قُلْ اِنَّ صَلَاتِیْ وَنُسُکِیْ وَمَحْیَایَ وَمَمَاتِیْ
لِلّٰہِ رَبِّ الْعَالَمِیْنَ (అల్ మాయిదహ్:164)

# హజ్రత్ ముహమ్మద్

## సల్లల్లాహు అలైహి వసల్లం

# జీవిత చరిత్ర


రచన

హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ (రజి)

ఖలీఫతుల్ మసీహుస్సాని అల్‌ముస్లిహుల్ మౌవూద్

అనువాదము

హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్


Hadhrat Muhammad saw
Jeevitha Charithra


| | | |
|---|---|---|
| Name of Book | : | Hadhrat Muhammad saw Jeevitha Charithra |
| Author | : | Hadhrat Mirza Bashiruddin Mahmud Ahmad Khalifathul Masih II (rz) |
| Language | : | Telugu |
| Translator | : | Hafiz Syed Rasool Niyaz |
| First Edition | : | 2014 |
| Copies | : | 5000 |
| Printed at | : | Fazl-e-Umar Printing Press Qadian |
| Published by | : | Nazarat Nashr-o-Isha'at, Sadr Anjuman Ahmadiyya Qadian, Dist: Gurdaspur, Punjab, India 143516 |

ISBN : 978-93-83882-03-8

ఇతర వివరాలకు సంప్రదించగలరు
www.alislam.org, www.mta.tv,
www.ahmadiyyamuslimjamaat.in
Toll Free : 1800-3010-2131

# రచయిత పరిచయం

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, ఖాతముల్ అన్బియా భవిష్యవాణి ప్రకారము అవతరించిన హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ మసీహ్ మౌవూద్, మహ్ది మావూద్ అలైహిస్సలాం సుపుత్రుడు హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుస్సానీ రజియల్లాహు అన్హు ఈ పుస్తకమును రచించినారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ఒక ప్రత్యేక కుమారుడు జన్మించునని గత దైవ గ్రంధములలో భవిష్యవాణి యుండెను. యూదులకు చెందిన 'తాల్మూద్' లో ఇట్లు వ్రాయబడి యున్నది.

"It is also said that the (The Messaih) shall die and his kingdom descend to his son and grandson"

అనగా (వాగ్దత్త) మసీహ్ పరమపదించిన తర్వాత వారి (ఆధ్యాత్మిక) రాజరికము వారి కుమారునికి, మనమనులకు లభించును.

ఇస్లాం విజయము కొరకు మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ మసీహ్ మౌవూద్‌నకు పవిత్ర కుమారున్ని ప్రసాదించునని భవిష్యవాణి ఇట్లు చేసిరి.

يَنْزِلُ عِيْسَى ابْنُ مَرْيَمَ اِلَى الْاَرْضِ يَتَزَوَّجُ وَيُوْلَدُ لَهُ

అనగా "మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అవతరింతురు. వారు వివాహమాడుదురు. తద్వారా వారికి సంతానము కలుగును." *(మిష్కాత్ ముజ్తబాయి: బాబ్ యన్జిలు ఈసా అలైహిస్సలాం)*

రచయిత 12 జనవరి 1889 తేదీన జన్మించిరి. వారి తల్లి పేరు హజ్రత్ సయ్యద నుస్రత్ జహాన్. 8వ ఏట పవిత్ర ఖురాన్ పూర్తి చేసిరి. 1906లో సదర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్‌లో సభ్యులైరి. 12



జనవరి 1907 తేదీన మొదటి సారి పబ్లిక్‌లో ఉపన్యాసము చేసిరి. 27 ఏప్రిల్ 1908 తేదీన హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వెంట లాహోర్ వెళ్ళిరి. ఈ ప్రయాణములోనే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) పరమపదించిరి. ప్రథమ ఖలీఫా హజ్రత్ హకీమ్ నూరుద్దీన్ చేతిలో ప్రప్రథమముగా బైఅత్ చేసిరి. వారి మరణము తర్వాత 14 మార్చి 1914 తేదీన అహ్మదియ్య సంస్థకు రెండవ ఖలీఫాగా ఎన్నికైరి.

అహ్మదియ్య సంస్థ అంతర్గత విధివిధానాలను తీర్చిదిద్ది వివిధ శాఖలను ఏర్పాటు చేసిరి. సంస్థ సభ్యుల శిక్షణకు 15 సం॥ల లోపు బాలలకు "అత్ఫాలుల్ అహ్మదియ్య", 15-40 సం॥ల యువకులకు "ఖుద్దాముల్ అహ్మదియ్య", 40 సం॥లు దాటిన పురుషులకు "అన్సారుల్లాహ్", 15 సం॥ల లోపు బాలికలకు "నాసిరాతుల్ అహ్మదియ్య", 16 సం॥ దాటిన స్త్రీలకు "లజ్న ఇమావుల్లాహ్" అను ఉపశాఖలను ప్రారంభించిరి. లండన్ సహా విదేశాలలో ప్రచార కేంద్రాలను స్థాపించి, మస్జిదులను నిర్మించిరి. వివిధ దేశాలను సందర్శించి శాంతి స్థాపనకై కృషి చేసిరి. గద్య, పద్య భాగాలలో అనేక రచనలు చేసిరి. గొప్ప ఉపన్యాసకులుగా కూడ పేరు పొందిరి.

పవిత్ర ఖురాన్ విశ్లేషణను ప్రత్యేక దైవానుగ్రహముతో "తఫ్సీరె కబీర్" పేరున 10 సంపుటిలలో వ్రాసిరి. ఈ విశ్లేషణను చదివి అనేకులు మార్గదర్శనము పొందితిరి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అమూల్యమైన సూచనలిచ్చుచు రెండు ఉపన్యాసములు "నిజామె నౌ", "ఇఖ్తెసాదీ నిజామ్" పేరున ఇచ్చిరి. అవి పుస్తక రూపంలో ప్రచురితమై ప్రశంసలందకున్నవి.

51 సం॥లు ఖిలాఫత్ బాధ్యతలు విజయవంతముగా నిర్వహించి 7/8 మధ్య రాత్రి నవంబర్ 1965న పరమపదించిరి.

# తొలి పలుకులు

మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రను జననము నుండి మరణము వరకు అన్ని కోణాలను సంక్షిప్త, అద్వితీయ, ఆసక్తికర రూపములో సయ్యద్నా హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుస్సానీ అల్ ముస్లిహుల్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్హు పవిత్ర ఖురాన్ పరిచయము పేరుతో రచించిన పుస్తకములో వివరించిరి. "హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర" అను ఈ పుస్తకములో ఆ భాగమునే ప్రచురించబడుతుంది. హజ్రత్ ముహమ్మద్ ఖాతముల్ అన్బియా (ప్రవక్తల నాయకులు), రసూల్ మఖ్బూల్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితమునకు చెందిన ప్రధాన సంఘటనలు, విషయములను ప్రస్తావించుచూ వారి జీవిత చరిత్ర పై సంధించబడిన నిరాధార విమర్శలకు ప్రబల నిదర్శనములతో సమాధానములు కూడ వ్రాసిరి.

నేడు ఈ సంపూర్ణ దైవసందేశహరుని జీవితమును ఎగతాళికి గురిచేయుటకు విఫల ప్రయత్నము జరుగుచున్నది. ఈ కాలములో సయ్యద్నా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను మనస్ఫూర్తిగా సాటిలేని విధముగా ప్రేమించుచున్న అంతర్జాతీయ అహ్మదియ్య సంస్థ ఇమామ్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ మసీహ్ ఐదవ ఖలీఫా అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ గారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితమును సద్గుణము, నిర్మల హృదయము గల అమాయక ప్రజలు తెలుసుకొనుటకు పెద్ద ఎత్తున ప్రచురించవలెనని ఆదేశించిరి.



ఈ పుస్తకమును ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రివ్యూ కమిటి అధ్యక్షులు హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ గారు తెలుగులో అనువదించగా, పవిత్ర ఖురాన్ అనువాదకులు షేక్ ఇబ్రాహీం నాసిర్, షబ్బీర్ అహ్మద్ యాకూబ్ గార్లు పున:పరిశీలించిరి, ముహమ్మద్ లతీఫ్ షరీఫ్ గారు ప్రూఫ్ రీడింగ్‌నకు సహకరించిరి. హైద్రాబాద్ జోనల్ అధ్యక్షులు సేఠ్ ముహమ్మద్ సుహైల్ గారు అమూల్య సలహాలివ్వగా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రచురణ అధ్యక్షులు తన్వీర్ అహ్మద్ గారు కూడ సహకరించిరి. నైస్ ప్రింట్ ముహమ్మద్ నాసిర్ అహ్మద్ గారు కంపోజింగ్ చేసిరి. వీరందరిని అల్లాహ్ అనుగ్రహించి ఉత్తమోత్తమ ప్రతి ఫలము నొసంగుగాక! ఆమీన్.

ఈ అనువాద ప్రచురణను అన్ని విధాలా అల్లాహ్ లాభదాయకముగా చేయుగాక! మానవాళికి మార్గదర్శనము అందించుగాక! తన ప్రియతమ ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం సత్యము, అద్భుత, గొప్ప స్థానము ను ప్రపంచ వాసులు గుర్తించుగాక! మనమందరము కూడ ఆదర్శమూర్తి అయిన రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించి అల్లాహ్ ప్రీతి, అనురాగమును పొందునట్లు అనుగ్రహించుగాక! ఆమీన్.

భవదీయుడు

హాఫిజ్ మఖ్దూమ్ షరీఫ్

**నాజిర్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్**

(జాతీయ ప్రచురణ కార్యదర్శి ఖాదియాన్)

విషయ సూచిక


| క్ర.సం | విషయములు | పేజి |
|---|---|---|
| 1 | ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర | 1 |
| 2 | ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం అవతరణ కాలంలో విగ్రహారాధన | 4 |
| 3 | మద్యపానము, జూదము | 6 |
| 4 | వ్యాపారము | 6 |
| 5 | అరబ్బుల ఇతర పరిస్థితులు, అలవాట్లు, అభిరుచులు | 7 |
| 6 | హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జననము | 9 |
| 7 | హల్ఫుల్ ఫుజూల్ సమితిలో సభ్యత్వం | 10 |
| 8 | హజ్రత్ ఖదీజ (రజి) తో ఆన్‌హజ్రత్ స.అ.స వివాహము | 12 |
| 9 | బానిసల విడుదల, జైద్ (రజి) చర్చ | 14 |
| 10 | హిరా గుహలో దైవ ప్రార్థన | 16 |
| 11 | పవిత్ర ఖురాన్ మొదటి దైవవాణి | 16 |
| 12 | ఆన్‌హజ్రత్ (స) ను హజ్రత్ అబూబకర్ (రజి) విశ్వసించుట | 18 |
| 13 | విశ్వాసుల చిన్న సంఘము | 19 |
| 14 | మక్కా నాయకుల ప్రతిఘటన | 20 |
| 15 | విశ్వాస బానిసలపై మక్కా అవిశ్వాసుల దౌర్జన్యము | 21 |
| 16 | స్వతంత్ర ముస్లిములపై దౌర్జన్యము | 26 |
| 17 | ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పై విపత్తులు | 28 |
| 18 | ఇస్లాం సందేశము | 30 |
| 19 | అబూతాలిబ్‌తో మక్కా అవిశ్వాసుల ఫిర్యాదు –ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్థిరత్వం | 33 |
| 20 | ఎబిసీనియా వైపు ప్రస్థానము | 35 |





| క్ర.సం | విషయములు | పేజి |
|---|---|---|
| 21 | హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లాం స్వీకరణ | 39 |
| 22 | ముస్లిముల బహిష్కరణ | 42 |
| 23 | హజ్రత్ ఖదీజ (రజి), అబూతాలిబ్ మృతితో ప్రచారములో అడ్డంకులు, ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తాయిఫ్ ప్రయాణము | 44 |
| 24 | మదీనా పౌరుల ఇస్లాం స్వీకరణ | 52 |
| 25 | ఇస్రా | 55 |
| 26 | రోమనుల విజయ భవిష్యవాణి | 56 |
| 27 | మక్కా నుండి మదీనా వైపు ప్రస్థానము | 63 |
| 28 | సురాఖ వెంటాడం, అతనిని గూర్చి ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి | 66 |
| 29 | ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో ప్రవేశము | 70 |
| 30 | హజ్రత్ అబూ అయ్యూబ్ (రజి) అన్సారి గృహములో నివాసము | 73 |
| 31 | ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవకుడు హజ్రత్ అనస్ (రజి) సాక్ష్యము | 74 |
| 32 | మక్కా నుండి కుటుంబ సభ్యుల రాక, మస్జిద్ నబ్వీ శంకుస్థాపన | 75 |
| 33 | మదీనా అన్యారాధకుల ఇస్లాం స్వీకరణ | 75 |
| 34 | ముస్లిములను మరల హింసించు యోచనలో మక్కా వాసులు | 77 |
| 35 | అన్సార్, ముహాజిర్ల మధ్య సోదర భావము | 78 |
| 36 | ముహాజిర్లు, అన్సార్, యూదుల మధ్య ఒప్పందము | 79 |
| 37 | మక్కా వాసుల ద్వారా మరల కుట్రల ఆరంభము | 82 |
| 38 | ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా రక్షణాత్మక చర్యలు | 84 |

| క్ర.సం | విషయములు | పేజి |
|---|---|---|
| 39 | మదీనాలో ఇస్లాం ప్రభుత్వ స్థాపన | 85 |
| 40 | ఖురైష్ వ్యాపార బృందము రాక – బద్ర్ యుద్ధము | 86 |
| 41 | ఒక గొప్ప భవిష్యవాణి పూర్తగుట | 94 |
| 42 | బద్ర్ ఖైదీలు | 97 |
| 43 | ఉహద్ యుద్ధము | 99 |
| 44 | విజయము ఓటమిగా మారుట | 102 |
| 45 | ఉహద్ యుద్ధము నుండి తిరోగమనం మదీనా వారి త్యాగవంతమైన భావాలు | 110 |
| 46 | మద్యపాన నిషేధ ఆదేశము దాని ప్రభావము | 115 |
| 47 | ఉహద్ యుద్ధము తర్వాత అవిశ్వాస జాతుల అపవిత్ర ప్రణాళికలు | 117 |
| 48 | 70 పవిత్ర ఖురాన్ కంఠస్తుల హత్య సంఘటన | 121 |
| 49 | బనీముస్తలఖ్ యుద్ధము | 124 |
| 50 | మదీనాపై మొత్తం అరబ్బుల దాడి – కందక యుద్ధము | 127 |
| 51 | కందక యుద్ధములో ఇస్లామీ సైన్యపు వాస్తవ సంఖ్య ఎంత | 131 |
| 52 | బనూ ఖురైజ నమ్మక ద్రోహం | 135 |
| 53 | దాంబికుల, విశ్వాసుల స్థితిగతుల ప్రస్తావన | 140 |
| 54 | ఇస్లాంలో శవపు గౌరవ, మర్యాదలు | 142 |
| 55 | కూటమి సైన్యములచే ముస్లిములపై దాడి | 143 |
| 56 | బనూ ఖురైజ అన్యారాధకులతో కలిసి దాడికి సన్నద్ధత, విఫలం | 145 |
| 57 | బనూఖురైజ ద్రోహమునకు శిక్ష | 149 |
| 58 | బనూ ఖురైజ నియమించిన న్యాయమూర్తి సాద్ (రజి) తీర్పు బైబిల్ ప్రకారమే యుండెను | 152 |





| క్ర.సం | విషయములు | పేజి |
|---|---|---|
| 59 | ముస్లిముల విజయ పరంపర ప్రారంభం | 157 |
| 60 | యుద్ధమును గూర్చి యూదుల, క్రైస్తవ బోధన | 161 |
| 61 | యుద్ధమును గూర్చి ఇస్లాం బోధన | 164 |
| 62 | కందక యుద్ధము తర్వాత ముస్లిములపై అవిశ్వాసుల దాడులు | 180 |
| 63 | 15 వందల అనుచరులతో ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాకు పయనం | 181 |
| 64 | హుదైబియా శాంతి ఒప్పంద నియమములు | 187 |
| 65 | రాజులకు ఉత్తరములు | 191 |
| 66 | రోమన్ రాజు హర్‌ఖల్ పేరున ఉత్తరము | 192 |
| 67 | ఆన్‌హజ్రత్ సల్లం సత్య సందేశహరుడని తెల్పిన రోమన్ రాజు | 195 |
| 68 | హర్‌ఖల్‌కు ఆన్ హజ్రత్ సల్లం పంపిన లేఖ పూర్తి పాఠం | 196 |
| 69 | పారసీక రాజు పేరిట ఉత్తరము | 199 |
| 70 | ఎబిసీనియా రాజు నీగస్ పేరిట ఉత్తరము | 202 |
| 71 | ఈజిప్టు రాజు మఖూఖస్ పేరిట ఉత్తరము | 205 |
| 72 | బహ్‌రైన్ అధినేత పేరిట ఉత్తరము | 208 |
| 73 | ఖైబర్ కోటను జయించుట | 210 |
| 74 | మూడు విచిత్ర సంఘటనలు | 212 |
| 75 | కాబా ప్రదక్షిణము | 216 |
| 76 | ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సతీమణుల సంఖ్యపై విమర్శకు సమాధానము | 218 |
| 77 | ఖాలిద్ బిన్ వలీద్, అమర్ బనిల్ ఆస్ ఇస్లాం స్వీకరణ | 219 |
| 78 | మౌతా యుద్ధము | 220 |
| 79 | మక్కా విజయము | 227 |

| క్ర.సం | విషయములు | పేజి |
|---|---|---|
| 80 | హునైన్ యుద్ధము | 248 |
| 81 | మక్కా విజయము, హునైన్ తర్వాత | 257 |
| 82 | తబూక్ యుద్ధము | 259 |
| 83 | హజ్జతుల్ విదా – ఆన్ హ(జత్ సల్లం ప్రసంగము | 265 |
| 84 | ఆన్‌హ(జత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరణము | 270 |
| 85 | ఆన్‌హ(జత్ సల్లం మరణముపై అనుచరుల స్పందన | 277 |
| 86 | ఆన్‌హ(జత్ సల్లల్లాహు అలైహి వసల్లం గుణగణాలు | 281 |
| 87 | ఆన్‌హ(జత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆధ్యాత్మిక, శారీరక పవిత్రత | 283 |
| 88 | ఆహారములో నిరాడంబరత, ధార్మికత | 284 |
| 89 | దుస్తులు, ఆభరణాలలో నిరాడంబరత, దైవభీతి | 290 |
| 90 | సాధారణ పరుపు | 292 |
| 91 | సాధారణ నివాస గృహము | 292 |
| 92 | అల్లాహ్‌తో ప్రేమ, ఆరాధన | 292 |
| 93 | అల్లాహ్‌పై నమ్మకము | 298 |
| 94 | మానవాళితో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వ్యవహారము | 306 |
| 95 | ఉత్తమ గుణములు | 308 |
| 96 | సహనము | 310 |
| 97 | న్యాయము | 312 |
| 98 | మనోభావాలను గౌరవించుట | 314 |
| 99 | పేదల పట్ల సానుభూతి, వారి మనోభావాల గౌరవము | 315 |
| 100 | పేదల ధనపు సంరక్షణ | 320 |
| 101 | బానిసలతో సత్ప్రవర్తన | 322 |





| క్ర.సం | విషయములు | పేజి |
|---|---|---|
| 102 | మానవ జాతి సేవకుల గౌరవము | 323 |
| 103 | మహిళలతో సత్ప్రవర్తన | 324 |
| 104 | మృతుల పట్ల వారి కార్యాచరణ | 329 |
| 105 | ఇరుగు పొరుగు వారితో సత్ప్రవర్తన | 330 |
| 106 | తల్లిదండ్రులు, ఇతర బంధువులతో సత్ప్రవర్తన | 331 |
| 107 | మంచి సహవాసము | 336 |
| 108 | ప్రజల విశ్వాసమును రక్షించు తాపత్రయం | 336 |
| 109 | ఇతరుల లోపాలను కప్పిపుచ్చుట | 337 |
| 110 | ఓపిక | 341 |
| 111 | పరస్పర సహాకారం | 342 |
| 112 | క్షమాగుణము | 343 |
| 113 | సత్యము | 344 |
| 114 | శోధించుటకు నివారణ, సదాభిప్రాయ ఆదేశము | 346 |
| 115 | వ్యాపారములో మోసము తగదు | 347 |
| 116 | నిరాశ | 348 |
| 117 | జంతువులతో సత్ప్రవర్తన | 348 |
| 118 | మతసామరస్యము | 349 |
| 119 | సాహసము | 350 |
| 120 | బుద్ధిహీనుల పట్ల ప్రేమానురాగం | 351 |
| 121 | ప్రతిజ్ఞలను పాటించుట | 351 |

بسم الله الرحمن الرحيم

# ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర

హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర విషయాలు చాలా స్పష్టంగా, భద్రముగానున్నవి. ఇతర ఏ సందేశహరుని జీవిత చరిత్ర ఇంత స్పష్టంగా అందుబాటులో లేదు. కనుక ఇస్లాం సత్యమునకు ఇదొక అద్భుత సాక్ష్యము, అల్లాహ్ గొప్ప సంకేతము. ఈ సువిశాల చరిత్ర వలన ఇతర సందేశహరులందరి కంటే అత్యధిక సంఖ్యలో హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పైన విమర్శలు వెలువడినవి. ఈ విమర్శలకు తగిన సమాధానాలు తెలిపినచో ఒక వ్యక్తి హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ను నిర్మల హృదయంతో మరే వ్యక్తిని ప్రేమించనంత ఎక్కువగా ప్రేమించును. గుప్తముగా నుండే వారి జీవితాలలో ప్రేమ లోపించు అవకాశం సదా వుండును. హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితము ఒక తెరిచివున్న పుస్తకము. శత్రువుల విమర్శలు పరిష్కారమైన తర్వాత వారి (స) జీవితమును గూర్చి ఏ ఇతర ఆలోచన కానరాదు. దైవ గ్రంధములను ప్రజల హృదయాలలో స్థిరపరచుటకు గొప్ప ఆచరణ కూడ అవసరము. గ్రంధము అవతరింపబడిన వారే అందరికంటే ఉత్తమ ఆదర్శం. ఇదొక సున్నితమైన, తత్వజ్ఞానంతో కూడిన



అంశం. అనేక ధర్మములు ఈ వాస్తమును గ్రహించనే లేదు. హిందూ ధర్మము వేదాలను ప్రవేశపెట్టును. కాని వేదాలను తెచ్చిన ఋషుల, మునుల చరిత్రను గురించి మౌనము వహించును. హిందూ ధర్మ పండితులు ఈ అవసరాన్ని ఇంత వరకు గుర్తించనే లేదు. ఇస్రాయీల్ సంతతిలోని ఫలానా సందేశహరునిలో ఈ లోపముందని, మరో సందేశహరునిలో ఆ లోపముందని క్రైస్తవ విద్వాంసులు, మత గురువులు బాహాటంగా అందురు. అల్లాహ్ తన శాసనముకై ఎన్నుకొనిన వ్యక్తిని ఆ శాసనము సంస్కరించనప్పుడు ఇతరులను ఎట్లు సంస్కరించునను విషయమును వారు గ్రహించలేదు. అతడు అనర్హుడే అయినచో అల్లాహ్ అతనిని ఎందుకు ఎన్నుకొనెను? మరొకనిని ఎందుకు ఎన్నుకొనలేదు? జబూర్ కొరకు దావూద్‌ను ఎన్నుకొనుటలో అల్లాహ్‌కు ఆటంకమేముండెను? ఇస్రాయీల్ సంతతిలోని మరో వ్యక్తిని ఎన్నుకోవచ్చును కదా! కనుక ఈ రెండు అర్థరహితమైన విషయాలు. శాసనము ఎవరిపైన అవతరించినదో అది అతన్నే సవరించలేదని, సంస్కరణకు అర్హుడు కాని వ్యక్తిని అల్లాహ్ ఎందుకు ఎన్నుకున్నాడని భావించుట అవివేకం. తమ మూలము నుండి దూరమై నందున విభిన్న మతాలలో ఇటువంటి అవివేక భావాలు ఉత్పన్నమైనవి. లేదా మానవ జ్ఞానం అభివృద్ధి చెందనందున ఆ కాలములో ఈ విషయాల ప్రాముఖ్యత గుర్తించలేదని చెప్పవచ్చును. కాని ఇస్లాంలో మొదటి నుండే ఈ విషయ ప్రాధాన్యతను గుర్తించనైనది. రసూలె కరీమ్ సల్లల్లాహు అలైహి వసల్లం సతీమణి హజ్రత్ ఆయిషా (ర) వివాహము 13,14 సం॥ల వయసులో వారి (స) తో జరిగినది. వారితో 7 సం॥ల దాంపత్య జీవితము కొనసాగినది. రసూలె కరీమ్ సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించినప్పుడు వారి వయస్సు 21 సం॥లు. నిరక్షరాస్యులు

అయినను వారు జ్ఞానవంతురాలైయుండిరి. ఒక సందర్భమున రసూలె కరీమ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవర్తనల గురించి తెలుపగలరని ఒకరు ఆమెను ప్రశ్నించిరి. అందుకు كَانَ خُلُقُهُ كُلُّهُ الْقُرْآن *(బుఖారి, అబూదావూద్ బాబ్ ఫీ సలాతిల్లైల్)* అనగా వారి (స) గుణాలను గూర్చి అడిగేదేముంది? వారు తెలిపినవే పవిత్ర ఖురాన్ ఆదేశించును, పవిత్ర ఖురాన్ బోధన వారి (స) ఆచరణకు భిన్నముగా లేదు. పవిత్ర ఖురాన్ వివరించు ప్రతి గుణమును వారు ఆచరించు వారు. వారి ప్రతి కదలికలనే పవిత్ర ఖురాన్ బోధించునని సమాధానమిచ్చిరి. ఇదొక గొప్ప విషయము. రసూలె కరీమ్ సల్లల్లాహు అలైహి వసల్లం సత్కార్యములు విశాల దృక్పథం కలిగి, ఉన్నతమైనందునే నిరక్షరాసురాలు అయిన ఒక యువతి శ్రద్ధను ఇటు మరల్చుటలో వారు విజయవంతులైరి. హిందూ, క్రైస్తవ, యూదుల, మసీహ్ విజ్ఞానులు తెలుసుకోలేని యదార్థమును హజ్రత్ ఆయిషా (ర) అర్థం చేసుకొనిరి. ఒక సత్యవంతుడు, ధార్మికుడు చేసేది ఒకటి, చెప్పేది మరొకటి ఉండదని, తాను ఒక సత్కార్యము చేసి ఇతరులకు తెలుపకుండా ఉండలేరని ఈ చిన్న వాక్యములో అంత గొప్ప భావమును వివరించిరి. కావున ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సత్ప్రవర్తనలను తెలుసుకొనుటకు ఏ చరిత్ర అవసరం లేదు. వారు నిజాయితీపరులు, మార్గదర్శకులు బోధించినదే పాటించేవారు, పాటించునదే బోధించేవారు. మేము వారిని దర్శించి పవిత్ర ఖురాన్‌ను అర్థం చేసుకొంటిమి. ఓ ప్రజలారా ! తర్వాత వచ్చిన మీరు పవిత్ర ఖురాన్‌ను చదివి ముహమ్మద్ రసూలుల్లాహ్ (స) ను అర్థం చేసుకొనుము.

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ كَمَا صَلَّيْتَ عَلٰى
اِبْرَاهِيْمَ وَعَلٰى اٰلِ اِبْرَاهِيْمَ وَبَارِكْ وَسَلِّمْ اِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ۔



## ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం
## అవతరణ కాలంలో విగ్రహారాధన

రసూలె కరీమ్ సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించిన కాలపు పరిస్థితులను కూడ వారి చరిత్రలోని భాగముగానే భావించవలెను. ఎందుకనగా ఈ విషయాల ఆధారంగానే వారి జీవిత విషయాలను ఒక వ్యక్తి సరియైన రీతిలో అర్థము చేసుకోగలడు. వారు సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర మక్కా నగరములో క్రీ.శ. 570, ఆగస్టు లో జన్మించిరి. *(లైఫ్ ఆఫ్ ముహమ్మద్, రచన మయూర్, ప్రచురణ 1857)* వారు ముహమ్మద్ అని నామకరణం చేయబడిరి. అనగా ప్రశంసించబడినది. వారు జన్మించిన సమయమున పలువురు తప్ప అరబ్ వాసులందరు విగ్రహారాధులే. వీరు ఇబ్రాహీమ్ సంతానము అని భావించువారు. ఇబ్రాహీమ్ విగ్రహారాధకులు కారని భావించుచు స్వయముగా విగ్రహాలను పూజించేవారు. ఇందుకు కొందరు అభివృద్ధి చెందుచూ అల్లాహ్ సామీప్యమును పొంది వారి సిఫారసులను స్వీకరించునట్లు చేయుదురని వారు వివరింతురు. అల్లాహ్ ఉన్నతుడైనందున ప్రతి మానవుడు అతని సమీపమునకు చేరుకొనుట అసాధ్యము. సంపూర్ణ మానవులే అతని దరి చేరగలరు. కావున సాధారణ మానవులు ఏదో ఒక ఆధారమును తప్పక ఆశ్రయించవలెను. ఈ ఆధారము ద్వారా అల్లాహ్ సమ్మతిని, సహాయాన్ని పొందవలెను. ఈ విచిత్రమైన విశ్వాసము ద్వారా హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాంను ఏకదైవారాధకుడిగా నమ్ముతూనే తమ కొరకు విగ్రహారాధనను సముచితమని భావించిరి. ఇబ్రాహీం చాలా పవిత్రుడు. అతడు అల్లాహ్ సన్నిధికి నేరుగా చేరుకునే శక్తిగలవాడు. కాని మక్కా నగరవాసులు ఈ స్థాయి వారు కానందున వారు పలు గొప్ప వ్యక్తులను ఆధారముగా ఆశ్రయించిరి. అందుకొరకు వారు ఆ వ్యక్తుల విగ్రహాలను

పూజించేవారు. వారిని సంతోషపర్చి అల్లాహ్ సామీప్యమును పొందెదరని భావించేవారు. ఈ విశ్వాసములోని లోపాలను, అసంబంధ భాగాలను పరిష్కరించుకొనుటకు వారెన్నడూ ఆలోచించలేదు. ఎందుకనగా వారికి ఏకారాధన చేయు గురువు లభించలేదు.

విగ్రహారాధన ఒక జాతిలో ప్రారంభమైనప్పుడు అది ఒకరి నుండి ఇద్దరికి తర్వాత ముగ్గురికి పాకి ఇలా అది వ్యాపించుచు పోవును. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జనన సమయమున ఖానా కాబా (ఇది ముస్లిముల పవిత్ర మస్జిద్, హజ్రత్ ఇబ్రాహీమ్, హజ్రత్ ఇస్మాయీల్ అలైహిమస్సలాం నిర్మించిన ఆరాధనాలయము) లో 360 విగ్రహాలుండేవని చరిత్ర కారుల అభిప్రాయము.(*బుఖారి కితాబుల్ ఘాజీ అధ్యా॥ ఫతహ్ మక్కా, జర్జానీ సంపుటి 2, పుట 334*) అనగా చంద్ర కాలమాన ప్రకారము ప్రతి రోజుకు ఒక విగ్రహం వుండెను. ఈ విగ్రహాలే కాక చుట్టు ప్రక్కల ప్రాంతాలలో, పెద్ద పెద్ద జాతుల కేంద్రములలో వేరే విగ్రహాలు ఉండెడివి. ఇటుల అరబ్‌లోని ప్రతి ప్రాంతము విగ్రహారాధనలో మునిగి వుండెను. అరబ్బుల భాషలో నాగరికత, సంస్కరణకు అధిక ప్రాధాన్యముండెను. వారు భాషను అత్యధికంగా విద్యతో పూరించుటకు ప్రయత్నించిరి. కాని ఇది తప్ప విద్యకు వారి వద్ద మరే భావము లేకుండెను. చరిత్ర, భూగోళశాస్త్రము, గణిత శాస్త్రము మొ॥ విద్యలు వారికి తెలియకుండెను. కాని ఎడారిలో వుండి ప్రయాణము చేయుట వలన ఖగోళశాస్త్రములో నిపుణులైయుండిరి. అరబ్ అంతటా ఒక్క పాఠశాల కూడ లేకుండెను. మక్కాలో అక్షరాస్యులు కొందరే వుండిరి. ప్రవర్తన పరంగా అరబ్ ఒక విచిత్ర, విరుద్ధ జాతిగా అభివర్ణించబడెను. వారిలో చాలా భయంకర నేరములు తిష్టవేసి వుండెను. అటులనే వారి స్థాయిని పెంపొందించు పలు గొప్ప సత్కార్యములు కూడ వారిలో యుండెను.



## మద్యపానము, జూదము

అరబ్బులు మద్యపానమునకు బానిసలైయుండిరి. మద్యం మత్తులో స్పృహ కోల్పోవడం లేదా అర్థరహితముగా మాట్లాడడం వారి దృష్టిలో లోపము గాక మంచిదైయుండెను. తన మిత్రులను, బంధువులను మద్యం తో గౌరవించడం ఒక సజ్జనుడి మంచి లక్షణములలో భాగమైయుండెను. ప్రతి రోజు ఐదు సమయాలలో మద్యపాన సమావేశాలు ధనికులు తప్పక ఏర్పాటు చేసుకునేవారు. జూదము వారి జాతీయ క్రీడగా వుండెను. కాని వారు దానిని ఒక కళగా మార్చుకొనిరి. తమ ధనమును పెంచుకొనుటకు వారు జూదమాడేవారు. అంతేగాక వారు దానములు, గొప్పతనము కొరకు జూదమాడేవారు. ఉ॥ జయించిన వ్యక్తి తాను గెలిచిన ధనములో నుండి తన స్నేహితులు, జాతి వారికి విందు ఏర్పాటు చేయు ఒప్పందముండెడిది. యుద్ధముల సమయమున ధనము ప్రోగు చేయుటకు జూదమునే ఆశ్రయించేవారు. యుద్ధ కాలములో నేడు కూడ లాటరీ ఆచారము పెరుగుతుంది. కాని లాటరీని పరిచయం చేసిన ఘనత అరబ్‌వాసులదని ఐరోపా, అమెరికా లాటరీ వ్యాపారులు తెలుసుకోవలెను. యుద్ధము జరిగినప్పుడు అరబ్ జాతులు పరస్పరం జూదమాడేవారు. గెలిచిన వాడే యుద్ధ ఖర్చులు ఎక్కువ భరించేవాడు. ఈ విధంగా ప్రాపంచిక వసతులు, సౌకర్యాల లోటును వారు మద్యపానము, జూదముతో పూడ్చుకొనుటకు ప్రయత్నించుచుండిరి.

## వ్యాపారము

అరబ్ నివాసుల ప్రధాన వృత్తి వ్యాపారం. వ్యాపారం చేయుచు వారు అతి దూర ప్రాంతాలకు వెళ్లేవారు. ఎబెసీనియా (హబ్షా), సీరియా (షామ్), పాలస్తీనా లాంటి దేశాలతో వ్యాపారం చేసేవారు. భారత దేశము లాంటి సుదూర దేశముతో కూడ వారికి వ్యాపార లావాదేవీలు ఉండెడివి.

అక్కడి ధనికులు భారత ఖడ్గములను ప్రత్యేకముగా ఇష్టపడేవారు. యమన్, సీరియా దేశాల నుండి వస్త్రాలు దిగుమతి అయ్యేవి. ఈ వ్యాపారాలు అరబ్‌లోని పట్టణ వాసుల వరకే పరిమితమైయుండెను. యమన్,ఉత్తరానికి చెందిన పలు ప్రాంతాలు తప్ప మిగతా ప్రాంతాల వారు గ్రామీణ జీవితమే గడిపేవారు. వారికి నగరములు గాని, పట్టణములు గాని లేకుండెను. పలు కుటుంబములు దేశమును విభజించుకొని యుండిరి. ఆ ప్రాంతాలలో వారు తిరుగుచూ ఉండేవారు. నీరు అయిపోగానే అక్కడి నుండి వేరే ప్రాంతానికి వెళ్లేవారు. నీరు లభించిన చోట వారు నివాసము ఏర్పరచుకునేవారు. గొర్రెలు, మేకలు, ఒంటెలే వారి ఆస్తి. వాటి ఉన్నితో వస్త్రములు తయారు చేసుకునేవారు. వాటి చర్మములతో గుడారాలు సిద్దము చేసుకొని మిగిలిన దానిని బజారులో విక్రయించేవారు.

### అరబ్బుల ఇతర పరిస్థితులు, అలవాట్లు, అభిరుచులు

వెండి, బంగారము గురించి వారు అవగాహన కలిగియున్నను అవి వారికి అరుదైనవి. అందుకే ప్రజలు, నిరుపేదలు వివిధ సుగంధ తిను భండారాలతో ఆభరణాలు తయారు చేసుకునేవారు. లవంగాలు, ఖర్బూజ, దోసకాయల గింజలతో విభిన్న తరహాలో హారాలు తయారు చేసుకొని వారి స్త్రీలు వాటిని ధరించి నగల కోరికలను తీర్చుకునేవారు. విచ్చలవిడి నేరం వారి సొంతం. దొంగతనం చాలా తక్కువ కాని దోపిడి అధికం. ఒకరినొకరు దోచుకొనుట వారు జాతీయ హక్కుగా భావించేవారు. కాని మాటకు కట్టుబడి వుండే విషయంలో మరొక జాతి వారికి సాటి లేకుండెను. ఒకడు ఒక బలవంతుని లేదా జాతి వద్దకు వచ్చి నేను మీ ఆశ్రయములో వచ్చితినని ప్రకటించినచో అతడిని రక్షించుట కర్తవ్యముగా భావించేవారు. ఆ జాతి అతనికి రక్షణ కల్పించనిచో అరబ్ దేశమంతటా అవహేళనకు గురయ్యేది. కవులకు చాలా అధికారములు యుండెడివి.



ఒక విధంగా వారు జాతి నాయకులుగా గుర్తించబడేవారు. సాహిత్యము, కవిత్వము నాయకత్వానికి ప్రధాన అర్హతలుగా భావించేవారు. అతిథ్యములో ఉన్నత స్థానాన్ని వారు పొందియుండిరి. అరణ్యములో ఎవరైనా దారి తప్పి వారి వద్దకు వచ్చి నేను మీ అతిథినని అనగానే అతని కొరకు మేకలు, గొర్రెలు, ఒంటెల మాంసమును వడ్డించేవారు. అతిథి స్థాయితో సంబంధం లేకుండా అతని రాకనే గౌరవప్రదంగా భావించేవారు. అతిథిని సత్కరించి తమ గౌరవాన్ని పెంచుకోవడము విధిగా ఊహించువారు. స్త్రీలకు ఎలాంటి హక్కులు లేకుండెను. తండ్రి తన కూతుర్ని చంపడము కొన్ని కుటుంబాలలో గౌరవముగా భావించబడేది. మొత్తం అరబ్‌లోనే బాలికలను హత్య చేసే ఆచారముండునని చరిత్రకారులు వ్రాయడం సమంజసం కాదు. ఈ ఆచారాన్ని దేశమంతటా ఆచరించడం వలన వంశమే మిగలదు గనుక ఇది అసాధ్యం. అరబ్, భారత దేశము లేదా ఏ ఇతర దేశాలలో ఈ ఆచారము గలదో దాని విధానమేమనగా పలు కుటుంబాలు తమను తాము గొప్పగా భావించి లేదా ఇతర కష్టతర పరిస్థితులలో అనగా ఆ బాలికల స్థాయి ప్రకారము వివాహాలు కానందున ఆ బాలికలను హత్య చేసే ఆచారము గలదు. బాలికలందరిని అంతమొందించే విధానము ఏ జాతిలో లేకుండెను. ఈ ఆచారము బాధాకరమైనది. పలు అరబ్బు జాతులలో బాలికలను సజీవంగా సమాధి చేసేవారు. కొందరు గొంతు నులిమి హతమార్చేవారు. ఇలా పలు రకాలుగా హత్యచేసేవారు. సొంత తల్లి తప్ప మిగతా వారిని వారు తల్లిగా భావించేవారు కాదు. వారితో వివాహము చేసుకొనుట తప్పుగా ఊహించేవారు కాదు. తండ్రి చనిపోయిన తర్వాత కుమారులు తమ సవతి తల్లిని వివాహమాడేవారు. ఒకటి కంటే ఎక్కువ వివాహాలు చేసుకోవడం సర్వసాధారణం. ఇందులో ఎలాంటి పరిమితి లేకుండెను.

సొంత అక్క చెల్లెలను ఒక వ్యక్తి వివాహము చేసుకునేవాడు. యుద్ధములో ఘోరంగా హింసించేవారు. కపటము ఎక్కువైనచో గాయాలైన వారి కడుపు చీల్చి వారి కాలేయాన్ని తినేవారు. ముక్కు, చెవులను కోసివేసేవారు. నేత్రములను తొలగించేవారు. బానిసత్వము సాధారణం. ఇరుగు పొరుగులోని బలహీన జాతుల వారిని బానిసలుగా చేసుకొనేవారు. బానిసలకు ఎలాంటి హక్కులు లేకుండెను. యజమాని తన బానిసతో ఇష్టారాజ్యంగా వ్యవహరించేవాడు. ఎలాంటి చట్టములు లేకుండెను. అతను హత్యచేయబడినను ఎటువంటి శిక్ష లేకుండెను. ఇతరుల బానిసలను చంపినను అతనికి మరణ శిక్షపడేది కాదు. యజమానికి కొంత పరిహారం ఇచ్చి విడుదలయ్యేవారు. స్త్రీ బానిసలను లైంగిక అవసరాల కొరకు వాడుకొనుట రాజ్యాంగ హక్కుగా భావించేవారు. స్త్రీ బానిసల పిల్లలు కూడా బానిసలు గానే ఉండేవారు. సంతానము గల స్త్రీ బానిసలు కూడ బానిసత్వ జీవితమే గడిపేవారు. విద్యాపరంగా, ప్రగతి రీత్యా అరబ్బులు చాలా వెనుకబడి యుండిరి. అంతర్జాతీయ కారుణ్య, సంత్సంబంధాలలో వారు అధమ స్థానములో నుండిరి. స్త్రీల వ్యవహారంలో ఇతర జాతుల కంటే హీనమైన స్థితిలో యుండిరి. కాని వ్యక్తిగత సాహసోపేతమైన కార్యములలో, సత్ప్రవర్తన పరంగా వారిలో కొందరు ఇతరులకందని అత్యున్నత స్థానము కలిగి వుండిరి.

## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జననము

ఇట్టి సమాజంలో ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మించిరి. వారు (స) జన్మించక ముందే వారి (స) తండ్రి అబ్దుల్లాహ్ మరణించియుండిరి. అప్పుడు తాత అబ్దుల్ ముత్తలిబ్ వారిని, వారి తల్లి ఆమినాను తన సంరక్షణలో తీసుకొనెను. అరబ్బుల ఆచారం ప్రకారము వారిని పాలు త్రాపుటకు తాయిఫ్ దగ్గరనున్న ఒక స్త్రీకి



అప్పగించబడెను. గ్రామీణ వాతావరణంలో వారి (స) మాతృభాష అభివృద్ధి చెందుటకై, ఆరోగ్యం మెరుగు పడుటకు అరబ్బులు తమ పిల్లలను గ్రామీణ స్త్రీలకు అప్పగించేవారు. వారి (స) 6వ యేట వారి తల్లి మదీనాలో తన తల్లిగారింటికి వెళ్ళి తిరిగి వచ్చుచుండగా మదీనా-మక్కా మార్గమధ్యలోనే మృతిచెందిరి. వారు అక్కడే సమాధి చేయబడిరి. వారి వెంట వున్న సేవకురాలు వారిని క్షేమంగా మక్కా తీసుకొచ్చి తాతకు అప్పగించెను. వారు 8 సం॥లకు చేరుకోగానే వారి సంరక్షకులుగా నున్న తాత కూడ పరమపదించిరి. అప్పుడు తన తండ్రి ఆజ్ఞ మేరకు వారి (స) చిన్నాన అబూతాలిబ్ వారి సంరక్షకులైరి. వారికి అరబ్ నుండి ఇతర దేశాలకు పోవుటకు రెండు మూడు సార్లు అవకాశము లభించెను. వాటిలో నుండి ఒకసారి చిన్నాన అబూతాలిబ్ వెంట 12వ యేట వ్యాపార నిమిత్తం సీరియా దేశములో ప్రయాణించిరి. ఈ పర్యటనలో యురోషిలం (బైతుల్ ముఖద్దస్) ప్రస్తావన లేనందున దక్షిణ సీరియాలోని తూర్పు భాగాన మాత్రమే పర్యటించినట్లు స్పష్టమగుచున్నది. ఆ తర్వాత యుక్త వయస్సు వరకు మక్కాలోనే వుండిరి.

## హల్ఫుల్ ఫుజూల్ సమితిలో సభ్యత్వం

బాల్యము నుండే దీర్ఘాలోచన, పరిశీలన వైపు ఆకర్షితులై యుండిరి. ప్రజల జగడములలో తలదూర్చేవారు కాదు. సాధ్యమైనంత వరకు కలహాలను, అశాంతిని అంతమొందించుటకు కృషి చేసేవారు. మక్కా, నగర ఇరుగు పొరుగు వర్గముల యుద్ధ వాతావరణముతో విసిగి పలువురు యువకులు పీడితుల సహాయార్థం ఒక సమితిని ఏర్పాటు చేసిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో ఇష్టముతో దానిలో చేరిరి. ఈ క్రింది విధముగా ఆ సమితి సభ్యులు ప్రమాణము చేసిరి. “వారు పీడితులకు సహాయము చేయుదురు. వారి హక్కులు వారికి

ఇప్పింతురు. సముద్రంలో ఒక్క బొట్టు వున్నంతవరకు వారు ఈ సేవకు వెనుకాడరు. ఇటుల చేయలేని పక్షమున వారు తమ వద్ద నుండి పీడితుల హక్కులు చెల్లింతురు". *(ఇబ్నె హష్షామ్ సంపుటి 1, పుట 36)*

ఈ ప్రమాణమును ఆచరించు భాగ్యము బహుశ వారికి తప్ప మరెవ్వరికి కలగలేదు. వారు ప్రవక్తృత్వ ప్రకటన చేసిన అనంతరం మక్కా నాయకుడైన అబూజహ్ల్ వీరి వ్యతిరేకతలో అందరికంటే ముందుండెను. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అన్ని విధాలా అవమానించుటకు వారితో ఎవరూ మాట్లాడకూడదు, వారి మాట ఎవరు పాటించకూడదని ప్రకటించెను. అప్పుడు అబూజహ్ల్ నుండి తన రుణం తిరిగి పొందుటకు ఒక వ్యక్తి మక్కాకు వచ్చెను. అతడు తన డబ్బు తిరిగివ్వమని అబూజహ్ల్‌ను కోరగా అతడు నిరాకరించెను. అతడు మక్కాకు చెందిన పలువురు వ్యక్తులకు తన గోడు వినిపించి సహాయము కోరెను. కాని వారు సహాయము చేయలేదు కదా దురుద్దేశంతో నీకు సహాయము చేసే వ్యక్తి మక్కాలో ఒక్కడే ఉన్నాడు. అతడు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అని చెప్పి ఆ వ్యక్తిని వారి వద్దకు పంపించిరి. ఇటుల రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా వాసుల నుండి ప్రత్యేకంగా అబూజహ్ల్‌తో ఎదుర్కొంటున్న వ్యతిరేకత వలన ఆ వ్యక్తికి సహాయము చేయుటకు నిరాకరించి నవూజుబిల్లాహ్ ప్రమాణము పాటించనందున అరబ్బులలో అవమానముకు గురి అగుదురు, లేదా ఆ వ్యక్తి సహాయార్థము అబూజహ్ల్ ఇంటికి వెళ్లినచో అతడు గెంటివేయునని వారు భావించియుండిరి. ఆ వ్యక్తి ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి అబూజహ్ల్ గూర్చి ఫిర్యాదు చేయగా వెంటనే అతనితో వారు వెళ్లిరి. అబూజహ్ల్ తలుపు తట్టగానే అతడు బయటికి వచ్చెను. తనకు



రుణమిచ్చిన వ్యక్తి ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట ఉన్నాడని చూసెను. వారు అబూజహ్ల్‌ను ఉద్దేశించి ఇతనికి రావాల్సిన ఫలానా హక్కులు వెంటనే చెల్లించమని అడిగిరి. అబూజహ్ల్ కూడ సాకులు చెప్పకుండా వెంటనే అతని హక్కులు చెల్లించెను. ఈ విషయము తెలియగానే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను అవమానపర్చవలెనని, అతని మాట ఎవరు వినకూడదు, అతనితో సత్సంబంధాలు నెరపకూడదని మాతో ప్రగల్బాలు పలికే నీవే అతని మాట విని అతని గౌరవము నిలిపితివని నగర నాయకులు అబూజహ్ల్‌ను నిలదీసిరి. నా బదులు మీరున్నా ఇదే చేసేవారు. ఎందుకనగా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కుడి, ఎడమ వైపు రెండు శక్తివంతమైన ఒంటెలు నా గొంతు నులిమి నన్ను హతమార్చుటకు సిద్ధముగా నుండెనని అబూజహ్ల్ సమాధానమిచ్చెను. *(ఇబ్నె హష్షామ్ సంపుటి 1, పుట 1301)* అతని సమాధానములో ఏ మేరకు సత్యమున్నదో లేదా నిజముగనే అల్లాహ్ అతనికి ఒక సంకేతము చూపెనో అల్లాహ్‌కే తెలుసు. న్యాయపరమైన హక్కు కాబట్టి అతను భయాందోళనకు లోనై వుండవచ్చు. మొత్తం మక్కాలో తిరస్కరించబడ్డ, చీదరించబడ్డ వ్యక్తి ఒక పీడితుని సహాయము కొరకు ఎలాంటి బాహ్య రక్షణ లేకుండా మక్కా నాయకుని తలుపు తట్టి ఆ వ్యక్తి హక్కు చెల్లించమని కోరుతున్నాడను సంఘటన కూడ అతని అన్యాయ మనస్తత్వాన్ని హతమార్చి వుండవచ్చు. అందుకే అతను సత్యమునకు తలొగ్గెను కాబోలు.

## హజ్రత్ ఖదీజ (రజి) తో ఆన్‌హజ్రత్ స.అ.స వివాహము

ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం 25 సం॥లు నిండినప్పుడు వారు తన సద్గుణములు, దైవభీతితో ఖ్యాతి పొందిరి. వారిని వ్రేలుతో చూపించి ఇతను ఒక సత్యవంతుడు, నమ్మకస్తుడు అని

చెప్పుకొనేవారు. మక్కాలోని ఒక ధనవంతురాలైన విధవరాలికి కూడ ఈ విషయములు తెలిసినవి. నా వ్యాపార బృందం సీరియా దేశమునకు వెళ్లుచున్నది. కావున ఈ బృందానికి నాయకత్వం ముహమ్మద్ (స.అ.స) వహించవలసినదిగా వారి (స) చిన్నాన అబూతాలిబ్‌ను ఆమె కోరెను. అబూతాలిబ్ వారితో ఈ విషయము ప్రస్తావించగా వారు అంగీకరించిరి. ఈ పర్యటనలో వారికి ఆశించిన దానికంటే ఎన్నో రెట్లు ఎక్కువ లాభాలు కలిగినవి. మార్కెట్ హెచ్చుతగ్గుదల వలన కాదు, ఈ బృంద నాయకుని నీతి, నిజాయితి వలన ఇంత లాభం వచ్చినదని ఆమె గ్రహించెను. వారి వెంట పర్యటించిన మైసర అను బానిసతో వారి (స) పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అతను కూడ ఆమె అభిప్రాయాన్ని సమర్థించుచూ ఆ నీతి, నిజాయితి వారి (స) సొంతమని సమాధానమిచ్చెను. ఈ విషయము హజ్రత్ ఖదీజా (రజి) ను ఎంతగానో ప్రభావితం చేసెను. ఆమె అప్పుడు 40 సం॥లు నిండియుండిరి. రెండు పర్యాయములు విధవరాలైరి. అయినను తన ఒక మిత్రురాలిని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు పంపి తనతో వివాహము చేసుకోగలరా అని రాయబారము నెరిపెను. ఆ మిత్రురాలు వచ్చి మీరు వివాహము ఎందుకు చేసుకోరని ప్రశ్నించెను. వివాహము చేసుకొనుటకు నా వద్ద ధనము లేదని వారు చెప్పిరి. ఈ ఆటంకము తొలగిపోయి ఒక సద్గుణములు గల ధనికురాలు మీతో వివాహము చేసుకొనుటకు సిద్ధమైతే మీరు చేసుకోగలరా ? అని ఆమె అడిగెను. ఆ స్త్రీ ఎవరు ? అని వారడిగిరి. ఖదీజ (రజి) అని ఆమె తెలిపెను. నేను ఆమెతో ఎలా మాట్లాడగలను ? అని వారనిరి. ఆ బాధ్యత నాది అని ఆ మిత్రురాలు తెలిపెను. అట్లయినచో నాకు అంగీకారమేనని వారు సమాధానమిచ్చిరి. అప్పుడు వారి చిన్నాన మధ్యవర్తిత్వంలో ఖదీజ (రజి) ఈ వివాహమును నిర్ణయించెను. ఈ విధంగా వారి వివాహము



ఖదీజ (రజియల్లాహు తాలా అన్‌హా) తో జరిగెను. ఒక నిరుపేద, అనాథ కొరకు ఆస్తి, అంతస్తుల మొదటి ద్వారము తెరుచుకొనెను. కాని ఈ ధనాన్నంతటిని అతడు వినియోగించిన తీరు ప్రపంచానికే ఒక ఆదర్శముగా నిలిచెను.

### బానిసల విడుదల, జైద్ (రజి) చర్చ

భార్య ధనవంతురాలిగా వుండి భర్త తన అవసరాలకు భార్యపై ఆధారపడు జీవితములో సున్నిత మనస్తత్వము గల వారు (స) ఆనందముగా ఉండలేకపోవచ్చునని వివాహానంతరం హజ్రత్ ఖదీజ (రజి) భావించిరి. నేను నా ధనమును, నా బానిసలను మీ అధీనములో ఇచ్చుటకు ఇష్టపడుతున్నానని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఆమె తెలిపిరి. ఓ ఖదీజా (రజి) ఇది నిజమేనా ? అని వారడిగినప్పుడు ఆమె మరోసారి ధ్రువీకరించెను. అయినచో నా మొదటి కార్యము బానిసలను విడుదల చేయుట అని వారనిరి. తక్షణమే వారు హజ్రత్ ఖదీజ (రజి) బానిసలను పిలిపించి నేటి నుండి మీరందరు స్వతంత్రులని ప్రకటించిరి. ధనములోని అధిక భాగమును బీదవారిలో పంచిపెట్టిరి. వారు విడుదల చేసిన బానిసలలో ఒకరు జైద్ అను బానిస కూడ వుండెను. గౌరవ, మర్యాదలు గల వంశమునకు చెందిన వాడైనందున అతడు ఇతర బానిసల కంటే ఎక్కువ తెలివితేటలు గలవాడైయుండెను. అతనిని బాల్యములో దోపిడీ దొంగలు బలవంతముగా దొంగిలించి విక్రయించి యుండిరి. అతడు తుదకు మక్కా చేరుకొనెను. స్వాతంత్ర్యము కంటే ఈ వ్యక్తి బానిసత్వములోనే జీవితము గడుపుట మిన్న అని వివేకముతో అతడు గ్రహించెను. బానిసలకు విముక్తి కల్పించినప్పుడు, మీరు నాకు స్వాతంత్ర్యము ప్రసాదించిరి కాని నాకు ఆ విముక్తి అనవసరం, నేను మీతో వుంటానని తెలిపెను. రోజు రోజుకు అతడు వారిపై అభిమానము

పెంచుకొనెను. అతడు ధనిక కుటుంబమునకు చెందినందున అతని తండ్రి, పిన తండ్రి దొంగలను వెంటాడుచూ అతన్ని వెతుకుచూ వచ్చుచుండగా మక్కాలో వారి కుమారుడున్నాడని తెలుసుకొని మక్కా చేరుకొనిరి. చివరకు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమావేశమునకు వారు చేరిరి. మీకు కావలసినంత డబ్బు తీసుకొని మా కుమారున్ని విడిచి పెట్టగలరని వారు వేడుకొనిరి. నేను అతనికి ఎప్పుడో విముక్తి కల్పించాను, సంతోషముగా మీరు అతన్ని మీ వెంట తీసుకెళ్లగలరని వారు తెలిపిరి. జైద్ ను పిలిపించి తండ్రి, పిన తండ్రితో కలిపిరి. ఎప్పుడో విడిపోయి ఇప్పుడు కలిసి ఆనందభాష్పాలతో ప్రేమను పంచుకున్న తర్వాత ఈ గుణవంతుడు నీకు స్వాతంత్ర్యము కల్పించినాడు కావున నీ తల్లి నీ జ్ఞాపకములో తల్లడిల్లుతున్నది ఆమె దు:ఖాన్ని చల్లార్చుటకు నీవు వెంటనే మాతో బయలు దేరమని చెప్పిరి. తల్లిదండ్రులంటే ఎవరికైనా అభిమానమే అందుకు నేను అతీతుడను కాను. కాని ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అభిమానము నాలో పూర్తిగా నిండిపోయినది. నేను ఇక మీదట వారిని వదిలి ఉండలేను. మీతో కలిసినందుకు నాకు చాలా ఆనందముగా వున్నది. కాని ముహమ్మద్ (రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం) తో విడిపోవుట నా వల్లకాదని కుండబద్దలు కొట్టి చెప్పెను. జైద్ తండ్రి, పిన తండ్రి ఎంత చెప్పినా జైద్ మాత్రము వారితో వెళ్లుటకు సిద్ధపడలేదు. జైద్‌లో వున్న ఈ అభిమానమును చూచిన ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిలబడి జైద్‌ను నేనింతకు ముందే విడుదల చేసితిని కాని నేటి నుంచి ఇతడు నా కుమారుడని ప్రకటించిరి. ఈ ప్రేమాభిమానాలను కళ్లారా చూసిన తండ్రి, చిన్నాన జైద్‌ను వదిలి వారి స్వదేశానికి తిరిగి వెళ్లిపోయిరి. ఆ తర్వాత జైద్ శాశ్వతముగా మక్కాలోనే వుండిపోయెను.



## హిరా గుహలో దైవ ప్రార్థన

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వయస్సు 30 సంవత్సరములు దాటిన తర్వాత అల్లాహ్ ప్రార్థన చేయు కోరిక వారి హృదయములో మరింత బలపడెను. వారు నగర వాసుల అరాచకాలు, నేరములు, దుష్కార్యములతో ద్వేషము కలిగి మక్కా నుండి 2,3 మైళ్ళ దూరాన కొన్ని శిల్పాలతో ఏర్పడిన ఒక చిన్న గుహలో ఏకాంతముగా అల్లాహ్ ప్రార్థన నిమిత్తం వెళ్ళడం ప్రారంభించిరి. హజ్రత్ ఖదీజా (రజి) కొన్ని దినములకు సరిపడే ఆహారము సిద్ధము చేసేవారు. వారు దానిని తీసుకొని హిరాలోకి వెళ్ళి పోయేవారు. ఇటుల ఆ రెండు మూడు శిల్పాల మధ్య కూర్చొని అల్లాహ్ ప్రార్థనలో రాత్రింబవళ్ళు నిమగ్నమయ్యేవారు.

## పవిత్ర ఖురాన్ మొదటి దైవవాణి

వారు (స) నాలుగు పదులకు చేరుకున్నప్పుడు ఒక రోజు స్వప్న రూపములో ఒక దృశ్యము చూచిరి. అందులో ఒక వ్యక్తి వారిని "చదువు" అని అనెను. నాకు చదువు రాదని వారు సమాధానమిచ్చిరి. ఈ విధంగా అతను ద్వితీయ, తృతీయ సారి కూడ అనెను. తుదకు ఈ క్రింది 5 వాక్యములు వారితో అతడు చదివించెను.

اِقْرَأْ بِاسْمِ رَبِّكَ الَّذِىْ خَلَقَ o خَلَقَ الْاِنْسَانَ مِنْ عَلَقٍ o اِقْرَأْ
وَرَبُّكَ الْاَكْرَمُ o الَّذِىْ عَلَّمَ بِالْقَلَمِ o عَلَّمَ الْاِنْسَانَ مَالَمْ يَعْلَمْ o

పై సూక్తుల ద్వారా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పై పవిత్ర ఖురాన్ అవతరణ ప్రారంభమైనది. వీటి భావమేమనగా నిన్ను, ఈ సంపూర్ణ విశ్వమును సృష్టించిన నీ ప్రభువు నామమున ఆకాశపు సందేశమును అందించుము. అల్లాహ్ అతని మానవజాతిని ప్రేమించే సహజగుణంతో మానవున్ని పుట్టించెను. అందరి కంటే ఎక్కువ గౌరవము

గల అల్లాహ్ నీ వెంట ఉన్నాడని ప్రపంచానికి తెలుపుము. ప్రపంచానికి విద్య బోధించుటకు అతడే కలమును సృష్టించెను. మానవునికి గతములో తెలియని విషయాలను ఇప్పుడు నేర్పుటకు అతడు సిద్ధమయ్యెను. ఈ కొన్ని సూక్తులు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పై భవిష్యత్తులో అవతరించబోయె విద్యలన్నిటితో ఇమిడి వున్నవి. ప్రపంచ సంస్కరణకు ఇందులో ముఖ్య విత్తనము గలదు. పవిత్ర ఖురాన్‌లో వీటి పై విస్తృత చర్చ ఆయా సూక్తుల సందర్భమున జరుగును. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జీవితములో ఇదొక ముఖ్య సంఘటన అయినందున ఈ సూక్తులను ఇక్కడ ప్రస్తావించడం జరిగినది. పవిత్ర ఖురాన్ కొరకు ఈ సూక్తులు గీటురాయిగా నిలుచును. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పై ఈ దైవవాణి అవతరించిన తర్వాత అల్లాహ్ కు చెందిన ఇంత పెద్ద బాధ్యతను నేను నిర్వర్తించగలనా లేదా అనే ఆందోళనకు వారు గురైరి. వారి బదులు మరొకరు ఉండినచో అల్లాహ్ తన కార్యమును నాకు అప్పగించెనని గర్వము తో విర్రవీగును. కాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కు పనిచేయు విధానము తెలిసియుండెను. పని పై గర్వించే అలవాటు లేకుండెను. వారు ఈ దైవవాణి తర్వాత హజ్రత్ ఖదీజ (రజి) వద్దకు వచ్చిరి. ముఖము చిన్నబోయి, భయాందోళన ప్రత్యక్షమగుచుండెను. ఇది గమనించిన హజ్రత్ ఖదీజ (రజి) అసలు ఏమైందని ప్రశ్నించెను. అప్పుడు పూర్తి విషయము తెలిపిరి. నా లాంటి బలహీనుడు ఈ భారమును ఎలా మోయగలడని సందేహము వ్యక్తపర్చిరి. వెంటనే హజ్రత్ ఖదీజ (రజి) ఇట్లనిరి.

كَلَّا وَاللّٰهِ مَا يُخْزِيْكَ اللّٰهُ اَبَدًا اِنَّكَ لَتَصِلُ الرَّحِمَ وَتَحْمِلُ الْكَلَّ
وَتَكْسِبُ الْمَعْدُوْمَ وَتَقْرِ الضَّيْفَ وَتُعِيْنُ عَلٰى نَوَائِبِ الْحَقِّ



*(బుఖారి బాబ్ బదవుల్ వహీ)* అనగా మీరు విఫలమగుటకు, అపజయము నొందుటకు లేదా అల్లాహ్ మిమ్ములను ఏకాకి చేయుటకు ఈ సందేశము అతడు మీకు అందించలేదని నేను దైవ ప్రమాణముతో తెలుపుచున్నాను. అతడెందుకు మీతో ఇట్లు వ్యవహరించును. మీరు బంధువులకు మర్యాదలు చేయుదురు, నిస్సహాయుల, నిరాశ్రయుల భారము మోయుదురు. దేశములో అదృశ్యమైన సద్గుణములు మీ ద్వారా మరల స్థిరపడుచున్నవి. అతిథులకు సపర్యలు చేయుదురు. నిజమైన ఆపద సమయములలో ప్రజలకు సహాయం చేయుదురు. ఇటువంటి వ్యక్తికి అల్లాహ్ నష్టము కలిగించునా ? ఆ తర్వాత క్రైస్తవ ధర్మము స్వీకరించిన తన చిన్నాన కుమారుడు వర్ఖ బిన్ నౌఫల్ వద్దకు వారిని తీసుకెళ్లిరి. ఈ సంఘటన వివరాలు విని అతడు నిస్సంకోచంగా ఇట్లు తెలిపెను. ‘మూసా అలైహిస్సలాం పై అవతరించిన దేవదూతే మీపై అవతరించెను’. *(బుఖారి బాబ్ బదవుల్ వహీ).* ఒక రకంగా అతడు ఇస్తిస్నా అధ్యాయము 18 సూక్తి 18 లో నున్న భవిష్యవాణి విషయము వైపు సూచించెను. ఈ విషయము వారు (స) విముక్తి కల్పించిన బానిస 25, 30 సంవత్సరముల వయస్సులో నున్న హజ్రత్ జైద్ (రజి), 10, 11 సం॥ల బాలుడైన వారి (స) చిన్నాన కుమారుడు అలి (రజి) కు తెలియగానే వారిరువురు వెంటనే వారిని విశ్వసించిరి.

**ఆన్ హజ్రత్ (స.అ.స) ను హజ్రత్ అబూబకర్ (రజి) విశ్వసించుట**

వారి (స) బాల్య మిత్రుడు అబూబకర్ (రజి) అప్పుడు నగరములో లేకుండిరి. వారు నగరములో ప్రవేశించగానే ‘నీ మిత్రుడు మతిస్థిమితం కోల్పోయి ఆకాశము నుండి దేవదూతలు దిగి నాతో సంభాషిస్తున్నారని ప్రకటించాడను’ వార్తలు వారికి వినిపించెను. అబూబకర్ నేరుగా వారి (స) నివాసానికి వచ్చి తలుపు తట్టిరి. వారు (స) తలుపు తెరవగానే

వాస్తవము గూర్చి వారడిగిరి. తన బాల్య మిత్రుడు అపోహకు గురి కాకూడదని కాస్త వివరణ ఇచ్చుటకు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ప్రయత్నించిరి. అబూబకర్ వారిని వారించి దేవదూతలు మీ వద్దకు వచ్చి మీతో సంభాషించినట్లు మీరు ప్రకటించితిరా లేదా ? మాత్రమే నాకు తెలుపమని అనిరి. వారు (స) మరల వివరణ ఇచ్చుటకు ప్రయత్నించిరి. కాని అబూబకర్ (రజి) దైవ సాక్ష్యముగా నా ప్రశ్నకు మాత్రమే నాకు సమాధానం చెప్పండని తెలిపిరి. వారు (స) అవునని సమాధానమివ్వగానే 'మీ పట్ల నేను విశ్వాసము ప్రకటించుచున్నాను. ఇందుకు మీరే సాక్ష్యులు' అని తెలిపిరి. ఆ తర్వాత ఇట్లనిరి. ఓ రసూలల్లాహ్! నిదర్శనములిచ్చి మీరు నా విశ్వాసమును బలహీనపర్చుచుండిరి గదా! మీ జీవితమును చూచిన వానికి మీ సత్యమునకు మరో నిదర్శనము అవసరమా ?

**విశ్వాసుల చిన్న సంఘము**

ఈ చిన్న సంఘముతోనే ఇస్లాం ఆవిర్భవించెను. వృద్ధాప్యములోకి అడుగిడుతున్న ఒక స్త్రీ, 11 సం॥ల ఒక బాలుడు, అపరిచితులలో నిస్సహాయ జీవితము గడుపుతున్న స్వాతంత్ర్యము పొందిన ఒక బానిస, ఒక యువ మిత్రుడు, దైవవాణి పొందు ప్రకటనకర్తతో ఈ చిన్న బృందం ఏర్పడెను. అవిశ్వాసము, దుర్మార్గము రాజ్యమేలుతున్న జగత్తులో కాంతి వ్యాపింపజేయుటకు కంకణము కట్టెను. ఈ విషయములు వినిన వారు హేళన చేసిరి. వీరు పిచ్చివారైనారు. వీరి మాటలకు ఆశ్చర్యపడవద్దు. విని ఆనందపడమని ఒకరినొకరు అనుకొనిరి. కాని నిజం నిప్పులాగా రాజుకుంటూ పోయింది. యసయా సందేశహరుని భవిష్యత్వాణి "ఆజ్ఞ వెంబడి ఆజ్ఞ, ఆజ్ఞ వెంబడి ఆజ్ఞ, సూత్రము వెంబడి సూత్రము, సూత్రము వెంబడి సూత్రము" *(అధ్యాయము 28, సూక్తి 13)* గా బలపడింది.



"ఇంతింతై వటుడింతై" అను చందంగా ఒక అపరిచిత భాషలో అల్లాహ్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా అరబ్బులతో మాట్లాడడం మొదలు పెట్టెను. నవయువకులు ఆకర్షితులైనారు. సత్యాన్వేషులు కూడ దీర్ఘాలోచనలో పడిపోయిరి. అపహాస్యము, ఎగతాళికి పాల్పడుతున్న వారి మాటలలో కూడ ప్రశంసనీయ పదాలు వెలువడడం ప్రారంభమయ్యెను. బానిసలు, నవయువకులు, పీడితులు, స్త్రీలు వారి (స) చుట్టు ప్రోగైరి. ఎందుకనగా వారి (స) పిలుపులో స్త్రీలు తమ హక్కుల భద్రత చూచుచుండిరి. బానిసలు తమ స్వాతంత్ర్య ప్రకటన వినుచుండిరి. నవయువకులు పెద్ద ఆశలు, అభివృద్ధి మార్గములు తెరువబడునని ఊహించుచుండిరి.

**మక్కా నాయకుల ప్రతిఘటన**

అపహాస్యము, ఎగతాళి మాటలలో ప్రశంసనీయ పదాలు వెలువడడం చూసి మక్కా నగర నాయకుల వెన్నులో వణుకు పుట్టెను. పాలకులు ఆందోళన చెందసాగిరి. వారు సలహా సమావేశమును ఏర్పరచి, ప్రణాళికలు రూపొందించుకొనిరి. పరిహాసము, ఎగతాళికి బదులు దౌర్జన్యము, హింస, ప్రతిఘటన, బహిష్కరణకు నిర్ణయాలు తీసుకొని వాటిని పాటించడం ప్రారంభించిరి. మక్కా వాసులు ఇస్లాంను ప్రతిఘటించుటకు తుది నిర్ణయం తీసుకొనిరి. ఎందుకనగా మతిలేని ప్రకటన ప్రగతి చెందుతున్నట్లు స్పష్టమగుచుండెను. ఈ ప్రకటన మక్కా రాజకీయ, మత, నాగరికత, సంప్రదాయాల అంతానికి సూచికగా మారుచుండెను. నవీన భూమ్యాకాశముల నిర్మాణము వైపు దూసుకెళ్లు తున్నట్లు ఇస్లాం కనిపించు చుండెను. ఈ నవీన భూమ్యాకాశములుండగా అరబ్ దేశ పురాతన భూమ్యాకాశములు నిలిచే పరిస్థితి లేకుండెను. ఇప్పుడీ సమస్య పరిహాసమును అధిగమించి జీవన్మరణ సమస్యగా

మారినది. ఇస్లాం ఛ్యాలెంజ్‌ను వారు స్వీకరించిరి. గతములో సందేశహరుల శత్రువులు సందేశహరుల ఛ్యాలెంజ్‌ను స్వీకరించుచూ వచ్చిన విధముగనే వారు స్వీకరించిరి. నిదర్శనమును నిదర్శనముతో ఎదుర్కొనక ఖడ్గము, బాణముతో ఎదుర్కొనుటకు వారు సిద్ధమైరి. ఇస్లాం సత్ప్రవర్తనకు బదులు దుర్భాష. దుష్పదాలతో ప్రత్యుత్తరమిచ్చుటకు పూనుకొనిరి. మరొక్కసారి జగత్తులో అవిశ్వాసము, ఇస్లాం మధ్య యుద్ధము మొదలయ్యెను. షైతాన్ సైన్యము మరోసారి దేవదూతలపై యుద్ధమునకు దిగెను. ఆ చిన్న బృందం మక్కావాసుల శక్తి ముందు ఎట్లు నిలబడును. అసభ్యకర పద్ధతులలో స్త్రీలు హతమార్చబడిరి. పురుషులు పాదములు చీల్చి హత్య చేయబడిరి. మండుతున్న ఇసుక, బొడుసులు గల శిల్పాలపై బానిసలు ఈడ్చబడిరి. వారి చర్మములు మానవ చర్మ రూపము కోల్పోయి జంతువుల చర్మ రూపముగా మారినంత వరకు హింసించిరి. చాలా కాలము తర్వాత ఇస్లాంకు జయమునొంది ఇస్లాం పతాకము తూర్పు, పడమరలో రెపరెపలాడు నప్పుడు ఒక సందర్భమున ఆరంభ దినములలో ఇస్లాంలో చేరిన ముస్లిం బానిస ఖబ్బాబ్ (రజి) వీపు బత్తెలైనప్పుడు వారి మిత్రులు దానిని మానవుల చర్మము వలె కాకుండా జంతువుల వలె వున్నదని చూచి భయపడిరి. మీకు ఏ వ్యాధి సోకిందని వారిని ప్రశ్నించిరి. ఖబ్బాబ్ (రజి) నవ్వుతూనే ఇట్లు సమాధానమిచ్చిరి. ఇది వ్యాధి కాదు. ఇస్లాం ఆవిర్భావ దినములలో మా లాంటి నూతన ముస్లిం బానిసలను అరబ్బులు మక్కా వీధులలో బొడుసులు గల శిల్పాల పై ఈడ్చుకెళ్లేవారు. మమ్ములను వరుసగా ఈ విధముగా హింసించేవారు. ఇదే కారణము వలన నా వీపు చర్మము ఇలా మారిపోయింది.

**విశ్వాస బానిసలపై మక్కా అవిశ్వాసుల దౌర్జన్యము**

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించిన వారిలో



వివిధ జాతులకు చెందిన బానిసలుండిరి. వీరిలో హబ్షి జాతి నుండి బిలాల్ (రజి), రోమ్ (ఖస్తున్తునియ ప్రభుత్వము) జాతి నుండి సుహైబ్ (రజి) వుండగా క్రైస్తవుల నుండి జుబైర్ (రజి), సుహైబ్ (రజి) యుండిరి. అన్యారాధకుల నుండి బిలాల్ (రజి), అమ్మార్ (రజి) యుండిరి. మక్కాకు చెందిన ధనవంతుడు ఉమయ్య బిన్ ఖల్ఫ్‌కు బానిసగా ఉన్న బిలాల్ (రజి) హబ్షి వంశమునకు చెందినవారు. వారిని మండుచున్న ఇసుకలో పరుండబెట్టి యదపైన శిల్పాలు పెట్టి వాటిపై ఎగురుటకు పలు యువకులను అతను నియమించేవాడు. వేసవి కాలములో మధ్యాహ్న సమయమున బిలాల్ (రజి) ను మక్కా శివారుకు తీసుకెళ్లి మండుతున్న ఇసుకపై అర్థ నగ్నంగా పరుండబెట్టి పెద్ద పెద్ద రాళ్లు యదపైన పెట్టి లాత్, ఉజ్జా విగ్రహాలను దైవముగా అంగీకరించి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను తిరస్కరించమని ఉమయ్య ఆజ్ఞాపించేవాడు. సమాధానముగా బిలాల్ (రజి) اَحَد، اَحَد (అహద్, అహద్) అనగా అల్లాహ్ ఒక్కడేనని విలపించేవారు. పదే పదే ఈ సమాధానము విని ఉమయ్య మరింత కోపోద్రిక్తుడయ్యేవాడు. మెడలో తాడు బిగించి మక్కా వీధులలోని రాళ్లపై ఈడ్చుకెళ్లమని దుష్టులైన బాలురకు అప్పగించేవాడు. వారి శరీరము రక్తసిక్తమయ్యేది. అయినను اَحَد، اَحَد (అహద్, అహద్) అనగా అల్లాహ్ ఒక్కడేనని అనేవారు. దీర్ఘ కాలము తర్వాత అల్లాహ్ ముస్లిములకు మదీనా నగరములో శాంతి ప్రసాదించి, ఎలాంటి అవరోధం లేకుండా ప్రార్థన చేయుటకు స్వేచ్ఛ కల్పించెను. అప్పుడు బిలాల్ (రజి) ను అజాన్ ఇచ్చుటకు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం నియమించిరి. ఈ హబ్షి బానిస اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰه కు బదులు اَسْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰه అనగానే మదీనా వాసులు వారి పూర్వము తెలియక నవ్వుకునేవారు. ఒక సారి బిలాల్ (రజి) అజాన్ గూర్చి ప్రజలను

నవ్వుచుండగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం గమనించి, వారు (స) ప్రజల వైపు తిరిగి ఇట్లు వ్యాఖ్యానించిరి. బిలాల్ (రజి) అజాన్ విని మీరు నవ్వుచున్నారు. కాని అల్లాహ్ సింహాసనమున అతని అజాన్ విని ఆనందపడును. ఇందులో ఉన్న భావమేమనగా ప్రజలారా! ఇతను "ష" పలుకలేడని మీరు అనుకుంటున్నారు. కాని **"ష"** ను **"స"** గా పలకడంతో కలిగే నష్టమేమున్నది. మండుచున్న ఇసుకపై అతన్ని అర్ధనగ్నంగా పరుండబెట్టేవారు. అతని యదపై హింసాత్ములు పాదరక్షలతో సహా ఎగురుచూ ఇప్పటికైనా గుణపాఠం కలిగిందా లేదా అని ప్రశ్నించి నప్పుడు వచ్చిరాని భాషలో اَحَد، اَحَد అని అల్లాహ్ ఏకత్వమును ప్రకటించేవారు. ఈ విధంగా విశ్వాసము, ఏకారాధన నమ్మకము, హృదయ స్థిరత్వంనకు నిలువెత్తు సాక్ష్యముగా నిలిచేవారు. కావున అతని اَسْهَدُ అనేకుల اَشْهَدُ కంటే చాలా విలువైనది.

హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హు వీరిపై జరుగుచున్న హింసను చూచి వారి యజమానికి అడిగిన ధర చెల్లించి వారికి విముక్తి ప్రసాదించిరి. అటులనే అనేక బానిసలకు హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హు తన ధనముతో విముక్తి కల్పించిరి. ధనవంతుడైన సుహైబ్ (రజి) అను వ్యక్తి కూడ ఈ బానిసలలో యుండిరి. వీరు వ్యాపారము చేసేవారు. మక్కాలో గౌరవమర్యాదలు గల వ్యక్తిగా పేరు పొందియుండిరి. వారు ధనవంతులైనను, స్వాతంత్ర్యము పొందివున్నను ఖురైషీలు స్పృహ కోల్పోయేంతవరకు వారిని కొట్టేవారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు వలస వెళ్లినప్పుడు సుహైబ్ (రజి) కూడ మదీనాకు వెళ్లిపోవుటకు బయలుదేరిరి. మక్కావాసులు వారిని అడ్డుకొని మక్కాలో సంపాదించిన డబ్బును మీరు వేరే ప్రాంతానికి ఎలా తీసుకెళ్లగలరని ప్రశ్నించిరి. మేము నిన్ను మక్కా నుండి వెల్లనివ్వమని భీష్మించి కూర్చొనిరి.



అప్పుడు నేను నా ధనమంతటిని మీకిచ్చినచో నన్ను పోనిస్తారా ? అని అడగగానే అందుకు వారు అంగీకరించిరి. ఈ విధముగా వారు తన సంపాదన మొత్తాన్ని మక్కా వాసులకు ఇచ్చి, కట్టుబట్టలతో మదీనాకు వెళ్లి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకోగానే "ఓ సుహైబ్ (రజి) నీవు చేసిన ఈ వ్యాపారము గతములోని అన్ని వ్యాపారాల కంటే లాభదాయకమైనదని" వారు (స) నుడివిరి. అనగా ఇంతకు ముందు నీవు వస్తువులను విక్రయించి డబ్బు సంపాదించేవాడవు, ఇప్పుడు డబ్బు బదులు 'విశ్వాసము' పొందితివి.

ఈ బానిసలలో అధిక శాతం అంతర్గత, బాహ్య జీవితములో స్థిరత్వము ప్రదర్శించిరి. కాని పలువురు బాహ్య రూపంలో ఒత్తిడికి కూడ తలొగ్గిరి. ఒక సందర్భమున అమ్మార్ నామము గల ఒక బానిస ఏడ్చి, ఏడ్చి ఎక్కిల్లు పట్టి, కన్నీళ్లు తూడ్చుకుంటుండగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని చూచి ఏమైనదని ప్రశ్నించిరి. ఓ అల్లాహ్ ప్రవక్త! నా పరిస్థితి చాలా దారుణంగా వుంది. ఎందుకనగా మీకు వ్యతిరేకంగా, విగ్రహాలకు అనుకూలంగా నా నోట వాక్యములు వెలువడే వరకు వారు నన్ను అతిక్రూరంగా హింసించారని అమ్మార్ వివరించెను. కాని నీ హృదయము లో ఏముండెనని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరల ప్రశ్నించిరి. నా హృదయము లో మడమ తిప్పని విశ్వాసము తొణికసలాడుతుండెనని అమ్మార్ సమాధానమిచ్చెను. నీ హృదయము విశ్వాసముపై తృప్తిగా వుండినచో అల్లాహ్ నీ ఈ బలహీనతను క్షమించునని వారు సంతృప్తి పరిచిరి. వీరి తండ్రి యాసిర్ (రజి), తల్లి సమియ్య (రజి) ను కూడ అవిశ్వాసులు చాలా హింసకు గురి చేయుచుండిరి. వారిరువురిని బాధపెడుతున్న సమయమున రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం స్వయాన చూచి, వారి బాధలను తట్టుకోలేక صبراً آل ياسر موعودكم الجنة

అనగా ఓ యాసిర్ కుటుంబం సహనం పాటించుము. అల్లాహ్ మీ కొరకు స్వర్గము సిద్ధము చేసివున్నాడని తెలిపిరి. ఈ భవిష్యవాణి కొద్ది రోజులలోనే ఈ విధంగా పూర్తయినది. యాసిర్ (రజి) కొరడా దెబ్బలు సహించలేక పరమపదించిరి. అయినను అవిశ్వాసుల కోపము తగ్గలేదు. వృద్ధురాలైన వారి భార్యను కూడ వారు హింసించడం ఆపలేదు. ఒక రోజు అబూజహ్ల్ మితిమీరిన కోపంతో వారి తొడపై బల్లెము విసరడంతో అది తొడను చీల్చుచూ కడుపులోకి దిగెను. అప్పుడు ఆ బాధతోనే వారు ప్రాణము విడిచిరి.

జిన్నీర (రజి) అను ఒక స్త్రీ బానిసను అబూజహ్ల్ ఘోరాతి ఘోరంగా హింసించడంతో వారు నేత్రములు కోల్పోయిరి. అబూఫకీహ (రజి) సఫ్వాన్ బిన్ ఉమయ్యకు బానిసగా వుండిరి. వారి యజమాని, కుటుంబ సభ్యులు వారిని మండుచున్న భూమిపై పరుండబెట్టి వేడెక్కిన పెద్ద పెద్ద రాళ్లు వారి యదపై పెట్టేవారు. ఈ బాధ తట్టుకోలేక వారి నాలుక బయటికి వచ్చేది. ఇదే పరిస్థితి ఇతర బానిసలది.

ఈ హింస నిస్సందేహంగా మానవులు భరించలేని తారాస్థాయికి చేరుకొనెను. కాని ఈ హింసకు గురైనవారు భౌతికంగా మానవులైనను అంతర్గతంగా దేవదూతలు. పవిత్ర ఖురాన్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హృదయము, చెవులలో మాత్రమే అవతరించలేదు. అల్లాహ్ వారి అనుచరుల హృదయాలలో కూడ అవతరించుచుండెను. ఆరంభ విశ్వాసుల హృదయాలలో అల్లాహ్ తన వాక్యము ద్వారా ధైర్యం నింపనిదే ఏ ధర్మము స్థిరపడదు. మానవులు వారిని వదిలి, బంధుమిత్రులు వారిని బహిష్కరించిన సందర్భమున అల్లాహ్ నేను మీ వెంట వున్నానని వారి హృదయాలలో ధైర్యము నింపడంతో వారి బాధలన్ని మటుమాయమైపోయేవి. దూషణలే ఆశీర్వాదాలుగా



మారిపోయేవి. రాళ్లు వారికి ఔషధంలా ఉపశమనం కల్పించేవి. వ్యతిరేకత అధికమవుతూ వుండగా విశ్వాసము కూడ ప్రగతి చెందసాగెను. హింస హద్దులు దాటెను కాని ప్రేమ కూడ హద్దులను దాటి ముందుకు సాగెను.

## స్వతంత్ర ముస్లిములపై దౌర్జన్యము

స్వతంత్ర ముస్లిములు కూడ భరించలేని బాధలకు గురైరి. వారి పెద్దలు, కుటుంబ ప్రముఖులు వారిని వివిధ రకాలుగా హింసించేవారు. గొప్ప ధనవంతులైన హజ్రత్ ఉస్మాన్ (రజి) 40 సంIIలకు చేరియుండిరి. అయినను ఖురైష్ వారిని హింసించు తీర్మాణము చేసినప్పుడు వారి చిన్నాన 'హకమ్' వారిని తాళ్ళతో బంధించి తీవ్రంగా కొట్టెను. జుబైర్ బనిల్ అవ్వామ్ ఒక వీర నవయువకుడు. ఇస్లాం విజయాల సమయమున వారు సఫలీకృత సేనాపతిగా ఋజువైరి. వారి చిన్నాన కూడ వారిని చాలా హింసించేవారు. వారు వారిని ఒక చాపలో చుట్టి శ్వాస తీసుకొనుటలో ఇబ్బంది కలుగుటకు క్రింది నుంచి పొగపెట్టి ఇప్పటికైనా ఇస్లాంను వదులుతావా లేదా ? అని ప్రశ్నించేవారు. కాని వారు ఆ బాధలను తట్టుకొని 'నేను సత్యమును గ్రహించిన తర్వాత నిరాకరించలేనని' సమాధానమిచ్చేవారు.

హజ్రత్ అబూజర్ (రజి) ఘిఫ్ఫార్ తెగకు చెందిన వారైయుండిరి. మక్కాలో ఒకరు దైవ ప్రవక్తగా ప్రకటించుకొనినట్లు వారక్కడ వినిరి. నిర్ధారించుకొను ఉద్దేశముతో వారు మక్కాకు వచ్చిరి. అయితే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మా బంధువే, అతడు ఒక దుకాణం తెరిచినాడని మాకు తెలుసని మక్కా వారు వారిని తప్పుద్రోవపట్టించ్చిరి. కాని అబూజర్ (రజి) తన సంకల్పమును వీడలేదు. అనేక ప్రయత్నాలతో కష్టపడి తుదకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుటలో సఫలమైరి. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లాం

బోధనలు ఉపదేశించగా వారు విశ్వసించిరి. కొంత కాలము వరకు తాను ఇస్లాంలో చేరినట్లు నా జాతి వారితో గుప్తముగా వుంచవచ్చునా? అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను అడిగిరి. కొన్ని రోజుల వరకు మౌనము వహించినా తప్పు లేదని వారు (స) అనుమతించిరి. ఈ అనుమతితో తమ కుటుంబము వైపు వెళ్లుచు కొన్ని రోజులలో పరిస్థితులను చక్కబెట్టి ఇస్లాంను బహిర్గతమొనర్చుదునని నిర్ణయించుకొనిరి. మక్కా వీధులలో పోవుచున్నప్పుడు మక్కా నాయకులు ఇస్లాంను దూషించుచున్నది వారు చూచిరి. ఇది విని తాను కొన్ని రోజుల వరకు తన విశ్వాసాన్ని బహిర్గతపర్చనను ఆలోచనను విరమించుకొనిరి. ఆవేశం ఆపుకోలేక వారు వెంటనే ఆ నాయకుల ముందు ఇట్లు ప్రకటించిరి.

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

అనగా అల్లాహ్ ఒక్కడే, అతనికి ఎవరు భాగస్వాములు లేరని నేను సాక్ష్యమిచ్చుచున్నాను. హజ్రత్ ముహమ్మద్ (స) అతని దాసుడు, అతని ప్రవక్త అని నేను సాక్ష్యమిచ్చుచున్నాను.

ఈ ప్రకటన వినగానే శత్రువుల ఆ సమూహం మొత్తం వారి పై విరుచుకుపడి కొట్టసాగిరి. ఈ దెబ్బలను తట్టుకోలేక వారు స్పృహ కోల్పోయిరి. అయినను క్రూరులు శాంతించలేదు. వారిని అలాగే హింసించుచుండిరి. ఇంతలోనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చిన్నాన అబ్బాస్ (రజి) అప్పటికి ఇస్లాంలో చేరలేదు. వారక్కడికి వచ్చిరి. వీరిని చూచి అబూజర్ గ్రామం నుండి మీ వ్యాపార బృందాలు వస్తుంటాయి వారు కోపోద్రిక్తులై ఆ బృందాలను అడ్డుకున్నచో మక్కా ఆకలితో మరణించునని వారికి హితవు పలికిరి. అప్పుడు వారు అబూజర్‌ను విడిచి పెట్టిరి. వారు ఒక రోజు విశ్రాంతి తీసుకొని రెండవ రోజు మరల ఆ సమావేశానికి హాజరైరి. అక్కడ ప్రతి రోజు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు వ్యతిరేకంగా మాట్లాడు కోవడం ఆనవాయితి. వీరు కాబాలో ప్రవేశించగానే అదే ప్రస్తావన కొనసాగుచుండెను. అప్పుడు వీరు మరల అక్కడ నిలిచి దైవ ఏకత్వమును ప్రకటించిరి. అవిశ్వాసులు వారిని మరల కొట్టిరి. ఈ విధంగా వారు మూడు రోజులు ప్రకటన చేయగా మూడు రోజులు హింసకు గురైరి. ఆ తర్వాత వారు తమ గ్రామానికి తిరిగి వెళ్లిపోయిరి.



**ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పై విపత్తులు**

ఈ దుర్భర పరిస్థితులలో స్వయంగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కూడ సురక్షితంగా లేకుండిరి. రకరకాలుగా వారిని హింసించనైనది. ఒక సందర్భమున వారు ప్రార్థనలో ఉండగా కొందరు వారి మెడలో తాడు కట్టి లాగడం వలన వారి కనులు బయటికి వచ్చేసినవి. ఇంతలో హజ్రత్ అబూబకర్ (రజి) అక్కడికి వచ్చి, ఇట్లనుచు వారిని విడిపించిరి. ఓ ప్రజలారా! 'నా యజమాని అల్లాహ్' అన్నందుకు మీరొక వ్యక్తిని హతమార్చుదురా? *(బుఖారి సంపుటి 1, పేజి 544 ప్రచురణ ముజ్తబాయి, అబ్వాబ్ బున్యానుల్ కాబా)* మరో సమయమున వారు ప్రార్థనలో వుండగా వారి వీపుపై ఒంటె పేగులు వేయనైనది. కొందరు వచ్చి దానిని వారి వీపు పై నుండి తొలగించే వరకు ఆ భారము వలన వారు తల పైకి లేపలేకపోయిరి. *(బుఖారి కితాబుస్సలాత్ బాబుల్‌మజాత్ తత్రహ్ మినల్‌ముసల్లి షైఅన్ మినల్ ఇజా)*

మరో సందర్భమున వారు వీధిలో వెళ్లుచుండగా మక్కా దుష్టుల ఒక గుంపు వారి చుట్టు చేరి, దారి పొడవున వారి మెడపై కొట్టుచూ 'ఓ ప్రజలారా ! ఇతనే ప్రవక్త' గా ప్రకటించుకున్నాడని అవహేళన చేసిరి.

చుట్టుప్రక్కల గృహాల నుండి వారి గృహముపై వరుసగా రాళ్ళ వర్షం కురిసేది. వంటశాలలో మురికి వస్తువులు పడవేసేవారు. వాటిలో

మేకల, ఒంటెల పేగులు కూడ వుండెడివి. వారు (స) ప్రార్థన చేయునప్పుడు వారిపై దుమ్ముధూళి వేసేవారు. విధిలేక వీరు పర్వత ప్రాంతములోని ఒక పెద్ద శిల్పం క్రింద రహస్యముగా ప్రార్థన చేసేవారు. కాని ఈ హింసలు నిష్ఫలం కాలేదు. ఎందుకనగా పుణ్యస్వభావము గల వారు వీటిని చూచి ఇస్లాం పట్ల ఆకర్షితులగుట ప్రారంభించిరి. ఒక రోజు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖానా కాబా సమీపములో నున్న సఫా అను పర్వతము పై కూర్చొని వుండిరి. వారి అతిపెద్ద శత్రువు, మక్కా నాయకుడు అబూజహ్ల్ అటు నుండి వెళ్లుచూ ఘోరంగా వారిని దూషించెను. కాని వారు అతని దూషణలను విని, ఏ సమాధానమివ్వక మౌనముగా అక్కడి నుండి లేచి తమ ఇంటికి వెళ్లిపోయిరి. వారి కుటుంబంలోని ఒక దాసి ఈ దృశ్యమును చూచెను. వారి చిన్నాన హంజ (రజి) శక్తివంతులు, ధైర్యవంతులుగా పేరు పొందియుండిరి. వారి ధైర్యసాహసాల వలన నగర వాసులు వారితో భయపడేవారు. వేటకు వెళ్ళి సాయంత్రం అరణ్యము నుండి తిరిగి ఇంటికి వచ్చిరి. భుజము పై ధనుస్సు వేలాడ దీసుకొని ఆడంబరముగా తమ గృహములోకి ప్రవేశించిరి. ఉదయం జరిగిన సంఘటన దాసిని కలతకు గురిచేసెను. హంజ (రజి) ను ఇంత ఆడంబరముగా చూచి భరించలేక, మీరు ఎల్లప్పుడు ఆయుధాలు ధరించి పెద్ద వీరునిగా తిరుగుదురు. కాని నేటి ఉదయం మీ అన్న కుమారునితో అబూజహ్ల్ ఏ విధంగా ప్రవర్తించెనో తెలుసా? అని వ్యంగ్యంగా ప్రశ్నించెను. ఏమి చేసినాడు ? అని హంజ (రజియల్లాహు తాలా అన్హు) అడిగినప్పుడు ఆమె ఉదయం జరిగిన సంఘటన మొత్తం హంజ (రజి) కు వివరించెను. అప్పటికి హంజ (రజి) ఇస్లాంలో చేరలేదు. కాని సత్యస్వభావము గలవారైయుండిరి. ఇస్లాం సందేశమును వారు ఇంతకు ముందే తప్పక వినివుండిరి. నిశ్చయముగా అది వారిని ప్రభావితం



చేసియుండెను. కాని స్వతంత్ర జీవితము వలన ఆ సందేశము గూర్చి ఆలోచించే అవకాశము వారికి లభించలేదు. కాని ఈ సంఘటనను వినగానే వారు ఉత్తేజులై నిర్లక్ష్యపు తెర తొలగిపోయెను. ఒక విలువైన వస్తువు చేజారిపోతుందని వారు భావించిరి. వెంటనే ఇంట్లో నుంచి బయలుదేరి నాయకుల సలహా సేకరణకు ప్రత్యేక స్థలమైన ఖానా కాబాకు చేరుకొనిరి. తన ధనుస్సు భుజము పైనుండి తీసి అబూజహ్ల్‌ను గట్టిగా కొట్టిరి. ఆ తర్వాత వినుము! నేను కూడ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మమును అనుసరించితిని. అతడు ఎదురు మాట్లాడడని అకారణముగా నీవు అతన్ని దూషించితివి. నీవు వీరుడవే అయినచో నా దెబ్బకు సమాధానమిమ్ము అని గర్జించిరి. ఈ ఊహించని పరిణామంతో అబూజహ్ల్ కూడ భయపడెను. అతని సహచరులు హంజ (రజి) ను దండించుటకు సిద్ధమైరి. కాని హంజ (రజియల్లాహు తాలా అన్హు) గారి సాహసం, శక్తివంతమైన వారి సమూహమును దృష్టియందుంచుకొని అబూజహ్ల్ వారిని వారించెను. ఎందుకనగా యుద్ధము మొదలయినచో దాని పరిణామాలు తీవ్రమయ్యే అవకాశముందని అతడు ఊహించెను. నేను నిజంగానే అతని అన్న కుమారున్ని అధికంగానే దూషించితిని. ఈ జగడమును ఇంతటితో వదులుటయే మేలని వివేకముతో స్పందించి తన మిత్రులను నివారించెను.

## ఇస్లాం సందేశము

ఒక వైపు వ్యతిరేకత తీవ్ర రూపం దాల్చుకొనెను. రెండవ వైపు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులు నిరంతరం మక్కా వాసులకు ఈ క్రింది సందేశము అందించసాగిరి. సృష్టిని పుట్టించిన దేవుడు ఒక్కడే. అతడు తప్ప మరో ఆరాధ్యుడు లేడు. గతించిన సందేశహరులందరు అతని ఏకత్వమును ప్రకటించుచుండిరి. తమ

స్వజాతులను ఈ బోధన వైపే ఆహ్వానించేవారు. మీరు ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను విశ్వసించుము. నిరుపయోగమైన ఈ శిల్ప విగ్రహాలను వదిలి పెట్టుము. వీటికి ఎట్టి శక్తి లేదు. ఓ మక్కా వాసులారా ! మీరు అందించిన తినుభండారాలను వీటి ముందు ఉంచగా ఈగల గుంపు వచ్చి వాటిపై కూర్చొనినచో వాటిని చెదరగొట్టే శక్తి కూడ వాటికి లేదు. వాటిపై దాడి జరిగినచో అవి ప్రతిఘటించలేవు. వాటిని ఎవరైనా ప్రశ్నించినచో సమాధానము ఇవ్వలేవు. ఎవరైనా వాటితో సహాయము కోరినచో అవి అతనికి సహాయము చేయలేవు అను విషయము మీరు చూచుచున్నారు కదా ? కాని ఏకేశ్వరుడైన అల్లాహ్ కోరువారి అవసరాలను తీర్చును. అడిగిన వారికి సమాధానమిచ్చును. సహాయము కోరువారికి సహాయము చేయును. తన శత్రువులను ఓడించును. తనను ఆరాధించేవారికి గొప్ప ప్రగతి అందించును. అతని ద్వారా ప్రజ్వలించే జ్యోతి అతని దాసులను కాంతివంతము చేయును. మరి ఇటువంటి దేవుడిని వదిలి ప్రాణరహిత విగ్రహాలను మీరు పూజించి, తమ ఆయువును ఎందుకు వృధా చేసుకుంటున్నారు ? అల్లాహ్ ఏకత్వమును వీడినందున మీ అభిప్రాయాలు కూడ మలినమై, హృదయములు చీకటి మయమైనట్లు మీరు గమనించలేదా? వివిధ భ్రమలతో కూడిన విద్యలలో మీరు కూరుకుపోయి యున్నారు. ధర్మము, అధర్మములో మీరు తేడా చేయలేక మంచి, చెడులను గుర్తించలేక పోవుచున్నారు. స్వంత తల్లులను అవమానించుచున్నారు. తమ సోదరీమణులను, కుమార్తెలను హింసకు గురిచేయుచున్నారు. వారి హక్కులు వారికి చెల్లించరు. తమ భార్యలతో మంచిగా ప్రవర్తించరు. అనాథల హక్కులను హరించెదరు. విధవరాళ్ళతో చెడుగా వ్యవహరించెదరు. నిరుపేదలు, బలహీనులపై దౌర్జన్యము చేయుదురు. ఇతరుల హక్కులను హరించి, పెద్దరికాన్ని చాటుకొందురు.



నిర్భయముగా అసత్యము, మోసమునకు పాల్పడెదరు. దొంగతనము, దోపిడితో మీకు ద్వేషము లేదు. జూదము, మద్యపానము మీ దినచర్య. విద్యాభ్యాసము, దేశ సేవలో మీకు శ్రద్ధ లేనే లేదు. ఏకేశ్వరుడైన అల్లాహ్ పట్ల ఎప్పటి వరకు నిర్లక్ష్యము వహించెదరు. తమ సంస్కరణకు ఇక నడుం బిగించుము. దౌర్జన్యమును వదులుము. ప్రతి ఒక్కరి హక్కులు చెల్లించుము. దేవుడు ధనము ప్రసాదించినచో దానిని దేశ, జాతి సేవకై, బలహీనుల, నిరుపేదల అభివృద్ధికై వినియోగించుము. స్త్రీలను గౌరవవించుము. వారి హక్కులు చెల్లించుము. అనాథలను అల్లాహ్ న్యాసముగా గుర్తించుము. వారిని ఆదుకొనుట గొప్ప సత్కార్యముగా భావించుము. విధవరాళ్లకు సహాయులుగా నిలవుము. దైవభీతితో సత్కర్మలు చేయుము. న్యాయము, నిజాయితినే గాక కరుణ, ఉపకారముతో వ్యవహరించుము. ఈ ప్రపంచ జీవితమును వృధా చేయకుము. మంచి జ్ఞాపకాలను తమ గుర్తుగా వదిలి శాశ్వత సత్కార్య బీజమును నాటుము. హక్కులు సాధించుటలో కాదు త్యాగము, బలిదానములోనే నిజమైన గౌరవము గలదు. మీరు త్యాగములు చేసి అల్లాహ్ సామీప్యము పొందుము. అల్లాహ్ వద్ద మీరు హక్కులు పొందుటకు దైవ దాసుల పట్ల త్యాగమునకు ఆదర్శముగా నిలువుము. మేము శక్తిహీనులమే కాని మా బలహీనతను చూడకుము. సత్యమైన ప్రభుత్వమునకై ఆకాశమున నిర్ణయము జరిగెను. ఇప్పుడు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా న్యాయము జరుగును. నిజాయితి, కరుణతో కూడిన ప్రభుత్వము ఏర్పడును. అందులో ఎవరికి అన్యాయము జరగదు. మతము విషయము లో జోక్యముండదు. స్త్రీలపై, బానిసలపై జరుగుతున్న దౌర్జన్యము అంతమగును. షైతాన్ ప్రభుత్వము బదులు ఏకైక అల్లాహ్ ప్రభుత్వము స్థాపించబడును.

## అబూతాలిబ్‌తో మక్కా అవిశ్వాసుల ఫిర్యాదు

## ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్థిరత్వం

ఈ బోధనలు మక్కా వారికి పదే పదే వినిపించడం వలన ఇస్లాం పట్ల సత్యస్వభావము గల ప్రజల ఆకర్షణ రోజు రోజుకు అధికమయ్యెను. అందుకే ఒక రోజు మక్కా నాయకులు కలిసి వారి (స) చిన్నాన్న అబూతాలిబ్ వద్దకు వచ్చి వారితో ఇట్లు ఫిర్యాదు చేసిరి. మీరు మా నాయకులు. మీ వలన మీ అన్న కుమారుడు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను మేము ఏమి అనలేము. మీతో అంతిమ నిర్ణయము తీసుకునే సమయము ఇప్పుడు ఆసన్నమైనది. మీరు అతన్ని నివారించుము. లేదా అతను మాతో ఆశిస్తున్నదేమిటో తెలుసుకొనుము. అతడు గౌరవము పొందాలని కోరినచో మేము అతన్ని మా నాయకునిగా ఎన్నుకొనుటకు సిద్ధముగా నున్నాము. అతడు ధనము ఆశించినచో మేమందరము మా ధనములో నుండి కొంత భాగము అతనికి సమర్పించుటకు సిద్ధమే. అతడు వివాహమాడదలచినచో మక్కాలోని ఏ అమ్మాయిని అతడు ఇష్టపడునో ఆ అమ్మాయితో అతనికి వివాహము చేయించుటకు సిద్ధముగా నున్నాము. ఇందుకు బదులు మేము అతనితో ఆశించునది శూన్యం. ఏ విషయంలో అవరోధం కల్గించము. మేము కోరునదొకటే అతడు మా విగ్రహాలను నిందించుట మానుకొనవలెను. దేవుడు ఒక్కడే నని అతను అనుటలో మాకు అభ్యంతరము లేదు. కాని మా విగ్రహాలను నిందించకూడదు. అతడు ఈ ఒక్క విషయాన్ని అంగీకరించినచో అతని, మా మధ్య సయోధ్య కుదురును. అతడు మా ఈ ప్రతిపాదనను అంగీకరించుటకు మీరు ఒప్పించుము. లేనిచో రెండింటిలో ఒకటి జరుగును. మీరు మీ అన్న కుమారున్ని వదిలివేయవలెను లేదా మీ జాతి మీ నాయకత్వమును తిరస్కరించి,



మిమ్ములను వదులును. అబూతాలిబ్‌నకు ఈ విషయము కష్టతరమైనది. అరబ్బుల దగ్గర ధనము ఎక్కువ లేకుండెను. వారి ఆనందమంతయు నాయకత్వము లోనే ఉండెడిది. నాయకులు ప్రజల కొరకు జీవించి వుంటే ప్రజలు నాయకుల కొరకు జీవించి వుండేవారు. ఈ విషయము విని అబూతాలిబ్ అనిశ్చితికి గురైరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ను పిలిపించి ఇట్లనిరి. ఓ నా అన్న కుమారుడా! నా జాతి నా వద్దకు వచ్చి నాకీ సందేశమిచ్చెను. మేము ప్రతి ఒక్క విషయము ప్రతిపాదించిన తర్వాత కూడ మీ తమ్ముని కుమారుడు రాజీకి రానిచో మీరు అతన్ని వదులవలెను. మీరు అతన్ని వదలనిచో మేము మీ నాయకత్వమును తిరస్కరించెదమని హెచ్చరించారని కూడ వివరించిరి. అబూతాలిబ్ ఈ విషయము తెలిపి కన్నీరు పెట్టుకొనిరి. వారి కన్నీటిని చూచి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కూడ కన్నీరు కార్చి, ఇట్లనిరి. ఓ చిన్నాన! నాకు సహకరించి మీరు మీ జాతిని విడిచి పెట్టమని నేను అనను. మీరు నిస్సందేహముగా నన్ను వదిలి మీ జాతితోనే వుండగలరు. కాని ఏకైక అల్లాహ్ ప్రమాణముగా వారు సూర్యున్ని నా కుడి చేతిలో, చంద్రున్ని నా ఎడమ చేతిలో పెట్టినను నా దైవ ఏకత్వమును బోధించుట విడిచి నేను వుండలేను. అల్లాహ్ నాకు మరణము నొసంగు వరకు నా కర్తవ్యములో నిమగ్నమైవుండెదను. మీ నిర్ణయము మీరే తీసుకొనగలరు. సత్యము గ్రహించుటలో విశ్వాసపూరిత, నిజాయితితో కూడిన ఈ సమాధానము అబూతాలిబ్‌నకు గుణపాఠం కలిగించెను. నాకు విశ్వాసము ప్రకటించే అనుగ్రహము లభించలేదు కాని విశ్వాస కాంతిని గ్రహించగలిగే అనుగ్రహము లభించుటయే అతి గొప్ప ధనమని వారు భావించిరి. వారిట్లు బదులిచ్చిరి. ఓ నా అన్న కుమారుడా! వెళ్లు! నీవు నీ కర్తవ్యమును నిర్వర్తించుము! జాతి నన్ను వదలదలచినచో

నిస్సందేహంగా వదలనిమ్ము. కాని నేను నిన్ను వదలలేను. *(ఇబ్నె హష్షామ్ సంపుటి 1, పుట 88 తి(బి)*

## ఎబిసీనియా వైపు ప్రస్థానము

మక్కా వాసుల దౌర్జన్యము హద్దులు దాటినప్పుడు ఒక రోజు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ అనుచరులను సమావేశపర్చి ఇట్లు ఆదేశించిరి. పశ్చిమాన సముద్రం దాటిన తర్వాత ఒక దేశము వుంది. అచట దైవారాధన వలన ఎవరు హింసించబడరు. మతమార్పిడి వలన ప్రజలను హతమార్చరు. న్యాయమూర్తి అయిన చక్రవర్తి పాలన అక్కడ కొనసాగుచున్నది. మీరు అచటికి వలస వెళ్ళుము. బహుశ మీకు అచట శాంతి వాతావరణం లభించవచ్చు. వారి (స) ఆదేశాను సారము కొందరు ముస్లిం స్త్రీలు, పురుషులు, పిల్లలు ఎబిసీనియాకు వలసపోయిరి. వారు మక్కాను వదిలి వెళ్ళుట సాధారణమైన విషయము కాదు. మక్కా వారు తమకు తాము ఖానాకాబా పర్యవేక్షకులుగా భావించేవారు. మక్కా వీడి వెళ్ళుట వారికి భరించలేని బాధగా వుండెను. ప్రపంచములో ఎక్కడా ఆశ్రయము మిగలని వ్యక్తి మాత్రమే ఈ విధంగా ఆలోచించును. కావున వారి వలస ఒక తీవ్ర దు:ఖకరమైన సంఘటనగా పరిగణించబడెను. మక్కా వాసులకు తెలిసినచో మమ్ములను వెళ్లనీయరని వారికి తెలసినందున ఎవరికి చెప్పకుండా వారు పోవలసివచ్చెను. అందుకే తమ బంధుమిత్రులను పలకరించకుండానే వారు వెళ్లిపోయిరి. వారి హృదయగాథ ఈ విధంగా ఉండగా వారి బాధను చూచిన వారు కూడ ప్రభావితమైరి. ఈ బృందం బయలుదేరుచుండగా అప్పటికి ఇస్లాం బద్దశత్రువు, ముస్లిములను ఘోరంగా హింసించే వారిలో ముందుండే హజ్రత్ ఉమర్ (రజి) దైవికముగా ఈ బృందంలోని పలువురిని చూచిరి. వారిలో ఉమ్మె అబ్దుల్లాహ్ నామము గల ఒక అనుచరురాలు కూడ వుండిరి.



మూటకట్టిన వస్తువులు, సిద్ధముగా నున్న వాహనాలను చూచి వీరు మక్కా వీడి వెళ్లుచున్నారని భావించిరి. ఓ ఉమ్మె అబ్దుల్లాహ్! ఇది వలసకు సంకేతముగా నున్నదని అనిరి. ఉమ్మె అబ్దుల్లాహ్ వ్యాఖ్యానము ప్రకారము వారిట్లు తెలిపిరి. అవును, అల్లాహ్ ప్రమాణముగా మేము వేరే దేశమునకు పోవుచున్నాము, ఎందుకనగా మీరు మమ్ములను కఠినంగా బాధించిరి. మమ్ములను క్రూరంగా హింసించిరి. అల్లాహ్ మా కొరకు సుఖసంతోష వాతావరణము కల్పించనంతవరకు మేము స్వదేశానికి తిరిగి రాలేము. అయితే అల్లాహ్ మీ వెంట వుండుగాక అని ఉమర్ (రజి) సమాధాన మిచ్చినట్లు, వారి మాటలలో ఇంతకు ముందు నేనెన్నడు చూడని ఒక రకమైన దు:ఖము స్పష్టమగుచుండెను. ఆ తర్వాత వారు తొందరగా ముఖము వేరే వైపు త్రిప్పుకొని వెళ్ళిపోయిరి. ఈ సంఘటనతో వారి హృదయం తీవ్రంగా గాయపడినట్లు నేను గమనించితినని ఉమ్మె అబ్దుల్లాహ్ (రజి) తెలిపిరి. వీరి వలస విషయము మక్కా వాసులకు తెలియగానే వారిని వెంబడించిరి. సముద్రము వరకు వారిని వెంటాడిరి. కాని వారు సముద్ర తీరమునకు చేరుకునే లోపే ఎబిసీనియా వైపు ఈ బృందం బయలుదేరెను. మక్కావారు ఈ విషయమును తెలుసుకొని వారిట్లు నిర్ణయించుకొనిరి. ఎబిసీనియా చక్రవర్తి వద్దకు ఒక బృందాన్ని పంపవలెను. అది ముస్లిములను మక్కా వారికి తిరిగి అప్పగించేటట్లు ముస్లిములకు వ్యతిరేకంగా అతన్ని రెచ్చగొట్టవలెను. తద్వారా పట్టణ నాయకుల హింసలను తట్టుకోలేక వారెందుకు మక్కా నుండి పారిపోయారను అహంకారము వలన శిక్షించవచ్చును. తర్వాత ఇస్లాంలో చేరిన అమర్ ఇబ్నుల్ ఆస్ అను వ్యక్తి కూడ ఈ బృందంలో యుండెను. వీరి సారథ్యంలోనే ఈజిప్ట్ జయించబడెను. ఈ బృందం ఎబిసీనియా వెళ్ళి చక్రవర్తిని కలిసెను. అధికారులను, సాహిత్యకారులను అన్ని విధాలా

రెచ్చగొట్టిరి. కాని అల్లాహ్ ఎబిసీనియా చక్రవర్తికి స్థిరత్వం ప్రసాదించినందున వారు ఎంత మొత్తుకున్నా, మంత్రులు ఎంత చెప్పినా ముస్లిములను అవిశ్వాసులకు అప్పగించుటకు నిరాకరించెను. ఈ బృందం విఫలమై తిరిగి వచ్చిన తర్వాత వలస వెళ్లిన ముస్లిములను రప్పించుటకు వారు మరొక ఎత్తుగడ వేసిరి. మక్కాలోని ప్రజలందరు ఇస్లాంలో చేరినట్లు ఎబిసీనియాకు వేళ్లే పలు వ్యాపార బృందాలలో అపోహ కల్గించిరి. ఈ వార్త ఎబిసీనియాలో గల ముస్లిములకు తెలియగా వారు ఆనందముగా తిరిగి మక్కా వచ్చిరి. కాని మక్కా చేరుకున్న తర్వాత కేవలం దురుద్దేశముతో ఈ వార్త వ్యాపించబడెనని, ఇందులో ఏ మాత్రం వాస్తవము లేదని వారికి తెలిసిపోయెను. అప్పుడు కొందరు తిరిగి ఎబిసీనియా వెళ్లిపోయిరి. ఇంకొందరు మక్కాలోనే ఉండి పోయిరి. ఇలా మక్కాలోనే ఉండిపోయిన వారిలో ఒకరు ఉస్మాన్ బిన్ మజ్వూన్ కూడ వుండిరి. వారు మక్కాకు చెందిన ఒక ధనవంతుని కుమారులు. ఈ సారి వారి తండ్రికి మిత్రుడైన వలీద్ బిన్ ముఘీర వారికి ఆశ్రయమిచ్చెను. వారు మక్కాలో శాంతియుతంగా వుండసాగిరి. కాని ఇతర ముస్లిములు అనేక బాధలకు గురవుతున్నట్లు, కఠినాతి కఠిన కష్టములు అనుభవించుచున్నట్లు వారు చూచిరి. వారు అభిమానముగల యువకులైనందున వలీద్ వద్దకు వెళ్లి నేను మీ శరణమును వదులుతున్నానని తెలిపిరి. ఎందుకనగా ఇతర ముస్లిములు దౌర్జన్యముకు గురవుతుండగా నేను సుఖంగా వుండుటను చూడలేక పోతున్నానని తెలిపిరి. ఉస్మాన్ ఇప్పుడు నా శరణములో లేడని వలీద్ ప్రకటించెను. ఆ తర్వాత ఒక రోజు అరబ్‌కు చెందిన ప్రఖ్యాత కవి లబీద్ మక్కా నాయకుల మధ్య కూర్చొని తన కవిత్వము వినిపించుచు ఇట్లు చదివెను.

وَكُلُّ نَعِيْمٍ لَا مَحَالَةَ زَائِلٌ



అనగా ప్రతి అనుగ్రహము ఏదో ఒక రోజు అంతమగును. ఉస్మాన్ నిలిచి ఇది తప్పు, స్వర్గమునకు చెందిన అనుగ్రహములు శాశ్వతమని తెలిపిరి. లబీద్ ఒక గొప్ప వ్యక్తి అయినందున ఈ సమాధానము విని కోపోద్రిక్తుడయ్యెను. ఓ ఖురైష్ ప్రజలారా! మీ అతిథిని ఇంతకు ముందు ఈ విధంగా అవమానించేవారు కాదు కదా? ఈ కొత్త ఆచారము ఎప్పుడు ప్రారంభమైనదని ప్రశ్నించెను. ఇతడు బుద్ధిహీనుడు కావున ఇతని మాటను పట్టించుకోవలసిన అవసరం లేదని ఒకరు సమాధానమిచ్చెను. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఇందులో బుద్ధిహీనత ఏముంది, నేనన్న విషయమే నిజమని గట్టిగా నొక్కిచెప్పిరి. అప్పుడు ఆ వ్యక్తి నిలిచి గట్టిగా వారి ముఖము పై కొట్టెను. దీనితో వారి ఒక నేత్రము బయటికి వచ్చెను. ఆ సందర్భమున ఈ సమావేశములో వలీద్ కూర్చొని వుండెను. ఉస్మాన్ (రజి) తండ్రితో అతనికి ప్రగాఢ మిత్రుత్వముండెను. చనిపోయిన తన మిత్రుని తనయుడి ఈ దుస్థితి అతడు చూడలేకపోయెను. కాని మక్కా ఆచారము ప్రకారము ఉస్మాన్ (రజి) వారి శరణములో లేనందున అతడేమియును చేయలేక పోయెను. ఉస్మాన్ నే ఉద్దేశించి అతడిట్లు అనెను. ఓ నా సోదరుని తనయుడా! అల్లాహ్ ప్రమాణముగా! నీ ఈ నేత్రము ఈ దు:ఖము నుండి రక్షించబడియుండెడిది. నీవు ఒక బలమైన శరణము (నా శరణము) లో యుండినచో, కాని నీవే స్వయంగా ఆ శరణమును వీడి, ఈ రోజును అనుభవించితివని తెలిపెను. అందుకు ఉస్మాన్ ఇట్లు బదులిచ్చిరి. నాతో జరిగిన సంఘటనను నేనే కోరుకుంటిని. గాయపడిన నా నేత్రము గురించి నీవు శోకము తెలుపుచున్నావా? సురక్షితంగా వున్న నా రెండవ నేత్రము కూడ నా తోటి నేత్రములాగా ఎందుకు నాతో జరగలేదని బాధపడుచున్నది. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మాత్రమే నాకు ఆదర్శవంతులు. వారు బాధలు ఎదుర్కొంటున్నప్పుడు నేనెట్లు సుఖంగా

ఉండగలను. నాకు దైవ సహాకారము సరిపోవును.

## హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లాం స్వీకరణ

మక్కాను అల్లకల్లోలం చేసిన ఒక అనూహ్య సంఘటన ఈ మధ్యే మక్కాలో జరిగెను. అదేమనగా ఇస్లాంలో ద్వితీయ ఖలీఫా అయిన హజ్రత్ ఉమర్ ఇస్లాం ఆరంభ కాలములో బద్ధ శత్రువులలోని ఒకరు. ఇప్పటి వరకు ఇస్లాంను అంతమొందించుటకు అనేక ప్రయత్నాలు చేయబడినను సఫలము కాలేదనే ఆలోచన వారికి వచ్చెను. అందుకే ఇస్లాం స్థాపకులనే హత్యచేసి ఈ మోసమునకు శాశ్వత ముగింపు పలకాలని ఊహించిరి. ఈ ఆలోచన రాగానే వారు ఖడ్గము పట్టుకొని ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ను అన్వేషించుటకు ఇంట్లో నుంచి బయలు దేరిరి. దారిలో వారి ఒక మిత్రుడు కలిసి వారి ఈ పరిస్థితిని చూచి ఆందోళనకు గురయ్యెను. ఓ ఉమర్ ! ఎక్కడికి వెళ్లుతున్నావని ప్రశ్నించెను. నేను ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను హతమార్చుటకు వెళ్లుతున్నానని ఉమర్ సమాధానమిచ్చిరి. అయితే నీవు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను హతమార్చి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జాతితో తప్పించుకోగలవా? అని ప్రశ్నించుచూ ముందు నీ ఇంటి విషయము తెలుసుకో ఎందుకనగా నీ సోదరి, బావ ఇస్లాం స్వీకరించిరని తెలిపెను. ఈ విషయము హజ్రత్ ఉమర్ (రజి) ను పిడుగుపాటుకు గురి చేసెను. నేను ఇస్లాంకు బద్ధ శత్రువును. నేను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను హతమార్చు సంకల్పముతో బయలుదేరిన వ్యక్తిని. నా సోదరి, నా బావే ఇస్లాంలో ప్రవేశించినారా? ఇటులైనచో ముందు నా సోదరి, నా బావ విషయము తేల్చుకొనవలెను. ఇదే ఆలోచనతో తన సోదరి గృహము వైపు వెళ్లిరి. వారు తలుపు వద్దకు చేరుకోగానే లోపల మంచి స్వరముతో ఏదో పఠించినట్లు వినపడెను. వారి సోదరి, బావకు పవిత్ర ఖురాన్



నేర్పుచున్న ఖబ్బాబ్ (రజి) ధ్వని బయటికి వినిపించెను. ఉమర్ వేగంగా ఇంట్లోకి ప్రవేశించిరి. వారి పాదముల శబ్దము వినిన ఖబ్బాబ్ (రజి) ఒక మూలకు నక్కిరి. అప్పుడు పఠించబడుచున్న పవిత్ర ఖురాన్ సూక్తుల పుటలను ఫాతిమా నామము గల వారి సోదరి దాచి పెట్టిరి. హజ్రత్ ఉమర్ (రజి) గదిలో ప్రవేశించి మీరు ధర్మభ్రష్టులైనట్లు నేను విన్నానని కోపముతో ప్రశ్నించుచూ చిన్నాన కుమారుడైన తన బావపై దాడికి సన్నద్ధమైరి. వారి సోదరుడు తన భర్త పై దాడి చేయుచున్నాడని చూచిన ఫాతిమ పరుగెత్తి తన భర్త ముందు నిలబడిరి. ఉమర్ (రజి) చేయి దాడికి లేచెను. వారి చేయి వారి బావపైకి వెళుతుండెను. ఇప్పుడు దానిని ఆపుట వారి వల్ల కాలేదు. అందుకే వారి హస్తము వారి బావ బదులు ఫాతిమా ముఖముపై పడెను. ఫాతిమా ముక్కు నుండి రక్తం ప్రవహించసాగెను. ఫాతిమా దెబ్బలు తిన్నను ధైర్యం మాత్రం కోల్పోలేదు. ఉమర్! మేము ఇస్లాంలో చేరినది నిజమే, మీరేమి చేసినను మేము ఈ ధర్మమును వదిలిపెట్టమని చెప్పెను. ఉమర్ (రజి) వీరులే అయినను దౌర్జన్యము వారి సాహసమును తగ్గించలేదు. కాని తన స్వంత సోదరి అయిన ఒక స్త్రీని స్వహస్తముతో గాయపర్చుట వలన వారిలో పశ్చాత్తాపము మొదలైనది. తన సోదరి ముఖము నుండి రక్తము ప్రవహించుచున్న దృశ్యమును చూచి ఉమర్ (రజి) కోపము దూరమయ్యెను. తన సోదరితో క్షమాపణ కోరాలనే ఆలోచన బలంగా వచ్చెను. అందుకే ఏమి అనలేక 'మీరు చదువుచున్న సందేశము నాకు కూడ వినిపించమని' అడిగిరి. మీరు ఆ కాగితములను వృధా చేయుదురు అందుకే నేను మీకు వాటిని చూపనని ఫాతిమా (రజి) చెప్పిరి. ఉమర్ (రజి) లేదు సోదరీ! నేనలా చేయనని వేడుకొనెను. మీరు అపవిత్రులు. ముందు మీరు స్నానము చేసినచో చూపించెదనని ఫాతిమా (రజి) బదులిచ్చిరి. పశ్చాత్తాపము వలన

ఉమర్ (రజి) ఏమైనా చేయుటకు సిద్ధమైరి. కావున వారు స్నానము చేసి వచ్చిన తర్వాత ఫాతిమా (రజి) వారికి ఆ పవిత్ర ఖురాన్ కాగితములు ఇచ్చిరి. పవిత్ర ఖురాన్ ఆ పుటలలో అధ్యాయము తాహా కు చెందిన కొన్ని సూక్తులు ఉండెను. వాటిని వారు చదువుచూ ఈ క్రింది సూక్తుల వరకు చేరుకొనిరి.

اِنَّنِیْ اَنَا اللّٰهُ لَاۤ اِلٰهَ اِلَّاۤ اَنَا فَاعْبُدْنِیْ وَاَقِمِ الصَّلٰوةَ لِذِكْرِیْ o

اِنَّ السَّاعَةَ اٰتِیَةٌ اَكَادُ اُخْفِیْهَا لِتُجْزٰی كُلُّ نَفْسٍۭ بِمَا تَسْعٰی o

*అనువాదము:* నిశ్చయముగా నేను అల్లాహ్‌ను. నాకు తప్ప మరో ఆరాధ్య దైవము లేదు. కనుక (నీవు) నన్ను ఆరాధించుము. నా స్తోత్రము కొరకు నీ ఇతర అనుచరులతో కలిసి ప్రార్థన (నమాజ్) ను స్థిరపర్చుము. నామమాత్రపు ప్రార్థన కాదు నా ఉనికిని ప్రపంచములో స్థిరపర్చు ప్రార్థన. ఈ సందేశమును స్థాపించు ఘడియ తప్పక రానున్నదని గుర్తుంచు కొనుము. ఫలితముగా ప్రతి ఆత్మకు అది చేయు ప్రయత్నమునకు ప్రతిఫలము నొసంగబడును.

ఈ సూక్తి వరకు రాగానే 'ఇది మహోన్నతమైన, పవిత్ర వచనము' అని అప్రయత్నంగానే హజ్రత్ ఉమర్ (రజి) నోట వెలువడెను. ఖబ్బాబ్ (రజి) ఈ వ్యాఖ్యలు వినగానే వారు తలదాచుకున్న స్థానము నుండి బయటికొచ్చి, ఇట్లనిరి. ఇది రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రార్థన ఫలితమే. అల్లాహ్ ప్రమాణముగా నేను నిన్ననే వారిట్లు ప్రార్థించుచుండగా వింటిని. ఓ అల్లాహ్! ఉమర్ ఇబ్నుల్ ఖత్తాబ్ లేదా అమర్ ఇబ్న్ హష్షామ్ ఇద్దరిలో ఒకరికి ఇస్లాం స్వీకరించే అనుగ్రహము తప్పక ప్రసాదించుము. ఉమర్ (రజి) లేచి నిలబడి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎక్కడున్నారని అడిగిరి. దారె అర్ఖమ్‌లో ఉంటున్నారని



వారికి తెలుపగా అదే స్థితిలో నగ్న ఖడ్గము పట్టుకొని అక్కడికి చేరుకొని తలుపు తట్టిరి. తలుపు సందుల నుండి అనుచరులు చూడగా ఉమర్ (రజి) నగ్న ఖడ్గము పట్టుకొని నిలిచి వుండిరి. తలుపు తెరిచినచో ఉమర్ (రజి) లోనికి వచ్చి భీభత్సం సృష్టించెదరని వారు భయపడిరి. కాని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఏమైనది? తలుపు తెరవమని ఆదేశించిరి. ఉమర్ (రజి) ఖడ్గము అలాగే పట్టుకొని లోనికి వచ్చిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ముందుకు వచ్చి ఉమర్ ! ఏ ఉద్దేశముతో వచ్చావని ప్రశ్నించిరి. ఓ అల్లాహ్ ప్రవక్త ! నేను ఇస్లాం స్వీకరించుటకు వచ్చితినని ఉమర్ (రజి) బదులిచ్చిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇది విని గట్టిగా 'అల్లాహు అక్బర్' అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడని నినదించిరి. వారి అనుచరులందరు ఈ అక్షరాలనే గట్టిగా నినదించడంతో మక్కా పర్వతములు కూడ ధ్వనించెను. కొద్ది క్షణాల్లోనే ఈ వార్త మక్కాలో అగ్నిలా వ్యాపించెను. ఇతర అనుచరులను హింసించిన విధముగనే ఉమర్ (రజి) ను కూడ హింసించడం మొదలైనది. గతములో దాడులు, హత్యలలో ఆనందపడే అదే ఉమర్ (రజి) ఇప్పుడు దెబ్బలు తినుటలోనే ఆనందపడుచుండిరి. విశ్వాసము ప్రకటించిన తర్వాత మక్కా వీధులలో దెబ్బలే తిన్నానని స్వయాన ఉమర్ (రజి) తెలిపిరి.

## ముస్లిముల బహిష్కరణ

దౌర్జన్యము హద్దులు దాటుచున్న దశలో కొందరు మక్కాను వదిలి పోయిరి. మిగిలిన వారు ఇంకను ఎక్కువ హింసకు గురవుచుండిరి. ఇంత జరిగినను ఆ క్రూరుల కోపము చల్లారలేదు. ఇప్పటి వరకు మేము చేసిన దౌర్జన్యము వలన ముస్లిములు నిరాశ చెందలేదు. వారి విశ్వాసము బలహీన పడలేదు. వారు రెట్టింపు ఉత్సాహంతో ఏకేశ్వరుడైన అల్లాహ్ ఆరాధనలో నిమగ్నమైరి. సంఖ్యాపరంగా ప్రగతి సాధించుచున్నారు.

విగ్రహాల పట్ల ద్వేషము పెరిగెను. ఇదంత గమనించి వారొక సలహా సమావేశము ఏర్పాటు చేసిరి. ముస్లిములను సమాజము నుండి పూర్తిగా బహిష్కరించాలని తీర్మానించబడెను. వారికి ఎవరు సరుకులు విక్రయించకూడదు. వారితో ఎవరు ఆర్థిక లావాదేవీలు జరపకూడదు. అప్పుడు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పలు అనుచరులు, భార్యా, పిల్లలతో సహా వారిని విడవడానికి ఇష్టపడని ముస్లిమేతర కొందరు బంధువులను వెంట బెట్టుకొని అబూతాలిబ్ స్వస్థలము (షుబ్ అబూతాలిబ్)లో విధిలేని పరిస్థితిలో ఆశ్రయము పొందిరి. *(ఇబ్నె హష్షామ్ 1/130, జర్ఖాని 2/279)* జీవించుటకు ధనము, ఆహార పదార్థాలు, నిత్యవసర సరుకులు వారి వద్ద నిల్వ లేకుండెను. వారు ఈ విపత్కర కాలములో ఎటువంటి పరిస్థితిలో గడిపిరో ఇతరుల ఊహకందని విషయము. సుమారు మూడు సం॥లు ఈ పరిస్థితులే కొనసాగినవి. మక్కా వారి బహిష్కరణ నిర్ణయములో ఎలాంటి సడలింపు రాలేదు. దాదాపు మూడు సం॥ల తర్వాత మక్కాకు చెందిన ఐదుగురు సత్యస్వభావముగల వ్యక్తులు ఈ దౌర్జన్యమును వ్యతిరేకించిరి. వారు షూబ్ అబీతాలిబ్ ద్వారము వద్దకు వచ్చి నిర్బంధించబడిన వారు బయటికి రావలెనని పిలిచిరి. మేము ఈ బహిష్కరణ ఒప్పందమును రద్దు చేయుచుటకు సిద్ధముగా నున్నామని కూడ తెలిపిరి. ఈ సుదీర్ఘ నిర్బంధన, వరుసగా ఆకలితో ఉన్నందున అబూతాలిబ్ చాలా బలహీనమగుచుండిరి. వారు బయటికి వచ్చి తమ జాతిని నిందించుచూ ఇంత సుదీర్ఘ దౌర్జన్యము ఏ విధంగా సమంజసమని ప్రశ్నించిరి. ఈ పంచ గుణవంతుల తిరుగుబాటు విషయము వెంటనే విద్యుత్తు వలె నగరములో వ్యాపించెను. మానవ అంతరాత్మ మరల జీవము పోసుకొనసాగెను. పుణ్య సంకల్పం మరొక్కసారి శ్వాస తీసుకొనెను. కావున మక్కా వాసులు ఈ అనైతిక ఒప్పందమును



భంగపరచక తప్పలేదు. ఒప్పందము సమాప్తయ్యెను. కాని మూడు సంవత్సరముల ఆకలి ప్రభావము బహిర్గతమవడం మొదలయ్యెను. ఈ బహిష్కరణ కాలపు బాధల వలన కొద్ది రోజులలోనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం విశ్వసనీయ సతీమణి హ॥జ్రత్ ఖదీజ (రజి) మృతిచెందిరి. మరో నెల రోజుల తర్వాత అబూతాలిబ్ కూడ ఈ లోకమును వదిలి వెళ్ళిపోయిరి.

## హజ్రత్ ఖదీజ (రజి), అబూతాలిబ్ మృతితో ప్రచారములో అడ్డంకులు, ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తాయిఫ్ ప్రయాణము

ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులు అబూతాలిబ్ నిర్మాణాత్మకమైన సహాయమును ఇప్పుడు కోల్పోయిరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అర్థాంగిని వ్యక్తిగత సహాయకారి హ॥జ్రత్ ఖదీజ (రజి) మరణముతో పెద్ద లోటు ఏర్పడెను. వీరిద్దరి మరణంతో వారి సహాయ, సహకారాలు వారు (స), వారి అనుచరులు కోల్పోయిరి ఎందుకనగా విస్తృత సత్సంబంధాలు కలిగి వున్నందున వారు క్రూరులను కట్టడి చేసేవారు. అబూతాలిబ్ మరణము వలన కలిగిన తాజా దు:ఖము, అబూతాలిబ్ మరణాదేశము వలన వారి (సల్లల్లాహు అలైహి వసల్లం) బద్ధ శత్రువు, అబూతాలిబ్ చిన్న సోదరుడు అబూలహబ్ వారి పక్షమున తన మద్దతు కొనసాగించెను. కాని దైవ ఏకత్వమును విశ్వసించని ప్రజలను నేరస్తులు, శిక్షార్హులని ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) భావించునని మక్కా వాసులు అతన్ని రెచ్చగొట్టిరి. అతడు తన తాత ముత్తాతల అభిమాన సాకుతో ఉద్రేకమునకు లోనై తన మద్దతు ఉపసంహరించుకొనెను. గతం కంటే ఎక్కువ వారిని ఎదురించునని ప్రతిజ్ఞ చేసెను. మూడు సం॥ల నిర్బంధ

జీవితము గడిపినందున బంధువులతో ముస్లిములు దూరమైయుండిరి. అందుకే సత్సంబంధాలలో ఆప్యాయత తగ్గెను. ముస్లిములతో బహిష్కరణకు మక్కా వాసులు అలవాటు పడిపోయిరి. కనుక ప్రచార మార్గములు పరిమితమై పోయెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ పరిస్థితిని గమనించి మక్కా బదులు తాయిఫ్‌నకు వెళ్ళి అక్కడి ప్రజలను ఇస్లాం వైపు ఆహ్వానించుటకు నిర్ణయించిరి. వారు (స) ఈ ఆలోచనలో ఉండగానే మక్కా వాసుల వ్యతిరేకత ఈ ఆలోచనను మరింత బలపర్చెను. ఎందుకనగా ఒకటి మక్కావారు వారి మాటే వినడం లేదు. రెండవది ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను వీధులలో నడవకుండా అడ్డుకొనుటకు ఇప్పుడు పూనుకొనిరి. వారు ఇతరులతో కలవకూడదనే ఉద్ధేశముతో వారు బయటికి రాగానే వారి మీద దుమ్ము పోసేవారు. ఒక మారు ఇదే స్థితిలో వారు తిరిగి వచ్చిరి. అప్పుడు వారి ఒక కూతురు వారి తలను శుభ్రపరుస్తూ కంటతడిపెట్టెను. ఓ నా కుమార్తె దు:ఖించకుము. నిశ్చయముగా దేవుడు నీ తండ్రి వెంట వున్నాడని అనిరి. వారు బాధలతో భయపడేవారు కాదు. కాని ఇబ్బందికర అంశమేమనగా ప్రజలు వారి సందేశము వినుటకు వెనుకంజ వేయుచుండిరి. బాధలు తప్పక రావలెనని వారు విశ్వసించేవారు. ఏ రోజైతే ఎవరైనా వారిని బాధ పెట్టరో ఆ రోజే వారు ఎక్కువ మదనపడేవారు. చరిత్రానుసారము ఒక రోజు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రచార నిమిత్తం మక్కా వీధులలో కలియ తిరిగిరి. కాని ఒక ప్రణాళిక ప్రకారము బానిస గాని, స్వతంత్రుడు గాని ఎవరు వారితో మాట్లాడలేదు. ఎటువంటి ఇబ్బందికి కూడ గురిచేయలేదు. అప్పుడు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బాధ, దు:ఖముతో నిశ్శబ్దంగా పరుండిరి. అల్లాహ్ స్వయాన వారిని ఓదార్చెను. వెళ్లు! నీ జాతిని మరల,మరల, మరల హెచ్చరించమని,



వారి నిర్లక్ష్యమును పట్టించుకోవద్దని ఆదేశించెను. ప్రజలు వారిని ఇబ్బంది పెట్టుటను రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పెద్ద కష్టముగా భావించేవారు కాదని ఈ సంఘటన ద్వారా అవగతమవుతుంది. ప్రపంచ మార్గదర్శనము కొరకు అవతరించిన దైవ సందేశహరుడు ప్రజలు వారితో మాట్లాడకుండా వుండుట, అసలు మాట్లాడటానికి సిద్ధపడని విషయాన్ని ఎలా భరించగలడు. ఇటువంటి వృధా జీవితము వారిని అన్నిటికంటే ఎక్కువ బాధించెను. అందుకే తాయిఫ్ వెళ్లి, తాయిఫ్ పౌరులకు దైవ సందేశమందించుటకు దృఢ నిర్ణయం తీసుకొనిరి. వివిధ జాతులను సంబోధించు భాగ్యము దైవ సందేశహరులది. హ(జత్ మూసా అలైహిస్సలాంకు ఇదే పరిస్థితి ఎదురయ్యెను. వారు ఒక సారి ఫిర్ఔన్ సంతతితో, మరొక సారి ఇస్హాఖ్ వంశముతో,ఇంకో సారి మద్యన్ వారికి బోధించేవారు. హ(జత్ ఈసా అలైహిస్సలాం కూడ ప్రచార ఉత్సాహములో ఒక సారి జలీల్ వాసులకు, మరొక్కప్పుడు యర్దాన్ వాస్తవ్యులను, మరొక్క సారి యురోషిలం ప్రజలను, ఇంకోసారి ఇతర పౌరులను సంబోధించ వలసివచ్చెను. కొట్టుము, హింసించుము కాని సందేశమును వినకూడదని ఎప్పుడైతే మక్కా ప్రజలు తీర్మాణించుకొనిరో అప్పుడు తాయిఫ్ వైపు వెళ్లిరి. ఫలములు, వ్యవసాయములో ప్రసిద్ధి గాంచిన తాయిఫ్ పట్టణము మక్కాకు తూర్పు దక్షిణ వైపు దాదాపు 60 మైళ్ళ దూరములో నున్నది. ఈ నగరము విగ్రహారాధనలో మక్కాకు ధీటుగా నుండెను. ఖానా కాబాలో నున్న ఇతర విగ్రహాలతో పాటు 'లాత్' అను ప్రఖ్యాత విగ్రహం తాయిఫ్ ప్రాముఖ్యతకు నిదర్శనం. దానిని దర్శించుకొనుటకు అరబ్బులు దూర ప్రాంతాల నుండి వచ్చేవారు. తాయిఫ్ వాసులకు మక్కాలో చాలా మంది బంధువులు కూడ ఉండిరి. తాయిఫ్ – మక్కా మధ్య సస్యశామలమైన ప్రాంతాలలో మక్కా వారి ఆస్తులు కూడ ఉండెను. వారు తాయిఫ్

చేరుకోగానే అక్కడి నాయకులు వారిని కలుసుకొనుటకు రావడం మొదలైరి. కాని ఎవరు సత్యమును స్వీకరించుటకు సిద్ధపడలేదు. సామాన్య ప్రజలు కూడ తమ నాయకులనే అనుసరించిరి. దైవ సందేశమును అవహేళనతో తిరస్కరించిరి. ఎందుకనగా ప్రజల దృష్టిలో నిరాయుధుడైన, ప్రాపంచిక అండదండలు లేని దైవ సందేశహరుడు సామాన్యుడే. ఆయుధాలు, భీకర సైన్య శబ్దమును వినుటకు వారు అలవాటు పడి యుండిరి. వారి గురించి ముందుగానే వార్తలు అందియుండెను. వారు తాయిఫ్ చేరినప్పుడు వారి వెంట సైన్యము, సమూహము వారికి కనిపించలేదు. కేవలం జైద్‌ను వారు వెంట బెట్టుకొని తాయిఫ్‌లోని ముఖ్య ప్రాంతాలలో ప్రచారము చేయుచుండిరి. కావున ఆధ్యాత్మిక అంధులు వారిని దైవ సందేశహరుడిగా కాక తిరస్కరించబడ్డ ఒక సాధారణ వ్యక్తిగా మాత్రమే చూచిరి. అతనిని బాధించి, హింసించడంతో జాతి నాయకుల దృష్టిలో తమ పలుకుబడి పెరుగునని వారు భావించిరి. అప్పుడు వారందరు ఒక రోజు గుమికూడి శునకాలను వెంట బెట్టుకొనిరి. బాలలను రెచ్చగొట్టి రాళ్ళతో తమ సంచులు నింపుకొని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను ఆ రాళ్ళతో క్రూరంగా కొట్టడం ప్రారంభించిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను తరుముతూ పట్టణము నుండి వెడలగొట్టిరి. వారి పాదాలు రక్తసిక్తమయ్యెను. వారిని రక్షించుచూ జైద్ తీవ్ర గాయాలపాలైరి. అయినను ఆ దుష్టుల హృదయములు చల్లారలేదు. పట్టణము నుండి చాలా మైళ్ళ దూరము పర్వతముల వరకు వారిని వెళ్లగొట్టనిదే వారు వారిని వదిలిపెట్టలేదు. వీరు వారిని తరుముతున్న సందర్భమున అల్లాహ్ ప్రకోపమునకు వీరు గురగుదురని వారు భయ పడుచుండిరి. ఆకాశము వైపు చూస్తూ 'ఓ నా అల్లాహ్! వీరిని క్షమించు! ఎందుకనగా వీరు చేయుచున్నదేమిటో వీరికి తెలియదు' ని అతి వినమ్రతతో



ప్రార్థన చేయుచుండిరి. గాయాలపాలై, అలసిపోయి, ప్రజల ద్వారా ఛీదరించబడిన స్థితిలో ఒక ద్రాక్ష తోటను ఆశ్రయించిరి. ఈ తోట మక్కాకు చెందిన ఇద్దరు నాయకులదై యుండెను. ఆ నాయకులు అప్పుడు తోటలోనే యుండిరి. వీరు పది సంవత్సరముల నుండి వారికి కఠిన శత్రువులుగా నుంటూ వారిని ప్రతిఘటించుచుండిరి. మక్కాకు చెందిన వ్యక్తిని తాయిఫ్ వాసులు గాయపర్చిరని వారు ప్రభావితులై యుండవచ్చు. లేక ఆ శుభ ఘడియలో వారి హృదయాలలో సత్కార్య బీజము నాటబడినది కాబోలు. ద్రాక్ష ఫలములతో నిండిన ఒక పాత్రను అదాస్ నామము గల తమ బానిస చేత ప్రయాణికులకు అందించమని వారు పంపిరి. అదాస్ నైనెవాకు చెందిన ఒక క్రైస్తవుడు. అతడు ఈ ద్రాక్ష ఫలములను ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అందించెను. వారు (సల్లల్లాహు అలైహి వసల్లం) అపార దయామయుడు పరమ కారుణ్యమూర్తి అల్లాహ్ పేర నేను వీటిని స్వీకరిస్తున్నాని అనగానే అతనికి క్రైస్తవ ధర్మము మరల గుర్తుకు వచ్చెను. ఇస్రాయీల్ సందేశహరుల మాదిరిగా సంభాషించుచున్న ఒక దైవ సందేశహరుని ముందు తను కూర్చున్నట్లు అతడు భావించెను. నీవు ఏ ప్రాంత వాసివని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అతన్ని ప్రశ్నించిరి. అతను నైనెవా వాసినని తెలుపగా వారిట్లు ప్రవచించిరి. ఓహో! మత్తయి తనయుడైన సత్పురుషుడు యూనుస్ (అలైహిస్సలాం) నైనెవా పౌరుడు, నా వలె అతడు దైవ ప్రవక్తగా వుండెను. తర్వాత వారు అతనికి తన ధర్మ సందేశమందించిరి. అదాస్ ఆందోళన క్షణాల్లోనే ఆశ్చర్యముగా మారెను. అంతలోనే ఆశ్చర్యము విశ్వాస రూపము దాల్చుకొనెను. ఫలితంగా కొద్ది సమయంలోనే ఆ అపరిచిత బానిస కన్నీటి పర్యంతమై రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తో ఆలింగనమై వారి హస్తములను, పాదాలను ముద్దాడడం

మొదలు పెట్టెను. అదాస్‌తో మాట్లాడిన తర్వాత వారు అల్లాహ్‌ను సంబోధించుచూ ఇట్లు ప్రార్థించిరి.

اَللّٰهُمَّ اِلَيْكَ اَشْكُوْ ضُعْفَ قُوَّتِىْ وَقِلَّةَ حِيْلَتِىْ وَهَوَانِىْ عَلَى النَّاسِ يَـا اَرْحَـمَ الـرَّاحِـمِيْنَ اَنْتَ رَبُّ الْمُسْتَضْعَفِيْنَ وَاَنْتَ رَبِّىْ اِلٰى مَنْ تَـكِـلُـنِىْ اِلٰى بَعِيْدٍ يَّتَجَهَّمُنِىْ اَمْ اِلٰى عَدُوٍّ مَلَّكْتَهٗ اَمْرِىْ اِنْ لَّمْ يَكُنْ بِكَ عَـلَـىَّ غَـضَـبٌ فَلَا اُبَـالِىْ وَلٰكِنْ عَافِيَتَكَ هِىَ اَوْسَعُ لِىْ اَعُوْذُ بِـنُـوْرِ وَجْهِكَ الَّذِىْ اَشْرَقَتْ لَهُ الظُّلُمَاتُ وَصَلَحَ عَلَيْهِ اَمْرُ الدُّنْيَا وَبِـالْاٰخِـرَتِ مِـنْ اَنْ تُـنَزِّلَ بِىْ غَضَبَكَ اَوْ يَحُلَّ عَلَىَّ سَخَطُكَ لَكَ الْعُقْبٰى حَتّٰى تَرْضٰى وَلَا حَوْلَ وَلَا قُوَّةَ اِلَّا بِكَ۔

అనగా ఓ నా పోషకుడా! నా బలహీనత, మౌళిక సదుపాయముల కొరత, ప్రజల దృష్టిలో నా అసహాయత గూర్చి నీ ఆస్థానములోనే ఫిర్యాదు చేయుచున్నాను. కాని నీవు నిరుపేదల, బలహీనుల దేవుడవు. నాకు కూడ నీవే దేవుడవు. నన్ను ఎవరి చేతిలో పెట్టెదవు? అటూ ఇటూ త్రిప్పుచున్న అపరిచితుల చేతిలో నన్ను వదులుతువా లేదా నా దేశములో నా పై ఆధిక్యత కలిగి వున్న శత్రువుల అధీనములో నన్ను విడిచి పెట్టెదవా? నీ ప్రకోపము నాపై లేకుంటే నేను ఈ శత్రువుల వలన బాధపడను. నీ కృప నావెంట గలదు. నీ సంరక్షణ నాకు సరిపోవును. నేను నీ ఆస్థాన కాంతిలో శరణు కోరుచున్నాను. అంధకారము నుండి ప్రపంచమును రక్షించే బాధ్యత నీదే. ఇహపరలోకంలో శాంతిని స్థాపించుము. నీ కోపము, ప్రకోపము నా పై పడనీయకుము. తర్వాత సంతోషము కలిగించుటకే నీవు కోపగించుకొనెదవు. నిజమైన శక్తి, సత్యమైన ఆశ్రమము నీవు తప్ప మరొకటి లేదు.



వారు (స) ఈ ప్రార్థన తర్వాత మక్కా వైపు పయనమైరి. కాని మధ్యలో నఖ్ల అను ప్రాంతమున ఆగి పోయిరి. అక్కడ కొద్ది రోజులు విశ్రాంతి తీసుకొని మరల మక్కా వైపు బయలు దేరిరి. కాని జగడము వలన మక్కా విడిచినందున అరబ్ ఆచారము ప్రకారము వారిప్పుడు మక్కా నివాస హక్కును కోల్పోయిరి. ఇప్పుడు మక్కా వారి అనుమతి లేనిదే వారు (స) మక్కాలో ప్రవేశించలేరు. కనుక నేను మక్కాలో ప్రవేశించుటకు వచ్చితిని, కావున అరబ్ ఆచారము ప్రకారము మీరు నాకు మక్కాలో ప్రవేశించే అనుమతి ఇవ్వగలరా? అని ముత్ ఇమ్ బిన్ అది అను ఒక మక్కా నాయకునికి వారు సందేశము పంపిరి. ముత్ ఇమ్ బద్ధ శత్రువు అయినను సత్యస్వభావము గల వ్యక్తి. అతడు వేంటనే తన కుమారులను, బంధువులను వెంట బెట్టుకొని, ఆయుధాలు ధరించి కాబా ఆవరణలో నిలిచి వారికి మక్కాలో ప్రవేశించే అనుమతి ఇస్తున్నానని సందేశము పంపెను. వారు మక్కాలో ప్రవేశించి, కాబా చుట్టు ప్రదక్షిణము చేసిరి. ముత్ ఇమ్ తన కుమారులు, బంధువులతో కలిసి ఖడ్గముల మాటున వారిని స్వగృహానికి చేర్చెను. ఇది ఆశ్రయము కాదు కేవలం మక్కాలో ప్రవేశించుటకు చట్ట రీత్యా అనుమతి మాత్రమేనని అర్థమవుతుంది. ఎందుకనగా ఈ సంఘటన తర్వాత కూడ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను వరుసగా హింసించడం జరిగినది. కాని ముత్ ఇమ్ రక్షణకు రాలేదు.

వారు వారి ఈ ప్రయాణములో సాటిలేని త్యాగము, మడమతిప్పని స్థిరత్వం ప్రదర్శించిరని శత్రువులు సైతం అంగీకరించిరి. సర్ విలియమ్ మయూర్ తన పుస్తకము “ముహమ్మద్” లో ఇట్లు వ్యాఖ్యానించెను.

“ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తాయిఫ్ ప్రయాణము లో ఆడంబరము, ధైర్యము ప్రదర్శించిరి. స్వజాతి వారు అవమానించిన,

చీదరించిన వ్యక్తి ఒంటరిగా నైనెవాకు చెందిన యూనాహ్ ప్రవక్త మాదిరిగా విగ్రహారాధనలో మునిగిన నగరమును అన్యారాధన నుండి విముక్తి కల్పించుటకు, దైవ సందేశము వైపు ఆహ్వానించుటకై దైవము పేరున సాహసముతో వెళ్ళిరి. తనకు తాను దైవ ప్రవక్తగా దృఢంగా నమ్ముతున్న విశ్వాసమును ఈ సంఘటన స్పష్టంగా తెలుపుచున్నది.” *(ది లైఫ్ ఆఫ్ ముహమ్మద్ (స) పేజి 117)*

మరోసారి బాధ పెట్టుట, అవహేళనకు గురిచేయుట మక్కా వాసులు ప్రారంభించిరి. కావున దైవ సందేశహరునికి తన జన్మభూమి నరకమై పోయెను. అయినను ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో ధైర్యముతో దైవ సందేశమును ప్రజలకు అందించుటలో వెనుకంజ వేయలేదు. “అల్లాహ్ ఒక్కడే–అల్లాహ్ ఒక్కడే” అను నినాదములు మక్కా వీధులలో వినిపించుచుండెను. ప్రేమ, ఆప్యాయత, మంచితనముతో విగ్రహారాధనకు విరుద్ధంగా ఉపదేశించిరి. పారిపోతున్న ప్రజలను వారు వెంబడించేవారు. ప్రజలు నిర్లక్ష్యము ప్రదర్శించినను సందేశము అందించేవారు. ఫలితంగా చాపక్రింద నీరులా సత్యము లోలోపల ఆదరణ పొందుచుండెను. ఎబెసీనియా నుండి తిరిగి వచ్చిన కొందరు ముస్లిములు మక్కాలో ఉండిపోయిరి. వారు నిశ్శబ్దంగా తమ బంధువులకు, మిత్రులకు, పరిచయస్తులకు, ఇరుగు పొరుగు వారికి సందేశమిచ్చుచుండిరి. కావున పలువురి హృదయములు విశ్వాస జ్యోతితో ప్రకాశించినప్పుడు బాహాటంగా తమ మతమును ప్రకటించేవారు. తమ సోదరులతో దెబ్బలు తిని కష్టములలో పాల్గొనేవారు. కాని చాలా మంది కాంతిని గమనించినను స్వీకరించే అనుగ్రహము పొందలేకపోయిరి. దైవ పరిపాలన భూమి పై స్థిరపడు దినమున అందులో చేరుటకు వారు నిరీక్షించుచుండిరి.



## మదీనా పౌరుల ఇస్లాం స్వీకరణ

వారి వలస సమయము ఆసన్నమగుచున్నదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అల్లాహ్ పదే పదే సంకేతాలు పంపుచుండెను. వారు వలస వెళ్లు ప్రాంతము బావులు, ఖర్జూర తోటలు గలదని కూడ వారికి తెలుపబడెను. వలస ప్రాంతము యమామా కావచ్చునని వారు తొలుత భావించిరి. *(బుఖారి బాబ్ హిజ్రతున్నబి సల్లల్లాహు అలైహి వసల్లం)* కాని తొందరలోనే ఆ ఊహ వారి హృదయము నుండి తొలగించబడెను. అల్లాహ్ భవిష్యవాణి మేరకు నిర్ణయించబడిన ఆ నగరము ఇస్లాం కేంద్రముగా వ్యవహరించునని వారు నిరీక్షించసాగిరి. ఇంతలోనే హజ్ కాలము సమీపించెను. ప్రజలు అరబ్ నలుమూలల నుండి మక్కాలో ప్రవేశించు చుండిరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తన అలవాటు ప్రకారం ఎక్కడ ఒక చిన్న సమూహం కనిపించినా వారి వద్దకు వెళ్లి దైవ ఏకత్వ సందేశము అందించేవారు. దైవ పాలన గూర్చి శుభవార్త తెలిపేవారు. దౌర్జన్యము, దుష్కార్యము, కలహము, నేరము నుండి దూరముండవలెనని ఉపదేశించేవారు. కొందరు వారి మాట విని ఆశ్చర్య పడి వెళ్లిపోయేవారు. మాటలను వినుచున్న కొందరిని మక్కా వారు చెదరగొట్టేవారు. గతములోనే మక్కా వారి మాటలు విన్న కొందరు వారిని ఎగతాళి చేసి వెళ్లిపోయేవారు. అదే స్థితిలో మినా అను లోయలో వారు సంచరించుచుండగా మదీనా పౌరులైన 6,7 గురు వ్యక్తులను వారు చూచిరి. వారు (స) మీరు ఏ వర్గ సంబంధీకులని వారిని ప్రశ్నించిరి. ఖజ్‌రజ్ వర్గీయులమని వారు సమాధానమిచ్చిరి. యూదుల మిత్రపక్షమైన వర్గమేనా అని మరల వారు ప్రశ్నించిరి. వారు అవునని బదులిచ్చిరి. నా మాటలు వినుటకు మీరు కొంత సమయం కేటాయించగలరా అని వారిని అడిగిరి. వారి ప్రస్తావన

వారు గతములోనే విన్నందున వారి ప్రకటనతో వారికి కొంత ఆసక్తి యుండెను. కనుక వారి వినతిని అంగీకరించి వారితో కూర్చొని వారి మాటలను వినుటకు సంసిద్ధులైరి. వారు వారికిట్లు తెలిపిరి. దైవ రాజరికము సమీపములోనే వున్నది. ప్రపంచము నుండి విగ్రహాలు అంతమగును. దైవ ఏకత్వము విశ్వంలో స్థాపించబడును. సత్కర్మ, దైవభీతి మరల ప్రపంచములో స్థాపించబపడును. మదీనా పౌరులు ఈ గొప్ప వరమును స్వీకరించుటకు సిద్ధముగా నున్నారా ? మేము మీ విషయములను విని ప్రభావితమై, మీ బోధనలను స్వీకరించితిమి. కాని ఇస్లాంకు మదీనాలో ఆశ్రయమిచ్చే విషయంలో మేము మా స్వదేశముకు వెళ్లి మా జాతితో మాట్లాడెదము. వచ్చే సంవత్సరము మా జాతి నిర్ణయము మీకు తెలుపెదమని వారు విన్నవించుకొనిరి. *(ఇబ్నె హష్షామ్ సంపుటి 1, పుట 150-152)* వీరు తిరిగి వెళ్ళిపోయిన తర్వాత తమ బంధువులకు, మిత్రులకు వారి బోధనలను వివరించడం మొదలు పెట్టిరి. ఆ కాలములో మదీనాలో రెండు అరబ్ తెగలు ఓస్, ఖజ్‌రజ్ వుండగా మూడు యూదుల తెగలు బనూఖురైజ, బనూనజీర్, బనూఖైనుఖా యుండెడివి. ఓస్, ఖజ్‌రజ్‌ల మధ్య యుద్ధము కొనసాగుతుండెను. అందుకే బనూఖురైజ, బనూనజీర్ ఓస్‌కు మిత్రపక్షమైతే, బనూఖైనుఖా ఖజ్‌రజ్ కు మిత్రపక్షముగా నుండెను. దశాబ్దాల పాటు సాగిన యుద్ధము వలన ఇక మన మధ్య సయోధ్య కుదుర్చుకొనవలెనను ఆలోచన వారిలో బలపడుచుండెను. పరస్పర సంప్రదింపుల తర్వాత ఖజ్‌రజ్ నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉబె బిన్ సలూల్‌ను మదీనా మొత్తం తమ చక్రవర్తిగా స్వీకరించుటకు నిర్ణయించబడెను. యూదులతో వున్న బంధము వలన ఓస్, ఖజ్‌రజ్ బైబిల్ భవిష్యవాణీలను వినుచుండిరి. యూదులు తమ కష్టనష్టములను వివరించునప్పుడు చివర్లో మూసా (అలైహిస్సలాం) పోలికలు గల ఒక



సందేశహరుడు అవతరించును. అతని రాక సమీపించెను. అతను వచ్చిన తర్వాత మేము మరొక్కసారి ప్రపంచమును జయించెదము. యూదుల శత్రువులు అంతమగుదురని కూడ చెప్పుకునేవారు. ఈ హజ్ యాత్రికుల ద్వారా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రకటనను మదీనా వాసులు వినగానే వారి సత్యము వారి హృదయాలలో స్థిరమైన స్థానము పొందెను. యూదులు మాకు అందించిన సమాచారము ప్రకారము వీరే ఆ ప్రవక్త కావచ్చునని వారొక అభిప్రాయానికి వచ్చిరి. కనుక ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సత్యమైన బోధనతో అనేక యువకులు ప్రభావితమైరి. యూదుల ద్వారా తెలిసిన భవిష్యవాణీలు వారు విశ్వాసము పొందుటలో సహాయపడెను. వచ్చే సంవత్సరం మరల హజ్ సందర్భమున మదీనా వాసులు వచ్చిరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ధర్మములో ప్రవేశించు ఉద్దేశముతో ఈ సారి మొత్తం 12 మంది అనగా 10 మంది ఖజ్‌రజ్ తెగ, ఇద్దరు ఓస్ తెగవారు బయలు దేరిరి. మినా అను ప్రాంతములో వారిని దర్శించుకొని, ఈ క్రింది విధంగా ప్రతిజ్ఞ చేసిరి. అల్లాహ్ తప్ప మరెవ్వరిని ఆరాధించము. దొంగతనము చేయము. నేరముకు పాల్పడము. తమ కుమార్తెలను హతమార్చము. ఒకరిపై నొకరు నిందారోపణలు చేయము. దైవ సందేశహరుని ఇతర బోధనలను కూడ పాటించెదము. వీరు తిరిగి పోయిన తర్వాత మరింత వేగంతో ఇస్లాం ప్రచారము మొదలు పెట్టిరి. *(ఇబ్నె హష్షామ్ సంపుటి 1, పుట 150, 156)* విగ్రహములు మదీనా వారి గృహములలో స్థానము కోల్పోయినవి. విగ్రహాల ముందు తలవంచే వారు ఇప్పుడు తల పైకి లేపి నడవసాగిరి. అల్లాహ్ తప్ప మరొకరి ముందు తల వంచుటకు వారు సిద్ధముగా లేకుండిరి. శతాబ్దాల మిత్రుత్వము, వందల సంవత్సరముల ప్రచారము

ద్వారా రాని మార్పు ఇస్లాం కొన్ని రోజులలోనే సాధించెనని యూదులు ఆశ్చర్యమునకు గురైరి. దైవ ఏకత్వ హితబోధ మదీనా వారి హృదయాలలో గట్టిగా నాటుకుపోవుచుండెను. ఒక్కొక్కరు ముస్లిముల వద్దకు వచ్చి మాకు మీ ధర్మము బోధించగలరని మనవి చేసేవారు. కాని మదీనాకు చెందిన ఈ నవ ముస్లిములకు ఇస్లాం గూర్చి పూర్తి అవగాహన లేకుండెను. వీరి సంఖ్య అతి తక్కువ వున్నందున వందల, వేల ప్రజలకు ఇస్లాం బోధనలు వివరించుట కష్టతరముగా మారెను. అందుకే వారు ఒక దూతను మక్కాకు పంపి ఒక ప్రచారకున్ని పంపవలసినదిగా విన్నవించిరి. అందుకు ఎబిసీనియా వలస నుండి తిరిగి వచ్చిన ముస్అబ్ నామము గల అనుచరున్ని ఇస్లాం ప్రచారము కొరకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా పంపిరి. మక్కా బయట ప్రప్రథమ ఇస్లాం ప్రచారకుడిగా ముస్అబ్ చరిత్ర కెక్కిరి.

## ఇస్రా

అల్లాహ్ ఈ రోజులలోనే ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు భవిష్యత్తు గురించి గొప్ప శుభవార్త అందించెను. ఒక సత్యస్వప్నములో వారికిట్లు చూపబడెను. వారు యురోషిలం వెళ్ళిరి. సందేశహరులందరు వారి నాయకత్వములో ప్రార్థన చేసిరి. *(ఇబ్నె హష్షామ్: సంపుటి 1, పుట 138, జర్ఖాని సంపుటి 1, పుట 306).* భవిష్యత్తులో దైవారాధన కేంద్రముగా మారనున్న మదీనాను స్వప్నములో యురోషిలంగా చూపబడెను. మున్ముందు వివిధ మతస్తులు వారి ధర్మములో చేరటంతో వారి ధర్మము అంతర్జాతీయ స్థాయికెదుగునని తెలుపుచు ప్రవక్తలందరు వారి నాయకత్వమున ప్రార్థన చేసినట్లు స్వప్నములో చూపబడెను. ఈ కాలములో ముస్లిములు మక్కాలో కఠిన స్థితిని ఎదుర్కొనుచుండిరి, కష్టములు ఆకాశాన్ని తాకెను. కావున ఈ



స్వప్నము వినిపించడంతో మక్కా వారు అపహాస్యము, ఎగతాళి చేసిరి. వారు ప్రతి సమావేశములో వారి ఈ స్వప్నము గురించి అవహేళన చేయడం మొదలు పెట్టిరి. కాని నూతన యురోషిలం నిర్మాణము ప్రారంభమై, తూర్పు, పడమరలో నివసించుచున్న జాతులన్ని ఈ అంతిమ దైవ సందేశహరుని సందేశమును స్వీకరించుటకు సిద్ధమగుచున్నాయని ఎవరికి తెలుసు.

## రోమనుల విజయ భవిష్యవాణి

ఖైసర్, కిస్రాల మధ్య భీకర యుద్ధము ఈ రోజులలో సంభవించెను. ఇందులో కిస్రాను విజయము వరించెను. ఈరాన్ సైన్యము సీరియాను వశపర్చుకొనెను. యురోషిలం నాశనం చేయబడెను. యూనాన్, ఆసియా కోచక్ వరకు ఈరాన్ సైన్యము చేరుకొనెను. బాస్ఫోరస్ హద్దుల వరకు ఈరాన్ సైనికాధికారులు ఖుస్తున్తునియా కు 10 మైళ్ళ దూరాన తమ గుడారములు వేసుకొనిరి. మక్కా ప్రజలు ఈ సంఘటనపై ఆనందోత్సవములు జరుపుకొనిరి. విగ్రహారాధకులైన ఈరానీయులు గ్రంథము గల క్రైస్తవులను ఓడించిరి. ఇదే దైవ నిర్ణయమని వారు భావించిరి. అప్పుడు అల్లాహ్ వారి (స) కిట్లు భవిష్యవాణి అందిచెను.

غُلِبَتِ الرُّوْمُ٥ فِیْ اَدْنَى الْاَرْضِ وَهُمْ مِّنْۢ بَعْدِ غَلَبِهِمْ سَيَغْلِبُوْنَ٥ فِیْ
بِضْعِ سِنِيْنَ ۭ لِلّٰهِ الْاَمْرُ مِنْ قَبْلُ وَمِنْۢ بَعْدُ ۭ وَيَوْمَئِذٍ يَّفْرَحُ الْمُؤْمِنُوْنَ ٥
بِنَصْرِ اللّٰهِ ۭ يَنْصُرُ مَنْ يَّشَاۗءُ ۭ وَهُوَ الْعَزِيْزُ الرَّحِيْمُ ٥ وَعْدَ اللّٰهِ ۭ لَا يُخْلِفُ
اللّٰهُ وَعْدَهٗ وَلٰكِنَّ اَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُوْنَ٥ (الروم:٣-٥)

అనగా 'రోమన్ సైనికులు అరబ్‌నకు సమీపములో నున్న

దేశములలో ఓడిపోయిరి. కాని వారు ఓడిపోయిన తరువాత కొద్ది సంవత్సరములలో మరల గెలుపొందెదరు. ముందు కూడ తరువాత కూడ అల్లాహ్ ఆదేశమే చెల్లును. ఆ విజయ దినము వచ్చినప్పుడు విశ్వాసులు కూడ దైవ సహాయముతో చాలా సంతోషింతురు. అతడు కోరిన వారికి సహాయమందించును. అతడు శక్తిమంతుడు, పరమకారుణ్య మూర్తి. తన వాగ్దానమును భంగపరచని అల్లాహ్ వాగ్దానమిది. కాని అనేకులు అల్లాహ్ మహిమలను తెలుసుకొనరు'. కొద్ది సంవత్సరములలోనే అల్లాహ్ ఈ భవిష్యవాణిని పూర్తి చేసెను. ఒక వైపు రోమనులు ఈరానీయులను ఓడించి తమ దేశమును విడిపించుకొనగా రెండవ వైపు ఆ రోజులలోనే మక్కా వారికి ప్రతికూలంగా ముస్లిములకు విజయాలు అందడం ప్రారంభమయ్యెను. ముస్లిముల సందేశము వినకుండ ప్రజలను అడ్డుకొని, ముస్లిములను హింసించుటకు ప్రేరేపించి ఇస్లాంను అంతమొందించామని మక్కా వారు భావించి యుండిరి. ఇస్లాం విజయ వార్తలతో పాటు మక్కా వ్యతిరేకుల వినాశనము అతి సమీపములోనే యున్నదని దైవ శాసనము నిరంతరం సూచించుచుండెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో ఆత్మ విశ్వాసంతో ఆ రోజులలోనే ఈ క్రింది దైవవాణిని ప్రకటించిరి.

وَقَالُوْا لَوْلَا يَأْتِيْنَا بِاٰيَةٍ مِّنْ رَبِّهٖ اَوَلَمْ تَأْتِهِمْ بَيِّنَةُ مَافِى الصُّحُفِ الْاُوْلٰى ٥
وَلَوْ اَنَّآ اَهْلَكْنٰهُمْ بِعَذَابٍ مِّنْ قَبْلِهٖ لَقَالُوْا رَبَّنَا لَوْلَآ اَرْسَلْتَ اِلَيْنَا رَسُوْلًا
فَنَتَّبِعَ اٰيٰتِكَ مِنْ قَبْلِ اَنْ نَّذِلَّ وَنَخْزٰى ٥ قُلْ كُلٌّ مُّتَرَبِّصٌ فَتَرَبَّصُوْا
فَسَتَعْلَمُوْنَ مَنْ اَصْحٰبُ الصِّرَاطِ السَّوِيِّ وَمَنِ اهْتَدٰى ٥ (طٰہٰ:١٣٤-١٣٦)



అనగా మక్కా వారిట్లందురు 'ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ప్రభువు వద్ద నుండి మా వద్దకు ఏదేని సంకేతము ఎందుకు తీసుకొనిరాడు. అతనిని బలపర్చుచున్న పూర్వపు ప్రవక్తల భవిష్యవాణీలు వారికి సరిపోవడం లేదా. సంపూర్ణ సందేశము పంపక ముందే మేము మక్కా వారికి శిక్ష విధించియుంటే ఓ మా ప్రభువు ! మా వద్దకు ఏ ప్రవక్తను ఎందుకు పంపలేదు ? మేము అవమానమునకు గురి అగుటకు ముందే నీ సూచనలను అనుసరించి వుండే వారము కదా అని వారనవచ్చును. నీవిట్లనుము. ప్రతి ఒక్కరు తమ సమయమునకు వేచి వుంటారు. మీరు కూడ ఆ ఘడియ కొరకు వేచి వుండుము. నిదర్శనము పూర్తయిన తర్వాత సన్మార్గము పై నడుచు వారు, మార్గదర్శనము పొందిన వారు ఎవరో మీరు నిశ్చయముగా తెలిసికొందురు.

ప్రతి రోజు నూతన దైవవాణి అవతరించుచుండెను. ప్రతి దినము ఇస్లాం ప్రగతి, అవిశ్వాసుల వినాశనమును గురించి అది సూచనలు ఇచ్చుచుండెను. మక్కా వారు ఒక వైపు తమ శక్తి, సామర్థ్యాలను అంచనా వేయుచు రెండవ వైపు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరుల బలహీనతను గమనించుచూ వుండిరి. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అందుతున్న దైవవాణిలో దైవ సహాయము, ముస్లిముల విజయాల వార్తలు విని మా మతి చలించినదా ? లేదా ముహమ్మద్ 'రసూలుల్లాహ్' మతి కోల్పోయారా ? అని ఆశ్చర్యపడేవారు. మక్కా వారిట్లు ఆశించుచుండిరి. మన దౌర్జన్యము, ఆధిపత్యము వలన ముస్లిములు నిరాశకు గురై మన వైపు తిరిగి రావలెను. ముహమ్మద్ (రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం), వారి అనుచరులకు వారి ప్రకటనలో సందేహాలు కలుగవచ్చును. కాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రకటించుచుండిరి.

فَلَا اُقْسِمُ بِمَاتُبْصِرُوْنَ o وَمَالَاتُبْصِرُوْنَ o اِنَّهٗ لَقَوْلُ رَسُوْلٍ كَرِيْم o وَمَاهُوَ
بِقَوْلِ شَاعِرٍ قَلِيْلًا مَّاتُؤْمِنُوْنَ oوَلَا بِقَولِ كَاهِنٍ قَلِيْلًا مَّاتَذَكَّرُوْنَ o تَنْزِيْلٌ
مِّنْ رَّبِّ الْعٰلَمِيْنَ oوَلَوْ تَقَوَّلَ عَلَيْنَا بَعْضَ الْاَقَاوِيْل oلَاَخَذْنَا مِنْهُ بِالْيَمِيْنِ o
ثُمَّ لَقَطَعْنَا مِنْهُ الْوَتِيْنَ o فَمَا مِنْكُمْ مِنْ اَحَدٍ عَنْهُ حَاجِزِيْنَ o وَاِنَّهٗ لَتَذْكِرَةٌ
لِّلْمُتَّقِيْنَ oوَاِنَّا لَنَعْلَمُ اَنَّ مِنْكُمْ مُكَذِّبِيْن o وَاِنَّهٗ لَحَسْرَةٌ عَلَى الْكَافِرِيْن o وَاِنَّهٗ
لَحَقُّ الْيَقِيْنَ oفَسَبِّحْ بِاسْمِ رَبِّكَ الْعَظِيْمِ o(سورۃ الحاقۃ:٣٩تا٥٣)

అనగా ఓ మక్కా నివాసులారా! మీ ఆలోచనలు సరియైనవి కావు. కనుక జాగ్రత్త! మీరు చూచే దాని కంతటికి నేను ప్రమాణము చేయుదును. మీరు చూడని దానికి కూడ. నిశ్చయముగా మర్యాద గల ప్రవక్త మాటలలో మీకు పవిత్ర ఖురాన్ వినిపించబడుచున్నది. ఒక కవి మాటలు కావివి. మీరు ఉపదేశము పొందునది చాలా తక్కువే. ఒక సోది చెప్పువాని మాటలు కావివి. కాని విచారమేమనగా మీరు ఉపదేశము పొందునది చాలా తక్కువే. ఇది సర్వలోకాల ప్రభువు వైపు నుండి ఒక అవతరణ. సర్వలోకాల ప్రభువైన మేము మీకు తెలుపునదేమనగా కొన్ని విషయములను అతడు మా వైపు అంటగట్టి వుండినచో మేమతనిని తప్పక కుడి చేతితో బంధించువారము. తరువాత నిశ్చయముగా మేము అతని ప్రాణ ధమనిని కోసి వేయువారము. మీరందరు ఏకమై అతన్ని రక్షించదలచినను రక్షించలేకపోయేవారు. ఈ పవిత్ర ఖురాన్ నిశ్చయముగా నిష్ఠాపరులకొక గొప్ప ఉపదేశము. మీలో ఈ ఖురాన్‌ను నిరాకరించువారు కూడా వున్నారని నిశ్చయముగా మేమెరుగుదుము. కాని దీని బోధన అవిశ్వాసుల హృదయాలలో పెద్ద నిరాశ కలిగించుచున్నదని కూడ మాకు తెలుసు. ఇటువంటి బోధన మా



వద్ద ఉంటే బాగుండునని వారందురు. ఈ పవిత్ర ఖురాన్‌లో తెలిపిన విషయములన్ని అక్షరాల తప్పక పూర్తగునని మాకు తెలుసు. ఎందుకనగా ఇది నిస్సంశయమైన నమ్మకము. కనుక ఓ ముహమ్మద్! (సల్లల్లాహు అలైహి వసల్లం) వీరి ప్రతిఘటనలను లెక్క చేయకుము. తమ గొప్ప ప్రభువు నామమును స్తుతించుచుండుము.

తుదకు 3వ హజ్ సమయము వచ్చెను. మదీనా ముస్లిం యాత్రికుల బృందం ఒక భారీ సంఖ్యలో మక్కాకు చేరెను. మక్కా వారి వ్యతిరేకత వలన మదీనా వారు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తో విడిగా కలిసేందుకు విన్నవించిరి. బహుశ మదీనాకే వలస సంభవించునని ఈ దశలో ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం భావించిరి. వారు తమ విశ్వసనీయ బంధువులకు ఈ విషయము తెలిపిరి. మీరిట్లు చేయరాదని వారు నచ్చజెప్పిరి. ఎందుకనగా మక్కా వారు శత్రువులైనను ప్రభావము గల పెద్ద పెద్ద నాయకులు మీ బంధువులున్నారు. మదీనాలో ఎటువంటి పరిస్థితులు ఎదురగునో తెలియదు. అక్కడ మీ బంధువులు మీకు ఏ విధంగా సహాయము చేయగలుగుదురో ఏమో. కాని దైవ నిర్ణయము ఇదేనని వారు (స) అర్థం చేసుకొనిరి. అందుకే బంధువుల వినతిని వారు తిరస్కరించి మదీనా వెళ్లుటకు నిశ్చయించుకొనిరి.

అర్ధరాత్రి తర్వాత ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, మదీనా ముస్లిములు మరోమారు ఉఖ్బా లోయలో సమావేశమైరి. ఇప్పుడు వారి వెంట చిన్నాన అబ్బాస్ (రజి) కూడ యుండిరి. ఈసారి మదీనా ముస్లిముల సంఖ్య 73 వుండెను. అనగా ఖజ్రజ్ తెగ నుండి 62, ఓస్ తెగ నుండి 11 మంది పాల్గొనిరి. ఈ బృందంలో ఇద్దరు మహిళలు కూడ పాల్గొనియుండిరి. వీరిలో ఒకరు బనీ నజ్జార్ తెగకు

చెందిన ఉమ్మె అమ్మారహ్ కూడ వుండిరి. ముసఅబ్ (రజి) ద్వారా వీరికి ఇస్లాం వివరములు తెలిసియుండెను. వీరి హృదయములు నమ్మకం, విశ్వాసంతో పొంగిపొర్లుతుండెను. మున్ముందు వీరు ఇస్లాంకు మూల స్తంబాలుగా నిలబడేవారని తర్వాత జరిగిన సంఘటనలు నిరూపించినవి. ఈ రోజు పాల్గొనిన ఉమ్మె అమ్మారహ్ (రజి) తన కుమారుల హృదయాలలో ఇస్లాం ప్రేమను ఎంతో దృఢంగా నాటిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతిచెందిన తర్వాత వారి కుమారుడు హబీబ్ (రజి) ముసైలమా కజ్జాబ్ సైన్యముచే బంధించబడిరి. అప్పుడు ముసైలమా వారిని పిలిచి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ ప్రవక్త అని నీవు సాక్ష్యమిచ్చుచున్నావా అని ప్రశ్నించెను. హబీబ్ (రజి) అవును అని అనెను. నేను అల్లాహ్ ప్రవక్త అని నీవు సాక్ష్యమిచ్చుచున్నావా అని మరల ముసైలమా ప్రశ్నించెను. హబీబ్ (రజి) కాదని తెలిపిరి. అందుకు వారి ఒక అవయవమును కోసివేయమని ముసైలమా ఆజ్ఞాపించెను. రెండవ సారి ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త అని నీవు సాక్ష్యమిచ్చుచున్నావా అని ముసైలమా ప్రశ్నించెను. అవునని హబీబ్ (రజి) సమాధానమిచ్చిరి. నేను అల్లాహ్ ప్రవక్త అని నీవు సాక్ష్యమిచ్చుచున్నావా అని మరల అతను ప్రశ్నించెను. కాదని హబీబ్ (రజి) తెలిపిరి. వారి రెండవ అవయవమును కోసివేయమని మరల అతను ఆదేశించెను. ప్రతి అవయవము కోసిన తర్వాత నేను అల్లాహ్ ప్రవక్తనని నీవు సాక్ష్యమిత్తువా అని అతడు ప్రశ్నించెడి వాడు. కాదని హబీబ్ (రజి) చెప్పేవారు. ఇలా వారి అవయవములన్నియు కోసివేయబడెను. ఈ రకంగా తుదకు ముక్కలు ముక్కలై తన విశ్వాసము ను ప్రకటించుచు ప్రాణాలు సమర్పించిరి. స్వయాన ఉమ్మె అమ్మారహ్ (రజి) కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో అనేక యుద్ధములలో పాల్గొనిరి. నిస్సందేహంగా ఈ బృందం స్వచ్ఛమైన



విశ్వాసముతో తొణికిసలాడుతుండెను. ఈ బృంద సభ్యులు ధనము, డబ్బు ఆశించి ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు రాలేదు. విశ్వాసము పొందుటకు మాత్రమే వచ్చిరి. అబ్బాస్ (రజి) వారిని ఉద్దేశించి ఇట్లు ప్రసంగించిరి. ఓ ఖజ్రజ్ తెగ సభ్యులారా! నా ఈ చిరంజీవి తన జాతిలో గౌరవముగల వాడు. ఇతని జాతి ప్రజలు ముస్లిములైనను కానున్నను ఇతనికి రక్షణ కల్పించెదరు. కాని ఇప్పుడతడు మీ వెంట వెళ్లుటకు నిశ్చయించుకొనెను. ఓ ఖజ్రజ్ ప్రజలారా! ఇతను మీ వద్దకు వచ్చినచో అరబ్ మొత్తం మీకు వ్యతిరేకమగును. కావున మీరు మీ బాధ్యతను గుర్తెరిగి ఇతని ధర్మమును రక్షించుటలో ఎదురయ్యే ప్రతిఘటనలను తెలుసుకొన్నచో సంతోషంగా ఇతన్ని తీసుకెళ్లగలరు. లేనిచో మీరు ఈ నిర్ణయమును విరమించుకొనుము. ఈ బృందం నాయకుడు అల్‌బరా ఇట్లు సమాధానమిచ్చిరి. మేము మీ హెచ్చరికలను వింటిమి. మేము మా సంకల్పములో వెనుకంజ వేయము. దైవ సందేశహరుని కొరకు మా ప్రాణాలను అర్పించెదము. ఇక తుది నిర్ణయం వారే తీసుకొనవలెను. వారి ప్రతి నిర్ణయమును మేము అంగీకరించెదము. అప్పుడు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లాం బోధనలు వారికి తెలిపి దైవ ఏకత్వ స్థాపన గూర్చి ఉపదేశించిరి. వారు తమ భార్యా పిల్లలను రక్షించు విధంగా ఇస్లాంను రక్షించు వాగ్దానము చేసినచో నేను మీ వెంట వచ్చుటకు సిద్ధమేనని తెలిపిరి. వారు (స) తన మాట ముగించక ముందే మదీనా పౌరులైన 73 మంది దాసులు ముక్తకంఠంతో గట్టిగా అవును అవును అని నినదించిరి. అప్పుడు ఉత్సాహంలో మక్కా వాసుల దుష్టత్వమును వారు మరిచిపోయిరి. వారి నినాదాలు పర్వతములు దాటుచుండెను. వెంటనే అబ్బాస్ (రజి) కల్పించుకొని నిశ్శబ్దం! నిశ్శబ్దం!! లేనిచో మక్కా వారికి ఈ సంఘటన తెలిసిపోవునని హెచ్చరించిరి. కాని

వారిప్పుడు విశ్వాసము పొందియుండిరి. మరణముతో వారు భయపడడం లేదు. అబ్బాస్ (రజి) మాటలు విని వారిలోని ఒక నాయకుడు ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! మేము భయపడము, మీరు అనుమతించినచో మక్కా వారు మీకు కలిగించిన బాధలకు ప్రతీకారము తీర్చుకొనుటుకు సిద్ధముగా నున్నాము. వారితో ఎదురు పోరాడు అనుమతి నాకింకా అల్లాహ్ ఇవ్వలేదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సముదాయించిరి. ఆ తర్వాత మదీనా వారు వారి (స) తో బైఅత్ ప్రతిజ్ఞ చేయగా ఈ సమావేశము ముగిసెను.

మక్కా ప్రజలకు ఈ సంఘటన విషయము తెలిసెను. వారు మదీనా నాయకుల వద్దకు ఫిర్యాదుతో వెళ్ళిరి. కాని మదీనా బృంద నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉబే బిన్ సలూల్ కు స్వయాన ఈ విషయము తెలియదు. అందుకే అతడు వారికిట్లు ధైర్యమిచ్చెను. బూటకపు విషయము వారు వినివుండవచ్చు. మదీనా వారు నన్ను విచారించనిదే ఏ పని చేయలేరు. కాని మదీనా వారి హృదయాలలో షైతాన్ బదులు అల్లాహ్ రాజ్యమేలుచున్నాడని అతనికేమి తెలుసు. ఆ తర్వాత మదీనా బృందం తిరిగి వెళ్ళిపోయెను.

## మక్కా నుండి మదీనా వైపు ప్రస్థానము

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులు ప్రస్థానమునకు సన్నాహాలు చేసుకొనసాగిరి. ఒక్కొక్క కుటుంబము మక్కానుండి వెళ్ళిపోవడం ప్రారంభమయ్యెను. దైవరాజ్యము కొరకు నిరీక్షిస్తున్న వారు కూడ ఇప్పుడు ధైర్యవంతులైరి. ఒక్కో సారి ఒక వీధిలోని గృహములన్నిటికి ఒకే రాత్రి తాళాలు పడుచుండెను. ఉదయం ఆ వీధిలో ఎలాంటి సందడి కనిపించనందున నగర ప్రజలు విచారించగా ఈ వీధి నివాసులందరు మదీనా వలసపోయారని తెలిసేది. మక్కా ప్రజలలో



బలపడుతున్న ఇస్లాం గట్టి ప్రభావమును చూసి వారు ఆశ్చర్యపడేవారు.

తుదకు మక్కా నుండి ముస్లిములందరు వెళ్లిపోయిరి. పలువురు బానిసలు, స్వయాన రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ అబూబకర్ (రజి), హజ్రత్ అలి (రజి) మాత్రమే మిగిలిపోయిరి. వేట మా చేతులు దాటుచున్నదని చూసిన మక్కా వాసులు మరోసారి సమావేశమైరి. అభిప్రాయ సేకరణ తర్వాత ఇక ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను హత్యచేయక తప్పదనే నిర్ణయానికి వచ్చిరి. అల్లాహ్ ప్రత్యేక మహిమతో వారిని హత్య చేసే తేది, వారు వలస పోవు తేది ఒకే రోజు వుండెను. వారిని హతమార్చుటకు మక్కా వాసులు వారి గృహము చుట్టు ప్రోగవుచుండిరి. గాఢాంధకారములో రాత్రి వారు ప్రస్థానము చేయు ఉద్దేశముతో ఇంటి నుండి బయలు దేరుచుండిరి. మా పన్నాగం గురించి ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలిసి వుండవచ్చని మక్కా వారు సందేహపడుచుండిరి. అయినను వారు (స) వారి కళ్లెదుటే పోవుచున్నను వేరే ఎవరోనని వారు భ్రమ పడిరి. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కు ఈ హత్యా ప్రయత్నం గురించి తెలియకూడదని వారు వారిపై దాడి చేసే బదులు దాక్కొనుటకు ప్రయత్నించిరి. ఈ రాత్రికి ముందే వారి వెంట ప్రస్థానము చేయవలెనని అబూబకర్ (రజి) కు తెలుపబడెను. వారు కూడ తమ వెంట చేరిరి. ఇద్దరూ కలిసి కొద్ది సమయములోనే మక్కా నుండి పయనమైరి. మక్కా నుండి 3,4 మైళ్ళ దూరాన సూర్ నామము గల గుహలో ఆశ్రయము పొందిరి. *(బుఖారి బాబ్ హిజ్రతున్నబి సల్లల్లాహు అలైహి వసల్లం)* ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా నుండి వెళ్ళిపోయినారని వ్యతిరేకులు నిర్ధారించుకున్న తర్వాత ఒక సైన్యమును సమకూర్చుకొనిరి. ఒక్కొక్క పరిశోధకున్ని తమ వెంట

బెట్టుకొని వారిని వెంటాడిరి. వారిని వెతుకుచూ ఒకడు సూర్ పర్వతమునకు చేరుకొనెను. అబూబకర్ (రజి) తో కలిసి వారు (స) తలదాచుకున్న చోటకు అతడు వచ్చి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ గుహలో ఉన్నాడు లేదా ఆకాశమునకు ఎగిరిపోయి వుంటాడని నమ్మకముతో చెప్పెను. అతని ఈ ప్రకటనను విని అబూబకర్ (రజి) నిర్ఘాంతపోయిరి. శత్రువు మన వద్దకు వచ్చెను, ఏ క్షణాన్నైనా గుహలోకి ప్రవేశించునని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో చిన్నగా చెప్పిరి. అప్పుడు వారిట్లు నుడివిరి لَاتَحْزَنْ اِنَّ اللّٰه مَعَنَا *(బుఖారి బాబ్ మనాఖిబుల్ ముహాజిరీన్)* ఓ అబూబకర్ (రజి)! భయపడకుము. అల్లాహ్ మనిద్దరితో ఉన్నాడు. ఓ రసూలుల్లాహ్! నేను నా ప్రాణము గురించి భయపడను. ఎందుకనగా నేనొక సామాన్య వ్యక్తిని. హతమైనను నేనొక్కడినే హతమగుదును. ఓ రసూలుల్లాహ్! మీ ప్రాణానికి ఏదైనా హాని జరిగినచో ప్రపంచములో ఆధ్యాత్మికత, ధర్మము నశించిపోవునని నేను భయపడుచుంటిని. ఇక్కడ మనమిద్దరం కాదు మూడవ శక్తిగా దేవుడు కూడ మనతో ఉన్నాడు. కావున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు తెలిపిరి. ఇస్లాం వ్యాపించుటకు, ఉన్నతికి సమయము వచ్చెను. కనుక మక్కా వారికి గడువు లభించలేదు. అల్లాహ్ మక్కా వారి దృష్టి లోపింపజేసెను. వారు పరిశోధకున్ని పరిహసించుచు ఇట్లనిరి. వారు ఇటువంటి బహిరంగ ప్రదేశములో ఎలా శరణము పొందెదరు. ఇది దాక్కొనుటకు తగిన ప్రదేశము కాదు. ఇక్కడ సర్పములు, తేల్లు అధికం. ఏ తెలివిమంతుడు శరణము పొందును. గుహలో తొంగి చూడక పరిశోధకున్ని ఎగతాళి చేస్తూ తిరిగి వెళ్లిపోయిరి. రెండు రోజులు ఆ గుహలోనే నిరీక్షించిన తర్వాత ముందుగానే రచించిన ప్రణాళిక ప్రకారము జంతువాహనములు రాత్రి సమయమున ఆ గుహ వద్దకు తేబడెను.



రెండు వేగవంతమైన ఒంటెల పై ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులు బయలుదేరిరి. ఒక ఒంటెపై ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, దారి చూపు వ్యక్తి కూర్చొనిరి. రెండవ ఒంటెపై హజ్రత్ అబూబకర్ (రజి), వారి సేవకుడు ఆమిర్ బిన్ ఫుహైర కూర్చొనిరి.

మదీనా వైపు బయలు దేరే ముందు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వలసల్లం తన ముఖము మక్కా వైపు త్రిప్పిరి. ఈ పవిత్ర నగరములో వారు జన్మించిరి, ప్రవక్తగా అవతరించిరి. హజ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాం కాలము నుండి వారి తాతముత్తాతలు నివాసముంటుండిరి. దాని వైపు చివరి చూపుగా చూస్తూ విచారముతో ఇట్లు ప్రవచించిరి. ఓ మక్కా నగరము! నీవు అన్ని ప్రాంతాలకంటే నాకు అమిత ఇష్టమైన ప్రదేశము. కాని నీ వారు నన్ను ఇచట ఉండనివ్వడం లేదు. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) కూడ విచారముతో 'వీరు తమ సందేశహరున్ని వెళ్లగొట్టిరి. ఇక వీరు తప్పక నాశనమగుదురని వ్యాఖ్యానించిరి. *(జర్ఖాని సంపుటి 2 పుట 328, మస్నద్ అహ్మద్, తిర్మిజి ఆధారముగా)*

**సురాఖ వెంటాడం, అతనిని గూర్చి**

**ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి**

మక్కా వారు వారిని పట్టుకోవడంలో విఫలమై ఇట్లు ప్రకటించిరి. ముహమ్మద్ (రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం)ను లేదా అబూబకర్ (రజి) ను సజీవముగా గాని నిర్జీవముగా గాని తీసుకొచ్చిన వానికి 100 ఒంటెలు బహుకరించబడును. మక్కా చుట్టు ప్రక్కల వున్న జాతులలో కూడ ఈ ప్రకటన చేయించిరి. కనుక ఒక గ్రామీణ నాయకుడైన సురాఖ బిన్ మాలిక్ ఈ బహుమాన ఆశతో వారిని వెంటాడెను. వెతుకుచూ మదీనా మార్గములో అతడు వారిని చూడగలిగెను. రెండు ఒంటెలపై

వెళ్లుతున్న వ్యక్తులను చూచి వీరు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులే అని అతడు భావించెను. కనుక వారి వెనుక తన అశ్వమును పరుగెత్తించెను. కాని దారిలో అశ్వమునకు తట్టు తగిలినందున సురాఖ పడిపోయెను. తర్వాత సురాఖ ఇస్లాం స్వీకరించెను. అతడు స్వయాన తన సంఘటనను ఇట్లు తెలిపెను. నేను అశ్వము నుండి పడి పోగానే అరబ్బుల ఆచారము ప్రకారము నా బాణముల ద్వారా ఫలితము తెలుసుకొనగా చెడు ఫలితము తేలెను. కాని బహుమాన ఆశతో నేను మరల వారిని వెంటాడితిని. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తన ఒంటెపై కూర్చొని సగౌరవముగా వెళ్లుచుండిరి. వారు వెనక్కి తిరిగి నన్ను చూడలేదు. కాని హజ్రత్ అబూబకర్ (రజి) (రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఏదేని హాని జరగకూడదనే భయముతో) పదే పదే వెనక్కి తిరిగి నన్ను గమనించుచుండిరి. రెండవ సారి నేను వారిని సమీపించగానే రెండవసారి కూడ నా అశ్వమునకు తట్టు తగిలి నేను కిందపడిపోతిని. మరల నేను నా బాణములతో ఫలితము తెలుసుకొనగా మంచి ఫలితము రాలేదు. ఇసుకలో అశ్వము పాదాలు లోతుగా దిగబడినందున వాటిని తీయుట కష్టతరమయ్యెను. వీరు దైవ సంరక్షణలో ఉన్నారని అప్పుడు నేను గ్రహించితిని. అందుకే వారిని పిలిచి నా మనవి వినగలరని వేడుకున్నాను. వారు నా వద్దకు రాగానే వారికి నా రాక ఉద్ధేశమును తెలిపితిని. కాని నేను ఇప్పుడు నా నిర్ణయమును మార్చుకొని తిరిగి వెళ్లిపోతున్నానని వేడుకొంటిని. ఎందుకనగా దైవము మీతో ఉన్నదని నాకు విశ్వాసము కలిగినది. అప్పుడు చాలా మంచిది. వెళ్లిపో కాని మా గురించి ఎవరికి సమాచారము ఇవ్వకూడదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నన్ను ఆదేశించిరి. అప్పుడు ఇతడు సత్యవంతుడైనందున ఒక రోజు తప్పక విజయము పొందుననే



ఆలోచన నాకు కలిగెను. ఈ ఆలోచన రాగానే మీరు విజయము పొందిన తర్వాత నాకు శాంతి లభించేటట్లు పత్రము వ్రాసివ్వగలరని నేను వారిని విన్నవించుకొంటిని. హజ్రత్ అబూబకర్ (రజి) గారి సేవకుడైన ఆమిర్ బిన్ ఫుహైరాను శాంతి పత్రము వ్రాసివ్వమని వారు ఆదేశించిరి. వారు శాంతి ఒప్పందము వ్రాసిరి. *(బుఖారి బాబ్ హిజ్రతున్నబి స.అ.స)* ఆ తర్వాత సురాఖ తిరిగి వెళ్లుచుండగా అల్లాహ్ సురాఖ భవిష్యత్తును వారికి వెంటనే పరోక్షముగా ప్రత్యక్షపర్చెను. అందుకనుగుణంగా "సురాఖ! నీవు కిస్రా కడియములు ధరించిన సందర్భమున నీ పరిస్థితి ఎట్లుండును?" అని వారు తెలిపిరి. సురాఖ ఆశ్చర్యానికి లోనై ఈరాన్ చక్రవర్తి అయిన కిస్రా బిన్ హుర్ముజ్‌నకు చెందినవా? అని అడిగెను. అవునని వారు బదులిచ్చిరి. *(అస్సీరతుల్ హల్బియ్యా సంపుటి 2, పేజి 50)* 16,17 సంవత్సరముల తర్వాత వారి ఈ భవిష్యవాణి సంపూర్ణ రీతిలో పూర్తయినది. సురాఖ ఇస్లాం స్వీకరించి మదీనా వచ్చెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మరణము తర్వాత మొదట హజ్రత్ అబూబకర్ (రజి), తర్వాత హజ్రత్ ఉమర్ (రజి) ఉత్తరాధికారి పీఠాన్ని అధిష్టించిరి. వ్యాపించుచున్న ఇస్లాం కీర్తిని ఓర్వలేక ఈరానీయులు ముస్లిముల పై దాడి ప్రారంభించిరి. ఇస్లాంను అంతము చేసే బదులు వారే అపజయము పాలైరి. కిస్రా రాజభవనము ముస్లిం సైనికుల పాదాల శబ్దముతో దద్దరిల్లిపోయెను. ఈరాన్ నిధి ముస్లిముల అధీనములోకి వచ్చెను. ముస్లిం సైన్య అధీనములో వచ్చిన ఈరానీ ప్రభుత్వ ధనములో ఆ కడియములు కూడ వుండెను. ఈరానీ ఆచారము ప్రకారము ఆస్థానముపై ఆసీనులవుచున్న సందర్భమున కిస్రా వాటిని ధరించేవాడు. ప్రస్థాన సందర్భమున రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో తనకు సంభవించిన ఈ సంఘటనను సురాఖ ఇస్లాం స్వీకరించిన తర్వాత

చాలా గర్వముగా చెప్పుకునేవారు. "సురాఖ! నీవు కిస్రా కడియములు ధరించిన సందర్భమున నీ పరిస్థితి ఎట్లుండును?" అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతనితో చెప్పిన విషయము ముస్లింలకు తెలిసియుండెను. ఆ ధనమును హజ్రత్ ఉమర్ (రజి) ముందుంచబడెను. అందులో కిస్రా కడియములను వారు చూడగానే పూర్తి దృశ్యము తెరపై వారికి కనిపించెను. అది బలహీనత, నిస్సహాయ సమయము. అందుకే దైవ ప్రవక్త తమ దేశమును వదిలి మదీనా రావలసి వచ్చెను. వారిని సజీవముగా లేదా నిర్జీవముగా పట్టుకొచ్చిన వ్యక్తికి 100 ఒంటెల బహుమానము లభించునని సురాఖ లాంటి ఇతరులు వారిని వెంటాడిరి. ఆ సమయములో సురాఖతో వారిట్లు నుడివిరి."సురాఖ! నీవు కిస్రా కడియములు ధరించిన సందర్భమున నీ పరిస్థితి ఎట్లుండును?" ఇది ఎంత గొప్ప భవిష్యవాణి. ఎంత పవిత్ర పరోక్ష వార్త. కిస్రా కడియములను హజ్రత్ ఉమర్ (రజి) తన ముందు చూడగానే వారికి దైవ నిర్ణయము దృశ్య రూపంలో కనిపించెను. సురాఖను హాజరు పర్చమని వారు ఆదేశించిరి. సురాఖ రాగానే కిస్రా కడియములను తన చేతులలో ధరించవలెనని ఆజ్ఞాపించిరి. ఓ దైవ ప్రవక్త ఉత్తరాధికారి! స్వర్ణధారణ ఒక ముస్లింనకు నిషేధమని సురాఖ విన్నవించుకొనెను. హజ్రత్ ఉమర్ (రజి) ఇట్లు తెలిపిరి. అవును నిషేధమే. కాని ఇటువంటి సందర్భములలో కాదు. నీ చేతులలో బంగారు కడియములను ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అల్లాహ్ చూపెను. కావున నీవు ఈ కడియములను ధరించుము, లేదా నేను నిన్ను శిక్షించెదను. శాసనములోని నియమము వలన మాత్రమే సురాఖ అభ్యంతరము తెలిపెను. వాస్తవానికి అతను కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి పూర్తగుచుండగా చూడాలనే కోరుకొనెను. సురాఖ ఆ కడియములను



తన చేతులలో ధరించెను. ఈ అద్భుత భవిష్యవాణి కార్య రూపం దాల్చుచుండగా ముస్లిములందరు సాక్ష్యముగా నిలిచిరి. మక్కా నుండి పారిపోతున్న ప్రవక్త నేడు ప్రపంచానికే చక్రవర్తి అయ్యెను. వారు స్వయాన ఈ లోకంలో లేకుండిరి. కాని ఇస్లాం దాసులు వారి భవిష్యవాణీలు పూర్తగుచుండగా చూచుచుండిరి.

## ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో ప్రవేశము

సురాఖను పంపి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కొన్ని మైళ్ళ ప్రయాణం చేసి మదీనా చేరుకొనిరి. మదీనా వాసులు ఎంతో ఆత్రుతతో వారి (స) రాకకై నిరీక్షించుచుండిరి. మక్కా లో ప్రత్యక్షమైన సూర్యుడు మదీనాలో ఉదయించుచుండెను. ఇంతకంటే గొప్ప అదృష్టము వారికి మరొకటి వుండునా ?

మక్కాలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అదృశ్య మైనారని తెలిసినప్పటి నుండి వారు వారి రాకకై ఎదురు చూచుచుండిరి. వారి బృందాలు ప్రతి రోజు మదీనా నుండి కొన్ని మైళ్ళ దూరం వరకు వచ్చి వెతికి సాయంత్రం నిరాశతో వెనుదిరిగేవి. వారు (స) మదీనా దగ్గరకు వచ్చినప్పుడు ఖుబా (మదీనా సమీపములో గల గ్రామము)లో నిలుచుటకు నిర్ణయించిరి. ఒక యూదుడు ఒంటెలను చూచి ఈ బృందం ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లందేనని తెలుసుకొనెను. అతడొక చిన్న పర్వతము నెక్కి "ఓ **ఖీల** (మదీనాకు చెందిన ఒక లోయ) నివాసులారా! మీరు నిరీక్షిస్తున్న వ్యక్తి వచ్చెనని ప్రకటించెను. ఈ పిలుపు వినిన వెంటనే మదీనాకు చెందిన ప్రతి ఒక్కరు ఖుబా వైపు పరుగెత్తిరి. దైవ సందేశహరుడు మాలో బస చేయుటకు వచ్చెనని ఖుబా నివాసులు అమితానందము పొందుచుండిరి.

ఈ సందర్భమున సంభవించిన ఒక సంఘటన రసూలుల్లాహ్

సల్లల్లాహు అలైహి వసల్లం నిరాడంబరతను నిరూపించును. మదీనా వాసులు అనేక మంది వారిని ఇంతకు ముందు చూడలేదు. ఖుబా గ్రామ శివారులో ఒక వృక్షము క్రింద వారు కూర్చొని యుండిరి. మదీనా నుండి ప్రజలు పరుగెత్తుకుంటూ వచ్చుచుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో సాధారణ రీతిలో కూర్చొని వుండిరి. హజ్రత్ అబూబకర్ (రజి) వారి కంటే వయసులో చిన్న అయినను వారి గడ్డములో కొన్ని తెల్ల వెంట్రుకలుండెను. వారి దుస్తులు కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కంటే నాణ్యత గలవైయుండెను. అందుకే అబూబకర్ (రజి) నే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంగా భావించిరి. కావున చాలా వినమ్రతతో వారి ముందు కూర్చొనసాగిరి. అబూబకర్ (రజి) ఈ విషయమును చూచి ప్రజలు అపోహ పడుచున్నారని తెలుసుకొనిరి. వారు వెంటనే ఒక దుప్పటి తెరిచి సూర్యునికెదురుగా నిలబడి ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! మీకు ఎండ తగులుతుంది కావున నేను దుప్పటి పట్టుకుంటాను. ఈ విధంగా చాలా సున్నితంగా ప్రజల అపోహను తొలగించిరి. ఖుబాలో పది రోజులు బస చేసిన తర్వాత మదీనా వారు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను మదీనా తీసుకెళ్లిరి. వారు మదీనా చేరుకోగానే ముస్లిం మహిళలు, పురుషులు, పిల్లలు అందరు వీధులలో వచ్చి వారిని ఘనంగా స్వాగతించిరి. పిల్లలు, స్త్రీలు ఈ క్రింది కవిత్వము పాడుచుండిరి.

طلع البدر علينا من ثنيات الوداع
وجب الشكر علينا ما دعا لله داع
ايها المبعوث فينا جئت بالامر المطاع

అనగా సంపూర్ణ చంద్రుడు వీడ్కోలు మూల నుండి మాపై ఉదయించెను. అల్లాహ్ వైపు ఆహ్వానించు వ్యక్తి ప్రపంచములో వున్నంత వరకు ఈ ఉపకారమునకు కృతజ్ఞతలు తెలుపుట మా బాధ్యత. అల్లాహ్ పంపిన ఓ ప్రవక్తా! నీ ఆదేశము సంపూర్ణముగా పాటించబడును.



రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తూర్పు మార్గాన మదీనా లో ప్రవేశించలేదు. కాని సంపూర్ణ చంద్రుడు తూర్పు నుండి ఉదయించును. కావున మదీనా వాసుల భావమేమనగా నిజమైన చంద్రుడు ఆధ్యాత్మిక చంద్రుడే. మేము ఇప్పటి వరకు అంధకారములో వుంటిమి. ఇప్పుడు మాపై చంద్రుడు ఉదయించెను. సంప్రదాయానికి విరుద్ధంగా ఆ చంద్రుడు ఉదయించెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సోమవారము రోజున మదీనాలో ప్రవేశించిరి. సోమవారమే సూర్ గుహ నుండి వారు బయలు దేరి యుండిరి. విచిత్రమేమనగా సోమవారము రోజునే వారు మక్కాను జయించిరి.

వారు మదీనాలో ప్రవేశించగా ప్రతి ఒక్కరు మా గృహములో వారు (స) బస చేయాలని ఆశించుచుండిరి. ఏ వీధిలోనైతే వారి ఒంటె వెళ్లుచుండెనో ఆ వీధిలోని వివిధ కుటుంబములు తమ తమ ఇంటి ముందు నిలబడి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు స్వాగతం పలుకుచుండిరి. ఓ రసూలుల్లాహ్! ఇది మా గృహము, మా ధనము, మా ప్రాణాలు మీ సేవకు అంకితం చేస్తున్నాము. ఓ రసూలుల్లాహ్! మేము మీకు రక్షణ కల్పించగలము, మీరు మా వద్దే బస చేయండని విజ్ఞప్తి చేయుచుండిరి. వారు తమ గృహముకు రావలెనని కొందరు ఉత్సాహము తో ముందుకొచ్చి వారి ఒంటె ముకుతాడు పట్టుకొనసాగిరి. కాని మీరు నా ఒంటెను వదులుము. ఇది నేడు దైవాదేశాను సారమే నడుచుచున్నది. ఇది ఆగిన చోటనే నేను నివసించాలని దైవ కోరిక అని వారు తెలిపిరి.

తుదకు మదీనాలోని ఒక శివారున బనూనజ్జార్ అనాథల స్థలములో ఒంటె ఆగెను. వారిట్లు నుడివిరి. ఇక్కడే మేము నివసించాలని

అల్లాహ్ అభీష్టమని అర్థమవుతుంది. ఇది ఎవరి స్థలమని ప్రశ్నించిరి. ఆ స్థలము అనాథలదైయుండెను. వారి సంరక్షకుడు ముందుకు వచ్చి ఓ రసూలుల్లాహ్! ఇది ఫలానా ఫలానా అనాథల స్థలము. మీకు అంకితము చేస్తున్నానని వేడుకొనెను. మేమెవరి భూమిని ఉచితముగా తీసుకోలేము. కావున ఆ భూమి విలువ నిర్ణయించిన తర్వాత అచట మస్జిద్, తమ నివాస గృహము నిర్మించుటకు నిర్ణయించిరి.

**హజ్రత్ అబూ అయ్యూబ్ (రజి) అన్సారి గృహములో నివాసము**

ఆ రత్వాత అందరి కంటే సమీపములో ఎవరి గృహమున్నదని వారు ప్రశ్నించిరి. అబూ అయ్యూబ్ (రజి) అన్సారి ముందుకు వచ్చి ఓ రసూలుల్లాహ్! నా ఇల్లు అందరి కంటే సమీపములో ఉన్నది. మీ సేవకు సిద్ధమని విన్నవించెను. ఇంటికి వెళ్ళి మా కొరకు ఒక గది సిద్ధపరచమని వారనిరి. అబూ అయ్యూబ్ (రజి)నకు రెండస్తుల గృహముండెను. వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు పై అంతస్తును కేటాయించిరి. కాని తనను కలవడానికి వచ్చేవారికి ఇబ్బంది కలుగునని క్రిందనే వుండుటకు వారు (స) ఇష్టపడిరి.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో అన్సార్‌కు ఎంత ప్రేమ కలిగెనో మనకు ఈ సంఘటనతో తెలియును. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్టుబట్టినందున వారు క్రిందనే వుండుటకు అబూ అయ్యూబ్ (రజి) ఒప్పుకొనిరి. కాని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి క్రింద నిద్రించుచుండగా పై భాగంలో అమర్యాదగా మేమెలా నిద్రించగలమని భార్యాభర్తలిద్దరు రాత్రంతా నిద్ర పోలేదు. రాత్రి ఒక పాత్రలోని నీరు పడిపోగా ఆ నీరు కారి క్రింద పడునని హజ్రత్ అబూ అయ్యూబ్ (రజి) పరుగెత్తి తన దుప్పటి ఆ నీటి పై వేసి నీళ్ళను తూడ్చిరి. ఉదయం వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం



వద్దకు వచ్చి పరిస్థితులన్నిటిని తెలిపిరి. అందుకు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పై అంతస్తులో వెళ్లుటకు ఒప్పుకొనిరి. అబూ అయ్యూబ్ (రజి) ప్రతి రోజు భోజనము సిద్ధము చేసి వారికి అందించేవారు. వారు స్వీకరించగా మిగిలిన భోజనము కుటుంబ సభ్యులందరు భుజించేవారు. కొన్ని రోజుల తర్వాత ఇతర అన్సార్‌లు కూడ అతిథ్యమునకు పట్టుబట్టిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వగృహము సిద్ధమయ్యే వరకు మదీనా ముస్లిములు వంతుల వారీగా వారింటికి భోజనము పంపుచుండిరి.

**ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవకుడు**

**హజ్రత్ అనస్ (రజి) సాక్ష్యము**

మదీనాకు చెందిన ఒక వితంతువుకు అనస్ నామము గల ఏకైక కుమారుడుండెను. అతని వయస్సు 8, 9 సంవత్సరములు యుండెను. ఆమె అతన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు తీసుకొచ్చి ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! మీ సేవకు నా ఈ కుమారున్ని స్వీకరించుము. ఆ స్త్రీ తన ప్రేమ వలన తన కుమారున్ని త్యాగము చేసెను. కాని ఆమె కుమారుడు త్యాగము కొరకు కాదు శాశ్వత జీవితము కొరకు స్వీకరించబడెనని ఆమెకేమి తెలుసు.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఛాయలో నివసించి అనస్ (రజి) ఇస్లాం గొప్ప విద్యావంతులైరి. క్రమేణ పెద్ద ధనవంతులూ అయిరి. వారు 100 సం॥ల కంటే ఎక్కువ ఆయువు పొందిరి. ముస్లిం రాజ్యములో వారికి గొప్ప గౌరవము లభించేది. అనస్ (రజి) ఇట్లు సాక్ష్యమిచ్చిరి. నేను బాల్యములోనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవ చేయు అనుగ్రహము పొందితిని. వారి జీవితాంతం వారితోనే వుంటిని. వారు నాతో ఏనాడు కఠినముగా మాట్లాడలేదు. ఎన్నడు కసురుకోలేదు. నా శక్తికి మించిన పని ఏనాడు చెప్పలేదు. రసూలుల్లాహ్

సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా జీవితములో అనస్ (రజి) తో మాత్రమే సేవలు పొందిరి. కావున వారి గుణముల గూర్చి అనస్ (రజి) సాక్ష్యము అమూల్యమైనది.

### మక్కా నుండి కుటుంబసభ్యుల రాక, మస్జిద్ నబ్వీ శంకుస్థాపన

వారు స్వాతంత్ర్యము ప్రసాదించిన బానిస జైద్ ను కొంత కాలము తర్వాత తన కుటుంబ సభ్యులను తీసుకరావడానికి మక్కా పంపించిరి. ఈ అనూహ్య వలసతో మక్కా వారు భయాందోళనకు గురైరి. అందుకే కొంత కాలము వరకు హింసల పరంపర ఆగిపోయెను. ఈ భయాందోళన వల్లనే వారు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ అబూబకర్ (రజి) కుటుంబము మక్కా నుండి పోవుచున్నప్పుడు అడ్డుకొనుటకు ప్రయత్నించలేదు. కావున వీరు సురక్షితంగా మదీనా చేరుకొనిరి. ఈ లోపు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కొనుగోలు చేసిన భూమిలో మొదట వారు మస్జిద్‌నకు శంకుస్థాపన చేసిరి. ఆ తార్వత తమ కొరకు, తమ అనుచరుల కొరకు గృహములు నిర్మింపజేసిరి. ఇందుకు సుమారు 7 నెలల సమయము పట్టెను. *(బుఖారి బాబ్ హిజ్రతున్నబీ సల్లం, జర్ఖానీ సంపుటి 2, పుట 369)*

### మదీనా అన్యారాధకుల ఇస్లాం స్వీకరణ

వారు మదీనా చేరుకొనిన కొద్ది రోజులలోనే మదీనాలోని అన్యారాధకుల తెగలలో అధిక శాతం ఇస్లాంలో ప్రవేశించిరి. హృదయ పూర్వకంగా ముస్లిములు కాని వారు బాహ్యరూపంలో ఇస్లాం స్వీకరించిరి. ఈ విధంగా మొదటి సారి ఇస్లాంలో దాంబికుల వర్గము ఏర్పడెను. వీరిలో కొందరు తర్వాత మనస్ఫూర్తిగా ఇస్లాం స్వీకరించినను కొందరు మాత్రం అవకాశము లభించినప్పుడల్లా ఇస్లాంకు వ్యతిరేకంగా కుట్రలు, కుయుక్తులకు పాల్పడేవారు. ఇంకొందరు బాహ్య రూపంలో కూడ ఇస్లాంలో



చేరలేదు. కాని వీరు మదీనాలో ఇస్లాం వైభవాన్ని చూచి ఓర్వలేక మక్కా వెళ్ళిపోయిరి. సంపూర్ణంగా ఏకదైవారాధనలో నిమగ్నమైన ప్రప్రథమ నగరముగా ప్రపంచములోనే మదీనా కీర్తి పొందెను. నిశ్చయముగా ఈ విశ్వ పటంలోని ఏకదైవారాధనలో పాల్గొంటున్న నగరము, గ్రామము మదీనా తప్ప మరొకటి లేకుండెను. మక్కా నుండి ప్రస్థానము తర్వాత కొద్ది రోజులలోనే అల్లాహ్ వారి ద్వారా ఒక నగరమును సంపూర్ణముగా ఏకదైవారాధనలో నిమగ్నము చేసెను. అక్కడ ఏ విగ్రహమును బహిర్గతముగా, లేదా అంతర్గతంగా పూజించేవారే లేకుండిరి. ఇది నిస్సందేహంగా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఒక గొప్ప సంతోషము, వారి అనుచరుల దృష్టిలో అత్యద్భుతమైన విజయము. కాని ఈ మార్పుతో ముస్లిములు పూర్తిగా రక్షణలోకి వచ్చినారని భావించరాదు. మదీనాలోనే అరబ్బుల ఒక వర్గము దాంబికులుగా ఉండి వారికి ప్రాణ శత్రువులుగా మారిరి. యూదులు కూడ అవకాశము కొరకు ఎదురుచూచుచుండిరి. ఈ అభద్రతాభావం వలన వారు సైతం జాగ్రత్తగా వుంటూ అనుచరులను జాగ్రత్తగా వుండవలెనని ఆదేశించేవారు. ఆరంభములో కొన్ని రోజులు వారు రాత్రంతా జాగారణ చేయవలసి వచ్చేది. ఒక సారి వారు వరుసగా జాగారణ చేసినందున అలసటకు గురై ఇట్లు ఉపదేశించిరి. విశ్వసనీయ వ్యక్తి ఎవరైనా రక్షణగా నిలిచినచో నేను విశ్రాంతి తీసుకొనెదనుగదా! కొద్ది సమయములోనే ఆయుధాల శబ్దము వినిపించెను. ఎవరు అని వారు ప్రశ్నించిరి. ఓ రసూలుల్లాహ్! మీ రక్షణ కొరకు వచ్చిన నేను సాద్ బిన్ వఖాస్‌ను అని బదులు వచ్చెను. అప్పుడు వారు విశ్రాంతి తీసుకొనిరి. మదీనాలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం శత్రువుల దాడుల నుండి పూర్తిగా సురక్షితంగా లేరని అన్సార్ కూడ గమనించిరి. అందుకే వారు సమిష్టి నిర్ణయము తీసుకొని

వివిధ తెగలకు వంతులు నిర్ణయించిరి. ప్రతి తెగలోని కొందరు వంతుల వారీగా వారి గృహమునకు రక్షణ కల్పించేవారు.

మక్కా జీవితముకును మదీనా జీవితములో ఒక మార్పు ఏర్పడెను అదేమనగా ఇప్పుడు అల్లాహ్ నామముతో నిర్మించబడిన మస్జిద్‌లో ఇతరుల జోక్యము లేకుండా ఐదు పూటలు ప్రార్థన చేసుకునే స్వేచ్ఛ ముస్లిములకు లభించెను.

### ముస్లిములను మరల హింసించు యోచనలో మక్కా వాసులు

రెండు మూడు నెలల తర్వాత మక్కా వారి ఆందోళన దూరమయ్యెను. అప్పుడు ముస్లిములను హింసించుటకు మరల కుయుక్తులు ప్రారంభించిరి. అభిప్రాయ సేకరణ తర్వాత కేవలం మక్కా, ఇరుగు పొరుగు ప్రాంతములో ముస్లిములను హింసకు గురిచేయుటతోనే వారు తమ ఉద్ధేశములో విజయము సాధించలేరని గ్రహించిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను మదీనా నుండి బహిష్కరించనిదే ఇస్లాంను అంతము చేయలేము. ఇంతకు ముందు తెలుపబడిన విధముగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా రాక ముందు అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్న్ సలూల్‌ను మదీనా వాసులు తమ చక్రవర్తిగా స్వీకరించుటకు నిర్ణయించుకొని యుండిరి. ఈ సలహా తర్వాత మక్కా వారు అతనికి ఇట్లు సందేశము పంపిరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా పోయినందున మక్కా వారి హృదయాలు గాయపడినవి. మదీనా వాసులు వారి (స) కి, వారి (స) అనుచరులకు శరణము ఇవ్వకుంటే బాగుండెడిది. ఇందులో చివరగా ఈ పదాలు కూడ వుండెను.

اِنَّكُمْ اٰوَيْتُمْ صَاحِبَنَا وَاِنَّانُقْسِمُ بِاللّٰهِ لَنُقَاتِلُنَّهٗ اَوْتُخْرِجُنَّهٗ اَوْلَنَسِيْرَنَّ
اِلَيْكُمْ بِاَجْمَعَنَا حَتّٰى نَقْتُلَ مَقَاتِلَتَكُمْ اَوْ نَسْتَبِيْحَ نِسَائَكُمْ ۔



అనగా మా వ్యక్తి (ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం) కు మీరు మీ గృహములలో ఆశ్రయమిచ్చిరి. మేము అల్లాహ్ ప్రమాణముగా ప్రకటించునదేమనగా మదీనావాసులైన మీరు అతనితో యుద్ధము చేయుము లేదా అతన్ని నగరము నుండి బహిష్కరించుము. లేనిచో మేమందరము ఏకమై మదీనాపై దాడి చేయుదుము. యుద్ధములో పాల్గొను శక్తిగల మదీనా వాసులందరిని హతమార్చెదము. స్త్రీలను బానిసలుగా మార్చుకొనెదము. ఈ ఉత్తరము అందగానే అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్న్ సలూల్‌లో దురుద్దేశము పుట్టెను. అతడు ఇతర దాంబికులకు ఇట్లు సలహా ఇచ్చెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఇక్కడ వుండనిచ్చినచో మనకు ఇబ్బందులు తప్పవు. కావున వారితో మనము యుద్ధము చేసి, మక్కా వారిని ప్రసన్నులు చేసుకొనవలెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంకు ఈ విషయము తెలిసెను. వారు అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్న్ సలూల్‌ను సంప్రదించి అతన్ని ఇట్లు సముదాయించిరి. మీ ఈ కార్యము మీకే నష్టము కలిగించును. ఎందుకనగా మదీనాలోని చాలా మంది ఇస్లాం స్వీకరించిరి. వారు ఇస్లాం కొరకు ప్రాణాలర్పించుటకు సిద్ధముగా వున్నారను విషయం మీకు తెలుసు. మీరిలా చేసినచో వారు ముహాజిరీన్ (మదీనాకు వలసవచ్చిన ముస్లిముల) తో యుందురు. కావున మీరు ఈ యుద్ధమును ప్రారంభించి పూర్తిగా నాశనమగుదురు. అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్న్ సలూల్ తన తప్పును తెలుసుకొని ఈ కుట్రను విరమించుకొనెను.

### అన్సార్, ముహాజిర్ల మధ్య సోదర భావము

ఇస్లాం బలోపేతానికి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ రోజులలోనే మరో ఏర్పాటు చేసిరి. అదేమనగా ముస్లిములందరిని సమావేశపర్చి ఇద్దరిద్దరిని కలిపి సోదరులుగా ప్రకటించిరి. ఈ

సోదరభావమును అన్సార్ (మదీనా ముస్లిములు) గొప్ప సంతోషముతో ఆహ్వానించిరి. ప్రతి అన్సార్ తన సోదరున్ని తన ఇంటికి తీసుకెళ్లెను. తన ఆస్తిని అతని ముందుంచి రెండు భాగాలుగా విభజించు కోవలెనని కోరెను. ఒక అన్సార్ మరో అడుగు ముందుకు వేసి తనకున్న ఇద్దరు భార్యలలో ఒకరికి విడాకులిచ్చెదను ఆమెను నీవు వివాహమాడవచ్చునని కూడ ప్రతిపాదించెను. కాని ముహాజిర్లు వారి మంచితనానికి కృతజ్ఞతలు తెలిపి వారి ఆస్తిలో వాటా తీసుకొనుటకు నిరాకరించిరి. అయినను అన్సార్ సోదరులు పట్టుబట్టిరి. వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఓ రసూలుల్లాహ్! వీరు మా సోదరులైనప్పుడు మా ఆస్తిలో భాగస్వాములు ఎందుకు కాలేరని ప్రశ్నించిరి. వీరి వృత్తి వ్యాపారమైనందున వీరికి వ్యవసాయము తెలియదు. కావున వీరు మా భూములలో భాగము తీసుకోనప్పుడు మా పంటలలో వీరిని తప్పక భాగస్వాములు చేయవలెనని తెలిపిరి. ముహాజిర్లు అందుకు ఇష్టపడక, తమ కుల వృత్తి వ్యాపారమునే కొనసాగించిరి. ఇలా కొద్ది రోజులలోనే వారిలో అనేకులు ధనవంతులైరి. కాని అన్సార్ ఆస్తిలో భాగము ఇచ్చుటకు పట్టుబట్టడంతో చనిపోయిన పలువురి సంతానము అరబ్ ఆచారము ప్రకారము ముహాజిర్ సోదరులకు ఆస్తిలో వాటా ఇచ్చిరి. అనేక సంవత్సరముల వరకు దీనిని పాటించిరి. తుదకు పవిత్ర ఖురాన్‌లో ఈ విషయము నిషేధించబడెను.

## ముహాజిర్లు, అన్సార్, యూదుల మధ్య ఒప్పందము

ముస్లిములను సోదరులుగా కలిపిన తర్వాత మదీనాలో నున్న మొత్తం జానాభాలో కూడ ఒక ఒప్పందము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కుదిర్చిరి. యూదులు, అరబ్బుల నాయకులను ప్రోగు చేసి ఇట్లు తెలిపిరి. గతములో ఇక్కడ రెండు వర్గములుండెడివి. కాని ఇప్పుడు మూడు వర్గములైనవి. అనగా ఇంతకు ముందు యూదులు



మదీనాకు చెందిన అరబ్బులే ఇక్కడ నివసించేవారు. కాని ఇప్పుడు యూదులు, మదీనా అరబ్బులు, మక్కా ముహాజిర్లు (వలసదారులు) మూడు వర్గములైనవి. కావున పరస్పరము ఒక శాంతి ఒప్పందము చాలా అవసరము. అందరి అంగీకారముతో క్రింది పదాలలో ఒక ఒప్పందము వ్రాయబడెను.

"**ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, విశ్వాసులు, సంతోషముగా వారితో జతకలిసేవారి మధ్య కుదిరిన ఒప్పందమిది**. ముహాజిర్లలో ఎవరైనా హత్యకు గురైనచో అతని హత్యకు వారే బాధ్యులగుదురు. తమ ఖైదీలను వారే విడిపించుకొందురు. మదీనాకు చెందిన వివిధ ముస్లిం వర్గములు కూడ ఈ విషయములో తమ వర్గముల కొరకు బాధ్యులగుదురు. ఎవరైనా తిరుగుబాటు, శత్రుత్వము లేదా పాలనలో విభేదము సృష్టించుటకు ప్రయత్నించినచో సభ్యులందరు అతనికి వ్యతిరేకంగా పోరాడెదరు. అతడు వారి కుమారుడు అయినను వెనుకాడకూడదు. ఒక అవిశ్వాసి ముస్లిం ద్వారా చంపబడినచో అతని ముస్లిం సోదరులు ఆ ముస్లింతో ప్రతీకారము తీసుకోకూడదు. ముస్లింనకు విరుద్ధముగా ఆ అవిశ్వాసికి సహాయము చేయకూడదు. మాతో కలిసిన యూదునికి మేమందరము సహాయము చేయుదుము. యూదులకు ఎటువంటి ఇబ్బంది కలుగనీయము. వారికి వ్యతిరేకముగా ఎటువంటి శత్రువుకు సహాయము చేయరాదు. మక్కా వాసునికి అవిశ్వాసులెవ్వరు తన గృహములో ఆశ్రయము కల్పించకూడదు. వారి ఆస్తిని న్యాసముగా తన వద్ద పెట్టుకోకూడదు. అవిశ్వాసుల, విశ్వాసుల మధ్య యుద్ధములో అతడు జోక్యము తీసుకోకూడదు. ఒక ముస్లింను అన్యాయంగా హతమార్చిన వ్యక్తికి

వ్యతిరేకంగా ముస్లిములందరు ఏకమై కృషి చేయుదురు. ఒక అన్యారాధకుడైన శత్రువు మదీనాపై దాడి చేసినచో యూదులు ముస్లిములకు సహకరించెదరు. వారి వారి భాగస్వామ్యము ప్రకారము ఖర్చు భరించెదరు. వివిధ మదీనా తెగలతో ఒప్పందము కుదుర్చుకున్న యూదుల వర్గములు ముస్లిముల వలె హక్కులు పొందెదరు. యూదులు తమ ధర్మమును, ముస్లిములు తమ ధర్మమును ఆచరించెదరు. యూదులకు లభించిన హక్కులు వారి అనుచరులకు కూడ లభించును. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుమతి లేనిదే మదీనా పౌరులలో ఎవరు కూడ యుద్ధము మొదలు పెట్టకూడదు. కాని ఈ నిబంధనలో భాగంగా ఎవరు కూడ తన ధర్మబద్ధమైన ప్రతీకారమును కోల్పోరు. యూదులు తమ కార్యముల ఖర్చులకు వారే బాధ్యులు. అటులనే ముస్లిములు కూడ తమ ఖర్చులకు వారే బాధ్యులు. కాని యుద్ధములో ఇద్దరు కలిసి పనిచేయుదురు. ఈ ఒప్పందములో పాల్గొంటున్న వారందరికి మదీనా ఒక గౌరవప్రదమైన ప్రాంతమగును. ఎవడేని బయటి వ్యక్తి నగర ప్రజల సహకారమునకు వచ్చినచో అతనితో కూడ నగర పౌరులతో సమానంగా వ్యవహరించబడును. కాని ఒక స్త్రీని ఆమె బంధువుల ఇష్టానికి వ్యతిరేకంగా మదీన వారు తమ గృహములలో వుంచుకోకూడదు. జగడములు, వివాదములు అల్లాహ్, అతని ప్రవక్త వద్దనే పరిష్కరించబడును. మక్కా, వారి పక్షాన వున్న వర్గములతో ఈ ఒప్పందములో వున్న వారెవరు ఒప్పందము చేసుకోకూడదు. ఎందుకనగా ఈ ఒప్పందములో పాల్గొను వారు మదీనా శత్రువులకు వ్యతిరేకంగా ఈ ఒప్పందము ద్వారా



ఏకీభవించిరి. యుద్ధము విడిగా చేయబడనట్లు ఒప్పందము కూడా విడిగా చేయబడదు. కాని యుద్ధములో పాల్గొనుటకు ఎవరిని బలవంతము చేయబడదు. ఎవరైనా దౌర్జన్యమునకు పాల్పడినచో అతడు శిక్షించబడును. నిశ్చయముగా అల్లాహ్ సత్యవంతుల, ధర్మమూర్తుల సంరక్షకుడు. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ ప్రవక్త." *(ఇబ్నె హష్షామ్ సంపుటి 1 పుట 178)*

ఒప్పందములోని సంక్షిప్త సమాచారమిది. ఇందులో నీతి, నిజాయితిని విడనాడకూడదు, క్రూరుడు తన హింసకు తానే బాధ్యుడగునను విషయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనైనది. ఈ ఒప్పందము తో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వైపు నుండి యూదులతో, ఇస్లాంలో చేరని మదీనా పౌరులతో ప్రేమ, ఆప్యాయత, సానుభూతితో ప్రవర్తించబడునని, వారితో సోదరభావముగా వ్యవహరించబడునని తీర్మానించబడెను. అందుకే తర్వాత యూదులతో ఏర్పడిన జగడములకు వారే బాధ్యులు.

## మక్కా వాసుల ద్వారా మరల కుట్రల ఆరంభము

ఇంతకు ముందు వివరించిన విధంగా రెండు మూడు నెలల తర్వాత మక్కావాసుల ఆందోళన దూరమైనప్పుడు ఇస్లాంకు వ్యతిరేకంగా మరల తమ కార్యకలాపాలను ప్రారంభించిరి. ఈ రోజులలోనే ఓస్ తెగ నాయకుడు సాద్ బిన్ మఆజ్ (రజి) దైవ గృహ ప్రదక్షిణము కొరకు మక్కా పోయిరి. అబూజహల్ వారిని చూచి కోపంగా ఇట్లనెను. "మీరు ఆ ధర్మభ్రష్టుడు (ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం)నకు ఆశ్రయమిచ్చి సురక్షితంగా కాబా ప్రదక్షిణము చేయగలరని భావించుచున్నారా? అతన్ని రక్షించే శక్తి మీకున్నదని ఊహించుచున్నారా? అల్లాహ్ ప్రమాణము! ఇప్పుడు నీ వెంట అబూసఫ్వాన్ లేనిచో నీవు నీ

ఇంటికి ప్రాణాలతో వెళ్లేవాడివి కాదు." సాద్ బిన్ మఆజ్ (రజి) ఇట్లు బదులిచ్చిరి. దైవసాక్ష్యముగా! మీరు కాబా ప్రదక్షిణలో మాకు అడ్డు తగిలినచో సీరియా మార్గములో మీకు రక్షణ వుండదు. అదే రోజులలో మక్కాకు చెందిన పెద్ద నాయకుడు వలీద్ బిన్ ముఘీరహ్ అనారోగ్యమునకు గురయ్యెను. తన మరణము సమీపములో నున్నదని అతను ఊహించెను. ఒక రోజు మక్కాకు చెందిన పెద్ద పెద్ద నాయకులు అతని వద్ద కూర్చొని వుండగా అతడు అనుకోకుండా విలపించడం మొదలు పెట్టెను. మక్కా నాయకులు ఆశ్చర్యపడి నీవెందుకు ఏడ్చుచున్నావని అతన్ని ప్రశ్నించిరి. వలీద్ ఇట్లనెను. నేను మరణముతో భయపడుచున్నానని మీరూహించుచున్నారా? అల్లాహ్ ప్రమాణముగా కానేకాదు. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మము వ్యాపించి తుదకు మక్కా కూడ అతని అధీనములోకి వెళ్ళి పోతుందేమోనని నేను బాధపడుచున్నాను. అబూసుఫ్యాన్ అతన్ని ఇట్లు ఓదార్చెను. నీవు బాధ పడకు! మేము ప్రాణముతో వున్నంత వరకు అలా జరగదని మేము నీతో వాగ్దానము చేయుచున్నాము. మక్కా వారి దౌర్జన్యములో ఏర్పడిన విరామము తాత్కాలికమేనని ఈ సంఘటనలు స్పష్టము చేయును. మరల జాతిని ప్రేరేపించడం మొదలయ్యెను. చావుబతుకుల్లో మృత్యువుతో పోరాడుతున్న నాయకులు కూడ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు వ్యతిరేకంగా ప్రమాణములు చేయుచుండిరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు విరుద్ధంగా యుద్ధము చేయుటకు మదీనా వాసులను ప్రోత్సహించడం జరుగుచుండెను. వారి నిరాకరణపై ఇట్లు బెదిరింపులు అందుచుండెను. మక్కా వారు, వారి మిత్రపక్ష తెగలు సైన్యముతో మదీనా పై దాడి చేయుచు మదీనా పురుషులను హతమార్చి స్త్రీలను బానిసలుగా చేసికొందురు.



## ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా రక్షణాత్మక చర్యలు

ఈ పరిస్థితులలో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో మౌనంగా వుండి మదీనా రక్షణ ఏర్పాటు నిశ్చయంగా చేయకుండినచో వారి పై ఒక పెద్ద బాధ్యత భారము పడేది. మక్కా వారి కార్యకలాపాలు తెలుసుకొనుటకు చిన్న చిన్న బృందాల రూపంలో తన అనుచరులను మక్కా చుట్టు పంపడం వారు ప్రారంభించిరి. కొన్ని సందర్భాలలో వీరు మక్కా బృందాలతో లేదా మక్కా వారి సైన్యముతో ఎదురుపడేవారు. ఒకరి నొకరు చూచిన తర్వాత వారి మధ్య ఘర్షణ కూడ ఏర్పడేది. ఇది ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా యుద్ధమును ప్రేరేపించే చర్య అని పాశ్చాత్య రచయితలు పేర్కొనిరి. మక్కాలో 13 సంవత్సరములు ముస్లిములను హింసించబడెను. మదీనా వారిని ముస్లిములపై యుద్ధమునకు ఉసిగొల్పబడెను. మదీనాపై దాడి చేయుదుమని బెదిరించబడెను. ఇన్ని సంఘటనలు జరిగిన తర్వాత సమాచార సేకరణ కొరకు బృందాలను పంపుట యుద్ధమునకు ప్రేరేపించడమా ? మక్కాలో 13 సంవత్సరముల హింసల తర్వాత ముస్లిములు, మక్కా వారి మధ్య యుద్ధము జరుగుటకు మరో కారణం అవసరమని ప్రపంచములోని ఏ చట్టము సూచించును? నేడు పశ్చిమ దేశములు తమను తాము పెద్ద సభ్యత గలవిగా భావించుచున్నవి. మక్కాలో సంభవించిన సంఘటనలలోని సగ భాగము ఎదుర్కొని యుద్ధము చేయు జాతిని ఎవడేని నేరము చేసినదని అనగలడా? ఒక సంఘమును హతమార్చుటకు గాని, దేశ బహిష్కరించుటకు గాని ఏదైనా ప్రభుత్వము ఇతర దేశ ప్రజలను బలవంతము చేసినచో ఆ సంఘమునకు దానితో యుద్ధము ప్రకటించే హక్కు లేదా? మదీనాలో ముస్లిం ప్రభుత్వము ఏర్పడిన తర్వాత మరో కారణమవసరము లేకుండెను. మక్కాలో జరిగిన

సంఘటనలే మక్కా వారితో యుద్ధము చేయుటకు సంపూర్ణ హక్కు ముస్లిములకు కల్పించెను. కాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అలా చేయలేదు. వారు (స) సహనం పాటించిరి. కేవలం శత్రువుల కదలికలను తెలుసుకొనుటకు తమ ప్రయత్నాలను పరిమితం చేసిరి. కాని మక్కా వాసులు మదీనాలోని అరబ్బులను ముస్లిములకు వ్యతిరేకంగా ప్రేరేపించిరి. హజ్ ప్రార్థన నుండి ముస్లిములను అడ్డుకొనిరి. సీరియాకు వెళ్లే వారి వ్యాపార బృందాలు తమ సరియైన మార్గమును వదిలి, మదీనా సమీపములోని జాతుల నుండి వెళ్లుచూ వారిని మదీనా వారికి విరుద్ధముగా పురిగొల్పుట మొదలు పెట్టిరి. మక్కా వారు 14 స॥ల నుండి వరుసగా వారు విసురుతున్న ఈ యుద్ధ ఛ్యాలెంజ్‌ను మదీనా రక్షణ కొరకు స్వీకరించుట ముస్లిములకు అనివార్యమయ్యెను. కావున ఈ ఛ్యాలెంజ్‌ను స్వీకరించినందుకు విమర్శించే హక్కు ప్రపంచములోని ఎవరికి లేదు.

## మదీనాలో ఇస్లాం ప్రభుత్వ స్థాపన

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బయటి పరిస్థితులను గమనించుచూనే మదీనా సంస్కరణను కూడ వారు విస్మరించలేదు. మదీనాలో నున్న అన్యారాధకులు చాలా వరకు హృదయపూర్వకంగా, కొందరు దాంబికులుగా ఇస్లాంలో ప్రవేశించిరనే విషయము ఇంతకు ముందే తెలుపనైనది. అందుకే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లాం ప్రభుత్వ పద్ధతిని వారిలో ఏర్పాటు చేయుట ప్రారంభించిరి. గతములో అరబ్ సంప్రదాయం ప్రకారము జగడములతో తమ హక్కులను నిర్ణయించుకొనేవారు. కాని ఇప్పుడు అధికారికంగా న్యాయమూర్తులు నియమించబడిరి. వారి తీర్పు తర్వాతనే ఎవరైనా తమ హక్కులు పొందవచ్చును. ఇంతకు ముందు విద్యాభ్యాసంలో మదీనా వాసులకు



ఆసక్తి లేకుండెను. కాని ఇప్పుడు చదువుకున్న వారు నిరక్షరాస్యులను చదివించే ఏర్పాట్లు చేయబడినవి. దౌర్జన్యము, ఆధిపత్యము, అన్యాయము ను అరికట్టనైనది. స్త్రీల హక్కులు రూపొందింబడెను. శాసనము ప్రకారము ధనవంతులపై పన్నులు విధించబడినవి. వాటిని బీదలకు, నగర సాధారణ అభివృద్ధి కొరకు వినియోగించే వారు. కార్మికుల హక్కులకు రక్షణ కల్పించబడెను. అనాథల విద్యాభ్యాసం కొరకు అధికారికంగా ఏర్పాటు జరిగెను. ఆర్థిక లావాదేవీలలో ఒప్పంద పత్రములు వ్రాసుకొనుట తప్పనిసరి చేయబడెను. బానిసలను హింసించుటను గట్టిగా నిరోధించబడెను. పారిశుధ్యం, ఆరోగ్య రక్షణ నియమముపై ప్రత్యేక శ్రద్ధ వహించనైనది. జనాభా లెక్క ప్రారంభించబడెను. వీధులను, రహదారులను విశాలం చేయు ఆజ్ఞలు వెలువడెను. రహదారులను శుభ్రం చేసే ఆదేశాలు జారీచేయబడెను. ఈ విధంగా వ్యక్తిగత, సామాజిక జీవితమునకు అన్ని చట్టములు రూపొందించబడెను. వాటిని సక్రమంగా పాటించుటకు తగిన సూచనలు చేయబడెను. అరబ్బులు మొదటి సారి క్రమ శిక్షణ, గౌరవనీయ సమాజ నిబంధనలను చూచిరి.

ఆ కాలములోనే కాదు ప్రపంచములోని ఇతర జాతులన్నిటికి శాశ్వతముగా ప్రయోజనం కల్గించే, గౌరవము, శాంతి, ప్రగతి సాధించే చట్టమును రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఒక వైపు రూపొందించుచుండిరి. మరోవైపు మక్కా వాసులు ఇస్లాంకు వ్యతిరేకంగా యుద్ధ సన్నాహాలలో అధికారికంగా తలమునకలై వుండిరి. దీని ఫలితంగా బద్ర్ యుద్ధము సంభవించెను.

## ఖురైష్ వ్యాపార బృందము రాక - బద్ర్ యుద్ధము

*(ఇబ్నె హష్షామ్ సంపుటి 2: పుట 9, అస్సీరతుల్ హల్బియ్యహ్, తారీఖె కామిల్ తిబ్రి ఘజ్వ బదర్)*

ప్రస్థానమునకు 13వ మాసములో అబూసుఫ్యాన్ నాయకత్వము లో ఒక వ్యాపార బృందము సీరియా నుండి వచ్చుచుండెను. దీని రక్షణ సాకుగా మక్కా వారు ఒక శక్తివంతమైన సైన్యమును మదీనా వైపు తీసుకెళ్లుటకు నిర్ణయించిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు కూడ ఈ విషయము తెలిసెను. శత్రువుకు అతని ఆయుధముతోనే సమాధానమిచ్చే సమయము ఆసన్నమైనదని అల్లాహ్ సువార్తవాణి కూడ వారికి అందెను. అందుకే మదీనాకు చెందిన పలు సహచరులను వెంట బెట్టుకొని వారు బయలు దేరిరి. వారు మదీనా నుండి వెళ్లినప్పుడు పోటీ బృందముతోనా లేక అసలు సైన్యముతో ఏర్పడునా అను విషయము స్పష్టము కాలేదు. అందుకే 300 మంది వారితో మదీనా నుండి బయలు దేరిరి.

బృందమనగా ధనముతో నిండిన ఒంటెలు మాత్రమేనని భావించకూడదు. మక్కా వారు ఆ బృందాల వెంట ఒక బలమైన సైన్యమును పంపేవారు. ఎందుకనగా ఈ బృందాల ద్వార ముస్లిములను భయాందోళనకు గురి చేయడం కూడ వారి ఉద్దేశముండెడిది. ఈ బృందము కంటే ముందు రెండు బృందాల చర్చ చరిత్రలో గలదు. వాటిలో ఒక దాని వెంట 200 మంది సైనికులుండగా రెండవ బృందం వెంట 300 మంది సైనికులుండిరి. ఇటువంటి పరిస్థితులలో మక్కా వారి నిరాయుధ బృందమును దోచుకొనుటకు 300 మందిని వారు (స) వెంట తీసుకెళ్లినారని క్రైస్తవ రచయితలు ఆరోపించుట కుట్రలో భాగమే. ఈ బృందము చాలా పెద్దదై యుండెను. కావున గత బృందముల రక్షణ సైన్యము సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే దీని వెంట 4 నుండి 5 వందల మంది సైనికులు తప్పక ఉండవచ్చును. ఇంత పెద్ద రక్షణ సైన్యమును ఎదురించుటకు నిరాయుధులైన మూడు వందల ముస్లిం



బృందము బయలు దేరుటను దోపిడిగా వర్ణించుట కేవలం అసూయ, మొండితనము, అన్యాయమనబడును. ఈ బృందముతోనే ఘర్షణ మొదలైనను దానిని యుద్ధమనే భావించవచ్చును. ఆ యుద్ధము కూడ రక్షణాత్మకమైనది. మదీనా బృందము చాలా బలహీనముగా నుండెను. ఎందుకనగా మదీనా చుట్టుప్రక్కల గల జాతులను మక్కా బృందాలు రెచ్చగొడుతున్నందున ఆ కుట్రను భగ్నంచేయు ఉద్ధేశముతోనే వీరు బయలుదేరిరి. కాని బృందముతో కాక అసలు సైన్యముతో యుద్ధము జరిగే అవకాశముందని ఇదే దైవ అభీష్టమని పవిత్ర ఖురాన్ ద్వారా స్పష్టమగును. ముస్లిముల త్యాగ స్ఫూర్తి, విశ్వాసమును బహిర్గతపర్చుటకే ఈ విషయము ముందే తెలుపబడలేదు. ముస్లిములు అసంపూర్తి ఏర్పాట్లతో మదీనా నుండి బయలుదేరిరి. కొంత దూరం పోయిన తర్వాత మక్కా వారి అసలు సైన్యముతోనే పోటీ పడాలని అల్లాహ్ ఆశయమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులకు తెలిపిరి. మక్కా నుండి వచ్చిన వార్తల ప్రకారము వారి సైన్యములో వెయ్యి మంది కంటే ఎక్కువే వున్నారని స్పష్టమైనది. వారందరు అనుభవము గల సైనికులు. కాని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట వచ్చిన 313 మంది అనుచరులు యుండిరి. వారిలో అనేకులు యుద్ధ నైపుణ్యరహితులే. తగిన యుద్ధ సామాగ్రి కూడ వారి వద్ద లేకుండెను. అనేకులు పాదచారులు లేదా ఒంటెల పై వచ్చిరి. అశ్వము ఒక్కటే వుండెను. నిరాయుధులైన ఒక చిన్న బృందము తన కంటే మూడు రెట్లు అధికమున్న అనుభవజ్ఞులైన సైన్యమును ఎదురించుట చాలా ప్రమాదకరమైన విషయము. అందుకే ఏ ఒక్కరిని కూడ యుద్ధములో పాల్గొనుటకు బలవంతము చేయరాదని వారు భావించిరి. ఇప్పుడు బృందముతో కాదు అసలైన సైన్యముతోనే యుద్ధము చేయబడునని తమ అభిప్రాయము తెలుపవలెనని వారు

అనుచరులకు సూచించిరి. స్పందనగా ప్రస్థానము చేసినవారు ఒక్కొక్కరు నిలిచి ఓ రసూలుల్లాహ్! శత్రువు యుద్ధము కొరకు మా ఇంటిపై దాడి చేయుచున్నప్పుడు మేము అతనితో భయపడము. అతన్ని ఎదురించుటకు మేము సిద్ధమేనని చెప్పిరి. ప్రతి ఒక్కరి సమాధానము వినినను నాకు సలహా ఇవ్వగలరని వారు కోరుచుండిరి. అన్సార్ ఇప్పటి వరకు నిశ్శబ్దముగా వుండిరి. ఎందుకనగా దాడికి దిగుచున్న సైన్యములో ముహాజిర్ల బంధువులుండిరి. వారి మాటల వలన ముహాజిర్లకు బాధ కలుగునని వారు భయపడుచుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పదే పదే అభిప్రాయము కోరడంతో ఒక అన్సార్ నాయకుడు నిలబడి ఇట్లు వేడుకొనెను. ఓ రసూలుల్లాహ్! అభిప్రాయము మీకు ఇవ్వబడుచున్నది. అయినను మీరు పదే పదే అభిప్రాయము అడుగుచున్నారు. మదీనా వాసులమైన మా అభిప్రాయము తెలుసుకొనుట మీ ఉద్ధేశము కావచ్చు. అందుకు అవునని వారనిరి. ఆ నాయకుడు బదులుగా ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! మీరు మదీనా రాకముందు మీకు, మాకు జరిగిన ఒప్పందము మీ దృష్టిలో వుండవచ్చును. ఆ ఒప్పందము ప్రకారము మదీనాలో మీ పై లేదా ముహాజిర్లపై దాడి జరిగినచో మేము మీకు రక్షణ కల్పించాలనే నిబంధన వుండెను. కాని ఇప్పుడు మీరు మదీనా నుండి బయటికి వచ్చిరి. కావున ఆ ఒప్పందము ఇక్కడ చెల్లదేమో. ఓ రసూలుల్లాహ్! ఆ ఒప్పందము కుదిరినప్పుడు మాకు మీ గొప్పతనము సంపూర్ణముగా తెలియదు. కాని ఇప్పుడు మీ స్థాయి, వైభవం పూర్తిగా మాకు తెలిసినది. ఓ రసూలుల్లాహ్! ఇప్పుడు ఆ ఒప్పందముతో పనిలేదు. మేము మూసా సహచరుల వలె اِذْهَبْ اَنْتَ وَرَبُّكَ فَقَاتِلَا اِنَّا هٰهُنَا قَاعِدُوْنَ అనగా నీవు నీ దేవుడు వెళ్ళి శత్రువులతో యుద్ధము చేయుము! మేము ఇచ్చటనే కూర్చొని వుందుమని అనము. మేము మీకు కుడి వైపు, ఎడమ



వైపు, ముందూ, వెనకా కూడ యుద్ధము చేయుదుము. ఓ రసూలుల్లాహ్! మీకు నష్టము కలిగించుటకు వచ్చిన శత్రువు (మా) శవాలను దాటనిదే మీ వద్దకు చేరుకోలేడు. ఓ రసూలుల్లాహ్! యుద్ధము ఒక సాధారణ విషయము. ఇక్కడికి సమీపములోనే సముద్రము గలదు. మీరు ఆదేశించినచో వెంటనే మా అశ్వములను ఆ సముద్రములో నిస్సంకోచంగా వదిలెదము. *(ఇబ్నె హష్షామ్ సంపుటి 2, పుట 12)* ఇటువంటి గొప్ప త్యాగ, సమర్పణ ఉదాహరణ గతించిన ఏ సందేశహరుడు చూపలేడు. మూసా అనుచరుల సామెతను వారే ఉదహరించిరి. శత్రువును ఎదుర్కొనుటలో హజ్రత్ మసీహ్ అనుచరులు చూపిన ఉదాహరణకు బైబిలే సాక్ష్యము. ఒకడు కొన్ని రూపాయలకే తన గురువును విక్రయించెను. రెండవ వ్యక్తి అతనికి శాపమిచ్చెను. మిగతా 10 మంది వారిని వదిలి అటు ఇటు పారిపోయిరి. కాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు కేవలం సంవత్సరమున్నర తోడుండి విశ్వాసములో ఎంతో గట్టిపడి, వారు (స) ఆదేశించినచో సముద్రములో దూకుటకు కూడ వారు సంసిద్ధమైరి.

విశ్వాసములో బలహీనులుగా నున్న వారికి తిరిగి పోవు అనుమతి ఇచ్చుటకే ఈ అభిప్రాయము సేకరించనైనది. కాని ముహాజిర్లు, అన్సార్లు ఇరువురు ఒకరిని మించి మరొకరు త్యాగ, విశ్వాస ఉదాహరణను ప్రదర్శించిరి. వారు దైవ వాగ్దానముల మేరకు తన కంటే మూడు రెట్లు అధికముగానున్న శత్రువుతో యుద్ధ సామాగ్రి అతి కొద్దిగానున్నను సిగ్గు విడిచి వీపులు చూపము. అల్లాహ్ ధర్మ అభిమానమును ప్రదర్శించుచూ ధైర్యముతో యుద్ధములో పాల్గొని ప్రాణాలర్పించెదమని రెండు వర్గాలు ముందుకొచ్చెను. అప్పుడు వారు (స) ముందుకు వెళ్లిరి. వారు **బదర్** అను ప్రాంతము చేరుకొని ఒక అనుచరుని సలహా మేరకు శత్రువునకు

సమీపములో బదర్ అను సరస్సు వద్ద బస ఏర్పాటు చేసిరి. ఈ విధంగా నీటిని వశపర్చుకొనిరి. కాని ఆ ప్రాంతము ఇసుకతో కూడినదై వున్నందున యుద్ధమునకు అనుకూలము కాదని అనుచరులు భయపడిరి. అందుకే రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం రాత్రంతా ప్రార్ధనలు చేయుచు అల్లాహ్‌ను ఇట్లు వేడుకొనిరి. ఓ నా పోషకుడా! విశ్వంలో వీరు మాత్రమే నిన్ను ఆరాధించువారున్నారు. ఓ నా పోషకుడా! ఈ యుద్ధములో వీరు మరణించినచో లోకంలో నీ నామమును స్మరించు వారెవరుందురు. *(జర్ఖాని సంపుటి 1, పుట 419, ఇబ్నె హష్షామ్ సంపుటి 2. పుట 17)* అల్లాహ్ వారి ప్రార్ధనలను స్వీకరించెను. రాత్రికి వర్షము పడెను. ఫలితముగా ముస్లిముల భూభాగము ఇసుకమయమైనందున గట్టిగా మారెను. కాని అవిశ్వాసుల భూభాగము రేగడి మట్టి అయినందున బురదమయమై జారుడు మొదలయ్యెను. మక్కా అవిశ్వాసులు వాస్తవానికి ముస్లిముల కంటే ముందే ఆ ప్రాంతానికి చేరుకొనిరి. గట్టి మట్టి అయినందున యుద్ధ సమయములో లాభదాయకమగునని వారు ఆ ప్రాంతమును ఎన్నుకొనిరి. ముందున్న ప్రాంతము ఇసుక గలదైనందున ముస్లిములు అచట బసచేయుదురని ఫలితముగా యుద్ధ సమయంలో వారి పాదాలు దిగబడి వేగంగా కదలలేరని వదిలిరి. కాని దేవుడు రాత్రికి రాత్రి పరిస్థితిని తారుమారు చేసెను. ఇసుక మైదానము గట్టిగా, గట్టి మైదానము జారుడు మట్టిగా మారిపోయెను. ఫలానా ఫలానా మీ శత్రువులు ఫలానా ఫలానా చోట హతమగుదురని అల్లాహ్ రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు రాత్రి శుభవార్తనందించెను. యుద్ధములో అటులనే జరిగెను. వారు సూచించిన చోటనే శత్రువులు హతమైరి. సైన్యము ఎదురెదురుగా నిలబడినప్పుడు అనుచరులు (రజి) ప్రదర్శించిన త్యాగమును వివరించుటకు ఈ క్రింది సంఘటన ఒక గొప్ప ఉదాహరణగా



నిలిచెను.

ముస్లిముల బృందములో కొద్ది మంది అనుభవజ్ఞులైన సైన్యాధికారులు వుండిరి. మక్కా నాయకులలోని హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) వారిలో ఒకరు. వారిట్లు తెలిపిరి. నేడు నా పై అత్యధిక భారం వుందని నేను భావించి నేను నా కుడి, ఎడమల వైపు చూచితిని. అయితే మదీనాకు చెందిన ఇద్దరు నవయువకులు నా కుడి, ఎడమ వుండిరి. అప్పుడు నేను ధైర్యము కోల్పోయితిని. ఎందుకనగా వీర సైనికుడు యుద్ధము చేయుటకు అతనికి కుడి, ఎడమలో బలమైన రక్షణ యున్నప్పుడే అతడు నిస్సంకోచంగా శత్రువులను చీల్చుచూ ముందుకు వెళ్ళగలడు. కాని నా చుట్టు మదీనాకు చెందిన ఇద్దరు అనుభవం లేని యువకులుండిరి. నేడు ఏ విధంగా నేను ధైర్యముతో పోరాడగలనని ఊహించితిని. ఈ ఆలోచనలో వుండగానే నా ప్రక్కనున్న ఒక యువకుడు నా భుజము తట్టెను. నేనతని వైపు శ్రద్ధ వహించితిని. అతడు నా చెవిలో ఇట్లనెను. ఓ చిన్నాన! రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను అబూజహ్ల్ అను వ్యక్తి చాలా హింసించే వాడని మేము వింటిమి. ఓ చిన్నాన! అతన్ని ఎదురించాలని నేను తాపత్రయ పడుచున్నాను. అతను ఎక్కడున్నాడో మీరు నాకు చూపుము. అతనికి సమాధానము ఇవ్వక ముందే నాకు రెండవ ప్రక్క నున్న యువకుడు నా భుజము తట్టెను. ఇంతకు ముందు యువకుడు సంధించిన ప్రశ్నే అతడు చిన్నగా ప్రశ్నించెను. వారి ఈ సాహసమును చూసి నేను ఆశ్చర్యపోయితిని. ఎందుకనగా నేను అనుభవజ్ఞుడైన సైనికున్ని అయినను సైనిక నాయకునిపై ఒంటరిగా దాడి చేయు ఆలోచన చేయలేను. వారి ప్రశ్నకు బదులుగా నా వ్రేలు లేపి అదిగో నగ్న ఖడ్గములు పట్టుకొన్న ఇద్దరు అనుభవజ్ఞులైన సైనికుల రక్షణలో, శత్రువుల వరుసల వెనుక తల నుండి పాదము వరకు

ఆయుధాలు ధరించిన వ్యక్తియే అబూజహ్‌ల్ అని చెప్పితిని. ఇంకా నా వ్రేలు కిందికి చేరకముందే ఆ ఇద్దరు యువకులు రాజపక్షి వలె శత్రువుల వరుసలను చీల్చుచూ గట్టిగా అరుస్తూ ఒక్కసారిగా దాడికి పరుగెత్తిరి. ఈ హటాత్పరిణామము వలన ఏ ఒక్కడు కూడ వారిపై ఖడ్గము లేపలేదు. వారు బాణ వేగముతో అబూజహ్‌ల్ వద్దకు చేరుకొనిరి. అతని అంగ రక్షకులు వారి పై దాడి చేసిరి. ఒకని దాడి వృధా కాగ మరొకని దాడి వలన ఒక యువకుని చేయి తెగిపోయెను. కాని ఇద్దరు సంకోచించకుండా అబూజహ్‌ల్‌పై మాత్రమే దృష్టి పెట్టిరి. అతనిపై వీరోచితంగా దాడి చేయడంతో అతను భూమిపై పడిపోయెను. తర్వాత అతన్ని విపరీతంగా వారు గాయపర్చిరి. కాని ఖడ్గ నైపుణ్యం తెలియక అతన్ని హతమార్చలేక పోయిరి.

మక్కా వాసులు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను హింసించిన సంఘటనలు సమీపము నుండి చూసిన వారికి ఎంత క్రూరంగా కనిపించినవో ఈ సంఘటన ద్వారా అర్ధమగును. ఇప్పటికి చరిత్ర పుటలలో ఆ దౌర్జన్యమును చదివినచో ఒక సభ్యతగల వ్యక్తి హృదయము తప్పక చలించును. కాని మదీనా వాసులు ఈ దౌర్జన్యమును, ప్రత్యక్షంగా చూసిన వారి నోట వినియుండిరి. ఒక వైపు వారు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్రత, శాంతియుత జీవితమును గమనించుచుండగా మరో వైపు మక్కా వాసుల మానవత్వంను కబలించే దౌర్జన్యపు సంఘటనలను విని బాధాతప్త హృదయముతో ఇట్లు భావించేవారు. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సయోధ్యాత్మక మనస్తత్వం, శాంతియుత భావము వలన వారికి తిరిగి సమాధానము చెప్పలేదు. వారు మాకు ఎదురుపడినచో మేమిట్లు సమాధానము చెప్పెదము. వారి హింసలకు ఎదురు దాడి చేయక



పోవడానికి కారణం ముస్లిముల బలహీనత కాదు. ముస్లిములకు అల్లాహ్ ఇంకా అనుమతి ఇవ్వనందుకే వారు బదులివ్వలేదు. ముస్లిముల హృదయ స్థితిని తెలుపు మరో సంఘటన ఇట్లు గలదు. యుద్ధము ప్రారంభము కాకముందు ముస్లిముల సంఖ్య తెలుసుకొనుటకు అబూజహ్‌ల్ ఒక గ్రామీణ నాయకున్ని పంపెను. అతడు తిరిగి వెళ్లి ముస్లిముల సంఖ్య 300 నుండి 325 వరకు వుండవచ్చునని తెలిపెను. అప్పుడు అబూజహ్‌ల్ అతని సహచరులు సంతోషించి ఇప్పుడు ముస్లిములు మమ్ములను తప్పించుకొని ఎక్కడికి పోగలరని అనెను. ఇది చూచి ఆ వ్యక్తి ఇట్లు హెచ్చరించెను. 'ఓ మక్కా ప్రజలారా! మీరు వారితో యుద్ధము చేయకపోవడమే మంచిదని నేను హితబోధ చేయుచున్నాను. ఎందుకనగా ముస్లిములను నేను చూసిన తర్వాత ఒంటెలపై మనుషులు కాదు శవములు వున్నట్లు నేను ప్రభావితమైతిని. అనగా వారిలో ప్రతి ఒక్కడు మరణించుటకే వచ్చెను. బ్రతికి పోవుటకు కాదు. మరణమును సులభము చేసుకొని, మరణించుటకు సిద్ధమైన వ్యక్తితో పోరాడుట సాధారణ విషయము కాదు.'

## ఒక గొప్ప భవిష్యవాణి పూర్తగుట

యుద్ధము మొదలగు సమయము వచ్చెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కూర్చొని ప్రార్థన చేయుచున్న గుడారము నుండి బయటికి వచ్చి ఇట్లు ప్రకటించిరి. سَيُهْزَمُ الْجَمْعُ وَيُوَلُّوْنَ الدُّبُرَ అనగా శత్రువుల సైన్యము ఓటమితో మైదానము విడిచి పారిపోవును. మక్కాలోనే ఈ యుద్ధము గురించి ఉపదిష్టమైన పవిత్ర ఖురాన్‌లోని పదాలనే వారు ఇక్కడ ప్రస్తావించిరి. మక్కాలో అవిశ్వాసుల దౌర్జన్యములకు ముస్లిములు గురగుచు అటు ఇటు ప్రస్థానము చేయుచున్నప్పుడు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంపై పవిత్ర ఖురాన్ ఈ సూక్తులను అల్లాహ్

అవతరింపజేసెను.

وَلَقَدْ جَآءَ اٰلَ فِرْعَوْنَ النُّذُرُ ० كَذَّبُوْا بِاٰيٰتِنَا كُلِّهَا فَاَخَذْنٰهُمْ اَخْذَ عَزِيْزٍ
مُّقْتَدِرٍ ० اَكُفَّارُكُمْ خَيْرٌ مِّنْ اُولٰٓئِكُمْ اَمْ لَكُمْ بَرَآءَةٌ فِى الزُّبُرِ ० اَمْ يَقُوْلُوْنَ
نَحْنُ جَمِيْعٌ مُّنْتَصِرٌ ० سَيُهْزَمُ الْجَمْعُ وَيُوَلُّوْنَ الدُّبُرَ ० بَلِ السَّاعَةُ مَوْعِدُ
هُمْ وَالسَّاعَةُ اَدْهٰى وَاَمَرُّ ० اِنَّ الْمُجْرِمِيْنَ فِىْ ضَلٰلٍ وَّسُعُرٍ ० يَوْمَ يُسْحَبُوْنَ
فِى النَّارِ عَلٰى وُجُوْهِهِمْ ذُوْقُوْا مَسَّ سَقَرَ ० (القمر:۴۱تا۴۸)

**అనువాదము:** ఓ మక్కా వాసులారా ! ఫిర్‌ఔన్ సంతతి వద్దకు కూడ భయపెట్టు వారు వచ్చిరి. కాని వారు మా మొత్తం సంకేతములను నిరాకరించిరి. కనుక మేము వారిని శక్తిమంతుడు, సర్వాధికారి పట్టుకొనునట్లు పట్టుకుంటిమి. (ఓ మక్కా జనులారా !) మీ కాలపు అవిశ్వాసులు వారి కంటే ఉత్తములా? లేదా మీ కొరకు గ్రంథములలో ఏదేని భద్రత వాగ్దానము గలదా? మేము గొప్ప శక్తిమంతులమని, మేము శత్రువుల చేతిలో ఓటమి ఎరుగమని, ప్రతీకారము తీసుకొను పక్షము మాది అని వారందురు. (వారిట్లు మాట్లాడుకొనుచుండిరి). సమీపములో ఈ అసంఖ్యాక గుంపులు ఏకమగును, అపజయమునకు గురి అగుదురు. వారు వీపులు త్రిప్పి పోవడమే గాక, వారి నాశనపు ఘడియ వాగ్దానము అల్లాహ్ వైపు నుండి చేయబడెను. ఆ నాశనపు ఘడియ చాలా అపాయకరముగా, చాలా చేదుగా వుండును. నిశ్చయముగా ఆ రోజు నేర చరితులు చింతాక్రాంతులై, బాధలో చిక్కుకొని యుందురు. వారిని ముఖములపై లాగి అగ్ని గుండములలో పడవేయబడును. నరకపు రుచి చూడుడు అని చెప్పబడును.



ఈ సూక్తులు 'ఖమర్' అధ్యాయములోనివి. అన్ని ఇస్లామి కథనముల ప్రకారము ఈ 'ఖమర్' అధ్యాయము మక్కాలోనే అవతరించెను. ప్రవక్తృత్వ ప్రకటన తర్వాత 5వ సం॥ నుండి 10వ సం॥ వరకు ఈ అధ్యాయము అవతరించినదని ముస్లిం పండితులు కూడ అభిప్రాయ పడిరి. అనగా ప్రస్థానమునకు కనీసం మూడు సం॥ల క్రితమే లేదా బహుశ 8 సం॥ల ముందు అవతరించెనని ఐరోపా పరిశోధకులు కూడా దీనిని ధ్రువీకరించిరి. ఈ అధ్యాయము ప్రవక్తృత్వ 5 సం॥ల తర్వాతదని నోల్డెకె తెలిపెను. నా దృష్టిలో ఈ అధ్యాయ అవతరణ సమయం కొంత ముందేనని రివ్‌రన్డ్ వేరి అభిప్రాయపడెను. వారి అంచనా మేరకు ప్రస్థానమునకు ముందు 6వ లేదా 7వ సం॥లో ఇది అవతరించెను. అనగా వారి దృష్టిలో ఈ అధ్యాయము ప్రవక్తృత్వ ప్రకటన తర్వాత 6వ, 7వ సం॥కు చెందినది. ఏదేమైనా ముస్లిముల శత్రువులు కూడ ప్రస్థానమునకు అనేక సం॥ల ముందేనని నిర్ణయించిరి. ఆ కాలములో ఎంత స్పష్టముగా యుద్ధ వార్త అందించబడెను. తిరస్కృతుల అంతము తెలుపబడి యుండెను. బదర్ యుద్ధము ప్రారంభము కాకముందే ఈ సూక్తులను చదివి దైవ వాగ్దానము పూర్తి కాబోవు సమయం వచ్చెనని ముస్లిములకు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం గుర్తు చేసిరి.

యసయా సందేశహరుడు ముందే తెలిపిన సమయము ఆసన్నమయ్యెను. పవిత్ర ఖురాన్ కూడ మరోసారి యుద్ధ ఆరంభానికి 6-8 సం॥ల ముందే ఈ వార్త అందించెను. ముస్లిములు యుద్ధమును ఇష్టపడకున్నను, అవిశ్వాసులలో కూడ కొందరు సోదరులు యుద్ధము చేయకూడదనే సలహా ఇచ్చినను పరిస్థితుల ప్రభావము వలన యుద్ధము సంభవించెను. ఒక వెయ్యి కంటే అధికమైన అనుభవజ్ఞులైన అవిశ్వాస యుద్ధ నిపుణుల ముందు 313 అనుభవరహితులైన ముస్లిములు యుద్ధ

ఆయుధాలు లేకుండానే పోటీకి సిద్ధమైరి. యుద్ధము జరిగిన కొద్ది గంటలలోనే అరబ్ కు చెందిన పెద్ద పెద్ద నాయకులు హతమైరి. యసయా భవిష్యవాణి ప్రకారము ఖీదార్ ఆధిపత్యము తొలగిపోయెను. కొన్ని శవాలను, కొందరు ఖైదీలను విడిచి మక్కా సైన్యం వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయెను. ఎల్లప్పుడు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు సహకరించే వారి చిన్నాన అబ్బాస్ (రజి) కూడ బంధించబడిన ఖైదీలలో వుండిరి. వారిని బలవంతముతో మక్కావారు యుద్ధము కొరకు తమ వెంట తీసుకొచ్చి యుండిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పెద్ద కూతురి భర్త అబుల్ ఆస్ కూడ ఖైదీలలో వుండిరి. హతమైనవారిలో మక్కా సేనాపతి, ఇస్లాం అతి పెద్ద శత్రువు అబూజహ్ల్ కూడ వుండెను.

## బద్ర్ ఖైదీలు

ఈ విజయముతో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆనందపడుచుండిరి. ఎందుకనగా వరుసగా 14 సం॥ల నుండి వారి ద్వారా ప్రచారము చేయబడుచున్న భవిష్యవాణీలు, గత ప్రవక్తలు ఈ రోజు గురించి చేసిన భవిష్యవాణీలు కూడ కార్య రూపం దాల్చినవి. కాని మక్కా వ్యతిరేకుల భయంకర అంతము కూడ వారి ముందుండెను. వారి స్థానములో మరొకరుండినచో ఆనందముతో ఎగిరి గంతులు వేసేవారు. కాని మక్కా ఖైదీలు తాళ్ళతో బంధించబడి వారి ముందు వెళ్లుచున్నప్పుడు వారు, వారి విశ్వాసపాత్రులైన మిత్రుడు అబూబకర్ (రజి) కన్నీరు పెడుచుండిరి. తర్వాత ద్వితీయ ఖలీఫా అయిన హజ్రత్ ఉమర్ (రజి) వారికెదురుగా వచ్చిరి. ఈ విజయానంద సమయములో మీరెందుకు దు:ఖించుచున్నారని ఆశ్చర్యపడి ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! మీ దు:ఖమునకు కారణము నాకు కూడ తెలుపుము. నాకు కూడ ఆ



విషయము అర్థమైనచో నేను కూడా ఏడ్చెదను. లేనిచో కనీసము మీతో కలిసి ఏడ్పు ముఖము పెట్టెదను. అల్లాహ్ అవిధేయత వలన ఈ రోజు మక్కా వారి దుస్థితి నీవు చూడడం లేదా అని వారనిరి.

వారి న్యాయ, న్యాయ పద్ధతి వార్త యసయా సందేశహరుడు పదే పదే తన భవిష్యవాణీలలో ఇచ్చి యున్నారు. ఈ సమయమున ఒక మధురమైన సాక్ష్యము లభించెను. అదేమనగా మదీనాకు తిరిగి వచ్చుచుండగా రాత్రి వారు నిద్రకు ఉపక్రమించిరి. వారికి నిద్ర పట్టడం లేదని అనుచరులు (రజి) గమనించిరి. వారు తర్జన బర్జన తర్వాత వారి చిన్నాన అబ్బాస్ (రజి) తాళ్ళతో బంధించబడినందున వారి బాధాతప్త శబ్దము వారికి వినిపించుచున్నందుకే వారికి నిద్ర పట్టడం లేదని తేల్చుకొనిరి. కనుక వారు పరస్పరం మాట్లాడుకొని హజ్రత్ అబ్బాస్ (రజి) బంధనములను వదులు చేసిరి. హజ్రత్ అబ్బాస్ (రజి) నిద్రపోయిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు కూడ నిద్ర పట్టెను. కొద్ది సమయము తర్వాత ఒకేసారి భయపడుచు వారు నిద్ర లేచిరి. అబ్బాస్ (రజి) ఎందుకు మౌనం వహించిరని వారి బాధాకర శబ్దము ఎందుకు రావడం లేదని అడిగిరి. అధిక బాధ వలన వారు స్పృహ కోల్పోయినారని వారి ఊహ. ఓ రసూలుల్లాహ్! మేము మీ బాధను చూచి వారి బంధనములను వదులు చేసితిమని అనుచరులు చెప్పిరి. అందుకు వారిట్లు ఆదేశించిరి. కాదు కాదు! ఈ అన్యాయము తగదు. అబ్బాస్ (రజి) నా బంధువైనట్లే ఇతర ఖైదీలు కూడ ఇతరుల బంధువులే. ఖైదీలందరు సుఖంగా నిద్రించుటకు వారి బంధనములను వదులు చేయుము! లేదా అబ్బాస్ (రజి) బంధనములను కూడ బిగించుము. వారి ఈ మాటను విని అనుచరులు ఖైదీలందరి బంధనములను వదులు చేసి పూర్తిగా రక్షణ బాధ్యత స్వీకరించిరి. ఖైదీలలో చదువుకున్న వారు మదీనాలోని

10, 10 బాలురకు అక్షరాభ్యాసం చేయించుటయే వారి పరిహారముగా వారు విధించిరి. పరిహారము కట్టుటకు ఎవరు లేని వారిని ఉచితముగానే వదిలిరి. పరిహారము ఇచ్చే స్థోమత గల ధనవంతుల నుండి తగిన పరిహారము తీసుకొని వారికి స్వేచ్ఛ ప్రసాదించిరి. ఖైదీలను బానిసలుగా మార్చుకునే అతి ప్రాచీన సంప్రదాయమును వారు ఈ విధంగా అంతమొందించిరి.

## ఉహద్ యుద్ధము

వచ్చే సంవత్సరం మరల మేము మదీనా పై దాడి చేయుదుము. మా ఓటమికి ప్రతీకారము తీర్చుకొనెదమని అవిశ్వాసుల సైన్యము పారిపోతూ ప్రకటించెను. కనుక ఒక సంవత్సరం తర్వాత మరల పూర్తి సన్నద్ధతతో మదీనాపై వారు దాడికి దిగిరి. మక్కా వాసులు ప్రతీకార జ్వాలతో రగిలిపోవుచుండిరి. అందుకు మరణించిన వారిని గూర్చి ఎవరు దు:ఖించకూడదని వ్యాపార బృందాల ద్వారా వచ్చే ఆదాయమును రాబోవు యుద్ధము కొరకు భద్ర పర్చవలెనని బదర్ యుద్ధము తర్వాత ప్రకటించిరి. కనుక పెద్ద ఎత్తున సన్నద్ధమై అబూసుఫ్యాన్ నాయకత్వములో మూడు వేల సైనికుల కంటే అధిక సంఖ్య గల సైన్యముతో మదీనాపై దాడి చేసిరి. మనము నగరములోనే వుండి వారిని ఎదుర్కొనాలా లేక బయటికి వెళ్లి పోటీ పడాలా అని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులను సలహా అడిగిరి. శత్రువు దాడి ప్రారంభించాలి, తద్వారా యుద్ధ ఆరంభమునకు వారే బాధ్యులగుదురని, ముస్లిములు ఇంట్లోనే కూర్చొని సునాయసంగా వారిని ఎదుర్కొనవచ్చునని వారి స్వంత అభిప్రాయముండెను. కాని బదర్ యుద్ధములో కొందరు ముస్లిం యువకులు పాల్గొనలేక పోయిరి. దైవ మార్గములో ప్రాణత్యాగము చేయలేక పోయామనే నిరాశ వారిలో వుండెను. మమ్ములను అల్లాహ్



మార్గములో ప్రాణత్యాగము నుండి ఎందుకు దూరముంచుతున్నారని వారు గట్టిపట్టు బట్టిరి. కనుక వారి విజ్ఞప్తిని వారు (స) ఒప్పుకొనిరి.

అభిప్రాయము తీసుకుంటున్నప్పుడు వారు చూచిన ఒక సత్యస్వప్నము కూడ ఇట్లు తెలిపిరి. 'స్వప్నములో నేను కొన్ని ఆవులను చూచితిని. నా ఖడ్గము తలభాగము విరిగిపోయెను. ఆ ఆవులు జుబహ్ చేయబడుచున్నట్లు కూడ నేను చూచితిని. ఒక దృఢమైన, సురక్షితమైన రక్షణ కవచంలో నా హస్తమును నేను వేసినట్లు, నేనొక గొర్రెపై స్వారి చేయునట్లు కూడ నేను తిలకించితిని.' అని ప్రవచించిరి. ఓ రసూలుల్లాహ్! ఈ స్వప్నములకు మీరు ఏ భావము ఊహించిరని అనుచరులు అడిగిరి. వారిట్లు నుడివిరి. ఆవులు జుబహ్ అగుటనగా నా అనుచరులు కొందరు అమరులగుదురు. నా ఖడ్గ తల భాగము విరుగుటనగా నా అతి సమీప బంధువు ఒకరు అమరుడగును లేదా నేనే గాయపడవచ్చును. రక్షణ కవచంలో హస్తము వేయుటనగా మదీనాలోనే వుండి యుద్ధము చేయుట మేలని నేను భావించితిని. గొర్రెపై స్వారీ అగుటనగా అవిశ్వాసుల సైనిక నాయకునిపై మనము విజయము సాధించెదము. అనగా అతడు ముస్లిములచే హతమగును. మదీనాలోనే వుండుట మేలని ఈ స్వప్నములో ముస్లిములకు స్పష్టముగా తెలుపబడి యుండెను. కాని ఈ స్వప్న భావము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఊహించినది. సువార్తవాణి కాదు. కనుక అధికుల సలహాను వారు స్వీకరించిరి. యుద్ధమునకు బయటికి వెళ్లుటకు నిర్ణయించిరి. వారు బయటికి వెళ్లినప్పుడు నవయువకులు పశ్చత్తప్తులై ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! మీ అభిప్రాయము సరైనది. మనము మదీనాలో వుండి శత్రువులను ఎదుర్కొనుటయే మేలు. దైవ సందేశహరుడు ఒక సారి రక్షణ కవచం ధరించిన తర్వాత దించుట సమంజసము కాదు. ఇప్పుడు ఎట్టి పరిస్థితుల్లోను మనము ముందుకే

వెళ్లెదము. మీరు సహనము పాటించినచో దైవ సహాయము మీకు అందునని వారనిరి. ఇట్లు ఉపదేశించి ఒక వెయ్యి మంది గల బృందముతో మదీనా నుండి వారు బయలు దేరిరి. కొద్ది దూరము వెళ్లి రాత్రి బస చేయుటకు ఆగిరి. శత్రువుకు సమీపాన చేరుకున్న తర్వాత తమ సైన్యము విశ్రాంతి తీసుకొనుటకు, యుద్ధ సామాగ్రిని సిద్ధము చేసుకొనుటకు ప్రతిసారి వారు అవకాశమిచ్చేవారు. వేకువజామున ప్రార్థనకై వారు బయటికి రాగా కొందరు యూదులు తమ పక్షమైన జాతుల సహాయ సాకుతో వచ్చినారని తెలుసుకొనిరి. యూదుల కుట్రల గూర్చి వారికి ముందే తెలిసి యుండెను. కనుక వారిని తిరిగి పంపాలని ఆదేశించిరి. 'ఇప్పుడిది యుద్ధము కాదు ఆత్మ హత్యతో సమానమని' దాంబికుల నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్న్ సలూల్ తన వెంట మూడు వందల సహచరులను తీసుకొని తిరిగి వెళ్లిపోయెను. ఎందుకనగా తమ సహాయకులనే యుద్ధములో పాల్గొనకుండా అడ్డుకోబడెను. ఫలితముగా ముస్లిములు 700 మాత్రమే మిగిలిరి. అవిశ్వాసుల సంఖ్యలోని 4వ వంతు కంటే తక్కువ వుండిరి. సామాగ్రి విషయంలో ఇంకా బలహీనులుగా నుండిరి. అవిశ్వాసులలో 700 మంది రక్షణ కవచం ధరించిన వారుంటే ముస్లిములలో 100 మంది మాత్రమే యుండిరి. అవిశ్వాసులలో 200 అశ్వములుంటే ముస్లిముల వద్ద రెండు మాత్రమే యుండెను. తుదకు వారు ఉహద్ ప్రాంతానికి చేరుకొనిరి. అక్కడ రెండు పర్వతముల మధ్య నున్న ఒక కనుమ రక్షణకు 50 మంది సైనికులను వారు నియమించిరి. ఈ దారి రక్షణ ప్రాధాన్యత వలన 'మేము చనిపోయినా, విజయులమైనా నా తదుపరి ఆజ్ఞ వచ్చు వరకు మీరు ఇక్కడి నుండి కదులొద్దని' సైనిక నాయకున్ని వారు గట్టిగా ఆదేశించిరి. *(ఇబ్నెహష్షామ్ సంపుటి2, పుట 78)* తర్వాత మిగతా 650 మందిని తీసుకొని శత్రువులను ఎదుర్కొనిరి.



ఇప్పుడు శత్రువుల సంఖ్యలో 5వ వంతు మాత్రమే యుండిరి. యుద్ధము మొదలయ్యెను. అల్లాహ్ సహాయ, సహకారముతో కొద్ది సమయములోనే 650 మంది ముస్లిములను ఎదుర్కొనలేక అనుభవజ్ఞులైన 3000 మక్కా సైనికులు తోక ముడుచుకొని పారిపోయిరి.

## విజయము ఓటమిగా మారుట

ముస్లిములు వారిని వెంటాడడం ప్రారంభించిరి. వెనుక నున్న కనుమను రక్షించే వారు తమ అధికారితో ఇట్లనిరి. శత్రువు ఓటమి పాలయ్యెను. మాకు కూడ యుద్ధ పుణ్యము పొందు అవకాశమిమ్ము. వారి అధికారి వారిని నివారించి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆజ్ఞను గుర్తు చేసెను. కాని వారిట్లనిరి. మనము నిర్లక్ష్యము వహించ కూడదనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అట్లు హెచ్చరించి యుండిరి. శత్రువు పారిపోయినను ఇక్కడే వుండాలని వారి భావన కాదు. ఇట్లనుచు వారు కనుమ వీడి యుద్ధ రంగములో దిగిరి. పారిపోతున్న సైన్యములోని ఖాలిద్ బిన్ వలీద్ ఆ కనుమను ఖాళీగా గమనించి, అక్కడ అతి కొద్ది సైనికులు తమ అధికారితో వున్నది చూచిరి. ఖాలిద్ బిన్ వలీద్ తర్వాత ఇస్లాం గొప్ప సేనాపతిగా పేరు పొందిరి. వీరు అవిశ్వాసుల మరో సేనాపతి అమర్ బిన్ అల్ఆస్‌ను పిలిచి ఆ కనుమను చూడమని చెప్పిరి. అమర్ బిన్ అల్ఆస్ ఆ కనుమను చూడగానే జీవితములో గొప్ప అవకాశము లభించబోతుందని ఆనందపడిరి. ఆ ఇద్దరు సేనాపతులు పారిపోతున్న తమ సైన్యమును శాంతింపజేసి, ముస్లిముల ప్రక్క నుండి తెలివిగా పర్వతమునెక్కిరి. ఆ కనుమ రక్షణలో కొద్ది మంది ముస్లిములు మాత్రమే మిగిలి యుండిరి. వారిని ముక్కలు ముక్కలుగా నరికి వెనుక నుండి ముస్లిం సైన్యముపై దాడి చేసిరి. వారి విజయానంద నినాదాలు విని పారిపోతున్న మిగతా సైన్యము తిరిగి మైదానము వైపు వచ్చెను.

అవిశ్వాసులను వెంటాడుచు ముస్లిములు చిన్నాభిన్నమై యున్నందున, ఈ ఆకస్మిక దాడిని సరియైన పద్ధతిలో ఎదుర్కొనలేక పోయిరి. మైదానములో ఒక్కొక్క సైనికుడే కనిపించుచుండెను. కొందరిని వారు హతమార్చిరి. ఈ హటాత్పరిణామముతో ఆశ్చర్య పడుచు మిగతా వారు వెనక్కి వెళ్ళిపోయిరి. కొందరు అనుచరులు పరుగెత్తుకొచ్చి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు చేరిరి. వీరి సంఖ్య అత్యధికంగా 20 వుండును. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిలబడిన ప్రాంతము పై అవిశ్వాసులు వీరోచితంగా దాడికి దిగిరి. అనుచరులు ఒకరి తర్వాత మరొకరు వారి రక్షణలో ప్రాణాలు వదులుచుండిరి. ఖడ్గ వీరులే గాక విల్లుకారులు ఎత్తైన పర్వతముల నుండి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పై నిర్విరామంగా బాణములు విడుచుచుండిరి. ఖురైష్ వంశీయులైన తల్హా (రజి) మక్కా ముహాజిర్లలో ఒకరు. శత్రువు బాణములన్ని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ముఖము వైపే విసురుచున్నట్లు చూచిరి. తన హస్తమును రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముఖమునకు అడ్డముగా పెట్టిరి. లక్ష్యము పై పడుతున్న బాణము వెనుక బాణము తల్హా (రజి) హస్తముపై పడుచుండెను. కాని వీరుడు, విశ్వాస పాత్రుడైన అనుచరుడు తన హస్తమును కదలనివ్వలేదు. ఇలా బాణములు పడుతూనే వుండగా తల్హా (రజి) హస్తము తీవ్ర గాయాల పాలై నిరుపయోగమయ్యెను. రెండవ హస్తము మాత్రమే మిగిలెను. చాలా సంవత్సరముల తర్వాత నాలుగవ ఉత్తరాధికారి హయాంలో ముస్లిముల మధ్య యుద్ధము సంభవించినప్పుడు ఒక శత్రువు తల్హా (రజి) ను ఒంటిచేతివాడని పరిహసించెను. మరో అనుచరుడు ఇట్లనెను. అవును ఒంటిచేతివాడే కాని ఎంతో అదృష్టవంతుడు. తల్హా (రజి) ఈ హస్తము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ముఖమును రక్షించుటలో



నిరుపయోగమైన విషయము నీకు తెలుసా? ఉహద్ యుద్ధము తర్వాత ఒకడు తల్హా (రజి) ను ఇట్లడిగెను. బాణములు మీ హస్తముపై పడుచుండగా మీకు నొప్పి కాలేదా, హాహాకరము వెలువడలేదా ? అందుకు తల్హా (రజి) ఇట్లు సమాధానమిచ్చిరి. నొప్పి కూడ అవుతుండెను, ఆహా కూడ వెలువడు చుండెను. కాని ఆహా అన్నప్పుడు నా హస్తము కదిలి, రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ముఖముపై బాణము పడునని నేను ఆహా అనలేదు.

కాని ఇంత పెద్ద సైన్యమును ఈ కొద్ది మంది ఎంత వరకు ఎదురించగలరు. అవిశ్వాసుల పెద్ద సమూహము ముందుకు వచ్చెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు వున్న సైనికులను వెనక్కి నెట్టివేసెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పర్వతము వలె ఒంటరిగా నిలిచివుండగా ఒక రాయి వచ్చి వారి తలజీరాకు (శిరస్త్రానము) తగిలెను. వారి తలజీరా మొల తలలో దిగెను. వారు స్పృహ తప్పి వారి చుట్టు పోరాడుచు అమరులైన అనుచరుల శవాలపై పడిరి. *(ఇబ్నె హిషామ్ సంపుటి 2 పుట 84)* తర్వాత మరికొందరు వారి శరీరమును రక్షించుటలో అమరులైరి. వారి శవాలు వారి శరీరముపై పడినవి. అవిశ్వాసులు వారి శరీరమును శవాల క్రింద పడి వుండడం చూచి వారు కూడ హతమైనారని భావించిరి. కనుక మక్కా సైన్యము తమ వరుసలను క్రమబద్ధీకరించుటకు వెనక్కి జరిగెను. వారి (స) చుట్టు వున్న అనుచరులను అవిశ్వాసుల సమూహము వెనక్కి నెట్టివేసెను. వారిలో హజ్రత్ ఉమర్ (రజి) కూడ వుండిరి. మైదానములో యుద్ధము చేయు వారెవరు లేరని చూచి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అమరులైనారని వారికి నమ్మకము కలిగెను. తర్వాతి కాలంలో ఒకేసారి ఖైసర్, కిస్రాను గొప్ప సాహసంతో ఎదుర్కొన్న వ్యక్తి, ఎన్నడు భయపడని, ఎప్పుడు ఆందోళన చెందనివారు

ఒక రాయిపై కూర్చొని పిల్లల వలె భోరున విలపించసాగిరి. ముస్లిం సైన్యము విజయము పొందినప్పుడు ఆకలి వలన మాలిక్ (రజి) నామము గల ఒక అనుచరుడు వెనక్కి వెళ్ళియుండెను. వారు రాత్రి నుండి ఏమియును భుజించలేదు. విజయము తర్వాత కొన్ని ఖర్జూరములు తిని ఆకలి తీర్చుకొనుటకు వారు వెనక్కి జరిగిరి. వారు విజయానందములో తిరుగుచుండిరి. తిరుగుచూ హజ్రత్ ఉమర్ (రజి) వద్దకు చేరుకొనిరి. ఉమర్ (రజి) ను విలపించుచు చూచి ఆశ్చర్యానికి లోనై ఇట్లడిగిరి. ఉమర్ మీకేమయ్యెను. ఇస్లాం విజయము పై మీరు ఆనందించవలెనా లేక దు:ఖించవలెనా ? ఉమర్ ఇట్లు సమాధానమిచ్చిరి. మాలిక్! బహుశ విజయము తర్వాత వెంటనే నీవు వెనక్కి పోయివుంటివి. అవిశ్వాసుల సైన్యము ఆ కనుమ నుండి తిరిగి వచ్చి ఇస్లాం సైన్యముపై దాడి చేసెను. ముస్లిములు ఛిన్నాభిన్నమైనందున వారిని ఎదురించ లేకపోయిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కొందరు అనుచరులతో కలిసి వారితో పోరాడుటకు నిలిచిరి. పోరాడుచూ అమరులైన విషయము నీకు తెలియదు. మాలిక్ (రజి) ఇట్లనెను. ఉమర్ ! ఇదే నిజమైనచో మీరిక్కడ కూర్చొని ఎందుకు ఏడ్చుచున్నారు. మన ఆదర్శమూర్తి వెళ్ళిన లోకానికే మనము కూడ వెళ్లవలెను. వారి చేతిలోనున్న చివరి ఖర్జూరమును వారు నోట్లో వేసుకోనుచుండిరి. ఓ ఖర్జూరము! స్వర్గము, మాలిక్‌కు మధ్య నీవు తప్ప మరేమి అడ్డు గలదని ఆ ఖర్జూరమును క్రింద పడేసిరి. ఖడ్గము పట్టుకొని శత్రువుల సైన్యములో చొచ్చుకుపోయిరి. మూడు వేల మందిని ఒక్క వ్యక్తి ఎట్లు ఎదురించగలడు? కాని దైవ ఆరాధన చేయు ఒక్క ఆత్మ కూడ అనేకులకు భారమగును. మాలిక్‌ను ఇంత ధైర్యముగా పోరాడుచూ చూచి శత్రువు ఆశ్చర్యపోయెను. తుదకు గాయాల పాలై వారు పడిపోయినను శత్రు సైనికులపై దాడిని కొనసాగించిరి. అందుకే మక్కా



అవిశ్వాసులు ప్రతీకారముతో రగలిపోవుచూ వారిపై తీవ్రంగా దాడి చేసిరి. యుద్ధము తర్వాత వారి శవపు 70 ముక్కలు లభించినవి. వారి శవాన్ని గుర్తించుట కూడ కష్టమయ్యెను. తుదకు ఒక వ్రేలు చూసి వారి సోదరి వారిని గుర్తించి ఇది మా సోదరుని శవమని చెప్పిరి.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు వున్న అనుచరులు అవిశ్వాసుల సమూహము ద్వారా వెనక్కి నెట్టబడి యుండిరి. అవిశ్వాసులు వెనుకకు వెళ్ళగానే మరల రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు వారు ప్రోగైరి. వారి (సల్లం) పవిత్ర శరీరమును వారు ఎత్తిరి. ఉబైదహ్ బిన్ అల్ జర్రాహ్ అను సహచరుడు తన దంతములతో వారి తలలో దిగిన మొలను తీసివేసెను. అందుకు వారి రెండు దంతములు విరిగిపోయెను. కొద్ది క్షణాలలోనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం స్పృహలోకి వచ్చిరి. ముస్లిములు మరల ఏకము కావలెనని అనుచరులు మైదానపు నలువైపులలో మందిని పంపిరి. పారి పోయిన సైన్యము మరల ప్రోగవడం మొదలయ్యెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని తీసుకొని పర్వత తీరమునకు వెళ్ళిపోయిరి. పర్వతము తీరమున మిగిలిన సైన్యము నిలిచినప్పుడు అబూసుఫ్యాన్ గట్టిగా ఇట్లనెను. మేము ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను హతమార్చితిమి. శత్రువు వాస్తవ పరిస్థితిని తెలుసుకొని దాడి చేసి ముస్లిములను గాయపర్చునని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అబూసుఫ్యాన్ మాటలకు సమాధానమివ్వలేదు. ముస్లిం సైన్యము నుండి అతని మాటకు సమాధానము రానప్పుడు అతని ఆలోచన నిజమేనని అబూసుఫ్యాన్ విశ్వసించెను. మరల అతను గట్టిగా అరుస్తూ మేము అబూబకర్ (రజి) ను హతమార్చితిమని అనెను. సమాధానము ఇవ్వకూడదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అబూబకర్ (రజి) ను ఆదేశించిరి. మేము

ఉమర్ (రజి) ను కూడ అంతము చేశామని మళ్ళీ అబూసుఫ్యాన్ గట్టిగా అరిచెను. నిజానికి ఉమర్ (రజి) ఉద్రేకము గల వ్యక్తి. వారు అతనికి సమాధానముగా ఇట్లన బోయిరి. మేము అల్లాహ్ దయ వలన సజీవముగానున్నాము. మిమ్ములను ఎదురించుటకు సిద్ధముగా నున్నాము. కాని ముస్లిములను ఆపదలో పడవేయకుము. మౌనం పాటించమని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. ఇస్లాం స్థాపకులను, వారి కుడి, ఎడమను మేము హతమార్చితిమని అవిశ్వాసులకు అప్పుడు నమ్మకము కలిగెను. కనుక అబూసుఫ్యాన్ అతని సహచరులు ఇట్లు నినదించిరి. اعلُ هُبَل اعلُ هُبَل అనగా మా గౌరవ విగ్రహము హుబుల్ గొప్పది. నేడు అది ఇస్లాంను అంతమొందించెను. తన మరణ ప్రకటనపై, అబూబకర్ మరణ ప్రకటనపై, ఉమర్ మరణ ప్రకటన పై మౌనము వహించమని ఉపదేశించి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం క్షతగాత్రులైన ముస్లిములపై అవిశ్వాసుల సైన్యము దాడి చేసి పిడికెడు ముస్లిములను వారు హతమార్చుదురని భావించి యుండిరి. ఇప్పుడు ఏకైక అల్లాహ్ గౌరవ సమస్య ఏర్పడెను. అన్యారాధన నినాదం మైదానంలో వినిపించెను. కనుక వారి హృదయము చలించి పోయెను. వారు ఎంతో ఉద్రేకముతో అనుచరుల వైపు చూచుచు మీరు సమాధానమెందుకు ఇవ్వరని అనిరి. మేము ఏమనాలని అనుచరులు అడిగిరి. اَللّٰهُ اَعلٰى وَاَجَلُّ అనుము. అనగా హుబుల్ విగ్రహము గొప్పదని మీరు అబద్ధమాడుచున్నారు. ఏకైక అల్లాహ్ గొప్పవాడు. అతడికి ఎవరు సమానులు లేరు. ఈ రకంగా వారు మేము బ్రతికే వున్నామను వార్తను శత్రువులకందించిరి. ఈ ధైర్యము, సాహసముతో కూడిన సమాధానము అవిశ్వాస సైనికులపై ఎంత ప్రభావము చూపినదనగా వారి ఆశలు ఆవిరై పోయెను. వారి ముందు పిడికెడు క్షతగాత్రులైన



ముస్లిములుండినను వారి పై దాడి చేసి యుద్ధ చట్టముల ప్రకారము వారిని హతమార్చడం సాధ్యమై యుండెను. కాని వారు మరల దాడి చేసే సాహసం చేయలేకపోయిరి. లభించిన విజయమే ఎక్కువన్నట్లు సంబరాలు జరుపుకొనుచూ మక్కాకు తిరిగి పోయిరి.

ఉహద్ యుద్ధములో ప్రత్యక్ష విజయము లభించినను మరో కోణంలో ఓటమి తప్పలేదు. కాని ఈ యుద్ధము ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సత్యమునకు ఒక గొప్ప నిదర్శనము. ఈ యుద్ధములో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారము ముస్లిములకు మొదట విజయము లభించెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారము వారి చిన్నాన హమ్జ (రజి) యుద్ధములో సంహరించబడిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారము అవిశ్వాస సైన్య పతాక రోహితుడు హతమార్చబడెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి మేరకు వారు కూడ గాయపడిరి, ఎంతో మంది అనుచరులు ప్రాణాలర్పించిరి. అయినను గొప్ప విశ్వాసము, స్వచ్ఛతను ప్రదర్శించు అవకాశము ముస్లిములకు లభించెను. దాని ఉదాహరణ చరిత్రలో మరెక్కడా కానరాదు. ఈ విశ్వాసము, స్వచ్ఛతకు సంబంధించిన పలు సంఘటనలు ముందే వివరించబడినవి. మరో సంఘటన కూడ ఇచట ప్రస్తావించదగ్గది. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట వున్నందున అనుచరుల విశ్వాసము ఎంత ధృడపడినదో దీని ద్వారా మనకు స్పష్టమగును. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కొందరు అనుచరులతో కలిసి పర్వత తీరమునకు వెళ్ళిపోయిరి. శత్రువు కూడ వెనక్కి పోయినప్పుడు మైదానముకు వెళ్లి గాయపడిన వారి స్థితిగతులను తెలుసుకొనుటకు కొందరు అనుచరులను నియమించిరి.

ఒక అనుచరుడు మైదానములో వెతుకుచూ ఒక క్షతగాత్రుడైన అన్సారీ వద్దకు చేరుకొనెను. అతనిని అపాయకరమైన స్థితిలో కొనఊపిరితో వున్నట్లు చూచిరి. ఈ అనుచరుడు వారి వద్దకు వెళ్లి అస్సలాము అలైకుమ్ అనెను. వారు గజగజ వణుకుతున్న తన హస్తము పైకి లేపి వారి హస్తము పట్టుకొని ఇట్లనెను. ఎవరైనా సోదరుడు వచ్చునని నేను నిరీక్షించుచుంటిని. వారు ఆ అనుచరున్ని ఇట్లడిగిరి. మీ పరిస్థితి అపాయకరముగా నున్నది. మీరు మీ బంధువులకు ఏదైనా సందేశం ఇవ్వదలచిరా ? ఆ చనిపోతున్న అనుచరుడు ఇట్లనెను. అవునవును! నా బంధువులకు నా సలాం అందించుము. నేను చనిపోవుచున్నాను. కాని ఒక పవిత్రమైన దైవ న్యాసము ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉనికిని మీలో వదిలి వెళ్లుచున్నాను. ఓ నా సోదరులారా! బంధువులారా! వారు నిజమైన దైవప్రవక్త. వారి రక్షణకై మీ ప్రాణాలర్పించుటకు మీరు వెనుకాడరని నా మరణాదేశమును గుర్తుంచుకుంటారని నేను ఆశించుచున్నాను. *(మొతా, జర్ఖాని)* చనిపోవు వ్యక్తి హృదయములో వేలాది విషయములు తమ బంధువులకు చెప్పాలని అనిపించును. కాని వీరు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట వుండి పూర్తిగా నిస్వార్థులైరి. వారికి తమ కుమారులు, భార్యలు, ధనము, స్థిరాస్తులు గుర్తు లేకుండెను. కాని వారికి కేవలం ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గుర్తుండిరి. ప్రపంచ మోక్షము వారి ద్వారనే సాధ్యమని వారికి తెలిసి యుండెను. మేము మరణించిన తర్వాత మా సంతానము బ్రతికివున్నను వారు చేసే ఘనకార్యమేమి లేదు. కాని ఈ మోక్ష ప్రదాత రక్షణలో వారు తమ ప్రాణాలు త్యాగము చేసినచో మా కుటుంబము అంతమగును. కాని ప్రపంచము జీవించును. షైతాన్ అధీనములోనున్న మానవునికి మరల మోక్షము లభించును.



మా కుటుంబముల జీవితము కంటే మానవ జాతి జీవితము, మోక్షము వేల రెట్లు అధిక విలువగలది.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం క్షతగాత్రులను, అమరులైన వారిని ఒక చోట చేర్చిరి. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయబడెను. అమరులకు సమాధుల ఏర్పాటు జరిగెను. క్రూరులైన మక్కా అవిశ్వాసులు అమరులైన ముస్లిముల ముక్కు, చెవులు కోసివేసినట్లు వారికి తెలిసెను. ముక్కు, చెవులు కోసివేయబడిన వారిలో వారి (స) చిన్నాన హజ్రత్ హమ్జ (రజి) కూడ వుండిరి. ఈ దృశ్యమును చూచి వారు బాధ పడుచు ఇట్లనిరి. మేము అధర్మమని భావించు విషయమును అవిశ్వాసులు తమ కర్మలతో ఈ ప్రతీకారమును ధర్మబద్దము చేసిరి. కాని అప్పుడు అల్లాహ్ ద్వారా ఇట్లు దైవవాణి అందెను. అవిశ్వాసులు ఏమి చేసినా వారు అనుభవించెదరు. కాని మీరు సదా కరుణ, న్యాయముతో వ్యవహరించుము.

## ఉహద్ యుద్ధము నుండి తిరోగమనం మదీనా వారి త్యాగవంతమైన భావాలు

ఇస్లాం సైన్యము మదీనాకు తిరిగి రాక ముందే రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అమరులైనారని, ముస్లిముల సైన్యము ఛిన్నాభిన్నమైనదను వార్త మదీనా అందియుండెను. మదీనా మహిళలు, పిల్లలు ఉహద్ వైపు పరుగెత్తుచుండిరి. చాలా మందికి మార్గమధ్యలోనే నిజము తెలియడంతో వారు అక్కడే ఆగిపోయిరి. కాని బనూ దీనార్ జాతి ఒక మహిళ వెఱ్ఱితనముతో ఉహద్ కు చేరుకొనెను. ఉహద్‌లో ఆ మహిళ భర్త, సోదరుడు, తండ్రి హతమార్చబడి యుండిరి. మరో కథనము ప్రకారము ఒక కుమారుడు కూడ హత్య చేయబడి యుండెను. ఆమెకు వెళ్లుచుండగా నీ తండ్రి చనిపోయాడని తెలిపినప్పుడు రసూలుల్లాహ్

సల్లల్లాహు అలైహి వసల్లం ఎలా వున్నారో ? నాకు తెలుపమని ఆమె అనెను. వార్తనిచ్చు వ్యక్తికి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం క్షేమంగా వున్నారను నమ్మకము వుండెను. అందుకే అతడు ప్రతి సారి సోదరుని, భర్త, కుమారుని మరణ వార్త ఆమెకు తెలుపుచుండెను. కాని ఆమె ప్రతి సారి "ما فعل رسول الله صلى الله عليه وسلم" అనగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇదేమి చేశారని ప్రశ్నించుచుండెను. ఈ వాక్యము సాధారణంగా తప్పుగా భావించబడును. అందుకే చరిత్రకారులు దాని భావమును రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఏమి జరిగినదని వ్రాసిరి. కాని వాస్తవముగా ఈ వాక్యము తప్పు కాదు. స్త్రీల మనోభావాల ప్రకారం ఇది సరైన వాక్యమే. స్త్రీలు చాలా ఉద్వేగ భరిత భావాలు కలిగివుందురు. వారు చాలా సార్లు శవాలను సజీవులుగా ఊహించుకొని సంబోధింతురు. కొందరు మహిళలు తమ భర్తలు, కుమారులు మృతి చెందినప్పుడు వారిని సంబోధించి ఇటువంటి మాటలు మాట్లాడెదరు. ఉదాహరణకు నన్ను ఎవరి బాధ్యతలో వదిలిపోతివి? కుమారుడా! ఈ వృద్ధాప్యంలో ఎందుకు నాతో ముఖము చాటేశావు? అధిక బాధలో మానవుల ద్వారా సహజంగానే వెలువడే సున్నితమైన స్పందన ఇది. ఈ విధముగనే రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మరణ వార్త విని ఆ స్త్రీ స్పందించెను. వారు పరమపదించారని నమ్ముటకు ఆమె సిద్ధముగా లేకుండెను. మరో వైపు ఈ వార్తను ఖండించే అవకాశము కూడ లేకుండెను. అందుకే భరించలేని బాధలో అయ్యో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎందుకిలా చేశారని అనుచుండెను. అనగా ఇంతటి విశ్వాసపాత్రుడు మాకీ దు:ఖము కలిగించుటకు ఎలా సిద్ధపడ్డారని అర్థము.

ఆమెకు తండ్రి, సోదరుడు, భర్త పట్ల బాధ లేదని ఆమె నిజమైన



భావాలను ప్రజలు అర్థము చేసుకొనిరి. అప్పుడు ఓ ఫలానా కుమారుని తల్లి ! నీవు కోరుకుంటున్నట్లే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ దయ వలన క్షేమంగానే ఉన్నారని తెలిపిరి. వారెక్కడున్నారో నాకు చూపమని ఆమె అడిగినప్పుడు వారక్కడున్నారని, ముందుకు సాగుమని, వారు ముందు వున్నారని తెలిపిరి. ఆ స్త్రీ పరుగెత్తి వారి (సల్లం) వద్దకు చేరుకొనెను. వారి చొక్కా పట్టుకొని ఇట్లనెను. (بابی انت وامی یا رسول اللهالاابالی اذا سلمت من عطب) అనగా ఓ రసూలుల్లాహ్! నా తల్లిదండ్రులు మీపై బలిఅగు గాక ! మీరు సురక్షితముగా వున్నచో మరెవరు చనిపోయినా నాకు బాధ లేదు.

యుద్ధములో పురుషులు ఆ విశ్వాస ఉదాహరణ ప్రదర్శించగా స్త్రీలు పైన ప్రస్తావించిన ఆప్యాయత ఉదాహరణ నెలకొల్పిరి. మర్యమ్ మగ్దిలేని ఆమె సహచర స్త్రీలు శత్రువుల కల్లుగప్పి మసీహ్ సమాధి వద్దకు ఉదయం చేరుకొనిరి. క్రైస్తవ లోకము ఈ ధైర్యముపై సంతోషించెను. రమ్ము! నా ప్రియుని విశ్వాసులు, త్యాగమూర్తులు ఎటువంటి పరిస్థితులలో వారి వెంట వుండిరో ఏ స్థితిలో దైవ ఏకత్వ పతాకమును వారు ఎగురవేసిరో చూడమని వారితో అంటున్నాను.

ఇటువంటి త్యాగమును తలపించే మరో సంఘటన చరిత్రలో గలదు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అమరులను సమాధి చేసి మదీనాకు తిరిగి పోయినప్పుడు స్త్రీలు, పిల్లలు స్వాగతించుటకు నగరము నుండి బయటికొచ్చిరి. మదీనా నాయకులైన సాద్ బిన్ మఆజ్ రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఒంటె ముకుతాడును పట్టుకొని గర్వముగా ముందుకు వెళ్లుచుండిరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను మేము సురక్షితంగా తమ ఇంటికి తిరిగి తీసుకొచ్చితిమని బహుశ ప్రపంచానికి చెప్పుచుండిరి. నగర సమీపాన మసకబారిన

చూపుతో నున్న వారి వృద్ధ తల్లి వచ్చుచుండగా కనిపించిరి. ఉహద్‌లో వారి మరో కుమారుడు ఉమర్ బిన్ మఆజ్ కూడ హత్య చేయబడి యుండెను. ఆమెను చూచి ఓ రసూలుల్లాహ్! నా తల్లి వచ్చుచున్నదని అనెను. దైవ శుభములతో వచ్చుగాక! అని వారనిరి. ఆ వృద్ధురాలు ముందుకు వచ్చి తన బలహీన, మసక బారిన నేత్రములతో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముఖము చూచుటకు దిక్కులు చూడసాగెను. తుదకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముఖమును గుర్తు పట్టి సంతోషపడెను. ఓ అమ్మా! నీ కుమారుడు అమరుడైనందుకు సంతాపం తెలుపుతున్నానని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. అప్పుడు ఆ పుణ్య స్త్రీ మిమ్ములను సురక్షితంగా చూచిన తర్వాత ప్రతి బాధను కాల్చి తిన్నానని అనుకొనుమని అనెను. 'బాధను కాల్చి తిన్నాను'. ఇదొక విచిత్ర సామెత. ప్రేమకు గల అపార భావాలను సూచించును. బాధ మనిషిని తినును. వృద్ధాప్య ఆసరాను కోల్పోయినను ఆ వృద్ధురాలు ఎంత ధైర్యముతో అనెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవించి వుండగా నా కుమారుని బాధ నన్నెలా తినును. నేను ఆ బాధను ఆరగించెదను. నా తనయుని మృతి నా మరణానికి కారణము కాజాలదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు అతడు ప్రాణమిచ్చెనను ఆలోచన, నా శక్తిని పెంచును. ఓ అన్సార్! నా ప్రాణము మీకు అంకితమగు గాక! మీరెంత గొప్ప పుణ్యము పొందితిరి.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సురక్షితంగా మదీనా చేరుకొనిరి. ఈ యుద్ధములో అనేక ముస్లిములు హత్య చేయబడిరి. అనేకులు గాయపడిరి. అయినను ఉహద్ యుద్ధమును ఓటమిగా నిర్వచించలేము. నేను పైన ఉదహరించిన సంఘటనల ఆధారంగా ఇదొక



గొప్ప విజయము. ప్రళయ దినము వరకు ముస్లిములు ఈ విజయమును గుర్తు చేసుకొని తమ విశ్వాసమును పెంపొందించు కోవచ్చును. మదీనా చేరుకొని వారు తన వాస్తవ కర్తవ్యమైన శిక్షణ, విద్యా, సంస్కరణను ప్రారంభించిరి. కాని ఈ పని సులువుగా చేయలేకపోయిరి. ఉహద్ ఘటన తర్వాత యూదులలో ఇంకను ధైర్యము పుట్టెను. దాంబికులు మరింత రెచ్చిపోయిరి. ఇస్లాంను అంతమొందించుట మానవశక్తికి సాధ్యమని బహుశ వారు భావించిరి. వివిధ రకాలుగా యూదులు వారిని ఇబ్బంది పెట్టసాగిరి. అవమానకర కవిత్వము రచించి అందులో వారి (స) వంశమును అవమానించేవారు. ఒక సారి ఒక వివాదమును పరిష్కరించుటకు యూదుల కోటలోకి వారు వెళ్లవలసివచ్చెను. వారు (స) కూర్చున్న చోట పై నుండి ఒక భారీ రాయి వేసి వారిని హతమార్చుటకు వారు పన్నాగం పన్నిరి. కాని అల్లాహ్ వారికి సరైన సమయంలో తెలిపెను. కనుక వారు ఏమి చెప్పకుండా అక్కడి నుండి తిరిగి వచ్చిరి. తర్వాత యూదులు తమ నేరమును అంగీకరించిరి. ముస్లిం మహిళలను వీధులలో కించపరిచేవారు. ఒక సారి ఈ జగడములో ఒక ముస్లిం కూడ హత్యచేయబడెను. మరో సందర్భమున ఒక ముస్లిం బాలిక తలను యూదులు రాళ్ళతో కొట్టి, తొక్కిరి. ఆమె విలపిస్తూ మృతిచెందును. ఈ కారణముల వలన యూదులతోను ముస్లిములు యుద్ధము చేయవలసి వచ్చెను. కాని అరబ్, యూదుల చట్ట ప్రకారము ముస్లిములు వారిని హతమార్చలేదు. కేవలం నగర బహిష్కరణ షరతుతో విడిచి పెట్టిరి. కనుక ఈ రెండు జాతులలోని ఒకటి సీరియా వైపు ప్రస్థానము చేసెను. రెండవ దాని లోని కొంత భాగము సీరియా వెళ్లగా కొందరు మదీనాకు ఉత్తరాన ఖైబర్ నామము గల పట్టణమునకు వెళ్లిపోయిరి. అరబ్ దేశములో అత్యద్భుత కోటలతో నిర్మితమైన ఈ

నగరము యూదుల కేంద్రముగా నుండెను.

## మద్యపాన నిషేధ ఆదేశము దాని ప్రభావము

అనుచరులపై ఇస్లాం ఈ ప్రభావము ఎంతగానుండెనో ఉహద్ యుద్ధము తర్వాతి యుద్ధము మధ్య ఈ ప్రపంచము ఒక స్పష్టమైన నిదర్శనము చూసెను. అనగా మద్యపాన నిషేధం. ఇస్లాం కంటే ముందు అరబ్బులు మద్యపానమునకు అలవాటు పడిపోయిరని మేము తెలిపి యుంటిమి. ప్రతి గౌరవ అరబ్బు కుటుంబములో రోజు 5 పూటలు మద్యం సేవించేవారు. మద్యం మత్తులో స్పృహ తప్పిపోవడం వారికి సాధారణమైన విషయము. దీనిని వారు అవమానముగా భావించే వారే కాదు. వారు దీనిని మంచి కార్యముగా భావించేవారు. అతిథి వచ్చినచో మద్యం అందించుట గృహిణి బాధ్యత. ఇట్టి వారితో ఈ వినాశకర అలవాటును మాన్పించడం సులభము కాదు. కాని ప్రస్థానము తర్వాత 4వ సం॥లో మద్యపాన నిషేధ ఆదేశము ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించెను. ఈ ఆదేశము ప్రకటించగానే ముస్లిములు మద్యం సేవించడం పూర్తిగా వదిలిరి. హదీసులో ఇట్లు గలదు. మద్యపాన నిషేధమును గూర్చి దైవవాణి అందగానే ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక అనుచరున్ని పిలిచి ఈ నూతన ఆదేశమును మదీనా వీధులలో చాటింపు చేయమని పంపిరి. మదీనా ముస్లిం అయిన ఒక అన్సార్ గృహములో అప్పుడు మద్యపాన సమావేశము జరుగుచుండెను. దీనిలో ఆహ్వానితులు చాలా మందే వుండిరి. ఒక పెద్ద కడవ అయిపోగా రెండవ కడవ మొదలు పెట్టబడుచుండెను. చాలా మంది మత్తులో జారుకోగా ఇంకొందరు జారుకో బోతుండిరి. అంతలోనే ఒక వ్యక్తి అల్లాహ్ ఆజ్ఞ మేరకు మద్యపానమును ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిషేధించిరని ప్రకటించుచున్నట్లు వారు వినిరి. వారిలో ఒకడు నిలబడి



ఇది మద్యపాన నిషేధ ఆజ్ఞలా వున్నది. ఆగుము! నేను తెలుసు కుంటాననెను. మరో వ్యక్తి నిలిచి మద్యముతో నిండి వున్న కడవను తన కర్రతో కొట్టి ముక్కలు ముక్కలు చేసి ఇట్లనెను. ముందు ఆజ్ఞను పాటించుము తర్వాత తెలుసుకోవచ్చును. మనము ఇటువంటి ప్రకటన విన్న తర్వాత దర్యాప్తు నెపంతో మద్యం సేవించుట సబబు కాదు. మద్యంను వీధులలో పడ వేయుటయే మన విధి. తర్వాత ప్రకటన గురించి దర్యాప్తు చేయవచ్చును. *(బుఖారి కితాబుల్ అశ్రిబ)*

ఈ ముస్లిం అభిప్రాయము సరైనదే. ఎందుకనగా మద్యపానం నిషేధించిన తర్వాత మద్యం సేవించినచో వారు నేరమునకు పాల్పడిన వారగుదురు. మద్యపానం నిషేధించక పోయినచో మద్యంను పార బోయడం పూరించలేనంత పెద్ద నష్టమేమి కాదు. ఈ ప్రకటన తర్వాత ముస్లిములు పూర్తిగా మద్యపానమునకు దూరమైరి. ఇంత గొప్ప విప్లవము కొరకు ప్రత్యేక కృషి లేదా ప్రయత్నము చేయవలసిన అవసరం రాలేదు. ఈ ఆజ్ఞను వినిన వెంటనే ఆచరించి చూసిన ముస్లిములు ఆ తర్వాత 70, 80 సం॥లు జీవించియుండిరి. కాని ఈ ఆజ్ఞను పాటించని కనీసం ఒక్క ముస్లిం కూడ వారిలో లేకుండెను. ఎవడైనా పాటించని వాడుంటే అతడు ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ప్రత్యక్ష శిక్షణ పొందనివాడై వుండవచ్చు. అమెరికాలో మద్యపాన నిషేధ పిలుపు, అందుకు తీసుకున్న చర్యలు, ఐరోపా దేశములలో సంవత్సరాల కొద్దీ వాటి అమలుతో దీనిని మనము పోల్చినచో ఈ సమాజ చెడు వ్యసనాన్ని రూపుమాపుటకు ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఒక్క ప్రకటన మాత్రమే సరిపోయినట్లు స్పష్టమగును. అక్కడ వివిధ చట్టములు రూపొందించ బడినవి. పోలీస్ సైన్యము, పన్ను శాఖాధికారులు కలిసి ఈ మద్యపాన శాపమును దూరము చేయుటకు ఐక్యంగా కృషి చేసిరి.

అయినను వారు సఫలం కాలేక పోయిరి. వారు తమ అపజయాన్ని అంగీకరించక తప్పలేదు. మన ఈ కాలమును అభివృద్ధి కాలమని అందుము. కాని దీనిని ఇస్లాం ఆవిర్భావ కాలముతో మనము పోల్చుకుంటే ఏది అభివృద్ధి కాలమో అని మనము ఆశ్చర్యపోక తప్పదు. మన వర్తమాన కాలం గొప్పదా లేక సమాజములో అంతటి గొప్ప విప్లవం సృష్టించిన ఇస్లాం ఆవిర్భావ కాలం గొప్పదా ?

**ఉహద్ యుద్ధము తర్వాత అవిశ్వాస జాతుల అపవిత్ర ప్రణాళికలు**

ఉహద్ సంఘటన సులభముగా మర్చిపోయేది కాదు. ఇస్లాంకు విరుద్ధముగా వారికి లభించిన మొదటి విజయమని మక్కా వారు భ్రమ పడిరి. ఈ వార్తను అరబ్ అంతట వారు వ్యాపింపజేసిరి. అరబ్ జాతులన్నిటిని ఇస్లాంకు వ్యతిరేకంగా వారు రెచ్చగొట్టిరి. వారికి ఇట్లు నమ్మకము కలిగించుటకు ప్రయత్నించిరి. ముస్లిములు ఓడించలేని శక్తి కాదు. వారు తమ బలముతో కాక అరబ్ జాతుల నిర్లక్ష్యము వలన వారు అభివృద్ధి చెందుచుండిరి. అరబ్బులు సంఘటితంగా ప్రయత్నించినచో ముస్లిములపై విజయము సాధించుట అసంభవం కాదు. ఈ దుష్ప్రచారం ముస్లిముల వ్యతిరేకతకు నాంది పలికెను. మక్కా వారి కంటే ఎక్కువ ఇతర జాతులే ముస్లిములకు ఇబ్బందులు సృష్టించడం ప్రారంభించిరి. కొందరు బహిరంగముగా దాడులను ప్రారంభించగా మరికొందరు రహస్యముగా వారికి నష్టము కలిగించుట మొదలు పెట్టిరి.

ప్రస్థానమునకు 4వ సం॥ అరబ్‌కు చెందిన రెండు జాతులు అజల్, ఖారహ్ తమ ప్రతినిధులను ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు పంపి ఇట్లు మనవి చేసిరి. మా జాతులలో చాలా మంది ఇస్లాం వైపు మొగ్గు చూపుచున్నారు. ఇస్లాం బోధనలు పూర్తిగా తెలిసిన కొందరిని పంపగలరని, వారు మా మధ్య వుంటూ ఈ క్రొత్త ధర్మమును బోధింతురని



వారు కోరిరి. నిజానికి ఇస్లాంకు బద్ధశత్రువులైన బనూ లిహ్యాన్ పన్నిన కుట్ర ఇది. ఈ ప్రతినిధులు ముస్లిములను తీసుకొని రాగానే తమ నాయకుడు సుఫ్యాన్ బిన్ ఖాలిద్‌కు ప్రతీకారముగా వారిని హతమార్చాలని వారి ఉద్ధేశము. కొందరు ముస్లిములను తీసుకొని వచ్చుటకు, వారు అజల్, ఖారహ్‌కు చెందిన ప్రతినిధులను భారీ బహుమాన ఆశ చూపి, ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు పంపిరి. అజల్, ఖారహ్ ప్రతినిధులు ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి విన్నవించగా, వారి మాటలను నమ్మి వారికి ఇస్లాం విశ్వాసాలు, సంప్రదాయాలను బోధించుటకు పది మంది ముస్లిములను వారి వెంట పంపిరి. ఈ బృందం బనూ లిహ్యాన్ ప్రాంతమునకు చేరుకొనినప్పుడు అజల్, ఖారహ్ ప్రతినిధులు బనూ లిహ్యాన్‌కు ముస్లిములను బంధించమని లేదా హతమార్చమని సమాచారమందించిరి. ఈ అపవిత్ర ప్రణాళిక ఫలితముగా బనూ లిహ్యాన్‌కు చెందిన 200 మంది సాయుధ సైనికులు ముస్లిములను వెంటాడుటకు వెళ్ళిరి. తుదకు రజీ అను ప్రాంతములో వారిని చుట్టుముట్టిరి. పది మంది ముస్లిములు రెండు వందల మంది శత్రువుల మధ్య యుద్ధము జరిగెను. ముస్లిములు విశ్వాస కాంతితో ప్రకాశించుచుండిరి. అవిశ్వాసులలో అటువంటి ఉత్తేజం లేకుండెను. పది మంది ముస్లిములు ఒక దిబ్బ పైకెక్కి 200 మందిని పోటీకి ఆహ్వానించిరి. మీరు క్రిందికి దిగినచో మీకు నష్టము జరగదని మోసముతో వారిని బంధించుటకు శత్రువు యత్నించెను. మేము అవిశ్వాసుల వాగ్దానమును బాగా అనుభవించియున్నామని ముస్లిముల నాయకుడు చెప్పెను. ఆ తర్వాత ఆకాశాన్ని చూచి వారిట్లు ప్రార్థించిరి. ఓ అల్లాహ్! మా పరిస్థితి నీతో దాగి లేదు. నీ ప్రవక్తకు మా స్థితిని తెలుపుము. ముస్లిముల ఈ చిన్న బృందము మా మాటలకు తలొగ్గడం లేదని చూచిన

అవిశ్వాసులు వారిపై దాడికి దిగిరి. ముస్లిములు ఓటమి భయం లేకుండా వారితో వీరోచితంగా పోరాడిరి. తుదకు పది మందిలో 7గురు అమరులు కాగా ముగ్గురు మిగిలిరి. మీరు దిబ్బ దిగి క్రిందికి వచ్చినచో మీకు ప్రాణ హాని కలగదని మరల అవిశ్వాసులు వాగ్దానము చేసిరి. కాని ఆ ముగ్గురు వారి మాటలను విశ్వసించి క్రిందికి రాగానే అవిశ్వాసులు వారిని బంధించిరి. మీరు మీ వాగ్దానమును భంగపరిచారనుటకు ఇది మొదటి అడుగని వారిలో ఒకరు నిరసన తెలిపెను. మీ తదుపరి చర్య ఏమిటో అల్లాహ్‌కే తెలుసు. ఆ తర్వాత అతడు వారితో పోవుటకు నిరాకరించెను. అవిశ్వాసులు అతన్ని హింసించుచూ తమ వెంట ఈడ్చుకు పోవుటకు ప్రయత్నించిరి. కాని అతని నిరసన, స్థిరత్వం వలన వారు నిరాశ చెంది అతన్ని అక్కడే హత్య చేసిరి. మిగిలిన ఇద్దరిని వారు తమ వెంట తీసుకెళ్లి మక్కా వారికి బానిసలుగా విక్రయించిరి. వారిలో ఒకరి పేరు ఖుబైబ్ (రజి) కాగా రెండవ వ్యక్తి జైద్. ఖుబైబ్ (రజి) ను కొనుగోలు చేసిన వాని తండ్రిని బదర్ యుద్ధములో ఖుబైబ్ (రజి) హత్య చేసి యుండిరి. అతను తన తండ్రికి ప్రతీకారముగా వీరిని హత్యచేయాలని కోరెను. ఒక రోజు ఖుబైబ్ (రజి) తన అవసరానికై కత్తి అడిగెను. ఇంతలోనే ఆ ఇంట్లోని ఒక బాలుడు ఆడుకుంటూ వారి వద్దకు వచ్చెను. ఖుబైబ్ ఆ బాలున్ని ఎత్తుకొని తన తొడపై కూర్చొనబెట్టుకునెను. ఆ బాలుని తల్లి ఈ దృశ్యాన్ని చూచి తీవ్ర ఆందోళనకు గురయ్యెను. ఖుబైబ్ (రజి) ఇప్పుడు బాలున్ని హతమార్చునని ఆమె విశ్వసించెను. ఎందుకనగా కొద్ది రోజులలోనే వారు ఖుబైబ్ (రజి) ను హత్య చేయబోచుండిరి. అప్పుడు కత్తి వారి చేతిలో యుండెను. బాలుడు అతనికి అతి సమీపములో వున్నందున అతడు అతనికి నష్టము కలిగించే అవకాశం వుండెను. ఖుబైబ్ (రజి) ఆ తల్లి ముఖముతోనే ఆమె ఆవేదనను గ్రహించి ఇట్లనిరి. నేను నీ కుమారున్ని



హత్య చేయుదునని భావించితివా? అలా ఆలోచించకు. ఎందుకనగా నేను ఇంతటి దుష్కార్యమునకు పాల్పడలేను. ముస్లిములు ఎన్నటికి మోసకారి కారు. ఆ స్త్రీ ఖుబైబ్ (రజి) నిజాయితి, సత్ప్రవర్తనతో చాలా ప్రభావితురాలయ్యెను. ఈ విషయమును ఆ స్త్రీ ఎల్లప్పుడు గుర్తు పెట్టుకొనెను. ఇటువంటి ఉత్తమ ఖైదీని మేమెన్నడు చూడలేదని సదా ప్రశంసించెడిది.

తుదకు ఖుబైబ్ (రజి) ను హత్య చేసి సంబరాలు జరుపు కుందామని ఖుబైబ్ (రజి)ను మక్కా వారు ఒక మైదానములో తీసుకొని పోయిరి. వారి హత్య సమయము దగ్గర పడగానే నేను రెండు రకాతులు నమాజ్ చేసుకుంటానని ఖుబైబ్ (రజి) కోరిరి. ఖురైష్ వారి కోరికను మన్నించిరి. అందరి సమక్షంలో ఖుబైబ్ (రజి) తుది సారి తమ అల్లాహ్ ఆరాధనలో నిమగ్నమైరి. నేను నా ప్రార్థనను ఇంకా కొనసాగించాలని భావించితిని. కాని ప్రాణ భయముతో నేనలా చేయుచున్నానని మీరు ఊహించెదరనే ఆలోచనతో ముగించానని తెలిపిరి. ఆ తర్వాత ప్రశాంతంగా తన తల హంతకుని ముందు వంచుతూ ఈ కవిత్వము చదివిరి.

ولست ابالی حین اُقتل مسلماً　　علیٰ ای جنبٍ کان للّٰہ مصرعی
وذالک فی ذات الالہ وان یشأ　　یبارك علیٰ اوصال شلوٍ ممزعی

అనగా నేను ముస్లిం అయిన స్థితిలో హత్య చేయబడుచున్నాను. హత్యానంతరం నేను ఎటువైపు పడతాను అనే ఆందోళన అనవసరం. ఇదంతా అల్లాహ్ కొరకే. కావున అల్లాహ్ తలచినచో నా శరీర ముక్కలన్నిటిలో శుభములు కలిగించును.

ఖుబైబ్ (రజి) తన కవిత్వమును ముగించకముందే హంతకుడు వారి మెడపై ఖడ్గము తో కొట్టగా తల మట్టిపై పడెను. ఈ సందర్భమున

సంబరాలు జరుపుకొనుటకు వచ్చిన వారిలో సయీద్ బిన్ ఆమిర్ కూడ వుండిరి. తర్వాత అతను ఇస్లాం స్వీకరించెను. ఖుబైబ్ (రజి) హత్య ప్రస్తావన వారి ముందు వచ్చినప్పుడల్లా వారు స్పృహ కోల్పోయేవారు. *(ఇబ్నెహష్షామ్)*

రెండవ ఖైదీ జైద్‌ను కూడా హత్య చేయుటకు బయటికి తీసుకొచ్చిరి. ఈ ప్రదర్శనను తిలకించిన వారిలో మక్కా నాయకుడు అబూసుఫ్యాన్ కూడ వుండెను. నీ బదులు ఇక్కడ ముహమ్మద్ (సల్లం) వుండి నీవు నీ ఇంట్లో సంతోషంగా వుండుటకు ఇష్టపడుదువా? అని జైద్ నుద్దేశించి అబూసుఫ్యాన్ ప్రశ్నించెను. జైద్ చాలా కోపంతో ఇట్లు సమాధానమిచ్చెను. ఓ అబూ సుఫ్యాన్! నువ్వేమనుచున్నావు. అల్లాహ్ ప్రమాణము! ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు మదీనా వీధులలో ఒక్క ముళ్ళు గ్రుచ్చుకొనుట కంటే నా మరణమే మేలు. *(ఇబ్నె హష్షామ్ సంపుటి 2, పుట 122)* ఈ ఆప్యాయతతో అబూసుఫ్యాన్ కూడ ప్రభావితము కాక తప్పలేదు. అతను జైద్ వైపు ఆశ్చర్యముతో చూచి మెల్లగా ఇట్లనెను. అల్లాహ్ సాక్ష్యముగా! ముహమ్మద్ (సల్లం) అనుచరులు ముహమ్మద్ (సల్లం) ను ప్రేమించిన విధముగా ప్రపంచములో ఎవ్వరు మరొకరిని ప్రేమించినట్లు నేను చూడలేదు.

### 70 పవిత్ర ఖురాన్ కంఠస్తుల హత్య సంఘటన

ఈ రోజులలోనే నజద్ ప్రాంత వాసులు ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చిరి. మాతో కొందరు ముస్లిములను పంపినచో వారు మాకు ఇస్లాం బోధించెదరని వారు విన్నవించిరి. ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని విశ్వసించలేదు. కాని మదీనాలో నివాసముంటున్న అబూబరా అను వ్యక్తి నేను ఆ జాతి తరపున జామీనుగా వుంటాను, వారెలాంటి నమ్మక ద్రోహానికి పాల్పడరని ఆన్‌హజ్రత్



సల్లల్లాహు అలైహి వసల్లంను నమ్మబలికెను. ఫలితముగా ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం 70 మంది పవిత్ర ఖురాన్ కంఠస్తులను ఈ కార్యము కొరకు ఎంపిక చేసిరి. వీరు బీరె మవూన ప్రాంతానికి చేరినప్పుడు వీరిలో ఒకరు హరామ్ బిన్ మల్హాన్ అబూబరా సోదరుని కుమారుడైన ఆమిర్ జాతి నాయకునికి ఇస్లాం సందేశం అందించుటకు వెళ్లెను. ఆ జాతి వారు బాహ్యరూపంలో హరామ్‌ను సాదరంగా ఆహ్వానించిరి. కాని నాయకుని ఎదుట వారు ప్రసంగించుచుండగా వెనుక నుండి ఒక వ్యక్తి గుప్తముగా వచ్చి బల్లెముతో వారిపై దాడి చేసెను. హరామ్ అక్కడికక్కడే మృతి చెందిరి. బల్లెము వారి గొంతును దాటినప్పుడు వారీ విధముగా నినదించినట్లు వినబడెను. الله اكبر فُزت وربِّ الكعبة అనగా అల్లాహ్ గొప్పవాడు కాబా ప్రభువు ప్రమాణము! నేను సఫలమైతిని.

నమ్మకద్రోహముతో హరామ్ (రజి) ను హత్య చేసిన తర్వాత మిగతా శిక్షకుల బృందమును కూడ హతమార్చవలెనని జాతి వారిని నాయకులు రెచ్చగొట్టిరి. కాని మా నాయకుడు అబూబరా జామీనుగా వున్నందున మేము ఈ బృందంపై దాడి చేయడము కుదరదని జాతి వారు సమాధానమిచ్చిరి. ముస్లిం శిక్షకులను తీసుకరావడానికి వెళ్లిన రెండు జాతుల వారి సహాయంతో ఈ జాతి నాయకులు శిక్షకుల బృందంపై దాడి చేసిరి. మేము యుద్ధము చేయుటకు కాదు ఇస్లాం బోధించుటకు వచ్చామని ముస్లింలు ఎంత మొరపెట్టుకున్నా వారు పట్టించుకోలేదు. అవిశ్వాసులు ముస్లిములను హతమార్చడం మొదలు పెట్టిరి. అంతిమంగా ముగ్గురు ముస్లిములు తప్ప మిగతా వారందరు అమరులైరి. ఈ బృందంలో ఒకడు కుంటి వాడుండెను. అతడు యుద్ధము మొదలు కాక ముందే పర్వతము పైకి వెళ్లిపోయెను. ఒంటెలను మేపుటకు అరణ్యానికి మరో ఇద్దరు వ్యక్తులు వెళ్లియుండిరి. తిరిగి వచ్చి వారి 66 మిత్రులు

మైదానములో విగతజీవులై పడి వున్నట్లు వారు చూచిరి. వారిరువురు పరస్పరము మాట్లాడుకొని ఈ విషయమును ఆన్‌హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలుపవలెనని ఒకరు అభిప్రాయపడెను. మరొకరు ఆన్‌హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం మనకు ఒక నాయకున్ని నియమించెను. అతను హతమైన ప్రదేశమును నేను వదిలి వెళ్లలేను అనుచు అతడు ఒంటరిగా దాడికి దిగి పోరాడుచూ హతమయ్యెను. మరో వ్యక్తి బంధించబడెను. కాని తర్వాత ఒక జాతి నాయకుని ప్రమాణము వలన అతన్ని వదిలిరి. హతమైనవారిలో హ్రజత్ అబూబకర్ (రజి) స్వేచ్ఛ కల్పించిన బానిస ఆమిర్ బిన్ ఫుహైరహ్ కూడ వుండిరి. వారిని జబ్బార్ బిన్ సల్మా అను వ్యక్తి హత్య చేసెను. అతను తర్వాత ఇస్లాంలో చేరెను. నేను ఇస్లాం స్వీకరించుటకు ఆమిర్ హత్యే కారణమయ్యెనని జబ్బార్ తెలుపుచుండేవారు. ఎందుకనగా నేను ఆమిర్‌ను హత్య చేయుచుండగా ఆమిర్ فُزْتُ وَاللهِ అనగా అల్లాహ్ ప్రమాణము! నేను సఫలమైనానునది వింటిని. ముస్లిం మరణము ఎదురైనప్పుడు ఎందుకిలా అంటాడని నేనొక వ్యక్తిని తర్వాత ప్రశ్నించితిని. దైవ మార్గములో మరణించుటను ముస్లిములు ఒక అనుగ్రహంగా, విజయముగా భావించుదురని అతడు చెప్పెను. ఈ సమాధానము విని జబ్బార్ ప్రభావితుడై అతను ఇస్లాం గురించి క్రమం తప్పకుండా వివరాలు సేకరించెను. అంతిమంగా ఇస్లాంలో ప్రవేశించెను. *(అసదుల్ ఘాబహ్, సీరత్ ఇబ్నె హష్షామ్ పేజి 127)* ఈ రెండు విషాదకర సంఘటనలలో మోసపూరిత కుట్ర వలన దాదాపు 80 మంది ముస్లిములు అమరులైన వార్త మదీనాలో వ్యాపించెను. హతమైన వారు సాధారణ వ్యక్తులు కాదు వారు పవిత్ర ఖురాన్ కంఠస్తులు. వీరెలాంటి నేరమునకు పాల్పడలేదు. వారెవరికి బాధ కలిగించలేదు. వారు ఏ యుద్ధము లో కూడ పాల్గొనలేదు.



అల్లాహ్, ధర్మము పేరున వారిని మోసముతో శత్రువుల చేతికందించబడి యుండిరి. ఈ సంఘటనలతో అవిశ్వాసులకు ఇస్లాంతో గట్టి శత్రుత్వముండెనని స్పష్టమగును. ముస్లిములకు కూడ ఇస్లాంపై అంతే నమ్మకము, విశ్వాసముండెనని కూడ తెలియును.

## బనీ ముస్తలఖ్ యుద్ధము

ఉహద్ యుద్ధము తర్వాత మక్కాలో కఠిన కరువు ఏర్పడెను. నబి కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో మక్కా నివాసులకు శత్రుత్వముండెను. వారికి వ్యతిరేకంగా వారు పన్నుచున్న కుయుక్తులను, ద్వేషమును దేశవ్యాప్తంగా వ్యాపింపజేసిరి. ఆ విషయమును పూర్తిగా విస్మరించి ఆన్‌హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాలోని నిరుపేదల సహాయార్థం కొంత డబ్బు సేకరించిరి. ఈ ఉపకారము వలన మక్కా వారిలో ఎలాంటి మార్పు రాలేదు. వారి శత్రుత్వము తగ్గలేదు. శత్రుత్వములో మరింత రెచ్చిపోయిరి. ముస్లిముల తో సానుభూతి గల జాతులు కూడ శత్రువులైరి. అటువంటి జాతులలో ఒకటి బనీముస్తలఖ్ యుండెను. వీరు ముస్లిములతో సత్సబంధాలు కలిగి యుండిరి. కాని ఇప్పుడు వారు మదీనాపై దాడి చేయుటకు సన్నాహాలు మొదలుపెట్టిరి. వారి సన్నాహాల గురించి ఆన్‌హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిసెను. కనుక వారు వాస్తవము తెలుసుకొనుటకు కొందరిని పంపిరి. వారు తిరిగొచ్చి ఆ వార్తలను ధ్రువీకరించిరి. స్వయంగా వెళ్లి ఈ క్రొత్త దాడిని ఎదుర్కొనాలని ఆన్‌హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయించిరి. వారు ఒక సైన్యమును సమకూర్చి బనూ ముస్తలఖ్ వైపు బయలు దేరిరి. శత్రువుతో ముస్లిములు తలపడినప్పుడు యుద్ధము జరక్కుండానే శత్రువు వెనక్కి వెళ్లుటకు అంగీకరించాలని ఆన్‌హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రయత్నించిరి. కాని వారు తిరస్కరించిరి. కావున యుద్ధము జరిగెను.

కొద్ది గంటల వ్యవధిలోనే శత్రువు అపజయమునొందెను.

ఒక వైపు మక్కా అవిశ్వాసులు ముస్లిములకు నిర్విరామంగా నష్టము కలిగించుచుండిరి. మరో వైపు మిత్రపక్షముగా వున్న జాతులు కూడ శత్రువులుగా మారుచుండిరి. ముస్లిములలో వుంటున్న దాంబికులు ముస్లిముల తరపున యుద్ధములో పాల్గొనుటకు సాహసించిరి. తద్వారా ముస్లిములకు నష్టము కలిగించే అవకాశము లభించునని వారు ఊహించిరి. కాని బనూముస్తలఖ్‌తో జరిగిన యుద్ధము కొన్ని గంటలలోనే ముగిసెను. అందుకే ఈ యుద్ధములో ముస్లిములకు నష్టము కలిగించే అవకాశము దాంబికులకు లభించలేదు. బనూముస్తలఖ్ పట్టణములో కొన్ని రోజులు బస చేయాలని ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయించిరి. వారు బస చేసిన రోజులలో మక్కాకు చెందిన ఒక ముస్లింనకు మదీనా ముస్లింనకు మధ్య బావి నుండి నీరు తోడుటలో వివాదము జరిగెను. మక్కాకు చెందిన ముస్లిం ఒక స్వేచ్ఛ పొందిన బానిస. అతడు మదీనా ముస్లింను కొట్టెను. అప్పుడతడు మదీనా వారిని అనగా అన్సార్‌ను సహాయమునకు పిలిచెను. మక్కా వ్యక్తి ముహాజిర్లతో సహాయము కోరెను. ఇంతలోనే ఉద్రేకము పెరిగిపోయెను. అసలు సంఘటన తెలుసుకొనుటకు ఎవరు ప్రయత్నించలేదు. ఇరు పక్షాల యువకులు ఖడ్గములు తీసిరి. అబ్దుల్లాహ్ బిన్ ఉబె ఇబ్న్ సలూల్ ఈ అవకాశము దేవుడు కల్పించాడని భావించి అగ్నికి ఆజ్యం పోయుటకు సిద్ధపడెను. మదీనా వాసులనుద్దేశించి ఇట్లు ప్రసంగించెను. ఈ ముహాజిర్లపై మీరు మితిమీరిన ఉపకారములు చేయుచున్నారు. మీ ఉపకారము ఈ ముహాజిర్లపై హద్దులు దాటెను. మీ సత్ప్రవర్తన వలన వీరు అహంకు గురైరి. రోజు రోజు వీరు మిమ్ములను నిర్లక్ష్యము చేయుచున్నారు. కొద్ది సమయంలోనే అబ్దుల్లాహ్ ఆశించిన విధంగా అతని



ఉపన్యాసము మదీనా వారిని ప్రభావితము చేయబోవు చుండెను. కాని అలా జరగలేదు. అతడు తన విషపూరిత ప్రసంగమును అంచనా వేయుటలో తప్పు చేసెను. అన్సార్లను ప్రభావితం చేసినానని అతడు భావించెను. మనము తిరిగి మదీనా చేరుకున్న తర్వాత అత్యంత గౌరవనీయ వ్యక్తి అత్యంత నీచమైన వ్యక్తిని మదీనా నుండి బహిష్కరించునని అతడనెను. అతని దృష్టిలో తాను అత్యంత గౌరవనీయ వ్యక్తి, ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అత్యంత నీచమైన వ్యక్తి (نعوذ بالله من ذالک) అతని నోట ఈ మాటలు వెలువడగానే విశ్వాసులు యదార్థమును అర్థం చేసుకొనిరి. ఇది సాధారణ విషయము కాదు. మమ్ములను మార్గభ్రష్టులుగా చేయుటకు వచ్చిన షైతాన్ వాక్యమని వారు మాట్లాడుకొనిరి. ఒక నవయువకుడు లేచి తన చిన్నాన ద్వారా ఈ విషయమును ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు చేరవేసెను. వారు అబ్దుల్లాహ్ బిన్ ఉబె ఇబ్న్ సలూల్, అతని సహచరులను పిలిపించి వాస్తవమును విచారించిరి. అబ్దుల్లాహ్ అతని సహచరులు పూర్తిగా నిరాకరించి, ఈ సంఘటన మాతో జరగలేదని చెప్పిరి. వారు వారిని ఏమి అనలేదు. కాని నిజమైన విషయము వ్యాపించడం మొదలైనది. కొన్ని రోజుల తర్వాత అబ్దుల్లాహ్ బిన్ ఉబె ఇబ్న్ సలూల్ కుమారుడు అబ్దుల్లాహ్‌కు కూడ ఈ విషయము తెలిసెను. అతడు వెంటనే ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లు మనవి చేసెను. ఓ అల్లాహ్ సందేశహరుడా! నా తండ్రి మిమ్ములను అవమానించెను. దీనికి శిక్ష మరణము. మీరు ఇదే నిర్ణయము తీసుకొనినచో నా తండ్రి తల నరికే ఆజ్ఞ నాకివ్వగలరని నేను కోరుచున్నాను. ఈ ఆజ్ఞ మీరు మరొకరికిచ్చినచో నా తండ్రి అతని చేతిలో మరణించును. అప్పుడు నా తండ్రి ప్రతీకారము తీసుకొనుటకు నేనతన్ని హత్య చేసి దైవ అసంతృప్తికి గురవుదును. అప్పుడు ఆన్‌హజ్రత్ సల్లల్లాహు

అలైహి వసల్లం అలాంటిదేమి లేదు. నేను నీ తండ్రితో అనుగ్రహ, మెతక వైఖరిని అనుసరింతునని చెప్పిరి. *(ఇబ్నె హష్షామ్ సంపుటి 2,పుట 169)* ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కృప, దయకు విరుద్ధముగా తన తండ్రి నీచ వాక్యములను అబ్దుల్లాహ్ పోల్చుకొనినప్పుడు అతని విశ్వాసము పెరిగిపోయెను. ఈ నిష్పత్తిలోనే తన తండ్రి పట్ల అతని కోపము అధికమయ్యెను. సైన్యము మదీనాకు సమీపమున చేరినప్పుడు అతడు ముందుకు వచ్చి తన తండ్రి దారికి అడ్డు వచ్చి ఇట్లనెను. నీవు ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను అన్న మాటలను వెనక్కి తీసుకొని, దైవ సందేశహరుడు నీచుడు, నీవు గౌరవస్తుడవు అని ఏ నోటితోనైతే అంటివో, అదే నోట నీవు నీచుడవు దైవ సందేశహరుడు గౌరవస్తుడని వ్యాఖ్యానించేంత వరకు నేను నిన్ను ముందుకు వెళ్లనివ్వనని భీష్మించెను. అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్న్ సలూల్ ఆశ్చర్యానికి లోనై భయపడుచు ఇట్లనెను. ఓ నా కుమారుడా ! నేను నీ మాటలతో ఏకీభవించుచున్నాను. ముహమ్మద్ (సల్లం) గౌరవస్తులు, నేను నీచుడనని ఒప్పుకొనెను. అప్పుడు నవయువకుడు అబ్దుల్లాహ్ తన తండ్రిని వదిలిపెట్టెను. *(తబ్ఖాతె కబీర్ లిఇబ్ని సాద్ ఖిసమ్ అవ్వల్ జుజ్ సానీ పేజి 46)*

## మదీనాపై మొత్తం అరబ్బుల దాడి - కందక యుద్ధము

ఇంతకు ముందు యూదుల రెండు జాతుల ప్రస్తావన జరిగినది. యుద్ధము, అశాంతి, హత్య, హత్యారోపణల వలన మదీనా నుండి బహిష్కరించబడియుండిరి. వాటిలోని బనూ నజీర్‌నకు చెందిన కొందరు సిరియా దేశమునకు వలస వెళ్లిపోయి యుండిరి. మరికొందరు మదీనాకు ఉత్తరాన ఖైబర్ పట్టణముకు వలసపోయి యుండిరి. అరబ్‌లో ఖైబర్ యూదులకు పెద్ద కేంద్రముగా నుండెను. అది సురక్షిత కోటలతో నిర్మితమైన పట్టణము. బనూ నజీర్ ఇక్కడికి వచ్చి ముస్లిములకు



వ్యతిరేకంగా అరబ్బులను రెచ్చగొట్టడం ప్రారంభించెను. మక్కా నివాసులు ముందే వ్యతిరేకులు అయినందున వారికి నూరిపోసేదేమి లేకుండెను. అరబ్ జాతులలో ఉన్నత స్థానము కలిగిన ఘత్ఫాన్ నామము గల నజద్ జాతి కూడ మక్కా వారితో మిత్రుత్వము వలన ఇస్లాంకు వ్యతిరేకంగానే వుండెను. ఇప్పుడు యూదులు ఖురైష్, ఘత్ఫాన్ తో పాటు మరో శక్తివంతమైన బనూ సలీమ్, బనూ అసద్ జాతులను ముస్లిములకు వ్యతిరేకంగా రెచ్చగొట్టుట ప్రారంభించిరి. యూదుల మిత్రపక్షమైన బనూసాద్ జాతిని మక్కా అవిశ్వాసులకు సహకరించాలని సిద్ధము చేసిరి. ఒక సుదీర్ఘ కార్యాచరణ తర్వాత అరబ్‌కు చెందిన అన్ని బలమైన జాతుల ద్వారా ఒక ఐక్య కూటమికి పునాది వేయబడెను. ఇందులో మక్కా వారు, మక్కా చుట్టు ప్రక్కల జాతులు, నజద్, మదీనా ఉత్తరాన వున్న జాతులు, యూదులు కూడ వుండిరి. ఈ జాతులన్ని కలిసి మదీనాపై దాడి చేయుటకు ఒక శక్తివంతమైన సైన్యమును సిద్ధము చేసిరి. ప్రస్థానమునకు 5వ సం॥ షవ్వాల్ నెల కాగా ఫిబ్రవరి చివర, మార్చి క్రీ.శ. 627 లోనిది ఈ సంఘటన. ఈ సైన్యపు సంఖ్య 10 వేల నుండి 24 వేలని వివిధ చరిత్రకారులు అభిప్రాయపడిరి. కాని మొత్తం అరబ్ ఏకమైనందున కేవలం పది వేల సైనికులు కానేకాదు. 24 వేల అంచనా నిశ్చయముగా సరైనది. లేనిచో కనీసం 18 నుండి 20 వేల వరకు ఈ సైన్యము తప్పక వుండవచ్చును. మదీనా ఒక సాధారణ గ్రామము మాత్రమే. ఈ గ్రామముపై యావత్ అరబ్ దాడి చేయుట సాధారణ విషయం కాదు. మదీనాలో పురుషులందరిని (వృద్ధులు, యువకులు, పిల్లలు) లెక్కించినా 3 వేల మంది వుండెదరు. శత్రువుల సైన్యములో 20 నుండి 24 వేల సైనికులు యుండిరి. వారందరు యువకులు, యుద్ధము చేయు శక్తి గల యుద్ధ సైనికులే. ఎందుకనగా నగరములో వుండి రక్షణ ఏర్పాట్లు చూసుకొనుటలో

పిల్లలు, వృద్ధులు అందరుందురు. కాని దాడి చేయుటకు దూర ప్రాంతానికి వెళ్లినప్పుడు అందులో యువకులు, బలమైనవారే వుందురు. అందుకే నిశ్చయముగా శత్రువుల సైన్యములో నున్న 20 నుండి 24 వేల మంది యువకులు, అనుభవజ్ఞులైన సైనికులే వుండిరి. కాని మదీనాలోని మొత్తం పురుషుల సంఖ్య పిల్లలను, వికలాంగులను కలుపుకొని కష్టంగా 3 వేలు మాత్రమే యుండెను. ఈ విషయములను పరిగణించినచో మదీనా సైన్యపు సంఖ్య 3 వేలు, శత్రువుల సంఖ్య 40 వేలని ఊహించవలెను. శత్రువుల సైన్యపు సంఖ్య 20 వేలని భావించినచో ముస్లిముల సంఖ్య పదిహను వందలు మాత్రమే భావించవచ్చును. ఈ సైన్యము ఏకమై దాడి సన్నాహాల వార్త రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు అందినప్పుడు అనుయాయులను సమావేశపర్చి అనుసరించాల్సిన వ్యూహం గురంచి అభిప్రాయము అడిగిరి. ఫారసీయులలో మొట్ట మొదటగా సల్మాన్ ఫార్సి (రజి) ఇస్లాంలో చేరిరి. మీ దేశములో ఇటువంటి పరిస్థితులలో ఏమి చేయుదురని వారిని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అడిగిరి. ఓ రసూలుల్లాహ్! నగరానికి భద్రత లేక, సైనికులు తక్కువ వున్నచో మా దేశములో కందకము త్రవ్వి అందులో వుండెదమని తెలిపిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు వారి ఈ అభిప్రాయము నచ్చెను. మదీనాకు ఒక వైపు పర్వతములుండెను. మరో వైపు ఒకదానికొకటి ఆనుకొని గృహములుండెను. శత్రువు కేవలం కొన్ని వీధుల ద్వారానే రాగలడు. మూడవ వైపు కొన్ని గృహములు, తోటలు, కొంత దూరంలోనే యూదుల జాతి బనూఖురైజ కోటలుండెను. ఈ జాతి ముస్లిములతో శాంతి ఒప్పందము కుదుర్చుకొని యుండెను. కావున అటు వైపు కూడ సురక్షితమేనని భావించబడెను. నాలుగవ వైపు విశాలమైన మైదానముండెను. ఇటునుండే ఎక్కువ ప్రమాదముండెను. శత్రువు



అకస్మాత్తుగా నగరములో ప్రవేశించకూడదని ఈ ఖాళీ మైదానము వైపు కందకము త్రవ్వుటకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయించిరి. అందుకు పది పది గజముల స్థలము త్రవ్వుటకు పది పది మందిని నియమించిరి. ఈ విధంగా సుమారు ఒక మైలు పొడవైన కందకము త్రవ్విరి. కందకము త్రవ్వుచున్న సమయమున ఒక పెద్ద రాయి అడ్డు వచ్చెను. అది ఎవరితో పగలకుండెను. అందుకే అనుచరులు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయం తెలుపగా వారు స్వయాన అక్కడికి వచ్చిరి. వారు తన చేతిలో సమ్మెటతో ఆ రాయిని గట్టిగా కొట్టిరి. ఆ దెబ్బ రాయిపై పడగానే ఒక కాంతి వెలువడెను. అప్పుడు వారు అల్లాహు అక్బర్ అనిరి. రెండవ సారి సమ్మెట కొట్టగా రాయి నుండి మరల కాంతి వెలువడెను వారు అల్లాహు అక్బర్ అనిరి. మూడవ సారి వారు సమ్మెట కొట్టగా రాయి నుండి మరల కాంతి వెలువడి రాయి పగిలి పోయెను. అప్పుడు వారు మరల అల్లాహు అక్బర్ అనిరి. ఓ రసూలుల్లాహ్! మీరు మూడు పర్యాయములు అల్లాహు అక్బర్ ఎందుకన్నారని అనుచరులు ప్రశ్నించగా వారిట్లు బదులిచ్చిరి. 'రాయి పై కొట్టినప్పుడు మూడు సార్లు కాంతి వెలువడిన ప్రతి సారి భవిష్యత్తులో ఇస్లాంకు లభించే ప్రగతి నాకు చూపబడెను. మొదటి సారి కాంతిలో సీరియా చక్రవర్తి ఖైసర్ ప్రభుత్వ భవనాలు చూపి, వాటి తాళంచెవిలు నాకివ్వబడినవి. రెండవ సారి కాంతిలో మదాయిన్ తెల్ల భవనాలు చూపించి, ఫారసీక దేశపు తాళం చెవిలు నాకివ్వబడెను. మూడవ సారి కాంతిలో సన్ఆ ద్వారములు నాకు చూపబడి, యమన్ ప్రభుత్వ తాళం చెవిలు నాకివ్వబడెను. కనుక అల్లాహ్ వాగ్దానములను మీరు నమ్ముము! శత్రువు మీకెట్టి నష్టము కలిగించలేడు.'

*(అస్సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 2 పుట 243, జర్ఖాని సంపుటి*

*2, సీరత్ ఇబ్నె హష్షామ్ సంపుటి 2 పుట 140)*

ఈ కొద్ది మంది సైనిక విధానములో ఇంత పెద్ద కందకము త్రవ్వలేరు. శత్రువు అకస్మాత్తుగా ప్రవేశించకుండా ఉండటానికి మాత్రమే ఈ కందకము ఉపయోగపడును. కాని శత్రువు దీనిని దాటి రావడం అసాధ్యమేమి కాకుండెను. మున్ముందు ప్రస్తావించబడే సంఘటనలు ఇదే విషయాన్ని బలపర్చును. మదీనా భౌతిక స్థితిగతులను పరిశీలించి శత్రువు కూడ ఇటువైపు నుండే దాడి చేయుటకు నిర్ణయించెను. కనుక శక్తివంతమైన శత్రువు సైన్యము ఇటువైపు నుండి యుద్ధము ప్రారంభించుటకు ముందుకు వచ్చెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము తెలిసెను. కొందరిని నగరములోని ఇతర ప్రాంతాల రక్షణ కొరకు పంపి 12 వందల మందిని తన వెంట బెట్టుకొని కందకము రక్షణ కొరకు వెళ్లిపోయిరి.

**కందక యుద్ధములో ఇస్లామీ సైన్యపు వాస్తవ సంఖ్య ఎంత**

ఈ సందర్భమున ముస్లిం సైన్యపు సంఖ్యను గూర్చి చరిత్రకారులలో అభిప్రాయ భేదము గలదు. కొందరు ఈ సైన్యపు సంఖ్య 3 వేలు, ఇంకొందరు 12, 13 వందలు, మరికొందరు 7 వందలని వ్రాసిరి. ఇంత పెద్ద తేడాను పరిష్కరించుట చాల కష్టతరమైనది. అందుకే చరిత్రకారులు దీనిని పరిష్కరించ లేక పోయిరి. కాని నేను వాస్తవమును తెలుసుకొంటిని. అదేమనగా ఈ మూడు రకాల అభిప్రాయాలు సరియైనవే. ఉహద్ యుద్ధములో దాంబికులు తిరిగి పోయిన తర్వాత ముస్లిం సైన్యపు సంఖ్య 7 వందలే వుండెనని ఇంతకు ముందే వివరించనైనది. తర్వాత 2 సం॥లకే ఈ అహ్జాబ్ (కందక) యుద్ధము సంభవించెను. ఈ మధ్య ఎటువంటి పెద్ద జాతి ఇస్లాం స్వీకరించి మదీనాలో నివసించుటకు రాలేదు. కావున 7 వందల మంది ఒక్కసారిగా 3 వేలు అగుట అసాధ్యము.



ఉహద్ తర్వాత రెండు సం॥ల వరకు ఇస్లాం అభివృద్ధి చెందెను. అయినను యుద్ధములో పాల్గొను ముస్లిముల సంఖ్య ఉహద్ లో పాల్గొన్న అదే 7 వందలు వుండెను. ఈ రెండు విషయాలను విమర్శనాత్మక రీతిలో పరిశీలించిన తర్వాత, యుద్ధములో పాల్గొనే అర్హత గల ముస్లిముల సంఖ్య కందక యుద్ధ సమయమున 12 వందలే సరియైన సంఖ్య అని తెలియును. మరి కొందరు 3 వేలు, కొందరు 7 వందలని ఎందుకు వ్రాసినారను ప్రశ్న ఉద్భవించును. దాని సమాధానమేమనగా ఈ రెండు అభిప్రాయాలు వేర్వేరు స్థితులను దృష్టియందుంచు కొని ప్రస్తావించబడినవి. అహ్జాబ్ యుద్ధములో మూడు భాగాలు యుండెను. ఒకటి శత్రువు మదీనాకు రాక ముందు కందకము త్రవ్వబడుచుండెను. మట్టి మోయు కార్యమును పిల్లలు చేయవచ్చును. కొందరు మహిళలు కూడ ఈ కార్యములో సహకరించవచ్చును. కనుక కందకము త్రవ్వుచున్నప్పుడు ముస్లిముల సైన్యపు సంఖ్య 3 వేలు వుండెను. కాని ఇందులో పిల్లలు కూడ వుండిరి. అనుచర స్త్రీల ఉత్సాహమును చూచి ఈ సంఖ్యలో మహిళలు కూడ పాల్గొన్నారని మనము భావించవచ్చు. వారు కందకము త్రవ్వకున్నను పై పనులు మాత్రం చేసి వుండవచ్చును. ఇది నా ఆలోచన మాత్రమే కాదు చరిత్ర కూడ నా ఈ విశ్లేషణను ఇట్లు ధ్రువీకరించును. కందకము త్రవ్వే సమయమున పిల్లలందరు ప్రోగుచేయబడిరి. పురుషులు చిన్నా పెద్దా తేడా లేకుండా అందరు కందకము త్రవ్వుటలో సహకరించుచుండిరి. శత్రువు వచ్చి యుద్ధము మొదలైనప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం 15 సం॥ల లోపు పిల్లలు ఇంటికి వెళ్లిపోవచ్చునని ఆదేశించిరి. 15 సం॥లు దాటిన వారు వెళ్ళిపోవచ్చును. లేదా వారి ఇష్టానుసారం వుండవచ్చునని వారు అనుమతించిరి. *(అస్సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 2, పుట 344)*

కందకము త్రవ్వుచున్నప్పుడు ముస్లిముల సంఖ్య ఎక్కువ వుండెనని యుద్ధ సమయమున తగ్గిపోయెనని ఈ అభిప్రాయము ద్వారా స్పష్టమగును. ఎందుకనగా చిన్న పిల్లలను తిరిగి పోవాలని ఆదేశించబడి యుండెను. కావున 3 వేలు సూచించుచున్న అభిప్రాయాలు కందకము త్రవ్వుచున్న సమయములో నున్న సంఖ్యను తెలుపును. ఇందులో పిల్లలు కూడ వుండిరి. నేను ఇతర యుద్ధములను విశ్లేషించి తెలిపిన విధముగా కొందరు స్త్రీలు కూడ వుండిరి. యుద్ధము ప్రారంభమైన సమయములో వున్న వారి సంఖ్య 12 వందలు. అప్పుడు పెద్దలు మాత్రమే మిగిలి యుండిరి. మూడవ అభిప్రాయము ప్రకారము 7 వందల సైనికుల సంఖ్య కూడ సరియైనదేనా ?

దీనికి సమాధానమేమనగా ఈ అభిప్రాయమును నమ్మకమైన చరిత్రకారుడిగా ఖ్యాతి గాంచిన ఇబ్నె ఇస్‌హాఖ్ తెలిపిరి. ఇబ్నె హజమ్ వంటి గొప్ప విద్యావంతుడు దానిని గట్టిగా సమర్ధించెను. అందుకే ఈ విషయంలో కూడ సందేహం తగదు. చరిత్ర ఈ విషయమును కూడ ఇట్లు బలపర్చును. చరిత్రను లోతుగా అధ్యయనం చేసినచో యుద్ధ సమయమున బనూ ఖురైజ అవిశ్వాసులతో చేతులు కలిపినట్లు తెలియును. అకస్మాత్తుగా మదీనాపై విరుచుకుపడుటకు వారు సంకల్పించిరి. వారి అంతర్గత ఉద్దేశము బహిర్గతమయ్యెను. అప్పుడు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో బనూఖురైజ వైపు కూడ రక్షణ తథ్యమని భావించిరి. బనూఖురైజ మన మిత్రపక్షమైనందున వారు శత్రువును అటు నుండి రానివ్వరని ముస్లిములు ఊహించి అటు రక్షణ ఏర్పాట్లు చేయలేదు. ఎందుకనగా బనూఖురైజపై నమ్మకముతో బనూఖురైజ కోటలు వున్న వైపు రక్షణ ఏర్పాట్లు లేకుండానే మహిళలను వుంచబడెనని చరిత్ర ద్వారా మనకు తెలియును. బనూ ఖురైజ నమ్మక ద్రోహము తెలియగానే రసూలె



కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వారి రక్షణ కూడ తప్పనిసరి అని భావించిరి. రెండు ముస్లిం సైన్యములను ఏర్పరచి స్త్రీలు వున్న రెండు చోట్ల నియమించిరి. ముసల్లమ ఇబ్న్ అస్లమ్ (రజి)కు రెండు వందల అనుచరులను ఇచ్చి ఒక చోట నియమించిరి. జైద్ బిన్ హార్స (రజి)కు మూడు వందల అనుచరులను ఇచ్చి మరో ప్రాంతములో నియమించిరి. స్త్రీలు క్షేమంగా వున్నారనే సంకేతంగా కొద్ది కొద్ది సమయము తర్వాత అల్లాహు అక్బర్ అని నినదించమని వారిని ఆదేశించిరి. ఈ అభిప్రాయము ద్వారా కందక యుద్ధములో ముస్లిం సైన్యపు సంఖ్య 7 వందలని ఇబ్నె ఇస్‌హాఖ్ ఎందుకు తెలిపిరో పరిష్కారమయ్యెను. ఎందుకనగా 12 వందల సైన్యములో 5 వందల మందిని స్త్రీల రక్షణ కొరకు పంపగా 12 వందల సైన్యములో 7 వందల మంది మాత్రమే మిగిలిరి. ఈ విధంగా అహ్‌జాబ్ యుద్ధములో పాల్గొన్న సైనికుల సంఖ్యలో తలెత్తిన తీవ్ర విభేదము పరిష్కరించబడెను.

సంక్షిప్తముగా ఈ ప్రమాదకర ఆపద సమయములో కందకము రక్షణ కొరకు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద కేవలం 7 వందల సైనికులు మాత్రమే మిగిలిరి. వారు (స) కందకము త్రవ్విరను విషయములో ఎట్టి సందేహము లేదు. ఆ కందకము దాటి రాకుండా ఇంత పెద్ద సైన్యమును అరికట్టుట ఆ కొద్ది సైనికులతో అసాధ్యమైన విషయము. కాని అల్లాహ్ సహాయమును నమ్ముకొని విశ్వాసుల ఈ చిన్న బృందం కందకము వెనుక శక్తివంతమైన శత్రువుల సైన్యమును ఎదుర్కొనుటకు నిరీక్షించసాగెను. స్త్రీలను, పిల్లలను రెండు వేర్వేరు చోట్ల వుంచబడెను. శత్రువు కందకము వద్దకు రాగానే ఈ వింతను చూచి వారు యుద్దమునకు సిద్దము కాలేదు. వారు కందకము ముందు తమ గుడారాలు వేసుకొనిరి. ఆపై మదీనాలోకి ప్రవేశించుటకు ఉపాయములు

ఆలోచించసాగిరి.

## బనూ ఖురైజ నమ్మక ద్రోహం

కందకం వలన మదీనా ఒక వైపు చాలా వరకు సురక్షితంగా వుండెను. రెండవ వైపు కొన్ని పర్వతములు, పక్కా గృహములు, తోటలు వుండెను. అందుకే సైన్యము మూకుమ్మడిగా దాడి చేయలేక పోయెను. కనుక వారు అభిప్రాయములు సేకరించి మదీనాలో నివాసముంటున్న యూదుల మూడవ జాతి బనూ ఖురైజను తమతో కలుపుకొని దీని ద్వారా మదీనా వరకు చేరు దారి తెరువవలెనని నిర్ణయించిరి. బహిష్కరణకు గురైన బనూనజీర్ నాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ కుట్రల ఫలితంగా మొత్తం అరబ్ మదీనాపై దాడికి సన్నద్ధమై యుండెను. కనుక సలహాల తర్వాత అవిశ్వాసుల సేనాపతి అబూసుఫ్యాన్ ఇతన్ని శతవిధాలా ప్రయత్నించి బనూ ఖురైజ జాతిని మనకు సహకరించేలా ఒప్పించాలని నియమించెను. హుయ్యి బిన్ అఖ్తబ్ యూదుల కోటల వైపు వెళ్లి బనూఖురైజ జాతి నాయకులను కలుసుకొనుటకు ప్రయత్నించెను. మొదట వారు కలుసుకొనుటకు నిరాకరించిరి. కాని అతడిట్లు ఉసిగొల్పెను. ఇప్పుడు మొత్తం అరబ్ ముస్లిములను నాశనము చేయుటకు వచ్చెను. ఈ నగరము ఎట్టి పరిస్థితిలో మొత్తం అరబ్‌ను ఎదుర్కొనలేదు. ముస్లిముల ముందు నిలబడిన ఈ సైన్యము సాధారణమైనది కాదు, ఒక పెద్ద సమూహము. ఈ మాటలతో అతను బనూఖురైజ జాతిని వెన్నుపోటు, నమ్మక ద్రోహానికి ఒప్పించెను. ఆ తర్వాత జరిగిన ఒప్పందం ప్రకారం అవిశ్వాసుల సైన్యము కందకము దాటుటకు ప్రయత్నించవలెను. వారు కందకము దాటుటలో సఫలమైన తర్వాత మదీనాకు రెండవ వైపు నుండి బనూ ఖురైజ వ్యక్తులు స్త్రీలు, పిల్లలు వున్న చోట దాడి చేయవలెను. ఎందుకనగా బనూ ఖురైజపై నమ్మకముతో రక్షణ లేకుండానే వారిని వుంచబడి యుండెను. ఈ విధంగా



ముస్లిముల పోరాట శక్తిని అణచివేయబడ వచ్చునని తద్వారా ఒకే సారి ముస్లిం పురుషులు, మహిళలు, పిల్లలందరిని హతమార్చవచ్చునని నిర్ణయించబడెను. నిస్సందేహంగా ఈ కుట్రలో కొంచమైనా అవిశ్వాసులకు విజయము లభించినచో ముస్లిములకు ఏమాత్రం రక్షణ లేకుండెను. బనూఖురైజ ముస్లిములకు మిత్రపక్షముగా నుండెను. కావున వారు ప్రత్యక్షంగా యుద్ధములో పాల్గొనకపోయినా, కనీసం అటు నుండి ఎవరు మదీనాపై దాడి చేయలేరనే నమ్మకం ముస్లిములకు వుండెను. అందుకే అటు వైపు భాగాన్ని పూర్తిగా రక్షణ లేకుండా వదిలిరి. బనూఖురైజ, అవిశ్వాసులు కూడ ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని బనూఖురైజ లోలోపల అవిశ్వాసులతో కలిసెను. బహిరంగముగా సహాయము చేయకూడదనే నిర్ణయించిరి. ఎందుకంటే ఈ విషయము ముస్లిములకు తెలిసినచో బనూ ఖురైజ వైపు కూడ ముస్లిములు రక్షణ ఏర్పాట్లు చేసికొందురు. ఈ పన్నాగం చాలా ప్రమాదకరమైనది. ముస్లిముల పై అవిశ్వాసుల శక్తివంతమైన పెద్ద సైన్యము దాడి చేయుచుండెను. ముస్లిములకు తెలియకుండానే బనూ ఖురైజ శత్రువులతో చేతులు కలుపుట వలన బనూ ఖురైజ కోటలు వున్న వైపు మదీనా రక్షణ అసాధ్యమగును. ఇరు వైపుల నుండి ముస్లిములపై దాడి చేసే ఏర్పాట్లు పూర్తయినప్పుడు అవిశ్వాసులు కందకము దాటుటకు ప్రయత్నాలు మొదలు పెట్టిరి. కందకము ఎలా దాటాలో మొదట కొన్ని రోజుల వరకు వారికి ఏమాత్రం అర్థం కాలేదు. కాని 4,5 రోజుల తర్వాత వారికి ఒక ఉపాయము తట్టెను. అనగా బాణములు విసురువారు ఎత్తైన ప్రాంతములో నిలబడి కందకము రక్షణ కొరకు కొంత కొంత దూరాన నిలిచి వున్న ముస్లిములపై వారు బాణాలతో దాడి చేయవలెను. బాణముల తీవ్ర దాడి వలన ముస్లిములు వెనక్కి జరగవలసి వచ్చినప్పుడు అనుభవజ్ఞులైన అశ్వారోహనులు

కందకము దాటుటకు ప్రయత్నించవచ్చును. ఇటువంటి నిరంతర దాడుల వలన ఏదో ఒక చోట మిగతా పాదచార సైన్యము అధిక సంఖ్యలో కందకము దాటుటకు చోటు లభించునని వారు భావించిరి. ముస్లిములకు ఏమాత్రం సడలింపు లేకుండా ఈ దాడులు వెంట వెంటనే నిర్విరామంగా జరుగుచుండెను. ఒక రోజు ఈ దాడులు ముమ్మరమైనందున ముస్లిములు ప్రార్థన కూడ నిర్ణీత సమయములో చేయలేకపోయిరి. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తీవ్ర మనస్తాపానికి గురైరి. అల్లాహ్ అవిశ్వాసులను శిక్షించుగాక! వారు మా ప్రార్థనలకు అవరోధం కలిగించిరని వారు ప్రార్థించిరి. *(బుఖారి సంపుటి 2, కితాబుల్ మఘాజి బాబ్ ఘజ్వతుల్ ఖందక్)* నేను శత్రువుల దాడి తీవ్రతను తెలుపుటకు ఈ సంఘటనను ప్రస్తావించితిని. కాని దీనితో ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తమ గుణములు కూడ స్పష్టంగా తెలియును. దైవస్మరణయే వారికి ప్రపంచములో అత్యంత ప్రియమైనదని స్పష్టమగును. శత్రువు నలు వైపుల నుండి మదీనాను చుట్టుముట్టెను. మదీనా పురుషులే కాదు స్త్రీలు, పిల్లల ప్రాణాలు కూడ ప్రమాదములో వుండెను. ఏ క్షణాన్నైనా శత్రువు మదీనాలోకి ప్రవేశించవచ్చునని మదీనా వాసుల హృదయాలు వేగంగా కొట్టుకుంటుండెను. అప్పుడు కూడా ప్రార్థనలు నిర్ణీత సమయంలో, పూర్తి శ్రద్ధతో చేయాలని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కోరుకునేవారు. ముస్లిముల ప్రార్థన యూదుల, క్రైస్తవుల, హిందువుల వలె వారానికి ఒకసారి గాక ముస్లిములు ప్రతి రోజు ఐదు పూటలు ప్రార్థన చేయుదురు. ఇటువంటి భయంకర సమయంలో రోజుకు ఒక్కసారి కూడ ప్రార్థన చేయుట మానవునికి కష్టతరమే. ఐదు పూటలు సంపూర్ణ శ్రద్ధతో, సామూహిక ప్రార్థన సలుపుట ఎలా సాధ్యమగును. కాని ఇటువంటి ప్రమాదకర రోజులలో కూడ ముహమ్మద్ రసూలుల్లాహ్



సల్లల్లాహు అలైహి వసల్లం ఐదు పూటల నమాజ్ నిర్ణీత ఘడియలలో చదివేవారు. శత్రువుల భీకర దాడుల వలన ఒక్క రోజు పూర్తి శ్రద్ధ, తృప్తితో తన అల్లాహ్‌ను నిర్ణీత సమయంలో గుర్తుచేయలేక పోయినందున వారికి చాలా బాధ కలిగెను. అప్పుడు శత్రువు ముందు వైపు నుండి దాడి చేయుచుండగా బనూ ఖురైజ ముస్లిములకు అనుమానం రాకుండానే మదీనాలోకి ప్రవేశించి స్త్రీలు, పిల్లలను హతమార్చాలని అవకాశము కొరకు నిరీక్షించుచుండిరి. స్త్రీలు, పిల్లలు ఒంటరిగా వున్నారా లేదా వారి రక్షణ కొరకు చాలా మంది సైనికులు పహారా ఇస్తున్నారా అని తెలుసుకొనుటకు బనూ ఖురైజ వారు ఒక గూఢచారిని పంపిరి. శత్రువుల నుండి ఎక్కువ ప్రమాదమున్న ప్రత్యేక కుటుంబములను ఉంచిన ప్రాంతములో ఆ గూఢచారి వచ్చెను. ముస్లిముల సైనికులు ఎక్కడైనా దాగి వున్నారా అని నలు వైపుల సమీక్షించసాగెను. అతను తన ప్రయత్నంలో వుండగానే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అత్తమ్మ హజ్రత్ సఫ్యా అతన్ని గమనించిరి. కాని అప్పుడక్కడ ఒక్క ముస్లిం పురుషుడే వుండెను. అతడు కూడ అనారోగ్యముతో బాధపడుచుండెను. చాలా సమయము నుండి ఇతడు స్త్రీల ప్రాంతములో గస్తి చేయుచున్నాడని, తిరిగి పోవడం లేదని నలువైపుల పరిశీలనగా చూచుచున్నాడని, నిశ్చయముగా ఇతడు గూఢచారి కావచ్చునని ఇతను ఇక్కడి పరిస్థితులను తెలుసుకొని పోయినచో శత్రువు ఇటువైపు దాడి చేసే ప్రమాదముంది. కావున నీవు ఇతనితో పోరాడమని ముస్లిం వ్యక్తితో హజ్రత్ సఫ్యా అనిరి. అనారోగ్యముతో నున్న ఈ అనుచరుడు అలా చేయుటకు నిరాకరించెను. అప్పుడు హజ్రత్ సఫ్యా స్వయంగా ఒక పొడుగాటి వెదురు కట్టెతో అతనిపై దాడి చేసి ఇతర స్త్రీల సహాయంతో అతన్ని హతమార్చెను. తర్వాత విచారణలో అతను బనూ ఖురైజ పంపిన గూఢచారి అని స్పష్టమైనది.

అప్పుడు మదీనా ఇటువైపు నుండి కూడ సురక్షితంగా లేదని ముస్లిములు మరింత భయాందోళనకు గురైరి. కాని ముందు వైపు నుండి శత్రువుల తీవ్ర దాడి వలన ఇటువైపు రక్షణ ఏర్పాటు ముస్లిములకు సంభవం కాలేదు. అయినను స్త్రీల రక్షణకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రాధాన్యత నిచ్చిరి. పైన ప్రస్తావించిన విధంగా స్త్రీల రక్షణకు 12 వందల సైనికులలోని 5 వందల మందిని నగరములో నియమించిరి. 18, 20 వేల సైన్యమును ఎదుర్కొంటూ కందకము రక్షణకై కేవలం 7 వందల సైనికులు మాత్రమే మిగిలిరి. అప్పుడు కొందరు ముస్లిములు భయాందోళనకు గురై రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! పరిస్థితులు చాలా ప్రమాదకరంగా మారినవి. ఇప్పుడు బాహ్య రూపంలో మదీనా రక్షణ అసాధ్యమైనది. మీరు ప్రత్యేక ప్రార్థనలు చేయుము. అల్లాహ్ కృపను ఆకర్షించే విధంగా మాకు కూడ పలు ప్రార్థనలు నేర్పించుము. వారిట్లు ఆదేశించిరి. మీరు చింతించకుము. మీరు అల్లాహ్‌తో ఈ విధంగా ప్రార్థించుము. అల్లాహ్ మీ లోపాలను కప్పిపుచ్చుగాక! మీకు ధైర్యము కల్పించుగాక! మీ భయమును దూరము చేయుగాక! ఆ తర్వాత వారు స్వయంగా ఈ ప్రార్థనలు చేసిరి.

اللّٰھم منزل الکتاب سریع الحساب اھزم الاحزاب اللھم اھزمھم وزلزلھم

అటులనే మరో ప్రార్థన ఇట్లు చేసిరి.

یا صریخ المکروبین یا مجیب المضطرین اکشف ھمی و غمی وکربی۔

فانک تری ما نزل بی وباصحابی

అనగా నాపై పవిత్ర ఖురాన్ అవతరింపజేసిన ఓ అల్లాహ్! తన దాసులతో శీఘ్రగతిలో గణణ చేయుగలవాడు. ఏకమై వచ్చిన ఈ సమూహమును ఓడించుము. ఓ అల్లాహ్! నేను మరల వేడుకుంటున్నాను వీరిని



ఓడించుము. వారి పై మాకు విజయము ప్రసాదించుము. వారి ఉద్దేశముల ను రూపుమాపుము. బాధితుల ప్రార్థనలను వినువాడా! ఆపదలో వున్న ప్రజలకు సమాధానమిచ్చువాడా! నా బాధ, నా చింత, నా భయమును దూరము చేయుము. ఎందుకనగా నేను, నా అనుచరులు ఎదుర్కొంటున్న కష్టములు నీకు తెలుసు.

### దాంబికుల, విశ్వాసుల స్థితిగతుల ప్రస్తావన

ఈ సందర్భములో దాంబికులు తీవ్ర భయాందోళనకు గురైరి. జాతీయ భావము, తమ నగర, తమ స్త్రీల, పిల్లల రక్షణ ఆలోచన కూడ వారిలో లేకుండా పోయెను. కాని తమ జాతి ముందు అవమానమునకు గురి కాకూడదని వివిధ సాకులతో సైన్యము నుండి తప్పుకొనుటకు సిద్ధపడిరి. వారి స్థితిని పవిత్ర ఖురాన్ ఇట్లు వివరించును.

وَيَسْتَأْذِنُ فَرِيْقٌ مِّنْهُمُ النَّبِىَّ يَقُوْلُوْنَ اِنَّ بُيُوْتَنَا عَوْرَةٌ وَمَاهِىَ

عَوْرَةٍ اِنْ يُّرِيْدُوْنَ اِلَّا فِرَارًا ۝ (سورة الاحزاب:١٤)

(అహ్‌జాబ్:14) అనగా వారిలోని ఒక వర్గము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లునుచు యుద్ధ రంగము నుండి తిరిగిపోవుటకు అనుమతి నడిగెను. ఎందుకనగా (ఇప్పుడు యూదులు కూడ వ్యతిరేకులైనందున అటు వైపు నుండి మదీనాకు రక్షణ లేదు) మా గృహములు అటువైపు నుండి సురక్షితముగా లేవు. (కనుక మేము వెళ్ళి మా గృహములను రక్షించుకొనుటకు మాకు అనుమతి ఇవ్వగలరు) కాని వారు మా గృహములు రక్షణలో లేవు అనుట పూర్తిగా తప్పు. అవి రక్షణ లేకుండా లేవు. (ఎందుకనగా అల్లాహ్ మదీనా రక్షణకై నిలిచివుండెను) భయముతో మాత్రమే వారు యుద్ధ రంగము నుండి పారిపోదలచిరి. ఆ సమయములో ముస్లిముల స్థితిని పవిత్ర ఖురాన్ ఇట్లు వివరించెను.

اِذْ جَآءُوْكُمْ مِنْ فَوْقِكُمْ وَمِنْ اَسْفَلِ مِنْكُمْ وَاِذْ زَاغَتِ الْاَبْصَارُ وَبَلَغَتِ الْقُلُوْبُ الْحَنَاجِرَ وَتَظُنُّوْنَ بِاللّٰهِ الظُّنُوْنَا o هُنَالِكَ ابْتُلِىَ الْمُؤْمِنُوْنَ وَزُلْزِلُوْا زِلْزَالًا شَدِيْدًا o وَاِذْ يَقُوْلُ الْمُنَافِقُوْنَ وَالَّذِيْنَ فِىْ قُلُوْبِهِمْ مَّرَضٌ مَّاوَعَدَنَا اللّٰهُ وَرَسُوْلُهٗۤ اِلَّا غُرُوْرًا o وَاِذْ قَالَتْ طَّآئِفَةٌ مِّنْهُمْ يَااَهْلَ يَثْرِبَ لَا مُقَامَ لَكُمْ فَارْجِعُوْا۔ (سورۃالاحزاب:۱۱تا۱۴)

(అల్ అహ్‌జాబ్:11-14) అనగా మీపై సైన్యము దాడి చేసిన సమయమును గుర్తు చేసుకొనుము. మీ పై నుండి కూడ అనగా యూదులు, క్రింది నుండి అనగా అవిశ్వాసులు, అప్పుడు కనులు చూచుట మరచి స్థంబించి, హృదయములు కంపించుచు పైకెగబాకినప్పుడు మీలో అనేకులు అల్లాహ్ గురించి పరిపరివిధములుగా అనుమానించుచుండిరి. అప్పుడు విశ్వాసుల విశ్వాసమును పరీక్షించబడెను. విశ్వాసులు కఠినముగా కదిలించబడిరి. దాంబికులు, హృదయములో రుగ్మతులున్న వారిట్లనిరి. మాతో అల్లాహ్, అతని ప్రవక్త అసత్య వాగ్దానములు చేసియుండిరని అన్నప్పుడు వారిలో ఒక వర్గము ఇట్లనిన సందర్భమును కూడ జ్ఞాపకము చేసుకొనుము. ఓ విశ్వాసులారా! ఏ గుడారము, కోట మిమ్ములను రక్షించలేదు. అందుకే ఇక్కడి నుండి పలాయనమే మేలు. విశ్వాసుల గూర్చి అల్లాహ్ ఇట్లు తెలిపెను. (అల్ అహ్‌జాబ్:23-24)

وَلَمَّا رَاَ الْمُؤْمِنُوْنَ الْاَحْزَابَ قَالُوْا هٰذَا مَاوَعَدَنَا اللّٰهُ وَرَسُوْلُهٗ وَصَدَقَ اللّٰهُ وَرَسُوْلُهٗ وَمَازَادَهُمْ اِلَّا اِيْمَانًا وَّتَسْلِيْمًا o مِنَ الْمُؤْمِنِيْنَ رِجَالٌ صَدَقُوْا مَاعَاهَدُ اللّٰهَ عَلَيْهِ فَمِنْهُمْ مَّنْ قَضٰى نَحْبَهٗ وَمِنْهُمْ مَّنْ يَّنْتَظِرُ وَمَابَدَّلُوْا تَبْدِيْلًا o (سورۃالاحزاب:۲۳تا۲۴)



అనగా దాంబికులు, బలహీన విశ్వాసులకు భిన్నముగా విశ్వాసులు శత్రువుల భీకర సైన్యమును చూచి ఇట్లనిరి. అల్లాహ్, అతని ప్రవక్త మాకు ఈ సైన్యమును గురించి ముందుగనే సమాచారమిచ్చి యుండిరి. ఈ సైన్యము చేసిన దాడి అల్లాహ్, అతని ప్రవక్త సత్యమునకు నిదర్శనము. ఈ భీకర సైన్యము వారి విశ్వాసమును బలహీనపరచలేక పోయెను. విశ్వాసము, విధేయతలో ముస్లిములు మరింత స్ఫూర్తి పొందిరి. విశ్వాసులు అల్లాహ్‌తో చేసిన వాగ్దానమును పూర్తిగా నిర్వహించుచున్నారు. వారిలో కొందరు తమ ప్రాణాలర్పించి తమ లక్ష్యాన్ని పొందిరి. కొందరికి ప్రాణాలర్పించే సందర్భము రాలేదు కాని దైవ మార్గములో ప్రాణాలు సమర్పించు సమయం వచ్చినచో త్యాగము చేయుటకు కూడ ఎదురు చూచుచున్నారు. వారు ఆరంభము నుండే తమ వాగ్దానముపై నిలిచిరి.

## ఇస్లాంలో శవపు గౌరవ, మర్యాదలు

కందకముపై శత్రువు దాడి చేయుచుండెను. ఒక్కోసారి దాన్ని దాటుటలో వారు సఫలమయ్యేవారు కూడ. ఒక రోజు అవిశ్వాసుల పెద్ద పెద్ద నాయకులు కొందరు కందకమును దాటుటలో సఫలమైరి. కాని ముస్లిముల తీవ్ర ప్రతిఘటన వలన వారు తిరిగిపోక తప్పలేదు. ఆ సమయమున నౌఫల్ నామము గల అవిశ్వాసుల ఒక ప్రఖ్యాత నాయకుడు కందకము దాటుచు హతమార్చబడెను. అతడు చాలా పెద్ద నాయకుడైన కారణముతో అతని శవం కించపర్చబడినచో మేము మొత్తం అరబ్‌లో ఎవరికి ముఖము చూపలేమని అవిశ్వాసులు భావించిరి. అతని శవాన్ని మాకు తిరిగిచ్చినచో బదులుగా మేము పది వేల దిర్హమ్‌ల నగదు ఇస్తామని అవిశ్వాసులు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు సందేశం పంపిరి.

మేము ముస్లిముల నాయకుల, స్వయాన రసూలుల్లాహ్ సల్లల్లాహు

అలైహి వసల్లం చిన్నాన హజ్రత్ హమ్జ (రజి) ముక్కు, చెవులను ఉహద్ యుద్ధములో కోసివేసితిమి. నేడు ముస్లిములు కూడ బహుశ మా నాయకుని ముక్కు, చెవులు కోసివేసి మా జాతిని అవమానించెదరని అవిశ్వాసులు భావించిరి. కాని ఇస్లాం ఆదేశాలు మరో విధంగా వుండెను. శవాలను అగౌరవపరచే అనుమతి ఇస్లాంలో లేదు. అవిశ్వాసుల సందేశము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు అందగా వారిట్లనిరి. ఈ శవము మాకెందుకు ? ఈ శవము మాకేమి ఉపయోగపడునని మీతో మేము దీని బదులు ధర తీసుకొనవలెను. మీ శవమును మీరు ఆనందముగా తీసుకొని పోగలరు. మాకు దీనితో ఎలాంటి సంబంధము లేదు. *(అస్సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 2 పుట 345)*

**కూటమి సైన్యములచే ముస్లిములపై దాడి**

ఆ రోజులలో అవిశ్వాసులు ఎంత ఉద్రేకముతో దాడి చేయుచుండిరో. ఆ విషయాన్ని మయూర్ ఇట్లు ప్రస్తావించెను.

"కూటమి సైన్యములు మూకుమ్మడిగా వారి పై దాడి చేయుటకు సిద్ధముగా నున్నట్లు రెండవ రోజు ముహమ్మద్ (సల్లం) గమనించిరి. వారి దాడులను ఎదుర్కొనుటకు ప్రతి క్షణం తెలివిగా, చురుకుగా వుండవలసిన అవసరముండెను. ఒకసారి మూకుమ్మడిగా దాడి చేసేవారు. మరోసారి అనేక బృందాల రూపంలో విడిపోయి వివిధ స్థావరాలపై దాడిచేసేవారు. ఏదైనా ఒక స్థావరాన్ని బలహీనముగా పొందినచో తమ పూర్తి సైన్యాన్ని కూడబెట్టి అచట వరుస బాణముల ద్వారా దాడికి పాల్పడి కందకము దాటుటకు ప్రయత్నించేవారు. ఖాలిద్, అమర్ వంటి ప్రఖ్యాత నాయకుల సారథ్యంలో ధైర్యముగా సైన్యములు దాడి చేసి నగరములో



ప్రవేశించుటకు ప్రయత్నించేవారు. ఒక సారి స్వయముగా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) శిబిరమును శత్రువులు చుట్టుముట్టిరి. కాని ముస్లిముల వీరోచిత పోరాటం, బాణముల విపరీత దాడుల వలన అవిశ్వాసులు వెనక్కి నెట్టబడిరి. ఈ దాడి రోజంతా కొనసాగెను. ముస్లిముల సైన్యం మొత్తం కలసినా అతికష్టం మీద కందకమును మాత్రమే రక్షించవచ్చును. ముస్లిములకు ఏ మాత్రం విశ్రాంతి లభించలేదు. రాత్రి కావచ్చెను. ఖాలిద్ సారథ్యంలో సైన్యము రాత్రి కూడ దాడులు నిర్వహించుచున్నందున ముస్లిములు తమ కందకమును రక్షించుటకు గస్తీ నిర్వహించవలసి వచ్చెను. కాని శత్రువుల ఈ ప్రయత్నాలన్ని విఫలమైనవి. శత్రువుల అధిక సైనికులు ఏ దశలో కూడ కందకమును దాటి రాలేకపోయిరి."

*(ది లైఫ్ ఆఫ్ ముహమ్మద్, రచన మయూర్, పేజి 32)*

రెండు రోజుల నుండి యుద్ధము జరుగుచున్నను సైనికులు ఎదురెదురుగా పోరాడే సందర్భం రాలేదు. అందుకే 24 గం॥ల యుద్ధము లో కూటమికి చెందిన ముగ్గురు, 5గురు ముస్లిం సైనికులు మాత్రమే హత మార్చబడిరి. ఈ దాడిలో ఓస్ జాతి నాయకుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం విశ్వసనీయ అనుచరుడు సాద్ బిన్ మఆజ్ (రజి) తీవ్రంగా గాయపడిరి. ఈ దాడుల వలన కందక తీరములు విరిగిపోయెను. అక్కడి నుండి దాడి జరిగే అవకాశం అధికమైనది. ముస్లిముల శ్రేయోభిలాషులైన రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో ధైర్యముతో రాత్రి చలిలో అక్కడికి పదే పదే వెళ్లి పహారానిస్తూ వుండేవారు. హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనము ప్రకారము వారు పహారా

విధులు నిర్వహించి అలసి పోయి, తీవ్ర చలితో ఇబ్బంది పడినప్పుడు వచ్చి నాతో దుప్పటిలో పరుండేవారు. కాని శరీరము వేడెక్కిన వెంటనే మరల లేచి ఆ విరిగిన ప్రదేశమునకు వెళ్లి రక్షణలో నిమగ్నమయ్యేవారు. వరుసగా జాగారణ వలన ఒక రోజు పూర్తిగా అలసిపోయిరి. ఎవరైనా విశ్వసనీయ ముస్లిం ఇక్కడున్నచో నేను నిద్రించేవాడినని అనిరి. ఇంతలోనే బయట సాద్ బిన్ వఖాస్ (రజి) శబ్దము వచ్చెను. ఎందుకు వచ్చితివని వారడిగిరి. మీకు రక్షణగా వుండుటకని వారు తెలిపిరి. నాకు రక్షణ అవసరం లేదు. ముస్లిములు భద్రంగా వుండుటకు ఫలానా చోట కందకము విరిగిపోయినది అక్కడ రక్షణగా వుండమని వారు ఆదేశించిరి. అప్పుడు సాద్ అక్కడ రక్షణ కొరకు వెళ్లిపోగా వారు నిద్రకు ఉపక్రమించిరి. (విచిత్రవేమనగా వారు మదీనా వచ్చిన ఆరంభములో ఎంతో ప్రమాదముండెను. అప్పుడు కూడ సాద్ (రజి) వారి రక్షణకు వచ్చియుండిరి). ఈ రోజులలోనే ఒక రోజు కొన్ని ఆయుధాల శబ్దము వినిపించగా ఎవరని ? వారు ప్రశ్నించిరి. నేను అని ఉబాదహ్ బిన్ బషీర్ సమాధానమివ్వగా నీతో ఇంకెవరైనా ఉన్నారా? అని అడిగిరి. మీ శిబిరము చుట్టు రక్షణ కొరకు అనుచరుల ఒక బృందం వున్నదని అతడు తెలిపెను. ఇప్పుడు నా శిబిరము సంగతి వదిలిపెట్టుము. అన్యారాధకులు కందకము దాటుటకు ప్రయత్నించుచున్నారు. అక్కడికి వెళ్లి వారితో పోరాడమని ఆదేశించిరి.

**బనూ ఖురైజ అన్యారాధకులతో కలిసి దాడికి సన్నద్ధత, విఫలం**

పైన ప్రస్తావించిన విధంగా దొడ్డిదారిన యూదులు మదీనాలోకి ప్రవేశించుటకు ప్రయత్నించిరి. ఈ ప్రయత్నంలో వారి గూఢచారి హతమయ్యెను. వారి కుట్ర బహిర్గతమైనదని యూదులకు తెలిసిన తర్వాత వారు మరింత సాహసంతో అరబ్బులకు సహకరించడం ప్రారంభించిరి.



మదీనా వెనుక నుండి సామూహికంగా దాడి చేయలేదు. ఎందుకనగా అటు మైదానము చిన్నగా వుండెను. ముస్లిముల సైన్యము అక్కడ వుండగా పెద్ద దాడి అసంభవమై యుండెను. కొన్ని రోజుల తర్వాత యూదులు, అన్యారాధకులు కలిసి ఒక నిర్ణీత సమయమున ఏకకాలంలో దాడి చేయుటకు తీర్మాణించిరి. కాని అప్పుడు అల్లాహ్ సహాయము ఒక విచిత్ర రూపములో ప్రత్యక్షమైనది. ఆ వివరాలు క్రింద చూడగలరు.

ఘత్ఫాన్ జాతికి చెందిన నయీమ్ పేరు గల ఒక వ్యక్తి మనస్సులో ముస్లిముగా నుండెను. ఇతడు కూడ అవిశ్వాసులతో కలిసి వచ్చి యుండెను. కాని అవకాశం లభించినచో ముస్లిములకు సహాయం చేయాలని ఆశించు చుండెను. ఒంటరి వ్యక్తి ఏమి చేయగలడు. యూదులు కూడ అవిశ్వాసులతో చేతులు కలిపినారని తెలుసుకొని ముస్లిముల రక్షణ అసాధ్యమని భావించెను. ఈ పరిస్థితులతో అతడు ప్రభావితమై ఈ మోసపూరిత కుట్రను ఏదో ఒక రకంగా విఫలం చేయాలని అతను నిర్ణయించుకొనెను. రెండు సైన్యములు కలిసి ఒక రోజు దాడి చేయవలెనని నిర్ణయము జరిగినప్పుడు అతడు బనూఖురైజ వారి వద్దకు వెళ్ళి వారి నాయకులతో ఇట్లనెను. అరబ్బుల సైన్యము పారిపోయినచో ముస్లిములు మీతో ఎలా ప్రవర్తించెదరు? మీరు ముస్లిములతో ఒక ఒప్పందము కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందమును ఉల్లంఘించినందుకు వారు మిమ్ములను ఏ విధంగా శిక్షించుదురో ఊహించు కొనుము. వారు కొంత భయమునకు లోనై మేము ఏమి చేయాలని అనిరి. నయీమ్ ఇట్లనెను. అరబ్బులు మూకుమ్మడి దాడి కొరకు మీతో సహాయము కోరినచో అన్యారాధకులతో ఇట్లనుము. 70 మందిని తాకట్టుగా మా వద్దకు పంపవలెను. వారు మా కోటలను రక్షింతురు. అప్పుడు మేము మదీనా వెనుక వైపు నుండి దాడి చేయుదుము. వీరితో మాట్లాడిన తర్వాత

అన్యారాధకుల నాయకుల వద్దకు వెళ్ళి అతడు వారితో ఇట్లనెను. యూదులు మదీనా నివాసులు. అసలు సమయం రాగానే మిమ్ములను వారు మోసం చేసినచో మీరు చేయగలిగిందేమి? ముస్లిములను సంతోష పెట్టుటకు, తమ నేర క్షమాపణ కొరకు మీ సైనికులను తాకట్టు రూపంలో తీసుకొని ముస్లిముల అధీనంలో పంపినచో మీరేమి చేయగలరు? అందుకే వారు తమ మాటను పాటించుదురో లేదో వారిని మీరొక సారి పరీక్షించవలెను. కనుక వెంటనే మీతో కలిసి దాడికి ఆహ్వానించుము. అవిశ్వాస నాయకులు ఈ అభిప్రాయమును నిజమేనని భావించి మరుసటి రోజే మేము ఒక సామూహిక దాడి చేయదలిచితిమి. మీరు మీ సైన్యముతో రేపు దాడి చేయవలెనని రాయబారం పంపిరి. బనూఖురైజ ఇట్లనిరి. ఒకటి రేపు శనివారము అందుకే మేము ఆ రోజు యుద్ధము చేయలేము. రెండవది మీరు బయటి వారు మేము మదీనా నివాసులము. మీరు యుద్ధము నుండి పారిపోయినచో మా గతేమిటి ? అందుకే మీరు తాకట్టుగా 70 మందిని మావద్దకు పంపినచో మేము యుద్ధములో పాల్గొనెదము. అవిశ్వాసుల హృదయంలో ఇంతకు ముందే అనుమానం పుట్టి నందులకు వారి కోరికను పూర్తి చేయుటకు వారు నిరాకరించిరి. మాతో మీ ఒప్పందము నిజమైనచో ఈ విధమైన కోరికకు అర్థం లేదనిరి. ఈ సంఘటనతో అటు యూదుల మనసులలో అనుమానాలు మొలకెత్తెను. ఇటు అవిశ్వాసుల హృదయాలలో కూడ సందేహాలు పుట్టెను. అనుమానాలు, సందేహాలు హృదయాలలో జనించిన తర్వాత ధైర్యము కోల్పోవుట సహజమైన విషయము. ఈ అనుమానాలు, సందేహాలతోనే అవిశ్వాసులు రాత్రి విశ్రాంతి కొరకు తమ తమ గుడారములలోకి వెళ్లిరి. సరిగ్గా అప్పుడే అల్లాహ్ ఆకాశ సహాయం మరో మార్గాన అందించెను. రాత్రి అతి వేగమైన గాలి దుమారం సంభవించెను. అది గుడారాలను



పడగొట్టెను. పొయ్యిలపై నున్న పాత్రలను క్రింద పడవేసెను. కొన్ని జాతుల నిప్పు ఆరిపోయెను. అన్యారాధ అరబ్బులు రాత్రంతా నిప్పు వెలిగించుట ఒక ఆచారము. దీనిని వారు శుభ సూచికగా భావించేవారు. నిప్పు ఆరిపోయిన జాతి ఆ రోజు వారికి అశుభ దినమని నమ్మేవారు. అది తన గుడారములను తీసుకొని యుద్ధ రంగము నుండి వెనక్కి పోవును. నిప్పు ఆరిపోయిన జాతులు ఆచారం ప్రకారం ఒక రోజు నిరీక్షణ తర్వాత మరల సైన్యములో చేరుటకు తమ గుడారములను తీసుకొని వెనక్కి వెళ్లిపోయిరి. పగటి పూట సంభవించిన జగడముల వలన సైనిక నాయకుల హృదయాలలో అనుమానాలు కలుగుచుండెను. రాత్రి ముస్లిములతో కలిసి యూదులు గుప్త దాడులకు దిగిరని, అందుకే మా ప్రక్క నున్న జాతులు పారిపోవుచున్నాయని వెనక్కి జరిగిన జాతులు భావించిరి. కనుక వారు తొందర తొందరగా తమ గుడారములను విప్పి మైదానము నుండి పారిపోవడం మొదలు పెట్టిరి. అబూసుఫ్యాన్ తన గుడారములో నిశ్చింతగా నిద్రించుచుండెను. అతనికి కూడ ఈ వార్త అందెను. అతను భయపడి కట్టేసి వున్న తన ఒంటెపై కూర్చొని దానిని పరుగెత్తించు చుండెను. అతను చేయుచున్న అవివేక పని గూర్చి అతని మిత్రులు అతనికి తెలిపిరి. అప్పుడు అతని ఒంటె తాళ్ళు విప్పగా మిత్రులతో సహా అతడు పారిపోయెను.

20-25 వేల అవిశ్వాస సైనికుల గుడారాలతో కిటకిటలాడిన మైదానము రాత్రి తుది ఘడియలో ఒక్క సారి అరణ్యము వలె నిర్మానుష్యమయ్యెను. మీ శత్రువును పారదోలితిమని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు అల్లాహ్ సువార్తవాణి ద్వారా తెలిపెను. వారు వాస్తవ పరిస్థితి తెలుసుకొనుటకు ఒక వ్యక్తిని పంపవలెనని కోరిరి. తమ చుట్టు కూర్చున్న అనుచరులను పిలిచిరి. అది చలి కాలము.

ముస్లిముల వద్ద సరిపడ దుస్తులు కూడ లేకుండెను. చలి తీవ్రత వలన నాలుకలు కదలలేని స్థితిలో వుండెను. మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పిలుపును వింటిమి. సమాధానము ఇవ్వాలని కూడ కోరుకుంటిమి. కాని మాట్లాడలేక పోయితిమని అనుచరులు వాపోయిరి. కేవలం ఒక్క హుజైఫా (రజి) మాత్రమే ఓ రసూలుల్లాహ్! ఏమిటని అడిగిరి. నీవు కాదు నాకు మరొక వ్యక్తి కావలెనని వారనిరి. ఎవరైనా ఉన్నారా ? అని మరల పిలిచిరి. అయినను తీవ్ర చలి వలన మేల్కొని వున్న వారు కూడ సమాధానము ఇవ్వలేక పోయిరి. రెండవ సారి కూడ ఓ రసూలుల్లాహ్! నేనున్నాని హుజైఫ (రజి) అనిరి. మీ శత్రువును మేము పారదోలితిమని అల్లాహ్ నాకు తెలిపెను. కనుక వెళ్ళి శత్రువు పరిస్థితి తెలుసుకొమ్మని వారు హుజైఫా (రజి) ను ఆదేశించిరి. హుజైఫ (రజి) కందకము వద్దకు వెళ్లగా మైదానములో శత్రువుల సైనికులు అసలే లేరని చూచిరి. తిరిగి వచ్చి కలిమా శహాదత్ చదువుచూ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వమును ధ్రువీకరించి శత్రువు మైదానము విడిచి పోయాడని సమాచారమిచ్చిరి. ఉదయం తమ తమ గుడారాలను విప్పుకొని ముస్లిములు తమ గృహాలకు పోవడం ప్రారంభించిరి. *(అస్సీరతుల్ హల్బియ్యహ్: సంపుటి 2, పుట 354)*

## బనూఖురైజ ద్రోహమునకు శిక్ష

ముస్లిములు 20 రోజుల తర్వాత ప్రశాంతత పొందిరి. కాని ఇప్పుడు బనూ ఖురైజ సమస్య పరిష్కారము కావలసి యుండెను. వారి ద్రోహము విస్మరించదగ్గది కాకుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తిరిగి రాగానే విశ్రాంతి తీసుకోకూడదు సాయంత్రం వరకు బనూఖురైజ కోటల వద్దకు వెళ్లమని అనుచరులతో అనిరి. ఒప్పందము నకు వ్యతిరేకముగా ద్రోహము ఎందుకు చేయవలసివచ్చెనని ప్రశ్నించుటకు



బనూఖురైజ వద్దకు హజ్రత్ అలి (రజి) ని పంపిరి. బనూఖురైజ పశ్చాత్తాపము, క్షమాపణ లేదా ఏదైనా కారణము చెప్పే బదులు హజ్రత్ అలి (రజి)ని, వారి సహచరులను దూషించడం మొదలు పెట్టిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి కుటుంబ స్త్రీలను దూషించసాగిరి. ముహమ్మద్ (సల్లం) ఎవరో మాకు తెలియదు. వారితో మాకెలాంటి ఒప్పందము లేదని అనిరి. వారి ఈ సమాధానముతో హజ్రత్ అలి (రజి) తిరిగి వచ్చునప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, అనుచరులతో కలిసి యూదుల కోటల వైపు పోవుచుండిరి. యూదులు అపవిత్ర దూషణలకు పాల్పడుచుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సతీమణుల, కుమార్తెల పట్ల కూడ దూషణలు పలుకుచుండిరి. హజ్రత్ అలి (రజి) వారికి బాధ కలుగునని ఓ రసూలుల్లాహ్! మీరెందుకు కష్టపడెదరు, తిరిగి వెళ్లిపోగలరు. ఈ జగడమును మేము చూసుకొనెదమని మనవి చేసిరి. వారు దూషణలకు పాల్పడుచున్న విషయము నాకు తెలుసు. ఆ దూషణలను నేను వినకూడదనే నీ కోరిక కదా! అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. ఓ రసూలుల్లాహ్! అవును అని హజ్రత్ అలి (రజి) అనిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపిరి. వారు దూషించినచో ఏమగును. వారు తమ ప్రవక్త మూసా (అ) ను ఇంతకంటే ఎక్కువ కష్టపెట్టిరి. మాట్లాడుచూనే యూదుల కోటల వైపు వారు పోయిరి. కాని యూదులు కోట ద్వారములు మూసుకొని లోపల వుండిపోయిరి. ముస్లిములతో యుద్ధము ప్రారంభించిరి. వారి స్త్రీలు కూడ యుద్ధములో పాల్గొనిరి. కోట గోడకు అనుకొని కొందరు ముస్లిములు కూర్చొనగా యూద స్త్రీ ఒకరు వారి మీద పై నుంచి రాయి పడవేసి, ఒక ముస్లింను హత్య చేసెను. కాని కొన్ని రోజుల నిర్బంధన తర్వాత యూదులు చాలా కాలము వరకు మేము పోరాడలేమనే నిర్ణయానికి వచ్చిరి. వారి

నాయకులు తమ మిత్రుడు, ఓస్ తెగ నాయకుడైన అబూలుబాబాను సలహా నిమిత్తం పంపవలసిందిగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను కోరిరి. వారు అబూలుబాబాను పంపిరి. వారిని యూదులు ఇట్లు సలహా అడిగిరి. 'నిర్ణయాధికారం నాకిచ్చి యుద్ధము నుండి వైదొలగవలెనను' ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కోరికను మేము అంగీకరించవలెనా. అబూలుబాబా నోటితో అవుననిరి. కాని తన చేతిద్వారా మెడపై ఖడ్గముతో కోసినట్లు సూచించిరి. ఇప్పటి వరకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎలాంటి తమ నిర్ణయమును ప్రకటించలేకుండిరి. కాని అబూలుబాబా వారి నేరమును బట్టి వారికి హత్యే సరైన శిక్ష అని భావించిరి. అందుకే అనాలోచితంగా పలికిన ఈ మాటే చివరికి వారి వినాశనముకు దారి తీసెను. కనుక యూదులు మనము కూడ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయమును ఒప్పుకున్నచో ఇతర యూదుల జాతుల వలె మనకు మదీనా బహిష్కరణ శిక్ష మాత్రమే పడునని అనిరి. కాని వారి దురదృష్టం మేము ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయమును ఒప్పుకొనుటకు సిద్ధముగా లేము, మా మిత్రపక్ష ఓస్ జాతి నాయకుడైన సాద్ బిన్ మఆజ్ (రజి) తీర్మాణమును అంగీకరించెదమనిరి. కాని ఇప్పుడు యూదులలో విభేదము ఏర్పడెను. యూదులలోని కొందరు ఇట్లనిరి. మనము ద్రోహమునకు పాల్పడితిమి. ముస్లిముల వైఖరితో ఇస్లాం నిజమైన ధర్మమని స్పష్టమగుచున్నది. కావున వారు తమ మతమును వదిలి ఇస్లాంలో చేరిరి. ఈ జాతి నాయకులలో ఒకరైన అమ్ర్ బిన్ సాద్ తన జాతిని నిందించుచు ఇట్లనెను. మీరు ద్రోహమునకు పాల్పడిరి. ఒప్పందమును ఉల్లఘించిరి. ఇప్పుడు ఇస్లాంను స్వీకరించుము! లేదా పరిహారము చెల్లించుటకు అంగీకరించుము. మేము ఇస్లాంలో చేరము,



పరిహారము చెల్లించము దీనికి బదులు చనిపోవడమే మేలని యూదులు అనిరి. అప్పుడతను నేను మీ ఈ చర్యకు బాధ్యుడను కాదని కోట నుండి బయటికి వచ్చెను. అతను కోట నుండి బయటికి వచ్చుచున్నప్పుడు ముస్లిముల ఒక సైన్యాధిపతి ముహమ్మద్ బిన్ ముసల్లమ (రజి) అతన్ని చూచి అతని వివరాలు తెలుసుకొనెను. అతను తన గురించి వాస్తవం తెలుపగా ముహమ్మద్ బిన్ ముసల్లమ (రజి) మీరు ప్రశాంతముగా పోగలరని చెప్పి అల్లాహ్‌తో ఇట్లు ప్రార్థన చేసిరి.

اللهم لا تحرمنى اقالة عثرات الكرام

*(అస్సీరతుల్ హల్బియ్యహ్:సంపుటి 2, పుట 362)*

అనగా ఓ అల్లాహ్! గుణవంతుల చిన్న తప్పిదములను విస్మరించే సత్కార్యము చేయు అనుగ్రహము ప్రసాదించుము. దీని భావమేమనగా ఇతను తను చేసిన, తన జాతి చేసిన తప్పుపై పశ్చత్తాపము పడుచుండెను. అందుకే అతన్ని క్షమించుట మా కర్తవ్యమని అర్థము. కనుక నేను అతన్ని బంధించకుండా వెళ్లిపోయే అవకాశం ఇచ్చితిని. అల్లాహ్ నాకు ఎల్లప్పుడు ఇటువంటి సత్కార్యములు చేయు అనుగ్రహము ప్రసాదించుగాక! ఈ విషయము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిసినప్పుడు ఆ యూదున్ని వదిలినందుకు వారు ముహమ్మద్ బిన్ ముసల్లమ (రజి) ను నిందించలేదు కదా ఈ కార్యమును ప్రశంసించిరి.

**బనూ ఖురైజ నియమించిన న్యాయమూర్తి సాద్ (రజి) తీర్పు బైబిల్ ప్రకారమే యుండెను**

పై సంఘటనలు వ్యక్తిగతమైనవి. బనూఖురైజ ఒక జాతిగా తన మొండితనమును ప్రదర్శించెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ను నిర్ణేతగా ఒప్పుకొనుటకు నిరాకరించి సాద్ (రజి) తీర్పు కొరకు పట్టుబట్టిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కూడ వారి ఈ

కోరికను మన్నించిరి. యుద్ధములో గాయపడిన సాద్ (రజి) కు మీ తీర్పును అంగీకరించుటకు బనూఖురైజ ఒప్పుకొనిరి కావున వచ్చి తీర్పు చేయగలరని సమాచారం అందించిరి. ఈ ప్రతిపాదనను ప్రకటించగానే బనూఖురైజకు చాలా కాలం నుండి మిత్రపక్షంగా వున్న ఓస్ జాతి ప్రజలు సాద్ (రజి) వద్దకు పరుగెత్తుకొచ్చి ఇట్లు విన్నవించిరి. ఖజ్‌రజ్ జాతి వారు తమ మిత్రపక్షమైన యూదులను సదా శిక్ష పడకుండా రక్షించిరి. అందుకే నేడు మీరు కూడ మన మిత్ర పక్ష జాతికి అనుకూలమైన తీర్పు ఇవ్వవలెనని పట్టుబట్టిరి.

గాయాల వలన సాద్ (రజి) వాహనముపై బనూఖురైజ వైపు పయనమైరి. వారి జాతి ప్రజలు వారికి కుడి ఎడమ పరుగెత్తుచుండిరి. బనూఖురైజకు వ్యతిరేకంగా తీర్పు చెప్పకూడదని పదేపదే సూచించు చుండిరి. తీర్పు చెప్పుటకు నియమించబడిన వ్యక్తి న్యాయమూర్తి అగును. అతడు నిజాయితిగా తీర్పు చెప్పవలెను. నేను నిజాయితిగానే తీర్పు చెప్పెదనని మాత్రమే సాద్ (జి) సమాధానమిచ్చిరి. సాద్ (రజి) బనూఖురైజ వారి కోట వద్దకు చేరుకొనిరి. అక్కడ బనూఖురైజ వారు కోట గోడ వద్ద సాద్ (రజి) కొరకు ఎదురు చూచుచుండిరి. రెండవ వైపు ముస్లిములు కూర్చొని యుండిరి. సాద్ (రజి) మొదట తన జాతినుద్దేశించి నా తీర్మాణమును అంగీకరిస్తారని మీరు వాగ్దానము చేయుదురా? అని ప్రశ్నించిరి. వారు అవునని తెలిపిరి. తర్వాత బనూఖురైజ ప్రజలనుద్దేశించి నా తీర్మాణమును అంగీకరిస్తారని మీరు వాగ్దానము చేయుదురా? అని ప్రశ్నించిరి. ఆ తర్వాత విచారవదనంతో వేరే వైపు చూస్తూ, తల క్రిందికి వంచి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కూర్చున్న వైపు చేతితో మీరు కూడ ఇదే వాగ్దానము చేయుదురా ? అని ప్రశ్నించిరి. అవునని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బదులిచ్చిరి. అప్పుడు బైబిల్



బోధనానుసారము సాద్ (రజి) తన తీర్పు చెప్పిరి. బైబిల్‌లో ఇట్లు గలదు.

"యుద్ధము చేయుటకు మీరొక పురము మీదికి సమీపించినప్పుడు సంధి నిమిత్తము రాయబారమును పంపవలెను. సంధిని స్వీకరించి, గుమ్మములను తెరచిన యెడల దానిలో నున్న జనులందరు నీకు పన్ను చెల్లించి నీ దాసులగుదురు. అది మీతో సంధి చేయక యుద్ధమే మంచిదని యోచించిన యెడల దానిని ముట్టడించుము. నీ దేవుడైన యెహోవా దానిని నీ కప్పగించినప్పుడు దానిలోని మగవారినందరిని కత్తితో హతమార్చుము. అయితే స్త్రీలను చిన్నవారిని పశువులను ఆ పురములో నున్నది యావత్తును దాని సొమ్మంతటిని నీవు తీసుకొనవచ్చును. నీ దేవుడైన యెహోవా నీకిచ్చిన నీ శత్రువుల సొమ్మును నీవు అనుభవించుము. ఈ పురములు గాక నీకు బహుదూరముగా వుండిన సమస్త పురములను యీలాగున చేయవలెను. అయితే నీ దేవుడైన యెహోవా స్వాస్థ్యముగా నీకిచ్చుచున్న యీ జనముల పురములలో ఊపిరి గల దేనిని బ్రదుకనియ్యకూడదు. వీరు, అనగా హిత్తీయులు అమోరీయులు కనానీయులు పెరిజ్జీయులు హివ్వీయులు యెబూసీయులను వారు తమ దేవతల విషయమై చేసిన సమస్త హేయకృత్యముల రీతిగా మీరు చేసి, నీ దేవుడైన యెహోవాకు విరోధముగా పాపము చేయుటకు వారు మీకు నేర్పకుండునట్లు నీ దేవుడైన యెహోవా నీ కాజ్ఞాపించిన ప్రకారముగా వారిని నిర్మూలము చేయవలెను."

*(ద్వితియోపదేశకాండము అధ్యాయము 20, సూక్తులు 10-18)*

బైబిల్ తీర్మాణము ప్రకారము ముస్లిములు ఓటమి చెంది, యూదులు విజయం సాధించి యుండినచో, పురుషులు, స్త్రీలు, పిల్లలతో సహా ముస్లిములందరు హత్య చేయబడి యుండేవారు. పురుషులు, స్త్రీలు, పిల్లలందరిని ఏకకాలంలో హతమార్చుటకు యూదులు పన్నాగం పన్నియుండిరని చరిత్ర నిరూపించును. కాని ద్వితియోపదేశకాండమైన పుస్తకము తీర్పు ప్రకారము దూరపు దేశాల జాతుల వలె వ్యవహరించే వారు. అనగా పురుషులందరిని హతమార్చి స్త్రీలను, పిల్లలను, సామాగ్రిని దోచుకునేవారు. సాద్ (రజి) బనూఖురైజకు మిత్రపక్షముగా నుండిరి. వారి మిత్రుడు కూడ. వారి ప్రాణాలను రక్షించు ఇస్లాం శాసనము ప్రకారము ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తీర్మాణమును అంగీకరించుటకు యూదులు నిరాకరించిరి. కనుక ద్వితియోపదేశకాండములో మూసా (అ) ఇటువంటి సందర్భములకై చేసిన నిర్ణయము ప్రకారమే యూదుల గురించి వారు తీర్పు చెప్పిరి. ఈ తీర్పునకు బాధ్యులు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం లేదా ముస్లిములు కాదు. మూసా, బైబిల్, వేలాది సం॥ల నుండి ఇతర జాతులతో ఇటువంటి వైఖరి అవలంభించుచున్న యూదులే ఇందుకు బాధ్యులు. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుగ్రహించుటకు వారిని ఆహ్వానించగా వారు నిరాకరించిరి. మేము ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తీర్పును ఒప్పుకొనుటకు సిద్ధముగా లేము, మేము సాద్ (రజి) తీర్పును అంగీకరించెదమని చెప్పిరి. మూసా (అ) శాసనము ప్రకారము సాద్ (రజి) తీర్పు ఇవ్వగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దౌర్జన్యమునకు పాల్పడిరని నేడు క్రైస్తవ లోకం గగ్గోలు పెడుతుంది. వేరే సందర్భమున ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎందుకు దౌర్జన్యము చేయలేదను విషయము క్రైస్తవ రచయితలు ఎందుకు



గమనించరు? శత్రువులు వందలాది సందర్భములలో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దయాదాక్షిన్యాలపై తమను తాము వదిలిరి. ప్రతి సారి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని క్షమించిరి. ఈ ఒక్క సందర్భములోనే శత్రువు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తీర్పును అంగీకరించుటకు నిరాకరించి వేరొక వ్యక్తి తీర్పును ఒప్పుకుంటామని మొండిగా వ్యవహరించిరి. ఆ వ్యక్తి కూడ నేను చేసిన తీర్పును ఒప్పుకుంటారా అని ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నుండి వాగ్దానము తీసుకొనెను. ఆ తర్వాత అతడు తీర్పు చెప్పెను. వాస్తవానికి అతడు తీర్పు చేయక మూసా (అ) తీర్పును వినిపించెను. యూదులు వారి సమాజ సభ్యులమని ప్రకటింతురు. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తీర్పును నిరాకరించి యూదులు తమ పై తామే దౌర్జన్యమునకు పాల్పడిరి. బంధించబడ్డ జాతి గురించి దైవాజ్ఞతో ఇటువంటి తీర్పు వెలువరించిన మూసా (అ) హింసకు పాల్పడిరి. ఇది దౌర్జన్యమే అయినచో క్రైస్తవ రచయితలు మూసా (అ) ను క్రూరుడని నిర్ణయించవలెను. లేనిచో పాత నిబంధనలో ఇటువంటి బోధనను అందించిన మూసా (అ) దైవమును క్రూరుడని వర్ణించవలెను.

అహ్జాబ్ యుద్ధము ముగిసిన తర్వాత రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపిరి. ఇక ముందు అన్యారాధకులు మనపై దాడి చేయరు. ఇప్పుడు ఇస్లాం స్వయాన సమాధానము చెప్పును. మనపై దాడి చేసిన జాతులపై ఇప్పుడు మనమే దాడి చేయుదుము. *(బుఖారి కితాబుల్ మఘాజి బాబ్ ఘజ్వతుల్ ఖందక్)* కనుక ఇటులనే జరిగెను. అహ్జాబ్ యుద్ధములో అవిశ్వాసులకు కొద్ది మంది ప్రాణాలు కోల్పోవడం తప్ప ఎలాంటి నష్టము జరగలేదు. కావున రెండవ సం॥ సన్నద్ధమై మరల వారు దాడి చేసే అవకాశం వుండెను. 20 వేలకు బదులు 40–50

వేల సైన్యము కూడ తీసుకరావచ్చును. వారు ఇంకా ప్రయత్నించినచో లక్ష, లక్షన్నర సైన్యము తీసుకరావడం కూడ వారికి అసాధ్యము కాకుండెను. కాని 21 సం॥ల నిరంతర కృషి తర్వాత అల్లాహ్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట వున్నాడని, వారి విగ్రహాలు బూటకమని, ఈ ప్రపంచమును సృష్టించు దేవుడు ఒక్కడేనని అవిశ్వాసులకు నమ్మకము కలిగెను. వారు భౌతికంగా ఆరోగ్యంగానే కనిపించినను తీవ్ర నిరాశకు లోనైయుండిరి. బాహ్య రూపంలో వారు విగ్రహాల ముందు తల వంచినట్లు కనిపించినను వారి హృదయాలలో మాత్రం لاالٰہ الااللّٰہ నినాదం వెలువడుచుండెను. అనగా అల్లాహ్ తప్ప మరొకరు ఆరాధనకు అర్హులు కారు.

### ముస్లిముల విజయ పరంపర ప్రారంభం

ఈ యుద్ధము అనంతరం రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపిరి. నేటి తర్వాత అరబ్ అవిశ్వాసులు మనపై దాడి చేయరు. అనగా ముస్లిముల ఆపదలు హద్దులు దాటెను. ఇప్పుడు వారి విజయ పరంపర మొదలగును. ఇప్పటి వరకు సంభవించిన యుద్ధములు అవిశ్వాసులు మదీనాపై దాడి చేసినందుకు లేదా వారి దాడులను ఎదుర్కొనుటకు ముస్లిములు మదీనా నుండి బయటికి వెళ్ళినందుకు జరిగినవే. కాని ఏనాడు ముస్లిములు స్వయాన యుద్ధమును కొనసాగించుటకు ప్రయత్నించలేదు. వాస్తవానికి యుద్ధ చట్టముల ప్రకారము ఒక సారి యుద్ధము మొదలైన తర్వాత రెండు రకాలుగానే అది అంతమగును. ఒకటి శాంతి ఒప్పందము కదురుట లేదా ఒక వర్గము లొంగిపోవుట. కాని ఇప్పటి వరకు ఒక్క సందర్భమున కూడ శాంతి ఒప్పందము కుదరలేదు, ఏ వర్గము లొంగిపోలేదు. ప్రాచీన కాల ఆచారము ప్రకారము యుద్ధములో కొంత విరామం వచ్చినను నిరంతరం



కొనసాగును, అంతము కాదు. కావున ముస్లిములు తలచినప్పుడు శత్రువులపై దాడి చేసి లొంగిపోవుటకు బలవంతము చేసే హక్కు యుండెను. కాని ముస్లిములు అలా చేయలేదు. విరామం ఏర్పడినప్పుడు ముస్లిములు కూడ మౌనముగా యుండేవారు. ఎందుకనగా అవిశ్వాసులు ఈ లోపు శాంతి కొరకు సిద్ధమైనచో యుద్ధము అంతమయ్యే అవకాశముండెను. కాని ఒక సుదీర్ఘ కాలము వరకు అవిశ్వాసుల నుండి శాంతి ప్రతిపాదన రాలేదు. లేదా వారు ముస్లిముల ఎదుట లొంగిపోక, ఇంకా గతం కంటే ఎక్కువ వ్యతిరేకత, వైరుధ్యంలో ముందుకు వెళ్ళిరి. కనుక ఇప్పుడు యుద్ధము గురించి ఒక స్పష్టమైన నిర్ణయము తప్పక జరగాల్సిన సమయం వచ్చెను. లేదా దేశములో శాంతి స్థాపనకై ఇరువురిలో ఒకరు లొంగిపోవలెను. అందుకే అహ్‌జాబ్ యుద్ధము తర్వాత రెండింటిలో ఏదో ఒక నిర్ణయము ఆవశ్యమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం భావించిరి. అనగా అవిశ్వాసుల, మా మధ్య ఒప్పందము కుదురును లేదా మాలో ఒకరు లొంగిపోవును. లొంగిపోవుటనగా అది అవిశ్వాసుల వైపు నుండే జరగవలసియుండెను. ఎందుకనగా ఇస్లాం విజయం గూర్చి అల్లాహ్ ముందే వార్త అందించి యుండెను. ఇస్లాం విజయమును రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాలోనే ప్రకటించి యుండిరి. ఇక రెండవ విషయము సంధి. దీనిని విజయులు లేదా పరాజితులు ఎవరైనా ప్రతిపాదించవచ్చును. అపజయులు సంధి కొరకు ప్రతిపాదన చేసినప్పుడు అందుకు తమ దేశములోని కొంత భాగము ఇవ్వవలెను లేదా తమ ఆదాయంలోని కొంత శాతం తాత్కాలికంగా లేదా శాశ్వతంగా విజయులకు అందించవలెను. ఇతర పరిస్థితులలో విజయులు విధించిన నిబంధనలను అంగీకరించవలెను. విజయుల తరపున సంధి ప్రతిపాదన వచ్చినప్పుడు మేము మిమ్ములను పూర్తిగా నాశనం చేయదలచలేదు, మీరు మా

విధేయత, మా అధికారమును స్వీకరించినచో మీరు పూర్తి స్వేచ్ఛగా లేదా పరిమిత స్వాతంత్ర్యముతో జీవించవచ్చును. అవిశ్వాసుల, ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మధ్య జరిగిన యుద్ధములలో అవిశ్వాసులు తరచుగా ఓడిపోవుచుండిరి. ఈ ఓటమి అనగా వారి దాడులు విఫలమగుచుండెను. రక్షణాత్మక శక్తిని కోల్పోవుటయే నిజమైన ఓటమి. దాడి విఫలమైనదనగా దాని అర్థం సంపూర్ణ ఓటమి కాదు. దాడులు మాత్రమే విఫలమైనట్లు కాని తర్వాత మళ్లీ దాడి చేసి తన లక్ష్యమును పొందును. కావున యుద్ధ నియమముల ప్రకారము మక్కా వారు ఇప్పటి వరకు ఓటమి చెందలేదు. వారు క్రూరమైన దాడులతో తమ లక్ష్యమును పొందలేదు. ఇటు ముస్లిములు యుద్ధ నియమముల ప్రకారము రక్షణాత్మక శక్తిని కోల్పోలేదు. అయినను వారు అపజయుల స్థితిలోనే వుండిరి. ఎందుకనగా!

**మొదటి విషయము**: వారు అతి అల్పసంఖ్యాకులు. **రెండవది** వారు ఇప్పటి వరకు దౌర్జన్యముగా ఎటువంటి దాడులు నిర్వహించలేదు. అనగా వారు మొదలు దాడి చేయలేదు. తద్వారా అవిశ్వాసుల దాడుల నుండి నిర్భయులైనారని భావించలేము. ఇటువంటి పరిస్థితులలో ముస్లిములు సంధి ప్రతిపాదన చేయడమనగా వారు రక్షణ ఏర్పాట్లలో విసిగి పోయిరని ఇక ప్రశాంతత కోరుకుంటున్నారని అర్థం. ఈ సమయములో ముస్లిములు సంధి ప్రతిపాదన చేసియుండినచో చాలా ప్రమాదకర ఫలితము వచ్చునని, ఇది వారి నామరూపాల్లేకుండా చేయునని ప్రతి వివేకి అర్థము చేసుకొనవచ్చును. అరబ్ అవిశ్వాసులు తమ క్రూరమైన దాడులలో విఫలమైరి. ఈ సంధి ప్రతిపాదనతో వెను వెంటనే వారిలో నూతన ఆశలు, కోరికలు ఉత్పన్నమగును. ముస్లిములు మదీనాను రక్షించుకొనుటలో సఫలమైనను అంతిమ విజయము గూర్చి నిరాశ



చెందినట్లు భావించబడును. కనుక సంధి ప్రతిపాదన ఎట్టి పరిస్థితిలో ముస్లిముల నుండి రావడం అసాధ్యము. సంధి ప్రతిపాదన అవిశ్వాసుల నుండి లేదా మూడవ శక్తి నుండి వచ్చే అవకాశముండెను. కాని అరబ్‌లో మధ్యవర్తిత్వం కొరకు మూడవ శక్తి లేకుండెను. ఒక వైపు మదీనా రెండవ వైపు మొత్తం అరబ్ వుండెను. అందుకే ఆచరణాత్మకంగా అవిశ్వాసులే సంధి ప్రతిపాదన చేసే అవకాశం వుండెను. కాని వారి వైపు నుండి సంధి ప్రతిపాదన రావడం లేకుండెను. ఇది వంద సం॥లు కొనసాగినను అరబ్ యుద్ధ చట్టముల ప్రకారం పరస్పర యుద్ధము అంతమయ్యేది కాదు. మక్కా వారి నుండి శాంతి ప్రతిపాదన రాలేదు. మదీనా వారు అరబ్ అవిశ్వాసుల నాయకత్వమును స్వీకరించుటకు సిద్ధముగా లేకుండిరి. ఇప్పుడు ఒకే పరిష్కారము మిగిలెను. అదేమనగా మదీనా వారు అరబ్ మహా కూటమి దాడిని విఫలము చేసినచో మదీనా వారు స్వయాన బయటికి వెళ్లవలెను. తద్వారా వారి నాయకత్వమును స్వీకరించుటకు లేదా శాంతి ఒప్పందము కుదుర్చుకొనుటకు అరబ్ అవిశ్వాసులను బలవంతము చేయవచ్చును. ఈ మార్గమునే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎన్నుకొనిరి. బాహ్యరూపంలో ఇది యుద్ధముగా కనిపించినను సంధికి ఇది తప్ప మరో మార్గము లేకుండెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ మార్గమును అనుసరించనిచో వంద సం॥ల వరకు యుద్ధము కొనసాగే అవకాశముండెను. ఇటువంటి పరిస్థితులలోనే ప్రాచీన కాలములో వంద వంద సం॥ల వరకు యుద్ధములు కొనసాగినవి. స్వయాన అరబ్‌లో కూడ 30, 30 – 40, 40 సం॥లు యుద్ధములు కొనసాగిన ఉదాహరణలు గలవు. ఆ యుద్ధములు సుదీర్ఘ కాలం కొనసాగుటకు కారణము యుద్ధమును ముగించుటకు ఏ మార్గమును అనుసరించక పోవడమేనని తెలియును. నేను తెలిపిన విధముగా

యుద్ధమును ముగించుటకు రెండే మార్గములు గలవు. ఒకటి నిర్ణయాత్మక యుద్ధము ద్వారా ఇరు పక్షాలలోని ఒకరు లొంగిపోయే పరిస్థితి ఏర్పడవలెను లేదా పరస్పరం శాంతి ఒప్పందము కుదుర్చు కొనవలెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం నిస్సందేహంగా దాడి చేయక మదీనాలో మౌనముగా ఉండే అవకాశం వుండెను. కాని అరబ్ అవిశ్వాసులు యుద్ధము మొదలు పెట్టి యుండిరి. కనుక వారు మౌనము వహించినచో యుద్ధము ముగిసినట్లు భావించబడక ఇంకా యుద్ధమునకు శాశ్వత ద్వారములు తెరుచుకున్నట్లు భావించబడును. అరబ్ అవిశ్వాసులు మరో కారణం లేకుండానే ఇష్టమున్నప్పుడు మదీనాపై దాడికి పాల్పడేవారు. అప్పటి చట్టం ప్రకారం వారికి ఆ హక్కు వున్నదనే భావన కలుగును. ఎందుకనగా అ కాలంలో యుద్ధములో విరామం రావడం యుద్ధము అంతమైనదని అర్థం కాదు. విరామం కూడ యుద్ధములోనే లెక్కించబడు చుండెను. ఒక సత్యమైన ధర్మము యుద్ధము చేయుట భావ్యమేనా అను ప్రశ్న ఇచట పలువురికి కలుగవచ్చును.

**యుద్ధమును గూర్చి యూదుల, క్రైస్తవ బోధన**

యుద్ధమును గూర్చి వివిధ ధర్మములు విభిన్న బోధనలు కలిగి వున్నాయను విషయమును కూడ ఇచట నేను స్పష్టము చేయుట అనివార్యమని భావించుచున్నాను. యుద్ధమును గురించి మూసా అలైహిస్సలాం బోధనను పైన నేను ప్రస్తావించితిని. పాత నిబంధన వారిని ఇట్లు ఆదేశించెను. బలవంతముగా కన్ఆన్‌లో ప్రవేశించుము. అక్కడి జాతులను ఓడించి అక్కడ తన జాతికి నివాసము ఏర్పాటు చేయుము. (ద్వితియోపదేశకాండము, అధ్యాయం:20, సూక్తులు:10-18) మూసా అలైహిస్సలాం ఈ విధంగా బోధించినను, యుసూ (అ), దావూద్ (అ), ఇతర దైవ ప్రవక్తలు దానిని క్రమం తప్పకుండా ఆచరించినను యూదులు,



క్రైస్తవులు వారిని దైవ సందేశహరులు, పాత నిబంధనను దైవ గ్రంధముగా విశ్వసించుచున్నారు. మూసా పరంపర చివరలో హజ్రత్ యేసు క్రీస్తు అలైహిస్సలాం అవతరించిరి. యుద్ధమును గూర్చి వారి హితబోధ ఏమనగా దుష్టుని ఎదురింపక, నిన్ను కుడి చెంప మీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడ త్రిప్పుము. *(మత్తయి అధ్యాయం: 5, సూక్తి:39)* ఈ సూక్తిని విశ్లేషించుచు యేసుక్రీస్తు జాతులను యుద్ధము నుండి నివారించిరని క్రైస్తవ జాతి ప్రకటించుచున్నది. కాని బైబిల్ లో ఈ బోధనకు విరుద్ధంగా మరికొన్ని బోధనలు ఉన్నట్లు మనము చూడగలము. ఉ॥ బైబిల్‌లో ఇట్లు వ్రాయబడెను. "నేను భూమి మీదికి సంధి కుదుర్చుటకు వచ్చితినని అనుకోకుము, సంధికుదుర్చుటకు కాదు ఖడ్గము దాల్చుటకు వచ్చితిని". *(మత్తయి: అధ్యాయం:10, సూక్తి:34)* మరో చోట ఇట్లు గలదు. "అతడు వారితో ఇట్లనెను. ఇప్పుడు సంచి గలవారు సంచి, జోలె గల వాడు జోలె తీసుకొనుము. ఖడ్గములేని వారు తన బట్టలు అమ్మి ఖడ్గము కొనవలెను." *(లూకా: అధ్యాయం:22, సూక్తి:36)* ఈ తుది రెండు బోధనలు మొదటి బోధనకు పూర్తిగా భిన్నమైనవి. మసీహ్ యుద్ధము చేయించుటకు వచ్చినచో ఒక చెంప పై కొట్టువాని వైపు రెండవ చెంప త్రిప్పుమనుటలో అర్థమేమిటి. ఈ రెండు భిన్నమైన బోధనలు లేదా ఈ రెండింటిలో ఒక దానిని బాహ్యా రూపంలో గాక ప్రత్యామ్నాయ భావములో తీసుకొనవలెను. ఒక చెంపపై కొట్టగా రెండవ చెంప కొట్టువాని వైపు త్రిప్పుట అను బోధన ఆచరణలో సాధ్యమా కాదా అనే అంశమును ఇచట నేను లేవనెత్తడం లేదు. ఇచట నేను వివరించదలచినది ఏమనగా క్రైస్తవ లోకం తన పూర్తి చరిత్రలో ఏనాడు యుద్ధముకు వెనుకాడలేదు. ఆరంభ కాలములో రోమన్ క్రైస్తవులు పాలించుచున్న రోజులలో కూడ వారు ఇతర జాతులతో రక్షణాత్మకమే కాక దౌర్జన్యపూరిత యుద్ధములు చేసిరి. ఇప్పుడు క్రైస్తవ మతం

ప్రపంచమును జయించెను. ఇప్పుడు కూడ వారు రక్షణాత్మకమే కాక దౌర్జన్యపూరిత యుద్ధములు చేయుచున్నారు. కాని తేడా ఏమనగా విజయం సాధించిన జాతి గురించి క్రిస్టియన్ సివిలైజేషన్ కు కట్టుబడి వున్నదని ప్రకటించెదరు. నేటి కాలములో విజయం సాధించు విధానమునే క్రిస్టియన్ సివిలైజేషన్ అందురు. వాస్తవముగా ఈ పదముకు నిజమైన భావము నేడు కనిపించదు. రెండు జాతులు పరస్పరం యుద్ధము చేయుచున్నప్పుడు ఇరువురు మేము క్రిస్టియన్ సివిలైజేషన్‌ను బలపరుస్తున్నామని ప్రకటించెదరు. అయితే తుదకు విజయం సాధించిన జాతిని క్రిస్టియన్ సివిలైజేషన్ విధానమును అనుసరించినదని నిర్ణయించెదరు. సంక్షిప్తముగా మసీహ్ కాలము నుండి నేటి వరకు క్రైస్తవులు యుద్ధము చేయుచునే వున్నారు. జరుగుచున్న పరిణామాలను బట్టి యుద్ధము కొనసాగించునను విషయం సుస్పష్టం. క్రైస్తవ ప్రపంచ నిర్ణయము మేరకు “తన బట్టలమ్మి ఖడ్గము కొనుము”, “నేను సంధి కుదర్చుటకు కాదు ఖడ్గము దాల్చుటకు వచ్చితిని” అనునదే అసలు చట్టమని తెలియును. “నీవు ఒక చెంప మీద దెబ్బతిని రెండవ చెంప కూడ త్రిప్పుము”. అను చట్టము క్రైస్తవ ధర్మం ఆరంభములో బలహీనంగా వున్న కాలములో అనుసరించినదని అర్థమగును. లేదా క్రైస్తవ మతస్థుల పరస్పరము వరకు ఈ చట్టము పరిమితము కావచ్చునని స్పష్టమగును. ప్రభుత్వాలకు, జాతులకు ఈ చట్టము వర్తించదు. మరో విషయమేమనగా మసీహ్ అలైహిస్సలాం యుద్ధముల కొరకు కాదు సంధి కొరకు వచ్చారని భావించినచో ఈ బోధనకు విరుద్ధంగా నడిచిన వ్యక్తి దైవ సామీప్యము నుండి దూరమగునని స్పష్టము కాదు. ఎందుకనగా మూసా (అ), యుసూ (అ), దావూద్ (అ) లను దైవ సామీప్యము పొందినవారిగా క్రైస్తవ ప్రపంచము గుర్తించును. క్రైస్తవ కాలములో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా శత్రువులతో



యుద్ధము చేసిన వీరులు వివిధ కాలపు మత గురువుల ప్రకారము నేడు “సేంట్” గా పిలువబడుచున్నారు.

## యుద్ధమును గూర్చి ఇస్లాం బోధన

ఈ రెండు రకాల బోధనలుగాక మధ్యేమార్గాన్ని అవలంభించుచు ఇస్లాం బోధించును. మూసా (అ) వలె దౌర్జన్యముగా ఒక దేశముపై దాడి చేసి ఆ జాతిని హతమార్చుమని అనదు. ఈ కాలములో మార్పునకు గురైన క్రైస్తవ మతం బాహాటంగా ఇట్లు ప్రకటించదు. “ఒక చెంప మీద దెబ్బతిని రెండవ చెంప కూడ త్రిప్పుము”. రహస్యంగా మీ వస్త్రములను అమ్ముకొని ఖడ్గము కొనవలెనని కూడ అనుచరులను సూచించదు. స్వభావమునకు అనువైన శాంతి సంధి స్థాపనకు ఏకైక కారణమగు బోధనను ఇస్లాం ప్రవేశపెట్టును. అదేమనగా నీవు ఎవరిపై దాడి చేయకుము. కాని నీపై ఎవడేని దాడి చేసినప్పుడు ఎదుర్కొననిచో ఉపద్రవము పెరిగి, శాంతి భద్రతలకు విఘాతం కలుగునని భావించినచో దాడికి సమాధానమిమ్ము. ఈ బోధనతో మాత్రమే ప్రపంచములో శాంతి, భద్రతల స్థాపన సాధ్యమగును. ఈ బోధనను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పాటించి చూపిరి. మక్కాలో వారు వరుసగా బాధలను భరించిరి. కాని యుద్ధమునకు మాత్రం సంకల్పించలేదు. వారు మదీనా ప్రస్థానము చేసినప్పుడు శత్రువు వారిని వెంటాడెను. శత్రువు దౌర్జన్యమునకు పాల్పడుచూ ఇస్లాంను అంతమొందించవలెనని కోరినందులకు నీతి, నిజాయితిని స్థాపించుటకు శత్రువును ఎదురించుమని అల్లాహ్ వారిని ఆదేశించెను.

పవిత్ర ఖురాన్‌లో ఈ విషయమును గురించి అవతరించిన వివిధ ఆదేశములు ఇట్లు గలవు.

1. పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇట్లు నుడివెను. *(అల్ హజ్: 40-42)*

اُذِنَ لِلَّذِيْنَ يُقَاتَلُوْنَ بِاَنَّهُمْ ظُلِمُوْا ۭ وَاِنَّ اللّٰهَ عَلٰي نَصْرِهِمْ لَقَدِيْرُ ۙ ؀
الَّذِيْنَ اُخْرِجُوْا مِنْ دِيَارِهِمْ بِغَيْرِ حَقٍّ اِلَّآ اَنْ يَّقُوْلُوْا رَبُّنَا اللّٰهُ ۭ وَلَوْلَا دَفْعُ
اللّٰهِ النَّاسَ بَعْضَهُمْ بِبَعْضٍ لَّهُدِّمَتْ صَوَامِعُ وَبِيَعٌ وَّصَلَوٰتٌ وَّمَسٰجِدُ
يُذْكَرُ فِيْهَا اسْمُ اللّٰهِ كَثِيْرًا ۭ وَلَيَنْصُرَنَّ اللّٰهُ مَنْ يَّنْصُرُهٗ ۭ اِنَّ اللّٰهَ لَقَوِيٌّ
عَزِيْزٌ ؀ اَلَّذِيْنَ اِنْ مَّكَّنّٰهُمْ فِي الْاَرْضِ اَقَامُوا الصَّلٰوةَ وَاٰتَوُا الزَّكٰوةَ وَاَمَرُوْا
بِالْمَعْرُوْفِ وَنَهَوْا عَنِ الْمُنْكَرِ ۭ وَلِلّٰهِ عَاقِبَةُ الْاُمُوْرِ ؀ (سورة الحج:٤٠تا٤٢)

అనగా వీరి (ముస్లిముల) పై దౌర్జన్యము చేయబడెను. శత్రువు ఈ ముస్లిములతో యుద్ధము మొదలు పెట్టెను. అందుకే వారికి నేడు యుద్ధము చేయు అనుమతి ఇవ్వబడుచున్నది. నిశ్చయముగా అల్లాహ్ వారి సహాయమునకు పూర్తి అధికారము గలవాడు. ఈ ముస్లిములకు యుద్ధము చేయు అనుమితి ఇవ్వబడుచున్నది. ఎందుకనగా వారిని వారి ఇండ్ల నుండి అన్యాయముగా వెడలగొట్టబడెను. వారి నేరమేమనగా (ఇది నేరమైనచో) వారు కేవలము అల్లాహ్ మా ప్రభువని అనిరి. వారిలో కొందరిని ఇతర కొందరితో అల్లాహ్ వైపు నుండి ఢీకొనునట్లు చేయక యుండినచో సన్యాస గృహములు, చర్చీలు, యూదుల ఆరాధనా మందిరములు, మస్జిద్‌లు తరచుగా అల్లాహ్ నామమును స్తుతించునవి నాశనము చేయబడియుండేవి. (ప్రపంచములో మతసామరస్యమును రక్షించుటకు పీడిత జాతులకు వ్యతిరేకముగా శత్రువు యుద్ధ ప్రకటన చేసినప్పుడు అల్లాహ్ యుద్ధము చేయుటకు అనుమతించును) నిశ్చయముగా అల్లాహ్ ధర్మమునకు సహాయము చేయువారికి తప్పక



అల్లాహ్ సహాయము చేయును. నిశ్చయముగా అల్లాహ్ గొప్ప బలవంతుడు, సర్వశక్తిమంతుడు. అల్లాహ్ వీరికి కూడ సహాయపడును. ఎవరికైతే భూమిపై మేము వైభవము ప్రసాదించినచో వారు ప్రార్థన (నమాజ్) స్థిరపర్చుదురు. పేదలకు దానము (జకాత్) చేయుదురు. సత్కర్మలకు ఆదేశింతురు. దుష్కర్మల నుండి ఆపుదురు. ప్రతి జగడము అంతము అల్లాహ్ కోరిన విధముగనే అగును.

ముస్లిములకు యుద్ధము చేయు అనుమతించుటకు అవతరించిన ఈ సూక్తులలో ఇట్లు తెలుపనైనది. ఒక జాతి సుదీర్ఘ కాలము వరకు ఇతర జాతి ద్వారా హింసకు గురైనప్పుడు, అకారణముగా క్రూరమైన జాతి దానికి విరుద్ధముగా యుద్ధము చేయుచు, పీడిత జాతి ధార్మిక స్వేచ్ఛను హరించినప్పుడు మాత్రమే ఇస్లాం బోధనానుసారము యుద్ధము చేయు అనుమతి గలదు. ఆ పీడిత జాతికి అధికారము లభించిన తర్వాత విధిగా ధార్మిక స్వేచ్ఛను కల్పించవలెను. అల్లాహ్ దానికి విజయము అందించి నప్పుడు సర్వ మతాలకు రక్షణ కల్పించవలెను. పుణ్య క్షేత్రాలను గౌరవించుట దాని భాధ్యత. ఈ విజయము వలన వారు శక్తి, గర్వమును ప్రదర్శించ కూడదు. పేదల సహాయము, దేశ సమగ్ర ప్రగతి, అశాంతి, పీడనమును దూరము చేయుటకు తమ శక్తులను ఉపయోగించవలెను. ఇది ఎంతో సంక్షిప్తమైన సంపూర్ణమైన బోధన. ముస్లిములకు యుద్ధము చేయు అనుమతి ఇవ్వబడిన కారణము కూడ ఇందులో తెలుపబడెను. బలవంతపు యుద్ధము ఇస్లాంలో నిషేధము కావున వారిప్పుడు విధిలేని పరిస్థితిలోనే యుద్ధము చేయుదురు. ఇస్లాం విజయము సాధించునని ఆరంభములోనే తెలుపబడిన విషయమును గమనించవలెను. విజయము లభించిన తర్వాత తమ జేబులు నింపుకోవడం, తమ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవడం కాక నిరుపేదల సహాయం, శాంతి స్థాపన,

పీడనమును పారదోలుటకు, సమాజము, జాతి, దేశ ఉన్నతికి కృషి చేయు లక్ష్యముతోనే వారు కృషి చేయవలెనని సూచించబడెను.

2. అల్లాహ్ ఇట్లు నుడివెను. (అల్ బఖరహ్:191-194)

وَقَاتِلُوْا فِیْ سَبِیْلِ اللّٰہِ الَّذِیْنَ یُقَاتِلُوْنَکُمْ وَلَاتَعْتَدُوْا اِنَّ اللّٰہَ لَا یُحِبُّ
الْمُعْتَدِیْنَ ٥ وَقْتُلُوْھُمْ حَیْثُ ثَقِفْتُمُوْھُمْ وَاَخْرِجُوْھُمْ مِّنْ حَیْثُ اَخْرَجُوْکُمْ
وَالْفِتْنَۃُ اَشَدُّ مِنَ الْقَتْلِ وَلَاتُقَاتِلُوْھُمْ عِنْدَالْمَسْجِدِ الْحَرَامِ حَتّٰی یُقَاتِلُوْکُمْ
فِیْہِ فَاِنْ قٰتَلُوْکُمْ فَاقْتُلُوْھُمْ کَذٰلِکَ جَزَآءُ الْکٰفِرِیْنَ ٥ فَاِنِ انْتَھَوْا فَاِنَّ اللّٰہَ
غَفُوْرٌ رَّحِیْمٌ ٥ وَقٰتِلُوْھُمْ حَتّٰی لَاتَکُوْنَ فِتْنَۃٌ وَّیَکُوْنَ الدِّیْنُ لِلّٰہِ فَاِنِ انْتَھَوْا
فَلَا عُدْوَانَ اِلَّا عَلَی الظّٰلِمِیْنَ ٥ (سورۃ البقرۃ:۱۹۱تا۱۹۴)

అనగా మీతో యుద్ధము చేయుచున్న వారితో అల్లాహ్ కొరకే యుద్ధము చేయుము. అందులో మీ స్వంత కోపము, స్వార్థము లేని విధంగా యుద్ధము చేయుము. జాగ్రత్త! యుద్ధములో కూడ హింసాత్మక సరళిని అవలంభించకుము. నిశ్చయముగా అల్లాహ్ దుర్జనులను ప్రేమించడు. (అన్యాయ యుద్ధమునకు తలపడిన వారు) మీరు వారితో యద్ధము వలన ఎదురుపడినప్పుడు వారితో మీరు యుద్ధము చేయుము. కాని ఒకరిద్దరు కలిసినచో వారిపై దాడి చేసి హతమార్చకుము. యుద్ధము కొరకు వారు మిమ్ములను వెళ్లుటకు బలవంతము పెట్టిరి. కావున మీరు కూడ వారికి యుద్ధ ఛ్యాలంజ్ ఇవ్వవచ్చును. హత్య, యుద్ధము, ధార్మిక విషయంలో ఒకరిని బాధకు గురిచేయుట ఎక్కువ ప్రమాదకరమైన నేరము. కావున ఈ పద్ధతిని అవలంభించకుము ఎందుకనగా ఇది అధర్ముల కార్యము. పవిత్ర మస్జిద్ వద్ద వారు మీతో యుద్ధమునకు తలపడునంత



వరకు మీరు వారితో యుద్ధము చేయకుము. ఎందుకనగా ఇటుల హజ్, ఉమ్రాహ్ చేయు వారికి ఇబ్బంది కలుగును. అప్పటికిని వారు యుద్ధము చేసినచో అనివార్యముగా మీరు కూడ వారితో యుద్ధము చేయుము. వివేకము, న్యాయమైన ఆదేశాలను రద్దు చేసిన వారితో ఇటులనే ప్రవర్తించవలెను. అవిశ్వాసుల ప్రతిఫలము ఇటులనే వుండును. కాని వారికి జ్ఞానోదయం కలిగినందు వలన వారు (ఈ దుష్కృత్యమును) మానుకొనినచో నిశ్చయముగా అల్లాహ్ క్షమాగుణ సంపూర్ణుడు, కారుణ్యమూర్తి. అటువంటి సందర్భములో మీరు కూడ మానుకొనవలెను. వారు యుద్ధము ప్రారంభించారని వారిపై దాడి కొనసాగించకుము. పీడనము నశించు వరకు, మతము అల్లాహ్ పరమైనంత వరకు వారితో యుద్ధము చేయుచుండుము. మతము అల్లాహ్ కు సంబంధించినది. అందులో బలవంతము చేయుట మానవునికి తగదు. వారు మతపరమైన విషయములలో బలవంతము చేయుట మానుకొనినచో వెంటనే యుద్ధమును నిలిపివేయుము. ఎందుకనగా హింసాత్ములకే శిక్ష విధించబడును. వారు ఇటువంటి హింసను వీడినచో వారితో యుద్ధము చేయుట సమంజసము కాదు.

ఈ సూక్తులలో ఇట్లు వివరించబడెను. **మొదటి విషయం:** అల్లాహ్ కొరకు మాత్రమే యుద్ధము జరగవలెను. అనగా స్వార్థ ప్రయోజనాలు, కోరికలు, దేశమును వశపర్చుకొనుటకు, తమ ఆధిపత్యము కొరకు యుద్ధము చేయరాదు. **రెండవ విషయము**: యుద్ధము ప్రారంభించిన వారితోనే యుద్ధము సమంజసము. **మూడవ విషయము:** మీతో యుద్ధము చేయువారితోనే మీరు యుద్ధము చేయవచ్చును. అనగా సైనికులు కాని వారు, ఈ యుద్ధములో పాల్గొనని వారిని హతమార్చుట లేదా వారితో యుద్ధము చేయుట సమంజసము

కాదు. **నాలుగవ విషయము:** శత్రువు యుద్ధము ప్రారంభించినను యుద్ధమును శత్రువు పరిమితం చేసినంతవరకు పరిమితం చేయవలెను. ప్రాంతపు ప్రకారము గాని. యుద్ధపు సామాగ్రి ప్రకారముగాని దానిని వ్యాపింపజేయుటకు ప్రయత్నించరాదు. **ఐదవ విషయం:** యుద్ధము యుద్ధ సైనికులతో మాత్రమే చేయవలెను. శత్రువు జాతికి చెందిన ఒక్కరిద్దరిని ఎదురించ కూడదు. **ఆరవ విషయం:** యుద్ధములో మతపరమైన ప్రార్ధనలు, ధార్మిక కార్యములలో అడ్డంకులు సృష్టించ కూడదు. ధార్మిక ప్రార్ధనల, ధార్మిక కార్యముల సమీపములో శత్రువు యుద్ధ వాతావరణం సృష్టించనప్పుడు ముస్లిములు కూడ అచట యుద్ధము చేయకూడదు. **ఏడవ విషయం:** ధార్మక కేంద్రాలను శత్రువు యుద్ధమునకు వినియోగించినచో విధిలేని స్థితిలో తప్ప మీరు అలా చేయకూడదు. ప్రార్ధన కేంద్రాలపై దాడి, వాటిని నేలమట్టం చేయడం అను విషయం అటుంచితే ఈ సూక్తిలో ప్రార్ధన కేంద్రముల సమీపములో కూడ యుద్ధము చేయరాదని సూచించబడెను. కాని శత్రువు ప్రార్ధన కేంద్రాలను యుద్ధమునకు వినియోగించినచో ఆ నష్టమునకు వారే బాధ్యులగుదురు. ఈ నష్టమునకు ముస్లిములు బాధ్యులు కారు. **ఎనిమిదవ విషయం:** శత్రువు ధార్మిక కేంద్రాలలో యుద్ధము ప్రారంభించిన తర్వాత దీని అపాయకరమైన ఫలితములను గమనించి ధార్మిక కేంద్రాలను విడిచి ఇతర స్థలములో యుద్ధమును మార్చినచో ఈ సాకుతో ముస్లిములు వారి ధార్మిక కేంద్రాలకు నష్టము కలిగించకూడదు. ఆయా క్షేత్రాల పవిత్రతను స్వీకరించుచూ వెంటనే మరో ప్రాంతమునకు వెళ్లిపోవలెను. **తొమ్మిదవ విషయం:** మతములో నిర్బంధము తొలగిపోయినచో మతపరమైన విషయాలలో స్వేచ్ఛ లభించునంతవరకు మాత్రమే యుద్ధము చేయవలెను. రాజకీయ విషయాల వలె ఇందులో జోక్యము చేసుకోకూడదు.



శత్రువు యుద్ధమును ప్రారంభించినను ఆచరణాత్మకంగా యుద్ధ విరమణ ప్రకటన చేసినచో వారితో యుద్ధము చేయకూడదు.

3. మరోచోట అల్లాహ్ ఇట్లు ఆదేశించెను. *(అన్ఫాల్ : 39, 40)*

قُلْ لِّلَّذِيْنَ كَفَرُوْٓا اِنْ يَّنْتَهُوْا يُغْفَرْ لَهُمْ مَّا قَدْ سَلَفَ وَاِنْ يَّعُوْدُوْا فَقَدْ
مَضَتْ سُنَّتُ الْاَوَّلِيْنَ٥ وَقَاتِلُوْهُمْ حَتّٰى لَا تَكُوْنَ فِتْنَةٌ وَّيَكُوْنَ الدِّيْنَ
كُلُّهٗ لِلّٰهِ فَاِنِ انْتَهَوْا فَاِنَّ اللّٰهَ بِمَا يَعْمَلُوْنَ بَصِيْرٌ ٥ وَاِنْ تَوَلَّوْا فَاعْلَمُوْٓا
اَنَّ اللّٰهَ مَوْلٰكُمْ نِعْمَ الْمَوْلٰى وَنِعْمَ النَّصِيْرُ٥ (سورة الانفال:٣٩تا٤١)

అనగా ఓ ముహమ్మద్ రసూలుల్లాహ్! శత్రువు యుద్ధములను ప్రారంభించెను. అల్లాహ్ ఆదేశముతో మీరు వారిని ఎదుర్కొనవలసి వచ్చును. కాని ఇప్పటికైనా వారు శాంతించినచో గతములో వారు చేసినది క్షమించబడునని నీవు ప్రకటించుము. వారు యుద్ధమును వీడక తరచుగా దాడులు చేసినచో పూర్వపు ప్రవక్తల శత్రువుల అంతము అయినట్లు వారి అంతమగును. ఓ ముస్లిములారా! పీడనము మిగులునంత వరకు, ధర్మము సంపూర్ణముగా అల్లాహ్ కొరకే అగునంత వరకు, ధార్మిక విషయాలలో జోక్యము అంతమగునంత వరకు వారితో మీరు యుద్ధము చేయుచుండుము. వారు ఆ విషయమును వీడినచో వారు అసత్య ధర్మమును నమ్ముచున్నారని వారితో యుద్ధము చేయకుము. అల్లాహ్ నిశ్చయముగా వారు చేయునదంతయు కనిపెట్టుచుండును, అతడే వారిని గూర్చి నిర్ణయించును. వారి తప్పుడు ధర్మము వలన వారి ఆచారాలలో జోక్యము చేయు అనుమతి మీకు లేదు. మా ద్వారా ఈ సయోధ్యాత్మక ప్రకటన వెలువడిన తర్వాత కూడ వారిలో మార్పు రాక యుద్ధమును

కొనసాగించినచో మీరు తక్కువగానున్నను మీరు జయింతురని భావించుము. ఎందుకనగా మీ సంరక్షకుడు అల్లాహ్. ఎంతో మంచి సంరక్షకుడు, ఎంతో మంచి సహాయకుడు.

అవిశ్వాసులు, ముస్లిముల మధ్య సంభవించిన ప్రప్రథమ అధికారిక బద్ర్ యుద్ధము ప్రస్తావన తర్వాత ఈ సూక్తులు పవిత్ర ఖురాన్‌లో అవతరించినవి. అరబ్ అవిశ్వాసులు అకారణముగా ముస్లిములపై దాడికి పాల్పడిరి. మదీనా చుట్టు శాంతి, భద్రతలకు విఘాతం కల్గించిరి. ఇందులో ముస్లిములు విజయము పొందగా శత్రువుల అగ్ర నాయకులు మృతిచెందిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా పవిత్ర ఖురాన్ ఇట్లు ప్రకటన చేయించెను. మీరు ఇప్పటికైనా మానుకొనినచో మేము యుద్ధమును కొనసాగించము. బలవంతముగా మత మార్పిడి సమంజసం కాదు. మతపరమైన విషయములలో జోక్యము సరికాదని మాత్రమే మేము కోరుచున్నాము.

4. అల్లాహ్ ఇట్లు ఉపదేశించెను. *(అన్ఫాల్: 62,63)*

وَاِنْ جَنَحُوْا لِلسَّلْمِ فَاجْنَحْ لَهَا وَتَوَكَّلْ عَلَى اللّٰهِ اِنَّهٗ هُوَ السَّمِيْعُ
الْعَلِيْمُ ٥ وَاِنْ يُّرِيْدُوْا اَنْ يَّخْدَعُوْكَ فَاِنَّ حَسْبَكَ اللّٰهُ هُوَالَّذِىْ
اَيَّدَكَ بِنَصْرِهٖ وَبِالْمُؤْمِنِيْنَ ٥ (سورة الانفال:٦٢ تا ٦٣)

అనగా అవిశ్వాసులు ఏ సమయములో సంధి కొరకు ముందుకు వచ్చినను నీవు కూడ వెంటనే సంధి కొరకు ముందంజవేయుము. వారు మోసము చేయుదురని భ్రమ పడకుము. అల్లాహ్‌నే నమ్ముము. నిశ్చయముగా అతడే సర్వశ్రవణ సమర్థుడు, సర్వజ్ఞుడు. నీవు ఊహించినదే నిజమై వారు నిన్ను మోసగించుటకు సంకల్పించినచో వారు మోసము



చేయుటతో ఏమగునని గుర్తుంచుకొనుము! కాదు. నీకు అల్లాహ్ సహకారముతోనే విజయాలు లభించుచున్నవి. అతడి సహాయము నీకు చాలు. ఇంతకు ముందు అతడే ప్రత్యక్షముగా విశ్వాసుల సహాయము ద్వారా నీకు సహాయము చేసెను.

ఈ సూక్తిలో ఇట్లు ఆదేశించబడెను. శత్రువు సంధి కోరుకున్నచో ముస్లిములు తప్పక సంధి కొరకు ఒప్పుకొనవలెను. సంధి నియమములను బాహ్య రూపంలో ఒప్పుకొనినచో శత్రువు దురుద్దేశముతో మరల శక్తి సమకూర్చుకొని దాడికి పాల్పడే అవకాశముందని సంధిని రద్దు చేయకూడదు.

ఈ సూక్తులలో హుదైబియా శాంతి ఒప్పందమును గూర్చి భవిష్యవాణి గలదు. రాబోవు కాలములో శత్రువు సంధి ప్రతిపాదన చేయునని అప్పుడు శత్రువు దౌర్జన్యము చేసినాడని, తర్వాత ఈ శాంతి ఒప్పందమును ఉల్లంఘించుననే సాకుతో మీరు సంధిని తిరస్కరించ కూడదు. ఎందుకనగా సత్యము ఇదే కోరును. సంధిని స్వీకరించుటలోనే మీకు శుభములు గలవు.

5. అల్లాహ్ ఇట్లు నుడివెను. *(అన్నిసా : 95)*

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْۤا اِذَا ضَرَبْتُمْ فِىْ سَبِيْلِ اللّٰهِ فَتَبَيَّنُوْا وَلَا تَقُوْلُوْا لِمَنْ
اَلْقٰۤى اِلَيْكُمُ السَّلٰمَ لَسْتَ مُؤْمِنًا تَبْتَغُوْنَ عَرَضَ الْحَيٰوةِ الدُّنْيَا
فَعِنْدَ اللّٰهِ مَغَانِمُ كَثِيْرَةٌ كَذٰلِكَ كُنْتُمْ مِّنْ قَبْلُ فَمَنَّ اللّٰهُ عَلَيْكُمْ
فَتَبَيَّنُوْا اِنَّ اللّٰهَ كَانَ بِمَا تَعْمَلُوْنَ بَصِيْرًا ٥ (سورة النساء:٩٥)

అనగా ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ మార్గము నందు యుద్ధము కొరకు వెళ్లినప్పుడు ఈ విషయమును సముచితమైన పరిశీలన చేసుకొనుడు. శత్రువునకు అన్ని విషయములు స్పష్టమైనను యుద్ధమును కోరుచున్నాడు. ఎవరైనా వ్యక్తి లేదా వర్గము శాంతిని ఆశించి సంధి కోరుతున్నానని మీకు ప్రతిపాదించినచో నీవు మోసము చేయదలచితివని. లేదా నీతో మేము శాంతియుతంగా ఉంటామనే నమ్మకము మాకు లేదని అనకుము. మీరు అట్లు చేసినచో దైవ మార్గములో మీరు యుద్ధము చేయువారనబడక మీరు ప్రపంచ జీవితపు వస్తువులను ఆశించిన వారగుదురు. కనుక అలా చేయకుము. ఎందుకనగా ధర్మము వున్నట్లు అల్లాహ్ వద్ద ప్రపంచపు వస్తువులు కూడ అనంతముగా నున్నవి. ఒకరిని హతమార్చడమే అసలైన ఉద్దేశము కాదని గుర్తుంచుకొనుము. మీకేమి తెలియును అతడు రేపు మార్గదర్శనము పొందవచ్చును. ఇంతకు ముందు మీరు కూడ ఈ విధముగనే ఇస్లాం ధర్మములో లేకుండిరి. తర్వాత అల్లాహ్ అనుగ్రహించి ఈ ధర్మమును స్వీకరించే అవకాశము మీకు కల్పించెను. కనుక హతమార్చడంలో తొందరపాటు చేయకుము. సముచితమైన పరిశీలన చేయుము. నిశ్చయముగా మీరేమి చేయుదురో అల్లాహ్‌కు బాగుగా తెలియును.

ఈ సూక్తిలో ఇట్లు తెలుపబడెను. యుద్ధము మొదలైనప్పుడు శత్రువు దౌర్జన్యపూరిత దాడి చేయుటకు సంకల్పించినాడేమో పరిశీలించు కొనవలెను. ఎందుకనగా శత్రువు దౌర్జన్యపూరిత యుద్ధమును ఆశించక ఏదేని భయము వలన సైనిక సన్నాహాలలో వుండవచ్చును. శత్రువు దౌర్జన్యముగా యుద్ధము చేయుటకు సిద్ధమైనాడని అన్ని విధాలా పరిశీలన చేసుకున్న తర్వాతనే అతన్ని ఎదురించుటకు బయలు దేరుము. అప్పుడు కూడ నేను యుద్ధము చేయు ఉద్దేశముతో కాదు భయము వలనే యుద్ధ



సన్నాహాలు చేసుకున్నాని శత్రువు అన్నచో, కాదు నీవు యుద్ధము చేయు ఉద్దేశముతోనే సన్నద్ధమైనావు, నీ నుండి మాకు ఏ విధంగా రక్షణ లభించునని మొండిగా వ్యవహరించకుము. అతని మాటను నమ్ముము. అతడు ముందు సంకల్పించినను తర్వాత విరమించుకొనవచ్చు. హృదయాలలో మార్పు రావచ్చును. ఇందుకు మీరు ప్రత్యక్ష సాక్షులు ఒకప్పుడు మీరు ఇస్లాంనకు శత్రువులుగా నుండిరి కాని నేడు ఇస్లాం సైనికులుగా నున్నారు.

6. శత్రువులతో చేయు వాగ్దానము గురించి అల్లాహ్ ఇట్లు తెలిపెను.

اِلَّا الَّذِيْنَ عَاهَدْتُّمْ مِّنَ الْمُشْرِكِيْنَ ثُمَّ لَمْ يَنْقُصُوْكُمْ شَيْئًا وَّلَمْ يُظَاهِرُوْا عَلَيْكُمْ اَحَدًا فَاَتِمُّوْٓا اِلَيْهِمْ عَهْدَهُمْ اِلٰى مُدَّتِهِمْ ۭ اِنَّ اللّٰهَ يُحِبُّ الْمُتَّقِيْنَ ۝ (سورة التوبة:٤)

(అత్తౌబహ్: 4) అనగా విగ్రహారాధులలో నుండి మీతో ఒప్పందము చేసికొనిన వారు, తరువాత మీతో చేసిన వాగ్దానమును నిర్వర్తించినచో, మీకు విరుద్ధముగా మీ శత్రువులకు సహాయము కూడ చేయనిచో మీరు వారితో చేసిన ఒప్పందపు నిర్ణీత సమయమును పూర్తి చేయుము. నిశ్చయముగా అల్లాహ్ ధర్మ నిష్టాపరులను ప్రేమించును.

7. యుద్ధములో నున్న శత్రువు జాతిలోని ఎవరైనా ఇస్లాం గూర్చి వాస్తవమును తెలుసుకొన దలచినచో అనుసరించాల్సిన పద్ధతిని అల్లాహ్ ఇట్లు తెలుపును. (అత్తౌబహ్: 6)

وَاِنْ اَحَدٌ مِّنَ الْمُشْرِكِيْنَ اسْتَجَارَكَ فَاَجِرْهُ حَتّٰى يَسْمَعَ كَلٰمَ اللّٰهِ ثُمَّ اَبْلِغْهُ مَاْمَنَهٗ ۭ (سورة التوبة:٦)

అనగా యుద్ధములో నున్న విగ్రహారాధులలో నుండి ఎవడేని మీ దేశములో ప్రవేశించి ఇస్లాం గురించి వివరాలు తెలుసుకొనుటకు శరణము కోరినచో అతనికి తప్పక శరణము ఇవ్వుము. అతడు ఇస్లాం గురించి వాస్తవాలు పరిశోధించుకొని, పవిత్ర ఖురాన్ బోధనలను తెలుసుకొనేంత వరకు అతనికి అభయము నిమ్ము. తరువాత అతనిని అతని భద్రత గల స్థలమునకు చేర్చుము.

8. యుద్ధ ఖైదీల గూర్చి అల్లాహ్ ఇట్లు బోధించును.(అన్ఫాల్:68)

مَا كَانَ لِنَبِيٍّ اَنْ يَّكُوْنَ لَهٗٓ اَسْرٰى حَتّٰى يُثْخِنَ فِى الْاَرْضِ ۭ (انفال:٦٨)

అనగా భూమి పై భీకర యుద్ధము చేయనిదే తన శత్రువులను బందీలు చేయుట ఏ సందేశహరునికి తగదు.

ఆ కాలము వరకే కాక తరువాత శతాబ్దాల పాటు ప్రపంచములో కొనసాగిన సంప్రదాయమేమనగా యుద్ధము జరగనిదే శత్రువుల ప్రజలను బంధించుట సమంజసమని భావించిరి. కాని దీనిని ఇస్లాం ఇష్టపడదు. యుద్ధ రంగములో పాల్గొని యుద్ధము ముగిసిన తరువాత పట్టుబడిన వారినే బంధించవలయును.

9. ఆ బందీల గూర్చి అల్లాహ్ ఇట్లు బోధించెను.(ముహమ్మద్:5)

فَاِمَّا مَنًّا ۢ بَعْدُ وَاِمَّا فِدَاۗءً (سورۃ محمد:٥)

అనగా యుద్ధ ఖైదీలు పట్టుబడిన తర్వాత ఉపకారము చేయుచు వారిని వదులుము లేదా తగిన పరిహారము తీసుకొని స్వేచ్ఛ ప్రసాదించుము.

10. పరిహారము కట్టువారు ఎవరు లేని ఖైదీలు, లేదా వారి ధనమును స్వాధీనం చేసుకొనుటకు వారి బంధువులు వారిని ఖైదీలుగా వుండ వలెనని కోరు బందీల గురించి అల్లాహ్ ఇట్లు ఉపదేశించెను.(అన్నూర్:34)



وَالَّذِيْنَ يَبْتَغُوْنَ الْكِتٰبَ مِمَّا مَلَكَتْ اَيْمَانُكُمْ فَكَاتِبُوْهُمْ اِنْ عَلِمْتُمْ فِيْهِمْ خَيْرًا وَّاٰتُوْهُمْ مِّنْ مَّالِ اللّٰهِ الَّذِيْٓ اٰتٰىكُمْ ۭ (سورۃ نور:٣٣)

అనగా మీరు ఉపకారముతో వదలలేని మీ యుద్ధ ఖైదీలను వారి జాతి పరిహారము ఇచ్చి విడిపించలేనప్పుడు వారు మాకు స్వేచ్ఛ ప్రసాదించమని మేము ఏదైనా వృత్తి, నైపుణ్యముతో కష్టపడి ధనము సంపాదించి మీకు పరిహారము చెల్లించెదమని కోరినచో వారు స్వాతంత్ర్యము గా సంపాదించగలరని మీరు భావించి యున్నచో వారికి తప్పక స్వేచ్ఛ కల్పించడమే గాక వారి ఈ ప్రయత్నములో వారికి సహకరించుము. అల్లాహ్ మీకు ప్రసాదించిన ధనములో నుండి కొంత ధనము వారికి స్వాతంత్ర్యము కల్పించుటలో వినియోగించుము. అనగా వారి యుద్ధ ఖర్చులు భరించుము. లేదా యజమాని కొంత రాయితి ఇవ్వవలెను. ఇతర ముస్లిములు సంయుక్తంగా ప్రయత్నించి అతనికి స్వేచ్ఛ కల్పించుటలో ఆర్థికముగా సహకరించవలెను.

ఇటువంటి పరిస్థితులలో, ఈ నియమములతోనే ఇస్లాం యుద్ధమునకు అనుమతించును. పవిత్ర ఖురాన్‌లోని ఈ బోధనను అనుసరించి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ముస్లిములకు ఆదేశించిన మరి కొన్ని బోధనలు ఇట్లు గలవు.

1) ముస్లిములు ఎట్టి పరిస్థితిలోనైనను "ముస్ల" చేయకూడదు. అనగా యుద్ధములో హతమైన శత్రువుల శవాలను కించపర్చడం, వారి అవయవాలను కోసివేయడం తగదు. *(ముస్లిం మిస్రి, సంపుటి 2, పుట 62 కితాబుల్ జిహాద్, బాబ్ తామీరుల్ ఇమామ్ అల్‌ఉమరా అల్ బవూసి వవసియ్యతిహి ఇయ్యాహుమ్ బిఆదాబి వఘైరహా)*

2) యుద్ధములో ముస్లిములు ఏ విధంగాను మోసము చేయకూడదు.

*(ముస్లిం మిస్రి, సంపుటి 2, పుట 65 కితాబుల్ జిహాద్, బాబ్ తహ్రీం ఖత్లిన్నిసా వస్సిబ్యాన్ ఫిల్‌హర్బ్)*

3) పిల్లలను, స్త్రీలను హతమార్చరాదు. *(ముస్లిం మిస్రి,సంపుటి 2, పుట 65 కితాబుల్ జిహాద్, బాబ్ తహ్రీం ఖత్లిన్నిసా వస్సిబ్యాన్ ఫిల్‌హర్బ్)*

4) క్రైస్తవ బోధకులు, పండితులు, ఇతర మత గురువులను హత్య చేయకూడదు. *(తహావి)*

5) వృద్ధులు, పిల్లలు, స్త్రీలను హతమార్చకూడదు. ఎల్లప్పుడు సంధి, ఉపకారమునే అవలంభించుటకు కృషి చేయవలెను. *(అబూదావూద్ సంపుటి 1, కితాబుల్ జిహాద్ ఫీ దుఆ ఇల్ ముష్‌రికీన్ పేజి 352 మత్బ నామీ కాన్‌పూర్)*

6) యుద్ధముకు ముస్లిములు పయనమైనప్పుడు శత్రు దేశంలో భయంకర వాతావరణం సృష్టించకూడదు. సాధారణ ప్రజలను ఇబ్బందికి గురి చేయకూడదు. *(ముస్లిం మిస్రి, సంపుటి 2, పుట 62 కితాబుల్ జిహాద్, బాబ్ ఫీ అమ్రిల్ జుయూషి బిత్తయస్సుర్ వతర్‌కుత్తన్‌ఫీర్)*

7) యుద్ధముకు వెళ్ళినప్పుడు ప్రజలకు ఇబ్బంది కలిగే చోట విడిది చేయకూడదు. పోవునప్పుడు ఇతర ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకుండా దారి వదులవలెను. ఈ ఆజ్ఞలను పాటించని వ్యక్తి అల్లాహ్ మార్గములో కాక తన స్వార్థ ప్రయోజనాలకై యుద్ధము చేయునట్లు అగునని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గట్టిగా హెచ్చరించిరి. *(అబూదావూద్ సంపుటి 1, కితాబుల్ జిహాద్ బాబ్ మా యూమరు మన్ ఇన్జిమాముల్ అస్కరి పేజి 352 మత్బ నామీ కాన్‌పూర్)*

8) యుద్ధములో శత్రువు ముఖమును గాయపర్చరాదు. *(బుఖారి, ముస్లిం)*

9) యుద్ధ సమయమున శత్రువునకు అతి తక్కువ నష్టము



కలిగించుటకు ప్రయత్నించవలెను. *(అబూదావూద్)*

10) బంధించబడిన ఖైదీలలో సమీప బంధువులున్నచో వారిని పరస్పరం విడదీయకూడదు. *(అబూదావూద్ సంపుటి 2, కితాబుల్ జిహాద్ బాబ్ ఫిత్తఫ్‌రీక్ బైనస్సబియ్యి పుట 297 మత్బ నామీ కాన్‌పూర్)*

11) ఖైదీల విశ్రాంతి, ఆరోగ్యము గూర్చి తమ కంటే ఎక్కువ శ్రద్ధ వహించవలెను *(తిర్మిజి అబ్వాబుస్సైర్)*

12) విదేశీ ప్రతినిధులను గౌరవించవలెను. వారు తప్పు చేసినను విస్మరించవలెను. *(అబూదావూద్ కితాబుల్ జిహాద్)*

13) ఎవరైనా యుద్ధ ఖైదీని హింసించినచో పరిహారము తీసుకోకుండానే ఆ ఖైదీని విడుదల చేయవలెను.

14) ఎవరి వద్దనైన యుద్ధ ఖైదీ వుంచబడినచో తాను తినునదే అతనికి తినిపించవలెను. తాను ధరించినదే అతనికి ధరింప జేయవలయును. *(బుఖారి)* హజ్రత్ అబూబకర్ (రజి) ఈ బోధనల ఆధారంగా భవనములను కూల్చరాదు, ఫలములు గల వృక్షములను నరికివేయరాదని ఆదేశించిరి. *(మొఅతా ఇమామ్ మాలిక్ ముత్తబాయి కితాబుల్ జిహాద్ పుట 167)*

యుద్ధమును నిరోధించుటకు ఇస్లాం ఎటువంటి ప్రయత్నాలు చేపట్టినదో ఈ బోధనల ద్వారా స్పష్టమగును. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ బోధనలను ఎంత సమర్థవంతముగా పాటించిరో వీటిని అమలు చేయాలని ముస్లిములకు నొక్కి చెప్పిరో కూడ అర్థమగును. ప్రతి ఒక్కరు అర్థము చేసుకొనునది ఏమనగా మూసా (అ) బోధన ఈ కాలములో నిజాయితితో కూడిన బోధన అనబడదు. అది ఆచరించ దగినది కూడ కాదు. యేసు బోధనను ఆచరించుట కూడ ఈ కాలములో అసాధ్యం. క్రైస్తవ దేశములు ఏనాడు దానిని ఆచరించలేదు. ఇస్లాం బోధనలే ఆచరణకు సాధ్యమగును. దానిని ఆచరించినచో ప్రపంచములో శాంతి

స్థాపన సాకారమగును.

యుద్ధ సమయములో కూడ యుద్ధము చేయకూడదని నేడు మహాత్మ గాంధీ నిస్సందేహముగా ప్రపంచములో ఒక ప్రతిపాదన ప్రవేశపెట్టిరి. కాని మహాత్మ గాంధీ ప్రవేశపెట్టిన విషయమును ప్రపంచము ఏనాడు పాటించలేదు. అందుకే దాని విశిష్టతలను, లోపాలను మనము అంచనా వేయలేము. మహాత్మ గాంధీ జీవితములోనే కాంగ్రెస్‌కు అధికారం లభించెను. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వము సైనికులను తొలగించక ఆంగ్ల కాలములో తొలగించబడిన ఐ.ఎన్.ఎ అధికారులను సైన్యములో మరల నియమించాలని సూచించుచున్నది. కాంగ్రెస్ ప్రభుత్వము ఏర్పడి వారం రోజులు కాకముందే వజీరిస్తాన్ ప్రాంతములో నిరాయుధ ప్రజలపై యుద్ధ విమానాల ద్వారా బాంబులు పేల్చబడెను. అప్పుడు స్వయనా మహాత్మ గాంధీ హింసకు పాల్పడిన వారి పక్షాన నిలిచి, వారి విడుదలకై నిరంతరం ప్రభుత్వంపై వత్తిడి కొనసాగించిరి. కావున స్వయాన మహాత్మ గాంధీ, వారి విధేయులు ఈ ప్రతిపాదనను ఆచరించలేరని నిరూపితమయ్యెను. జాతులు, దేశముల యుద్ధములో ఈ బోధనను సమర్ధవంతముగా అనుసరించినచో ఏ విధముగా శాంతి స్థాపన సాధ్యమగునో ఆమోదయోగ్య పద్ధతులు కూడ వారు వివరించలేరు. నోటి మాటలతో ఉపదేశించి దానిని పాటించని వైనమే ఇది ఆచరణకు సాధ్యం కాదని తేల్చును. నేటి వరకు ప్రపంచ అనుభవము, జ్ఞానం మానవునికి మార్గదర్శనం చేసిన మేరకు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుసరించిన విధానమే ఉత్తమమని స్పష్టమగును.

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ كَمَا صَلَّيْتَ
عَلٰى اِبْرَاهِيْمَ وَعَلٰى اٰلِ اِبْرَاهِيْمَ اِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ۔



## కందక యుద్ధము తర్వాత ముస్లిములపై అవిశ్వాసుల దాడులు

అహ్‌జాబ్ నుండి తిరిగి వచ్చిన తర్వాత అవిశ్వాసులు ధైర్యము కోల్పోయి, నిరాశకు గురై యుండిరి. కాని ముస్లిములు అల్ప సంఖ్యలో వుండగా మేము అధిక సంఖ్యలో వున్నామనే భావన వారిలో తొలగిపోలేదు. అందుకే అవకాశము లభించిన ప్రతి చోట ఒకరిద్దరు ముస్లిములను పట్టుకొని హతమార్చెదము. ఇటుల మాకు జరిగిన అవమానమునకు ప్రతీకారము తీర్చుకోగలమని నిర్ణయించుకొనిరి. కావున అహ్‌జాబ్‌లో ఓటమి తర్వాత మదీనా చుట్టు ప్రక్కల గల జాతులు ముస్లిములపై గుప్త దాడులకు పాల్పడడం ప్రారంభించిరి. ఫజారా జాతి వారు కొందరు మదీనా సమీపములో గుప్త దాడి చేసి, అక్కడ మేయుచున్న ముస్లిముల ఒంటెలను దోచుకొని కాపరిని హత్య చేసి, అతని భార్యను బంధించి ఒంటెలతో సహా పారిపోయిరి. బంధించబడిన స్త్రీ ఏదోవిధంగా తప్పించుకొని తిరిగి వచ్చెను. కాని ఒంటెల ఒక మందను తీసుక పోవడంలో శత్రువు సఫలమయ్యెను. దీనికి నెల తర్వాత ఉత్తరాన వున్న ఘత్ఫాన్ జాతి వారు ముస్లిముల ఒంటెల మందలను దొంగిలించుటకు ప్రయత్నించిరి. ముహమ్మద్ బిన్ ముసల్లమ (రజి)ను పది మందితో పరిస్థితులను తెలుసుకొనుటకు, మందల రక్షణ కొరకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పంపిరి. కాని అవిశ్వాసులు అదును చూసి వారిని హతమార్చిరి. ముహమ్మద్ బిన్ ముసల్లమ (రజి) ను కూడ వారు హత్య చేసి పోయిరి. కాని నిజానికి వారు స్పృహ తప్పి పడియుండిరి. శత్రువులు వెళ్ళిపోయిన తర్వాత వారు స్పృహలోకి వచ్చి, మదీనా చేరుకొని, ఈ స్థితిగతులను తెలిపిరి. నా మిత్రులందరు హతమార్చబడిరి. కేవలం నేను మిగిలితినని తెలిపిరి. కొన్ని రోజుల తర్వాత రోమన్ ప్రభుత్వము

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు ఒక ప్రతినిధిని పంపెను. జర్హమ్ జాతి ప్రజలు అతడిపై దాడి చేసి దోచుకొనిరి. మరో మాసము తర్వాత బనూ ఫజారా జాతి వారు ముస్లిముల ఒక బృందంపై దాడి చేసి దోచుకొనిరి. ఈ దాడి ధార్మిక ద్వేషముతో జరగలేదు కాబోలు. ఎందుకనగా బనూఫజారా ఒక దోపిడీ దొంగల ముఠా. ప్రతి జాతి వారిని దోచుకొని హత్య చేసేవారు. ఆ కాలములో ఖైబర్ యూదులు కూడ అహ్‌జాబ్ యుద్ధమునకు కారకులై యుండిరి. అందుకే వారు కూడ తమ ఓటమికి ప్రతీకారంగా చుట్టు ప్రక్కల వున్న జాతులను రెచ్చగొట్టేవారు. రోమన్ ప్రభుత్వ సరిహద్దు ప్రాంతాల అధికారులను, జాతులను కూడ ముస్లిములకు వ్యతిరేకంగా ప్రేరేపించేవారు. సంక్షిప్తముగా మదీనాపై దాడి చేసే ధైర్యము అరబ్ అవిశ్వాసులకు లేకుండెను. కాని యూదులతో కలిసి మొత్తం అరబ్ దేశములో ముస్లిములను ఇబ్బందులకు గురి చేయుచు దోపిడి చేసేవారు. కాని ఇప్పటి వరకు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అవిశ్వాసులతో తుది యుద్ధము చేయుటకు నిర్ణయము తీసుకోలేకుండిరి. ఈ యుద్ధము సంధితో ముగిసినచో బాగుండునని వారు నిరీక్షించు చుండిరి.

## 15 వందల అనుచరులతో ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాకు పయనం

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ మధ్యకాలంలో ఒక సత్యస్వప్నము చూచిరి. పవిత్ర ఖురాన్ దానిని ఇట్లు భద్రపర్చెను. *(అల్ ఫతహ్:28)*

لَتَدْخُلُنَّ الْمَسْجِدَ الْحَرَامَ اِنْ شَآءَ اللّٰهُ اٰمِنِيْنَ ۙ مُحَلِّقِيْنَ رُءُوْسَكُمْ وَمُقَصِّرِيْنَ ۙ لَا تَخَافُوْنَ ۭ فَعَلِمَ مَالَمْ تَعْلَمُوْا فَجَعَلَ مِنْ دُوْنِ ذٰلِكَ فَتْحًا قَرِيْبًا ٥ (الفتح:٢٨)



అనగా అల్లాహ్ కోరినచో మీరు తప్పక పవిత్ర మస్జిద్ యందు తమ తల ముండనము చేయుచు, తల వెంట్రుకలు కత్తిరించుచు భయపడని స్థితిలో మీరు శాంతియుతంగా ప్రవేశింతురు. (హజ్ సందర్భంగా తల ముండనము చేయుట, వెంట్రుకలు కత్తిరించుట అనివార్యము) మీరెరుగని దానిని అల్లాహ్ ఎరిగివుండెను. అందుకే అతడు ఆ స్వప్నము పూర్తి గాక ముందే మరొక విజయమును విధించియున్నాడు. అది స్వప్నపు విజయానికి పునాదిగా నుండును.

నిజమునకు ఈ స్వప్నములో ఒప్పందము చేసుకొని. శాంతి యుతముగా మక్కాను జయించు వార్తనివ్వబడి యుండెను. కాని బహుశ దీనికర్థము కాబా ప్రదక్షిణము చేయాలని అల్లాహ్ మమ్ము ఆదేశించాడని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం భావించిరి. ఈ అవగాహన లోపంతోనే ఇట్టి విజయానికి పునాది పడవలసి యుండెనని అల్లాహ్ రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలియజేయలేదు. కనుక తమ అనుచరులలో ఈ విషయమును వారు ప్రకటించి, వారు కూడ తమ వెంట రావలసినదిగా ఆదేశించిరి. మనము కేవలం ప్రదక్షిణము నిమిత్తం వెళ్ళుచున్నాము, కావున శత్రువుకు కోపము తెప్పించే ఎటువంటి బల ప్రదర్శన లేదా వ్యాఖ్యములు చేయకూడదని కూడ ఉపదేశించిరి. ఈ విధంగా క్రీ.శ. 628 ఫిబ్రవరి అంతములో 15 వందల మంది సందర్శకులతో కలిసి మక్కా వైపు పయనమైరి. (ఒక సం॥ తర్వాత 15 వందల అనుచరులు వారి వెంట వచ్చారనగా ఒక సం॥ క్రితం అహ్‌జాబ్ యుద్ధములో ఇంత కంటే తక్కువే వుండివుంటారు. ఎందుకనగా ఒక సం॥లో ముస్లిములు పెరిగిరి కాని తగ్గలేదు. కావున అహ్‌జాబ్ యుద్ధములో ముస్లిముల సంఖ్య 3 వేలు వ్రాసిన చరిత్రకారులు పొరపాటు పడిరి. అప్పుడు 12 వందల సైనికుల సంఖ్యే సరియైనది) హజ్ బృందమునకు

ముందు 20 మంది సైనికులు నడిచేవారు. తద్వారా శత్రువులు ముస్లిములకు నష్టము కల్గించాలని కుట్ర పన్నినచో సరైన సమయంలో విషయము తెలియును. మక్కా వారికి వారి (స) ఈ సంకల్పము గురించి వార్త అందినప్పుడు వాస్తవానికి మక్కా ప్రదక్షిణమునకు వచ్చేవారిని అడ్డుకోవడం సరికాదని ధార్మికంగా అవిశ్వాసులు కూడ విశ్వసించేవారు. ఇటు ముస్లిములు మేము కాబా ప్రదక్షిణము కొరకు మాత్రమే వచ్చుచున్నాము. యుద్ధము, జగడము లాంటి దురుద్దేశం మాకు లేదని సవివరముగా ప్రకటించి యుండిరి. అయినను వారు మక్కాను ఒక కోటగా మార్చిరి. చుట్టు ప్రక్కల జాతుల వారిని కూడ తమ సహాయమునకు పిలిపించుకొనిరి. వారు మక్కా సమీపమునకు చేరుకోగా వారికి తెలిసినదేమనగా ఖురైష్ ప్రజలు చిరుత చర్మములు ధరించి తమ సతీమణులు, పిల్లలను వెంటబెట్టుకొని ఇట్లు ప్రమాణము చేసిరి. వారిని వెళ్లనివ్వము. ఒక జాతి ప్రాణత్యాగమునకు సిద్ధమైనప్పుడు ఆ జాతి నాయకులు చిరుత చర్మములు ధరించుట అరబ్బుల ఆచారము. అనగా ఇప్పుడు వివేకముతో పని లేదు. ధైర్య సాహసాలు ప్రదర్శించి ప్రాణాలు అర్పించెదము. ఈ వార్త అందిన కొద్ది సమయములోనే మక్కాకు చెందిన సైన్యముల మొదటి బృందము ముస్లిములకు ఎదురుగా నిలిచెను. వారి ఈ చర్య వలన ఖడ్గ బలముతో శత్రువును ఓడించి మాత్రమే ముందుకు వెళ్లే పరిస్థితి ఏర్పడెను.

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఎట్టి పరిస్థితి ఎదురైనను యుద్ధము చేయకూడదనే నిర్ణయము ఇంతకు ముందే తీసుకొని యుండిరి. అరణ్య మార్గములు తెలిసిన ఒక తెలివైన మార్గదర్శిని వారు నియమించి అరణ్య ప్రాంతములో నుండి ముస్లిములను మక్కాకు చేర్చమని ఆదేశించిరి. అతడు వారిని, వారి అనుచరులను అరణ్య మార్గాన మక్కాకు అతి



సమీపములో నున్న హుదైబియా ప్రాంతము వరకు చేర్చెను. ఇక్కడ వారి ఒంటె మొండికేసి ముందుకు వెళ్లుటకు నిరాకరించెను. ఓ రసూలుల్లాహ్! మీ ఒంటె అలసిపోయినది. దాని బదులు మీరు మరో ఒంటెపై కూర్చో గలరని అనుచరులు మనవి చేయగా కాదు కాదు ఇది అలసిపోలేదు. మనము ఇక్కడే ఆగిపోవాలని అల్లాహ్ కోరిక కావచ్చునని వారు తెలిపిరి. నేను ఇక్కడే ఆగి హజ్ చేయు అనుమతి మనకివ్వాలని మక్కా వారిని కోరెదను. ఇందుకు వారు విధించిన ప్రతి నియమమును నేను ఒప్పుకొనెదను. అప్పటి వరకు మక్కా సైన్యము మక్కా నుండి చాలా దూరాన నిలిచి ముస్లిముల రాకకై నిరీక్షించుచుండెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కోరినచో ఎటువంటి ప్రతిఘటన లేకుండానే మక్కాలో ప్రవేశించేవారు. కాని మక్కా వారి అనుమతితోనే ప్రదక్షిణము చేయుటకు ప్రయత్నించెదరని వారు నిర్ణయించి యుండిరి. మక్కా వారు స్వయం యుద్ధమును ప్రారంభించినచో విధిలేని పరిస్థితిలోనే ఎదురించాలని వారు నిర్ణయించిరి. అందుకే మక్కాకు చేరే దారిలో ఎటువంటి అడ్డంకులు లేకున్నను వారు హుదైబియా ప్రాంతములో వుండి పోయిరి. కొద్ది సమయములోనే వారు హుదైబియా ప్రాంతములో బస చేసినట్లు మక్కా వారికి తెలిసెను. వారు తొందరగా వెనక్కి జరిగి మక్కా సమీపములో వరుసలలో నిలిచిరి. ప్రప్రథమముగా వారితో మాట్లాడుటకు బుదేల్ నామము గల ఒక నాయకుడు పంపబడెను. అతడు వారి వద్దకు వచ్చినప్పుడు నేను కేవలం హజ్ కొరకు వచ్చితిని. కాని మక్కా వారు బలవంతము చేసినచో మేము యుద్ధము చేయవలసి వచ్చునని అనిరి. ఆ తర్వాత మక్కా సేనాపతి అబూసుఫ్యాన్ అల్లుడు ఉర్వ వారి వద్దకు వచ్చెను. అమర్యాదగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇట్లనెను. ఈ చరిత్ర హీనుల బృందమును మీరు వెంట తీసుకొని

వచ్చితిరా? ఎట్టి పరిస్థితిలో మక్కా వారు తమ నగరములో ప్రవేశించుటకు వీరిని అనుమతించరు. ఒకరి తర్వాత మరొకరు దూతలు వచ్చిరి. ఏది ఏమైనా ఈ సం॥ మిమ్ములను మేము ప్రదక్షిణము చేయనివ్వము. ఇందులో మాకు అవమానము జరుగును. వచ్చే సం॥ వచ్చినచో మీకు మేము అనుమతించెదము. వీరు కేవలం ప్రదక్షిణము కొరకు వచ్చిరి. వీరిని అడ్డుకోవడం సమంజసం కాదని చుట్టు ప్రక్కల జాతులవారు మక్కా వారికి సలహా ఇచ్చిరి. అయినను మక్కావారు మొండితనమును వీడలేదు. అప్పుడు బయటి జాతులు మక్కావారితో ఇట్లనిరి. మీ ఉద్దేశము శాంతి కాదు, పీడనము. కావున మేము మీకు సహకరించలేము. అప్పుడు మక్కావారు భయాందోళనకు గురై, మేము ముస్లిములతో ఒక శాంతి ఒప్పందము చేసుకొనెదమని అంగీకరించిరి. ఈ విషయము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలియగానే వీరు వారి తర్వాత మూడవ ఖలీఫాగా ఎన్నికైన హజ్రత్ ఉస్మాన్ (రజి) ను మక్కావారితో సంభాషించుటకు పంపిరి. హజ్రత్ ఉస్మాన్ (రజి) మక్కా చేరుకొనిరి. మక్కాలో వారికి చాలా పెద్ద సంఖ్యలో బంధువులు వున్నందున వారు వారి చుట్టు గుమికూడిరి. మీరు ప్రదక్షిణము చేసుకొనుము కాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వచ్చే సం॥ ప్రదక్షిణము చేసుకోవచ్చని తెలిపిరి. కాని నా యజమాని లేనిదే నేను ప్రదక్షిణము చేయనని ఉస్మాన్ (రజి) తెలిపిరి. మక్కా నాయకులతో వారి సంభాషణ సుదీర్ఘమైనందున కొందరు దురుద్దేశముతో ఉస్మాన్ (రజి) హత్య చేయబడిరను వార్తను వ్యాపింపజేసిరి. ఈ వార్త వ్యాపించుచూ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు కూడ అందెను. కనుక రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులను ఒక చోట సమావేశపర్చి ఇట్లనిరి. దూత ప్రాణము ప్రతి జాతిలో సురక్షితమైనది.



ఉస్మాన్ (రజి) ను మక్కా వారు హత్య చేసినట్లు మీరు వినిరి. ఇది నిజమైనచో మనము బలవంతముగా మక్కాలో ప్రవేశించెదము. (శాంతియుతంగా ప్రవేశించాలనే మన నిర్ణయము ఇప్పుడు పరిస్థితుల వలన మారిపోవును. ఆ నిర్ణయముకు మనము కట్టుబడి వుండాల్సిన అవసరం లేదు.) మేము ముందుకు వెళ్లవలసి వచ్చినచో విజయము సాధించి తిరిగెదము లేదా ఒక్కొక్కరం మైదానములో హత్యచేయబడెదమను వాగ్దానము చేయుటకు సిద్ధముగానున్న వారు నాతో ప్రతిజ్ఞ చేయవలెను. వారి ఈ ప్రకటన వినగానే 15 వందల సందర్శకులు తక్షణమే 15 వందల సైనికులుగా మారిపోయిరి. ఒకరిని మరొకరు దాటుచూ మనస్ఫూర్తిగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకొని ఇతరుల కంటే ముందు ప్రతిజ్ఞ చేయుటకు ప్రయత్నించిరి. ఇస్లాం చరిత్రలో ఈ ప్రతిజ్ఞకు చాలా ప్రాధాన్యత గలదు. ఇది **వృక్ష ప్రతిజ్ఞ**గా పేరు గాంచినది. ఎందుకనగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ప్రతిజ్ఞ తీసుకుంటున్న సమయమున ఒక వృక్షము క్రింద కూర్చొని యుండిరి. ఈ ప్రతిజ్ఞలో పాల్గొన్న చివరి వ్యక్తి బ్రతికి వున్నన్ని రోజులు ఈ ప్రతిజ్ఞ గురించి చాలా గర్వముగా చెప్పుకునేవారు. 15 వందల మందిలో ఒక్కరు కూడ ఈ ప్రతిజ్ఞ చేయుటకు వెనుకాడలేదు. అనగా ఇస్లాం తరపున పంపబడిన దూతను శత్రువు హత్య చేసినచో సూర్యాస్తమయం లోపు మేము మక్కాను జయించెదము లేదా అదే సూర్యాస్తమయం లోపు యుద్ధ మైదానములో హత్యచేయబడెదము. కాని ఈ ప్రతిజ్ఞ ముగించగానే హజ్రత్ ఉస్మాన్ (రజి) తిరిగి వచ్చి, మక్కా వారు ఈ సం॥ ఉమ్రాహ్ చేయుటకు అనుమతించడం లేదు కాని వచ్చే సంవత్సరం వారు మనకు అనుమతి ఇచ్చేందుకు సిద్ధమైరి. ఇందుకు ఒప్పందము కుదుర్చుకొనుటకు వారు ప్రతినిధులను నియమించిరని తెలిపిరి. హజ్రత్ ఉస్మాన్ (రజి) చేరుకున్న

కొద్ది సమయం తర్వాత సుహైల్ నామము గల మక్కాకు చెందిన ఒక నాయకుడు ఒప్పందము కొరకు వారి వద్దకు వచ్చెను. అప్పుడు ఈ క్రింది ఒప్పందము వ్రాయబడెను.

**హుదైబియా శాంతి ఒప్పంద నియమములు**

"ఈ శాంతి నియమములు అల్లాహ్ నామమున అబ్దుల్లాహ్ కుమారుడు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్ల), సుహైల్ ఇబ్నె అమర్ (మక్కా ప్రభుత్వ ప్రతినిధి) మధ్య కుదిరినవి. 10 సం॥ల కొరకు యుద్ధము నిలిపివేయబడెను. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తో కలవాలని లేదా వారితో ఒప్పందము చేసుకోవాలని కోరువాడు అలా చేసుకో వచ్చును. ఖురైష్ వారితో కలవదలచిన లేదా ఒప్పందము కుదుర్చు కొనదలచిన వాడు అలా చేసుకోవచ్చును. తండ్రి బ్రతికి వున్న చిన్న వయస్కుడైన బాలుడు తన తండ్రి, సంరక్షకుని అనుమతి లేనిదే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు పోయినచో అతన్ని అతని తండ్రి లేదా సంరక్షకుని వద్దకు తిరిగి పంపవలెను. కాని ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచరులలోని ఎవరైనా ఖురైష్ వద్దకు వచ్చినచో అతన్ని తిరిగి పంపవలసిన అవసరం లేదు. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ సం॥ మక్కాలో ప్రవేశించకుండానే తిరిగి వెళ్ళిపోవుదురు. కాని వచ్చే సం॥ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం), వారి అనుచరులు మక్కాకు రావచ్చును. మూడు రోజులుండి కాబా ప్రదక్షిణము చేసుకోవచ్చును. ఆ సమయమున ఖురైష్‌వారు నగరము బయట గల పర్వతమునకు వెళ్లిపోవుదురు. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి అనుచరులు మక్కాలో ప్రవేశించునప్పుడు ప్రయాణికులు వెంట పెట్టుకునే ఒరలో వుంచిన ఖడ్గము తప్ప ఇతర ఎటువంటి ఆయుధాలు ధరించకూడదనే నియమమును పాటించవలెను." *(ఇబ్నె హష్షామ్: సంపుటి 2, పుట 180, బుఖారి కితాబుష్షురూత్)*



ఈ ఒప్పంద సమయమున రెండు విచిత్ర విషయాలు సంభవించినవి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నియమముల ను నిర్ధారించి ఒప్పందమును వ్రాయించునప్పుడు వారిట్లనిరి. "అపార దయామయుడు, పరమకారుణ్య మూర్తి అల్లాహ్ పేర". సుహైల్ దీనికి అభ్యంతరము తెలుపుచు ఇట్లనెను. అల్లాహ్ అంటే మాకు తెలుసు కాని ఈ "అపార దయామయుడు, పరమకారుణ్య మూర్తి" ఎవరో మాకు తెలియదు. ఈ ఒప్పందము మీకు మాకు మధ్య జరుగుచున్నది కావున ఇరు పక్షాల మతములను గౌరవించుట అనివార్యము. అందుకు వారు అతని మాటను అంగీకరించి "అల్లాహ్ నామముతో మేము ఈ ఒప్పందము చేసు కుంటున్నామని" వ్రాయించిరి. తర్వాత "ఈ శాంతి నియమములు మక్కా వాసుల, దైవ సందేశహరుడు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మధ్య కుదిరినవని" వారు వ్రాయించిరి. ఇందుకు సుహైల్ మరల అభ్యంతరము తెలుపుచూ మేము మిమ్ములను అల్లాహ్ ప్రవక్త అని విశ్వసించినచో మీతో మేము యుద్ధమెందుకు చేసేవారము? వారు అతని ఈ అభ్యంతరమును కూడ ఆమోదించి అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ అనే బదులు "అబ్దుల్లాహ్ కుమారుడు ముహమ్మద్" అని వ్రాయించిరి. మక్కా వారి ప్రతి విషయమును వారు ఆమోదించటం వలన అనుచరులకు విచారము, దు:ఖము కలిగెను. కోపముతో రక్తముడికి పోయెను. తుదకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు హజ్రత్ ఉమర్ (రజి) వచ్చి ఓ రసూలుల్లాహ్! మనము సత్యవంతులము కామా? అని ప్రశ్నించిరి. అవునని వారు (స) సమాధానమిచ్చిరి. ఓ రసూలుల్లాహ్! మనము కాబా ప్రదక్షిణము చేయుదుమని అల్లాహ్ మీకు తెలుపలేదా? అని వారు మరల ప్రశ్నించిరి. మరల అవునని వారు (స) బదులిచ్చిరి. హజ్రత్ ఉమర్

(రజి) ఇట్లనిరి. అటులయినచో ఈ ఒప్పందమును నేడు మీరెందుకు చేసిరి? అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు వివరించిరి. ఓ ఉమర్! మనము కాబా ప్రదక్షిణము శాంతియుతంగా చేయుదుమని అల్లాహ్ నాకు తెలిపెను. కాని ఇదే సం॥ చేయుదుమని చెప్పలేదు కదా! ఇది నేను ఊహించిన భావము మాత్రమే. ఇంకొందరు అనుచరులు ఇట్లు అభ్యంతరము తెలిపిరి. ఓ రసూలుల్లాహ్! ఒక నవయువకుడు ఇస్లాం స్వీకరించినచో అతన్ని అతని తండ్రి, సంరక్షకుని వద్దకు తిరిగి పంపబడును. కాని మక్కా వారి వైపు ఒక ముస్లిం వెళ్లిపోయినచో వారు తిరిగి పంపవలసిన అవసరం లేదని ఎందుకు మీరు ఒప్పుకొనిరి. అందుకు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు వివరించిరి. ఇందులో అభ్యంతరకర విషయమేముంది. ఇస్లాంలో చేరు ప్రతి వ్యక్తి ఇస్లాంను సత్యమైనదిగా భావించి ముస్లిం అగును. ప్రదర్శన నిమిత్తం, ఆచారముగా ఇస్లాంలో చేరడు. అటువంటి వ్యక్తి ఎక్కడున్నా ఇస్లాం ప్రచారము చేయును. ఫలితముగా ఇస్లాం వ్యాపించును. కాని ఇస్లాంను వీడిన వ్యక్తిని మనలో వుంచుకొని చేసేదేముంది? మన మతమును అసత్యమని భావించుచున్న వ్యక్తి మనకే విధంగా ఉపయోగ పడును. ఇస్లాంను వీడిన వ్యక్తికి మరణ శిక్ష పడాలని వాదించుచున్న ముస్లిముల అభిప్రాయము తప్పు అని ఈ సమాధానము స్పష్టము చేయును. ఇస్లాంలో ధర్మభ్రష్టుని శిక్ష హత్యే అయివుండినచో ప్రతి ధర్మభ్రష్టునికి అతని నేరమునకు శిక్ష విధించుటకు తిరిగి పంపవలెనని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్టుబట్టేవారు. ఈ ఒప్పందము ముగిసిన తర్వాత ఇరు పక్షములు సంతకము చేసిరి. అప్పుడే దీని విశ్వసనీయతను పరీక్షించుటకు అల్లాహ్ ఏర్పాట్లు చేసెను. మక్కా వారి తరపున ఒప్పందమునకు వచ్చిన సుహైల్ తనయుడు తాళ్ళతో బంధించబడి,



తీవ్ర గాయాలతో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందు వచ్చి కుప్పకూలెను. ఓ రసూలుల్లాహ్! నేను మనస్ఫూర్తిగా ఇస్లాం స్వీకరించితిని. కాని ఇస్లాం వలన నా తండ్రి నన్ను హింసకు గురి చేయుచున్నాడు. నా తండ్రి ఇక్కడికి వచ్చినందుకు నేను తప్పించుకొని మీ వద్దకు వచ్చితిని అనెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాధానము ఇవ్వక ముందే ఒప్పందము కుదిరినందున ఈ నవయువకుడు నాతో తిరిగి రావలెనని అతని తండ్రి చెప్పెను. అబూజన్దల్ పరిస్థితి అప్పుడు ముస్లిముల ముందుండెను. తన తండ్రి చేతిలో ఈ విధముగా హింసను భరించుచున్న తమ సోదరున్ని తిరిగి పంపడం వారు చూడలేక పోయిరి. వారు ఒరలో నుంచి ఖడ్గములు తీసి మా ప్రాణాలు పోయినను ఇంతటి బాధాకరమైన ప్రదేశమునకు మరల మా సోదరున్ని పంపే ప్రసక్తే లేదని నిర్ణయించుకొనిరి. స్వయాన అబూజన్దల్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! మీరు నా స్థితిని చూచుచు వారు గతం కంటే అధికంగా నన్ను హింసించుటకు ఈ క్రూరులకు నన్ను అప్పగించుదురా! రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ ప్రవక్తలు ఒప్పందమును ఉల్లంఘించరు. ఓ అబూజన్దల్! మేము ఒప్పందము కుదుర్చుకుంటిమి. నీవిప్పుడు సహనం పాటించుము. అల్లాహ్‌నే నమ్ముము. అతడు నీకు, నీ లాంటి ఇతర నవయువకులకు మోక్షము లభించే ఏదో ఒక మార్గము చూపును. ఈ ఒప్పందము తర్వాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా తిరిగి వచ్చిరి. వారు మదీనా చేరుకున్నప్పుడు మరో మక్కా నవయువకుడు అబూ బసీర్ (రజి) వారిని అనుసరించుచు మదీనా చేరుకొనెను. కాని ఒప్పందము ప్రకారము అతను మక్కా తిరిగి పోవుటకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బలవంతము చేసిరి. మార్గ

మధ్యలో అతన్ని తీసుకెళ్లుచున్న వారితో అతనికి వివాదము తలెత్తెను. ఒక రక్షకున్ని హతమార్చి అతను పారిపోయెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు మక్కా వారు వచ్చి ఫిర్యాదు చేసిరి. మేము మీ వ్యక్తిని మీకు అప్పగించితిమి. కావున అతను ఎక్కడున్నా వెతికి మీకు అందించాల్సిన బాధ్యత మాది కాదని వారు (స) బదులిచ్చిరి. కొద్ది రోజుల తర్వాత ఒక మహిళ పారిపోయి మదీనా వచ్చెను. ఆమె బంధువులు మదీనాకు చేరుకొని ఆమెను తిరిగి పంపాలని కోరిరి. ఒప్పందములో పురుషులని వుంది మహిళలని లేదు. కావున ఈ మహిళను మేము తిరిగి పంపమని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిరి.

## రాజులకు ఉత్తరములు

మదీనా చేరుకోగానే తమ సందేశమును ప్రపంచ నలు మూలల వరకు అందించుటకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంకల్పించిరి. తమ ఈ సంకల్పమును తమ అనుచరుల ముందు ప్రస్తావించినప్పుడు రాజ్యాస్థానముల గురించి అవగాహన కలిగి వున్న కొందరు అనుచరులు ఇట్లు సలహా నిచ్చిరి. ఓ రసూలుల్లాహ్! ముద్ర లేనిదే రాజులు ఉత్తరములు స్వీకరించరు. ఈ సలహా మేరకు వారొక ముద్ర చేయించిరి. దానిపై "ముహమ్మద్ రసూలుల్లాహ్" అనగా దైవ ప్రవక్త ముహమ్మద్ అని ముద్రించిరి. అల్లాహ్ గౌరవార్థం పైన 'అల్లాహ్', దాని క్రింద అనగా మధ్యలో 'రసూల్', దాని క్రింద 'ముహమ్మద్' అని వ్రాయించిరి.

క్రీ.శ.628 ముహర్రమ్‌లో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తరములను తీసుకొని వివిధ అనుచరులు వివిధ దేశాల వైపు బయలుదేరిరి. అందులోని ఒక ఉత్తరము రోమన్ రాజు ఖైసర్ పేరిట యుండెను. మరో ఉత్తరము ఈరాన్ రాజుకు పంపబడెను. ఖైసర్



అధీనములో నుండిన ఈజిప్టు రాజు పేరున ఒక ఉత్తరము యుండెను. ఎబిసీనియా రాజు నజాశీకి ఒక ఉత్తరము పంపబడెను. ఈ విధముగనే ఇంకొందరు రాజులకు వారు లేఖలు వ్రాసిరి.

## రోమన్ రాజు హర్‌ఖల్ పేరున ఉత్తరము

దహ్యా కల్బీ (రజియల్లాహు అన్‌హు) అనుచరుని ద్వారా రోమన్ రాజు ఖైసర్‌నకు లేఖ పంపబడెను. వంశపరంగా అరబ్బుడైన బస్రా గవర్నర్‌ను ముందు కలిసి అతని ద్వారా ఖైసర్‌కు లేఖ అందజేయాలని వారు (స) ఆదేశించి యుండిరి. దహ్యా కల్బీ (రజియల్లాహు అన్‌హు) బస్రా గవర్నర్ వద్దకు చేరుకోగా ఆ రోజులలో ఖైసర్ కూడ పర్యటనలో భాగంగా సీరియా వచ్చి యుండెను. బస్రా గవర్నర్ దహ్యా (రజి) ను అతని వద్దకు పంపెను. బస్రా గవర్నర్ ద్వారా ఖైసర్ ఆస్థానమునకు దహ్యా (రజియల్లాహు అన్‌హు) చేరుకొన్నప్పుడు ఆస్థాన అధికారులు ఖైసర్ ముందు హాజరయ్యే ప్రతి వ్యక్తి ఖైసర్‌నకు సాష్టాంగము చేయవలెననిరి. దహ్యా నిరాకరించి, మేము ముస్లిములము ఒక మనిషికి సాష్టాంగములు చేయమని తెలిపిరి. సాష్టాంగము చేయకుండానే దహ్యా ఖైసర్ ముందుకు వెళ్ళి లేఖ అందించిరి. రాజు తన అనువాదకునితో లేఖ చదివించెను. ఈ వ్యక్తిని గురించి నేను విచారించుటకు అరబ్ నుండి ఏదైనా బృందం వచ్చి యుంటే వారిని నా ముందు ప్రవేశపెట్టమని ఆదేశించెను. దైవికముగా అబూసుఫ్యాన్ ఆ రోజులలో ఒక వ్యాపార బృందంతో అక్కడికి వచ్చి యుండెను. ఆస్థాన అధికారులు అబూసుఫ్యాన్‌ను రాజు ముందు ప్రవేశపెట్టిరి. అబూసుఫ్యాన్‌ను అందరికంటే ముందు నిలబెట్టి అతని సహచరులను అతని వెనుక నిలబెట్టాలని రాజు ఆజ్ఞాపించెను. అబూసుఫ్యాన్ ఏదైనా అసత్యమాడినచో అతని సహచరులు వెంటనే ఖండించాలని ఆదేశించెను. ఆ తర్వాత అతను

అబూసుఫ్యాన్‌ను ఇట్లు ప్రశ్నించెను.

ప్రశ్న॥ నాకు ఉత్తరం పంపిన ఈ ప్రవక్తృత్వ దావాదారుని వంశము ఎటువంటిదో నీకు తెలుసా ?

జవాబు॥ అతడు మంచి వంశమునకు చెందిన వ్యక్తి, మా బంధువే, అని అబూసుఫ్యాన్ తెలిపెను.

ప్ర॥ ఇటువంటి ప్రకటన ఇతని కంటే ముందు మరెవరైనా అరబ్‌లో చేసిరా అని అతను అడిగెను.?

జ॥ లేదని అబూసుఫ్యాన్ సమాధానమిచ్చెను.

ప్ర॥ అతను ఈ ప్రకటన చేయక ముందు అసత్యమాడినట్లు మీరు ఆరోపించువారా అని అతను అడిగెను.

జ॥ లేదని అబూసుఫ్యాన్ అనెను.

ప్ర॥ అతని తాతముత్తాతలలో ఎవరైనా రాజు వుండిరా అని అతను అడిగెను.

జ॥ లేదని అబూసుఫ్యాన్ అనెను.

ప్ర॥ అతని వివేకము, సలహా ఏ స్థాయి కలిగినదని రాజు అడిగెను.

జ॥ అతని వివేకము, సలహాలో ఏ లోపము మేము ఎప్పుడు చూడలేదని అబూసుఫ్యాన్ అనెను.

ప్ర॥ దౌర్జన్యులు, శక్తివంతులు అతని సంస్థలో చేరుచున్నారా లేదా నిరుపేదలు, బలహీనులు చేరుచున్నారా అని ఖైసర్ అడిగెను.

జ॥ నిరుపేదలు, బలహీనులు, నవయువకులు అని అబూసుఫ్యాన్ అనెను.

ప్ర॥ వారు తరుగుచున్నారా? లేక పెరుగుచున్నారా అని అతను అడిగెను.

జ॥ పెరుగుచున్నారని అబూసుఫ్యాన్ బదులిచ్చెను.

ప్ర॥ ఆ మతమును చెడుగా భావించి వారిలో ఎవరైనా దానిని వదిలిరా అని ఖైసర్ అడిగెను.



జ॥ లేదని అబూసుఫ్యాన్ అనెను.

ప్ర॥ అతడు ఎప్పుడైనా వాగ్దానమును భంగపరిచెనా అని అతను మరల అడిగెను.

జ॥ ఇప్పటి వరకైతే భంగపరచలేదు. కాని ఈ మధ్య మేము అతనితో ఒక నూతన ఒప్పందము కుదుర్చుకొంటిమి. అతడెలా వ్యవహరించునో వేచి చూడాల్సిందేనని అబూసుఫ్యాన్ తెలిపెను.

ప్ర॥ మీకు అతనికి మధ్య ఎప్పుడైన యుద్ధం జరిగినదా అని అతను అడిగెను.

జ॥ అవునని అబూసుఫ్యాన్ అనెను.

ప్ర॥ ఆ యుద్ధముల ఫలితము ఎట్లుండెనని రాజు అడిగెను.

జ॥ అబూసుఫ్యాన్ ఇట్లు తెలిపెను. బావి బొక్కెన పరిస్థితి. ఒకమారు అతను సఫలమైతే మరోమారు మేము విజయము సాధించుచున్నాము. కనుక ఒక సారి బద్ర్ యుద్ధము జరిగెను. అందులో నేను పాల్గొనలేదు. అందుకే అతను విజయము సాధించెను. రెండవ సారి నా నాయకత్వములో ఉహద్ యుద్ధము సంభవించెను. అందులో మేము వారిని ఘోరంగా ఓడించి వారి ముక్కు, చెవులను కోసి వేసితిమి.

ప్ర॥ అతను మీకు బోధించినదేమిటని ఖైసర్ అడిగెను.

జ॥ అబూసుఫ్యాన్ ఇట్లు తెలిపెను. అల్లాహ్‌ను ఆరాధించుము. అతనితో మరెవరిని చేర్చకుము. మా తాత ముత్తాతలు పూజించిన విగ్రహాలను పూజించకూడదని అతను బోధించెను. అల్లాహ్‌ను ఆరాధించుము, సత్యమే పలుకుము, దుష్ట, చెడు కార్యముల నుండి దూరముండుము. ఆప్యాయత తో వ్యవహరించి వాగ్దానమును పాటించి ఇతరుల న్యాసములను సకాలంలో అందించుమని అతడు మమ్ము ఆదేశించును. *(బుఖారి ముద్రణ ముజ్తబాయి సంపుటి 1, పుట 4, బాబ్ : కైఫ కాన బదవుల్ వహీ)*

## ఆన్ హజ్రత్ సల్లం సత్య సందేశహరుడని తెల్చిన రోమన్ రాజు

దీని తర్వాత ఖైసర్ ఇట్లు తెలిపెను. వినుము! అతని వంశము ఎలాంటిదని నేను నిన్ను ప్రశ్నించగా అతని వంశము గౌరవము గలదేనని నీవు తెలిపితివి. సందేశహరులు ఇటులనే వుందురు. ఇంతకు ముందు ఇటువంటి ప్రకటన మరెవరైనా చేసిరా అని నేను నిన్ను అడగగా లేదని నీవు బదులిచ్చితివి. గత సమీప కాలములో ఎవరైనా ఇటువంటి ప్రకటన చేసినచో అతన్ని ఇతడు అనుసరించుచున్నాడని నేను భావించేవాడిని. ఇతని ప్రకటన కంటే ముందు అసత్యుడనే ఆరోపణ వుందా అని నేను అడగగా లేదని నీవు సమాధానమిచ్చితివి. మానవుల గూర్చి అబద్దము చెప్పని వ్యక్తి అల్లాహ్ గూర్చి ఎలా అసత్యమాడునని నేను ఊహించితిని. అతని తాతముత్తాతలలో ఎవరైనా రాజు వుండిరా అని నేను నిన్ను అడిగితిని. నీవు లేదని తెలిపితివి. ఇతడు ఈ ప్రకటన ద్వారా తన తాతముత్తాతల అధికారమును తిరిగి పొందుటకు ప్రయత్నించడం లేదని నేను తెలుసుకొంటిని. దౌర్జన్యులు, శక్తివంతులు అతని మతములో చేరుచున్నారా లేదా నిరుపేదలు, బలహీనులు చేరుచున్నారా అని నేను నిన్నడిగితిని. నీవు నిరుపేదలు, బలహీనులని తెలిపితివి. సందేశహరులందరి మతములో నిరుపేదలు, బలహీనులే ప్రవేశించెదరు, దౌర్జన్యులు, గర్వితులు చేరరని నేను ఊహించితిని. వారు పెరుగుచున్నారా లేదా తరుగుచున్నారా అని నేను నిన్ను ప్రశ్నించితిని. అందుకు పెరుగుచున్నారని నీవు తెలిపితివి. సందేశహరుల స్థితి ఇటులనే వుండును. ఉన్నత శిఖరానికి చేరునంత వరకు వారు పెరుగుచూనే వుందురు. ఎవడేని అతని ధర్మమును ఇష్టపడక వదిలెనా అని నేను నిన్ను ప్రశ్నించినప్పుడు నీవు కాదని అంటివి. సందేశహరుల సంస్థల పరిస్థితి ఇటులనే వుండును. వ్యక్తిగత కారణాలతో



బయటికి వెళ్ళును తప్ప ధర్మమును చెడుగా భావించి ఎవడూ వెళ్లడు. మీ మధ్య ఎప్పుడైనా యుద్ధము సంభవించినదా? దాని ఫలితము ఎలా వుండెనని నేను నిన్ను ప్రశ్నించితిని. అందుకు నీవు బావిలో బొక్కెన పరిస్థితి అనగా ఒకసారి మేము విజయులమైతే మరో సారి అతను విజయం పొందుచున్నాడని తెలిపితివి. సందేశహరుల స్థితి ఇటులనే వుండును. ఆరంభములో కష్టములు ఎదురైనను అంతిమ విజయం వారినే వరించును. అతను మీకు ఏమి బోధించెనని నేను నిన్ను ప్రశ్నించితిని. ప్రార్థన, సత్యము, పవిత్రత, వాగ్దానమునకు కట్టుబడి వుండుట, న్యాసకర్తగా వుండవలెనని అతడు బోధించునని నీవు బదులిచ్చితివి. అతను మోసగించునా అని నేను నిన్ను ప్రశ్నించితిని. కాదని నీవు తెలిపితివి. సత్యవంతులే ఈ పద్ధతులను సదా అవలంభింతురు. అతను సత్యమైన సందేశహరుడని నేను భావించుచున్నాను. ఆ 'సందేశహరుడు' ఈ కాలములో అవతరించునని నేను కూడ భావించితిని. కాని అరబ్బులలో అతను జన్మించునని నేను ఊహించలేదు. నీవు ఇచ్చిన సమాధానములు సత్యమే అయినచో అతను తప్పక ఈ దేశములను వశపరచుకొనునని నేను భావించుచున్నాను. *(బుఖారి)* అతని ఈ మాటలతో ఆస్థానములోనున్న సభికులలో ఉద్రేకము ఏర్పడెను. మీరు క్రైస్తవులై ఒక ఇతర జాతి వ్యక్తి సత్యమును అంగీకరించుచున్నారా? అని సభికులు నిరసనలతో హోరెత్తించిరి. అప్పుడు ఆస్థాన అధికారులు తొందరగా అబూసుఫ్యాన్ అతని సహచరులను బయటికి పంపివేసిరి.

## హర్‌ఖల్‌కు ఆన్ హజ్రత్ సల్లం పంపిన లేఖ పూర్తి పాఠం

ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖైసర్‌నకు వ్రాసిన లేఖ పూర్తి పాఠం ఇట్లు గలదు. *(బుఖారి బాబ్ కైఫ కాన బదవుల్ వహి, జర్మనీ సంపుటి 3, పుట 336)*

بسم الله الـرحمن الرحيم. من محمد عبدالله ورسوله الى هرقل
عظيـم الـروم.سلام علـى من اتبع الهدى اما بعد فانى ادعوك
بدعاية الاسلام اسلم تسلم يؤتك الله اجرك مرتين فان توليت
فـان علـيك اثـم اليريسين يااهل الكتاب تعالوا الى كلمة سواء
بيـننا وبينكم الانعبد الا الله ولانشرك به شيئا ولا يتخذ بعضنا
بعضا اربابا من دون الله فان تولوا فقولوا اشهدوا بانامسلمون.

అనగా రోమన్ రాజు హర్‌ఖల్ పేరిట అల్లాహ్ దాసుడు, అతని ప్రవక్త ముహమ్మద్ ద్వారా ఈ లేఖ వ్రాయబడినది. అల్లాహ్ మార్గదర్శనము ను అనుసరించే వ్యక్తి పై అల్లాహ్ శుభములు అవతరించుగాక! తర్వాత ఓ రాజా! నీకు ఇస్లాం ఆహ్వానాన్ని (అనగా ఏకైక దేవుడు, అతని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించుటకు) అందించు చున్నాను. ఓ రాజా! నీవు ఇస్లాం స్వీకరించినచో సర్వపీడనముల నుండి అల్లాహ్ నిన్ను రక్షించును. నీకు రెట్టింపు ఫలితమందించును. (అనగా యేసు అలైహిస్సలాంను విశ్వసించి, ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను కూడ విశ్వసించినందుకు) కాని నీవు ఈ ఆహ్వానాన్ని తిరస్కరించినచో నీ పాపముతో పాటు నీ దేశ ప్రజలు విశ్వసించని పాపమునకు నీవే బాధ్యుడగుదువు. చివరలో పవిత్ర ఖురాన్ లోని ఒక సూక్తి వ్రాసి యుండెను. దాని అర్థము ఇట్లు గలదు. "ఓ గ్రంథము



పొందిన ప్రజలారా! మనము అల్లాహ్‌ను తప్ప మరెవరిని ఆరాధించము. దేనిని కూడ అతనికి భాగస్వామిగా జత చేయము. మనలో ఎవ్వడు ఎవ్వడిని అల్లాహ్‌కు తప్ప ప్రభువుగా ఎన్నుకొనడు. ఈ విధముగా మీకును, మాకును సమానముగా వర్తించు కట్టుబాటు చేసికొందుము రండు". గ్రంథము పొందినవారు ఈ ఐక్యత ఆహ్వానాన్ని స్వీకరించనిచో ఓ ముహమ్మద్ రసూలుల్లాహ్! అతని సహచరులారా! మీరు వారితో ఇట్లనుము. "నిశ్చయముగా మేము అల్లాహ్ విధేయులము".

పలు చరిత్రలలో ఇట్లు వ్రాయబడినది. ఈ ఉత్తరము రాజు ముందు ప్రవేశపెట్టినప్పుడు కొందరు సభికులు ఈ ఉత్తరమును చింపి వేయవలెనని అనిరి. ఎందుకనగా దీనిలో రోమన్ రాజును కించపర్చ బడినది. ఉత్తరముపైన రోమన్ రాజు అనే బదులు రోమన్ పర్యవేక్షకుడని సంబోధించబడెను. కాని రాజు ఇట్లు తెలిపెను. లేఖను చదవక ముందే చింపివేయుట అవివేకమగును. నా గూర్చి రోమన్ పర్యవేక్షకుడని అతను వ్రాయుట సమంజసమే. శాశ్వత యజమాని అల్లాహ్‌యే. నేను పర్యవేక్షకున్ని మాత్రమే. ఈ విషయము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిసినప్పుడు ఇట్లనిరి. రోమన్ రాజు అవలంభించిన తీరును బట్టి అతని ప్రభుత్వము రక్షించబడును. అతని సంతానము సుదీర్ఘ కాలము వరకు పరిపాలించును. కనుక అటులనే జరిగెను. తదుపరి యుద్ధములలో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మరో భవిష్యవాణి ప్రకారము దేశంలోని చాలా భాగము రోమ్ రాజు అధీనములో నుండి వెళ్లిపోయెను. కాని ఈ సంఘటన తర్వాత 6 వందల సం॥ల వరకు ఖుస్తున్తునియాలో అతని వంశీయుల ప్రభుత్వము కొనసాగెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తరము రోమన్ ప్రభుత్వములో సుదీర్ఘ కాలము వరకు భద్రముగా వుంచబడెను. ఒక సారి మన్సూర్ ఖలాదూన్ రాజు దూతలు

రోమన్ రాజు వద్దకు వెళ్లిరి. రోమన్ రాజు వారికి చూపించుటకు ఒక పెట్టె తెప్పించెను. మీ ప్రవక్త మా తాత గారికి పంపిన ఒక ఉత్తరము మా వద్ద నేటికి సురక్షితముగా వుందని అతడు తెలిపెను.

### పారసీక రాజు పేరిట ఉత్తరము

పారసీక రాజు పేరిట రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వ్రాసిన ఉత్తరం అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా (రజి) ద్వారా పంపబడి యుండెను. అందులో ఇట్లు వ్రాయబడెను.

بسم اللّٰہ الرحمن الرحیم۔ من محمد رسول اللّٰہ الی کسری عظیم الفارس۔سلام علی من اتبع الهدی وامن باللّٰہ ورسوله۔ وشهدان لااله الااللّٰہ وحده لاشریک له۔ وان محمدا عبده ورسوله۔ ادعوك بدعایة اللّٰہ عز وجل فانی انا رسول اللّٰہ الی الناس کافة لانذر من کان حیا ویحق القول علی الکافرین۔ اسلم تسلم فان ابیت فعلیک اثم المجوس۔

*(జర్ఖాని సంపుటి 3, పుట 340, తారీఖుల్ ఖమీస్ సంపుటి 2 పుట 38)*

అనగా అపార దయామయుడు పరమ కారుణ్యమూర్తి అల్లాహ్ పేర. పారసీక నాయకునికి ముహమ్మద్ రసూలుల్లాహ్ వ్రాసిన లేఖ ఇది. అల్లాహ్ మార్గదర్శనమును పూర్తిగా పాటించి, అల్లాహ్‌ను అతని ప్రవక్తను విశ్వసించి, అల్లాహ్ ఒక్కడే, అతనికి ఎవరూ సమానులు లేరని, ముహమ్మద్ (సల్లం) అతని దాసుడు, ప్రవక్త అని సాక్ష్యమిచ్చిన వ్యక్తి దైవ శుభములు పొందుగాక! ఓ రాజా! దైవాదేశానుసారము నిన్ను ఇస్లాం వైపు నేను



ఆహ్వానించు చున్నాను. ఎందుకనగా ప్రతి వ్యక్తిని జాగృతి పరచుటకు, అవిశ్వాసులకు సాకులు వెతికే అవకాశం లేకుండా చేయుటకు నేను సర్వమానవాళి కొరకు ప్రవక్తగా పంపబడితిని. ప్రతి పీడనము నుండి నీవు సురక్షితముగా నుండుటకు ఇస్లాం స్వీకరించుము. నీవు ఈ ఆహ్వానాన్ని నిరాకరించినచో నక్షత్ర ఆరాధకులందరి పాపములకు కూడ నీవే బాధ్యుడగుదువు.

అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా (రజి) ఇట్లు తెలిపిరి. నేను కిస్రా ఆస్థానమునకు చేరి లోపలికి ప్రవేశించుటకు అనుమతి కోరగా ఇవ్వబడెను. నేను ముందుకు వెళ్లి కిస్రా చేతికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తరం అందించితిని. అతడు అనువాదకున్ని చదివి వినిపించమని ఆజ్ఞాపించెను. అనువాదకుడు దానిని చదివి వినిపించినప్పుడు కిస్రా లేఖను కోపముతో చింపివేసెను. అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా (రజి) వచ్చి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము తెలిపినప్పుడు వారిట్లనిరి. కిస్రా మా లేఖతో వ్యవహరించిన విధముగనే అల్లాహ్ అతని ప్రభుత్వముతో కూడ వ్యవహరించును. ఇందుకు గల కారణము ఇట్లు గలదు. రోమన్ ప్రభుత్వము నుండి పారిపోయి ఈరాన్‌కు వచ్చిన యూదులతో అరబ్ యూదులు కుమ్మక్కైరి. వారు రోమన్ ప్రభుత్వము నకు వ్యతిరేక కుట్రలో కిస్రాకు సహకరించినందుకు కిస్రా మన్ననలు పొంది యుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు వ్యతిరేకంగా చాడీలు చెప్పి, కిస్రాను పక్కదారి పట్టించియుండిరి. వారు చేయుచున్న ఫిర్యాదుల వలన ఈ లేఖ కిస్రా అభిప్రాయమును బలపర్చెను. ఈ వ్యక్తి నా ప్రభుత్వమును ఆశించుచున్నాడని అతడు భావించెను. ఈ ఉత్తరము తర్వాత కిస్రా వెంటనే తన యమన్ గవర్నర్‌కు ఒక లేఖ పంపెను. అందులో ఇట్లు వ్రాయబడెను. ఖురైష్ లోని ఒక వ్యక్తి ప్రవక్తృత్వ

ప్రకటన చేసియున్నాడు. తన ప్రకటనలో హద్దులు దాటుచున్నాడు. అతన్ని బంధించి నా ముందు హాజరు పర్చుటకు నీవు అతని వైపు వెంటనే ఇద్దరిని పంపుము. క్రిసా తరపున అప్పుడు యమన్‌లో గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించుచున్న బాజాన్ ఒక సేనాపతి, మరొక సైనికున్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు పంపెను. ఈ ఉత్తరం ముట్టిన వెంటనే నా ప్రతినిధులతో కలిసి కిస్రా ఆస్థానములో హాజరు కాగలరని తెలుపుచూ ఒక ఉత్తరం కూడ పంపెను. ఆ అధికారి మొదట మక్కా వైపు వెళ్లెను. తాయిఫ్ సమీపమునకు చేరుకున్న తర్వాత వారు (స) మదీనాలో వుంటున్నారని తెలుసుకొని అక్కడి నుండి మదీనాకు పోయెను. మదీనా చేరుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో అతడిట్లనెను. మిమ్ములను బంధించి అతని ఆస్థానములో ప్రవేశపెట్టమని యమన్ గవర్నర్ బాజాన్‌ను కిస్రా ఆదేశించెను. మీరు అతని ఆదేశాన్ని నిరాకరించినచో మిమ్ములను కూడ హతమార్చును. మీ జాతిని కూడ అంతము చేయును. మీ దేశాన్ని కూడ నాశనం చేయును. అందుకే మీరు తప్పక మాతో రాగలరని అతడు కోరెను. వారి సందేశాన్ని విని రేపు మరల మీరు నాతో కలవగలరని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. వారు రాత్రి అల్లాహ్‌ను ప్రార్థించగా వైభవోపేతుడైన అల్లాహ్ వారికిట్లు తెలిపెను. కిస్రా అమర్యాదకు శిక్షగా అతని తనయున్ని అతనిపై మేము నియమించితిమి. ఇదే సంవత్సరము జమాదియుల్ వూలా మాసపు 10వ తేదీ సోమవారము నాడు అతడు అతన్ని హతమార్చును. నేటి రాత్రి అతను అతన్ని హతమార్చెనని కూడ వారు తెలిపినట్లు కొన్ని కథనములలో ప్రస్తావన గలదు. ఆ రాత్రి జమాదియుల్ వూలా మాసపు 10వ తేదీ అయి వుండవచ్చు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉదయం వారిద్దరిని పిలిపించి, వారికి ఈ భవిష్యవాణి గురించి తెలిపిరి.



ఫలాన నెల, తేదీన కిస్రా హతమార్చబడినట్లు అల్లాహ్ నాకు వార్తనందించెనని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బాజాన్‌కు లేఖ వ్రాసిరి. యమన్ గవర్నర్‌కు ఈ లేఖ అందినప్పుడు ఇతడు సత్యమైన సందేశహరుడు అయినచో ఇటులనే జరుగునని అభిప్రాయపడెను. లేనిచో ఇతను, ఇతని దేశము నాశనము చేయబడును. కొంత కాలము తర్వాత ఈరాన్ నుంచి ఒక పడవ వచ్చి యమన్ ఓడరేవు వద్ద నిలిచెను. ఈరాన్ రాజు పంపిన లేఖ గవర్నర్‌కు అందజేసెను. దాని ముద్రను చూసి యమన్ గవర్నర్ ఇట్లనెను. మదీనా సందేశహరుడు సత్యమే తెలిపెను. ఈరాన్ రాజు మారిపోయెను. ఈ లేఖపై మరొక రాజు ముద్ర గలదు. అతను ఉత్తరము విప్పగా అందులో ఇట్లు వ్రాసియుండెను. ఈరాన్ కిస్రా షేర్దియా నుండి గవర్నర్ యమన్ బాజాన్‌కు ఈ ఉత్తరము వ్రాయబడుచున్నది. నేను మాజీ కిస్రా అయిన నా తండ్రిని అంతమొందించితిని. ఎందుకనగా అతడు దేశములో రక్తపాతమును ప్రోత్సహించి, దేశ పుణ్యాత్ములను హతమార్చుచూ, సాధారణ ప్రజలపై దౌర్జన్యమునకు పాల్పడుచుండెను. నా ఈ ఉత్తరము నీకు అందినప్పుడు వెంటనే నా విధేయత ప్రతిజ్ఞ అధికారులందరితో చేయించుము. ఇంతకు ముందు నా తండ్రి ఒక అరబ్ సందేశహరున్ని బంధించమని పంపిన ఆదేశము రద్దు అయినట్లు భావించుము. *(తిబ్రి సంపుటి 3,పుట 1572-1574, సీరతున్నబీ లిఇబ్ని హష్షామ్)* ఈ ఉత్తరము చదివి బాజాన్ ఎంతో ప్రభావితమై వెంటనే తన అనేక సహచరుల సమేతం ఇస్లాం స్వీకరించెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తాను ఇస్లాం స్వీకరించిన విషయమును తెలిపెను.

### ఎబిసీనియా రాజు నీగస్ పేరిట ఉత్తరము

వారు మూడవ ఉత్తరము ఎబిసీనియా రాజు నీగస్ (నజాశీ) కి వ్రాసిరి. అది అమర్ బిన్ ఉమయ్యహ్ జమ్రీ రజియల్లాహు అన్హు

ద్వారా పంపబడెను. దాని వ్యాసము ఇట్లుండెను.

بسم اللّٰه الـرحـمـن الـرحيـم. مـن مـحـمـد رسول اللّٰه الـى النجـاشـى ملك الـحبشة. سلامٌ انـت. اما بـعد فانى احمد اليک اللّٰه الذى لااله الا هو الملک الـقـدوس السلام المؤمن المهيمن. واشهد ان عيسٰى ابن مريم روح اللّٰه وكلمة الـقـاهـا الـىٰ مـريـم البتول وانى ادعوك الى اللّٰه وحده لا شريک له والموالاة عـلـى طـاعـة. وان تتـبـعـنى وتؤمن بالذى جائنى فانى رسول اللّٰه وانى ادعوك وجـنـودك الـى اللّٰه عـز وجل وقد بلغت ونصحت فاقبلوا نصيحتى والسلام على من اتبع الهدى.

*(జర్ఖాని సంపుటి 3 పుట 342, సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 3 పుట 273)*

అనగా అపార దయామయుడు పరమ కారుణ్యమూర్తి అల్లాహ్ పేర. అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ ఎబిసీనియా రాజు నీగస్‌కు వ్రాసిన లేఖ ఇది. ఓ రాజా! నీపై అల్లాహ్ శుభము అవతరించుచున్నది. (ఎందుకనగా ఈ రాజు ముస్లిములకు ఆశ్రయమిచ్చి యుండెను. అందుకే నీవు చేసిన ఈ సత్కార్యము అల్లాహ్ ఆమోదించెను, నీవు దైవ సంరక్షణలో గలవని వారు తెలిపిరి.) నేను ఆ అల్లాహ్ ప్రశంసలను నీకు తెలిపెదను. అతడు తప్ప మరొకరు ఆరాధనకు అర్హులు కారు. అతడే నిజమైన రాజు. సర్వ పవిత్రతలకు మూలము. ప్రతి లోపమునకతీతుడు. ప్రతి లోపమును



తొలగించువాడు. తమ దాసులకు శాంతి చేకూర్చును. తన సృష్టిని రక్షించును. మరియమ్మ కుమారుడు యేసు అల్లాహ్ సందేశమును ప్రపంచములో వ్యాపింపజేయువారని తన జీవితమును అల్లాహ్ కొరకు సమర్పించిన మర్యమ్‌తో అల్లాహ్ ముందే చేసిన వాగ్దానములను పూర్తి చేసేవారని నేను సాక్ష్యమిచ్చుచున్నాను. ఏకైక దేవునితో సంబంధము ఏర్పరచుకొని, అతని విధేయతపై పరస్పరం ఒప్పందము కుదుర్చు కోవలసినదిగా నేను నిన్ను ఆహ్వానించుచున్నాను. నన్ను అనుసరించ వలెనని, నన్ను సందేశహరుడిగా పంపిన అల్లాహ్‌ను విశ్వసించి, దైవ ధర్మములో ప్రవేశము పొందవలెనని నీకు, నీ సైనిక బృందాలకు పిలుపునిచ్చుచున్నాను. నా బాధ్యతను నేను నెరవేర్చితిని. దైవ సందేశము నీకందించితిని. నిష్కపటముగా వాస్తవమును వివరించితిని. నా స్వచ్ఛతను గౌరవించుము. దైవ మార్గదర్శనమును అనుసరించే వ్యక్తిపై అల్లాహ్ శుభములు అవతరించును.

ఈ ఉత్తరము నీగస్‌నకు అందినప్పుడు దీనిని సగౌరవముగా తన కనులకు అద్దుకొనెను. సింహాసనము నుండి క్రిందికి దిగి నిలబడి ఏనుగు దంతముల ఒక పెట్టె తీసుకరావలెనని ఆదేశించెను. ఒక పెట్టె తీసుకరాబడెను. ఆ ఉత్తరమును మర్యాదపూర్వకంగా ఆ పెట్టెలో పెట్టి ఇట్లనెను. ఈ ఉత్తరము సురక్షితముగా వున్నంత వరకు ఎబిసీనియా ప్రభుత్వము సురక్షితముగా వుండును. కనుక నీగస్ అభిప్రాయము నిజమైనది. వెయ్యి సంııల వరకు సముద్ర అలల వలె ఇస్లాం ప్రపంచమంతా వ్యాపించెను. ఎబిసీనియా కుడి, ఎడమ నుండి ఇస్లాం సైన్యములు వెళ్లినవి. కాని ఆరంభ ముస్లిం వలసదారులతో ఎబిసీనియా రాజు చేసిన ఉపకారము వలన, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తరమును నీగస్ గౌరవించినందులకు వారు ఎబిసీనియా వైపు కన్నెత్తి

కూడ చూడలేదు. ఖైసర్ వంటి రాజు ప్రభుత్వము ముక్కలు ముక్కలై పోయెను. కిస్రా వంటి ప్రభుత్వం నామారూపాలు లేకుండా పోయెను. చైనా, భారత దేశములోని రాజరికములు తలక్రిందులైనవి. కాని ఒక చిన్న ప్రభుత్వమైన ఎబిసీనియా సురక్షితముగా వుంచబడెను. ఎందుకనగా ఇతడు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రారంభ అనుచరులపై ఒక ఉపకారము చేసి ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తరమును గౌరవించి యుండెను. ఒక చిన్న ఉపకారము వలన ముస్లిములు ఎబిసీనియాతో ఈ విధముగా వ్యవహిరించిరి. కాని ఒక చెంపపై కొట్టినచో రెండవ చెంప చూపమని ప్రకటించే క్రైస్తవ జాతులు తమ స్వధార్మికుడైన, స్వపక్షమైన ఎబిసీనియా రాజు, స్వజాతికి చెందిన ప్రజలతో ఈ రోజులలో వ్యవహరించిన తీరు ప్రపంచమునకు తెలిసినదే. ఎబిసీనియా నగరములు బాంబులతో నాశనం చేయబడినవి. సంవత్సరాల తరబడి రాజు గౌరవనీయ భార్యా, పిల్లలతో కలిసి తన దేశము వదిలి విదేశాలలో ఆశ్రయము పొందవలసి వచ్చెను. ఎబిసీనియాతో వ్యవహరించిన ఈ రెండు రకాల ప్రవర్తనలు ఒకటి ముస్లిముల ప్రవర్తన, రెండవది క్రైస్తవుల ప్రవర్తన ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర శక్తిని నిరూపించడం లేదా ? ముస్లిములు నేడు ధర్మము నుండి దూరమైనను వారి అభిప్రాయాలను పుణ్యము, ఉపకారమునకు లోబడి వుండేటట్లు చేయుచున్నది.

### ఈజిప్టు రాజు మఖూఖస్ పేరిట ఉత్తరము

నాలుగవ ఉత్తరము వారు ఈజిప్టు రాజు మఖూఖస్ పేరిట వ్రాసి యుండిరి. హాతిబ్ ఇబ్నె అబీ బల్తఅ రజియల్లాహు అన్హు ద్వారా వారు ఈ ఉత్తరమును పంపిరి. అందులోని వ్యాసము ఇట్లు గలదు.



بسم الله الرحمن الرحيم۔ من محمدرسول الله الى المقوقس عظيم القبط۔سلام على من اتبع الهدى اما بعد فانى ادعوك بدعاية الاسلام اسلم تسلم يؤتك الله اجرك مرتين فانما توليت فانما عليك اثم القبط و يااهل الكتاب تعالوا الى كلمة سواء بيننا وبينكم الانعبد الا الله ولانشرك به شيئا ولا يتخذ بعضنا بعضا اربابا من دون الله فان تولوا فقولوا اشهدوا بانامسلمون۔

*(జర్ఖాని సంపుటి 3 పుట 347, సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 3 పుట 275)*

రోమన్ రాజుకు వ్రాసిన ఉత్తరములోని వ్యాసమే ఇందులో యుండెను. అందులో నీవు విశ్వసించనిచో రోమన్ ప్రజల పాపమునకు కూడ నీవే బాధ్యుడవని వుండెను. ఇందులో ఖబ్తి ప్రజల పాపమునకు నీవు బాధ్యుడవని వ్రాసి యుండెను. హాతిబ్ ఈజిప్టు చేరుకొన్నప్పుడు మఖూఖస్ రాజధానిలో లేక అలెగ్జాండ్రియలో యుండెను. హాతిబ్ (రజి) అలెగ్జాండ్రియ వెళ్లిరి. అక్కడ సముద్ర తీరాన రాజు ఒక సమావేశము ఏర్పాటు చేసి యుండెను. హాతిబ్ ఒక పడవలో ఆ ప్రాంతమునకు చేరుకొనిరి. అక్కడ భద్రత వలయం వలన హాతిబ్ దూరము నుండే లేఖను పైకి లేపి పిలవడం ప్రారంభించిరి. వీరిని తన ముందు ప్రవేశపెట్టవలెనని రాజు ఆజ్ఞాపించెను. రాజు ఉత్తరము చదివి హాతిబ్ (రజి) తో ఇట్లనెను. ఇతను సత్యమైన సందేశహరుడే అయినచో తమ శత్రువులకు విరుద్ధముగా ప్రార్థన ఎందుకు చేయడు? హాతిబ్ (రజి) ఇట్లు బదులిచ్చెను. మీరు మరియమ్మ కుమారుడు యేసు అలైహిస్సలాం

ను విశ్వసింతురు గదా! వారి జాతి వారిని హింసించినప్పుడు వారి నాశనము కొరకు యేసు (అ) ఎందుకు ప్రార్థన చేయలేదు? ఈ సమాధానము విని నీవు ఒక వివేకుని తరపున తెలివిగల దూతవని రాజు ప్రశంసించెను. హాతిబ్ (రజి) ఇట్లు వివరించెను. ఓ రాజా! మీ కంటే ముందు ఒక రాజు వుండెను. అతడు నేనే దేవుడను అని ప్రకటించెను అనగా ఫిర్ఔన్. తుదకు అతడు దైవ శిక్షకు గురయ్యెను. కావున మీరు గర్వము ప్రదర్శించక ఈ దైవ సందేశహరుడిని విశ్వసించుము. అల్లాహ్ ప్రమాణముగా! ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను గురించి యేసు (అ) చేసినటువంటి భవిష్యవాణీలు యేసు (అ) గురించి మూసా (అ) చేయలేదు. మీరు యూదులను యేసు (అ) వైపునకు ఆహ్వానించినట్లే మేము మిమ్ము ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వైపు ఆహ్వానించుచున్నాము. ప్రతి సందేశహరుడికి ఒక సమాజముండును. అతని విధేయుత తెలుపుట దాని కర్తవ్యము. మీరు ఈ సందేశహరుడి కాలమును పొందినందున వారిని స్వీకరించుట మీ కర్తవ్యము. మా ధర్మము మసీహ్ (అ)ని అనుసరించుట లో మీకు ఆటంకము కాదు. మసీహ్ (అ)ని విశ్వసించవలెనని మేము ఇతరులను కూడ ఆదేశించెదము. ఇది విని మఖూఖస్ ఇట్లనెను. నేను ఈ సందేశహరుని స్థితిగతులను విన్నాను. చెడును ఆదేశించరు. సత్కార్యము నుండి ఆపరని విశ్వసించు చున్నాను. అతడు మాంత్రికులు, తాంత్రికుల వలె కాడని నేను తెలుసుకొంటిని. వారి పలు భవిష్యవాణీలు పూర్తయినట్లు కూడ నేను విన్నాను. ఏనుగు దంతముల ఒక పెట్టె తెప్పించి అందులో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తరమును భద్ర పరచెను. దానిపై ముద్ర వేసి, తన ఆస్థానములోని ఒక దాసికి అప్పగించెను. ఆ తర్వాత రసూలు ల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పేరిట అతడు ఈ క్రింది లేఖ వ్రాసెను.



*అపార దయామయుడు పరమకారుణ్య మూర్తి అల్లాహ్ పేర.*

ముహమ్మద్ ఇబ్న్ అబ్దుల్లాహ్‌కు ఖబ్తి రాజు మఖూఖస్ లేఖ వ్రాయుచున్నాడు. మీకు శాంతి కలుగు గాక! నేను మీకు తెలుపునదేమనగా మీ ఉత్తరమును చదివితిని. మీరు అందులో ప్రస్తావించిన, ఆహ్వానించిన విషయములను నేను పరిశీలించితిని. ఇస్రాయీల్ వారి భవిష్యవాణీల ప్రకారము ఒక ప్రవక్త అవతరించునని నాకు తెలిసినది. కాని సీరియాలో అవతరించునని నేను భావించితిని. మీ దూతకు గౌరవనీయ అతిథి మర్యాదలు నేను చేసితిని. ఒక వెయ్యి పౌండ్లు, ఐదు జతల వస్త్రములు గౌరవసూచికగా అతనికి సమర్పించితిని. ఇద్దరు ఈజిప్టు అమ్మాయిలను మీకు కానుకగా పంపుచున్నాను. ఖబ్తీ జాతిలో ఈ అమ్మాయిలకు చాలా గౌరవము గలదు. వీరిలో ఒకరి నామము మారియా, మరొకరి నామము సీరీన్. ఈజిప్టు సంప్రదాయమును తెలుపే గొప్ప ప్రమాణము గల 20 జతల దుస్తులు మీ సేవలో పంపుచున్నాను. అదేవిధముగా ఒక కంచర గాడిదను మీ స్వారి కొరకు పంపుచున్నాను. చివరగా దైవ అనుగ్రహములు మీకు అందవలెనని ప్రార్థించుచున్నాను.

*(జర్ఖాని సంపుటి 2, పుట 349, తిబ్రి సంపుటి 3 పుట 1559)*

మఖూఖస్ వారి (స) ఉత్తరమును గౌరవించెనని ఈ లేఖ ద్వారా తెలియును. కాని అతడు ఇస్లాం స్వీకరించలేదు.

**బహ్రైన్ అధినేత పేరిట ఉత్తరము**

అలా బిన్ హజ్రమీ రజియల్లాహు అన్హు ద్వారా వారు ఐదవ ఉత్తరం బహ్రైన్ అధినేత మున్జిర్ తైమీకి పంపిరి. ఈ ఉత్తరము భద్రముగా లేదు. ఈ ఉత్తరము అతనికి చేరినప్పుడు అతడు విశ్వాసము ప్రకటించెను. అతడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఇట్లు వ్రాసెను. నేను, నా అనేక అనుచరులు మిమ్ములను విశ్వసించితిమి. కొందరు

ఇస్లాంలో చేరలేదు. ఇంకొందరు నా దేశములో యూదులు, నక్షత్ర ఆరాధకులు కూడ వున్నారు. వారితో నేను ఏ విధముగా ప్రవర్తించవలెనో నాకు మీరు సూచనలు పంపగలరు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతనికి వ్రాసిన ఉత్తరములోని వ్యాసము ఇట్లు గలదు. నీవు ఇస్లాంలో చేరినందుకు మాకు ఆనందం కలిగినది. నా వైపు నుండి వచ్చిన దూతల ఆజ్ఞలను నీవు పాటించుము. ఎందుకనగా వారిని అనుసరించినవారు నన్ను అనుసరింతురు. నీ వద్దకు వచ్చిన నా దూత నిన్ను పొగడ్తలతో ముంచెను. నీవు ఇస్లాం స్వీకరించితివని నాకు తెలిపెను. నేను నీ జాతి కొరకు అల్లాహ్ తో ప్రార్థన చేసితిని. ముస్లిములలో ఇస్లాం సంప్రదాయాలను జారీ చేయుము. వారి ధనమును రక్షించుము. నాలుగు భార్యల కంటే ఎక్కువ తన వద్ద వుంచుకొనుటకు ఎవరిని అనుమతించకుము. ముస్లిములు కాక ముందు వారితో సంభవించిన తప్పిదములను క్షమించుము. సన్మార్గమును వీడనంత వరకు నీవు ప్రభుత్వము నుండి తొలగించబడవు. యూదులు, నక్షత్ర ఆరాధకులైన వారి పై కేవలం ఒకే పన్ను విధించబడియున్నది. ఇతరత్రా ఎటువంటి భారములు వేయకుము. మీ దేశములో ఆహారమందించు భూములు లేని ప్రజలలో తలా ఒక్కరికి 4 రూపాయలు, దుస్తులు అందించే ఏర్పాటు చేయుము. *(జర్ఖానీ సంపుటి 3 పుట 352-53, అస్సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 3 పుట 278)*

వీరితో పాటు అమ్మాన్ రాజు, యమామా నాయకుడు, ఘస్సాన్ రాజు, యమన్‌లోని బని నహద్, హమ్దాన్, బనీ అలీమ్, హజ్రమీ జాతుల నాయకులకు కూడ ఉత్తరములు పంపిరి. వీరిలో చాలా మంది ఇస్లాం స్వీకరించిరి. వారి (స) కి అల్లాహ్‌పై సంపూర్ణ నమ్మకమున్నదని ఈ ఉత్తరముల ద్వారా స్పష్టమగును. వారు ఒక్క జాతి కొరకు కాదు సమస్త



ప్రజలకు ప్రవక్తగా పంపబడినారని ఆరంభము నుండే విశ్వసించేవారు. ఉత్తరములు పంపబడిన రాజులు, నాయకులు కొందరు ఇస్లాంలో ప్రవేశించిరి. కొందరు అమిత గౌరవ, మర్యాదలు చూపుచూ ఉత్తరములు స్వీకరించిరి కాని ఇస్లాంలో చేరలేదు. కొందరు సాధారణ గౌరవం చూపగా మరికొందరు గర్వము ప్రదర్శించిరి. నిస్సందేహముగా ప్రపంచ చరిత్ర ఇట్లు సాక్ష్యమిచ్చెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తరముల తో వ్యవహరించిన తీరును బట్టి ప్రతి రాజు, జాతితో వ్యవహరించబడెను.

## ఖైబర్ కోటను జయించుట

యూదులు, అరబ్ అవిశ్వాసులు ఇరుగు పొరుగున వున్న జాతులను ముస్లిములకు వ్యతిరేకంగా ప్రేరేపించుచున్నారని ఇంతకు ముందే వివరించనైనది. మదీనా పై దాడి చేసి ముస్లిములను అంతమొందించే శక్తి అరబ్బులకు లేదని వారు భావించిరి. యూదులు ఒక వైపు రోమన్ ప్రభుత్వ దక్షిణ సరిహద్దులో నున్న క్రైస్తవ అరబ్ జాతులను ప్రేరేపించుట మొదలు పెట్టిరి. మరో వైపు తమ ధర్మము వారైన ఇరాకీయులకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు వ్యతిరేకంగా వారు కిస్రాను ముస్లిములకు విరుద్ధముగా ఉసిగొల్పుటకు లేఖలు వ్రాయడం ప్రారంభించిరి. ఇంతకు ముందు నేను వ్రాసినట్లు ఈ కుయుక్తుల వలన కిస్రా ముస్లిములపై తీవ్ర కోపముతో వుండెను. అందుకే అతడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను బంధించవలెనని యమన్ గవర్నర్ కు ఆదేశము కూడ ఇచ్చి యుండెను. కాని అల్లాహ్ తన ప్రత్యేక అనుగ్రహముతో ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను రక్షించెను. కిస్రా, యూదుల పన్నాగాలను విఫలము చేసెను. అల్లాహ్ విశిష్ట సహకారము అందనిచో ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక వైపు కిస్రా మరో వైపు ఖైసర్ సైన్యములను ఎలా

ఎదుర్కోగలవారు ? అల్లాహ్‌యే కిస్రాను హతమార్చి అతని తనయుని ద్వారా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గురించి వెలువడిన ఆదేశాలను రద్దు చేయించెను. ఈ సంకేతమును చూచి యమన్ అధికారులు విశ్వసించిరి. ఎటువంటి యుద్ధము జరగనిదే యమన్ రాష్ట్రము ఇస్లాం ప్రభుత్వములో విలీనమైనది. ఈ పరిస్థితులకు కారకులైన యూదులను మదీనా నుండి ఇంకా దూరము పంపుట అనివార్యమయ్యెను. ఎందుకనగా వారు మదీనాకు సమీపములో వున్నచో మరింత రక్తపాతము, కుట్ర, మోసమునకు నిశ్చయముగా పాల్పడేవారు. హుదైబియా నుండి తిరిగి వచ్చిన సుమారు 5 మాసముల తర్వాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు నిర్ణయించిరి. మదీనా నుండి కొన్ని మైళ్ళ దూరాన వున్న యూదులను ఖైబర్ నుండి పంపివేయవలెను. ఎందుకనగా ఇక్కడి నుండి చాలా సులభంగా మదీనాకు వ్యతిరేకంగా కుట్ర పన్నే అవకాశముండెను. ఇందుకు 16 వందల అనుచరులతో క్రీ.శ.628, ఆగస్టు నెలలో ఖైబర్ వైపు పయనమైరి. ఖైబర్ కోటలతో నిర్మితమైన నగరము. దాని చుట్టు పర్వతములపై కోటలు నిర్మితమైయుండెను. ఇటువంటి దృఢమైన పట్టణమును ఇంత కొద్ది మంది సైనికులతో జయించుట అంత సులభం కాకుండెను. చుట్టు వున్న చిన్న చిన్న సైనిక స్థావరాలు కొద్దిపాటి యుద్ధముతో జయించబడినవి. కాని యూదులు నగరపు కేంద్రములో నున్న కోటలో ప్రవేశించినప్పుడు ఆ కోటను జయించుటకు అన్ని రకాల ఉపాయములు విఫలమైనవి. హజ్రత్ అలి రజియల్లాహు అన్‌హు చేతిలో ఈ నగరము జయించబడునని అల్లాహ్ ఒక రోజు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిపెను. వారు ఉదయం ఇట్లు ప్రకటించిరి. అల్లాహ్, అతని ప్రవక్త, ముస్లిములు ప్రేమించు వ్యక్తి చేతిలో నేడు ఇస్లాం నల్ల పతాకము నేను ఇచ్చెదను. అల్లాహ్ అతని



ద్వారా ఈ కోటను జయించుటకు నిర్ణయించెను. మరుసటి ఉదయం వారు హజ్రత్ అలీ (రజి) ని పిలిచి పతాకము వారికిచ్చిరి. వారు అనుచరుల సైన్యమును తీసుకొని కోటపై దాడి చేసిరి. రక్షణ వలయమైన కోటలో యూదులు వున్నను హజ్రత్ అలీ (రజి), అనుచరులకు అల్లాహ్ గొప్ప శక్తి ప్రసాదించినందున సాయంత్రానికి ముందు కోట జయించబడెను. భార్య, పిల్లలతో సహా యూదులందరు మదీనా నుండి దూరము వెళ్ళిపోవలెనని, వారి ధనమంతయు ముస్లిముల వశమగునని, ఈ విషయములో ఎవరైనా అసత్యమాడి, ధనము, వస్తువు దాచుకొన్నచో ఈ ఒప్పందము ప్రకారము రక్షణ కోల్పోవునని, మోసమునకు పాల్పడినందుకు శిక్షకు అర్హుడగునను ఒప్పందము కుదిరెను.

**మూడు విచిత్ర సంఘటనలు**

ఈ యుద్ధములో మూడు విచిత్ర సంఘటనలు సంభవించినవి. వీటిలో ఒకటి దైవ చిహ్నమునకు నిదర్శనము కాగా మరో రెండు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప ప్రవర్తనను తెలుపును. దైవ చిహ్నమేమనగా ఈ యుద్ధము తర్వాత ఖైబర్ నాయకుడు కనాన భార్య సఫ్యా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను వివాహమాడిరి. వారి ముఖముపై పొడుగాటి మచ్చలున్నవి. వాటిని చూచి వారిట్లడిగిరి. ఓ సఫ్యా! ఈ మచ్చలు ఎలా వచ్చినవి? ఆమె ఇట్లు తెలిపిరి. ఓ రసూలుల్లాహ్! చంద్రుడు వచ్చి నా ఒడిలో పడినట్లు నేనొక రోజు స్వప్నములో చూచితిని. మరుసటి రోజు నేను నా భర్తకు ఈ స్వప్నము వినిపించితిని. ఇది చాలా విచిత్రమైన స్వప్నము. గొప్ప విద్యావంతుడైన నీ తండ్రికి ఈ స్వప్నము వినిపించవలెనని అతను చెప్పెను. అందుకు నేను నా తండ్రికి ఈ విషయము తెలిపితిని. స్వప్నము వినగానే అతడు నా ముఖముపై గట్టిగా కొట్టి పిచ్చిదానా! నీవు అరబ్ రాజును

వివాహమాడదలచితివా? అని అనెను. *(అస్సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 3, పుట 50)* అరబ్ జాతీయ చిహ్నము చంద్రుడు అయినందున అతడు ఇట్లనెను. చంద్రుడు వచ్చి తన ఒడిలో పడినట్లు ఎవరైనా స్వప్నములో చూచినచో అరబ్ రాజుతో సంబంధమేర్పడునని భావించేవారు. చంద్రుడు విరిగినట్లు, కిందపడినట్లు ఎవరైనా స్వప్నములో చూచినచో అరబ్ ప్రభుత్వములో విభేదాలు ఏర్పడునని లేదా నాశనమగునని భావించేవారు.

ఈ స్వప్నము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సత్యమునకు ఒక నిదర్శనము. అల్లాహ్ తన దాసులకు పరోక్ష వార్తలు తెలుపుననుటకు కూడ ఒక సంకేతము. కాని విశ్వాసులకు అధికముగా అవిశ్వాసులకు అల్పముగా తెలుపును. హజ్రత్ సఫ్యా యూదురాలుగా వున్నప్పుడే అల్లాహ్ ఇంతటి స్వచ్ఛమైన స్వప్నము ఆమెకు చూపెను. దీని ప్రకారము ఆమె భర్త ఒప్పందమును భంగపర్చినందుకు శిక్షపడి హత్య చేయబడెను. ఆమె వేరే ఒక అనుచరుని ఖైదీగా పోయినను కొందరి గట్టి విన్నపముల వలన తిరిగి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను వివాహమాడిరి. అల్లాహ్ వారికి తెలిపిన రహస్యము పూర్తయ్యెను.

రెండవ ప్రస్తావించదగ్గ సంఘటన ఇట్లు గలదు. ఖైబర్‌ను ముట్టడించిన రోజులలో యూదుడైన ఒక నాయకుని మేకల కాపరి ఇస్లాం స్వీకరించెను. ఇస్లాంలో చేరిన తర్వాత అతడిట్లు వేడుకొనెను. ఓ రసూలుల్లాహ్! నేను ఇక వారి వద్దకు పోలేను. ఆ యూదుని ఈ మేకలు నా వద్ద న్యాసముగా నున్నవి. వీటిని నేనేమి చేయవలెను? మేకలను కోట వైపు త్రిప్పి పరుగెత్తించుము. అల్లాహ్ వాటిని వాటి యజమాని వద్దకు చేర్చునని వారనిరి. కనుక అతడు అటులనే చేసెను. మేకలు కోట ద్వారము వద్దకు చేరుకొన్నప్పుడు కోటలోని వ్యక్తులు వాటిని లోపకి తీసుకొనిరి. *(అస్సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 3, పుట 44)* న్యాసముల



నియములను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంత గట్టిగా పాటించేవారో, పాటింప జేసేవారో ఈ సంఘటనతో స్పష్టమగును. యుద్ధము చేయువారి సామాగ్రిని నేడు కూడ ధర్మబద్దమని భావించెదరు. ఉన్నత సమాజముగా భావించబడుచున్న నేటి కాలములో శత్రువు సైన్యమునకు చెందిన పశువులు అధీనములోకి వచ్చినప్పుడు వాటిని తిరిగి శత్రువుల వైపు పంపబడిన సంఘటన ఏదేని జరిగినదా? ఫలితముగా నెలల తరబడి శత్రువునకు ఆహారమందును. దాని నమ్మకముతో వారు చాలా సమయము వరకు ముట్టడి కొనసాగించ వచ్చును. ఒక ముస్లిం న్యాసములో లోపము ఏర్పడునని వారు ఆ మేకలను కోటలోకి పంపించిరి.

మూడవ సంఘటన ఏమనగా ఒక యూదురాలు అనుచరులను ఇట్లడిగెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు మాంసములోని ఏ భాగము చాలా ఇష్టము? వారికి భుజము మాంసము ఎక్కువ ఇష్టమని అనుచరులు తెలిపిరి. అప్పుడు ఆమె మేకను జుబహ్ చేసి, రాళ్ళపై కరకుట్లు (కబాబ్) సిద్ధము చేసి ఆ మాంసము లో విషము కలిపెను. ప్రత్యేకంగా భుజపు భాగాలలో ఎందుకనగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఆ భాగముల మాంసము అధిక ఇష్టమని ఆమెకు తెలుపబడెను.

సూర్యాస్తమయం తర్వాత సాయంత్రపు ప్రార్థన చేసి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తన గుడారము వైపు పోవుచుండి నప్పుడు వారి గుడారము సమీపములో ఒక స్త్రీ కూర్చున్నట్లు చూచిరి. అమ్మా! నీకే పని వున్నదని వారు ప్రశ్నించిరి. ఓ అబుల్ ఖాసిమ్! నేను మీ కొరక కానుక తెచ్చితినని ఆమె తెలిపెను. ఈమె ఇచ్చే వస్తువును తీసుకొనుమని ఒక సహచర అనుచరున్ని రసూలె కరీం సల్లల్లాహు అలైహి

వసల్లం ఆదేశించిరి. తర్వాత భోజనము కొరకు వారు కూర్చున్నప్పుడు ఆ భుజపు కాల్చిన మాంసము కూడ పెట్టబడెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అందులోని ఒక ముక్క భుజించిరి. వారి ఒక అనుచరుడు బషీర్ ఇబ్నుల్‌బరా బిన్ అల్‌మారూర్ కూడ ఒక ముక్క భుజించెను. ఇంతలో ఇతర అనుచరులు కూడ మాంసమును తినుటకు సిద్దమైనప్పుడు ఎవరూ భుజించకుము ఎందుకనగా ఇందులో విషము కలుపబడినట్లు ఈ చెయ్యి నాకు తెలిపెనని వారనిరి. (వారికి ఈ విషయములో ఏదో దైవవాణి అందినట్లు కాదు. ఇది అరబ్ సామెత. ఈ మాంసము రుచిచూడగా ఇందులో విషం వున్నట్లు నాకు తెలిసినదని దీని భావము. హజ్రత్ మూసా అలైహిస్సలాం కాలపు ఒక సంఘటనను ప్రస్తావించుచూ ఒక గోడ పడిపోదలచినదని పవిత్ర ఖురాన్‌లో తెలుపబడెను. అది పడిపోయే స్థితిలో ఉన్నదని అర్థము. ఇక్కడ కూడ ఆ చెయ్యి చెప్పినదని కాదు దీనిని రుచి చూడగా తెలిసిపోయెనని అర్థము. తర్వాతి వాక్యము దీనిని వివరించును.) బషీర్ (రజి) ఇట్లనెను. మీకు గౌరవము ప్రసాదించిన అల్లాహ్ ప్రమాణముగా! ఈ బుక్కలో విషం వున్నట్లు నాకు తెలిసి దానిని పారేయాలని నా హృదయము కోరెను. కాని మీకు ఇబ్బంది కలుగకూడదని, మీ భోజనం చెడిపోకూడదని నేను భావించితిని. మీరు మ్రింగిన తర్వాత మీ అనుసరణలో నేను కూడ ఆ బుక్క మ్రింగితిని. ఇందులో విషం వున్నదను అనుమానం వలన రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మ్రింగకూడదని నా మనసు కోరుకుంటుండెను. కొద్ది సమయంలోనే బషీర్ (రజి) అస్వస్థతకు గురైరి. కొన్ని కథనములలో వారు ఖైబర్‌లోనే మృతిచెందినట్లు వున్నది. కొంత కాలము అనారోగ్యము తో బాధపడి తర్వాత మృతి చెందినట్లు మరికొన్ని కథనములు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కొంత మాంసం ఒక శునకం ముందు వేయగా దానిని



తిని అది మరణించెను. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ స్త్రీని పిలిపించి మేకలో విషం కలిపినావా అని ప్రశ్నించిరి. మీకు ఇది ఎవరు చెప్పినారని ఆమె అడిగెను. వారి చేతిలో మేక భుజముండెను. నాకు ఈ భుజము చెప్పినదని వారు తెలిపిరి. ఈ రహస్యము వారికి తెలిసినదని గమనించి తాను విషం కలిపినట్లు అంగీకరించెను. ఇంతటి విద్వేషపూరిత పని ఎందుకు చేశావని వారు ప్రశ్నించిరి. ఆమె ఇట్లు బదులిచ్చెను. నా జాతితో, మీ యుద్ధము జరిగి యుండెను. నా బంధువులు ఈ యుద్ధములో హత్య చేయబడియుండిరి. వారికి విషమివ్వాలనే ఆలోచన నాకు కలిగెను. వారి కార్యము మానవ కార్యమైనచో మాకు వారితో మోక్షము లభించును. వారు నిజముగనే సందేశహరులైనచో అల్లాహ్ వారిని రక్షించును. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆమె ఈ మాటను విని ఆమెను క్షమించిరి. *(అస్సీరతుల్ హల్బియ్యహ్: సంపుటి 3, పుట 61)* నిశ్చయముగా ఇందుకు మరణ శిక్ష పడవలసియుండెను కాని ఇవ్వలేదు. వారిని, వారి మిత్రులను హత్య చేసేవారిని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏ విధంగా క్షమించేవారో ఈ సంఘటన ద్వారా తెలియును. వాస్తవముగా ఒక వ్యక్తి జీవించి వుండడంతో ముమ్ముందు అనేక పీడనములకు కారకుడయ్యే అవకాశం వుండినచో మాత్రమే శిక్షించేవారు.

### కాబా ప్రదక్షిణము

ప్రస్థానమునకు 7వ సం॥, క్రీ.శ. 629 ఫిబ్రవరిలో ఒప్పందము మేరకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కాబా ప్రదక్షిణమునకు పోవలసి యుండెను. ఆ సమయము రాగానే కాబా ప్రదక్షిణ నిమిత్తం 2 వేల మందితో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాకు బయలుదేరిరి. మక్కాకు ఒక మైలు దూరాన వున్న ముర్రుజ్జుహ్రాన్

ప్రాంతమునకు చేరుకొని ఒప్పందము ప్రకారము భారీ ఆయుధాలు, కవచములను అక్కడ పెట్టిరి. ఒరలో పెట్టిన ఖడ్గములతో మాత్రమే వారు, అనుచరులు పవిత్ర స్థలములో ప్రవేశించిరి. 7 సం॥ల విదేశీ జీవితం తర్వాత ముహాజిర్లు మక్కాలో ప్రవేశించుట ఒక సాధారణ విషయము కాదు. మక్కాలో వారిపై సుదీర్ఘ కాలము వరకు చేయబడిన హింసలను గుర్తు చేసుకొని ఒక వైపు వారి హృదయాలు మనస్తాపం చెందుచుండెను. రెండవ వైపు అల్లాహ్ కాబా ప్రదక్షిణమునకు అవకాశము కల్పించినందుకు ఆనంద పడుచుండిరి. మక్కా ప్రజలు పర్వత శిఖరాలపై నిలిచి ముస్లిములను వీక్షించుచుండిరి. అల్లాహ్ మరల మక్కాలో ప్రవేశించే అనుగ్రహము కల్పించెనా లేదా అని తెలుపుటకు ముస్లిములు తహతహలాడుచుండిరి. కనుక అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజి) యుద్ధ గీతములు పాడటం మొదలు పెట్టిరి. కాని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వారిని వారించి ఇట్లు ఆదేశించిరి. అల్లాహ్ తప్ప మరొకరు ఆరాధనకు అర్హులు కారు. ఆ అల్లాహ్‌యే తన ప్రవక్తకు సహకరించి, విశ్వాసులను అవమానము నుండి రక్షించెను. శత్రువులను వారి ముందునుండి పారిపోయేటట్లు చేసినవాడే అల్లాహ్. కాబా ప్రదక్షిణము, సఫా, మర్వ పర్వతముల అధిరోహణ తర్వాత మక్కాలో వారు మూడు రోజులు అనుచరులతో బస చేసిరి. హజ్రత్ అబ్బాస్ (రజి) మరదలు మైమూన చాలా కాలము క్రితము వితంతువై మక్కాలో నుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని వివాహమాడవలెనని హజ్రత్ అబ్బాస్ (రజి) కోరిరి. వారు ఇందుకు ఆమోదించిరి. నాలుగవ రోజు ఒప్పందము ప్రకారము వారు మక్కా వదిలి పోవలెనని మక్కా వాసులు అడిగిరి. వెంటనే మక్కా విడిచి మదీనాకు బయలు దేరవలెనని అనుచరులను వారు ఆదేశించిరి. మక్కా వారి భావాలను గౌరవించి,



తర్వాత తగిన ప్రయాణ సౌకర్యములు సమకూర్చుకొని రాగలరని నూతన వధువు మైమూనాను కూడ మక్కాలోనే వదిలిరి. స్వయముగా తమ వాహనమును పరుగెత్తించి పవిత్ర స్థల సరిహద్దులు దాటిరి. అక్కడే సాయంత్రం వారి సతీమణి మైమూనా కూడ చేర్చబడిరి. అదే అరణ్యములో మైమూన మొదటి రాత్రి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో చేరిరి.

## ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సతీమణుల సంఖ్యపై విమర్శకు సమాధానము

నేను ఇప్పుడు రచించుచున్న సంక్షిప్త చరిత్రలో ఈ సంఘటన వివరించదగినది కాదు. ఈ చిన్న సంఘటనను ఇక్కడ వ్రాయుటకు ఈ సంఘటనలోని ఒక అంశము నన్ను బలవంతము చేయుచున్నది. అదేమనగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు అధిక భార్యలుండిరని, నవూజు బిల్లాహ్ మిన్ జాలిక్ ఇది వారి కామానికి పరాకాష్ట అని విమర్శించబడును. కాని వారికి వారి భార్యల మధ్య నున్న బంధమును చూసి అది ఎంత పవిత్ర, నిస్వార్థ, ఆధ్యాత్మికమైనదో అది ఒక్క భార్య గల పురుషుని మధ్య కూడ లేదని మనము ఒప్పుకోక తప్పదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బంధము తమ భార్యలతో కేవలం కామం వరకే పరిమితమైయుండినచో ఏ ఆధ్యాత్మిక భావము వారి సతీమణులను ప్రభావితం చేయలేదని ఋజువు కావలెను. కాని వారి భార్యల హృదయాలలో వారితో వున్న ఆప్యాయత, వారు పొందిన పవిత్ర స్ఫూర్తికి చెందిన అనేక సంఘటనలు వారి మరణము తర్వాత చరిత్రలో లభించును. ఉదాహరణకు ఇదొక చిన్న సంఘటన. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తో మైమూనా మొదటి సారి పవిత్ర స్థలము బయట ఒక గుడారములో కలిసిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు

అలైహి వసల్లంతో వారికి ఏదైనా శారీరక సంబంధముండినచో వారు భార్యలలో కొందరికి ప్రాధాన్యత ఇచ్చేవారే అయినచో మైమూనా (రజి) తన జీవితములో ఈ సంఘటనను మంచి సంఘటనగా గుర్తుంచుకొనే వారు కాదు. ఆమె ఈ సంఘటనను మరచి పోవుటకు ప్రయత్నించెదరు. కాని మైమూనా (రజి) రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిన తర్వాత 50 సంుులు జీవించియుండిరి. 80 సంుులకు చేరుకొని మరణించిరి. కాని ఈ శుభ బంధమును ఆమె జీవితాంతం మరచిపోలేదు. 80 సంుుల వయస్సులో యవ్వన భావాలు తగ్గిపోవును. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతిచెందిన 50 సంవత్సరములు అనగా ఒక జీవిత కాలముతో సమానమైన ఆయువు గడిపిన తర్వాత మైమూనా (రజి) మృతిచెందిరి. అప్పుడు తమ చుట్టు వున్న వారిని మైమూనా ఒక కోరిక కోరిరి. అదేమనగా మక్కా నుండి ఒక మైలు దూరాన రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం గుడారము వున్న చోట నేను మొదటి సారి వారి సేవలో చేరితిని. అక్కడే నా సమాధి ఏర్పాటు చేయవలెను. *(అస్సీరతుల్ హల్బియ్యహ్: సంపుటి 3, పుట 73)* ప్రపంచములో నిజమైన సంఘటనలు, కథలు కూడ వుండును. కాని ఆ నిజమైన సంఘటనలలో, కథలలో కూడ ఇటువంటి ప్రేమ కంటే ఎక్కువ ప్రభావితము చేసే ఏదేని సంఘటన చూపగలరా?

## ఖాలిద్ బిన్ వలీద్, అమర్ బనిల్ ఆస్ ఇస్లాం స్వీకరణ

కాబా సందర్శన తర్వాత తొందరలోనే ఇద్దరు వ్యక్తులు ఇస్లాం స్వీకరించిరి. వీరు ఇస్లామి యుద్ధముల ఆరంభము నుండి అవిశ్వాసుల గొప్ప సైనికాధికారులలో వుండిరి. వీరు ఇస్లాంలో చేరిన తర్వాత ఇస్లాం చరిత్ర విస్మరించలేని విధంగా ప్రఖ్యాత సేనాపతులుగా గుర్తింపు పొందిరి. రోమనుల పునాదులను పెకిలించి ఒక్కొక్క ప్రదేశమును జయించుచూ



ఇస్లాం ప్రభుత్వములో చేర్చిన ఖాలిద్ బిన్ వలీద్ ఒకరు కాగా ఈజిప్టును జయించి ఇస్లాం ప్రభుత్వములో చేర్చిన అమర్ బనిల్ ఆస్ మరొకరు.

## మౌతా యుద్ధము

కాబా సందర్శన నుండి వారు వచ్చిన తర్వాత అరబ్ జాతులు, యూదులు, అవిశ్వాసులు ప్రేరేపించడం వలన సీరియా సరిహద్దులో క్రైస్తవులు మదీనాపై దాడికి సన్నద్ధమవుచున్నారని వారికి వార్తలు అందుచుండెను. కనుక ఈ అపోహలు ఎంత వరకు నిజమో తెలుసుకొనుటకు 15 మంది అనుచరుల ఒక బృందమును సీరియా సరిహద్దునకు వారు పంపిరి. వీరు సీరియా సరిహద్దునకు చేరుకోగా అక్కడ ఒక సైన్యము గుమికూడుచున్నట్లు చూచిరి. వీరు తిరిగి వచ్చి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలుపే బదులు ప్రచార ఉత్సాహము వలన ధైర్యము, సాహసముతో ముందుకు వెళ్ళి వారిని ఇస్లాం వైపు ఆహ్వానించడం ప్రారంభించిరి. ఎందుకనగా ఆ కాలములో ప్రచార ఉత్సాహము విశ్వాసి లక్షణముగా యుండెడిది. శత్రువులచే రెచ్చగొట్టబడి, ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దేశముపై దాడి చేసి దానిని జయించాలని కోరువారు వారి దైవ ఏకత్వ విద్యతో ఎలా ప్రభావితమగుదురు. వీరు ఇస్లాం బోధనను వినిపించడం ప్రారంభించ గానే నలు వైపుల సైనికులు విల్లు ఎక్కుపెట్టి వారి పై బాణములు కురిపించడం మొదలు పెట్టిరి. మా ప్రచారమునకు సాక్ష్యాలు, నిదర్శనముల తో సమాధానము చెప్పే బదులు వీరు బాణములు విసురుచున్నారని గ్రహించిన ముస్లిములు పారిపోలేదు. ఈ వందలాది, వేలాది సమూహము నుండి తమ ప్రాణాలు రక్షించుకోలేదు. ఈ 15 మంది స్వచ్ఛమైన ముస్లిముల వలె ఆ వందలాది, వేలాది మందిని ఎదురించి అందరు అక్కడిక్కడే ప్రాణాలు విడిచిరి. ఇట్టి క్రూరమైన చర్యకు

పాల్పడిన వారిని శిక్షించుటకు మరో సైన్యమును పంపాలని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కోరిరి. కాని అక్కడ గుమికూడిన సైన్యము చీలిపోయినదని వారికి తెలిసెను. కనుక కొంత కాలము వరకు ఈ నిర్ణయమును వాయిదా వేసిరి.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ కాలములోనే రోమన్ ప్రభుత్వము తరపున బస్రా పాలకునిగా వున్న ఘస్సాన్ జాతి నాయకునికి లేదా రోమ్ రాజుకే ఒక లేఖ వ్రాసిరి. ఈ ఉత్తరములో పైన ప్రస్తావించ బడిన సంఘటన ఫిర్యాదు వుండవచ్చు. అనగా పలు సీరియా జాతులు ఇస్లామి ప్రాంతములో దాడి సన్నాహాలలో ఉన్నారు. వారు 15 మంది ముస్లిములను అకారణముగా హతమార్చిరని యుండవచ్చును. అల్ హార్స్ నామము గల ఒక అనుచరుని ద్వారా ఈ ఉత్తరము పంపబడెను. వారు సీరియా వెళ్ళుచూ మౌతా అను ఒక ప్రాంతములో బస చేసిరి. అక్కడ ఖైసర్ నియమించిన నాయకులలోని ఒకడైన సర్జీల్ నామము గల ఘస్సాన్ జాతి నాయకుడు వారిని కలిసెను. వారిని అతడు నీవు ఎటువైపు పోవుచున్నావు? బహుశ నీవు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దూతవు కదూ అని అడిగెను. వారు అవునని తెలిపినప్పుడు అతడు వారిని బంధించి కొట్టి కొట్టి హతమార్చెను. చరిత్రలో దీని వివరాలు లేవు కాని ఇంతకు ముందు 15 మంది అనుచరులను హత్యచేసిన సైన్యపు నాయకులలో ఇతను ఒకడు కావచ్చును. నీవు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దూతవు కదూ అని అతడు ప్రశ్నించిన తీరును బట్టి ఇట్లనుపించును. ఎందుకనగా మీ ప్రాంతము వారు మా ప్రాంతము వారిపై దాడి చేసిరని ఖైసర్ వద్ద ముహమ్మద్ రసూలుల్లాహ్ ఫిర్యాదు చేసినచో రాజు మమ్ము ప్రశ్నించునని అతడు భయపడెను. కావున దూతను హత్య చేయుటలోనే తనకు మేలు జరుగునని, సందేశము అందదు, ఎటువంటి విచారణ జరగదని భావించెను. కాని అల్లాహ్ అతని దురుద్దేశాలను పూర్తి కానివ్వలేదు. ఏదో రూపంలో అల్‌హార్స్ హత్య చేయబడినట్లు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు వార్త అందెను. ఈ రెండు సంఘటనలకు పాల్పడిన వారిని శిక్షించుటకు జైద్ బిన్ హార్స (రజి) (వారు స్వేచ్ఛ కల్పించిన బానిస, వారి మక్కా జీవితములో ప్రస్తావించబడిరి) నేతృత్వములో 3 వేల మంది అనుచరులతో ఒక సైన్యమును సీరియా వైపు పంపిరి. జైద్ బిన్ హార్స సైన్యమునకు నాయకుడని ఆదేశించిరి. వారు హతమైనచో జాఫర్ బిన్ అబీ తాలిబ్ (రజి) సేనాపతి అగుదురని వారు కూడ అమరులైనచో అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజి) నాయకత్వము వహింతురని వారు కూడ హత్యచేయబడినచో ముస్లిములు కలిసి తమలో ఒకరిని అధికారిగా ఎన్నుకోవలెనని ఆదేశించిరి. ఆ సమయములో ఒక యూదుడు వారి సమావేశములో ఉపస్థితై యుండెను. అతడిట్లు వ్యాఖ్యానించెను. ఓ అబుల్ ఖాసిమ్! మీరు సత్యవంతులైనచో ఈ ముగ్గురు తప్పక హతమార్చబడుదురు. ఎందుకనగా అల్లాహ్ తన సందేశహరుల నోట వెలువడిన మాటలను పూర్తి చేయును. తర్వాత అతడు జైద్‌నుద్దేశించి ఇట్లు వ్యాఖ్యానించెను. నేను నిజముగా చెప్పుచున్నాను ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సత్యమైన అల్లాహ్ సందేశహరుడు అయినచో నీవు ఎన్నటికి బ్రతికి తిరిగి రాలేవు. నేను తిరిగి వచ్చినా రాకున్నా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన అల్లాహ్ సందేశహరులేనని జైద్ జవాబిచ్చెను. మరుసటి రోజు ఉదయం ఈ సైన్యము పయనమయ్యెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం, అనుచరులు దీనికి వీడ్కోలు పలుకుటకు పోయిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితములో వారి నాయకత్వము లేని ఇంత పెద్ద సైన్యము ఒక సేనాపతి సారథ్యంలో ఒక

ముఖ్య కార్యమునకు వెళ్లలేదు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ సైన్యము వెంట పోవుచు వారికి కొన్ని సూచనలు అందించుచుండిరి. తుదకు మదీనా శివారులో వారు మదీనాలో ప్రవేశించిన చోట, సాధారణంగా మదీనా వాసులు తమ అతిథులకు వీడ్కోలు పలికే ప్రదేశమునకు చేరుకొని నిలబడి ఇట్లు ఆదేశించిరి. దైవ మార్గమును వీడకూడదు, మీతో వున్న ముస్లిములతో సత్ప్రవర్తన కలిగి వుండుము. అల్లాహ్ నామముతో యుద్ధమునకు వెళ్లుము. సీరియాలో నున్న మీ, దేవుని శత్రువులతో వెళ్లి యుద్ధము చేయుము. మీరు సీరియా చేరినప్పుడు ప్రార్థనాలయాలలో కూర్చొని ప్రార్థనలో వున్నవారు మీకు తారస పడుదురు. వారిని ఎదురించకుము, వారికి ఇబ్బంది కలిగించకుము. శత్రువు దేశములో స్త్రీని, బాలుడిని, అంధుడిని, వృద్ధుడిని హతమార్చకుము. ఏ వృక్షమును నరకరాదు, భవనమును కూల్చివేయకూడదు. ఈ ఉపదేశము చేసి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడి నుండి తిరిగి వచ్చిరి. ఇస్లామి సైన్యము సీరియా వైపు పయనమయ్యెను. క్రైస్తవ మతమునకు విరుద్ధముగా బయలు దేరిన మొదటి ముస్లిం సైన్యమిది. ఈ సైన్యము సీరియా సరిహద్దునకు చేరుకొన్నప్పుడు ఖైసర్ కూడ ఇటు వైపు వచ్చి యున్నాడని వీరికి తెలిసెను. ఒక లక్ష రోమన్ సైన్యము అతని వెంట వుండగా మరో లక్ష అరబ్ క్రైస్తవ జాతుల సైన్యము కూడ వున్నదని తెలిసెను. మార్గమధ్యలోనే బస చేసి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము చేరవేయాలని ముస్లిములు భావించిరి. అటుల చేసినచో వారు ఏదైనా సహాయం పంపినా పంపవచ్చునని లేదా ఏదైనా ఆదేశము ఇవ్వవచ్చునని భావించిరి. ఈ సలహా సేకరణ జరుగుచున్నప్పుడు అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజి) ఉద్రేకముతో నిలబడి ఇట్లు ప్రసంగించిరి. ఓ నా జాతి ప్రజలారా! దైవ మార్గములో ప్రాణాలర్పించుటకు మీరు మీ



గృహముల నుండి బయలు దేరి యుండిరి. మరిప్పుడు భయమెలా? మనము మన సంఖ్య, శక్తి, ఆధిక్యము వలన ఎవరితో యుద్ధము చేయము. అల్లాహ్ తన అనుగ్రహము తో మన కొరకు అవతరింపజేసిన ధర్మ సహాయం నిమిత్తం శత్రువులతో మనము యుద్ధము చేయుదుము. శత్రువు ఎక్కువ వుంటే ఏమగును. తుదకు రెండు పుణ్యములలో ఒకటి మనకు తప్పక లభించును. మనము విజయము సాధించవచ్చు లేదా దైవ మార్గములో అమరులము కావచ్చును. వారి ఈ మాటలను వారు విని ఇబ్నె రవాహ (రజి) నిజమే అంటున్నారని అనిరి. వెంటనే ముందుకు వెళ్లుటకు ఆదేశించబడెను. వారు ముందుకు వెళ్లినప్పుడు రోమన్ సైన్యము వారి వైపు వచ్చుచున్నట్లు కనిపించెను. ముస్లిములు మౌతా అను ప్రదేశములో యుద్ధమునకు సైనికులను వరుసలుగా నిలబెట్టిరి. యుద్ధము ప్రారంభమయ్యెను. కొద్ది సమయము లోనే ముస్లిముల సేనాపతి జైద్ బిన్ హార్స సంహరించబడిరి. అప్పుడు ఇస్లాం సైన్య పతాకమును రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం చిన్నాన కుమారుడు జాఫర్ బిన్ అబీ తాలిబ్ (రజి) తన చేతిలో తీసుకొని సైన్యమునకు నాయకత్వము వహించిరి. శత్రు సైనిక సమూహము దూసు కొస్తున్నట్లు ముస్లిములు తక్కువ సంఖ్య వలన వారిని తట్టుకోలేరని వారు గ్రహించి ఉద్రేకముతో అశ్వము దిగి తన అశ్వము కాళ్ళను నరికి వేసిరి. దాని అర్థమేమనగా కనీసం నేను మైదానము వదిలిపోను. నేను మరణమును ఇష్టపడుదును కాని పారిపోవుటకు ఇష్టపడను. ఇది అరబ్బుల ఒక సంప్రదాయము. అశ్వముపై మనిషి లేనందున అది మైదానములో గందరగోళం సృష్టించకూడదని వారు దాని కాళ్ళు నరికేవారు. కొద్ది యుద్ధములోనే వారి కుడి హస్తము నరికివేయబడెను. అప్పుడు ఎడమ చేతితో పతాకమును పట్టుకొనిరి. తర్వాత ఎడమ చేయి కూడ నరికి వేయబడెను. అప్పుడు తన రెండు

మోచేతులతోనే పతాకమును ఛాతికి ఆనించి పట్టుకొనిరి. వారు అమరులయ్యే వరకు మైదానములో నిలిచిరి. వారి తర్వాత రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశము మేరకు అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజి) పతాకమును పట్టుకొనిరి. వారు కూడ శత్రువుతో యుద్ధము చేయుచూ హత్య చేయబడిరి. అప్పుడు ముస్లిములు ఏకాభిప్రాయముతో ఒక నాయకున్ని నియమించుకొనే అవకాశం లేకుండెను. శత్రువుల అధిక సంఖ్య వలన ముస్లిములు మైదానము వదిలి పారిపోవాల్సిన స్థితి ఏర్పడుచుండెను. ఒక మిత్రుని సలహా మేరకు ఖాలిద్ బిన్ వలీద్ పతాకము పట్టుకొని సాయంత్రము వరకు శత్రువులతో పోరాడిరి.

రెండవ రోజు కూడ తన అలసిన, గాయపడిన సైన్యమును తీసుకొని ఖాలిద్ బిన్ వలీద్ శత్రువును ఎదురించుటకు వెళ్లిరి. వారు తెలివితో ముందు భాగాన్ని వెనుక, వెనుక భాగాన్ని ముందు, కుడిని ఎడమ, ఎడమను కుడి చేసిరి. ముస్లిములకు సహాయము వచ్చినట్లు శత్రువు భావించే విధముగా గట్టిగా నినదించిరి. అప్పుడు శత్రువు వెనక్కి జరిగెను. ఖాలిద్ (రజి) ఇస్లామి సైన్యము ను రక్షించుకొని తిరిగి వచ్చిరి.

అల్లాహ్ రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు అదే రోజు సువార్త వాణి ద్వారా ఈ వార్త అందించెను. వారు ప్రకటన చేసి ముస్లిములందరిని మస్జిద్‌లో సమావేశపర్చిరి. వారు వేదికపైకి రాగానే కన్నీటి పర్యంతమై ఇట్లు ఉపదేశించిరి. ఓ ప్రజలారా! ఈ యుద్ధములో పాల్గొను సైన్యమును గురించి మీకు తెలిపెదను. ఆ సైన్యము ఇక్కడి నుండి వెళ్లి శత్రువుకెదురుగా నిలబడెను. యుద్ధము మొదలైన తర్వాత జైద్ హతమార్చబడెను. మీరు జైద్ (రజి) కొరకు ప్రార్థనలు చేయుము. తర్వాత పతాకమును జాఫర్ (రజి) పట్టుకొని శత్రువుపై దాడి చేసిరి. వారు కూడ హత్యచేయబడిరి. మీరు వారి కొరకు కూడ ప్రార్థనలు



చేయుము. తర్వాత అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజి) పతాకమును పట్టుకొని ధైర్యముతో పోరాడిరి. కాని తుదకు వారు కూడ అమరులైరి. మీరు వారి కొరకు కూడ ప్రార్థనలు చేయుము. ఆ తర్వాత ఖాలిద్ బిన్ వలీద్ (రజి) పతాకమును పట్టుకొనిరి. నేను అతన్ని సేనాపతిగా నియమించలేదు. కాని తనకు తానే సేనాపతిగా బాధ్యతలు చేపట్టెను. అతను దైవ ఖడ్గములలో ఒక ఖడ్గము. అతడు అల్లాహ్ సహాయముతో ఇస్లామి సైన్యమును సురక్షితముగా తీసుకొచ్చెను. వారి ఈ ఉపన్యాసము వలన ఖాలిద్ (రజి) నామము ముస్లిములలో "సైఫుల్లాహ్" అనగా దైవ ఖడ్గములలో ఒక ఖడ్గముగా ఖ్యాతి చెందెను. ఖాలిద్ చివరలో విశ్వాసులైరి. అందుకే కొందరు అనుచరులు వారిని హాస్యము లేదా ఏదేని వివాద సమయమున ఎగతాళి చేసేవారు. ఒకసారి ఇటువంటి మాటపైనే అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) వారికి మధ్య వివాదము జరిగెను. వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఖాలిద్ బిన్ వలీద్ గురించి ఫిర్యాదు చేసిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఆదేశించిరి. ఖాలిద్! బదర్ సమయము నుండి ఇస్లాం సేవ చేయుచున్న వ్యక్తిని నీవెందుకు బాధ పెట్టుచున్నావు. ఉహద్ నకు సమానంగా స్వర్ణము ఖర్చు చేసినను దానికి సమాన ఫలితము అల్లాహ్‌తో పొందలేవు. అప్పుడు ఖాలిద్ (రజి) "ఓ రసూలుల్లాహ్! వీరు నన్ను ఎగతాళి చేయుట వలన నేను సమాధానమిత్తునని" అనిరి. మీరు ఖాలిద్ (రజి) కు బాధ కలిగించకూడదని ఇతడు దైవ ఖడ్గములలో ఒక ఖడ్గమని అది అవిశ్వాసుల వినాశనము కొరకు సిద్ధమైనదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. ఈ భవిష్యవాణి కొన్ని సం॥ల తర్వాత అక్షరాల పూర్తయ్యెను. ఖాలిద్ (రజి) తన సైన్యముతో తిరిగి మదీనాకు వచ్చినప్పుడు ఆ యుద్ధములో పాల్గొనని మదీనా అనుచరులు ఆ సైన్యములోని సైనికులను పారిపోయిన వారని అనుట ప్రారంభించిరి.

అనగా మీరు తిరిగి రాక పోరాడుచూ అక్కడే మరణించ వలసియుండెనని అర్థము. కాని వీరు పారిపోవు వారు కాదు మరల మరల శత్రువుపై దాడి చేయు సైనికులని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించిరి. ఈ విధముగా సీరియాతో ముస్లిములకు భవిష్యత్తులో సంభవించే యుద్ధముల భవిష్యవాణి వారు చేసిరి.

## మక్కా విజయము

ప్రస్థానమునకు 8వ సం॥ రమజాన్ నెల అనగా క్రీ.శ. 629 డిశంబర్‌లో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అరబ్‌లో ఇస్లాంను స్థిరపరచిన అంతిమ యుద్ధము కొరకు పయనమైరి. ఈ సంఘటన ఇట్లు సంభవించెను. హుదైబియా శాంతి ఒప్పందము సందర్భమున ఇట్లు తీర్మాణించబడియుండెను. ఇష్టమున్న అరబ్ జాతులు మక్కా వారి పక్షములో చేరవచ్చును. ఇష్టమున్న వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పక్షమున చేరవచ్చును. ఒకరు మరొకరిపై దాడికి దిగి ఈ ఒప్పందమును భంగపరచితే తప్ప పది సం॥ల వరకు ఇరువురికి పరస్పరం యుద్ధము చేయు అనుమతి లేదు. ఈ ఒప్పందానుసారము బనూబకర్ అను అరబ్ జాతి మక్కావారితో యుండెను. ఖజాఅ జాతి ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసెను. అరబ్ అవిశ్వాసులు ఒప్పందమును తక్కువే పాటించేవారు ప్రత్యేకంగా ముస్లిముల విషయంలో. బనూబకర్‌కు ఖజాఅ జాతితో ప్రాచీన విభేదము యుండెను. హుదైబియా శాంతి ఒప్పందమైన కొంత కాలము తర్వాత వారు మక్కా వారిని ఇట్లు పురిగొల్పిరి. ఒప్పందము వలన ఖజాఅ వారు సంతృప్తిగా వున్నారు. కావున వారితో మనము ప్రతీకారము తీర్చుకొనుటకు ఇదే మంచి అవకాశము. కనుక మక్కా ఖురైష్, బనూబకర్ కలిసి ఖజాఅపై రాత్రికి రాత్రి గుప్త దాడి చేసి వారి చాలా మందిని హతమార్చిరి. ఖురైష్ బనూబకర్



వారితో కలిసి ఈ దాడి చేశారని ఖజాఅకు తెలియగానే ఈ ఒప్పంద ఉల్లంఘన విషయమును తెలుపుటకు 40 మందిని వేగంగా పరుగెత్తే ఒంటెలతో మదీనా పంపిరి. పరస్పరం ఒప్పందము మేరకు ఇప్పుడు మా ప్రతీకారము తీసుకొనుటకు మీరు మక్కాపై దాడి చేయగలరని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను వారు కోరిరి. ఈ బృందం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకొనగా వారిట్లు అనిరి. మీ దు:ఖము, మా దు:ఖము. నేను నా ఒప్పందము పై స్థిరముగా నున్నాను. ఈ కురుస్తున్న మేఘాలలో (అప్పుడు వర్షము పడుచుండెను) నుండి వర్షము పడుచున్నట్లు అతి త్వరలోనే ముస్లిం సైన్యములు మీ సహాయము కొరకు చేరును. మక్కా వారికి ఈ బృందం గురించి తెలిసినప్పుడు వారు తీవ్ర ఆందోళనకు గురై ముస్లిములను దాడి నుండి విరమింపజేయుటకు అబూసుఫ్యాన్ ను మదీనా పంపిరి. అబూసుఫ్యాన్ మదీనా చేరుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంపై ఇట్లు ఒత్తిడి చేసెను. హుదైబియా శాంతి ఒప్పందము సందర్భమున నేను లేను కావున నూతనంగా ఒప్పందము కుదుర్చుకొనెదము. కాని జవాబు చెప్పడంతో రహస్యము బహిర్గతమగునని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని మాటకు ఎలాంటి సమాధానము ఇవ్వలేదు. అబూసుఫ్యాన్ నిరాశతో భయపడి మస్జిద్‌లో నిలబడి ఇట్లు ప్రకటించెను. ఓ ప్రజాలారా! నేను మక్కా వారి తరపున మీతో నూతన శాంతి ప్రకటన చేయుచున్నాను. ఈ మాట విని ముస్లిములు అతని అవివేకముపై నవ్విరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపిరి. అబూసుఫ్యాన్! నీవు ఇది ఏకపక్షముగా ప్రకటించుచున్నావు. మేము నీతో ఎలాంటి ఒప్పందము కుదుర్చుకోలేదు.

ఈ లోపు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నలు వైపులలో

ముస్లిం జాతులన్నిటి వద్దకు దూతలను పంపిరి. ముస్లిం జాతులన్ని సిద్ధమై వున్నట్లు, అవి మక్కా వైపు వెళ్లుచుండగా మార్గములో కలుస్తాయని వార్తలు అందిన తర్వాత మదీనా ప్రజలు ఆయుధాలు ధరించవలెనని ఆజ్ఞాపించిరి. క్రీ.శ. 630 జనవరి మొదటి తేదీన ఈ సైన్యము మదీనా నుండి బయలు దేరెను. మార్గమధ్యలో నలు వైపుల నుండి ముస్లిం జాతులు వచ్చి చేరుచుండెను. కొన్ని మైళ్ళ దూరము ప్రయాణించిన తర్వాత ఈ సైన్యము ఫారాన్ వనములో ప్రవేశించినప్పుడు దీని సంఖ్య సులెమాన్ (అ) సందేశహరుని భవిష్యవాణి ప్రకారము 10 వేలకు చేరియుండెను. ఈ సైన్యము ఇటు మక్కా వైపు వెలుచుండెను. అటు మక్కా వారు ప్రస్తుత పరిస్థితులపై వున్న ఈ స్తబ్దత వలన మరింత ఆందోళన చెందుచుండిరి. తుదకు వారు సలహా చేసుకొని ముస్లిములు అసలు ఏమి చేయదలచిరో తెలుసుకొనుటకు మరల అబూసుఫ్యాన్‌ను మక్కా బయటికి పంపిరి. మక్కా నుండి ఒక మైలు దూరాన బయటికి రాగానే అరణ్యమంతా అగ్నితో ప్రకాశించుచున్నట్లు అబూసుఫ్యాన్ చూసెను. అన్ని గుడారాల ముందు నిప్పు రాజేయాలని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆజ్ఞాపించి యుండిరి. అరణ్యములో 10 వేల మంది కొరకు గుడారాల ముందు ప్రకాశించుచున్న ఈ అగ్ని ఎంతో భయంకర దృశ్యాన్ని సృష్టించెను. ఇది ఏమిటి? ఆకాశము నుండి ఏదైనా సైన్యము దిగెనా?అని అబూసుఫ్యాన్ తన సహచరులను ప్రశ్నించెను. ఎందుకనగా అరబ్‌లోని ఏ జాతి సైన్యము ఇంత పెద్దగా లేదు. అతని సహచరులు వివిధ జాతుల పేర్లు చెప్పిరి. కాని అరబ్‌లోని ఎవరి సైన్యము కూడ ఇంత పెద్దగా లేదని అబూసుఫ్యాన్ అనెను. వీరు మాట్లాడుకుంటున్న మధ్యలోనే చీకటిలో అబూ హన్జల! (ఇది అబూ సుఫ్యాన్ మారుపేరు) అని ఎవరో పిలిచిరి. అబ్బాస్! నువ్వు ఇక్కడెక్కడా? అని అబూసుఫ్యాన్ అనెను. వారిట్లనిరి. ముహమ్మద్



రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సైన్యము ఇక్కడే వున్నది. మీరు ఏదైనా ఉపాయము ఆలోచించనిచో పరాజయము, అవమానము మీ వాకిట్లో వుందని తెలిపిరి. వారు అబూసుఫ్యాన్‌కు ప్రాచీన మిత్రులు. ఈ మాటల తర్వాత తన వాహనము మీద కూర్చొని, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందు హాజరు కావలెనని వారు అబూసుఫ్యాన్‌ను బలవంతము చేసిరి. అతని హస్తము లాగి తన ఒంటెపై తన వెంట కూర్చోబెట్టుకొని, ఒంటెను పెరుగెత్తించి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చిరి. వారి వెంట పహారా ఇస్తున్న హజ్రత్ ఉమర్ (రజి) అతన్ని హతమార్చునని అబ్బాస్ భయపడుచుండిరి. కాని అబూసుఫ్యాన్ మీలో ఎవరికైనా కనిపించినచో అతన్ని హత్య చేయకూడదని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇంతకు ముందే ఆదేశించి యుండిరి. వారు అబూసుఫ్యాన్‌ను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందు హాజరుపర్చినప్పుడు ఈ దృశ్యమంతయు అబూసుఫ్యాన్ హృదయంలో ఒక పెద్ద మార్పుకు నాంది పలికెను. కొన్ని సం॥ల క్రితమే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఒక్క మిత్రునితో కలిసి మక్కా నుండి వెళ్లిపోయేటట్లు మేము బలవంతము చేసియుంటిమి. కాని 7 సం॥లు పూర్తి కాగానే వారు 10 వేల పవిత్రులతో కలిసి మక్కాపై దౌర్జన్యము, హింసతో కాక సమంజసమైన పద్ధతిలో దాడి చేయుటకు వచ్చిరని వారిని ఎదుర్కొనే శక్తి మక్కా వారికి లేదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమావేశము వరకు చేరుకునే లోపు ఇటువంటి ఆలోచనల తో, భయము, భీతి వలన అబూసుఫ్యాన్ నోట మాటరాని పరిస్థితి ఏర్పడెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అతని పరిస్థితిని చూచి ఇట్లనిరి. అబ్బాస్! అబూసుఫ్యాన్‌ను తన వెంట తీసుకెళ్లి, రాత్రి తన వద్ద వుంచుకొని ఉదయం నా ముందు ప్రవేశపెట్టుము. కనుక

అబూసుఫ్యాన్ రాత్రి అబ్బాస్ (రజి) వెంట వుండెను. ఉదయం ఫజ్ర్ ప్రార్థన సమయమున అతన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందు ప్రవేశ పెట్టబడెను. ఉదయం లేచి ప్రార్థన చేయు విషయము మక్కా వారకేమి తెలియును. నీళ్ళతో నిండిన చెంబులను తీసుకొని అటు ఇటు తిరుగుచున్న ముస్లిములను అతడు చూచెను. ఒకడు వజూ చేసుకుంటున్నట్లు, ఒకడు వరుసలలో నిలబడుచున్నట్లు అతనికి కనిపించెను. బహుశ ఏదో విచిత్రమైన శిక్ష నా కొరకు నిర్ణయించారని అబూసుఫ్యాన్ భయపడెను. అతడు భయపడి వీరు ఇంత పొద్దున ఏమి చేయుచున్నారని హజ్రత్ అబ్బాస్ (రజి) ను అడిగెను. నీవు భయపడాల్సిందేమి లేదు, వీరు ప్రార్థనకు సిద్ధమవుచున్నారని హజ్రత్ అబ్బాస్ (రజి) అనిరి. వేలాది ముస్లిములు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెనుక నిలబడి, వారు రుకూలోకి వెళితే అందరు రుకూ చేయుదురు. వారు సాష్టాంగములు చేయునప్పుడు అందరు సాష్టాంగములు చేయుచున్నట్లు అబూసుఫ్యాన్ చూచెను. హజ్రత్ అబ్బాస్ (రజి) పహారాలో వున్నందున ప్రార్థనలో లేకుండిరి. అబూసుఫ్యాన్ వారినిట్లడిగెను. వీరేమి చేయుచున్నారు. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చేయుచున్నదే వీరు అనుసరించుచున్నది నేను చూచెదను. అబ్బాస్ (రజి) ఇట్లనిరి. నీవు ఏ ఆలోచనలో వున్నావు? ఇప్పుడు ప్రార్థన జరుగుచున్నది. కాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వీరిని అన్న పానీయాలు వదలమని ఆదేశించినచో వీరు అన్న పానీయాలు వదిలెదరు. అబూ సుఫ్యాన్ ఇట్లనెను. నేను కిస్రా, ఖైసర్ వారి ఆస్థానములను కూడ చూచితిని. కాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలకు వారి పట్ల వున్న అభిమానమును నేను ఏ ప్రజలలో చూడలేదు. తర్వాత అతడు



అబ్బాస్ (రజి)ను ఇట్లు వేడుకొనెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో వారు తమ జాతిని నేడు క్షమించమని మనవి చేయలేవా? ప్రార్థన ముగిసిన తర్వాత హజ్రత్ అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్‌ను తీసుకొని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చిరి. వారిట్లనిరి. అబూసుఫ్యాన్! అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవము లేదను విషయము ఇంకా నీకు అర్థము కాలేదా? అబూసుఫ్యాన్ ఇట్లనెను. నా తల్లిదండ్రులు మీ కొరకు బలిఅగుగాక! మీరు సహనశీలురు, మర్యాదస్తులు, బంధుత్వమును నిలబెట్టువారు. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవము వుంటే మాకు కొంతైనా సహాయము చేసేదని నాకిప్పుడు అర్థమైనది. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అబూసుఫ్యాన్! నేను అల్లాహ్ ప్రవక్త అని నీవు తెలుసుకునే సమయం ఇంకనూ రాలేదా? నా తల్లిదండ్రులు మీ కొరకు బలిఅగుగాక! ఈ విషయములో నా హృదయంలో ఇంకా కొన్ని సందేహాలు గలవని అబూసుఫ్యాన్ అనెను. ముస్లిముల సైన్యము గూర్చి వార్త తెలుసుకొనుటకు మక్కా నుండి అతనితో కలిసి వచ్చిన మిగతా ఇద్దరు అబూసుఫ్యాన్ సందేహాలను లెక్క చేయక ఇస్లాం స్వీకరించిరి. వీరిలో ఒకరు హకీమ్ బిన్ హజామ్ కూడ వుండిరి. వారి తర్వాత అబూసుఫ్యాన్ కూడ ఇస్లాం స్వీకరించెను. కాని మక్కా విజయము తర్వాతనే అతను హృదయ పూర్వకంగా మారిపోయెను. విశ్వసించిన తర్వాత హకీమ్ బిన్ హజామ్ ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! మీరు తమ జాతిని నాశనం చేయుటకు ఈ సైన్యముతో వచ్చితిరా? రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు నుడివిరి. వీరు హింసకు పాల్పడిరి. వీరు నేరములు చేసిరి. మీరు హుదైబియాలో కుదిరిన ఒప్పందమును ఉల్లంఘించిరి. ఖజాఅకు విరుద్ధముగా క్రూరమైన యుద్ధము చేసితిరి. అల్లాహ్ శాంతి ప్రసాదించిన

పవిత్ర ప్రాంతములో యుద్ధము చేసిరి. హకీమ్ బిన్ హజామ్ ఇట్లనెను. అవును ఓ రసూలుల్లాహ్! మీ జాతి నిస్సందేహముగా అటులనే చేసెను. కాని మీరు మక్కాపై దాడి చేసే బదులు హవాజిన్ జాతిపై దాడి చేయవలెను కదా! రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఆ జాతి క్రూరమైనదే. కాని మక్కా విజయము, ఇస్లాం ఆధిక్యము, హవాజిన్ పరాజయములన్నిటిని నా ద్వారా పూర్తి చేయునని నేను అల్లాహ్‌తో ఆశించుచున్నాను. ఆ తర్వాత ఓ రసూలుల్లాహ్! మక్కా వారు ఖడ్గము పట్టుకొననిచో వారు శాంతి పొందుదురా ? అని అబూసుఫ్యాన్ అడిగెను. వారిట్లనిరి అవును! తమ ఇంటి ద్వారములు మూసుకున్న ప్రతి వ్యక్తికి శాంతి లభించును. హజ్రత్ అబ్బాస్ ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! అబూ సుఫ్యాన్ కాస్త గౌరవము గల వ్యక్తి. అనగా అతని గౌరవమునకు కూడ ఏర్పాటు కావలెను. చాలా మంచిది, ఎవరైతే అబూసుఫ్యాన్ గృహములో ప్రవేశించునో వారికి శాంతి కలుగును. ఎవరైతే మస్జిద్ కాబాలో ప్రవేశించునో వారికి కూడ శాంతి కలుగును. తన ఆయుధము పడవేసిన వానికి శాంతి లభించును. తన ద్వారము మూసుకొని కూర్చొనిన వానికి శాంతి లభించును. హకీమ్ బిన్ హజామ్ ఇంట్లో ప్రవేశించిన వానికి కూడ శాంతి కలుగును. ఆ తర్వాత బిలాల్ హబ్షి (రజి) నకు వారు సోదరులు గా చేసిన అబూరవీహ (రజి) గురించి ఇట్లనిరి. మేము మా పతాకము అబూరవీహ (రజి) కు ఇచ్చుచున్నాము. అబూరవీహ (రజి) పతాకము క్రింద నిలిచిన వ్యక్తిని కూడ మేము ఏమి చేయము. బిలాల్ (రజి) ను ఇట్లనిరి. నీవిట్లు ప్రకటించుము. ఎవరైతే అబూరవీహ (రజి) పతాకము క్రింద చేరునో వారికి రక్షణ కల్పించబడును. *(అస్సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి3, పుట 91)* ఈ ఆదేశములో ఎంతో గొప్ప వివేకము గలదు. మక్కా వారు బిలాల్ (రజి) కాళ్ళకు తాళ్ళు కట్టి వారిని మక్కా



వీధులలో ఈడ్చుకెళ్ళేవారు. మక్కా వీధులు, మక్కా మైదానము బిలాల్ కొరకు శాంతియుతంగా లేక, శిక్ష, అవమానము, ఎగతాళి ప్రాంతముగా నుండెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు భావించిరి. బిలాల్ హృదయము నేడు ప్రతీకారము కొరకు తహతహలాడుచుండును. ఈ విశ్వాసపాత్రుడైన అనుచరుని ప్రతీకారము తీసుకొనుట కూడ చాలా ముఖ్యమే. కాని మా ప్రతీకారము ఇస్లాం బోధనానుసారము వుండుట కూడ అనివార్యము. కనుక బిలాల్ ప్రతీకారము ఖడ్గముతో శత్రువుల తలలు నరకకుండా అతని సోదరునికి ఒక పతాకము ఇచ్చి నిలబెట్టి తీసుకొనిరి. నేడు నా సోదరుని పతాకము నీడన చేరిన వ్యక్తికి ఎలాంటి ప్రాణ హాని లేదని ప్రకటించమని బిలాల్‌ను ఆదేశించిరి. ఇది ఎంత మధురమైన, అందమైన ప్రతీకారము. ఓ మక్కా ప్రజలారా! రమ్ము! నా సోదరుని పతాకము క్రింద నిలబడుము! మీకు శాంతి ప్రసాదించబడునని బిలాల్ (రజి) పెద్ద ధ్వనితో ప్రకటించునప్పుడు అతని హృదయములో ప్రతీకార భావము తగ్గుచుండెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నా కొరకు సూచించిన ప్రతీకారము కంటే గొప్ప, అందమైన ప్రతీకారము మరొకటి వుండదని అతను అర్థము చేసుకొని వుండవచ్చును.

సైన్యము మక్కా వైపు వెళ్లినప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబ్బాస్ (రజి) ను ఇట్లు ఆదేశించిరి. ముస్లిం సైన్యమును, దాని త్యాగ స్ఫూర్తిని దర్శించుటకు అబూసుఫ్యాన్ అతని సహచరులను తీసుకొని రహదారి ప్రక్కన నిలబడుము. హజ్రత్ అబ్బాస్ (రజి) అటులనే చేసిరి. మక్కా వారు సహాయం లభించునని నమ్ముకున్న ఒక్కొక్క అరబ్ జాతుల బృందాలు అబూసుఫ్యాన్, అతని సహచరుల ముందు నుండి వెళ్లుట ప్రారంభించెను. నేడు వారు అవిశ్వాస పతాకము కాక ఇస్లాం పతాకము ఎగురవేయుచుండిరి. వారి నోట శక్తిమంతుడైన

అల్లాహ్ ఏకత్వము ప్రకటించబడుచుండెను. మక్కా వారు ఆశించినట్లు వీరు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రాణం హరించుటకు కాక ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు తమ రక్తపు తుది బొట్టును కూడ ప్రవహింపజేయుటకు సిద్ధమైరి. ఒక్కడైన అల్లాహ్ ఏకత్వమును, దాని ప్రచారమును ప్రపంచములో స్థిరపరచవలెననే వారి అంతిమ కోరికగా యుండెను. ఒక సైన్యము తర్వాత మరో సైన్యము వెళ్ళుచుండగా ఇంతలోనే ఆశ్జ జాతి సైన్యము వెళ్లెను. ఇస్లాంపై మమకారం, దానికై ప్రాణాలర్పించు ఉద్రేకము వారి ముఖములు, నినాదాల నుండి ప్రత్యక్షమగుచుండెను. అబ్బాస్! వీరెవరని అబూసుఫ్యాన్ అడిగెను. ఇది ఆశ్జ జాతి అని అబ్బాస్ (రజి) తెలిపిరి. అబూసుఫ్యాన్ తీవ్ర ఆశ్చర్యముతో అబ్బాస్ (రజి) వైపు చూచి మొత్తం అరబ్‌లో ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు వీరే అతి పెద్ద శత్రువులుగా వుండేవారని అనెను. అబ్బాస్ (రజి) ఇట్లనిరి. ఇది అల్లాహ్ అనుగ్రహము. అతడు కోరినప్పుడు వీరి హృదయాలలో ఇస్లాంకై ప్రేమ పుట్టించెను. అందరి తర్వాత ముహాజిర్ల, అన్సార్ సైన్యమును తీసుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెళ్లిరి. వీరి సంఖ్య 2 వేలు యుండెను. వీరు తల నుంచి పాదముల వరకు రక్షణ కవచం ధరించి యుండిరి. హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హు) వీరి వరుసలను సరిదిద్దుచూ వరుసల మధ్య సమాన దూరము వుండుటకు అడుగులు జాగ్రత్తగా వేయమని సూచించుచుండిరి. ఈ పురాతన ఇస్లాం ప్రేమికుల ఉద్రేకము, వారి ధృడ సంకల్పము, వారి ధైర్యము వారి ముఖముల నుండి ప్రత్యక్షమగుచుండెను. అబూసుఫ్యాన్ వారిని చూడగానే గుండె తరుక్కుపోయెను. అబ్బాస్ ! (రజి) వీరెవరని అతడు ప్రశ్నించెను. అన్సార్, ముహాజిర్ల సైన్యముతో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం



వెళ్ళుచున్నారని వారనిరి. ఈ సైన్యమును ఎదుర్కొనే శక్తి ప్రపంచములో ఎవరికున్నదని అబూసుఫ్యాన్ బదులిచ్చెను. మరల అతను అబ్బాస్ (రజి) ను సంబోధించి ఇట్లనెను. అబ్బాస్ (రజి)! మీ సోదరుని కుమారుడు నేడు ప్రపంచములో అందరి కంటే గొప్ప రాజయ్యెను. ఇప్పటికి నీ హృదయ ద్వారములు తెరుచుకోలేదా? ఇది రాజరికము కాదు ప్రవక్తృత్వమని అబ్బాస్ (రజి) అనిరి. అవును అవును ప్రవక్తృత్వమే కావచ్చు అని అబూసుఫ్యాన్ అనెను. అబూసుఫ్యాన్ ముందు నుండి ఈ సైన్యము వెళ్ళుచుండగా అన్సార్ సేనాపతి సాద్‌బిన్ ఉబాదహ్ (రజి) అబూసుఫ్యాన్‌ను చూచి ఇట్లనిరి. నేడు మక్కాలో ఖడ్గ బలముతో ప్రవేశించుటకు అల్లాహ్ అనుమతించెను. నేడు ఖురైష్ జాతి అవమాన పరచబడును. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అబూసుఫ్యాన్ ముందు నుండి వెళ్ళుచుండగా, ఓ రసూలుల్లాహ్! మీరు మీ జాతిని హత్య చేయుటకు అనుమతించిరా అని గట్టిగా అడిగెను. ఇప్పుడే అన్సార్ నాయకుడు సాద్ (రజి) వారి సహచరులు గట్టిగా ఇట్లను చుండిరి. నేడు యుద్ధము జరుగును. నేడు యుద్ధము చేయుటకు మక్కా పవిత్రత మాకు అడ్డురాదు. ఖురైష్ వారిని మేము అవమానించి తీరెదము. ఓ రసూలుల్లాహ్! మీరు ప్రపంచములో అందరి కంటే గొప్ప పుణ్యులు, అందరికంటే పెద్ద దయామయులు. అందరిని మించి బంధుత్వమును రక్షించే మానవులు. నేడు మీ జాతి హింసలను మరచిపోలేరా? అబూసుఫ్యాన్ ఈ ఫిర్యాదును విని మక్కా వీధులలో దెబ్బలు కొట్టబడిన, గృహములు, ఆస్తుల నుండి బహిష్కరించబడిన ముహాజిర్ల హృదయాలలో కూడ మక్కా వారికై దయ కలిగెను. వారిట్లనిరి. ఓ రసూలుల్లాహ్! మక్కా వారి క్రూర సంఘటనలను విన్న అన్సార్ నేడు మక్కా వారితో ఏ విధంగా ప్రవర్తించెదరో మాకు తెలియదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఓ అబూసుఫ్యాన్! సాద్ వ్యాఖ్యలు

తప్పు. నేడు కరుణించే దినము. అల్లాహ్ నేడు ఖురైష్, ఖానా కాబాకు గౌవరము ప్రసాదించును. ఆ తర్వాత వారు ఒకరిని సాద్ వద్దకు పంపి, నీ పతాకము నీ తనయుడు ఖైస్‌కు అప్పగించుమని నీ బదులు అతడు అన్సార్‌కు సేనాపతిగా వుండునని తెలిపిరి. ఈ విధముగా వారు ఇటు మక్కా వారిని ఆనందపరచి అటు అన్సార్లకు బాధ కలగకుండా చేసిరి. ఖైస్ మీద రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు కూడ నమ్మకముండెను. ఎందుకనగా ఖైస్ చాలా నిర్మల స్వభావము గల నవయువకులు. ఎంత నిర్మలమనగా చరిత్రలో ఇట్లు వ్రాయబడెను. వీరి మరణము సమీపించి నప్పుడు కొందరు వారిని పరామర్శించుటకు వచ్చిరి. ఇంకొందరు పరామర్శించుటకు రాలేదు. నాకు తెలిసిన వారు కూడ కొందరు పరామర్శించుటకు రాని కారణమేమిటని తమ మిత్రులను వారడిగిరి. వారి మిత్రులు ఇట్లనిరి. మీరు పెద్ద ధనికులు. ప్రతి ఒక్కరికి అతని ఆపద కాలంలో రుణం ఇచ్చి యుండిరి. నగరములో చాలా మంది మీ రుణగ్రహీతలున్నారు. బహుశ మీకు డబ్బు అవసరముండి మీరు వారితో రుణము చెల్లంచమని అంటారేమోనని వారు రాలేదు. అవునా! నా మిత్రులకు అకరాణంగా బాధ కలిగెను. ఖైస్ ద్వారా రుణం పొందిన ప్రతి ఒక్కరి రుణం మాఫీ చేయబడెనని నా తరపున నగరమంతా చాటింపు చేయించగలరని వారనిరి. అప్పుడు వారిని పరామర్శించుటకు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చినందుకు వారి గృహములోని మెట్లు విరిగిపోయెను. సైన్యము వెళ్లిన తర్వాత అబూసుఫ్యాన్‌తో అబ్బాస్ (రజి) ఇట్లనెను. ఇప్పుడు నీ వాహనమును పరుగెత్తించి మక్కా చేరుకొని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వచ్చిరి, వారు ఈ విధముగా శాంతి ప్రసాదించిరని మక్కా వారికి తెలుపుము. నేను మక్కా వారికి మోక్షము కల్పించానని అబూసుఫ్యాన్ లోలోపల అనంద పడుచుండెను. అప్పుడు



అతని భార్య హింద ఇస్లాం ఆరంభం నుండి ముస్లిములతో ఈర్ష్యా, ద్వేషముతో వ్యవహిరించాలని నేర్పెను. అవిశ్వాసి అయినను సాహస స్త్రీ. ఆమె ముందుకు వచ్చి తన భర్త గడ్డం పట్టుకొని ఇట్లనుచు మక్కా వారిని పిలిచెను. ఈ తెలివి తక్కువ వృద్ధుడిని హతమార్చుము. ఎందుకనగా తమ ఆత్మ, నగర గౌరవము కొరకు వెళ్లి యుద్ధము చేయుచు ప్రాణ త్యాగము చేయమని ఉపదేశించే బదులు మీలో శాంతి ప్రకటన చేయుచున్నాడు. ఆమె స్పందనను చూచి అబూసుఫ్యాన్ ఇట్లనెను. ఓ వెర్రి మహిళ! ఇప్పుడు ఈ మాటలకు సమయం లేదు. వెళ్లి తమ ఇంట్లో దాగుము. నేను ఆ సైన్యమును చూచి వచ్చితిని. ఆ సైన్యమును ఎదురించే శక్తి మొత్తం అరబ్‌లో ఎవరికి లేదు. ఆ తర్వాత అబూసుఫ్యాన్ శాంతి నిబంధనలను గట్టిగా ప్రకటించడం ప్రారంభించెను. శాంతి ప్రకటిత జాబితాలో నున్న ఆయా గృహములు, ప్రదేశముల వైపు ప్రజలు వేగంగా పరుగెత్తిరి. కేవలం 11 మంది పురుషులు, 4గురు స్త్రీల గురించి కఠిన హత్యా నేరములు ఋజువయ్యెను. వారు యుద్ధ నేరస్తులుగా పరిగణించబడిరి. వారిని హత్య చేయవలెనని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించి యుండిరి. ఎందుకనగా వారు అవిశ్వాసము, జగడపు నేరస్తులే గాక యుద్ధ నేరస్తులై యుండిరి.

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ సందర్భముగా మీతో ఎవరు యుద్ధమునకు దిగనిదే మీరు యుద్ధము చేయకూడదని ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ను గట్టిగా ఆదేశించిరి. కాని ఖాలిద్ (రజి) నగరము లో ప్రవేశించిన వైపు శాంతి ప్రకటన అందలేదు. ఆ ప్రాంత సైన్యము ఖాలిద్ (రజి) ను ఎదుర్కొనినందున 24 మంది హతమార్చబడిరి. ఖాలిద్ (రజి) చాలా ఉత్సాహ భరిత స్వభావము గల వ్యక్తి. కనుక ఒకరు పరుగెత్తి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు

వార్త అందించి ఇట్లనెను. ఖాలిద్(రజి) ను అడ్డుకోవలెను లేనిచో అతడు మొత్తం మక్కా వారిని హతమార్చును. వారు వెంటనే ఖాలిద్ (రజి) ను పిలిపించి నేను యుద్ధము చేయకూడదని నీకు చెప్పలేదా ? అని అనిరి. ఖాలిద్ (రజి) ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! మీరు వద్దని ఆజ్ఞాపించిరి. కాని ముందు వారు మా పై దాడి చేసిరి. బాణములు విసరడం మొదలు పెట్టిరి. నేను కొద్ది సమయం నిరీక్షించితిని. మీపై దాడి చేసే ఉద్దేశము మాకు లేదు. అలా చేయకూడదని కూడ చెప్పితిని. ఏ విధంగాను వారు మా మాట వినలేదని నేను గ్రహించినప్పుడు వారితో యుద్ధము చేసితిని. అల్లాహ్ వారిని నలువైపుల విడదీసెను. ఈ చిన్న సంఘటన తప్ప మరే ఇతర అవాంఛనీయ సంఘటన జరగకుండానే మక్కా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వశమయ్యెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాలో ప్రవేశించినప్పుడు ఓ రసూలుల్లాహ్! మీరు మీ గృహములో బసచేయుదురా? అని ప్రజలు అడిగిరి. వారిట్లనిరి. అఖీల్ (వారి చిన్నాన్న కుమారుడు) మా కొరకు ఏదైనా గృహము విడిచి పెట్టినాడా? అనగా నా ప్రస్థానము తర్వాత నా బంధువులు నా మొత్తం ఆస్తిని విక్రయించి ఆరగించిరి. ఇప్పుడు మక్కాలో నాకు ఎలాంటి నివాసము లేదు. మరల ఇట్లనిరి. మేము ఖైఫ్ బనీ కనానాలో బస చేయుదుము. ఇది మక్కాలో ఒక మైదానము. ఖురైష్, కనానా జాతి కలిసి ఇక్కడ ఇట్లు ప్రమాణము చేసి యుండిరి. బనూ హాషిమ్, బనూ అబ్దుల్ ముత్తలిబ్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను బంధించి మా అధీనములో హాజరుపర్చి, అతడికి సహాయ నిరాకరణ చేయనంత వరకు మేము వారితో వివాహము చేసుకోము, క్రయ విక్రయాలు జరపము. ఈ ప్రతిజ్ఞ తర్వాతనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి చిన్నాన్న అబూతాలిబ్, వారి అనుచర గణం వ్యక్తులందరు అబూతాలిబ్ లోయలో



శరణము పొంది యుండిరి. మూడు సం॥ల కఠిన బాధల తర్వాత అల్లాహ్ వారికి విముక్తి కల్పించెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఎన్నిక ఎంత మధురమైనదో. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను మాకు అప్పగించ నంత వరకు మేము మీ జాతితో రాజీపడలేమని ఇదే ప్రాంతములో మక్కా వారు ప్రమాణములు చేసి యుండిరి. నేడు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అదే మైదానములో బస చేసి మక్కా వారికి ఇట్లు సవాలు విసిరిరి. మీరు కోరుకున్న చోట నేను వచ్చితిని. నన్ను హింసించే శక్తి నేడు మీకున్నదా? నన్ను అవమానిత, భయంకర స్థితిలో చూడాలని మీరు కోరుకుంటిరి, నా జాతి నన్ను బంధించి ఇదే చోట మీ అధీనములో చేర్చవలెనని మీరు ఆశించి యుండిరి, అక్కడే నేను చేరుకున్నాను. నాతో నా జాతి మాత్రమే కాదు యావత్ అరబ్ ప్రజానీకం వున్నది. నా జాతి నన్ను మీకు అప్పగించలేదు. నా జాతి మిమ్ములను నా అధీనములో చేర్చెను. దైవికముగా ఆ రోజు సోమవారమై యుండెను. సూర్ గుహ నుండి కేవలం అబూబకర్ (రజి) తో కలిసి ప్రస్థానము చేసిన రోజు కూడ సోమవారమే అయివుండెను. సూర్ పర్వతము పై నుండి ఆ రోజే ఎంతో నిరాశతో మక్కా వైపు చూచి వారిట్లని యుండిరి. ఓ మక్కా! నీవు నాకు ప్రపంచ పురములలో అన్నిటి కంటే ప్రియమైనదానివి, కాని నీ పౌరులు నన్ను ఇక్కడ వుండనివ్వడం లేదు.

మక్కాలో ప్రవేశించే సమయమున హజ్రత్ అబూబకర్ (రజి) వారి ఒంటె ముక్కుతాడు పట్టుకొని వారితో మాట్లాడుచుండిరి. మక్కా విజయ వార్త తెలుపబడిన ఫతహ్ అధ్యాయమును కూడ పఠించుచుండిరి. వారు నేరుగా ఖానా కాబా చేరుకొని ఒంటెపై కూర్చొనే 7 పర్యాయములు ఖానా కాబా ప్రదక్షిణము చేసిరి. అప్పుడు వారి చేతిలో ఒక కర్ర వుండెను.

ఇబ్రాహీమ్ (అ), వారి కుమారుడు ఇస్మాయిల్ (అ) ఏక దైవారాధన కొరకు ఖానా కాబా నిర్మించి యుండిరి. సన్మార్గము కోల్పోయిన వారి సంతానము దానిని విగ్రహాల ఖనిగా మార్చిరి. దాని చుట్టు తిరిగి అక్కడ పెట్టబడిన 360 విగ్రహాలలో ఒక్కొక్కటిని కర్రతో కొట్టుచు ఇట్లనుచుండిరి. جَآءَ الْحَقُّ وَزَهَقَ الْبَاطِلُ اِنَّ الْبَاطِلَ كَانَ زَهُوْقًا ఈ సూక్తి ప్రస్థానము కంటే ముందు బనీ ఇస్రాయిల్ అధ్యాయములో అవతరించి యుండెను. ఇందులో ప్రస్థానము, మక్కా విజయం గురించి వార్త ఇవ్వబడి యుండెను. ఇది ప్రస్థానము కంటే ముందే అవతరించిన అధ్యాయమని ఐరోపా రచయితలు అంగీకరించిరి. ఈ అధ్యాయములో ఇట్లు తెలుపబడెను. (బనీ ఇస్రాల్: 81,82)

وَقُلْ رَّبِّ اَدْخِلْنِىْ مُدْخَلَ صِدْقٍ وَّاَخْرِجْنِىْ مُخْرَجَ صِدْقٍ وَّاجْعَلْ لِّىْ مِنْ لَّدُنْكَ سُلْطَانًا نَّصِيْرًا ٥ وَقُلْ جَآءَ الْحَقُّ وَزَهَقَ الْبَاطِلُ اِنَّ الْبَاطِلَ كَانَ زَهُوْقًا ٥ (بنی اسرائیل:۸۲،۸۱)

అనగా నీవిట్లనుము. ఓ నా ప్రభువు! ఈ నగరము అనగా మక్కాలో సత్యముగా నన్ను ప్రవేశింపజేయుము. ఈ ప్రస్థానము తర్వాత విజయము, అధికారము ప్రసాదించి ఈ నగరము నుండి నా బయలు దేరుట సత్యముతో నుండునట్లు నన్ను వెడలనిమ్ము. తన సన్నిధి నుండి నాకు విజయము, సహాయము ప్రసాదించుము. ఇంకను ఇట్లనుము. సత్యము వచ్చెను. అసత్యము అనగా అన్యారాధన పరాజయముతో పలాయన మయ్యెను. అసత్యము నిశ్చయముగా పలాయనవే అగును. ఈ భవిష్యవాణి అక్షరాల పూర్తగుచున్న, అబూబకర్ (రజి) దీనిని పఠించుచున్న సందర్భమున ముస్లిముల, అవిశ్వాసుల హృదయాలలో మొలకెత్తిన మనో భావాలను అక్షరాలలో వివరించుట అసంభవం. ఎట్టకేలకు ఇబ్రహీమ్



(అ) ప్రదేశమును మరల ఏక దైవారాధన కొరకు ఆ దినము ప్రత్యేకించ బడెను. విగ్రహాలు శాశ్వతముగా విరగగొట్టబడెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం హుబుల్ నామము గల విగ్రహంపై కర్ర కొట్టగా అది క్రింద పడి విరిగిపోయెను. అప్పుడు హజ్రత్ జుబైర్ (రజియల్లాహు అన్హు) అబూసుఫ్యాన్ వైపు హాస్యముతో చూచి, ఇట్లనెను. అబూసుఫ్యాన్ నీకు గుర్తున్నదా! ఉహద్ రోజు ముస్లిములు తీవ్రముగా గాయపడి ఒక చోట నిలిచి వునప్పుడు నీవు గర్వముతో ఇట్లు ప్రకటించితివి. "اعلُ هُبُل اعلُ هُبُل" అనగా హుబుల్ స్థానము గొప్పది, హుబుల్ స్థానము గొప్పది. మీకు ఆ రోజున ముస్లిములపై హుబులే విజయము ప్రసాదించి యుండెను. నేడు చూచుచున్నావా! అదిగో హుబుల్ ముక్కలు ముక్కలై పడియున్నది. అబూసుఫ్యాన్ ఇట్లనెను. జుబైర్! (రజి) ఇక ఆ మాటలను వదిలివేయుము. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దైవము కాక మరో దైవముండినచో నేడు మనము చూచుచున్నది ఎన్నటికి జరగకపోవును. ఖానా కాబాలోపలి భాగంలో చిత్రించబడిన హజ్రత్ ఇబ్రాహీం (అ) మొ॥ చిత్రాలను తుడిసి వేయాలని వారు ఆజ్ఞాపించిరి. అల్లాహ్ వాగ్దానములు పూర్తి అయినందున కృతజ్ఞతగా కాబా గృహములో రెండు రకాతులు చదివిరి. తర్వాత బయటికి వచ్చి కూడ రెండు రకాతుల ప్రార్థన చేసిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖానా కాబా చిత్రాలను తుడిసివేయుటకు హజ్రత్ ఉమర్ (రజి) ను నియమించియుండిరి. హజ్రత్ ఇబ్రాహీం (అ) ను సందేశహరునిగా మేము కూడ విశ్వసించెదమని హజ్రత్ ఇబ్రాహీం (అ) చిత్రమును వారు తుడిసివేయలేదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ చిత్రమును అలాగే వున్నట్లు చూచి ఇట్లనిరి. ఓ ఉమర్! నువ్వు చేసిన ఈ పని ఏమిటి? అల్లాహ్ ఇట్లు ఆదేశించలేదా ?

مَاكَانَ اِبْرَاهِيْمُ يَهُوْدِيًّا وَّلَا نَصْرَانِيًّا وَّلٰكِنْ كَانَ حَنِيْفًا مُّسْلِمًاؕ وَمَاكَانَ مِنَ الْمُشْرِكِيْنَ ٥ (آلِ عمران:٦٨)

(ఆలెఇమ్రాన్:68) అనగా 'ఇబ్రాహీం యూదుడు కాడు, క్రైస్తవుడు కాడు, అతడు ఎల్లప్పుడు అల్లాహ్ యందు భక్తి నిలిపి విధేయుడుగా నుండెడి వాడు. అతడు ఇతరులను అల్లాహ్‌తో జతగూర్చి ఆరాధించెడి వాడు కాడు.' కావున వారి ఆజ్ఞతో ఈ చిత్రమును కూడ తుడిసివేయబడెను. దైవ చిహ్నములను చూచి ముస్లిముల హృదయాలు విశ్వాసముతో పొంగి పొర్లుతుండెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వైభవము పట్ల వారికి గల నమ్మకము రెట్టింపు అగుచుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జంజం (ఇబ్రాహీం (అ) పుత్రుడైన ఇస్మాయిల్ (అ) కొరకు ఒక సంకేతముగా అల్లాహ్ జారీ చేసిన) చెలిమ నుండి త్రాగుటకు నీరు తెప్పించినప్పుడు దానిలో కొంత నీటిని త్రాగి మిగిలిన నీటితో ప్రక్షాళన చేసుకొనిరి. అప్పుడు వారి శరీరము నుండి ఒక్క బిందువు కూడ క్రింద పడలేకుండెను. ముస్లిములు వెంటనే దానిని అందుకొని శుభముగా భావించి తమ శరీరమునకు అద్దుకొనేవారు. తమ ప్రజలతో ఇంతటి గౌరవము పొందిన రాజును మేము ఎన్నడు చూడలేదని అన్యారాధకులు వ్యాఖ్యానించుచుండిరి. తర్వాత మక్కా ప్రజలు వారి ముందు ప్రవేశపెట్టబడిరి. వారిట్లనిరి. ఓ మక్కా ప్రజలారా! అల్లాహ్ సంకేతములు ఏ విధముగా అక్షరాల పూర్తయినవో చూచితిరిగదా! ఏకదైవారాధన చేయుచున్న నిరుపేదలను మీరు హింసించి, దౌర్జన్యము చేసినందుకు మీతో ఎలా ప్రతీకారము తీసుకొనవలెను? యూసుఫ్ అలైహిస్సలాం తన సోదరులతో వ్యవహరించినట్లే మేము మీతో ఆశించుచున్నామని మక్కా ప్రజలు అనిరి. అల్లాహ్ మహిమతో మక్కా



వారి నోట పవిత్ర ఖురాన్‌లో యూసుఫ్ అధ్యాయంలో ముందే అల్లాహ్‌చే భవిష్యవాణి చేయబడిన అక్షరములే వెలువడినవి. మక్కా విజయముకు 10 సం॥ల క్రితం యూసుఫ్ (అ) తన సోదరులతో వ్యవహరించిన విధముగనే నీవు మక్కా వారితో వ్యవహరించెదవని తెలిపెను. మక్కా ప్రజల నోట వారు యూసుఫ్‌ను పోలిన వారని స్పష్టమై, యూసుఫ్‌కు వారి సోదరులపై విజయం లభించినట్లే మక్కా వారిపై వారికి విజయం లభించినట్లు రుజువైనది. కనుక వారు కూడ ఇట్లు ప్రకటించిరి. تَاللّٰهِ لَاتَثْرِيْبَ عَلَيْكُمُ الْيَوْمَ అల్లాహ్ ప్రమాణముగా నేడు మీకు ఎటువంటి శిక్ష, మందలింపు వుండదు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కాబా సందర్శనకు చెందిన ఇతర ప్రార్థనలో నిమగ్నమై, తమ జాతిని కరుణ, క్షమించుటలో వుండగా అన్సార్ హృదయములు అంతర్గతంగా విచారపడుచుండెను. సైగలతోనే ఒకరినొకరు ఇట్లనుకొనుచుండిరి. బహుశా నేడు మనము అల్లాహ్ ప్రవక్తను మనతో విడదీయు చున్నాము. ఎందుకనగా వారి నగరమును అల్లాహ్ వారిచే జయింపజేసెను. వారి జాతి వారిని విశ్వసించెను. అప్పుడు అన్సార్ సందేహాలను అల్లాహ్ సువార్త వాణి ద్వారా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిపెను. వారు తల పైకి లేపి అన్సార్ వైపు చూచి ఇట్లు ప్రవచించిరి. ఓ అన్సార్! ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను తన నగర ప్రేమ బాధించునని, తన జాతి అనురాగం గుర్తుకొచ్చునని ఊహించుచున్నారా? ఓ రసూలుల్లాహ్! ఇది నిజమే. మా హృదయాలలో ఇటువంటి ఆలోచనలు వచ్చినవని అన్సార్ బదులిచ్చిరి. వారిట్లనిరి. మీకు తెలుసునా నా పేరేమిటో? అనగా నేను అల్లాహ్ దాసుడను, అతని ప్రవక్తను. ఇస్లాం ధర్మము బలహీనముగా నున్న కాలములో మీ ప్రాణాలు త్యాగము చేసినవారిని విడిచి నేనెక్కడికి

వెళ్లగలను. మరల ఇట్లనిరి. ఓ అన్సార్! అట్లెన్నటికి జరగదు. నేను అల్లాహ్ దాసుడను, అతని ప్రవక్తను. నేను అల్లాహ్ కొరకే నా స్వస్థలమును వదిలితిని. ఆ తర్వాత నేనెప్పుడు స్వస్థలమునకు తిరిగి రాలేను. నా జీవితము, మీ జీవితముతోనే వున్నది. నా మరణము, మీ మరణము తో ముడిపడివున్నది. మదీనా వారు వారి ఈ ప్రవచనములను విని, వారి ఈ ఆప్యాయత, విశ్వాసపాత్రను చూచి రోదించుచు ముందుకు వచ్చి ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! అల్లాహ్ ప్రమాణము! మేము అల్లాహ్‌పై, అతని ప్రవక్తని గూర్చి అపోహపడితిమి. అసలు విషయమేమనగా అల్లాహ్ ప్రవక్త మమ్ములను మా నగరమును విడిచి మరో చోట వెళ్లు ఆలోచనను మేము భరించలేక పోయితిమి. వారిట్లనిరి. అల్లాహ్, అతని ప్రవక్త మీరు నిర్దోషులని భావించి, మీ విశ్వసనీయతను బలపరచును. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, మదీనా ప్రజల మధ్య ఈ ప్రేమానురాగ సంభాషణ జరుగుచున్నప్పుడు మక్కా ప్రజల కంట నీరు రాకున్నను వారి హృదయాలు మాత్రం నిశ్చయముగా రోధించు చుండెను. ప్రపంచములో అత్యంత విలువైన వజ్రమును అల్లాహ్ వారికి ప్రసాదించెను. కాని వారు దానిని తమ గృహముల నుండి తీసి పారవేసిరి. ఇప్పుడది అల్లాహ్ కృప, సహాయముతో మరల మక్కాకు వచ్చి యుండెను. తన వాగ్దానము వలన, తన ఇష్టము, సంతోషముతో మక్కాను వదిలి మదీనా తిరిగి పోవుచున్నాడు.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం క్రూర హత్యలు, హింసల వలన కొందరిని హత్య చేయవలెనని తీర్మానించిరి. వారిలో చాలా మందిని పలువురు ముస్లిముల మధ్యవర్తిత్వముతో వారు క్షమించిరి. అటువంటి వారిలోనే అబూజహ్ల్ కుమారుడు ఇక్రమ కూడ వుండెను. ఇక్రమ భార్య హృదయపూర్వకంగా ఇస్లాం స్వీకరించి యుండెను. ఓ రసూలుల్లాహ్!



ఇక్రమను కూడ క్షమించమని ఆమె రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో అనెను. అవును! మేము అతన్ని క్షమించితిమని వారు తెలిపిరి. ఇక్రమ ఎబిసీనియాకు పారిపోవుచుండెను. భార్య తన భర్త ప్రేమలో అతన్ని వెతుకుచు వెంటాడెను. వారు యన్బూ ఓడ రేవు వద్ద ఒక పడవలో కూర్చొని అరబ్‌ను శాశ్వతంగా వీడుటకు సిద్ధముగా నుండిరి. ఇంతలోనే చెరిగిపోయిన తల వెంట్రుకలతో, బాధాతప్త భార్య భయపడుచు సముద్ర తీరమునకు చేరుకొని ఇట్లనెను. ఓ నా చిన్నాన కుమారుడా! (అరబ్ స్త్రీలు తమ భర్తలను చిన్నాన కుమారుడా అని సంబోధించేవారు) ఇంతటి నిర్మల హృదయుడైన, ఇంతటి దయాసాగరున్ని వదిలి నీవెక్కడికి పోవుచున్నావు. ఇక్రమ ఆశ్చర్యముగా తన భార్యను ఇట్లడిగెను. ఇన్ని శతృత్వములకు పాల్పడిన నన్ను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం క్షమించుదురా? ఇక్రమ భార్య ఇట్లనెను. అవును, అవును నేను వారితో వాగ్దానము తీసుకొంటిని. వారు నిన్ను క్షమించిరి. వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చినప్పుడు ఓ రసూలుల్లాహ్! మీరు నా లాంటి వాడిని కూడ క్షమించిరని నా భార్య అంటున్నదని అనెను. వారిట్లనిరి. అవును నీ భార్య చెబుతున్నది నిజమే. మేము నిన్ను క్షమించితిమి. ఇక్రమ ఇట్లనెను. ఇంతటి కఠిన శత్రువులను క్షమించువారు అసత్యులు కాలేరు. అల్లాహ్ ఒక్కడే, అతనికి ఎవరు సమానులు లేరని నేను సాక్ష్యమిచ్చుచున్నాను. ఓ ముహమ్మద్! సల్లల్లాహు అలైహి వసల్లం మీరు అతని దాసులు, అతని ప్రవక్త అని నేను సాక్ష్యమిచ్చుచున్నాను. తర్వాత పశ్చత్తాపముతో తన తల దించుకొనెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని ఈ పశ్చత్తాపమును చూచి, అతని సంతృప్తి కొరకు ఇట్లనిరి. ఇక్రమ మేము నిన్ను క్షమించడమే కాదు నాకు సాధ్యమైనచో నీవు కోరుకున్నది నేడు నీకు నేను బహుకరించెదను. ఇక్రమ ఇట్లనెను. ఓ

రసూలుల్లాహ్! నేను మీతో చేసిన శత్రుత్వములను అల్లాహ్ క్షమించవలెనని మీరు ప్రార్థన చేసినచో ఇంతకంటే ఎక్కువ నేనేమి కోరెదను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్‌ను సంబోధించుచు ఇట్లనిరి. ఓ నా అల్లాహ్! ఇక్రమ నాతో చేసిన శత్రుత్వములన్నిటిని క్షమించుము. అతని నోట వెలువడిన దూషణములన్నిటిని క్షమించుము. ఆ తర్వాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిలబడి తన దుప్పటి తీసి అతనికి కప్పి ఇట్లనిరి. ఎవడేని అల్లాహ్‌ను విశ్వసించి మా వద్దకు వచ్చినచో మా గృహము అతని గృహము, మా ప్రాంతము అతని ప్రాంతమగును.

చాలా సం॥ల క్రితం ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ అనుచరుల ముందు ప్రస్తావించిన భవిష్యవాణి ఇక్రమ విశ్వాసము ప్రకటించడంతో పూర్తయినది. వారిట్లు తెలిపియుండిరి. నేను స్వర్గములో వున్నట్లు స్వప్నములో చూచితిని. అక్కడ నేను ద్రాక్ష గుచ్ఛమును చూచి ఇది ఎవరి కొరకని ప్రజలను ప్రశ్నించితిని. జవాబు చెప్పువాడు ఇది అబూజహ్ల్ కొరకని తెలిపెను. ఈ విషయము నాకు విచిత్రముగా అనిపించి ఇట్లనుకొంటిని. స్వర్గములో విశ్వాసులు తప్ప మరెవ్వరూ ప్రవేశించరు. మరి అబూజహ్ల్ కొరకు ద్రాక్ష ఎట్లు అందించబడెను. ఇక్రమ విశ్వసించినప్పుడు వారిట్లనిరి. ఆ గుచ్ఛము ఇక్రమ కొరకు యుండెను. అల్లాహ్ తనయుని బదులు తండ్రి పేరును చూపించెను. స్వప్నములో తరచుగా అటులనే జరుగును. *(అస్సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 3, పుట 104)*

హత్యాదేశము ఇవ్వబడిన వారిలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కూతురు హజ్రత్ జైనబ్ (రజి) మృతికి కారకుడైన హబ్బార్ కూడ వుండెను. హజ్రత్ జైనబ్ (రజి) ఒంటె తాడును అతడు కత్తిరించినందున హజ్రత్ జైనబ్ (రజి) క్రింద పడిపోయిరి. అందు వలన వారికి



గర్భస్రావం జరిగెను. కొద్ది కాలము తర్వాత ఆమె మృతి చెందిరి. ఇతర నేరములతో పాటు ఈ నేరము వలన కూడ అతడు మరణశిక్షకు అర్హుడయ్యెను. ఈ వ్యక్తి కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లనెను. ఓ దైవ సందేశహరుడా! నేను మీతో పారిపోయి ఈరాన్ వైపు వెళ్ళియుంటిని. అప్పుడు నేనిట్లు ఆలోచించితిని. అల్లాహ్ తన సందేశహరుని ద్వారా మా అన్యారాధ భావాలను దూరము చేసెను. మమ్ములను ఆధ్యాత్మిక వినాశము నుండి రక్షించెను. ఇతరుల వద్దకు పోయే బదులు వారి వద్దకు వెళ్ళి నా నేరములను ఒప్పుకొని క్షమాపణ కోరవలెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఓ హబ్బార్! నీ హృదయంలో అల్లాహ్ ఇస్లాం ప్రేమ పుట్టించినప్పుడు నేను నీ నేరములను ఎందుకు క్షమించను. బాధపడకు నిన్ను నేను క్షమించితిని. నీ గత నేరములను ఇస్లాం అంతమొందించెను.

ఈ అధ్యాయమును పొడిగించుటకు ఇక్కడ అవకాశం లేదు. ప్రమాదకర నేరస్తులను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కొద్ది సాధారణ సాకులతో క్షమించిరి. అధికుల సంఘటనలు బాధాకరమైనను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కరుణించిన తీరును ప్రస్తావించినచో కఠిన మనస్సుగల మానవుడు కూడ ప్రభావితము కాక మానడు.

## హునైన్ యుద్ధము

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాలో అకస్మాత్తుగా ప్రవేశించి యుండిరి. అందుకే మక్కా నుండి కొంత దూరంలో నున్న జాతులు ప్రత్యేకముగా దక్షిణాన వున్న వాటికి వారు మక్కాలో ప్రవేశించిన తర్వాతనే మక్కా పై దాడి వార్త అందినది. ఈ వార్త తెలియగానే వారు సైన్యమును కూడబెట్టడం మొదలు పెట్టి, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి

వసల్లంను ఎదురించుటకు సన్నాహాలు చేయుచుండిరి. హవాజిన్, సఖీఫ్ అను రెండు అరబ్ జాతులు తాము చాలా ధైర్యవంతులమని భావించేవారు. వారు వెంటనే పరస్పరం మాట్లాడుకొని ఒక నాయకున్ని ఎన్నుకొనిరి. అనగా మాలిక్ ఇబ్నె అవుఫ్‌ను తమ నాయకునిగా నియమించుకొనిరి. తర్వాత ఇరుగు పొరుగు జాతులను కూడ తమ వెంట రావాలని ఆహ్వానించిరి. ఈ జాతులలోనే బనూ సాద్ బిన్ బకీర్ కూడ వుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పోషకురాలు హలీమా కూడ ఈ జాతికి చెందిన వారే. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బాల్యము ఈ జాతిలోనే గడిపి యుండిరి. వీరు ఏకమై మక్కా వైపు పయనమైరి. వారు తమ ధనమును, భార్యాపిల్లలను తమ వెంట నిడుకొనిరి. వారిలా ఎందుకు చేశారని వారి నాయకులను ప్రశ్నించినప్పుడు వారిట్లనిరి. మా సైనికులు పారిపోవాలని ఊహించినచో మా భార్యా పిల్లలు బంధించబడుదురు. మా ధనము దోచుకోబడుననే ఆలోచన వారికి వుండవలెను. ఎంత గట్టి పట్టుదలతో ముస్లిములను నాశనము చేయుటకు వారు వెళ్లిరో ఈ విషయము ద్వారా తెలియును. తుదకు ఈ సైన్యము ఓతాస్ లోయలో దిగెను. ఈ లోయ యుద్ధ అవసరాలకు అత్యంత అనుకూలమైనది. ఎందుకనగా ఇందులో ఆశ్రయమునకు స్థలములు యుండెను. పశువులకు మేత, మానవులకు నీరు వుండెను. అశ్వములను పరుగెత్తించుటకు మంచి భూభాగం కూడ వుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయం తెలిసినప్పుడు అబ్దుల్లాహ్ బిన్ అబి హద్‌రద్ (రజి) అను ఒక అనుచరున్ని వాస్తవమును తెలుసుకొనటకు పంపిరి. అవును సైన్యము వచ్చియున్నది, వారు చావో రేవో తేల్చుకొనుటకు సిద్ధమై యున్నారని అబ్దుల్లాహ్ వచ్చి సమాచారమందించిరి. ఇది బాణములు సంధించుటలో నైపుణ్యం గల



జాతి. వీరు బస చేసిన ప్రాంతములో పరిమిత స్థలములోనే యుద్ధము చేయు అవకాశముండెను. ఆ స్థలములో కూడ దాడిచేయువారు సులభముగా బాణములకు గురయ్యే ఆస్కారముండెను. మక్కా నాయకుడు సఫ్వాన్ గొప్ప వ్యాపారి, పెద్ద ధనవంతుడు. అతనితో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ యుద్ధము కొరకు ఆయుధాలు, కొంత ధనము అడిగిరి. సఫ్వాన్ ఇట్లనెను. ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి సల్లం) మీరు మీ ప్రభుత్వ బలముతో నా ధనమును లాక్కొన దలచితిరా? వారిట్లనిరి. మేము లాక్కోదలచలేదు ఋణముగా అడుగుచున్నాము. ఇందుకు జామీను ఇచ్చుటకు సిద్ధముగా వున్నాము. అట్లయినచో మీరు నాతో ఈ వస్తువులు తీసుకోగలరు. ఒక వంద రక్షణ కవచములు, దానికి తగిన ఆయుధాలు, అరువుగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఇచ్చెను. ఇంకను 3 వేల రూ॥లు రుణం కూడ ఇచ్చెను. అలాగే తన చిన్నాన కుమారుడు నౌఫల్ బిన్ హారిస్ తో కూడ 3 వేల బల్లెములు వారు (స) ఋణముగా తీసుకొనిరి. ఈ సైన్యము హవాజిన్ వైపు బయలు దేరినప్పుడు మేము ముస్లిములము కాకున్నను ఇప్పుడు ఇస్లాం ప్రభుత్వములో చేరినందున మాకు కూడ ఈ యుద్ధములో పాల్గొనే అవకాశం ఇవ్వగలరని మక్కా వాసులు అనిరి. మక్కా నుండి 2 వేల మంది వారి వెంట బయలు దేరిరి. మార్గములో జాతె అన్వాత్ అను ఒక అరబ్ ప్రఖ్యాత సందర్శన స్థలము వచ్చును. ఇదొక పురాతన రేగి చెట్టు. అరబ్బులు దీనిని పవిత్రముగా భావించేవారు. అరబ్ వీరులు ఎవరైనా ఆయుధములు కొనుగోలు చేసినచో శుభము పొందుటకు జాతె అన్వాత్‌లో మొదట వేలాడ దీసేవారు. అనుచరులు దాని సమీపము నుండి వెళ్లినప్పుడు కొందరు ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! మా కొరకు కూడ ఒక జాతె అన్వాత్‌ను నియమించుము. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి.

అల్లాహ్ గొప్పవాడు. ఈ విషయము మూసా (అ) జాతిని పోలి యున్నది. వారు కన్‌ఆన్ వైపు వెళ్లుచున్నప్పుడు కన్‌ఆన్ జాతులను విగ్రహారాధన చేయుచుండగా చూచిరి. అప్పుడు వారు మూసా (అ) ను సంబోధించుచు ఇట్లనిరి. يٰمُوْسَى اجْعَلْ لَّنَآ اِلٰهًا كَمَا لَهُمْ اٰلِهَةٌ ؕ అనగా ఓ మూసా (అ) ! వీరికి ఆరాధ్య దైవములు వున్నట్లు మా కొరకు కూడ ఆరాధ్య దైవములను సూచించుము. ఇవి మూర్ఖత్వపు మాటలు. ఇటువంటి అపోహల వలన మీలో ఒక వర్గము ఈ విధమైన కార్యములకు సిద్దపడునని నేను భయపడుచున్నాని వారనిరి.

హవాజిన్, వారి మిత్ర పక్ష జాతులు నేటి కాలములోని గుప్త కందకముల వలె ముస్లిములపై దాడి చేయుటకు ఒక స్థావరం ఏర్పాటు చేసియుండిరి. ముస్లిముల సైన్యము హునైన్ ప్రాంతమునకు చేరుకోగా వారి ముందు చిన్న చిన్న పిట్టగోడ ఏర్పాటు చేసుకొని వాటి వెనుక వారు దాగి మధ్యలో ఒక చిన్న దారి ముస్లిములకు వదిలిపెట్టిరి. అధిక సైనికులు ఈ స్థావరాల వెనుక దాక్కొనగా కొందరు ఒంటెల ముందు వరుసలలో నిలబడిరి. ముందు నిలుచున్నదే సైన్యమని భావించి ముస్లిములు ముందుకు వెళ్ళి దాడి చేసిరి. ముస్లిములు చాలా ముందుకు వెళ్ళిన తర్వాత వెనుక వున్న శత్రువుల సైనికులు ఇప్పుడు మనము మంచిగా దాడి చేయవచ్చునని భావించిరి. ముందు నిలిచివున్న సైనికులు ముందు నుండి దాడి చేసిరి. ఇరు వైపుల దాగి వున్న విల్లుకారులు ఏకధాటిగా బాణములు కురిపించడం మొదలు పెట్టిరి. నేడు ధైర్యము ప్రదర్శించే అవకాశము మాకు కూడ లభించునని వచ్చిన మక్కా ప్రజలు ఈ ఇరువైపుల దాడిని తట్టుకోలేక తిరిగి మక్కాకు పరారైరి. ఇటువంటి కష్టములను ఎదుర్కొనే అనుభవం ముస్లిములకు యుండెను. కాని 2 వేల అశ్వములు, ఒంటెలు వారి వరుసలలో నుండి పారిపోయినప్పుడు వారి అశ్వములు,



ఒంటెలు కూడ భయపడెను. మొత్తం సైన్యము భయపడి వెనక్కి పరుగెత్తెను. మూడు వైపుల దాడిలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారితో కేవలం 12 మంది అనుచరులు మాత్రమే నిలిచిరి. అనగా అనుచరులందరు పారిపోలేదు. సుమారు వంద మంది కూడ మైదానములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు కొంత దూరములో వుండిరి. వారి చుట్టు సుమారు 12 మంది మాత్రమే వుండిరి. అప్పటి దుస్థితిని ఒక అనుచరుడు ఇట్లు తెలిపెను. నేను నా సహచరులము మా వాహనములు యుద్ధ రంగము వైపు వచ్చుటకు ఎంతో ప్రయత్నించి యుంటిమి. కాని 2 వేల ఒంటెలు పరుగెత్తినందున మా వాహనములు బెదిరినవి. ముకుతాళ్ళను లాగి లాగి మా చేతులు గాయపడినవి. కాని ఒంటెలు, అశ్వములు తిరిగి వచ్చుటకు సిద్ధపడలేదు. ఒక్కో సారి మేము గట్టిగా లాగడం వలన వాటి తల భాగము వీపులకు తాకేది. కాని మేము వాటిని వెనక్కి యుద్ధ మైదానము వైపు పరుగెత్తించుటకు ప్రయత్నించినప్పుడు అవి అంతే వేగంతో ముందుకు సాగిపోయేవి. వెనుక రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పరిస్థితి ఏమిటని మేము చింతించుచుంటిమి. కాని మేము నిస్సహాయుల మైపోయితిమి. ఇటు అనుచరుల పరిస్థితి ఇట్లుండగా అటు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కేవలం కొద్ది మందితో యుద్ధ రంగములో నిలబడియుండిరి. కుడి, ఎడమ, ముందు అనగా మూడు వైపుల నుండి బాణములు పడుచుండెను. వెనుక ఒక ఇరుకైన దారి మాత్రమే యుండెను. దాని నుండి ఏక కాలంలో అతి కొద్ది మంది మాత్రమే వెళ్లగలరు. అయినను ఈ దారి తప్ప మోక్షమునకు మరో మార్గము లేకుండెను. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) తన వాహనము దిగి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కంచరగాడిద ముకుతాడును పట్టుకొని ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్!

కొద్ది సమయము కొరకు వెనక్కి రండి. ఇంతలో మన ఇస్లామి సైన్యము ఏకమగును. వారిట్లనిరి. ఓ అబూబకర్ (రజి) నా కంచర గాడిద ముకుతాడు వదులుము. కంచర గాడిదను పరుగెత్తించి అదే ఇరుకైన దారి వైపు వారు వెళ్లసాగిరి. దానికి ఇరు వైపు స్థావరాలలో వున్న సైనికులు బాణములు విసురుచుండిరి. అప్పుడు వారు (స) ఇట్లనిరి

انا النبی لا کذب انا ابن عبدالمطلب

అనగా నేను దైవ సందేశహరుడను. అసత్యుడను కాను. కాని ఇది కూడ గుర్తుంచుకొనుము. ఇప్పుడు ప్రమాదకర ప్రదేశమున నిలిచి శత్రువు దాడి నుండి సురక్షితంగా వున్నానంటే నేను దైవమనే అర్థము కాదు, నేను మానవుడనే, అబ్దుల్ ముత్తలిబ్ మనుమడిని. చాలా పెద్ద ధ్వని గల హజ్రత్ అబ్బాస్ (రజి) ను ముందుకు పిలిచి ఇట్లనిరి. అబ్బాస్! గట్టిగా చాటింపు చేయుము. హుదైబియా రోజున వృక్షము క్రింద ప్రతిజ్ఞ చేసిన అనుచరులారా! అల్ బఖరహ్ అధ్యాయము కాలము నుండి ముస్లిములుగా నున్న ప్రజలారా! అల్లాహ్ ప్రవక్త మిమ్ములను పిలుచుచున్నాడు. హజ్రత్ అబ్బాస్ (రజి) పెద్ద ధ్వనితో గట్టిగా ఈ చాటింపు చేయగానే అనుచరులలో ఏర్పడిన స్థితిని వారి నోట వెలువడిన మాటలను విని అంచనా వేయవచ్చును. నేను పైన ప్రస్తావించిన అనుచరులే ఇట్లు తెలిపిరి. ఒంటెలను, అశ్వములను వెనక్కి తీసుకొచ్చు ప్రయత్నములో మేముండగా అబ్బాస్ (రజి) పిలుపు మా చెవులలో పడెను. అప్పుడు మేము ఈ ప్రపంచములో లేము. ప్రళయ దినమున అల్లాహ్ ముందున్నాము. మా లెక్కలు సమర్పించుటకు దేవదూతలు మమ్ము పిలుచుచున్నారని మేము భావించితిమి. అప్పుడు మాలో కొందరు తమ ఖడ్గములు, ఢాల్లు తమ చేతులలో తీసుకొని ఒంటెల నుండి దూకిరి. బెదిరిన ఒంటెలను అవి



ఇష్టానుసారం ఎక్కడికైనా వెళ్లవచ్చునని వదిలిరి. కొందరు తమ ఖడ్గములతో తమ ఒంటెల మెడలు కోసివేసి స్వయంగా తాము పాదచారులుగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వైపు పరుగెత్తిరి. ఒంటెలు, ఆవులు తమ పిల్లల ఏడ్పు విని పరుగెత్తునట్లు అనుచరులు ప్రత్యేకముగా అన్సార్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వైపు పరుగెత్తుచు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు చేరినందున శత్రువు పరాజయము పాలయ్యెను.

ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర శక్తికి నిదర్శనమేమనగా కొన్ని రోజుల క్రితం వారి ప్రాణ శత్రువుగా వుండి, వారికెదురుగా అవిశ్వాస సైన్యములకు సారథ్యం వహించిన అబూసుఫ్యాన్ నేడు హునైన్ దినమున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట వుండెను. అవిశ్వాసుల ఒంటెలు వెనక్కి పరుగెత్తినప్పుడు చాలా వివేకము, దూరదృష్టి గల అబూసుఫ్యాన్ తన అశ్వము బెదిరిపోవుననే ఆలోచనతో వెంటనే తన అశ్వము దిగి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కంచరగాడిద తాడు పట్టుకొని వారి వెంట నడవడం మొదలు పెట్టెను. అబూసుఫ్యాన్ ఇట్లు తెలిపెను. అప్పుడు నా చేతిలో నగ్న ఖడ్గముండెను. మనసులోని రహస్యాలను ఎరుగు అల్లాహ్ ప్రమాణముగా నన్ను హత్య చేయనిదే ఎవరు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకోలేరనే దృఢ సంకల్పంతో నేను ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గాడిద ప్రక్కన నిలిచివుంటిని. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నన్ను ఆశ్చర్యముగా చూచుచుండిరి. (బహుశ వారు ఆలోచించవచ్చు కేవలం 10, 15 రోజుల క్రితం ఇతడు తన సైన్యము తీసుకొని నన్ను హతమార్చుటకు మక్కా నుండి బయలు దేరి యుండెను. కాని అతి కొద్ది

రోజులలోనే అల్లాహ్ ఇతనిలో ఇంత మార్పు తెచ్చెను. మక్కా సేనాపతి నేడు ఒక సామాన్య సైనికునిగా నా గాడిద తాడు పట్టుకొని నిలబడెను. తన ప్రాణత్యాగముతో తన నేరములను క్షమింప జేసుకోవాలనే కోరిక అతనిలో వున్నట్లు అతని ముఖముతో స్పష్టమగుచుండెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆశ్చర్యముతో అబూసుఫ్యాన్‌ను చూచుచుండగా అబ్బాస్ (రజి) గమనించి ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! ఈ అబూసుఫ్యాన్ మీ చిన్నాన్న కుమారుడు, మీ సోదరుడు నేడు మీరు ఇతనితో సంతోష పడుము! ఇతను నాతో చేసిన శత్రుత్వములన్నిటిని అల్లాహ్ క్షమించుగాక! అని వారు ప్రార్థించిరి. అబూసుఫ్యాన్ ఇట్లనెను. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఓ సోదరుడా! అని నన్ను సంబోధించినప్పుడు నేను వెంటనే అమిత అభిమాన ఉత్సాహము వలన గాడిద పళ్ళెములో నున్న వారి పాదమును చుంబించితిని.

మక్కా విజయము తర్వాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఋణముగా తీసుకున్న యుద్ధ సామాగ్రిని వాటి యజమానులకు తిరిగిచ్చిరి. వాటితో పాటు చాలా బహుమానము, కానుకలు కూడ ఇచ్చినప్పుడు వీరు నేటి కాలపు సాధారణ మానవులలోని వారు కారని భావించి సఫ్వాన్ వెంటనే ఇస్లాం స్వీకరించెను.

ఈ యుద్దమునకు సంబంధించిన మరో విచిత్ర సంఘటన కూడ చరిత్రలో ఇట్లు గలదు. ఖానాకాబా సేవకుడిగా నియమితుడైన మక్కా నివాసి షైబా నామము గల ఒక వ్యక్తి ఇట్లు తెలిపెను. నేను కూడ ఈ యుద్ధములో పాల్గొంటిని. ఇరు సైన్యములు భీకర పోరులో వుండగా అవకాశము లభించగానే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను హత్య చేయాలనే ఉద్దేశము నాకుండెను. అరబ్, అరబ్బేతర ప్రజలు, తుదకు ప్రపంచమంత ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి



వసల్లం ధర్మములో చేరినను నేను మాత్రం చేరనని మనస్సులో అనుకొంటిని. యుద్ధము వేగము పుంజుకున్న తర్వాత ఇటున్న వారు అటు, అటున్నవారు ఇటు కలిసిపోగానే ఖడ్గము పైకి లేపి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను సమీపించుటకు ప్రయత్నించినప్పుడు వారికి నాకు మధ్య మండుతున్న ఒక అగ్ని జ్వాల నన్ను భస్మము చేయునట్లు కనిపించెను. అప్పుడు 'షైబా! నా దగ్గరికి రా!' అను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పిలుపు నాకు వినిపించెను. నేను దగ్గరికి చేరినప్పుడు వారు నా యదపై హస్తము వాల్చి ఇట్లనిరి. ఓ అల్లాహ్! షైబాకు దుష్ట ఆలోచనల నుండి విముక్తి కల్పించుము. షైబా ఇట్లనెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హస్తము నా యదపై పడగానే నా హృదయము నుండి మొత్తం శత్రుత్వము, ద్వేషము ఆవిరై పోయెను. అప్పటి నుండి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నా నేత్రములు, నా చెవులు, నా ప్రాణము కంటే అధిక ప్రియులైరి. మరల వారిట్లనిరి. ఓ షైబా! ముందుకు వెళ్లి యుద్ధము చేయుము. అప్పుడు నేను ముందుకు వెళ్లి నా ప్రాణాలను ఫణంగా పెట్టి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను రక్షించాలనే కోరిక తప్ప మరేమి లేకుండెను. అప్పుడు నా తండ్రి బ్రతికి వుండి నా ముందు వచ్చినచో నేను నా ఖడ్గమును అతని యదలో దింపుటకు ఏ మాత్రం సంకోచించేవాడిని కాదు.

*(సీరత్ ఇబ్నె హష్షామ్ సంపుటి3 పుట 9, జాదుల్ మఆద్ సూచన జర్ఖాని సంపుటి 4, పుట 465)*

ఆ తర్వాత వారు తాయిఫ్ నగరము వైపు బయలు దేరిరి. ఈ నగర పౌరులే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను రాళ్ళతో కొట్టి తమ నగరము నుండి వెళ్లగొట్టి యుండిరి. కొంత కాలము వరకు ఈ నగరమును వారు ముట్టడించిరి. కాని కొందరు వారికి ఇట్లు సలహా

ఇచ్చిరి. మొత్తం అరబ్‌లో ఈ ఒక్క నగరము ఏమి చేయగలదు, కనుక దీనిని ముట్టడించి సమయం వృధా చేయవలసిన అవసరం లేదు. కావున వారు ముట్టడిని ఎత్తివేసి తిరిగి వచ్చేసిరి. కొంత కాలము తర్వాత తాయిఫ్ ప్రజలు కూడ ఇస్లాంలో చేరిరి.

## మక్కా విజయము, హునైన్ తర్వాత

ఈ యుద్ధములను ముగించుకొనిన తర్వాత పరాజిత శత్రువుల పరిహారము, యుద్ధ రంగములో వదిలిపెట్టబడిన వస్తువుల ద్వారా ప్రోగైన ధనమును గత ఆచారము ప్రకారము ముస్లిం సైన్యములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పంచి పెట్ట వలసి యుండెను. కాని ఈ సందర్భముగా ముస్లిములలో పంచే బదులు మక్కా, చుట్టు ప్రక్కల ప్రజలలో పంచి పెట్టిరి. వీరిలో ఇంకా విశ్వాసము బలపడలేదు. అనేకులు ఇంకా అవిశ్వాసులుగానే యుండిరి. ముస్లిములైన వారు కూడ క్రొత్త క్రొత్త ముస్లిములుగనే యుండిరి. ఒక జాతి తన ధనమును మరొక జాతిలో పంచడమనేది వారికి కొత్తగా అనిపించెను. ఈ ధనమును పంచడంతో వారి హృదయములో పుణ్యము, ధార్మికత పెరిగే బదులు వారిలో ధనాపేక్ష మరింత బలపడెను. వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చుట్టు చేరి ఇంకా ఇవ్వాలని కోరుచు ఇబ్బంది పెట్టడం ప్రారంభించిరి. వారు వారిని నెట్టుచూ వెనుక వున్న ఒక వృక్షము వద్దకు తీసుకెళ్ళిరి. వారిలోని ఒక వ్యక్తి వారి భుజాలపై నున్న దుప్పటిని పట్టుకొని గట్టిగా లాగడంతో వారికి శ్వాస ఆడడం కష్టమయ్యెను. వారిట్లనిరి. ఓ ప్రజాలారా! నా వద్ద ఇంకా ఏదైనా వున్నచో నేను దానిని కూడ మీకు ఇచ్చేవాడిని. మీరు నన్ను లోభితనము, అధైర్యము గల మనిషిగా పొందలేరు. తర్వాత వారు తన ఒంటె వద్దకు వెళ్లి దాని ఒక కేశము తెంపి, దానిని పైకి లేపి ఇట్లనిరి. ఓ ప్రజలారా! మీ ధనములలో అరబ్ చట్టము ప్రకారము ప్రభుత్వ



5వ భాగము తప్ప ఈ కేశమునకు సమానము కూడ నాకు అవసరం లేదు. ఆ 5వ భాగమును కూడ నేను నా వ్యక్తిగత అవసరాల కొరకు వినియోగించక అది కూడ మీ జాతీయ కార్యములపై వినియోగించ బడును. గుర్తుంచుకొనుము! దుర్వినియోగమునకు పాల్పడిన మనిషి ప్రళయ దినమున ఆ దుర్వినియోగము వలన అల్లాహ్ ఆస్థానములో అవమానితుడగును. *(అస్సీరతుల్ హల్బియ్యహ్: సంపుటి 3 పుట 135)*

ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం రాజరికము కోరుకునే వారని కొందరందురు. రాజుల, ప్రజల మధ్య ఇటువంటి సంబంధముండునా? రాజును ఈ విధంగా నెట్టి, మెడలో దుప్పటి వేసి శ్వాస ఆడని విధంగా లాగే ధైర్యము ఎవరికైనా వుండునా? అల్లాహ్ ప్రవక్తలు తప్ప ఎవరు ఇటువంటి ఉదాహరణ చూపగలరు. ధనమంత పేదలలో ఈ రకంగా పంచి పెట్టినను, కొందరు కఠిన హృదయులు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం న్యాయముగా పంచలేదని భావించేవారు. జుల్ ఖువైసిర నామము గల ఒక వ్యక్తి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లనెను. ముహమ్మద్! (సల్లల్లాహు అలైహి వసల్లం) నేడు మీరు చేసినది నేను చూచితిని. నీవు ఏమి చూచితివని వారని నప్పుడు నేడు మీరు దౌర్జన్యము చేసిరి. అన్యాయముతో వ్యవహరించి నట్లు నేను చూచితినని అతడనెను. వారిట్లనిరి. నీపై విచారము! నేను న్యాయము చేయనిచో ప్రపంచములో మరే మానవుడు న్యాయము చేయును. అప్పుడు అనుచరులు ఉద్రేకముతో నిలబడిరి. అతడు మస్జిద్ నుండి బయటికి వెళ్లినప్పుడు వారిలో కొందరు ఇట్లనిరి. ఈ వ్యక్తి హత్యాశిక్షకు అర్హుడు. ఇతన్ని హతమార్చు అనుమతి మీరు మాకు ఇవ్వగలరా! వారిట్లనిరి. ఈ వ్యక్తి చట్టమును పాటించినచో ఇతన్ని మనమెలా హత్యచేయుదుము. అనుచరులు ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్!

ఒక వ్యక్తి బహిరంగంగా ఒక ఆలోచన, అంతర్గతంగా మరో ఆలోచన కలిగి వున్నప్పుడు శిక్షకు అర్హుడు కాడా? రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ప్రజల హృదయాల ఆలోచనల ప్రకారము వ్యవహరించుటకు అల్లాహ్ నన్ను ఆజ్ఞాపించలేదు. ప్రజల బహిరంగమును బట్టి వ్యవహరించవలెనని నేను ఆదేశించబడితిని. మరల వారిట్లనిరి. ఇతడు, ఇతని సహచరులు ఒక రోజు ఇస్లాం నుండి తిరుగుబాటుకు పాల్పడుదురు. కనుక హజ్రత్ అలి (రజి) కాలములో వారికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు పాల్పడిన ప్రజలకు ఇతను, ఇతని జాతికి చెందిన ప్రజలు నాయకులై యుండిరి. వీరు ఖవారిజ్ పేరున నేటికి సుపరిచితులే.

హవాజిన్ పని ముగించుకొని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు పోయిరి. ఇది మదీనా ప్రజలకు మరో ఆనందకరమైన రోజు. మక్కా ప్రజల దౌర్జన్యములను తాళలేక ఒక మారు అల్లాహ్ ప్రవక్త మదీనా వైపు వచ్చియుండిరి. నేడు అల్లాహ్ ప్రవక్త మక్కాను జయించిన తర్వాత సంతోషముగా తన వాగ్దానమును నిలబెట్టుకొనుటకు ఇప్పుడు రెండవ సారి మదీనాలో ప్రవేశించుచుండిరి.

## తబూక్ యుద్ధము

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాను జయించి నప్పుడు ఖజ్రజ్ జాతికి చెందిన అబూ ఆమిర్ అను వ్యక్తి యూదులు, క్రైస్తవులతో మిత్రుత్వము వలన కొన్ని దైవస్మరణ పద్ధతులకు అలవాటు పడెను. అందుకే ఇతన్ని ప్రజలు సన్యాసి అని గుర్తు చేసుకునేవారు. కాని మతపరంగా క్రైస్తవుడు కాకుండెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా చేరుకున్నప్పుడు ఈ వ్యక్తి మక్కా పారిపోయి యుండెను. ఇప్పుడు మక్కా కూడ జయించబడినందున ఇస్లాంనకు విరుద్ధముగా అశాంతి కలిగించుటకు మరో కుట్ర చేయాలని ఈ వ్యక్తి ఆలోచించెను.



ఇందుకు అతను తన పేరు, విధానము మార్చుకొని మదీనా సమీపమున ఖుబా నామము గల గ్రామంలోకి వెళ్ళి వుండడం మొదలు పెట్టెను. సంవత్సరాల తరబడి బయట వున్నందున, జీవన శైలి, దుస్తులలో మార్పు చేసుకున్నందుకు మదీనా ప్రజలు అతన్ని గుర్తించలేక పోయిరి. అతడు సంబంధము ఏర్పరచుకున్న దాంబికులు మాత్రమే అతన్ని గుర్తుపట్టేవారు. అతడు మదీనా దాంబికులతో కలిసి ఇట్లు నిర్ణయించెను. నేను సీరియా వెళ్లి క్రైస్తవ ప్రభుత్వము, అరబ్ క్రైస్తవ జాతులను ప్రేరేపించి మదీనాపై దాడికి సన్నద్ధం చేయుదును. ఇటు మీరు సీరియా సైన్యములు మదీనాపై దాడి చేయుచున్నాయని అపోహలు సృష్టించుము. నా పథకం సఫలమైనచో వీరిద్దరి మధ్య యుద్ధము సంభవించును. నా పథకం విఫలమైనను మీరు సృష్టించిన అపోహల వలన బహుశ ముస్లిములే వెళ్లి సీరియాపై దాడి చేయవచ్చు. ఖైసర్ ప్రభుత్వము, వీరి మధ్య యుద్ధము ప్రారంభమై మన లక్ష్యము నెరవేరును. ఈ విధంగా దాంబికులను సిద్ధము చేసి అతను సీరియా వెళ్లిపోయెను. ఇటు దాంబికులు ప్రతి రోజు మాకు తారసపడిన ఫలానా బృందం సీరియా సైన్యము మదీనాపై దాడి చేయుటకు సన్నాహాలు చేయుచున్నదని చెప్పినట్లు వార్తలు వ్యాపింపజేయడం మొదలు పెట్టిరి. రెండవ రోజు మరల మాకు ఫలానా బృంద సభ్యులు కలిసి సీరియా సైన్యము మదీనాపై దాడి చేయుటకు సన్నద్ధమగుచున్నదని చెప్పినట్లు చెప్పేవారు. ఈ వార్తలు గట్టిగా వ్యాపించినందున ఇస్లామి సైన్యమును తీసుకొని స్వయముగా వెళ్లి సీరియా సైన్యములను ఎదుర్కొన వలెనని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం భావించిరి. ముస్లిములకు ఈ సమయము ఎంతో కష్టకాలముగా వుండెను. కరువు సంవత్సరమై యుండెను. క్రితం సారి ధాన్యము, ఫలములు తక్కువ వచ్చి యుండెను. ఈ సారి పంటకు ఇంకా సమయముండెను. సెప్టెంబర్ చివర లేదా

అక్టోబర్ ఆరంభములో వారు ఈ మహత్కార్యమునకు పయనమైరి. ఇదంతా ఒక కుట్ర అని దాంబికులకు తెలిసి యుండెను. సీరియా సైనికులు దాడికి రానిచో ముస్లిములే వెళ్ళి సీరియావారితో యుద్ధము చేసి నాశనం కావలెనని వారు ఈ పన్నాగం పన్నిరి. మౌతా యుద్ధ సంఘటనలు వారి ముందుండెను. అప్పుడు చాలా పెద్ద సైన్యముతో ముస్లిములు తారసపడి అపార నష్టముతో అతి కష్టం మీద తిరిగి వచ్చిరి. ఇప్పుడు వారు మరో మౌతాను తమ కనులతో చూడాలని, నవూజుబిల్లాహ్ ఇందులో స్వయాన రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ అమరులు కావాలని వారు కోరి యుండిరి. అందుకే ఒక వైపు శత్రువు దాడికి దిగునట్లు మాకు ఆ బృందంతో తెలిసినది. సీరియా సైన్యములు దాడికి వచ్చుచున్నారని మరో బృందం చెప్పినట్లు అపోహలు కల్పించు చుండిరి. రెండవ వైపు అంత పెద్ద సైన్యమును ఎదుర్కొనుట సులభం కాదు కావున మీరు యుద్ధమునకు వెళ్ళకూడదని ముస్లిములను భయపెట్టు చుండిరి. ఈ విధముగా ముస్లిములు యుద్ధమునకు వెళ్ళవలెను కాని సాధ్యమైనంత వరకు తక్కువ సంఖ్యలో వెళ్ళితే ఓటమి తప్పదని వారి ఈ కార్యముల ఉద్దేశమై యుండెను. మనము సీరియా వైపు పోవు చున్నామనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రకటనపై నిష్కపటము, ఉద్రేకముతో ముస్లిములు పోటా పోటీగా త్యాగములు చేయుచుండిరి. నిరుపేద ముస్లిముల వద్ద యుద్ధ సామాగ్రి ఏముండెను? ప్రభుత్వ కోశాగారములో ఏమి లేకుండెను. వారిలో ధనిక సోదరులే వారికి సహాయము చేయవచ్చును. అందుకే ప్రతి ఒక్కరు త్యాగములో ఒకరిని మించి మరొకరు ముందుకు వచ్చుచుండిరి. హజ్రత్ ఉస్మాన్ (రజి) తన ధనములోని అధిక భాగము ఒక వెయ్యి స్వర్ణ దీనార్లు అనగా సుమారు 25 వేల రూపాయలు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు



సమర్పించిరి. ఇతర అనుచరులు కూడ తమ తమ సామర్థ్యమును బట్టి విరాళాలు అందజేసిరి. పేద ముస్లిముల కొరకు వాహనములు, ఖడ్గములు, బల్లెములు సమకూర్చబడెను. అనుచరుల త్యాగస్ఫూర్తికి ఈ క్రింది సంఘటన నిదర్శనము. ఇస్లాంలో చేరిన కొందరు యమన్ దేశస్తులు మదీనాకు ప్రస్థానము చేసిరి. వారు చాలా నిరుపేదలు. వారిలో కొందరు వచ్చి ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్ ! మమ్ములను కూడ తమతో తీసుకెళ్ళుము. మేము అక్కడికి చేరుకునే వస్తువులు తప్ప మేమేమి కోరడం లేదు. వీరి ప్రస్తావన పవిత్ర ఖురాన్‌లో ఇట్లు గలదు. (అత్తౌబహ్: 92)

وَّلَا عَلَى الَّذِيْنَ اِذَا مَآ اَتَوْكَ لِتَحْمِلَهُمْ قُلْتَ لَا اَجِدُ مَآ اَحْمِلُكُمْ عَلَيْهِ
تَوَلَّوْا وَّاَعْيُنُهُمْ تَفِيْضُ مِنَ الدَّمْعِ حَزَنًا اَلَّا يَجِدُوْا مَا يُنْفِقُوْنَ۝ (الرعد:٩٢)

అనగా ఈ యుద్ధములో పాల్గొనని వారిది ఏ తప్పులేదు. ఎందుకనగా యుద్ధములో పాల్గొనుటకు ఏదేని వాహనముపై ఎక్కించుకొమ్మని నిన్ను అడుగుచు వారు నీ వద్దకు వచ్చిరి. సమాధానముగా వారితో నీవు ఇట్లందువు. మిమ్ములను ఎక్కించుకొనుటకు నా వద్ద ఏమియును లేదు. ఇది విని అల్లాహ్ మార్గములో ఖర్చు చేసి నేడు ఇస్లాం సేవ చేయుటకు వారి వద్ద ఏమియును లేదని వారు శోకించుచు, వారి కనుల వెంట కన్నీరు కారుచుండగా, నీ సమావేశము నుండి వారు తిరిగి పోయిరి. మీరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఏమేమి అడిగితిరని వీరి నాయకుడు అబూ మూసా (రజి) ను ఒకరు ప్రశ్నించగా వారిట్లనిరి. అల్లాహ్ ప్రమాణము! మేము ఒంటెలు, అశ్వములు కోరలేదు. మేము బత్తెల పాదాలతో వున్నామని ఇంత దూర ప్రయాణము పాద రక్షలు లేనిదే చేయలేమని మాకు కేవలము పాదరక్షలు సమకూర్చినచో మేము కూడ మా సోదరుల వెంట పరుగెత్తి ఈ యుద్ధములో పాల్గొనెదమని

మేము కోరియుంటిమి. సైన్యము సీరియా వెళ్లవలసి యుండెను. మౌతా యుద్ధ దృశ్యము ముస్లిముల కనుల ముందుండెను. అందుకే ప్రతి ముస్లిం హృదయములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రాణ రక్షణ ఆలోచన అన్నిటికంటే ప్రాధాన్యము సంతరించుకొనెను. స్త్రీలు కూడ ఈ ప్రమాదమును గుర్తించి తమ భర్తలను, తనయులను యుద్ధములో పాల్గొనుటకు ఆజ్ఞాపించుచుండిరి. ఈ ఉత్సాహము, ఉద్రేకమును ఈ క్రింది సంఘటనతో అంచనా వేయవచ్చును. ఏదో ఒక పని మీద ఒక అనుచరుడు బయటికి వెళ్లియుండెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సైన్యముతో మదీనా నుండి పయనమైన తర్వాత అతడు తిరిగి వచ్చెను. తన ప్రియురాలైన భార్యను చూచి ఆనందపడదామనే ఆలోచనతో కొంత కాలము విడిగా వున్న అతడు ఇంట్లో ప్రవేశించినప్పుడు తన భార్యను వాకిట్లో కూర్చొన్నట్లు చూచెను. ప్రేమతో ఆలింగనమగుటకు, ఆమెను ప్రేమించుటకు వేగముగా ఆమె వైపు ముందుకొచ్చెను. అతడు తన భార్యను సమీపించగానే ఆమె తన రెండు చేతులతో వారిని నెట్టి వెనక్కి జరిపెను. ఆ అనుచరుడు చాలా ఆశ్చర్యముతో తన భార్య ముఖము చూచి ఇట్లడిగెను. ఇంత కాలము తర్వాత కలిసినప్పుడు ఈ వ్యవహారము ఎందుకు? భార్య ఇట్లనెను. నీకు సిగ్గులేదా ! అటు అల్లాహ్ ప్రవక్త అపాయకర ప్రాంతమునకు పోవుచున్నారు. ఇటు నీవు నీ భార్యతో ప్రేమ వ్యవహారం నడుపుటకు సాహసించితివా ? ముందు తన కర్తవ్యమును నెరవేర్చుము. ఆ తర్వాత ఈ విషయములు చూసుకోబడును. ఆ అనుచరుడు వెంటనే ఇంట్లో నుండి బయటికి వచ్చి తన వాహనమును సిద్దము చేసుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను మూడు మైళ్ళ దూరాన కలుసుకొనెను.

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ అపోహల వలన



ప్రణాళికరహితముగానే సీరియా సైన్యములపై దాడి చేయుదురని అవిశ్వాసులు భావించియుండిరి. కాని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లాం నియమములను పాటించేవారు. వారు సీరియా సమీపమున తబూక్ ప్రాంతమునకు చేరుకొనినప్పుడు వాస్తవమును తెలుసుకొనుటకు నలు వైపులలో దూతలను పంపిరి. ఇప్పుడు ఏ సీరియా సైన్యము ఏకము కావాడం లేదని ఈ దూతలందరు ఏకగ్రీవ వార్తలతో వచ్చిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడ కొన్ని రోజులు బస చేసి చుట్టు వున్న కొన్ని జాతులతో ఒప్పందము కుదుర్చుకొని యుద్ధము చేయక తిరిగి వచ్చిరి.

ఈ ప్రయాణము దాదాపు 2, రెండున్నర నెలలు సాగినది. ఎటువంటి యుద్ధము సంభవించక, ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం క్షేమముగా తిరిగి వచ్చుచున్నారని మదీనా దాంబికులు తెలుసుకొనిరి. మా దాంబిక కుట్రల రహస్యము ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిసినది కనుక ఇప్పుడు మాకు శిక్ష తప్పదని వారు ఊహించిరి. అప్పుడు మదీనా నుండి కొంత దూరాన ఒక్క వాహనము మాత్రమే వెళ్లగలిగే అతి ఇరుకైన దారిలో కొందరిని కూర్చొబెట్టిరి. ఆ ప్రాంత సమీపమునకు వారు చేరుకొన్నప్పుడు శత్రువు దారిలో ఇరువైపులా దాక్కున్నాడని అల్లాహ్ సువార్త వాణి ద్వారా వారికి తెలిపెను. అక్కడికి వెళ్లి చూడమని ఒక అనుచరున్ని వారు ఆదేశించిరి. వారు వేగంగా పరుగెత్తి అక్కడకి చేరుకోగా దాడికి పాల్పడే సైనికుల వలె కొందరు రహస్యముగా కూర్చున్నట్లు వారు చూచిరి. వారు చేరుకొనగా వారు అక్కడి నుండి పారిపోయిరి. కాని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వారిని వెంటాడుటను సమంజసముగా భావించలేదు.

వారు మదీనా చేరుకొనగా ఈ యుద్ధములో పాల్గొనని దాంబికులు

వివిధ సాకులు చెప్పడం మొదలు పెట్టిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వారిని మన్నించిరి. కాని దాంబికుల వాస్తవమును ముస్లిములపై బహిర్గతము చేయవలసిన సమయము ఇప్పుడు వచ్చెను. ప్రార్థన పేరుతో సమావేశమై అక్కడ దాంబిక అభిప్రాయములు సేకరించుటకు దాంబికులు నిర్మించిన ఖుబా అను మస్జిద్‌ను నేలమట్టం చేయాలని, ఇతర ముస్లిముల మస్జిద్‌లలో ప్రార్థన చేయుటకు వారిని బలవంతము చేయవలెనని అల్లాహ్ సువార్త వాణి ద్వారా వారిని ఆదేశించెను. ఇంత పెద్ద కుట్రకు పాల్పడినను వీరికి ఎలాంటి శారీరక, ఆర్థిక శిక్ష విధించబడలేదు.

తబూక్ నుండి తిరిగి వచ్చిన తర్వాత తాయిఫ్ వారు కూడ వచ్చి విధేయత తెలిపిరి. ఆ తర్వాత అరబ్‌లోని వివిధ జాతులు వంతుల వారీగా వచ్చి ఇస్లాం ప్రభుత్వములో చేరుటకు అనుమతి కోరిరి. కొద్ది కాలములోనే మొత్తం అరబ్‌లో ఇస్లాం పతాకము రెపరెపలాడెను.

## హజ్జతుల్ విదా - ఆన్ హజ్రత్ సల్లం ప్రసంగము

ప్రస్థానము 9వ సం॥ వారు మక్కా హజ్ చేసిరి. ఆ రోజు పవిత్ర ఖురాన్‌లోని ఈ ప్రఖ్యాత సూక్తి వారి పై అవతరించెను.

اَلْيَوْمَ اَكْمَلْتُ لَكُمْ دِيْنَكُمْ وَاَتْمَمْتُ عَلَيْكُمْ نِعْمَتِىْ
وَرَضِيْتُ لَكُمُ الْاِسْلَامَ دِيْنًا۔ (مائدة:٤)

(అల్ మాయిదహ్: 4) అనగా ఈనాడు మీ కొరకు మీ ధర్మమును సమగ్ర మొనర్చితిని. నేను చేయవలసిన ఉపకారము నంతయు నేను చేసితిని. ఇస్లాంను మీ కొరకు ధర్మముగా నేను ఎన్నుకొంటిని.

ముజ్‌దల్ఫ మైదానములో హజ్ కొరకు అందరు సమావేశమగు చోట వారు ఈ సూక్తిని పెద్ద ధ్వనితో చదివి వినిపించిరి. మజ్‌దల్ఫ నుండి



తిరిగి వచ్చిన తర్వాత హజ్ నియమముల ప్రకారము వారు మనాలో విడిది చేసిరి. జుల్‌హజ్జ 11 న ముస్లిములందరి సమక్షములో వారు ఈ క్రింది విధముగా ప్రసంగించిరి.

ఓ ప్రజలారా! నా మాటలను శ్రద్ధగా వినము. ఈ సం॥ తర్వాత నేను మీముందు ఈ మైదానములో నిలబడి ప్రసంగము చేయుదునా లేదా అను విషయము నాకు తెలియదు. అల్లాహ్ మీ ప్రాణాలను, ధనమును ప్రళయ దినము వరకు పరస్పర దాడుల నుండి రక్షించెను. అల్లాహ్ ప్రతి వ్యక్తికి వారసత్వములో హక్కు కల్పించెను. కావున ఇతర వారసుని హక్కును హరించే మరణాదేశము చెల్లుబాటు కాదు. ఏ ఇంట్లో జన్మించిన బాలుడు ఆ ఇంటి వాడే అనబడును. ఎవడైనా అక్రమ సంబంధము పేరున ఆ బాలుని కొరకు దావా చేసినచో అతడే చట్టరీత్యా శిక్షార్హుడగును. ఎవడైనా ఒక వ్యక్తిని అసత్యముగా తన తండ్రి, సంరక్షకుడని ప్రకటించినచో అతనిపై అల్లాహ్, దేవదూతల, ప్రజల శాపము పడును. ఓ ప్రజలారా! మీ భార్యలపై మీరు హక్కులు కల్గివున్నట్లే మీ భార్యలు కూడ మీపై కొన్ని హక్కులు కల్గి వున్నారు. వారిపై మీకు వున్న హక్కు ఏమనగా సమాజములో భర్తల గౌరవము భంగపడే విధంగా వారు అశ్రద్ధ, అక్రమ పద్ధతులలో నడవకూడదు. వారు అలా చేసినచో మీరు (పవిత్ర ఖురాన్ ఆదేశాను సారము పూర్తిగా విచారణ జరిపిన తర్వాత న్యాయవ్యవస్థ ద్వారా) వారిని శిక్షించవచ్చును. కాని ఇందులో కూడ క్రూరమును ప్రదర్శించరాదు. కుటుంబ మర్యాద, భర్తల గౌరవమును మంట గలిపే ఏ కార్యము వారు చేయనిచో మీ సామర్థ్యం మేరకు వారికి ఆహారము, దుస్తుల ఏర్పాటు మీరు

చేయవలెను. జాగ్రత్తగా గుర్తుంచుకొనుము! మీ సతీమణుల పట్ల మీరు ఎల్లప్పుడు సత్ప్రవర్తనతో వ్యవహరించుము. ఎందుకనగా అల్లాహ్ వారి పర్యవేక్షణను మీకు అప్పగించెను. స్త్రీ స్వతహాగా బలహీనమైన జాతి. తన హక్కులను తానే రక్షించుకోలేదు. మీరు వారిని వివాహమాడిన తర్వాత అల్లాహ్ మిమ్ములను వారి హక్కులకు బాధ్యులను చేసెను. అల్లాహ్ విధించిన చట్టము ప్రకారము మీరు వారిని తమ ఇంటికి తీసుకొచ్చిరి. (కావున ఆ బాధ్యతను అగౌరవ పరచకుము. స్త్రీల హక్కులను చెల్లించుటకు సదా శ్రద్ధ వహించుము) ఓ ప్రజలారా! మీ అధీనములో ఇంకా కొందరు యుద్ధ ఖైదీలున్నారు. మీరు తినునదే వారికి తినిపించుము. మీరు ధరించునదే వారికి ధరింపజేయుము. వారు ఏదైనా తప్పు చేసినచో మీరు క్షమించలేని స్థితిలో వుంటే వారిని మరొకరికి విక్రయించుము. వారు దైవదాసులు, వారిని హింసించుట ఎట్టిపరిస్థితిలోను తగదు. నేను మీకు చెప్పుచున్న విషయాలను అతి శ్రద్ధగా విని, గుర్తుంచుకొనుము. ప్రతి ముస్లిం మరొక ముస్లిమునకు సోదరుడు. మీరందరు ఒకే స్థాయివారు. మీరు మానవులందరు ఏ జాతికి, ఏ స్థాయికి చెందినను మానవత్వ రూపంలో మీరందరు సమానులే. ఇట్లనుచు తమ రెండు చేతులను పైకి లేపి రెండు వ్రేళ్ళను కలిపి ఈ వ్రేళ్ళు సమానంగా వున్నట్లే మానవులైన మీరందరు పరస్పరం సమానులే. పరస్పరం మీరు ఆధిక్యము, విశిష్టత ప్రదర్శించు హక్కు మీకు లేదు. పరస్పరం మీరు సోదరులు. ఆ తర్వాత ఇట్లనిరి. ఇది ఏ మాసమో మీకు తెలుసా? ఇది ఏ ప్రాంతమో మీకు తెలుసా? నేడు ఏ దినమో మీకు తెలుసా? ప్రజలు ఇట్లనిరి.



ఇది పవిత్ర మాసము, ఇది పవిత్ర ప్రాంతము, నేడు హజ్ పర్వ దినము. ప్రతి సమాధానము తర్వాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. ఈ మాసము పవిత్రమైనట్లే, ఈ ప్రాంతము పవిత్రమైనట్లే, ఈ దినము పవిత్రమైనట్లే అల్లాహ్ ప్రతి మానవుని ప్రాణమును, ధనమును కూడ పవిత్రముగా నిర్ణయించెను. ఈ నెల, ప్రాంతము, దినమును కించపరచిన విధముగనే ఒకరి ప్రాణము, ధనముపై దాడి చేయుట అవమాన పరచటమే అనబడును. ఈ ఆదేశము ఈ రోజు, రేపటి వరకే పరిమితం కాదు మీరు అల్లాహ్‌తో కలిసే రోజు వరకు కొనసాగును. మరల ఇట్లనిరి. నేడు నేను మీకు బోధించుచున్న ఈ విషయములను ప్రపంచ నలు మూలల వరకు అందించుము. ఎందుకనగా నేడు ప్రత్యక్ష్యముగా నాతో వింటున్న వారి కంటే నాతో వినలేని వారు ఎక్కువ పాటించే అవకాశము గలదు.”

మానవ జాతి అభివృద్ధి, శాంతి పట్ల, స్త్రీలు, బలహీనుల హక్కుల గురించి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఎటువంటి ప్రత్యేక శ్రద్ధ కలిగివుండిరో ఈ సంక్షిప్త ప్రసంగం స్పష్టము చేయును. ఇప్పుడు తనువు చాలించే సమయం సమీపించుచున్నదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం భావించుచుండిరి. వారి జీవితములోని కొన్ని రోజులు మాత్రమే మిగిలినట్లు బహుశ అల్లాహ్ వారికి తెలిపియుండెను. ఆది నుండి పురుషుల వద్ద బానిసలుగా జీవితము గడుపుచున్న స్త్రీల హక్కులను భద్రపరచనిదే ఈ లోకమును వదిలి పోవుటను వారు ఇష్టపడలేదు. బానిసలు అనబడే యుద్ధ ఖైదీలు వివిధ రకాల హింసలు, దౌర్జన్యములకు గురవుచుండిరి కనుక వారి హక్కులకు రక్షణ కల్పించనిదే ఈ లోకము నుండి పోవుటను వారు ఇష్టపడలేదు. మానవులలో పరస్పర భేదము,

ప్రత్యేకత మానవులలో కొందరిని ఆకాశమునకు ఎత్తితే మరికొందరిని పాతాళములో పడవేయుచు జాతులు, దేశముల మధ్య భేదము, యుద్ధమును పుట్టించి కొనసాగించు కారణమగు ఈ భేదము, ప్రత్యేకతను అంతము చేయనిదే వారు ఈ ప్రపంచమునకు వీడ్కోలు చెప్పదలచలేదు. ఒకరు మరొకరి హక్కులపై దాడి చేయుట, ఒకరి ప్రాణము, ధనమును తమ కొరకు ధర్మబద్ధముగా భావించుట, దుష్ప్రవర్తన కాలములో మానవ దృష్టిలో అతి పెద్ద శాపముగా పరిగణించబడెను. ఈ సంస్కృతిని పూర్తిగా నిర్మూలించనిదే, దైవ పవిత్ర మాసములు, పవిత్ర ప్రాంతముల వలె మానవ ప్రాణము, ధనమునకు పవిత్రత లభించనంత వరకు ఈ ప్రపంచ బంధమును వదులుటకు వారు ఇష్టపడలేదు. స్త్రీలపై సానుభూతి, బానిసల పట్ల ప్రేమానురాగం, మానవులలో సుఖ శాంతిని స్థాపించు కోరిక, మానవులలో సమాన హక్కుల స్థాపన కోరిక ఇంత గట్టిగా ప్రపంచములో మరొకరిలో చూపగలరా ? ఆదమ్ నుండి నేటి వరకు మానవ జాతి సానుభూతి కొరకు ఇంతటి ఉత్సాహము, ఉద్రేకము ఎవరైనా చూపించిరా? అందుకే నేటి వరకు ఇస్లాంలో స్త్రీ తన ఆస్తికి యజమానురాలుగా వున్నది. యూరప్ ఈ స్థాయిని ఇస్లాం తర్వాత 13 వందల సం॥లకు పొందెను. ఇస్లాంలో ప్రవేశించే ప్రతి వ్యక్తి ఎంతటి నీచ, అవమానకరముగా పరిగణించబడే జాతికి చెందినను సమాన గౌరవమునకు అర్హుడగును. స్వేచ్ఛ, సమానత్వపు భావనను ఇస్లాం మాత్రమే ప్రపంచములో స్థాపించెను. అటువంటి ఉదాహరణ నేటి వరకు ప్రపంచములోని ఇతర జాతులు చూపించలేవు. మన మస్జిద్‌లో ఒక రాజు, గౌరవనీయ ధార్మిక నాయకుడు, ఒక సాధారణ వ్యక్తి సమానులే. వారిలో ఎలాంటి భేదము, ప్రత్యేక వ్యవహారము చూపబడదు. ఇతర ధర్మముల ప్రార్థనాలయాలు నేటి వరకు చిన్నా, పెద్దలలో ప్రత్యేక వ్యవహారమును ప్రదర్శించుచున్నాయి.



కాని ఇతర జాతులు స్వేచ్ఛ, సమానత్వ ప్రకటనను ఇస్లాం కంటే పెద్ద ఎత్తులో ప్రచారము చేయుచున్నవి.

## ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరణము

ఈ ప్రయాణము నుండి వారు తిరిగి వచ్చుచున్నప్పుడు దారిలో మరల అనుచరులకు తన మృత్యువు వార్త ఇట్లు అందించిరి. ఓ ప్రజలారా! నేను మీ వలె ఒక మనిషినే. అల్లాహ్ దూత నా వద్దకు తొందరలోనే రావచ్చును. అతనికి నేను సమాధానము ఇవ్వాల్సి వుండును. మరల ఇట్లనిరి. ఓ ప్రజలారా! ఒక ప్రవక్త తన కంటే ముందు ప్రవక్త ఆయువులో అర్ధ వయస్సు పొందునని నాకు నా పరమకారుణ్య మూర్తి, జాగరూకుడైన యజమాని అల్లాహ్ తెలిపెను. (హజ్రత్ ఈసా అలైహిస్సలాం ఆయువు 120 సం॥లని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలుపబడి యుండెను. అందుకే తన వయస్సు సుమారు 60 సం॥లు వుండునని వారు భావించిరి. ఎందుకనగా అప్పటికి వారు 62, 63 సం॥లకు చేరుకొని యుండిరి. కావున నా ఆయువు ఇక ముగియనున్నదని వారు సంకేతమిచ్చిరి. ప్రతి సందేశహరుడు తన కంటే ముందు సందేశహరుని ఆయువులో అర్థాయువు పొందునని ఈ హదీసు భావము కాదు. ఈ కథనములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తన వయస్సు, యేసు (అ) వయస్సును మాత్రమే పోల్చిరి) తొందరగానే నన్ను ఆహ్వానించ బడును, నేను మరణించెదను. ఓ నా అనుచరులారా! అల్లాహ్ ఆస్థానములో నన్ను కూడ ప్రశ్నించబడును. మీరు ప్రశ్నించబడుదురు. అప్పుడు మీరేమందురు? వారిట్లు సమాధానమిచ్చిరి. ఓ రసూలుల్లాహ్! మీరు ఇస్లాం ప్రచారము గొప్పగా చేసితిరని, తమ జీవితమును సంపూర్ణముగా అల్లాహ్ ధర్మము కొరకు వినియోగించిరని, మానవ జాతి శ్రేయస్సును ఉన్నత స్థాయికి చేర్చిరని, అల్లాహ్ మీకు మా తరపున గొప్ప

ప్రతిఫలము నొసంగుగాక! అని మేము తెలిపెదము. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీరిట్లు సాక్ష్యమివ్వరా! అనగా అల్లాహ్ ఒక్కడే, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అతని దాసుడు, అతని ప్రవక్త, స్వర్గము, నరకము సత్యము. ప్రతి మానవుడు మరణించక తప్పదు. మరణించిన తర్వాత కూడ ప్రతి మానవుడు బ్రతికించబడును. ప్రళయ దినము కూడ తప్పక సంభవించును. అల్లాహ్ మానవులందరిని సమాధుల నుండి మరల బ్రతికించి ఏకము చేయును. వారిట్లనిరి. అవును ఓ రసూలుల్లాహ్! మేము ఇందుకు సాక్ష్యమిచ్చెదము. ఆ తర్వాత అల్లాహ్‌ను సంబోధించుచు వారిట్లనిరి. ఓ అల్లాహ్! నేను వీరికి ఇస్లాం నియమములు అందించినట్లు నీవు కూడ సాక్ష్యముగా నుండుము.

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ హజ్ నుండి తిరిగి వచ్చిన తర్వాత నిర్విరామముగా ముస్లిముల ప్రవర్తన, కార్యముల సంస్కరణలో నిమగ్నమై యుండిరి. తను మరణించే రోజు కొరకు ముస్లిములను మానసికంగా సిద్ధము చేసిరి. ఒక రోజు వారు ఉపన్యాసము కొరకు నిలిచి ఇట్లు ఉపదేశించిరి. నేడు నాకు అల్లాహ్ సువార్త వాణి ఇట్లు అందెను. అల్లాహ్ సహాయములు, అతని తరపున విజయములు గత కాలము కంటే ఎక్కువ వేగంతో వచ్చును. ప్రతి జాతి, దేశపు ప్రజలు తండోపతండాలుగా ఇస్లాంలో ప్రవేశించడం మొదలు పెట్టు ఆ రోజును మీరు గుర్తుచేసుకొనుము. కనుక మీ ద్వారా స్థాపించబడిన ధర్మము నుండి అల్లాహ్ లోటుపాట్లను దూరము చేయవలెనని అతనిని మీరు వేడుకొనుము. మీరు ఈ ప్రార్థనలు చేసినచో అల్లాహ్ తప్పక మీ ప్రార్థనలను స్వీకరించును. వారు ఈ విధముగనూ అనిరి. అల్లాహ్ తన ఒక దాసునితో ఇట్లనెను. నీవు కోరినచో మా వద్దకు రావచ్చును. లేదా ఇంకా కొన్ని రోజుల వరకు ప్రపంచ సంస్కరణను కొనసాగించవచ్చును.



అల్లాహ్ ఆ దాసుడు దానికి సమాధానముగా ఇట్లనెను. మీ వద్దకు రావడమే నాకు ఎక్కువ ఇష్టము. వారు ఈ విషయము సమావేశములో వినిపించినప్పుడు హ్రజత్ అబూబకర్ (రజి) విలపించిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లాం విజయాల వార్తలు వినిపించుచుండగా అబూబకర్ (రజియల్లాహు) విలపించుచున్నారని అనుచరులు ఆశ్చర్య పడిరి. శుభవార్త విని ఈ వృద్ధుడు ఎందుకు విలపించుచున్నాడని నేను కోపగించుకొంటినని హ్రజత్ ఉమర్ (రజి) తెలిపిరి. కాని అబూబకర్ (రజి) మాత్రమే వారి విషయమును సరిగ్గా అర్థము చేసుకొనెను, ఈ అధ్యాయములో నా మరణ వార్త వుందని అతనికి అర్థమైపోయినదని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలుసుకొనిరి. వారిట్లనిరి. అబూబకర్ (రజి) నాకు చాలా ప్రీతి పాత్రుడు. అపరిమిత ప్రేమ అల్లాహ్ ఉనికికి ప్రత్యేకము కానిచో నేను అబూబకర్‌ను అంతులేకుండా ప్రేమించేవాడిని. ఓ ప్రజలారా! మస్జిద్‌నకు తెరువబడు అందరి ద్వారములు నేటి నుండి మూయబడవలెను. అబూబకర్ (రజి) ద్వారము మాత్రమే తెరచి వుండవలెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తర్వాత అబూబకర్ (రజి) ఉత్తరాధికారి అగుదురని ఇందులో భవిష్యవాణి వుండెను. అప్పుడు ప్రార్థన చేయించుటకు మస్జిద్‌లోకి ఆ ద్వారము నుండి వారు రావలసియుండును. ఈ సంఘటన జరిగిన సుదీర్ఘ కాలము తర్వాత హ్రజత్ ఉమర్ (రజి) ఉత్తరాధికారిగా వుండిరి. ఒక సారి సమావేశములో వారు ఉపస్థితులై వుండగా ఇట్లనిరి. إِذَا جَآءَ نَصْرُ اللّٰهِ وَالْفَتْحُ అధ్యాయములో ఏ విషయము తెలుపబడెను? ఈ విషయములో వారు తమ సభికులను ఈ విధముగా పరీక్షించిరి. ఆ అధ్యాయము అవతరించిన సందర్భంగా వారు దానిని అర్థము చేసుకోలేక పోయి యుండిరి. ఈ సంఘటన జరిగిన సమయమున ఇబ్నె అబ్బాస్ (రజి) 10,11 సం॥ల

వయస్సులో వుండిరి. ఇప్పుడు వారు 17,18 సం॥ల వయస్సుకు చేరుకొనిరి. ఇతర అనుచరులు చెప్పలేకపోయిరి. ఇబ్నె అబ్బాస్ ఇట్లనిరి. ఓ అమీరుల్ ముమినీన్! ఈ అధ్యాయములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరణవార్త అందించబడెను. ఎందుకనగా సందేశహరుడు తన కార్యమును పూర్తి చేసిన తర్వాత ప్రపంచములో వుండుటకు ఇష్టపడడు. హజ్రత్ ఉమర్ (రజి) ఇట్లనిరి. అవును నిజమే నేను నీ తెలివితేటలకు ముగ్ధుడనైతిని. ఈ అధ్యాయము అవతరించిన సమయమున అబూబకర్ (రజి) దీని భావమును అర్థము చేసుకొనిరి కాని మేము అర్థము చేసుకోలేక పోయితిమి.

తుదకు ప్రతి మనిషికి వచ్చే ఆ రోజు రానే వచ్చెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తన కార్యమును ప్రపంచములో ముగించుకొనిరి. సంపూర్ణమైన దైవవాణి అవతరించెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర శక్తితో ఒక నూతన జాతి, నవీన ఆకాశము, క్రొత్త భూమికి పునాది వేయబడెను. నాటువాడు భూమిని పదును చేసి, నీరందించి, బీజము నాటి, పంట సిద్ధము చేసెను. ఇక పంటను కోసే బాధ్యత అతనిది కాకుండెను. ఒక కూలి వాని వలె వచ్చి కూలి వాని వలెనే ఈ ప్రపంచము నుండి పోవలసియుండెను. ఎందుకనగా అతని బహుమానము ఈ ప్రపంచములోని వస్తువులు కావు. తనను పుట్టించిన, పంపించిన వాని సంతోషమే అతని ప్రతిఫలము. పంట చేతికి వచ్చే సమయంలో నన్ను నీ వద్దకు పిలిపించుకో, ఈ పంటను మరొకరు కోయవలెనని తన పోషకున్ని అతడు కోరెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనారోగ్యమునకు గురైరి. కొన్ని రోజులు బాధతోనే ప్రార్థన చేయించుటకు మస్జిద్‌నకు వచ్చిరి. తుదకు మస్జిద్‌నకు వెళ్లే శక్తి కూడ లేకుండెను. వారు మృతి చెందుదురని అనుచరులు ఎన్నడు



ఊహించలేదు. కాని వారు తరచు తన మరణము ఆసన్నమైనట్లు వారికి తెలుపేవారు. ఒక రోజు అనుచరులు సమావేశములో వుండగా వారిట్లనిరి. ఎవడేని తప్పు చేసినచో అల్లాహ్ ముందు అవమాన పడే బదులు ఈ ప్రపంచములోనే దానిని పరిష్కరించుకొనుట మంచిది. నా ద్వారా తెలియక ఎవరి హక్కైనా హరించబడినచో తన హక్కు అడగవచ్చును. అనుకోకుండా ఎవరికైనా నా ద్వారా బాధ కలిగినచో నేడు నాతో ప్రతీకారము తీసుకొనవచ్చును. ఎందుకనగా నేను అల్లాహ్ ముందు అపహాస్యమునకు గురి కాదలచుకోలేదు. ఇతర అనుచరులు ఈ విషయము విని దు:ఖములో మునిగిపోయిరి. వారి హృదయాలలో ఈ ఆలోచనలు వచ్చెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎట్లు కష్టపడి వారి విశ్రాంతికి ఏర్పాట్లు చేసేవారు. వారు ఎలా ఆకలితో వుండి వారికి ఆహారమందించేవారు. తమ దుస్తులకు అతుకులు వేసుకొని వారికి దుస్తులు తొడిగించేవారు. అయినను ఇతరుల హక్కుల పట్ల ఎంత శ్రద్ధగల వారంటే తెలియక ఎవరికైనా నా ద్వారా ఇబ్బంది కలిగినచో నేడు ప్రతీకారము తీర్చుకొనమని కోరుచున్నారు. కాని ఒక అనుచరుడు ముందుకు వచ్చి ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! మీ ద్వారా నాకొకసారి బాధ కలిగియుండెను. యుద్ధ వరుసలు సిద్ధమగుచుండెను. మీరు ఒక వరుస నుండి ముందుకు వచ్చినప్పుడు మీ మోచేయి నా శరీరమునకు తగిలెను. తెలియక బాధ కలిగినను నాతో ప్రతీకారము తీసుకోవచ్చునని మీరు అన్నందున నేను మీతో ప్రతీకారము తీసుకోదలచితిని. దు:ఖసాగరములో మునిగి వున్న అనుచరుల స్థితిలో హఠాత్తుగా మార్పు వచ్చెను. వారి కనులు రక్తము కక్కుచుండెను. ఇటువంటి సమయమున ఉపదేశము పొందే బదులు ప్రతీకారము తీసుకొనుటకు సిద్ధమైన ఈ వ్యక్తి కఠిన శిక్షకు అర్హుడని ప్రతి ఒక్కరు భావించుచుండెను. కాని ఆ

అనుచరుడు పట్టించుకోలేదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అవును నీవు అనుచున్నది సమంజసమే. ప్రతీకారము తీసుకొనుట నీ హక్కు. అటు వైపు తిరిగి తన వీపు అతని వైపు త్రిప్పి మోచేయితో కొట్టమని  అనిరి. ఓ రసూలుల్లాహ్! నాకు మోచేయి తగిలినప్పుడు నా శరీరము నగ్నముగా నుండెను. ఎందుకనగా అప్పుడు ధరించుటకు నా వద్ద చొక్కా లేకుండెను. వారిట్లనిరి. నా చొక్కా లేపి నగ్న శరీరముపై మోచేయితో కొట్టి ప్రతీకారము తీసుకొనుము. ఆ అనుచరుడు (రజి) వారి చొక్కా లేపి వణుకుచున్న పెదాలతో, కన్నీరు కార్చుచున్న కనులతో వంగి వారి నడుమును చుంబించెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇదేమిటని అనిరి. అతడు సమాధానముగా ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! మీ మరణము సమీపములో వున్నదని మీరనిరి. కావున మిమ్ము స్పృశించు, ప్రేమించు అవకాశములు మాకు ఎప్పటి వరకు లభించును. నిస్సందేహముగా యుద్ధ సందర్భమున మీ మోచేయి నాకు తగిలి యుండెను. కాని ఆ మోచేయి తగిలినందులకు ప్రతీకారము తీసుకునే ఆలోచన ఎవరికి కలుగును. నేడు నాతో ప్రతీకారము తీసుకోగలరని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపినందున ఈ సాకుతో మిమ్ము చుంబించవచ్చుననే ఆలోచన నా హృదయములో కలిగెను. *(బుఖారి కితాబుల్ మఘాజి బాబ్ మర్జున్నబియ్యి వవఫాతుహు)* ఇప్పటి వరకు కోపముతో రగిలిపోవుచున్న అనుచరులు ఈ విషయము విని అయ్యో! ఇటువంటి అవకాశము మాకు లభించినచో ఎంత బాగుండునని  విచారపడిరి.

వ్యాధి ముదురుచుండెను. మృత్యువు సమీపించుచుండెను. సూర్యుడు మదీనాలో గతము వలె ప్రకాశించుచున్నను అనుచరుల దృష్టిలో మసక మసకగా కనిపించసాగెను. పొద్దు పొడుచుచున్నను వారి



నేత్రములను అంధాకార తెరలు కమ్ముచుండెను. తుదకు అల్లాహ్ ప్రవక్త ఆత్మ ఈ ప్రపంచమును వదిలి తన ప్రియమైన అల్లాహ్ ఆస్థానమునకు వెళ్లే ఘడియ రానే వచ్చెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం శ్వాస వేగం పుంజుకొని శ్వాస పీల్చుటలో ఇబ్బంది కలుగుచుండెను. హజ్రత్ ఆయిషా (రజి) తో రసూలుల్లాహ్ సల్లల్లాహ్ అలైహి వసల్లం ఇట్లనిరి. పడుకొని వున్నందున శ్వాస ఆడటం లేదు అందుకే నా తల పైకి లేపి నీ యదపై పెట్టుకొనుము. హజ్రత్ ఆయిషా (రజి) వారి తల లేపి తన ఛాతిపై పెట్టుకొని వారికి ఆధారముగా కూర్చొనిరి. మృత్యువు బాధ వారిని ఆవహించుకొనెను. కూర్చొనివుండే ఆందోళనతో అటు ప్రక్క ఇటు ప్రక్క కదులుచూ ఇట్లనుచుండిరి. యూదులు, క్రైస్తవులను అల్లాహ్ శిక్షించుగాక! వారు వారి ప్రవక్తలు మరణించిన తర్వాత వారి సమాధులను ప్రార్థనాలయాలుగా మార్చిరి. *(బుఖారి కితాబుల్ మఘాజి బాబ్ మర్జున్నబియ్యి వవఫాతుహు)* ఇది వారు తమ సమాజమునకు చేసిన అంతిమ ఉపదేశము. అనగా మీరు నన్ను ప్రవక్తలలో ఉత్తమునిగా పొందెదరు. అందరికంటే గొప్ప విజయునిగా పొందెదరు. కాని నేను మానవుడనే విషయమును మర్చిపోకుము. అల్లాహ్ స్థానమును అల్లాహ్‌కే ఇవ్వుము. నా సమాధిని ఒక సమాధిగానే పరిగణించుము. ఇతర సమాజములు తమ ప్రవక్తల సమాధులను ప్రార్థన కేంద్రాలుగా మార్చి అక్కడ తిష్టవేసి కానుకలు సమర్పించవచ్చును. కాని మీరు అలా చేయకూడదు. మీరు ఏకేశ్వరుడైన అల్లాహ్ ప్రార్థనను స్థాపించుటకు నిలుపబడిరి. ఇలా అనుచుండగానే కనులు పైకి లేవగా, వారి నోట ఈ చివరి పదములు వెలువడెను.

اِلَى الرَّفِيْقِ الْاَعْلٰى اِلَى الرَّفِيْقِ الْاَعْلٰى

అనగా గొప్ప సింహాసమునధిష్టించిన దయామయుడైన మిత్రుని వైపు

నేను పోవుచున్నాను. గొప్ప సింహాసమునధిష్టించిన దయామయుడైన మిత్రుని వైపు నేను పోవుచున్నాను. ఇట్లనుచుండగానే వారు పరమపదించిరి.

**ఆన్‌హజ్రత్ సల్లం మరణముపై అనుచరుల స్పందన**

తమ దైనందిన కార్యములను వదులుకొని వారి స్వస్థత శుభవార్త వినుటకు మస్జిద్ వద్ద అధిక సంఖ్యలో నిరీక్షించుచున్న అనుచరులకు ఈ విషయము తెలియగా వారు పెద్ద ఆందోళనకు గురైరి. హజ్రత్ అబూబకర్ (రజి) కొద్ది సమయము కొరకు ఏదో పని మీద బయటికి వెళ్ళి వుండిరి. హజ్రత్ ఉమర్ (రజి) మస్జిద్‌లోనే యుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతిచెందిరని మాట్లాడుకుంటున్న ప్రజల మాట విని నప్పుడు వారు ఒరలో నుంచి ఖడ్గము బయటికి లాగి ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణముగా! రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతిచెందిరని అనే వ్యక్తి తల నేను నరికివేయుదును. ఇప్పటికి దాంబికులు ప్రపంచములో వున్నారు. అందుకే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరణించ లేరు. వారి ఆత్మ శరీరమును వదిలినను మూసా (అ) వలె అల్లాహ్‌తో మాట్లాడుటకు వెళ్లెను. అది తిరిగి వచ్చి ప్రపంచములో నున్న దాంబికులను అంతము చేయును. ఇట్లని నగ్న ఖడ్గము పట్టుకొని ప్రాణము తీసే ఈ వార్త బాధ వలన పిచ్చివాని వలె అటు ఇటు తిరుగుచు ఇట్లనుచుండిరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతిచెందినారని అనే వ్యక్తిని నేను హత్యచేయుదును. హజ్రత్ ఉమర్ (రజి) ను ఇట్లనుటను చూచి మాకు కూడ కొంత ధైర్యం కలిగెనని అనుచరులు తెలిపిరి. మేమిట్లంటిమి. ఉమర్ (రజి) నిజమే అంటున్నారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందలేదు. ప్రజలకు తప్పక ఏదో అపోహ కలిగినదని ఉమర్ (రజి) కథనముతో మాకు మేము తృప్తి పరచుకోవడం



మొదలు పెట్టితిమి. ఇంతలోనే కొందరు పరుగెత్తి హజ్రత్ అబూబకర్ (రజి) నకు ఈ పరిస్థితిని తెలిపిరి. వారి ద్వారా విషయము తెలుసుకొని హజ్రత్ అబూబకర్ (రజి) కూడ మస్జిద్‌నకు చేరిరి. కాని ఎవరితో మాట్లాడక నేరుగా ఇంట్లోకి వెళ్లి, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చనిపోయిరా? అని హజ్రత్ ఆయిషా (రజి) ను అడిగిరి. అవును అని హజ్రత్ ఆయిషా (రజి) సమాధానమిచ్చిరి. వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వెళ్లి, వారి ముఖము పై నుండి వస్త్రము తొలగించి, నుదుట ముద్దు పెట్టుకొనగా రెండు ప్రేమలతో ప్రకాశించుచున్న కన్నీరు కనుల నుండి పడెను. వారిట్లనిరి. అల్లాహ్ ప్రమాణము! అల్లాహ్ వారిపై రెండు మరణములను రానివ్వడు. అనగా వారు ఇటు శారీరకముగా మరణించగా అటు వారి సమాజము తప్పుడు విశ్వాసాలు, ఆలోచనలలో మునిగిపోదని అర్థము. ఇట్లని వారు బయటికి వచ్చి వరుసలను చీల్చుచూ మౌనముగా వేదిక వైపు వెళ్లిరి. వారు వేదికపై నిలబడగా వేదిక ప్రక్కనే ఖడ్గము పట్టుకొని హజ్రత్ ఉమర్ (రజి) కూడ నిలబడి యుండిరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరణించిరని అబూబకర్ (రజియల్లాహు అన్హు) అన్నచో నేను వారిని హతమార్చెదనని వారి ఉద్దేశముండెను. వారు మాట్లాడబోగా హజ్రత్ ఉమర్ (రజి) వారి వస్త్రము లాగి, మాట్లాడకూడదని కోరిరి. కాని వారు వస్త్రమును వదిలించుకొని వారి చేతి నుండి విడిపించుకొనిరి. తర్వాత పవిత్ర ఖురాన్‌లోని ఈ సూక్తి పఠించిరి. (ఆలె ఇమ్రాన్: 145)

وَمَا مُحَمَّدٌ اِلَّا رَسُوْلٌ قَدْ خَلَتْ مِنْ قَبْلِهِ الرُّسُلُ اَفَاْئِنْ مَّاتَ
اَوْ قُتِلَ انْقَلَبْتُمْ عَلٰى اَعْقَابِكُمْ۔ (آلِ عمران:۱۴۵)

అనగా ఓ ప్రజలారా ! ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు

అలైహి వసల్లం ఒక దైవ ప్రవక్త మాత్రమే. నిశ్చయముగా ప్రవక్తలందరు అతని కంటే పూర్వమే మరణించిరి. వారు మరణించినను, లేక నిహతులైనను, మీరు మీ ధర్మమును వదిలి మీ కాలికి బుద్ధి చెప్పి వెనుకకు మరలుదురా ? ధర్మము అల్లాహ్‌ది ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంది కాదు. ఈ సూక్తి ఉహద్ యుద్ధము సందర్భమున అవతరించి యుండెను. అప్పుడు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అమరులైనారనే వార్త విని కొందరు నిరాశ చెందియుండిరి. ఈ సూక్తి చదివిన తర్వాత వారిట్లనిరి.

مَنْ كَانَ يَعْبُدُ اللّٰهَ فَاِنَّ اللّٰهَ حَیٌّ لَايَمُوْت

అనగా ఓ ప్రజలారా! మీలో ఎవరైతే అల్లాహ్‌ను ప్రార్థించుచుండెనో అల్లాహ్ సజీవుడు, అతనికి మరణము సంభవించదని గుర్తుంచుకొనవలెను.

وَمَنْ كَانَ مِنْكُمْ يَعْبُدُ مُحَمَّدًا فَاِنَّ مُحَمَّدًا قَدْمَات

కాని ఎవరైతే ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఆరాధించుచుండెనో అతనికి నేను స్పష్టముగా తెలియ జేయునదేమనగా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరణించిరి. హజ్రత్ ఉమర్ (రజి) ఇట్లనిరి. హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) مَا مُحَمَّدٌ اِلَّا رَسُوْلٌ సూక్తిని పఠించడం మొదలు పెట్టినప్పుడు నాకు స్పృహ రావడం మొదలయ్యెను. ఈ సూక్తి ముగిసే వరకు నా ఆధ్యాత్మిక నేత్రములు తెరుచుకున్నవి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజముగనే మృతిచెందినట్లు నేను తెలుసుకొంటిని. అప్పుడు నా మోకాళ్లు వణికి నేను అచేతనముగా క్రింద పడిపోయితిని. ఖడ్గముతో హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు)



ను హతమార్చ దలచిన వ్యక్తి ఇప్పుడు అబూబకర్ (రజియల్లాహు అన్హు) సత్యోపదేశముతో తనే హతుడయ్యెను. అనుచరులు ఇట్లనిరి. ఈ సూక్తి నేడే అవతరించినట్లు మేము భావించితిమి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరణ బాధ వలన ఈ సూక్తిని మేము మర్చియుంటిమి. మదీనాకు చెందిన మహా గొప్ప కవి హస్సాన్ బిన్ సాబిత్ ఈ క్రింది పద్యమనిరి.

كنت السواد لناظرى فعمى عليك الناظر

من شاء بعدك فليمت فعليك كنت اُحاذر

అనగా ఓ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నీవే నా కను పాపగావుంటివి. నేడు నీ మృతితో నా నేత్రములు గ్రుడ్డివైనవి. ఇప్పుడు నీవే మృతిచెందిన తర్వాత నా తండ్రి, నా సోదరుడు, నా కుమారుడు, నా భార్య మరణించినను వీరిలో ఎవరి మృతిని నేను లెక్క చేయను. నేను నీ మరణముతోనే భయపడుచుంటిని.

ఈ పద్యము ప్రతి ముస్లిం హృదయగాథగా యుండెను. ఆ తర్వాత చాలా రోజుల వరకు మదీనా వీధులలో ముస్లిం పురుషులు, మహిళలు, బాలబాలికలు ఈ పద్యమునే చదువుచు తిరుగుచుండిరి. ఓ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నీవే మా కంటిపాపగా వుంటివి. నీ మృతితో మేము అంధులమైతిమి. ఇప్పుడు మా ప్రియుడు, సమీప బంధువు ఎవరు మృతిచెందినను మాకు బాధ లేదు. మేము నీ మరణముతోనే భయపడు చుంటిమి.

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ وَبَارِكْ وَسَلِّمْ

☆☆☆☆☆

# ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గుణగణాలు

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత స్థితిగతులను ప్రస్తావించిన తర్వాత ఇప్పుడు వారి గుణగణాలను వివరించెదను. వారి ప్రవక్తృత్వ ప్రకటనకు పూర్వము వారి జాతి వారిని 'విశ్వసనీయుడు', 'సత్యవంతుడు' అని నామకరణం చేయుట వారి సద్గుణముల గూర్చి సామూహిక సాక్ష్యముగా నిలిచినది. *(సీరత్ ఇబ్నె హష్షామ్)*

అవినీతి నిరూపణ కాని వారు ప్రపంచములో చాలా మంది వుందురు. కఠిన పరీక్షను ఎదుర్కొనే అవకాశము రాని వారు కూడ చాలా మంది వుందురు. సామాన్య పరీక్షలు వారికి ఎదురై వారి నిజాయితి నిలుచును. అయినను వారి జాతి వారికి ఒక ప్రత్యేక నామము ఇవ్వదు. ఎందుకనగా ఒక ప్రత్యేక లక్షణములో ఇతరులందరిని మించి గుర్తింపు పొందినప్పుడే ఆ వ్యక్తిని ప్రజలు ప్రత్యేక నామముతో సత్కరించెదరు. యుద్ధములో పాల్గొను ప్రతి సైనికుడు తన ప్రాణమును ఫణంగా పెట్టును. కాని ఆంగ్ల జాతి తమ ప్రతి సైనికునికి విక్టోరియా క్రాస్ ప్రదానము చేయదు. లేదా జర్మన్ జాతి తమ ప్రతి సైనికున్ని అయిరన్ క్రాస్‌తో సన్మానించదు. ఫ్రాన్స్‌లో విద్యారంగములో ఆసక్తి కనబర్చు వారు లక్షలాది



మంది వుందురు. కాని ప్రతి ఒక్కరికి లిజన్ ఆఫ్ ఆనర్ (LEGION OF HONOUR) పట్టా లభించదు. కనుక ఒక వ్యక్తి 'విశ్వసనీయుడు', 'సత్యవంతుడు'గా వుండుట అతని ఉన్నతమునకు నిదర్శనము కాదు. కాని ఒక వ్యక్తికి మొత్తం జాతి 'విశ్వసనీయుడు', 'సత్యవంతుడ'ను బిరుదు ప్రదానం చేయుట సాధారణ విషయం కాదు. ప్రతి తరములో ఒక్కరికి 'విశ్వసనీయుడు', 'సత్యవంతుడు' అనే బిరుదు మక్కా ప్రజలు ఇచ్చినను ఆ బిరుదు పొందు వాడు గొప్ప వ్యక్తి అనబడును. కాని అరబ్ చరిత్ర సాక్ష్యముగా అరబ్ ఏ తరములో ఎప్పుడు కూడ ఏ వ్యక్తికి ఈ బిరుదు ప్రదానం చేయువారు కాదు. వందలాది సంవత్సరముల అరబ్ చరిత్రలో ముహమ్మద్ రసూలులల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మాత్రమే ఒక ఉదాహరణగా కనిపించెదరు. అరబ్ వాసులు వారికి 'విశ్వసనీయుడు', 'సత్యవంతుడు' అనే బిరుదులు ప్రదానం చేసిరి. అరబ్ వందలాది సం॥ల చరిత్రలో జాతిలోని ఒక్క వ్యక్తికి 'విశ్వసనీయుడు', 'సత్యవంతుడు' అనే ఈ బిరుదులు ప్రదానము చేయుట అతని విశ్వసనీయత, సత్యము ఈ రెండింటిలో వారి ఉదాహరణ మరోవ్యక్తిలో వున్నట్లు అరబ్బులు చూడలేదు. సూక్ష్మ దృష్టిలో అరబ్బులు పేరుపొంది యుండిరి. వారు నిరుపమాణమని తేల్చినది ప్రపంచములో నిశ్చయముగా సాటిలేనిదిగా భావించబడును.

వారి గుణగణాల గురించి మరో సాక్ష్యము వారి అవతరణ సందర్భమున హజ్రత్ ఖదీజ (రజియల్లాహు అన్‌హా) ఇచ్చిరి. దానిని నేను ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రలో ప్రస్తావించితిని. వారి ప్రవర్తన రహస్య కోణములను ఈ పుస్తక పాఠకులు తెలుసుకొనవలెనని వారి గుణగణాల కొన్ని ఉదాహరణలు నేను ఇచట ప్రస్తావించ దలచితిని. .

## ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆధ్యాత్మిక, శారీరక పవిత్రత

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఎప్పుడు దూషించేవారు కాదు. వృధా ప్రమాణములు చేయువారు కాదు. *(బుఖారి కితాబుల్ అదబ్)* అరబ్‌లో నివసించుచూ ఇటువంటి ప్రవర్తన అరుదైన విషయమే. అరబ్బులు అలవాటుగా దుర్భాషలాడేవారని మేము అనలేము కాని అరబ్బులు నిస్సందేహముగా అలవాటుగా ప్రమాణములు చేసేవారని చెప్పవచ్చును. నేటి వరకు అరబ్‌లో అధికంగా ప్రమాణములు చేయు ఆచారము కొనసాగుచున్నది. కాని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్‌ను అమితంగా గౌరవించడంతో అసందర్భముగా అతని పేరు ఉచ్చరించుటను ఎప్పుడు ఇష్టపడేవారు కాదు. పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. సదా దంతములను శుభ్రపరిచేవారు. ఈ విషయము గురించి గట్టిగా వారిట్లు ఆదేశించేవారు. ముస్లిములకు ఇబ్బంది కలుగుననే భయము నాకు లేనిచో ప్రతి ప్రార్థనకు ముందు దంతములను శుభ్రము చేయవలెనని నేను ఆదేశించేవాడిని. *(మిష్కాత్ కితాబుత్తహారత్)*

భోజనము తినే ముందు కూడ చేతులు శుభ్రపరచుకునేవారు. భోజనము తర్వాత కూడ చేతులు శుభ్రపరచుకొని పుక్కిలించేవారే గాక ఉడికిన ప్రతి పదార్ధమును భుజించిన తర్వాత పుక్కిలించేవారు. ఉడికిన పదార్థమును భుజించిన తర్వాత పుక్కిరిల్లనిదే ప్రార్థనకు వెల్లుటను ఇష్టపడేవారు కాదు. *(బుఖారి కితాబుల్ అత్‌యిమహ్)*

ముస్లిములు సమావేశమగు ఏకైక స్థలం మస్జిదులు. వాటి పరి శుభ్రత పట్ల వారు ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. గాలి శుభ్రమగుటకు సమావేశముల రోజులలో మస్జిద్‌లను శుభ్రపరచి, వాటిలో సుగంధము ఏర్పాటు చేయవలెనని వారు ముస్లిములను ప్రత్యేకముగా ఆదేశించేవారు.



*(మిష్కాత్ కితాబుస్సలాత్)* దుర్వాసన గల పదార్థములు భుజించి మస్జిద్‌లకు రాకూడదని అనుచరులను వారు సదా ఆదేశించే వారు. *(బుఖారి కితాబుల్ అత్‌యిమహ్)* రహదారుల శుభ్రత గూర్చి వారు ప్రత్యేకముగా ఆదేశించేవారు. రహదారిలో పొదలు, రాళ్ళు, ఏదేని మలిన వస్తువులు పడివున్నచో వారు స్వయముగా వాటిని తొలగించేవారు. రహదారుల శుభ్రత పాటించే వ్యక్తితో అల్లాహ్ ఆనందపడునని అతనికి పుణ్యము అందించునని వారు తెలిపేవారు. *(ముస్లిం కితాబుల్ బిర్ర్ వస్సిలహ్)*

రహదారులను మూసివేయుట, మార్గములలో కూర్చొనుట, బాటసారులకు ఇబ్బంది కలిగించే వస్తువులను పడవేయుట, దారిలో కాలకృత్యాలు తీర్చుకొనుట మొ॥ వాటిని అల్లాహ్ ఇష్టపడడని వారు తెలిపేవారు. *(మిష్కాత్ కితాబుత్తహారత్)*

నీటి శుభ్రత పట్ల వారు ప్రత్యేక జాగరూకత కలిగియుండిరి. నిలిచి వున్న నీటిలో ఎటువంటి మలినము వేయకూడదని వారు అనుచరులను ఎల్లప్పుడు ఆదేశించేవారు. నిలిచి వున్న నీటిలో కాలకృత్యాలు తీర్చుకొనుటను వారు కఠినముగా నివారించేవారు. *(బుఖారి కితాబుల్ వజూ)*

### ఆహారములో నిరాడంబరత, ధార్మికత

అన్న పానీయములలో వారు సదా నిరాడంబరతను పాటించే వారు. భోజనములో ఉప్పు అధికమైనను, ఉప్పు లేకున్నను, భోజనము రుచికరముగా లేకున్నను వారు అసంతృప్తి ప్రదర్శించేవారు కాదు. సాధ్యమైనంత వరకు ఇటువంటి భోజనమును భుజించి వండిన వ్యక్తి బాధపడకూడదనే ప్రయత్నించేవారు. మరీ భరించలేనట్లు వుండినచో తక్కువ భుజించేవారు. కాని దీనితో నాకు బాధ కలిగినదని బహిర్గతం

చేయువారు కాదు. *(బుఖారి కితాబుల్ అత్‌యిమహ్: అబూహురైరహ్ ఉల్లేఖనము)* వారు భోజనము చేయునప్పుడు ఆహారము వైపు దృష్టి సారించి ఇట్లనేవారు. కొందరు గర్వమును ప్రదర్శించుచు ఒక వస్తువును ఆధారముగా చేసుకొని అవసరము లేని విధముగా భుజించుటను నేను ఇష్టపడను. *(బుఖారి కితాబుల్ అత్‌యిమహ్)* వారి వద్దకు ఏదైనా వస్తువు వచ్చినప్పుడు అనుచరులలో పంచి తినేవారు. ఒక మారు వారి వద్దకు కొన్ని ఖర్జూరములు వచ్చినవి. అనుచరుల సంఖ్యను వారు అంచనా వేయగా ఒక్కొక్కరికి ఏడు ఖర్జూరములు వచ్చుచుండెను. కనుక అనుచరులందరికి ఏడు ఏడు ఖర్జూరములు పంచిరి. *(బుఖారి కితాబుల్ అత్‌యిమహ్: అబూహురైరహ్ ఉల్లేఖనము)* హజ్రత్ అబూహురైరహ్ (రజి) ఉల్లేఖనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం యవల రొట్టె కూడ ఎన్నడు పుష్టిగా భుజించలేదు. *(బుఖారి కితాబుల్ అత్‌యిమహ్)* వారు ఒక సారి దారిలో వెళ్లుచుండగా కొందరు ఒక మేకను కాల్చి, విందు చేసుకొనుచుండగా వారు చూచిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను వారు చూచి వారిని ఆహ్వానించిరి. కాని వారు తిరస్కరించిరి. *(బుఖారి కితాబుల్ అత్‌యిమహ్)* దీని అర్థము కాల్చిన మాంసము తినుట వారికి ఇష్టము లేదని కాదు. వారికి సమీపములోనే నిరుపేదలు ఆకలితో అలమటించుచుండగా వారి కనుల ముందే ఈ విధముగా మేకను కాల్చి తినుటను వారు (స) ఇష్టపడలేదు. వారు (స) కాల్చిన మాంసమును భుజించేవారని ఇతర కథనములతో ఋజువైనది.

హజ్రత్ ఆయిషా (రజి) కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎన్నడు వరుసగా మూడు రోజులు పుష్టిగా భుజించలేదు. ఇదే పరిస్థితి వారి మరణము వరకు కొనసాగెను. *(బుఖారి*



*కితాబుల్ అత్‌యిమహ్)*

భోజనము పట్ల వారు ప్రత్యేకముగా పాటించిన విషయమేమనగా ఆహ్వానము అందనిదే ఎవరు ఇతరుల ఇంటికి భోజనమునకు వెళ్లకూడదు. ఒక సారి వారిని ఒక వ్యక్తి విందుకు పిలిచి, తమ వెంట మరో నలుగురిని కూడ తీసుకొని రాగలరని విన్నవించెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని ఇంటి వద్దకు చేరుకున్నప్పుడు వారి వెంట ఐదవ వ్యక్తి కూడ వున్నాడని తెలిసెను. ఆహ్వానించిన వ్యక్తి బయటికి వచ్చినప్పుడు అతనితో వారిట్లనిరి. మీరు మా ఐదుగురిని విందుకు ఆహ్వానించిరి. మీరు కోరినచో ఇతన్ని అనిమతించగలరు లేనిచో ఇతన్ని తిరిగి పంపుము. ఇంటివాడు ఇట్లనెను. నేను ఇతన్ని కూడ ఆహ్వానించుచున్నాను. ఇతను కూడ లోనికి రావచ్చుననెను. *(బుఖారి కితాబుల్ అత్‌యిమహ్)*

వారు ఎల్లప్పుడు బిస్మిల్లాహ్ చదివి భోజనము ప్రారంభించేవారు. భోజనము ముగిసిన తర్వాత వారు ఈ క్రింది పదాలలో అల్లాహ్‌ను ప్రశంసించేవారు.

اَلْحَمْدُ لِلّٰهِ حَمْدًا كَثِيْرًا طَيِّبًا مُبَارَكًا فِيْهِ غَيْرَ مكفى ولا مودع ولا مستغنى عنه ربّنا

అనగా సర్వ ప్రశంసలకు అర్హుడు అల్లాహ్‌యే. అతడే మాకు ఆహారము అందించెను. చాలా చాలా ప్రశంస, నిష్కల్మశ ప్రశంస, తరగని ప్రశంస. మానవుడు నేను పూర్తిగా ప్రశంసించానని భావించని ప్రశంస. ప్రశంస హక్కును నేను పూర్తి చేయలేదని భావించును. ఎన్నడు ప్రశంసించుటను నిలిపివేయడు. అల్లాహ్ ఏ కార్యము ప్రశంసనీయము కాదని, ప్రశంసకు అర్హత లేదనే ఆలోచన నాకు రాకూడదు. ఓ అల్లాహ్ ! మమ్మూ ఇటులనే చేయుము. మరి కొన్ని కథనముల ప్రకారము వారు ఒక్కో సారి ఈ క్రింది పదాలలో కూడ ప్రార్థన చేసేవారు.

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ کَفَانَا وارْوانا غَیْرَ مکفی ولا مکفور (بخاری کتاب الاطعمة)

అనగా సర్వ ప్రశంసలకర్తుడు అల్లాహ్‌యే. అతడే మా ఆకలి, దాహార్తిని తీర్చును. అతన్ని ప్రశంసించుటలో మేము ఎన్నడు అలసిపోకూడదు, ఎన్నడు మేము అతని పట్ల కృతఘ్నులుగా మారకూడదు.

పుష్టిగా తినక ముందే భోజనము ముగించమని అనుచరులను వారు సదా ఆదేశించేవారు. ఒక వ్యక్తి ఆహారము ఇద్దరికి సరిపోవలెనని వారనేవారు. *(బుఖారి కితాబుల్ అత్‌యిమహ్)* వారి గృహములో ఏదేని రుచికరమైన వస్తువు వండినచో ఇరుగు పొరుగు వారికి కూడ ఇవ్వవలెనని గృహిణులను వారు ఆదేశించేవారు. *(ముస్లిం కితాబుల్ బిర్ వస్సిలహ్)* తమ చుట్టు ప్రక్కల వారికి తరచు కానుకలు పంపేవారు. *(బుఖారి కితాబుల్ అదబ్)* నిరుపేదలైన తమ అనుచరులలో ఎవరైనా ఆకలితో వున్నారా అనే విషయమును వారి ముఖ కవలికలతోనే పసిగట్టేవారు. హజ్రత్ అబూహురైరహ్ (రజి) ఉల్లేఖనము ఇట్లు గలదు. వారొకసారి చాల రోజుల నుండి ఆకలితో యుండిరి. ఏడు పూటల ఆకలి వలన వారు భరించలేక ఒక రోజు మస్జిద్ ద్వారము ముందు నిలబడిరి. దైవికముగా హజ్రత్ అబూబకర్ (రజి) అక్కడి నుండి పోవుచుండిరి. పేదలకు ఆహారము తినిపించే ఆదేశము గల ఒక సూక్తి భావమును వారిని వారడిగిరి. వీరికి ఈ సూక్తి భావము తెలియదని హజ్రత్ అబూబకర్ (రజి) భావించి, ఆ సూక్తి భావము చెప్పి ముందుకు వెళ్లిపోయిరి. హజ్రత్ అబూహురైరహ్ (రజి) ఈ సంఘటనను ఇతరులకు తెలిపేటప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) నకు నా కంటే ఎక్కువ పవిత్ర ఖురాన్ తెలుసునా? వారు ఈ సూక్తి భావమును గమనించి నా ఆకలి తీర్చెదరని నేను ప్రశ్నించితినని కోపగించుకునేవారు. ఇంతలోనే హజ్రత్ ఉమర్ (రజి) కూడ అక్కడికి



వచ్చిరి. వారిని కూడ నేను ఈ సూక్తి భావము అడిగితిని. హజ్రత్ ఉమర్ (రజి) కూడ ఈ సూక్తి భావము తెలిపి ముందుకు వెళ్లిపోయిరి. అనుచరులు (రజి) యాచించుటను ఇష్టపడేవారు కాదు. అబూహురైరహ్ (రజి) ఇట్లు తెలిపిరి. ఇక అడగనిదే ఆహారము లభించదని భావించి నేను నిర్ఘాంతపోయి భరించలేక క్రింద పడిపోవుచుంటిని. నేను ద్వారము నుండి ముఖము త్రిప్పక ముందే ఎంతో ప్రేమతో కూడిన శబ్దము ఎవరో నన్ను ఇట్లు పిలిచినట్లు వచ్చెను. అబూహురైరహ్! అబూహురైరహ్!! నేను ముఖము త్రిప్పగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ గృహపు కిటికి తెరిచి నిలబడి నవ్వుచుండిరి. నన్ను చూచి వారిట్లనిరి. ఓ అబూ హురైరహ్! ఆకలితో నున్నావా ? ఓ రసూలుల్లాహ్! అవును ఆకలితో వున్నానని నేనంటిని. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మా ఇంట్లో కూడ భుజించడానికి ఏమి లేకుండెను. ఇప్పుడే ఒక వ్యక్తి పాలు పంపించెను. నీవు మస్జిద్ లోకి వెళ్లి చూడు. మన వలె ఇంకా కొందరు ముస్లిములు ఆకలి తో వుండవచ్చును. అబూహురైరహ్ మనసులో ఇట్లనుకొనిరి. నేను ఎంతో ఆకలితో వున్నాను. నేనొక్కడినే ఆ పాలను మొత్తం త్రాగగలను. ఇప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇతరులను కూడ పిలవమని అనిరి. కనుక నా భాగము అతి తక్కువ వుండును. కాని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించినందున వారు మస్జిద్‌లోకి వెళ్లిచూడగా ఇంకా ఆరుగురు కూర్చొని వుండిరి. వారిని కూడ వెంట బెట్టుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారము వద్దకు వచ్చిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆ కొత్తగా వచ్చిన ఆరుగురిలో ఒకరికి పాల పాత్ర ఇచ్చి త్రాగమనిరి. అతడు పాలు త్రాగి ఆగిన తర్వాత ఇంకా త్రాగమని వారు బలవంతము పెట్టిరి. మూడవ సారి కూడ బలవంతము చేసి అతనికి పాలు త్రాగించిరి. ఈ విధముగా

ఆ ఆరుగురికి వరుసగా వారు పాలు త్రాగించిరి. ప్రతి సారి ఇక నా వంతు వచ్చే వరకు ఏమి మిగులునని నేను ఊహించుకొనే వాడినని అబూహురైరహ్ (రజి) తెలిపిరి. కాని ఆ ఆరుగురు త్రాగిన తర్వాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ పాల పాత్ర నాకు అందించినప్పుడు పాత్రలో ఇంకా చాలా పాలు వున్నట్లు నేను చూచితిని. నేను పాలు త్రాగిన తర్వాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బలవంతముగా మూడు సార్లు నాతో కూడ పాలు త్రాగించిరి. నా తర్వాత మిగిలిన పాలు తాము స్వయముగా త్రాగి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుచూ ద్వారము మూసుకొనిరి. *(బుఖారి కితాబు (రిఖాఖ్)*

అల్లాహ్‌నే నమ్ముచు ఆకలిని భరించవలెనని సైగతో కూడ అడగరాదని అబూహురైరహ్ (రజి)ను సూచించుటకు బహుశ రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అందరి కంటే తర్వాత వారికి పాల పాత్ర ఇచ్చి యుండిరి.

వారు సదా కుడి చేతితోనే భుజించేవారు. నీరు కూడ కుడి చేతితోనే త్రాగేవారు. నీరు త్రాగే టప్పుడు మధ్యలో మూడు పర్యాయములు శ్వాస తీసుకొనేవారు. ఇందులో ఒక వైద్యపరమైన జ్ఞానము గలదు. ఒకే శ్వాసలో నీరు త్రాగడంతో అధిక నీరు త్రాగబడి జీర్ణకోశము చెడిపోవును. ఆహారములో పవిత్రమైన వస్తువులను భుజించవలెననే నిబంధనను వారు పాటించేవారు. కాని నిరుపేదల హక్కులకు భంగము కలగకుండా, మానవునికి విపరీతముగా భుజించే అలవాటు పడకుండా జాగ్రత్త పడేవారు. వారు చాలా సాధారణ ఆహారము తీసుకునేవారని తెలుపబడెను. కాని ఎవరైనా రుచికరమైన ఆహారము అందించినచో దానిని తిరస్కరించక భుజించేవారు. మంచి రుచికరమైన ఆహారమును వెతికేవారు కాదు. తేనె, ఖర్జూరము వారికి ఇష్టముండెను. ఖర్జూరమునకు విశ్వాసికి మధ్య



ఒక బంధమున్నదని ప్రవచించేవారు. ఖర్జూరపు ఆకులు, పొట్టు, కాయ, పండు, బీజము అన్ని ఉపయోగకరమైనవే. దాని ఏ వస్తువు వృధా కాదు. అటులనే విశ్వాసి చేయు ఏ కార్యము కూడ వృధా కాదు. అతని ప్రతి కార్యము మానవ జాతికి లాభదాయకముగా నుండును.

### దుస్తులు, ఆభరణాలలో నిరాడంబరత, దైవభీతి

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం దుస్తుల విషయంలో కూడ చాలా నిరాడంబరతను ఇష్టపడేవారు. వారు సాధారణముగా చొక్కా, లుంగి లేదా చొక్కా, పైజామా ధరించేవారు. వారు లుంగి, పైజామాను చీలమండలి పైన మోకాళ్ళ క్రిందికి ధరించేవారు. మోకాళ్లు లేదా మోకాళ్ల కంటే పైన శరీరము నగ్నముగా వుంచుటను వారు ఇష్టపడేవారు కాదు. తప్పనిసరి పరిస్థితి తప్ప వారు మానవుల దుస్తులలోగాని తెరలలో గాని చిత్రములు గల వస్త్రమును ఇష్టపడేవారు కాదు. అన్యారాధనకు చిహ్నాములుగా నున్న పెద్ద చిత్రములను అస్సలు అనుమతించేవారు కాదు. ఇటువంటి ఒక వస్త్రము ఓరోజు వారి గృహములో వేలాడదీసి వుండగా చూచి దానిని వెంటనే తొలగింప జేసిరి. అన్యారాధనను కలిగించని చిన్న చిన్న చిత్రములు గల వస్త్రములను విస్మరించేవారు. పట్టు వస్త్రములు వారు ధరించేవారే కాదు. పట్టు వస్త్రము ధరించుటను ఇతర పురుషులకు కూడ అనుమతించేవారు కాదు. రాజులకు లేఖలు వ్రాయునప్పుడు వారొక ముద్ర గల ఉంగరము చేయించిరి. కాని వారిట్లు ఆదేశించిరి. స్వర్ణముతో కాదు వెండితో చేయుము. ఎందుకనగా నా సమాజ పురుషులు స్వర్ణము ధరించకూడదని అల్లాహ్ ఆజ్ఞాపించెను. పట్టు వస్త్రములు, స్వర్ణాభరణాలు ధరించు అనుమతి స్త్రీలకు నిస్సందేహముగా యుండెను. ఈ విషయములో కూడ హద్దులు దాటకూడదని ఉపదేశించేవారు. ఒక సారి పేదల కొరకు వారు విరాళాలు

సేకరించిరి. ఒక మహిళ ఒక కడియము తీసి వారి ముందు పెట్టెను. రెండవ చేయి నరకము నుండి తప్పించుటకు అర్హత లేనిదా ? అని వారనిరి. ఆ మహిళ రెండవ కడియము కూడ తీసి పేదల కొరకు ఇచ్చివేసెను. వారి సతీమణుల ఆభరణాలు లేనితో సమానము. అనుచర స్త్రీలు కూడ వారి బోధనలను పాటించి ఆభరణాలు చేయించుటకు వెనుకాడే వారు. పవిత్ర ఖురాన్ బోధనానుసారము ధనమును కూడబెట్టుట పేదల హక్కులను హరించుటయే అని వారు తెలిపేవారు. అందుకే వెండి, బంగారమును తమ గృహములలో కూడబెట్టుకొనుట జాతీయ ఆర్థిక స్థితికి గొడ్డలి పెట్టు, నేరమని భావించేవారు. ఒక సారి హ్రజత్ ఉమర్ (రజి) వారికిట్లు సలహా ఇచ్చిరి. మీతో మాట్లాడుటకు పెద్ద పెద్ద రాజుల దూతలు వచ్చుచున్నారు. కావున మీరొక విలువైన వస్త్రముల జత కుట్టించుకొని ఇటువంటి సందర్భములలో ధరించవలెను. హ్రజత్ ఉమర్ (రజి) చెప్పిన ఈ మాటను విని వారు చాలా కోపగించుకొని ఇట్లనిరి. అల్లాహ్ నన్ను ఈ విషయముల కొరకు పుట్టించలేదు. ఇవి గర్వముతో కూడిన మాటలు. మా దుస్తులు ఎలా వున్నా వాటితోటే మేము ప్రపంచవాసులను కలిసెదము. ఒక సారి పట్టు వస్త్రములు వారికి ఇవ్వబడెను. దానిని వారు హ్రజత్ ఉమర్ (రజి) కు కానుకగా ఇచ్చి వేసిరి. మరుసటి రోజు హ్రజత్ ఉమర్ (రజి) దానిని ధరించి తిరుగుచుండగా వారు చూచి అసంతృప్తి వ్యక్తపరచిరి. ఓ రసూలుల్లాహ్! దీనిని మీరే నాకు కానుకగా ఇచ్చిరి కదా అని హ్రజత్ ఉమర్ (రజి) అన్నప్పుడు ప్రతి వస్తువు మన వాడుక కొరకే లేదుగదా? అని వారనిరి. అనగా ఇది పట్టు వస్త్రము అయినందున నీవు నీ భార్య లేదా కుమార్తెకు ఇవ్వవలసియుండెను. లేదా మరో విధముగా వినియోగించవలెను. దానిని తమ దుస్తులుగా వినియోగించడం మంచిది కాదు.



## సాధారణ పరుపు

వారి పరుపు కూడ అతి సాధారణమైనదై యుండెడిది. సామాన్యముగా ఒక చర్మము లేదా ఒంటె వెంట్రుకల, వస్త్రముగా యుండెడిది. హ్రజత్ ఆయిషా (రజి) ఇట్లు తెలిపిరి. మా పరుపు చాలా చిన్నదైనందున రాత్రి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రార్థనకు లేచినప్పుడు నేను ఒక వైపు తిరిగి పరుండేదానిని. పరుపు ఎంత చిన్నదైనదనగా వారు ప్రార్థనకు నిలిచినప్పుడు నేను కాళ్ళు పొడుగు చేసుకునేదానిని. మరల వారు సాష్టాంగము చేయునప్పుడు నేను నా కాళ్ళను ముడుచుకునే దానిని.

## సాధారణ నివాస గృహము

నివాస గృహ విషయములో కూడ వారు చాలా నిరాడంబరతను ఇష్టపడేవారు. సాధారణముగా వారి గృహములలో ఒక్కొక్క గది చిన్న వాకిలి వుండెడిది. ఆ గదిలో ఒక తాడు కట్టివుండెడిది. ఆ తాడుపై ఒక వస్త్రము వేసి ఎవరైనా వారితో మాట్లాడటానికి వచ్చినప్పుడు వచ్చిన వారితో విడిగా కూర్చొని మాట్లాడేవారు. మంచం ఉపయోగించేవారు కాదు. భూమిపైనే పరుపు వేసి పరుండేవారు. వారు పరమపదించిన తర్వాత హ్రజత్ ఆయిషా (రజి) ఇట్లు తెలిపిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతి సాధారణమైన జీవితము గడుపుచున్నందున వారి జీవితము లో చాలా సందర్భాలలో ఖర్జూరము, నీరుతోనే పూట గడపవలసి వచ్చెడిది. వారు మృతిచెందిన రోజు కూడ మా గృహములో తినుటకు ఖర్జూరము, నీరు తప్ప మరేమి లేకుండెను.

## అల్లాహ్‌తో ప్రేమ, ఆరాధన

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పూర్తి జీవితము అల్లాహ్ ప్రేమలో మునిగినట్లు స్పష్టమగును. అనేక సామాజిక బాధ్యతలు వున్నను

దివారాత్రులు దైవారాధనలో నిమగ్నమయ్యేవారు. అర్ధరాత్రి తర్వాత వారు దైవారాధనకు లేచి ఉదయం వరకు ప్రార్థన చేసేవారు. ఒక్కోసారి వారి పాదాలకు వాపు వచ్చేది. వారిని చూసేవారికి వారి స్థితిపై దయ కలిగేది. హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనము ప్రకారము ఇటువంటి సందర్భములో ఒక సారి ఓ రసూలుల్లాహ్ ! మీరు ఇప్పటికే దైవ సన్నిధిలో చోటు పొందితిరి. మీరు మీ ఆత్మను ఎందుకు ఇంత కష్టపెడుచున్నారని నేను అన్నప్పుడు వారిట్లనిరి. ఓ ఆయిషా !

اَفَلَا اَكُوْنَ عَبْدًا شَكُوْرًا

అనగా నేను దైవ సన్నిధిలో చోటు పొందినది సత్యమైనప్పుడు, అల్లాహ్ దయతో నాకు తన సామీప్యము కల్పించినందున అతనికి కృతజ్ఞతలు తెలుపుట నా కర్తవ్యము కాదా? ఎందుకనగా ఉపకారమునకు బదులు కృతజ్ఞతే వుండును.

అల్లాహ్ అనుమతి లేనిదే వారు ఏ పెద్ద కార్యము చేసేవారు కారు. వారి జీవిత సంఘటనలలో ప్రస్తావించినట్లు మక్కా వారు వారిని ఎంత కఠినముగా హింసించినను అల్లాహ్ ద్వారా సువార్త వాణి అవతరించనిదే, సువార్త వాణి ద్వారా మక్కా నుండి ప్రస్థానము చేయు ఆదేశము రానిదే వారు మక్కాను విడిచి పోలేదు. మక్కా వారి దౌర్జన్యములు అధికమైనట్లు వారు చూచి ఎబిసీనియా వైపు ప్రస్థానము చేయు అనుమతి అనుచరులకిచ్చిరి. మీరు కూడ వారి వెంట రాగలరని వారు కోరినప్పుడు నాకింత వరకు అల్లాహ్ అనుమతి లభించలేదని వారు తెలిపిరి. హింస, విపత్తు సమయములో ప్రజలు తమ మిత్రులను, బంధువులను తమ చుట్టు చేర్చుకొనెదరు. కాని వారు తన సమాజమును ఎబిసీనియా వైపు ప్రస్థానము చేయవలెనని ఆదేశించి తాను ఒక్కరే మక్కాలో ఒంటరిగా వుండి పోయిరి. ఎందుకనగా వారి అల్లాహ్ ప్రస్థానము చేయుటకు



వారికింత వరకు ఆదేశమివ్వలేకుండెను.

అల్లాహ్ శాసనమును వారు వినుచుండగా, ప్రత్యేకముగా వారికి తమ విధుల గురించి సూచనలు ఇవ్వబడిన సూక్తుల సమయమున వారి కనుల నుండి సహజముగనే కన్నీళ్లు వచ్చేవి. అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజి) వ్యాఖ్యానము ప్రకారము ఒక సందర్భమున పవిత్ర ఖురాన్ కొన్ని సూక్తులు పఠించి వినిపించమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నన్ను ఆదేశించిరి. సమాధానముగా నేనిట్లంటిని. ఓ రసూలుల్లాహ్! ఖురాన్ మీపై అవతరించెను. నేను మీకేమి వినిపించగలను? వారిట్లనిరి. ఇతరులు ఖురాన్ చదువుచుండగా వినుట నేను ఇష్టపడెదను. అందుకు నేను సూరతున్నిసా చదివి వినిపించడం ప్రారంభించితిని. చదువుచూ నేను ఈ సూక్తి (అన్నిసా: 42) వరకు చేరుకొంటిని.

فَكَيْفَ اِذَا جِئْنَا مِنْ كُلِّ اُمَّةٍ بِشَهِيْدٍ وَّجِئْنَا بِكَ عَلٰى هٰٓؤُلَآءِ شَهِيْدًا (النساء:٤٢)

అనగా 'ప్రతి ప్రజా సమూహము నుండి ఆ జాతి ప్రవక్తను మేము సాక్షిగా తెచ్చి వారి గణన చేయుదుము, అటులనే మేము నిన్ను నీ జాతి ముందు గణన కొరకు సాక్షిగా చేసి నిలిపినప్పటి స్థితి ఎట్లుండునో!' అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం "ఆగుము, ఆగుము" అనిరి. నేను వారి వైపు చూడగా వారి రెండు కనుల నుండి కన్నీటి ధార ప్రవహించుచుండెను.

ప్రార్థన పట్ల వారు అమిత శ్రద్ధ కలిగి వుండిరి. తీవ్ర అనారోగ్యము వలన గృహములో లేదా పరుండి ప్రార్థన చేసుకునే అనుమతి అల్లాహ్ ఇచ్చినను వారు ఇతరుల సహాయముతో ప్రార్థన చేయించుటకు మస్జిద్‌నకు వచ్చేవారు. ఒక రోజు వారు ప్రార్థనకు రాలేకపోయినందున హజ్రత్ అబూబకర్ (రజి) ను ప్రార్థన చదివించవలెనని ఆదేశించిరి. కాని

ఇంతలోనే ఆరోగ్యం కొంచెం మెరుగుపడినట్లు అనిపించగా ఇద్దరు వ్యక్తుల సహాయముతో మస్జిద్‌నకు బయలుదేరిరి. అతి బలహీనత వలన వారు తమ రెండు పాదాలను భూమిపై ఈడ్చుకుంటూ పోయారని హజ్రత్ ఆయిషా (రజి) తెలిపిరి. సంతోషము, శ్రద్ధ కలిగించుటకు ప్రపంచములో చప్పట్లు కొట్టెదరు. అరబ్బులలో కూడ ఈ ఆచారముండెను. కాని వారికి అల్లాహ్ ఆరాధన, అతని స్మరణ పట్ల అమితాసక్తి వున్నందున ఈ ఉద్దేశము కొరకు కూడ దైవస్మరణనే వినియోగించుటకు ఆదేశించిరి. కనుక ఇట్లు ప్రస్తావన గలదు. ఒక సారి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక పనిలో నిమగ్నమై వుండగా ప్రార్థన సమయము అయ్యెను. అబూబకర్! (రజి) ప్రార్థన చదివించమని వారనిరి. ఇంతలోనే వారు పని ముగించుకొని వెంటనే మస్జిద్ వైపు బయలు దేరిరి. వారు మస్జిద్ చేరు కున్నప్పుడు అబూబకర్ (రజి) ప్రార్థన చదివించుచుండిరి. వారు మస్జిద్‌లో ప్రవేశించారని అనుచరులకు తెలిసినప్పుడు భరించ లేక ప్రార్థన చేయు వారు చప్పట్లు కొట్టడం ప్రారంభించిరి. ఒక వైపు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వచ్చినందుకు వారు అమితానందము పొందుచుండిరి. రెండవ వైపు ఇప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చేరు కున్నందున మీ నాయకత్వము ముగిసినదని అబూబకర్ (రజి) నకు సూచించుచుండిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు ఇమామ్ స్థానము వదిలి హజ్రత్ అబూబకర్ (రజి) వెనక్కి వచ్చిరి. ప్రార్థన తర్వాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అబూబకర్! (రజి) నేను ప్రార్థన చేయించమని ఆదేశించిన తర్వాత నీవు వెనక్కి ఎందుకు వచ్చితివి? అబూబకర్ (రజి) ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్ ! అల్లాహ్ ప్రవక్త వుండగా అబూఖహాఫ తనయుడు ఏ స్థాయిలో ప్రార్థన చేయించును? తర్వాత అనుచరుల వైపు తిరిగి వారిట్లనిరి. మీరు ఏ ఉద్దేశముతో చప్పట్లు



కొట్టిరి ? అల్లాహ్ స్మరణలో వుండగా చప్పట్లు కొట్టుట సముచితము కాదు. ప్రార్థన మధ్యలో ఏదైనా విషయము తెలుపుట తప్పనిసరి అయినప్పుడు చప్పట్లు కొట్టే బదులు అల్లాహ్ నామమును కీర్తించుము. అప్పుడు సహజంగానే ఇతరులు ఆ విషయమును అర్థము చేసుకొనెదరు. కాని ప్రార్థనలో అనవసర ప్రదర్శనను ఇష్టపడేవారు కాదు. ఒక సారి వారు ఇంట్లోకి వెళ్ళినప్పుడు రెండు స్తంభాల మధ్య ఒక తాడు వేలాడదీసి వున్నట్లు చూచి, ఈ తాడును ఎందుకు కట్టిరని అడిగిరి. ప్రజలు ఇట్లనిరి. ఇది హజ్రత్ జైనబ్ (రజి) తాడు. ప్రార్థన చేయుచు అలసిపోయినప్పుడు ఈ తాడు సహాయమును తీసుకొనెదరు. వారిట్లనిరి. ఈ విధముగా చేయకూడదు. ఈ తాడును విప్పి వేయుము. హృదయములో ఉత్సాహము వున్నంత వరకే ప్రతి ఒక్కరు ప్రార్థన చేయవలెను. అలసటకు గురైనప్పుడు కూర్చొనవలెను. ఇటువంటి ప్రదర్శనతో కూడిన ప్రార్థన నిష్ప్రయోజనం.

అన్యారాధనను వారు గట్టిగా ద్వేషించేవారు. అంతిమ ఘడియలో మృత్యువుతో పోరాడుతున్న సమయంలో ఒక సారి కుడి వైపు తిరిగే వారు, మరోసారి ఎడమ వైపు తిరిగేవారు. అప్పుడు వారిట్లని యుండిరి. 'తమ సందేశహరుల సమాధులను ప్రార్థనాలయాలుగా మార్చుకున్న యూదులు, క్రైస్తవులపై అల్లాహ్ శాపము పడుగాక'. అనగా వారు సందేశహరుల సమాధులకు సాష్టాంగములు చేయుదురు, కోరికలు కోరెదరు. వారి భావమేమనగా నా జాతి నా తర్వాత ఈ కార్యమునకు పాల్పడినచో నా ప్రార్థనలు వారికి లభించునని వారు భావించరాదు. దీనితో నాకెలాంటి సంబంధము వుండదు. అల్లాహ్ గౌరవార్ధ ప్రస్తావన వారి జీవిత చరిత్ర సంఘటనలలో వివరించబడెను. వారు విగ్రహాలను ఖండించుట విడిచిపెట్టినచో మక్కా ప్రజలు అన్ని విధాలా లంచములను వారి ముందు ప్రతిపాదించిరి. వారి చిన్నాన్న అబూతాలిబ్ ఇందుకు

మధ్యవర్తిత్వము వహించి ఇట్లనిరి. ఈ చిన్న విషయము కూడ నీవు ఒప్పుకొననిచో, నేను నీ సహాయమును వదలనిచో నా జాతి నన్ను వదిలిపెట్టును. అప్పుడు వారిట్లనిరి. ఓ చిన్నాన్న! వీరు సూర్యుని నా కుడి చేతిలో, చంద్రున్ని నా ఎడమ చేతిలో పెట్టినను నేను ఏకేశ్వరుడైన అల్లాహ్ ఏకత్వ ప్రచారమును వదలలేను. అటులనే ఉహద్ సందర్భమున ముస్లిములు గాయపడి, చెల్లాచెదురైన స్థితిలో, ఒక పర్వతము క్రింద నిలిచివున్నప్పుడు శత్రువు సంపూర్ణ ఆయుధాలతో ముస్లిముల వెన్ను విరిచితిమనే ఆనందముతో నినాదాలు చేయుచుండెను. అబూసుఫ్యాన్ اعلُ هُبَل اعلُ هُبَل అనగా హుబుల్ వైభవము గొప్పది. హుబుల్ వైభవము గొప్పదని అన్నప్పుడు శత్రువుల కంట పడకుండా దాక్కొని వున్న సహచరులను, ఈ దాగివుండుటలోనే వారి క్షేమము యుండెను. అయినను వారిట్లు ఆదేశించిరి. సమాధానమిమ్ము! اللہ اَعلٰی وَاَجَلُّ اللہ اَعلٰی وَاَجَلُّ అనగా అల్లాహ్‌యే గొప్ప వైభవోపేతుడు, అల్లాహ్‌యే గొప్ప వైభవోపేతుడు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు అల్లాహ్ పట్ల గల అభిమానమును తెలుపు మరో ఉదాహరణ వారి జీవితములో ఇట్లు గలదు. ఇస్లాం కంటే పూర్వము వివిధ మతములలో సామాన్యముగా ఈ క్రింది అభిప్రాయము యుండెడిది. సందేశహరుల ఆనందము, దు:ఖముపై భూమ్యాకాశాలలో మార్పు సంభవించును. ఖగోళములోని అంశాలు వారి అధీనములో వుండును. ఒక సందేశహరుడు సూర్యున్ని ఆగమని అనగానే అది ఆగిపోయెనని వ్రాసియుంది. మరొకరు చంద్ర భ్రమనమును నిలిపివేసెనని తెలియును. మరొకరు నీటి ప్రవాహాన్ని ఆపివేసెనని వ్రాసియుంది. కాని ఇస్లాం ఇటువంటి ఆలోచనలు తప్పు అని స్పష్టము చేసి, ఇట్లు తెలిపెను. ఈ విషయములు పరోక్ష సంకేతములు. కాని ప్రజానీకం వాటితో లబ్ది పొందే బదులు వాటిని తప్పుగా అర్థం



చేసుకొని భ్రమలో పడిపోవుదురు. ఇంతటి స్పష్టమైన వివరణలు వున్నను కొందరి హృదయాలలో ఇటువంటి భావాల ప్రభావము మిగిలియుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చివరి రోజులలో వారి ఏకైక కుమారుడు హజ్రత్ ఇబ్రాహీం (రజి) రెండున్నర సం॥ల వయసులో మృతి చెందిరి. అదే రోజు సూర్య గ్రహణం సంభవించినప్పుడు ఇటువంటి కొందరు వ్యక్తులు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కుమారుని మృతి వలన సూర్యుడు మబ్బులు కమ్మెనని మదీనాలో పుకార్లు లేపిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము తెలియగా వారు ఆనందించలేదు, మౌనము కూడ పాటించలేదు. చాలా గట్టిగా దీనిని ఖండించుచూ ఇట్లు తెలిపిరి. సూర్య, చంద్రాదులు అల్లాహ్ ద్వారా నియమిత చట్టమును తెలుపు వస్తువులు. ఒక గొప్ప లేదా సాధారణ వ్యక్తి మరణము, జీవితముతో వాటికి ఎలాంటి సంబంధము వుండదు. *(బుఖారి కితాబుల్ కుసూఫ్)* అరబ్ ప్రాంత ఆచారము ప్రకారము ఒక నక్షత్రము, ఒక బురుజులో వున్నందున మనపై వర్షము కురిసినదని ఏవరైనా అన్నచో వారి ముఖము మారిపోయి ఇట్లనేవారు. ఓ ప్రజలారా! అల్లాహ్ శుభములను ఇతరులతో ఎందుకు అంటగట్టెదరు? అల్లాహ్ నియమించిన చట్టము ప్రకారము వర్షము మొ॥వి సంభవించును. ఒక దేవి, దేవతా లేదా ఇతర ఆధ్యాత్మిక శక్తి ప్రభావముతో అవి సంభవించవు. *(ముస్లిం కితాబుల్ ఈమాన్, బాబ్ కుఫ్ర్ మన్ ఖాల మతర్నా బినౌఇన్)*

## అల్లాహ్‌పై నమ్మకము

అల్లాహ్ పై వారికి పూర్తి నమ్మకముండెను. ఒక వ్యక్తి వారిని ఒంటరిగా పొంది వారిపై ఖడ్గము లేపి ఇప్పుడు నిన్ను నా నుండి ఎవడు రక్షించునని ప్రశ్నించినప్పుడు వారు నిరాయుధులై వుండి పరుండినందున కదల లేని స్థితిలో వున్నను నిదానము, తడబడకుండా “అల్లాహ్” అని

సమాధానమిచ్చిరి. ఈ పదము ఎంత నమ్మకము, విశ్వాసముతో వెలు వడినదనగా ఆ అవిశ్వాసుని హృదయం కూడ వారి విశ్వాస గొప్పతనము, పరిపూర్ణ నమ్మకమును అంగీకరించక తప్పలేదు. అతని చేతి నుండి ఖడ్గము పడిపోయెను. వారిని సంహరించుటకు వచ్చిన వాడు ఇప్పుడు నేరస్తునిగా వారి ముందు నిలబడెను. *(ముస్లిం సంపుటి 2, కితాబుల్ ఫజాయిల్)* అల్లాహ్ పట్ల ఎంత వినమ్రత వుండెననగా ఓ రసూలుల్లాహ్! మీరు మీ కర్మల బలముతో దైవానుగ్రహమును పొందగలరని ప్రజలు అన్నప్పుడు 'కాదు కాదు నేను కూడ అల్లాహ్ ఉపకారముతోనే క్షమించ బడెదనని అనిరి. హజ్రత్ అబూహురైరహ్ (రజి) ఇట్లు తెలిపిరి. నేను ఒక రోజు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఇట్లు అనునట్లు వింటిని. ఏ వ్యక్తి తన కర్మలతో స్వర్గములో ప్రవేశించడు. నేను ఇట్లంటిని. ఓ రసూలుల్లాహ్! మీరు కూడ మీ కర్మలతో స్వర్గములో ప్రవేశించరా? వారిట్లనిరి. నేను కూడ నా కర్మల బలముతో స్వర్గములో ప్రవేశించలేను. కాని అల్లాహ్ అనుగ్రహము, దయతో కరుణించినచో అది సాధ్యమగును. *(బుఖారి కితాబుర్రిఖాఖ్)* మరల వారిట్లనిరి. సత్కార్యములు చేయుటకు ప్రయత్నించుము. అల్లాహ్ సన్నిధికి మార్గములు అన్వేషించుము. మీలో ఎవరూ తన మృత్యువును కోరరాదు. ఎందుకనగా అతడు పుణ్యుడైనచో జీవించి తన పుణ్యములను పెంచుకొనును. దుష్టుడైనచో జీవించి తన పాపముల నుండి పశ్చత్తాప పడుటకు అనుగ్రహము పొందును. *(బుఖారి కితాబుల్ తమన్నా వ కితాబుద్దావాత్)* అల్లాహ్‌తో ప్రేమ ఎంత వుండెననగా ఒక సంఘటన తర్వాత వర్షము కురిసినచో వర్షపు నీటి బొట్టు తన నాలుకపై తీసుకొని ఇది నా పోషకుని తాజా అనుగ్రహమని అనేవారు. సమావేశములో కూర్చున్నప్పుడు పశ్చత్తాప ప్రార్థనలు చేసేవారు. ఇతర సమయాలలో కూడ వారి సమాజము, వారితో సంబంధమున్న



వారు అల్లాహ్ శిక్షకు గురికాకుండా, అల్లాహ్ క్షమాపణకు అర్హులు కావలెనని తరచు పశ్చత్తాప ప్రార్థనలు చేసేవారు. *(బుఖారి కితాబుద్దావాత్, ముస్లిం కితాబుజ్జిక్ర్ వద్దుఆ)* ప్రతి క్షణం అల్లాహ్ ముందు హాజరగు విషయమును గుర్తు చేసుకునేవారు. వారు నిద్రకు ఉపక్రమించి నప్పుడు ఇట్లనేవారు.

باسمک اللّٰھم اموتُ و احیٰ

అనగా ఓ అల్లాహ్! నేను నీ నామముతోనే మరణించెదను, నీ నామముతో జీవించెదను. వారు ఉదయం లేచినప్పుడు ఇట్లనే వారు.

اَلْحَمْدُ لِلّٰہِ الَّذِیْ اَحْیَانَا بَعْدَ مَااَمَاتَنَا وَاِلَیْهِ النُّشُوْر

అనగా సర్వ ప్రశంసలకు అల్లాహ్‌యే అర్హుడు. అతడే మరణించిన తర్వాత మమ్ములను బ్రతికించెను. తర్వాత మేము మా పోషకుని వద్దకే తిరిగి వెళ్లెదము. *(బుఖారి కితాబుద్దావాత్)* అల్లాహ్ సామీప్యమును ఎంత కోరుకునే వారనగా తరచు అల్లాహ్‌ను ఇట్లు ప్రార్థించేవారు.

اللّٰھم اجعل فی قلبی نورًا وفی بصری نورًا وفی سمعی نورًا وعن یمینی نورًا وعن یساری نورًا وفوقی نورًا وتحتی نورًا وامامی نورًا وخلفی نورًا واجعل لی نورًا

అనగా ఓ నా పోషకుడా! నీ కాంతితో నా హృదయమును నింపుము. నీ కాంతితో నా నేత్రములను నింపుము. నా చెవులలో కూడ నీ కాంతిని పూరించుము. నా కుడి, ఎడమ కూడ నీ కాంతిని వెలిగించుము. నా పైన, నా క్రింద కూడ నీ కాంతియే వుండుగాక! నా ముందు, నా వెనుక కూడ నీ జ్యోతి వుండుగాక! ఓ నా పోషకుడా! నా ఉనికిని మొత్తం కాంతిమయం చేయుము. *(బుఖారి కితాబుద్దావాత్ అన్ ఇబ్నె అబ్బాస్)*

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనము ప్రకారము వారి మృతికి

కొన్ని రోజుల ముందు ముసైలమా కజ్జాబ్ వచ్చి ఇట్లనెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తన తర్వాత నన్ను పాలకునిగా నియమించినచో నేను వారి విధేయత స్వీకరించెదను. అప్పుడు అతని వెంట పెద్ద సమూహముండెను. అతని జాతి మొత్తం అరబ్బు జాతుల కంటే పెద్దగా యుండెను. అతడు మదీనాకు చేరుకున్న విషయము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిసినప్పుడు వారు అతని వద్దకు పోయిరి. వారి వెంట సాబిత్ బిన్ ఖైస్ బిన్ షమాస్ వుండిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం చేతిలో ఖర్జూరపు ఒక కొమ్మ వుండెను. వారు ఆ బృందం వద్దకు వచ్చి ముసైలమా కజ్జాబ్ ముందు నిలబడిరి. ఇంతలో మరికొందరు అనుచరులు చేరి వారి చుట్టు నిలబడిరి. వారు ముసైలమాను సంబోధించుచు ఇట్లనిరి. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తన తర్వాత నన్ను ఉత్తరాధికారిగా నియమించినచో నేను వారిని అనుసరించుటకు సిద్ధమని నీవందువా? కాని నేను అల్లాహ్ ఆదేశమునకు విరుద్ధముగా ఈ ఖర్జూరపు కొమ్మను కూడ నీకు ఇచ్చుటకు సిద్ధముగా లేను. అల్లాహ్ విధించినట్లే నీ అంతముండును. నీవు మడమ తిప్పి పోయినచో నీ పాదములు అల్లాహ్ కోసివేయును. అల్లాహ్ నాకు నీ గురించి చూపినట్లే జరుగుచున్నట్లు నేను చూచుచున్నాను. మరల ఇట్లనిరి. నేను పోవుచున్నాను. నీవు మాట్లాడదలచినది నా తరపున సాబిత్ బిన్ ఖైస్ బిన్ షమాస్‌తో మాట్లాడుము. ఇట్లు చెప్పి వారు తిరిగి పోయిరి. హజ్రత్ అబూహురైరహ్ (రజి) కూడ వారి వెంట వుండిరి. మార్గ మధ్యలో వారిని ఒకరిట్లడిగిరి. ఓ రసూలుల్లాహ్! అల్లాహ్ నాకు చూపినట్లే నిన్ను నేను చూచుచున్నాని మీరు ఎందుకనిరి? రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నా చేతిలో రెండు కడియములు వున్నట్లు నేను స్వప్నములో చూచితిని.



ఆ రెండు కడియములను చూచి నేను ఇష్టపడలేదు. వాటిపై ఊదవలెనని అప్పుడు స్వప్నములోనే నాకు సువార్తవాణి అందెను. నేను ఊదగా అవి ఎగిరి పోయినవి. నా తర్వాత ఇద్దరు అసత్య దావాదారులు వచ్చెదరని దీనితో నేను భావించితిని. *(బుఖారి కితాబుల్ మఘాజీ బాబ్ ఖిస్సతుల్ అస్వదుల్ అన్సీ)* రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత అంతిమ కాలమది. అరబ్‌లోని అతి పెద్ద, అంతిమ జాతి వారి విధేయతను స్వీకరించుటకు సిద్ధముగా నుండెను. దాని నాయకున్ని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తన తర్వాత ఉత్తరాధికారిగా నియమించ వలెననే నిబంధన మాత్రమే యుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మనసులో ఏమాత్రం స్వంత గౌరవ ఆలోచన వున్నచో వారికి మగ సంతానము లేని ఈ పరిస్థితిలో అరబ్బుకు చెందిన అతి పెద్ద జాతి అగ్ర నాయకునికి తన తర్వాత నాయకత్వ బాధ్యతల ఆశ చూపి అరబ్ మొత్తంలో ఐక్యత ఏర్పాటుకు అవకాశం కల్పించేవారు. కాని చిన్న చిన్న వస్తువును కూడ స్వంతమని భావించని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లాం ప్రభుత్వమును తన స్వంతమని ఎలా నిర్ణయించెదరు. వారి దృష్టిలో ఇస్లాం నాయకత్వము అల్లాహ్ న్యాసము. ఆ న్యాసమును యధావిధిగా అల్లాహ్‌కే అప్పగించవలసి యుండెను. తర్వాత అతడు కోరిన వానికి అప్పగించును. అందుకే వారు ఈ ప్రతిపాదనను నిర్ద్వందంగా తోసిపుచ్చి ఇట్లనిరి. రాజరికము అటుంచితే, ఈ ఖర్జూరపు ఒక కొమ్మ కూడ నేను అల్లాహ్ ఆదేశము లేనిదే నీకిచ్చుటకు సిద్ధముగా లేను.

వారు అల్లాహ్‌ను గుర్తు చేసుకున్నప్పుడు వారి మనసులో ఉద్రేకము పుట్టుకోచ్చేది. వారి శరీరమును అంతరంగికముగా, బాహ్యముగా అల్లాహ్ ప్రేమ పూర్తిగా ఆవహించుచున్నట్లు స్పష్టమగు

చుండును. అల్లాహ్ ఆరాధనలో నిరాడంబరత ఎంత పాటించేవారనగా మస్జిద్‌లో నేల చదునుగా లేని, వస్త్రము లేని చోట కూడ వారు ప్రార్థన చేసేవారు, ఇతరులకు చేయించేవారు. అనేక సందర్భాలలో వర్షము వలన పై కప్పు నుండి నీళ్ళు కారుచుండగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం శరీరము మట్టి, నీటితో తడిసిపోయేది. అయినను ప్రార్థనలో నిమగ్నమై వుండేవారు. తన శరీరము, దుస్తులను రక్షించుకొనుటకు మధ్యలో ప్రార్థనను నిలిపివేయడం లేదా ప్రార్థనకై వేరే చోటకు వెళ్లడం చేసేవారు కాదు. *(బుఖారి కితాబుస్సౌమ్ బాబ్ ఫజ్ల్ లైలతుల్ ఖద్రి)* తమ అనుచరుల ప్రార్థనల పట్ల కూడ వారు శ్రద్ధ వహించేవారు. చాలా పుణ్య, పవిత్ర గుణములు గల హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) గూర్చి ఒక సందర్భమున వారిట్లనిరి. తహజ్జుద్ ప్రార్థన కూడ క్రమం తప్పకుండా చదివినచో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఎంత ఉత్తముడగునో! *(ముస్లిం కితాబ్ ఫజాయిలుస్సహాబహ్)* హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కు ఈ విషయము తెలిసినప్పుడు ఆ రోజు నుండి తహజ్జుద్ ప్రార్థన క్రమం తప్పకుండా చదవడం ప్రారంభించిరి. చరిత్రానుసారము మరొక సందర్భమున రాత్రి తమ అల్లుడు హజ్రత్ అలి (రజి), తమ కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి) నివాసమునకు వారు వెళ్లి, మీరు తహజ్జుద్ ప్రార్థన (అనగా మధ్య రాత్రి నిద్ర లేచి చదివే ప్రార్థన) చేయుదురా? అని అడిగిరి. హజ్రత్ అలి (రజి) ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! చదువుటకు మేము ప్రయత్నించెదము. కాని దైవానుగ్రహముతో మేము నిద్ర లేవనిచో తహజ్జుద్ ప్రార్థన చదవము. తహజ్జుద్ చదవమని వారిని ఆదేశించి లేచి తమ ఇంటికి తిరిగి వచ్చుచుండగా దారిలో పదే పదే ఇట్లనుచుండిరి.

وكان الانسان اكثر شئى جدلاً

*(బుఖారి కితాబుల్ కుసూఫ్ బాబ్ తహజ్జుద్ ఫిల్లైల్)*



ఇది పవిత్ర ఖురాన్, అధ్యాయము అల్ కహఫ్, సూక్తి 55. దీని భావమేమనగా మానవుడు తన తప్పిదమును తరచుగా అంగీకరించక, వివిధ నిదర్శనములు చూపి తన తప్పిదమును కప్పిపుచ్చును. అనగా హజ్రత్ అలి (రజి), హజ్రత్ ఫాతిమా (రజి) తమ తప్పును అంగీకరించక మేము నిద్ర లేచే ఇష్టము అల్లాహ్‌కు లేనప్పుడు మేము పరుండే వుంటామని వారెందుకు అనిరి. తన తప్పును అల్లాహ్‌పై ఎందుకు నెట్టిరి. అల్లాహ్‌తో ఇంత ప్రేమ, అనురాగం వున్నను ప్రార్థనలో ప్రదర్శనను, ఆడంబరమును గట్టిగా ద్వేషించేవారు. అల్లాహ్ మానవునికి అందించిన శక్తులను సద్వినియోగం చేసుకొనుటయే నిజమైన ఆరాధన అనేది వారి సూత్రము. కనులున్నను వాటిని మూసుకొనుట లేదా తీసి వేయించుకొనుట ఆరాధన కాక అవమానము. వాటి దుర్వినియోగము పాపము. ఒక శస్త్ర చికిత్స ద్వారా చెవుల వినికిడి శక్తిని తొలగించుట దైవమును అవమానపరచుట అగును. కాని ప్రజల చాడీలు, నిందారోపణలు వినుట పాపము. ఆహారమును వదులుట, ఆత్మ హత్య చేసుకొనుట దైవమును కించపరచుటయే. కాని భోజనములోనే నిమగ్నమగుట, నిషేధిత, అసమంజస వస్తువులను భుజించుట నేరమే అగును. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచములో ప్రవేశపెట్టిన ఇదొక వైభవోపేత సంకేతము. ఇంతకు ముందు ఏ సందేశహరుడు దీనిని ప్రవేశపెట్టలేదు. సహజ శక్తుల సద్వినియోగమే సద్గుణములు. సహజ శక్తులను చంపుటయే అవివేకము. వాటిని నిషేధిత కార్యములలో వినియోగించుటయే పాపము. వాటి సరైన ఉపయోగమే పుణ్యము. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బోధనల సారాంశము ఇదే. ఇది రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత, కర్మల సారాంశము. హజ్రత్ ఆయిషా (రజి) వారి గురించి ఇట్లనిరి.

ما خُيِّر رسول الله صلى الله عليه وسلم بين امرين الّا اخذ ايسرهما
مالم يكن اثماً كان ابعد الناس منهُ

*(ముస్లిం సంపుటి 2 కితాబుల్ ఫజాయిల్)*

అనగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జీవితములో సులభ మార్గములో దుష్కార్యమునకు అవకాశమే లేనిచో రెండు మార్గములు వున్నప్పుడు వాటిలో సులభ మార్గమును ఎన్నుకొనని సందర్భము ఎన్నడు రాలేదు. దుష్కార్యమునకు అవకాశమున్నచో అందరి కంటే దూరము వారే పారిపోయేవారు. ఇది ఎంత గొప్ప, మధురమైన ప్రవర్తన. ప్రపంచమును మోసగించుటకు అనవసరముగా పలువురు తమను తాము కష్టములు, బాధలకు గురి చేసుకొనెదరు. వారు ఆ కష్టములు, బాధలను అల్లాహ్ కొరకు భరించరు. ఎందుకనగా అల్లాహ్ కొరకు ఏ వృధా కార్యమును చేయరాదు. వారి నిజమైన సత్కార్యము తక్కువగా వున్నందుకే అసత్య సత్కార్యములతో ప్రజలను ప్రభావితం చేయదలచెదరు. తమ లోపములను కప్పిపుచ్చుకొనుటకు ప్రజల కనులలో మట్టికొట్టెదరు. కాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ధ్యేయం అల్లాహ్ సంతోషము, నిజమైన పుణ్యము పొందుటయే. వారికి ఇటువంటి ఆడంబర, దర్శన నిమిత్తం చేసే సత్కార్యముల అవసరమేముండెను. ప్రపంచము తప్పుగా లేదా మంచిగా వారిని అర్థం చేసుకున్నను వారు పట్టించుకునే వారు కాదు. నా అల్లాహ్ నన్నెట్లు భావించుచున్నాడు, నా అంతరాత్మ నన్నెట్లు పొందునని మాత్రమే వారు చూసుకునేవారు. అల్లాహ్, తన ఆత్మ సాక్ష్యము తర్వాత ప్రజలు కూడ సాక్ష్యమిచ్చినచో వారికి కృతజ్ఞులుగా వుండేవారు. వారు చెడుగా



భావించినచో వారి తప్పిదముపై విచారము వ్యక్తం చేసేవారు. కాని వారి అభిప్రాయమునకు ఎటువంటి ప్రధాన్యత ఇచ్చేవారు కాదు.

## మానవాళితో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వ్యవహారము

సతీమణుల పట్ల వారు ప్రేమపూర్వకముగా, న్యాయముగా వ్యవహరించేవారు. కొన్ని సందర్భాలలో భార్యలు కఠినముగా ప్రవర్తించినను వారు చిరునవ్వుతో దాటవేసేవారు. ఒక రోజు హజ్రత్ ఆయిషా (రజి) తో ఇట్లనిరి. 'ఓ ఆయిషా (రజి) నామీద నీకు కోపమున్నప్పుడు నాకు తెలిసిపోవును. మీకెట్లు తెలిసిపోతుందని హజ్రత్ ఆయిషా (రజి) అనిరి. వారిట్లనిరి. నీవు నాతో సంతోషంగా వున్నప్పుడు ప్రమాణము చేయు అవసరము వచ్చినచో 'ముహమ్మద్ పోషకుని ప్రమాణముగా' అని అందువు. నా మీద నీకు కోపము వచ్చిన సందర్భములో ప్రమాణము చేయవలసి వచ్చినచో 'ఇబ్రాహీమ్ పోషకుని ప్రమాణముగా' అని అందువు. హజ్రత్ ఆయిషా (రజి) ఈ మాటలు విని నవ్వుచూ వారిని ధ్రువీకరించి మీరనునది నిజమే అనిరి. *(బుఖారి కితాబున్నికాహ్ బాబ్ ఘైరతున్నిసా వవజదహున్న)* వారి కొరకు అనేక త్యాగములు చేసిన వారి ప్రథమ భార్య హజ్రత్ ఖదీజ (రజి) మృతి చెందిన తర్వాత యుక్త వయసు గల వారితో వారి వివాహము జరిగెను. కాని హజ్రత్ ఖదీజ (రజి) అనుబంధమును వారు మరచిపోలేదు. హజ్రత్ ఖదీజా (రజి) స్నేహితురాళ్లు ఎవరైనా వచ్చినచో వారిని స్వాగతించుటకు నిలబడేవారు. *(ముస్లిం బాబ్ ఫజాఇల్ ఖదీజ రజియల్లాహు అన్హా)* హజ్రత్ ఖదీజ (రజి) చేతితో సిద్ధమైన ఏదైనా వస్తువు వారి ముందు వచ్చినచో వారు కన్నీరు కార్చేవారు. బద్ర్ యుద్ధములో వారి అల్లుడు కూడ ఖైదీగా

వచ్చినప్పుడు స్వాతంత్ర్యమునకు పరిహారము చెల్లించుటకు వారి వద్ద ధనము లేకుండెను. వారి భార్య అనగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కుమార్తె తన భర్త విడుదలకు మరో ధనము లేదని తన తల్లి చివరి గుర్తుగా వున్న ఒక హారమును తన భర్త విడుదల కొరకు మదీనా పంపిరి. ఆ హారము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ముందుకు వచ్చినప్పుడు వారు దానిని గుర్తు పట్టి, కంట తడి పెట్టుకొని అనుచరులతో ఇట్లనిరి. నేను మిమ్ములను ఆజ్ఞాపించలేను. ఎందుకనగా అలా ఆజ్ఞాపించే హక్కు నాకు లేదు. ఈ హారము జైనబ్ వద్ద ఆమె తల్లి చివరి గుర్తుగా వున్నదని నాకు తెలుసు. మీరు ఆనందముగా చేయగలిగినచో ఒక కుమార్తె వద్ద నున్న ఆమె తల్లి చివరి గుర్తును లేకుండా చేయుట భావ్యము కాదని నేను సిఫారసు చేయుచున్నాను. అనుచరులు ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! మాకు ఇంత కంటే ఆనందకరం మరొకటి ఏముండును? వారు ఆ హారమును హజ్రత్ జైనబ్ (రజి) నకు తిరిగి పంపించిరి. *(అస్సీరతుల్ హల్బియ్యాహ్ సంపుటి 2 పుట 215)* హజ్రత్ ఖదీజ (రజి) త్యాగము వారి మనస్సును ఎంతో ప్రభావితం చేసినందున ఇతర సతీమణుల ముందు తరచుగా ఆమె పుణ్యమును గుర్తు చేసేవారు. ఒక రోజు హజ్రత్ ఆయిషా (రజి) ముందు హజ్రత్ ఖదీజ (రజి) ఒక సత్కర్మను ప్రస్తావించగా హజ్రత్ ఆయిషా (రజి) అలకతో ఆ వృద్ధురాలి ప్రస్తావన వదిలేయుము, అల్లాహ్ ఆమె కంటే యువతులైన, అందమైన స్త్రీలను మీకు ప్రసాదించెనని అనిరి. ఈ విషయము విని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం దు:ఖములో మునిగి ఇట్లనిరి. ఆయిషా! 'ఖదీజ (రజి) నాకు ఎంత గొప్ప సేవలు చేసినదో నీకేమి తెలుసు.

*(బుఖారి కితాబ్ బదవుల్ ఖల్క్ బాబ్ తజ్వీజున్నబియ్యి సల్లం ఖదీజ రజి వ ఫజ్లహా)*



## ఉత్తమ గుణములు

వారు అతి సాధారణ స్వభావము గలవారు. ఆపద వచ్చినచో నిరుత్సాహపడేవారు కాదు. ఏదేని కోరిక వలన హద్దులు దాటి ప్రభావితం అయ్యేవారు కాదు. జన్మించక ముందే వారికి పితృవియోగం కాగా బాల్యములోను తల్లి చనిపోయి యుండిరని జీవిత చరిత్రలో తెలుపబడినది. ఆరంభ 8 సం॥లు తన తాత సంరక్షణలో గడిపిరి. ఆ తర్వాత తమ చిన్నాన అబూతాలిబ్ సంరక్షణ పొందిరి. చిన్నానతో రక్త సంబంధము కూడ వుండెను. చనిపోయే ముందు వారి తండ్రి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం గూర్చి ప్రత్యేక ఆదేశము కూడ చేసి యుండిరి. కనుక వారు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను ఆప్యాయంగా, శ్రద్ధగా చూసుకునేవారు. కాని చిన్నమ్మలో ఆ అనురాగం, కుటుంబ బాధ్యత భావము కూడ లేకుండెను. ఏదైనా వస్తువు ఇంట్లోకి వచ్చినప్పుడు ముందు ఆమె తన పిల్లలకు ఇచ్చేవారు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను పట్టించుకునే వారు కాదు. చిన్నాన ఇంట్లోకి వచ్చినప్పుడు పిన్న వయస్కుడైన తన సోదరుని కుమారున్ని విలపించుచూ, ఫిర్యాదు చేయుచూ ఎన్నడు పొందలేదు. వారి పిల్లలు ఏదో ఒక వస్తువు తినుచుండగా పిన్న వయస్కుడైన తన సోదరుని కుమారుడు మాత్రం ఒక మూలకు గౌరవ సూచికగా కూర్చొని వుండేవారు. చిన్నాన ప్రేమ, కుటుంబ బాధ్యతలను గుర్తు చేసుకొని పరుగెత్తి ఆ బాలున్ని ఎత్తుకొని నా కుమారున్ని కూడ పట్టించుకో, నా కుమారున్ని కూడ చూడమని అనేవారు. ఇలా తరచు సంభవించేది. కాని చూచిన వారు చెప్పినదేమనగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఎన్నడు ఫిర్యాదు చేయలేదు, బాధను వ్యక్త పర్చలేదు. ఇందు మూలముగా ఎన్నడు విసుగించుకోలేదు. తన చిన్నాన కుమారులతో వైరము పెంచుకోలేదు. తర్వాత మారిన పరిస్థితులలో హజ్రత్ అలి (రజి),

హజ్రత్ జాఫర్ (రజియల్లాహు అన్హు) లను తన సంరక్షణలో తీసుకొని వారి ఉన్నతికి ఎటువంటి కృషి చేసిరో వారి తదుపరి జీవితము ద్వారా స్పష్టమగును.

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ప్రాపంచిక జీవితము కూడ చాలా కఠినముగా గడిచినది. పుట్టక ముందే తమ తండ్రి చనిపోవడం, తర్వాత తల్లి, తాత ఒకరి తర్వాత మరొకరు మృతి చెందిరి. వివాహమాడిన తర్వాత పిల్లలు వరుసగా చనిపోయిరి. తర్వాత ఒకరి తర్వాత మరొక సతీమణి చనిపోయెను. వీరిలో విశ్వాసురాలిగా, గొప్ప సేవకురాలిగా వున్న భార్య హజ్రత్ ఖదీజ (రజి) కూడ వుండిరి. కాని ఈ ఆపదలన్నిటిని ఆనందముతో భరించిరి. ఈ దు:ఖముల వలన ఎన్నడు వారు నిరాశ చెందలేదు. ఉత్సాహ భరిత స్వభావమును చెదరనివ్వలేదు. అంతరంగిక గాయములు నేత్రముల ద్వారా బహిర్గతము కాలేదు. అందరిని చిరునవ్వుతో పలకరించేవారు. చాలా అరుదుగా ఏదో ఒక సందర్భమున తన బాధను వ్యక్తపరచే వారు. ఒక సారి కుమారుడు మృతిచెందిన ఓ స్త్రీ తన కుమారుని సమాధి వద్ద రోధించుచుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడి నుండి వెళ్ళుచుండగా ఇట్లనిరి. ఓ మహిళ! సహనం పాటించుము. అల్లాహ్ అభీష్టం ప్రతి ఒక్కరిపై కొనసాగును. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఎవరో ఆమెకు తెలియనందున ఇట్లు ఎదురు సమాధానము ఇచ్చెను. నా కుమారుడు మృతిచెంది నట్లు నీ కుమారుడు చనిపోయి వుండినచో సహనమేమిటో నీకు తెలిసివుండెడిది. ఒక్కడు కాదు నా ఏడుగురు సంతానము మృతిచెందిరని తెలిపి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడి నుండి వెళ్ళిపోయిరి. ఇటువంటి సందర్భములలో తన గత ఆపదలను రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఎప్పుడో ఒక సారి



ప్రస్తావించేవారు. కాని మానవ జాతి సేవలో నిర్లక్ష్యము వహించలేదు. వారి చిరునవ్వులో తేడా రాలేదు.

## సహనము

వారిలో గొప్ప సహనముండెడిది. అల్లాహ్ వారికి రాజ్యాధికారము ప్రసాదించిన తర్వాత కూడ ప్రతి ఒక్కరి మాటను వినేవారు. ఇతరులు కఠినముగా మాట్లాడినా మౌనముగా వుండి, నిర్మలముగా సమాధానమిచ్చు వారు. ముస్లిములు వారిని నామముతో కాక ఆధ్యాత్మిక స్థాయి ఓ రసూలల్లాహ్! అని సంబోధించేవారు. ఇతర మతస్తులు ఆసియా ఆచారము ప్రకరాము వారి గౌరవము, మర్యాద వలన ముహమ్మద్ బదులు అబుల్ ఖాసిమ్ అని సంబోధించేవారు. (అబుల్ ఖాసిమ్ అనగా ఖాసిమ్ తండ్రి. ఖాసిమ్ వారి కుమారుని పేరు) ఒక సారి ఓ యూదుడు మదీనా వచ్చి వారితో వాదన మొదలు పెట్టెను. మధ్య మధ్యలో ఓ ముహమ్మద్ ! ఓ ముహమ్మద్! ఈ విషయము అలా కాదు ఇలా అని పదే పదే మాట్లాడెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అసంతృప్తి వ్యక్తపరచక అతని మాటలకు సమాధానము ఇచ్చుచుండిరి. కాని అనుచరులు అతని ఈ అమర్యాదను చూచి ఆందోళన చెందుచుండిరి. తుదకు ఒక అనుచరుడు భరించలేక ఆ యూదునితో ఇట్లనెను. జాగ్రత్త ! రసూలుల్లాహ్ అనలేకపోతే సరే కాని అబుల్ ఖాసిమ్ అని సంబోధించుము. వారి తల్లిదండ్రులు పెట్టిన పేరే నేను పలుకెదనని ఆ యూదుడనెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం నవ్వి, తమ అనుచరులతో ఇట్లనిరి. ఇతను అనునది సమంజసమే. నా తల్లిదండ్రులు నాకు ముహమ్మద్ అనే నామకరణం చేసిరి. అతనికి ఇష్టమున్న పేరు అననివ్వుము. అతన్ని కోపగించు కొనకుము.

వారు పని మీద బయటికి వెళ్ళినప్పుడు ప్రజలు వారి దారికి

అడ్డుగా నిలబడి తమ అవసరాలను చెప్పుకునేవారు. వారి అవసరాలు చెప్పుకునే వరకు వారు అలాగే నిలబడేవారు. వారు మాట ముగించిన తర్వాతనే ముందుకు వెళ్లేవారు. కొందరు కరచాలనం చేయుచు చాలా సమయం వరకు అలాగే చేతిని పట్టుకొనేవారు. ఇది అసమంజసము, పనిలో ఆటంకము కలిగించినను రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఎప్పుడు తమ చేతిని విడిపించుకునే వారు కాదు. కరచాలనం చేయు వాడు పట్టుకున్నంత వరకు వారు అలాగే చేతిని అతని చేతిలో వుంచేవారు. వివిధ రకాల వ్యక్తులు వారి వద్దకు వచ్చి తమ అవసరాలను చెప్పుకునేవారు. కొన్ని సందర్భాలలో అడుగువారి అవసరాల దృష్ట్యా ఏదైనా ఇచ్చినను అత్యాశతో ఇంకా అడిగేవారు. అయినను వారు అతని కోరికను తీర్చేవారు. కొన్ని సార్లు కొందరు ఎన్ని సార్లు అడిగినను వారికి ఎంతో కొంత ఇచ్చేవారు. సద్గుణ వంతునిగా కనిపించిన వ్యక్తికి అతని అవసరం మేరకు ఇచ్చి నీవు అల్లాహ్‌నే నమ్ముకొనినచో ఎంత బాగుండునని మాత్రమే అనేవారు. ఒక సారి ఒక గుణవంతుడైన అనుచరుడు తరచుగా తన అవసరాల కొరకు బలవంతముగా వారిని నగదు అడిగెను. వారు అతని కోరికను పూర్తి చేసి తుదకు ఇట్లనిరి. మానవుడు అల్లాహ్‌ను నమ్ముకొనుటయే ఉత్తమమైన స్థానము. ఆ అనుచరునిలో విశ్వాసము, గౌరవముండెను. తీసుకున్నది గౌరవము వలన తిరిగివ్వలేదు. కాని భవిష్యత్తు గురించి అతడిట్లనెను. ఓ రసూలుల్లాహ్! ఇది నా అంతిమ విషయము. ఇక ముందు ఏ స్థితిలో నైనను నేను ఎవ్వరితో ఏమి అడగను. ఒక సారి భీకర యుద్ధము జరుగుచుండెను. బల్లెములు విసరబడు చుండెను. ఖడ్గములు విరిగి పడుచుండెను. ఇసుక రాలనట్టి పోరు జరుగుచుండెను. సైనికుడు మరో సైనికునిపై దాడి చేయుచుండెను. ఆ అనుచరుడు కూడ శత్రువుల సమూహము మధ్య ఇరుక్కొని వున్నప్పుడు



అతని కొరడా జారి పడిపోయెను. పాదచారి అయిన స్వపక్షములోని మరో సైనికుడు సేనాపతి క్రిందికి దిగినచో నష్టము వాటిల్లుననే ఉద్దేశము తో ఆ కొరడా వారి చేతిలో పెట్టుటకు వంగి తీయబోయెను. ఆ అనుచరుడు ఆ సైనికున్ని చూచి ఇట్లనెను. ఓ నా సోదరుడా ! నీకు అల్లాహ్ ప్రమాణము. ఆ కొరడాను నీవు ముట్టుకోకుము. వారు అశ్వము దిగి కొరడా తీసుకొని తన సహచరునితో ఇట్లనెను. నేను ఎవరితో ఏమి అడగనని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో వాగ్దానము చేసియుంటిని. నీవు కొరడా తీసి నాకిచ్చి వుండినచో నేను కొరడా ఇవ్వవలసినదిగా నిన్ను అడగకున్నను నిస్సందేహముగా పరిస్థితిని బట్టి అది సహాయము కోరినట్లే అగును కదా! తద్వారా నేను వాగ్దానమును భంగపరచినట్లు అగును. ఇది రణరంగమైనను నా పని నేనే చేసుకొనెదను.

## న్యాయము

ప్రపంచములో ఎక్కడా కనిపించని నీతి, నిజాయితి వారిలో యుండెను. సాన్నిధ్యము, సిఫారసుల స్వీకరణ లక్షణము అరబ్బులలో సాధారణ వ్యాధిగా యుండెను. అరబ్బులే కాక నేటి నాగరికత గల దేశాలలో కూడ పెద్దలను శిక్షించుటకు వెనుకంజ వేయుదురు. కాని పేదలను నిస్సంకోచంగా శిక్షించెదరు. ఒక సారి వారి వద్దకు ఒక వ్యాజ్యము వచ్చెను. ఒక పెద్ద వంశమునకు చెందిన మహిళ మరొకరి నగదు దొంగిలించి యుండెను. వాస్తవము స్పష్టమైన తర్వాత గౌరవనీయ కుటుంబం అవమానమునకు గురగునని అరబ్బులలో ఉత్కంఠ నెలకొనెను. ఆ మహిళను క్షమించవలెనని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో విజ్ఞప్తి చేయాలనే నిర్ణయానికి వచ్చిరి. ఇందుకు ఎవరూ సాహసించలేదు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు ప్రియుడైన ఉసామా బిన్ జైద్ (రజి) ను ప్రజలు ఎన్నుకొని ఆ మహిళకై రసూలె కరీం సల్లల్లాహు

అలైహి వసల్లంతో సిఫారసు చేయాలని వారిని బలవంతము చేసిరి. ఉసామా (రజి) రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో మాట ప్రారంభించగానే వారి ముఖములో కోపము బహిర్గతమయ్యెను. వారిట్లనిరి. ఉసామా! ఏమనుచున్నావు? గత జాతులు పెద్దలను క్షమించి పేదలను శిక్షించినందుకే నాశనమైనవి. ఇస్లాం ఇందుకు అనుమతించదు. నేనలా చేయ్యలేను. అల్లాహ్ ప్రమాణముగా నా కూతురు ఫాతిమా కూడ ఇటువంటి నేరము చేసినచో నేను ఆమెను కూడ శిక్షించేవాడిని. మరో సంఘటన జీవిత చరిత్రలో ఇట్లు ప్రస్తావించబడెను. బద్ర్ యుద్ధములో హజ్రత్ అబ్బాస్ (రజి) బంధించబడి నప్పుడు వారి మూలుగుతో వారి(స) కు బాధ కలిగెను. కాని అనుచరులు వారి బాధను చూచి హజ్రత్ అబ్బాస్ తాళ్ళను వదులు చేసిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము తెలియగా వారిట్లనిరి. నా బంధువులున్నట్లు ఇతరుల బంధువులు కూడ వున్నారు. నా చిన్నాన అబ్బాస్ (రజి) తాళ్ళను బిగించుము లేదా ఖైదీలందరి తాళ్ళను వదులు చేయుము. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బాధను అనుచరులు గమనించి వారిట్లనిరి. ఓ రసూలుల్లాహ్! మేము గట్టి పహారా ఇచ్చెదము. కాని ఖైదీలందరి తాళ్ళను వదులు చేయుదుము. ఈ విధముగా ఖైదీలందరి తాళ్ళను విప్పివేసిరి.

యుద్ధములో కూడ వారు న్యాయమును పాటించేవారు. ఒక సారి సమాచార సేకరణ కొరకు అనుచరులను బయటికి పంపిరి. కొందరు శత్రువులు వారికి నిషేధిత ప్రాంతములో తారసపడిరి. మేము వీరిని ప్రాణముతో వదిలినచో వీరు వెళ్లి మక్కా వారికి సమాచారమందింతురు. అప్పుడు వారు మమ్ములను హతమార్చుదురని వారిపై దాడి చేసిరి. వారిలో ఒకడు ఈ జగడములో హత్యచేయబడెను. ఈ సమాచార సేకరణ బృందం



మదీనా చేరుకున్న వెంటనే మక్కా వారి ఒక బృందం కూడ ఫిర్యాదుతో మదీనా వచ్చెను. నిషేధిత ప్రాంతములో మా ఇద్దరు వ్యక్తులను వారు హత్య చేసిరని తెలిపిరి. నిషేధిత ప్రాంతములో వీరు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను హింసించేవారు. వారిని 'మీరు నిషేధిత ప్రాంతమును ఎన్నడు గౌరవించిరని మాతో గౌరవము నాశించుచున్నారని' ఎదురు ప్రశ్న వేయ వలసి యుండెను. కాని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ సమాధానము ఇవ్వక ఇట్లనిరి. అవును అన్యాయము జరిగినది. నిషేధిత ప్రాంతములో సురక్షితంగా వున్నామనే భావనతో వారు ప్రాణ రక్షణకు ప్రయత్నించలేదేమో అందుకే వారి హత్య పరిహారము మీకివ్వబడును. అరబ్బుల ఆచారము ప్రకారము హతుల వారసులకు పరిహారము అందించిరి.

## మనోభావాలను గౌరవించుట

స్వంత వారితో పాటు ప్రత్యర్థుల మనోభావాలను కూడ వారు గౌరవించే వారు. ఒక సందర్భమున ఒక యూదుడు వారి వద్దకు వచ్చి ఇట్లు ఫిర్యాదు చేసెను. అబూబకర్ (రజి) ఇట్లని నా హృదయమును గాయపర్చెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రమాణముతో నేను అనునదేమనగా అల్లాహ్ మూసా అలైహిస్సలాం కంటే గొప్ప స్థానము వారికి ప్రసాదించెను. ఈ మాట విని నాకు బాధ కలిగెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబూబకర్ (రజి) ను పిలిపించి విషయమేమిటని వారినడిగిరి. హజ్రత్ అబూబకర్ (రజి) ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! ఇతను మొదలు పెట్టి ఇట్లనెను. నేను మూసా (అ) ప్రమాణముగా చెప్పునదేమనగా వారికి అల్లాహ్ సర్వ సృష్టిపై ప్రధాన్యత ప్రసాదించెను. అప్పుడు నేను ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రమాణముతో నేను అనునదేమనగా అల్లాహ్

మూసా అలైహిస్సలాం కంటే గొప్ప స్థానము వారికి ప్రసాదించెనంటిని. వారిట్లనిరి. అలా అనకూడదు. ఇతరుల మనోభావాలను గౌరవించవలెను. నాకు మూసా (అ) పై ప్రాధాన్యత ఇవ్వకుము. వారు తమను మూసా (అ) కంటే గొప్ప కాదని భావించేవారని కాదు. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అల్లాహ్ మూసా (అ) పై ప్రాధాన్యత ప్రసాదించారను వాక్యములో యూదుల హృదయములు గాయపడునని అర్థము.

### పేదల పట్ల సానుభూతి, వారి మనోభావాల గౌరవము

వారు పేదల ఉన్నతికి, సమాజములో వారికి తగిన గుర్తింపు ఇచ్చుటకు సదా కృషి చేసేవారు. వారొక సారి కూర్చొని వుండగా ఒక ధనవంతుడు వారి ముందు నుండి వెళ్లెను. ఇతని గూర్చి నీ అభిప్రాయమేమిటని ఒక సహచరున్ని అడిగిరి. అతడిట్లనెను. ఇతడు గౌరవనీయుడు, ధనికులలోని వాడు, ఏ యువతిని వివాహమాడదలచినా అతని విన్నపము స్వీకరించబడును. ఎవరి పట్ల సిఫారసు చేసినను అతని సిఫారసు అంగీకరించబడును. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ మాట విని మౌనముగా వుండిపోయిరి. తర్వాత మరో పేద, అసహాయ వ్యక్తి వెళ్లెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇతని గురించి నీ అభిప్రాయము ఏమిటని ఆ సహచరున్ని అడిగిరి. అతడిట్లనెను. ఓ రసూలుల్లాహ్! ఇతడు నిరుపేద వ్యక్తి. ఏ యువతితో వివాహమాడ దలచినా అతని విన్నపము తిరస్కరించబడును. సిఫారసు చేసినను అతని సిఫారసు నిరాకరించబడును. ఇతను ఏమైనా చెప్పదలచినను ఇతని మాటలను ఎవరు వినరు. ఇది విని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మొత్తం ప్రపంచమును స్వర్ణముతో నింపినను ఈ వ్యక్తి దాని కంటే ఎక్కువ ధరగలవాడు. *(బుఖారి కితబుర్రిఖాఖ్ బాబ్ ఫజ్లుల్ ఫఖ్ర్)*



ఒక బీద మహిళ మస్జిద్‌ను శుభ్రము చేసేది. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు కొన్నిరోజులు ఆమె కనిపించలేదు. ఆ మహిళ కనిపించడం లేదని వారడిగిరి. ఆమె మృతి చెందినదని ప్రజలు చెప్పిరి. వారిట్లనిరి. ఆమె చనిపోయినప్పుడు నాకు మీరెందుకు తెలుపలేదు, నేను ఆమె అంత్యక్రియలో పాల్గొనేవాడిని కదా? ఆమె నిరుపేద అయినందున మీరు చిన్నచూపు చూచిరి. ఇలా చేయడం సమంజసం కాదు. ఆమె సమాధి ఎక్కడుందో నాకు తెలుపుము. తర్వాత వారు ఆమె సమాధి వద్దకు వెళ్లి ఆమె కొరకు ప్రార్థన చేసిరి. *(బుఖారి కితాబుస్సలాత్ బాబ్ కన్సుల్‌మస్జిద్)*

వారిట్లు చెప్పేవారు. చాలా మంది వెంట్రుకలు చిదిరిపోయి వుందురు. వారి శరీరము మట్టితో మలినమై వుండును. వారు ప్రజలను కలుసుకొనుటకు వెళ్లినచో ప్రజలు తమ తలుపులు మూసుకొనెదరు. కాని అటువంటివారు అల్లాహ్ ప్రమాణము చేసినచో అల్లాహ్ వారి గౌరవార్థం వారి ప్రమాణమును పూర్తి చేయును. *(ముస్లిం సంపుటి 2 కితాబుల్ బిర్ర్ వస్సిలహ్ బాబ్ ఫజ్లుజ్జుఅఫా)*

ఒక సారి గతములో బానిస జీవితము గడిపిన నిరుపేదలైన రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు కూర్చొనివుండగా వారి ముందు నుండి అబూసుఫ్యాన్ వెళ్లెను. వారు అతని ముందు ఇస్లాం విజయమును ప్రస్తావించిరి. హజ్రత్ అబూబకర్ (రజి) విని ఖురైష్ నాయకున్ని అవమాన పరచినట్లు వారు భావించిరి. వారు వారిని సంబోధించి ఇట్లనిరి. మీరు ఖురైష్ నాయకుడిని, వారి అధికారిని ఈ విధముగా అవమానించెదరా? హజ్రత్ అబూబకర్ (రజి) రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇదే ఫిర్యాదు చేసిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఓ అబూబకర్ ! బహుశ నీవు

ఆ ప్రత్యేక దైవ దాసులను అసంతృప్తికి గురి చేసితివేమో? అటులనే జరిగినచో నీ అల్లాహ్ కూడ నీతో అసంతృప్తి చెందును. హజ్రత్ అబూబకర్ (రజి) వెంటనే లేచి నిలబడి వారి వద్దకు తిరిగొచ్చి ఇట్లనిరి. ఓ నా సోదరులారా! నా మాటతో మీరు అసంతృప్తి చెందితిరా! అప్పుడు ఆ బానిసలు ఇట్లు సామాధానమిచ్చిరి. ఓ మా సోదరుడా! మేము అసంతృప్తికి గురికాలేదు, అల్లాహ్ మీ తప్పును క్షమించుగాక!

*(ముస్లిం కితాబుల్ ఫజాయిల్ బాబ్ మిన్ ఫజాయిల్ సల్మాన్ వ సుహైబ్ వ బిలాల్ రజియల్లాహు అన్హుమ్)*

వారు పేదల గౌరవము, మర్యాదను నిలబెట్టుచూ, వారి అవసరాలను తీర్చేవారు. వారికి ఆత్మాభిమానమును కూడ నేర్పేవారు. అడుగుట నుండి నివారించేవారు. సదా వారిట్లనేవారు. ఒకటి, రెండు ఖర్జూరములు, ఒక ముద్ద, రెండు ముద్దలతో సంతృప్తి పడే వ్యక్తి నిరుపేద కాదు. ఎన్ని ఆపదలు వచ్చినను అడగని వ్యక్తే నిజమైన నిరుపేద. *(బుఖారి కితాబుల్ కురూబ్ బాబ్ ఖౌలుల్లాహి తాలా లా యస్ అలూనన్నాస ఇల్హాఫా)* పేదలు ఆహ్వానించబడని విందు అత్యంత నీచమైన విందు అని కూడ వారు అనుచరులకు ఉపదేశించేవారు.

*(బుఖారి కితాబున్నికాహ్ బాబ్ మన్ తరకద్దావత ఫఖద్ అసల్లాహ వరసూలహు)*

హజ్రత్ ఆయిషా (రజి) ఇట్లు తెలిపిరి. ఒక సారి ఒక మహిళ నా వద్దకు వచ్చెను. ఆమె వెంట ఆమె ఇద్దరు కుమార్తెలు కూడ వుండిరి. అప్పుడు మా గృహములో ఒక్క ఖర్జూరము తప్ప మరేమి లేకుండెను. నేను అదే ఖర్జూరము ఆమెకిచ్చితిని. ఆమె ఆ ఒక్క ఖర్జూరమును రెండు ముక్కలు చేసి తన కుమార్తెలకు తినిపించెను. ఆ తర్వాత లేచి వెళ్లిపోయెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇంట్లోకి ప్రవేశించగా నేను ఈ



సంఘటన వారికి వినిపించితిని. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఒక నిరుపేద గృహములో ఇద్దరు కుమార్తెలు వుండి అతడు వారితో సత్ప్రవర్తనగా వ్యవహరించినచో అల్లాహ్ ప్రళయ దినమున అతన్ని నరకాగ్ని నుండి రక్షించును. మరల ఇట్లనిరి. ఆమె ఈ కార్యము వలన అల్లాహ్ ఆ మహిళను స్వర్గమునకు అర్హురాలిగా చేయును. *(ముస్లిం సంపుటి 2 కితాబుల్ ఫజాయిల్ బాబ్ ఫజ్లుల్ ఇహ్సాన్ ఇలల్ బనాతి)*

ఇదే విధముగా వారి ఒక ధనిక అనుచరుడు సాద్ (రజి) ఇతరులపై తన ఆధిక్యతను ప్రదర్శించుచున్నట్లు వారికి తెలిసెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ మాట విని ఇట్లనిరి. నీ ఈ శక్తి, సామర్థ్యము, నీ ఈ ధనము నీకు నీ శ్రమతో లభించినవని నీవు భావించితివా? ఇలా కానే కాదు. మీ శక్తి, సామర్థ్యము, మీ ధనము అంతయు పేదల ద్వారానే వచ్చును.

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ప్రార్థన చేసేవారు.

اللّٰهم احینی مسکینًا وامتنی مسکینًا واحشرنی فی زمرة المساکین یوم القیامة

అనగా ఓ అల్లాహ్! నన్ను నిరుపేద స్థితిలోనే బ్రతికించుము. నిరుపేద స్థితిలోనే మరణము నొసంగుము. నిరుపేదల జాబితాలోనే నన్ను ప్రళయ దినమున మరల బ్రతికించుము. *(తిర్మిజి సంపుటి 2 అబ్వాబుజ్జుహ్ద్)*

ఒక సందర్భమున రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బజారులో వెళ్లుచుండిరి. దైవికముగా అందవిహీనుడైన వారి ఒక అనుచరుడు వేసవి కాలములో మూటలను మోయుచు అటు ఇటు తరలించుచుండెను. ఒక వైపు వారి ముఖము అందవిహీనముగా వుండెను మరో వైపు మట్టి, మలినము, చెమట వలన మరింత వికారముగా

కనిపించుచుండిరి. సరిగ్గా అదే సమయములో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బజారులో వెళ్లుచుండిరి. వారి ముఖములో నిరుత్సాహ భావాలు గమనించి, నిశ్శబ్దంగా వారి వెనక చేరుకొని పిల్లలు ఆడుకుంటూ ఒక మిత్రుని కనులను చేతులతో మూసి ఎవరో కనుక్కో అన్నట్లే వారు వారి కనులపై చేతులు పెట్టిరి. అతడు తన చేతితో వారి శరీరము, చేతులను తాకడం మొదలు పెట్టి వీరు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అని గ్రహించెను. ఇంత పేద, అందవిహీనుడు, మలినముతో నున్న వ్యక్తిని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తప్ప మరెవరు ఆప్యాయతతో అక్కున చేర్చుకొనునని అతడు ఊహించుకొనెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లమే అతనితో ప్రేమపూర్వకముగా వ్యవహరించుచున్నారని నిర్ధారించుకొని మట్టి, చెమటతో తడిసిన తన శరీరమును రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం దుస్తులకు రుద్దడం ప్రారంభించెను. బహుశ అతను రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఎంత వరకు సహనం పాటించెదరని పరీక్షించుచుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం చిరునవ్వు చిందించిరి కాని అతన్ని ఈ కార్యము నుండి నివారించలేదు. అతడు మనసు నిండా వారి దుస్తులను మలినము చేసిన తర్వాత హాస్యముతో వారిట్లనిరి. 'నా వద్ద ఒక బానిస వున్నాడు ఎవరైనా కొనుగోలు చేయుదురా'. వారి ఈ వాఖ్యము అతన్ని సింహాసనము నుండి నేల పై పడవేసెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తప్ప ఎవరు నన్ను ఇంత ఆప్యాయతతో పలకరించునని, నన్ను బానిసగా కూడ ఎవరు కొనలేరనే ఆలోచన వైపు అతని దృష్టి మరల్చిరి. అతడు నిరాశతో ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! నన్ను కొనుగోలు చేయువాడు ప్రపంచములో ఎవ్వడు లేడు. వారిట్లనిరి. కాదు కాదు అలా అనకుము, అల్లాహ్ దృష్టిలో నీ విలువ చాలా అధికము.



వారు నిరుపేదలకు సహాయము చేయడమే గాక అనుచరులను కూడ పేదల సహాయ విషయంలో సదా ఆదేశించేవారు. హజ్రత్ అబూ మూసా అష్అరి (రజి) ఉల్లేఖనము ప్రకారము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు ఒక అవసరముగల వ్యక్తి వచ్చినచో సమావేశములో కూర్చున్న అనుచరులను కూడ సిఫారసు చేయవలెనని అనేవారు. తద్వారా పుణ్య కార్యములో సిఫారసు వలన మీరు కూడ పుణ్యములో చేరెదరు. *(బుఖారి, ముస్లిం)* ఈ విధముగా ఒకవైపు వారు తన సమాజపు ప్రజలలో నిరుపేదల సహాయమునకు అనుచరులను ప్రోత్సహించేవారు. రెండవ వైపు ముస్లిముల పట్ల ప్రేమను నిరుపేదలలో కల్గించేవారు.

## పేదల ధనపు సంరక్షణ

ఇస్లాంకు విజయము లభించిన తర్వాత రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అధీనములో అధిక ధనము వచ్చేది. వారు దానిని అర్హులలో పంచేవారు. ఒక సారి చాలా ధనము వచ్చినప్పుడు వారి కూతురు హజ్రత్ ఫాతిమా రజియల్లాహు అన్హా వారి వద్దకు వచ్చి ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! విసురు రాయి విసిరి విసిరి నా చేతులు ఎలా గాయపడినవో చూడుము! ఈ ధనములో నుండి నాకొక సేవకురాలు లేదా బానిసను ఇచ్చినచో వారు నాకు సహాయపడెదరు. వారిట్లనిరి. ఓ నా కుమార్తె ఫాతిమా! నేను నీకు సేవకురాలు లేదా బానిస కంటే విలువైన ఒక విషయము తెలుపనా? నీవు నిద్రకు ఉపక్రమించే ముందు 33 పర్యాయములు '**సుబ్హానల్లాహ్**' 33 పర్యాయములు '**అల్హందులిల్లాహ్**', 34 పర్యాయములు '**అల్లాహు అక్బర్**' చదువుము. ఇవి నీకు సేవకురాలు లేదా బానిస కంటే ఉత్తమమైనవి. *(బుఖారి కితాబుద్దావాత్ బాబ్ అత్తక్బీర్ వత్తస్బీహ్ ఇన్దల్ మనామ్)*

మరోసారి కొంత ధనము రాగా దానిని వారు పంచిపెట్టిరి. పంచుచుండగా ఒక నాణెము వారి చేతి నుండి పడిపోయి కనిపించలేదు.

ధనము పంచుచుండగా ఆ విషయమును వారు మరచిపోయిరి. మొత్తం ధనము పంచిన తర్వాత మస్జిద్‌లోకి వచ్చి ప్రార్థన చేయించిరి. ప్రార్థన ముగిసిన తర్వాత అలవాటు ప్రకారము దైవస్మరణలో నిమగ్నమయ్యే, అనుచరులకు తమ అవసరాలు, సందేహాలు తెలిపే అవకాశమిచ్చే బదులు వేగంగా తమ ఇంటి వైపు వెళ్లిరి. అనుచరుల కథనము ప్రకారము అతి వేగము వలన మా భుజములను దాటుచూ లోనికి వెళ్లి ఆ నాణెమును వెతికి, తిరిగి వచ్చిరి. బయటికి వచ్చి ఆ నాణెమును ఒక అర్హునికిచ్చి ఇట్లనిరి. ఈ దీనారు పడిపోయిన విషయమును నేను మర్చిపోతిని. ప్రార్థన చేయించుచుండగా నాకు గుర్తుకొచ్చెను. ప్రజల ధనము నా వద్ద వుండగా నేను మరణించినచో అల్లాహ్‌కు ఏమని సమాధానము ఇచ్చెదను అని భయాందోళనకు గురైతిని. అందుకే నేను త్వరగా లోపలికి వెళ్లి ఈ నాణెమును తీసుకొచ్చితిని.

*(బుఖారి కితాబుల్ కుసూఫ్ బాబ్ మన్ అహబ్బ తాజీలుస్సధ్ధ మిన్ యౌమిహీ)*

ఇంతకు మించిన విషయమేమనగా వారి గౌరవము వలన ప్రజలు వారి సంతానములోనే దానము పంచుటను నివారించుటకు దానమును తన సంతానము కొరకు నిషేధించిరి. లేనిచో నిరుపేదలు సహాయము కోల్పోవుదురు. ఒక సారి వారి వద్దకు దానముగా కొన్ని ఖర్జూరములు వచ్చినప్పుడు రెండు, రెండున్నర సం॥ల వయసు గల వారి మనవడు హజ్రత్ ఇమామ్ హసన్ రజియల్లాహు అన్హు వారి ప్రక్కన కూర్చొని వుండిరి. వారు ఒక ఖర్జూరము నోట్లో వేసుకొనిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వెంటనే వారి నోట్లో వ్రేలు పెట్టి ఆ ఖర్జూరమును తీసి ఇట్లనిరి. ఇది మన హక్కు కాదు. ఇది అల్లాహ్ దాసులైన నిరుపేదల హక్కు. *(బుఖారి కితాబుల్ కుసూఫ్ బాబ్ అఖజ సదఖతుత్తమ్ర)*



## బానిసలతో సత్ప్రవర్తన

బానిసలతో మంచిగా వ్యవహరించవలెనని వారు ఎల్లప్పుడు ఉపదేశించేవారు. వారి ఆదేశమిట్లు యుండెను. ఎవరి వద్దనైనా ఒక బానిస వుండగా అతడు తన బానిసకు స్వేచ్ఛ కల్పించే స్థితిలో లేనిచో ఏదైనా సందర్భమున కోపముతో బానిసను దండించినను, దూషించినను పరిహారముగా అతనికి స్వేచ్ఛ కల్పించవలెను. *(ముస్లిం సంపుటి 2 కితాబుల్ ఈమాన్)*

అటులనే బానిసలకు స్వేచ్ఛ కల్పించే విషయములో ప్రత్యేక శ్రద్ధ వహించుచూ సదా వారిట్లు ఆదేశించేవారు. ఎవడేని ఒక బానిసకు స్వాతంత్ర్యము ప్రసాదించినచో ఆ బానిస ఒక్కొక్క అవయవమునకు బదులు అతని ప్రతి అవయవముపై నరకాగ్నిని అల్లాహ్ నిషేధించును. మరల వారిట్లు బోధించేవారు. బానిసకు అతని శక్తి మేరకే పని చెప్పవలెను. అతనితో ఏదైనా పని తీసుకొన్నచో అతను అవమానముగా భావించకూడదని అతనితో కలిసి పనిచేయుము. *(ముస్లిం సంపుటి 2 కితాబుల్ ఈమాన్)* అతని వెంట ప్రయాణము చేసినచో అతనిని వాహనముపై ఎక్కించవలెను. లేదా వంతుల వారీగా వాహనమును వినియోగించవలెను. వారు ఈ విషయమును ఎంత గట్టిగా ఆజ్ఞాపించేవారనగా హజ్రత్ అబూహురైరహ్ (రజి) ఇస్లాం స్వీకరించిన తర్వాత ఎల్లప్పుడు వారి వెంటే వుండేవారు. వారి ఈ హితబోధను తరచుగా వినేవారు. వారిట్లు తెలిపిరి. ఎవరి పిడికిలిలో అబూహురైరహ్ ప్రాణమున్నదో ఆ అల్లాహ్ ప్రమాణముగా! అల్లాహ్ మార్గములో త్యాగము చేయు అవకాశము నాకు లభించకపోయినచో, హజ్ యాత్ర అనుగ్రహము లభించకపోయినచో, నేను విధిగా సేవలు అందించాల్సిన వృద్ధురాలైన నా తల్లి జీవించి లేనిచో నేను బానిస జీవితము గడుపుచూ మరణించుటకు

ఇష్టపడుదును. ఎందుకనగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం బానిసల పక్షమున ఎన్నో పుణ్య విషయములు బోధించేవారు. *(ముస్లిం సంపుటి 2 కితాబుల్ ఈమాన్)*

మారూర్ బిన్ సువైద్ (రజి) ఉల్లేఖనము ప్రకారము నేను రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుడైన హజ్రత్ అబూజర్ ఘఫ్ఫారీని ఇట్లు చూచితిని. వారి దుస్తుల వలె వారి బానిస దుస్తులుండెను. మీ దుస్తులు, మీ బానిస దుస్తులు ఒకే విధముగా ఎందుకున్నాయని అడగగా వారిట్లనిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కాలములో ఒక వ్యక్తి బానిస స్త్రీని అయిన అతని తల్లి పేరున అవమానించెను. అప్పుడు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నీలో ఇంకా అవిశ్వాస లక్షణములు మిగిలే వున్నాయి. బానిసలెవరు ? మీ సోదరులే కదా! మీ శక్తికి కారకులు. ఏదో అల్లాహ్ వివేకము వలన కొంత కాలానికి వారు మీ అధీనములో వచ్చెదరు. కావున ఒక సోదరుడు అతని సేవలో వచ్చినచో తాను భుజించునదే అతనికి తినిపించవలెను. తాను ధరించినదే అతనికి ధరింప జేయవలెను. మీలో ఎవరు ఒక బానిసతో అతని శక్తికి మించిన పని తీసుకోకూడదు. మీరు వారికి ఏదైనా పని చెప్పినప్పుడు తాము కూడ వారితో కలిసి పని చేయవలెను. *(ముస్లిం సంపుటి 2 కితాబుల్ ఈమాన్)*

ఇదే విధముగా వారిట్లు తెలిపేవారు. మీ బానిస మీ కొరకు ఆహారము తీసుకొచ్చినప్పుడు అతనిని తమ వెంట కూర్చొనబెట్టి కనీసం కొంచమైనా తినిపించుము. ఎందుకనగా అతడు ఆహారము వండి తన హక్కు కల్పించుకొనెను. *(ముస్లిం సంపుటి 2 కితాబుల్ ఈమాన్)*

**మానవ జాతి సేవకుల గౌరవము**

మానవ జాతి సేవలో తమ సమయమును వినియోగించేవారి



పట్ల వారు ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. తై జాతి ప్రజలు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో యుద్ధము చేసినప్పుడు వారిలోని కొందరు ఖైదీలుగా వచ్చిరి. గతించిన అరబ్ ప్రఖ్యాత దాత హాతిమ్ కుమార్తె కూడ వారిలో వుండెను. తాను హాతిమ్ కుమార్తెనని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఆమె తెలిపినప్పుడు వారు ఆమెతో గౌరవ, మర్యాదలతో వ్యవహరించిరి. ఆమె సిఫారసు మేరకు ఆమె జాతి శిక్షలను క్షమించిరి. *(అసీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 3 పుట 227, సీరత్ అలీ ఇబ్నె అబీ తాలిబ్ కరముల్లాహ్ వజ్‌హు)*

**మహిళలతో సత్ప్రవర్తన**

మహిళల పట్ల సత్ప్రవర్తన గూర్చి వారు ప్రత్యేక శ్రద్ధ కనబర్చేవారు. ప్రపంచములో ప్రప్రథమముగా వారే స్త్రీకి వారసత్వములో హక్కు కల్పించిరి. పవిత్ర ఖురాన్‌లో బాల, బాలికలకు వారి తల్లి దండ్రుల ఆస్తిలో వారసత్వ హక్కు కల్పించబడెను. అటులనే తల్లులకు కుమారుల, భార్యలకు భర్తల ఆస్తిలో వారసత్వ హక్కు కల్పించెను. కొన్ని సందర్భాలలో సోదరీమణులను వారి సోదరుల ఆస్తిలో వారసత్వమునకు అర్హురాలుగా చేయనైనది. ఇస్లాం కంటే ముందు ప్రపంచములోని ఏ ధర్మము కూడ ఇటువంటి హక్కులను పేర్కొనలేదు. స్త్రీని తన ధనముకు శాశ్వత యజమానురాలిగా వారు నిర్ణయించిరి. భర్తకు తన భార్య ఆస్తిలో జోక్యము చేసుకునే హక్కు లేదు. తన ధనమును వినియోగించే అధికారము స్త్రీకి గలదు. వారు మహిళల సత్ప్రవర్తన విషయంలో ఎంతో ముందున్నందున ఈ విషయమునకు అలవాటు పడని అరబ్బులు దీనిని చూచి అపోహకు గురయ్యేవారు. హజ్రత్ ఉమర్ (రజి) ఉల్లేఖనము ప్రకారము నా భార్య కొన్ని సందర్భాలలో నా విషయములలో తలదూర్చినందుకు నేను కోపగించుకునే వాడిని. పురుషుల కార్యములలో స్త్రీలు తమ అభిప్రాయము తెలిపే హక్కును

అరబ్బులు ఎన్నడు ఆమోదించలేదని అనేవాడిని. అప్పుడు నా భార్య ఇట్లనెను. మీరెంత ! మీ స్థాయి ఎంత ! ముహమ్మద్ రసూలుల్లాహ్ సతీమణులే వారికి సలహాలు ఇచ్చుచున్నారు. వారిని వారే వారించనప్పుడు మీరెందుకు ఇట్లనుచున్నారు. దీనిపై ఆమెతో నేను ఇట్లు అనేవాడిని. ఆయిషా (రజి) రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు చాలా ఇష్టమైనవారు. వారిని ఉదహరించకుము. మిగిలినది నీ కుమార్తె అట్లు చేయుచున్నచో ఏదో ఒక రోజు అధిక ప్రసంగం వలన శిక్ష అనుభవించక తప్పదు. ఒక సారి ఏదో విషయంలో అసంతృప్తికి గురై రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కొన్ని రోజులు సతీమణుల నుండి దూరముగా బయట గడుపుటకు నిర్ణయించుకొనిరి. నాకీ విషయము తెలియగా, నేనన్నదే ఇప్పుడు జరిగినది కదా ? అని అంటిని. నేను నా కుమార్తె హఫ్స (రజి) ఇంట్లోకి వెళ్లినప్పుడు ఆమె ఏడ్చుచుండెను. నేనిట్లంటిని. హఫ్స ఏమైనది ? రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం నీకు విడాకులిచ్చిరా? వారిట్లనిరి. ఆ విషయము నాకు తెలియదు. కాని ఏదో ఒక విషయం వలన కొన్ని రోజుల వరకు గృహములోకి ప్రవేశించనని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయించుకొనిరి. నీవు ఆయిషా (రజి) చేసినట్లు చేయకని నేను నీకు ముందే చెప్పి వుంటిని కదా! ఆయిషా (రజి) రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు చాలా ఇష్టమైనవారు. నేను భయపడిన విషయములోనే నీవు ఆపదలో చిక్కుకొంటివి. ఇట్లని నేను రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చితిని. అప్పుడు వారు సమతులముగా లేని ఒక చాపపై పరుండి వుండిరి. చొక్కా వారి శరీరము పై లేకుండెను. వారి యద, నడుము పై చాప గీతలు కనిపించుచుండెను. నేను వారి వద్ద కూర్చొని ఇట్లంటిని. ఓ రసూలుల్లాహ్! అల్లాహ్ శుభములకు ఈ ఖైసర్, కిస్రా ఎట్లు అర్హులైరి?



వారు ఎంత సుఖముగా జీవించు చున్నారు. కాని అల్లాహ్ ప్రవక్త ఈ బాధలు అనుభవించుచున్నారు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఓ ఉమర్ (రజి) ఇది సముచితము కాదు. అటువంటి జీవితము దైవ ప్రవక్తలు గడపరు. ఇది ప్రాపంచిక రాజుల ఆర్భాటము. ఆ తర్వాత నేను నా సతీమణి, కుమార్తెతో జరిగిన పూర్తి సంఘటన వినిపించితిని. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం నా మాటలు విని నవ్వి ఇట్లనిరి. నేను నా భార్యలకు విడాకులు ఇచ్చిన మాట వాస్తవము కాదు. నేను కేవలం ఒక ఔచిత్యము వలన కొన్ని రోజులు ఇంటి నుండి బయట వుండుటకు నిర్ణయించు కొంటిని. *(బుఖారి కితాబున్నికాహ్ బాబ్ మౌఇజతుర్రజుల్ అబ్నతహు లిహాలి జౌజిహా)*

వారు మహిళల మనోభావాల పట్ల ఎంత శ్రద్ధ కలిగివుండేవారనగా ఒక సారి ప్రార్థనలో ఒక బాలుడు విలపిస్తున్న శబ్దము వచ్చినప్పుడు ప్రార్థన తొందర తొందరగా చదివించి పూర్తి చేసి ఇట్లనిరి. ఒక బాలుని విలపించు శబ్దము వచ్చెను అతని తల్లికి ఎంత బాధ కలుగుతుందోనని, భావించి తల్లి తన బిడ్డను ఓదార్చుటకు నేను ప్రార్థన తొందరగా ముగించితిని. *(బుఖారి కితాబుస్సలాత్ బాబ్ మన్ అఖ్ఫస్సలాత్ ఇన్ద బాయిస్సబియ్యి)*

వారు ప్రయాణించినప్పుడు స్త్రీలు వారి వెంట వుండినచో మెల్లగా నడువ వలెనని ఎల్లప్పుడు ఆదేశించేవారు. ఇటువంటి ఒక సందర్భమున సైనికులు తమ అశ్వములను, తమ ఒంటెలను వేగంగా పరుగెత్తించుచుండగా వారిట్లనిరి. رفقًا بالقوارير అరె ఏమి చేయుచున్నారు? స్త్రీలు కూడ మన వెంట వున్నారు. మీరిలా ఒంటెలను పరుగెత్తించినచో ఈ అద్దాలు ముక్కలు ముక్కలై పోవును అనగా స్త్రీలు గాయపడుదురు. *(బుఖారి కితాబుల్ అదబ్)*

ఒక సారి యుద్ధ రంగములో ఏదో ఒక గందరగోళంతో వాహనములు బెదిరిపోయినవి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కూడ అశ్వము పై నుండి పడిపోయిరి. కొందరు స్త్రీలు కూడ పడిరి. ఒక అనుచరుని ఒంటె రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వెనుక వుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను పడిపోవుచు చూచి ఆ అనుచరుడు ఆందోళనకు గురై దూకి ఇట్లనుచు వారి వైపు పరుగెత్తెను. ఓ రసూలుల్లాహ్! నేను చనిపోయి మీరు జీవించుదురు గాక! రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పాదము అశ్వము పల్లెములో ఇరుక్కొని వున్నందున తొందరగా విడిపించుకొని ఆ అనుచరున్ని సంబోధించి ఇట్లనిరి. 'నన్ను వదులుము, ముందు స్త్రీల సంగతి చూడుము'. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం మరణము సమీపించిన సమయమున ముస్లిములందరిని సమావేశపరచి ఉపదేశించిన విషయాలలో ఒకటి ఇట్లు గలదు. నేను అంతిమ మరణాదేశము చేయునదేమనగా ఎల్లప్పుడు మహిళలతో సత్ప్రవర్తన అవలంభించుము. వారు తరచుగా ఇట్లనేవారు. ఇద్దరు కూతుర్లు వున్న గృహము వాడు, వారిని చదివించి, వారిని ఉత్తమ రీతిలో సంస్కరించినచో ప్రళయ దినమున అల్లాహ్ అతనిపై నరకమును నిషేధించును. *(తిర్మిజి సంపుటి 2 అబ్వాబుల్ బిర్రి వస్సిలహ్ బాబ్ మాజాఅ ఫిన్నఫ్ఖతి అల్‌బనాతి)*

మహిళలు ఏదైనా తప్పు చేసినచో వారిని దండించే ఆచారము అరబ్బులలో యుండెను. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము తెలిసినప్పుడు ఇట్లనిరి. స్త్రీలు అల్లాహ్ దాసులు మీ దాసులు కారు. వారిని దండించకుము. కాని ఇంత వరకు స్త్రీల పూర్తి సంస్కరణ కానందున వారు ఈ ప్రోద్భలంతో పురుషులపై తిరగబడిరి. సంసారాలలో అశాంతి మొదలయ్యెను. తుదకు హజ్రత్ ఉమర్ (రజి)



రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇట్లు ఫిర్యాదు చేసిరి. మీరు స్త్రీలను దండించకూడదని మమ్మాదేశించిరి. వారు తీవ్ర అవిధేయతకు పాల్పడుచున్నారు. ఇటువంటి పరిస్థితిలో వారిని దండించే అనుమతి మాకు లభించవలెను. మహిళల గూర్చి ఇంత వరకు సవివరముగా ఆదేశాలు అవతరించనందున హద్దులు దాటిన స్త్రీని మీరు మీ ఆచారము ప్రకారము దండించవచ్చునని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిరి. ఈ అనుమతి వలన అత్యవసర పరిస్థితిలో పురుషులు స్త్రీలను దండించే బదులు అరబ్బుల పురాతన ఆచారమును కొనసాగించిరి. స్త్రీలు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సతీమణుల వద్దకు వచ్చి ఫిర్యాదులు చేయగా వారు తమ అనుచరులతో ఇట్లనిరి. తమ జీవిత భాగస్వాముల పట్ల సత్ప్రవర్తనతో వ్యవహరించక, వారిని దండించే వారు అల్లాహ్ దృష్టిలో పుణ్యులుగా భావించబడరని నేను తెలుపుచున్నాను. ఆ తర్వాత మహిళల హక్కులు నియమించబడెను. ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కరుణతో మొదటి సారి స్త్రీ స్వేచ్ఛగా శ్వాస తీసుకొనెను. *(అబూదావూద్ కితాబున్నికాహ్)*

హింద కుమారుడు ముఆవియా (రజి) ఇట్లు తెలిపిరి. నేను రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇట్లడిగితిని. ఓ రసూలుల్లాహ్! మాపై భార్యకు ఏ హక్కు గలదు. వారిట్లనిరి. అల్లాహ్ మీకు నొసంగిన దానిని వారికి తినిపించుము. అల్లాహ్ మీకు అందించిన దుస్తులు వారికి ఇవ్వుము. ఆమెను కొట్టకుము, దూషించకుము. ఆమెను ఇంటి నుండి వెడలగొట్టకుము. *(బుఖారి, ముస్లిం)*

వారికి మహిళల మనోభావాల శ్రద్ధ ఎంత వుండెననగా వారు ఎల్లప్పుడు ఇట్లు ఉపదేశించేవారు. ప్రయాణములో బయటికి పోయిన వ్యక్తులు వారి భార్యాపిల్లలకు ఇబ్బంది కలగకూడదని తొందరగా తిరిగి

ఇంటికి రావలెను. హ[జత్ అబూహురైరహ్ (రజి) ఉల్లేఖనము ప్రకారము ప్రయాణములో వున్న వ్యక్తి తన పర్యటన ఉద్దేశము పూర్తి కాగానే తన బంధువులను గుర్తు చేసుకొని వెంటనే తిరిగి ఇంటికి రావలెనని వారు తెలిపిరి. *(బుఖారి, ముస్లిం)*

వారి పద్ధతి ఇట్లుండెను. వారు ప్రయాణము నుండి తిరిగి వచ్చేటప్పుడు పగలే నగరములో ప్రవేశించేవారు. రాత్రి అయినచో నగర శివారులోనే బస చేసి, ఉదయం నగరములో ప్రవేశించేవారు. ఈ విధముగా రాత్రి అకస్మాత్తుగా ఇంటికి వచ్చి గృహిణులను ఇబ్బంది పెట్టకూడదని అనుచరులను వారు ఆదేశించేవారు. *(బుఖారి, ముస్లిం)* ఇందులో ఒక గొప్ప వివేకము వారి దృష్టిలో యుండెను. అనగా స్త్రీ, పురుషుల సంబంధాలు సున్నితమైనవి. భర్త లేనందున భార్య తన దుస్తుల, శరీర పరిశుభ్రత పట్ల పూర్తి దృష్టి సారించనిచో భర్త హఠాత్తుగా ఇంట్లోకి వచ్చినచో భార్యా భర్తల మధ్య వున్న ప్రేమానురాగాల భావాలలో తేడా వచ్చే అవకాశముండును. అందుకే వారిట్లు ఉపదేశించిరి. మానవుడు ప్రయాణము నుండి ఎప్పుడు తిరిగి వచ్చినను పగలే ఇంట్లోకి ప్రవేశించవలెను. భార్యాపిల్లలు అతన్ని స్వాగతించుటకు తగిన ఏర్పాట్లు చేసుకొనుటకు  ముందస్తు సమాచారమిచ్చి రావలెను.

## మృతుల పట్ల వారి కార్యాచరణ

తన బంధువులకు తర్వాత ఇబ్బందులు తెలెత్తకుండా మరణించే వ్యక్తి తప్పక మరణాదేశము చేయవలెనని వారు సదా ఆదేశించేవారు.

మృతుల గురించి వారిట్లు మార్గదర్శనము చేసేవారు. ఎవడేని పట్టణములో మృతిచెందినచో అతని దుష్కర్మలను ఎప్పుడు ప్రస్తావించ కూడదు. అతని సత్కార్యములను స్మరించుకొనవలెను. ఎందుకనగా అతని చెడును ప్రస్తావించడంలో ఎలాంటి ప్రయోజనముండదు. కాని అతని



పుణ్యమును స్మరించుకొన్నచో ఇతరుల హృదయములలో అతని కొరకు ప్రార్థన చేయు ఆలోచన కలుగును. *(బుఖారి)*

మరణించిన వారిపై నున్న రుణములను త్వరితగతిన చెల్లించ వలెనని వారు ప్రత్యేక శ్రద్ధ కనబర్చేవారు. ఎవరైనా మృతి చెందినప్పుడు అతని పై రుణభారము తేలినచో వారే స్వయముగా అతని రుణము చెల్లించేవారు. వారు చెల్లించలేని స్థితిలో వున్నచో మృతుని బంధువులను రుణము చెల్లించుటకు ప్రోత్సహించేవారు. మృతుని రుణము చెల్లించనంత వరకు అతని అంత్యక్రియ ప్రార్థన చదివేవారు కాదు.

## ఇరుగు పొరుగు వారితో సత్ప్రవర్తన

ఇరుగు పొరుగు వారితో వారు అన్యోన్యంగా వ్యవహరించేవారు. వారిట్లు తెలిపేవారు. ఇరుగు పొరుగు వారితో సత్ప్రవర్తన కలిగి వుండవలెనని జిబ్రాయీల్ నన్ను పదేపదే ఆదేశించుచుండెను. తుదకు ఇరుగు పొరుగు వారిని ఆస్తిలో వారసులుగా చేయునని నేను ఊహించితిని. *(బుఖారి, ముస్లిం)*

హ[జత్ అబూజర్ ఘఫ్ఫారి (రజి) ఇట్లు తెలిపిరి. నాతో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనేవారు. ఓ అబూ జర్! నీవు ఎప్పుడేని పులుసు వండినచో నీరెక్కువ పోయుము. తమ ఇరుగు పొరుగు వారిని దృష్టిలో వుంచుకొనుము. *(ముస్లిం)* ఇతర వస్తువులు ఇవ్వవలసిన అవసరం లేదని కాదు. అరబ్ గ్రామీణుల ఉత్తమ ఆహారము పులుసు అయినందున పొరుగువారి సహాయము గురించి ఇదే ఆహారమును ప్రస్తావించిరి. తమ రుచి కొరకే తాపత్రయ పడకుము. మీ ఇరుగు పొరుగు వారు మీ ఆహారములో చేరవలెనని ఆలోచించుము.

హ[జత్ అబూహురైరహ్ (రజి) ఉల్లేఖనము ప్రకారము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఒకసారి కూర్చొని వుండగా ఇట్లనిరి.

అల్లాహ్ ప్రమాణము అతడు ఎన్నటికి విశ్వాసి కాడు. అల్లాహ్ ప్రమాణము అతడు ఎన్నటికి విశ్వాసి కాడు. అల్లాహ్ ప్రమాణము అతడు ఎన్నటికి విశ్వాసి కాడు. ఓ రసూలుల్లాహ్! ఎవడు విశ్వాసి కాడని అనుచరులు అడిగిరి. ఇరుగు పొరుగు వారు ఎవడి ద్వారా నష్టము, దుష్ప్రవర్తన నుండి సురక్షితముగా లేరో అతడని వారనిరి. తమ పొరుగు వారిని దృష్టిలో వుంచుకోవలెనని మహిళలను కూడ వారు ఆదేశించేవారు.

ఒక సారి వారు స్త్రీలలో ఉపదేశించుచూ ఇట్లనిరి. ఎవరికైనా ఒక మేక కాలు లభించినను అందులో పొరుగువారి హక్కును కేటాయించవలెను. *(బుఖారి, ముస్లిం)* వారు అనుచరులను తరచు ఇట్లు ఉపదేశించేవారు. మీ ఇరుగు పొరుగు వారు మీ గోడలో ఏదేని మొలను కొట్టినచో, లేదా మీకు నష్టము కలిగించని విధముగా మీ గోడతో ఏదైనా పని చేసుకొనినచో మీరతనిని అడ్డుకోకూడదు. *(బుఖారి, ముస్లిం)*

హజ్రత్ అబూహురైరహ్ (రజి) ఉల్లేఖనము ప్రకారము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించేవారు. అల్లాహ్, ప్రళయ దినమును విశ్వసించే వ్యక్తి తన ఇరుగు పొరుగు వారికి బాధ కలిగించ కూడదు. అల్లాహ్, ప్రళయ దినమును విశ్వసించే వ్యక్తి తన అతిథిని నొప్పించకూడదు. అల్లాహ్, ప్రళయ దినమును విశ్వసించే వ్యక్తి సత్యము పలుకవలెను లేనిచో మౌనముగా వుండవలెను. *(బుఖారి, ముస్లిం)*

## తల్లిదండ్రులు, ఇతర బంధువులతో సత్ప్రవర్తన

ప్రపంచములో అధికులు యుక్తవయసునకు చేరుకోగానే తమ భార్యాపిల్లల యోగక్షేమాలలో మునిగిపోయి తల్లిదండ్రులతో సత్ప్రవర్తన విషయంలో కొంత అలక్ష్యం ప్రదర్శించెదరు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఈ లోపమును దూరము చేయుటకు తల్లిదండ్రులతో సత్ప్రవర్తన ప్రాముఖ్యతను తరచుగా స్పష్టము చేసేవారు. కనుక హజ్రత్



అబూహురైరహ్ (రజి) ఉల్లేఖనము ప్రకారము ఒక వ్యక్తి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! నా సత్ప్రవర్తనకు ఎవరు అధిక అర్హులు. నీ తల్లి అని వారనిరి. అతడు మరల ఎవరని అడిగెను. వారు మరల నీ తల్లి అనిరి. ఓ రసూలుల్లాహ్! మరల ఎవరని అతడు అడిగెను. ఆ తర్వాత కూడ నీ తల్లి అనిరి. అతడు నాలుగవ సారి ఓ రసూలుల్లాహ్! ఆమె తర్వాత ఎవరని అడగగా ఆ తర్వాత నీ తండ్రి, తర్వాత అతని బంధువులు, తర్వాత వారి బంధువులని వారనిరి. *(బుఖారి, ముస్లిం)*

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పెద్దలు బాల్యములోనే మృతిచెందియుండిరి. సతీమణుల పెద్దలు జీవించియుండిరి. వారు ఎల్లప్పుడు వారిని గౌరవించేవారు. మక్కా జయించబడినప్పుడు వారు ఒక విజేత సేనాపతిగా మక్కాలో ప్రవేశించినప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) తమ తండ్రిని వారితో కలుపుటకు తీసుకొచ్చిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నీవు వారిని ఎందుకు బాధ పెట్టితివి. నేనే వారి వద్దకు వెళ్లేవాడిని కదా. *(అస్సీరతుల్ హల్బియ్యహ్ సంపుటి 3 పుట 99)* వారు తరచుగా అనుచరులతో ఇట్లనేవారు. తమ వృద్ధ తల్లిదండ్రుల కాలము పొంది కూడ స్వర్గమునకు అర్హుడు కానివాడు అత్యంత దౌర్భాగ్యుడు. అనగా వృద్ధ తల్లిదండ్రుల సేవ మానవున్ని అల్లాహ్ అనుగ్రహములకు వారసున్ని చేయును. తన వృద్ధ తల్లిదండ్రుల సేవ చేయు అవకాశము పొందిన వ్యక్తి సత్కార్యములలో స్థిరత్వం, అల్లాహ్ శుభములకు అర్హత పొందును. *(ముస్లిం)*

ఒక సందర్భమున రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో ఒక వ్యక్తి ఇట్లు ఫిర్యాదు చేసెను. ఓ రసూలుల్లాహ్! నేను నా బంధువులతో సత్ప్రవర్తనతో వ్యవహరించినను వారు నాతో దుష్ప్రవర్తనతో

వ్యవహరించెదరు. నేను వారిపై ఉపకారము చేయగా వారు నాపై దౌర్జన్యము చేయుదురు. నేను వారితో ఆప్యాయతగా ప్రవర్తించగా వారు నాకు దు:ఖము కలిగించెదరు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఇదే నిజమైనచో నీవు చాలా అదృష్టవంతుడవు. ఎందుకనగా అల్లాహ్ సహాయము సదా నీకు అందును. *(ముస్లిం కితాబుల్ బిర్ వస్సిలహ్)*

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సారి దాన, ధర్మములను గూర్చి ఉపదేశించుచుండగా వారి ఒక అనుచరుడు హజ్రత్ అబూతల్హా అన్సారి (రజి) వచ్చి తన ఒక తోటను దానముగా అంకితము చేసిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అందుకు చాలా సంతోషించి ఇట్లనిరి. గొప్ప దానము. చాలా ఉత్తమ దానము. చాలా ఉత్తమ దానము. మరల ఇట్లనిరి. నీవైతే అంకితము చేసితివిగదా! నీవు దీనిని నీ బంధువులలో పంచిపెట్టుమని నా హృదయకాంక్ష. *(బుఖారి కితాబుత్తఫ్సీర్)*

ఒక సారి వారి వద్దకు ఒక వ్యక్తి వచ్చి ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! నేను ప్రస్థానమునకు మీ హస్తముపై ప్రతిజ్ఞ చేయుదును. నేను అల్లాహ్ మార్గములో సేవ చేయుటకు మీ హస్తముపై ప్రతిజ్ఞ చేయుదును. ఎందుకనగా నా అల్లాహ్ నాతో సంతోషపడవలెనని నేను కోరు కుంటున్నాను. నీ తల్లిదండ్రులలో ఎవరైనా సజీవముగా వున్నారా అని వారడిగిరి. ఇద్దరు సజీవముగా నున్నారని అతడనెను. వారిట్లనిరి. నీ అల్లాహ్ నీతో సంతోషపడవలెనని నీవు కోరుకుంటున్నావా ? ఓ రసూలుల్లాహ్ ! అవును అవునని అతడనెను. అయితే నీవు తిరిగి పోయి నీ తల్లిదండ్రులకు సేవలందించుట ఉత్తమమని వారనిరి. *(బుఖారి, ముస్లిం)*



సత్ప్రవర్తనకు మతము అడ్డురాకూడదు, నిరుపేద బంధువులు ఏ మతమునకు చెందినను వారితో మంచిగా వ్యవహరించుట పుణ్యమని వారు సదా తెలిపేవారు. హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) ఒక భార్య అన్యారాధకురాలుగా వుండెను. హజ్రత్ అబూబకర్ (రజి) కూతురు అస్మా (రజి) నేను వారికి మర్యాదలు చేయవచ్చునా అని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రశ్నించెను. వారిట్లనిరి. ఎందుకు చేయకూడదు ? ఆమె నీ తల్లి, నిశ్చయముగా మర్యాదలు చేయుము. *(బుఖారి కితాబుల్ అదబ్)*

బంధువులే కాదు బంధువుల బంధువులతో, వారి మిత్రులతో కూడ వారు మర్యాదపూర్వకముగా వ్యవహరించేవారు. ఎప్పుడేని వారు పశువును బలి ఇచ్చినప్పుడు మాంసమును హజ్రత్ ఖదీజ (రజి) స్నేహితురాళ్లకు తప్పక పంపేవారు. ఖదీజ (రజి) స్నేహితురాళ్లను విస్మరించకూడదని వారికి తప్పక మాంసము పంపవలెనని తరచుగా ఆదేశించేవారు. *(బుఖారి, ముస్లిం)*

హజ్రత్ ఖదీజ (రజి) మృతిచెందిన కొన్ని సంవత్సరముల తర్వాత వారొక సమావేశములో కూర్చొని వుండగా హజ్రత్ ఖదీజ (రజి) సోదరి హాల (రజి) వారిని సందర్శించుటకు వచ్చెను. ఆమె నేను లోనికి రావచ్చునా? అని అనుమతి కోరినప్పుడు హాల (రజి) స్వరము మరణించిన ఆమె సోదరి హజ్రత్ ఖదీజ (రజి) స్వరము వలె వుండెను. ఆ పిలుపు విని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం గత స్మృతులలో లీనమై శరీరము కంపించెను. మరల తేరుకొని ఓ అల్లాహ్! ఈమె ఖదీజ (రజి) సోదరి హాల కదూ! అని అనిరి. *(బుఖారి, ముస్లిం)* వాస్తవముగా నిజమైన ప్రేమకు ఇదొక నిదర్శనము. మనకు ప్రియమైన, గౌరవనీయులైన వారి సన్నిహితుల, సంబంధీకుల పట్ల కూడ ప్రేమ, గౌరవము పుట్టును.

అనస్ బిన్ మాలిక్ (రజి) ఇట్లు తెలిపిరి. నేను ఒక సారి ప్రయాణములో వుంటిని. జరీర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి), అనుచరుడు కూడ ఈ ప్రయాణములో వెంట వుండెను. వారు ప్రయాణములో సేవకునిగా నా పనులు చేయుచుండిరి. జరీర్ (రజి) వయసులో పెద్ద వారైనందున వారిని గౌరవించుట ఆవశ్యమని హజ్రత్ అనస్ (రజి) భావించేవారు. అందుకే నేను అట్లు చేయకూడదని వారిని నివారించే వాడిని. నేనట్లు అన్నప్పుడు జరీర్ (రజి) ఇట్లు సమాధానమిచ్చేవారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అనంత సేవలు చేయుచు అన్సార్లను నేను చూచితిని. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంతో వారి ఈ ప్రేమను చూచి మనసులో ఇట్లు ప్రతిజ్ఞ చేసియుంటిని. అన్సార్‌తో కలిసి ప్రయాణించు, అతనితో వుండే అవకాశము వచ్చినప్పుడు నేను అతనికి సేవలు చేయుదును. కనుక మీరు నన్ను నివారించకుము. నేను నా ప్రతిజ్ఞను పూర్తి చేయుచున్నాను. *(బుఖారి, ముస్లిం)*

తమ ప్రియుని సేవకుడు కూడ ప్రేమికుని దృష్టిలో ఆప్యాయత పొందునని ఈ సంఘటన స్పష్టముగా నిరూపించును. కనుక ఎవరి హృదయములోనైతే తన తల్లిదండ్రుల నిజమైన ప్రేమ వుండునో వారు తమ తల్లిదండ్రులనే గాక వారి బంధువులను, మిత్రులను కూడ గౌరవింతురు. ఒక సారి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమావేశములో సన్నిహితుల సేవ గురించి ప్రస్తావన జరుగుచుండెను. తన తండ్రి మిత్రుల సేవ చేయుట కూడ గొప్ప పుణ్యమని వారనిరి. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తో వారీ విషయము చెప్పి వుండిరి. దీనిని వారు ఎట్లు పాటించిరనగా వారొక సారి హజ్ కాబా యాత్రకు వెళ్లుచున్నప్పుడు మార్గములో ఒక వ్యక్తి వారికి కనిపించెను. తన వాహనము అయిన గాడిదను అతనికిచ్చి, తన అందమైన తలపాగ కూడ



బహుకరించిరి. వారి అనుచరులు వారితో ఇట్లనిరి. మీరు ఎంత పని చేసిరి. వీరు గ్రామీణ వ్యక్తులు. కొంచెం ఇచ్చినా సంతోషింతురు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇట్లనిరి. ఇతని తండ్రి హజ్రత్ ఉమర్ (రజి) నకు మిత్రుడిగా నుండెను. తన తండ్రి మిత్రుల సేవ చేయుట గొప్ప పుణ్యమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో నేను విని యుంటిని. *(ముస్లిం)*

## మంచి సహవాసము

వారు తన చుట్టు సదా పుణ్యవంతులు వుండుటను ఇష్టపడేవారు. ఎవరిలోనైన లోపము కనిపించినచో అద్వితీయ రీతిలో రహస్య పద్ధతిలో ఆదేశించేవారు. హజ్రత్ అబూ మూసా అష్అరి (రజి) ఉల్లేఖనము ప్రకారము రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించేవారు. పుణ్య మిత్రుడు, పుణ్య సమావేశము, దుష్ట మిత్రుడు, దుష్ట సమావేశపు ఉదాహరణ ఇట్లు గలదు. కస్తూరిని మోయుచు తిరుగువాడు దానిని తినినచో లాభము పొందును. ఒక చోట పెట్టినను దాని సువాసనతో లబ్ది పొందును. కాని దుష్ట సహచరులు గల వ్యక్తి ఉదాహరణ కుంపటిని రాజేయు వాని వలె గలదు. అందులోని ఒక అగ్ని రవ్వ వచ్చి అతని దుస్తులను కాల్చి వేయును. లేదా బొగ్గు దుర్వాసనతో అతడి మెదడు చెడిపోవును.

వారు తమ అనుచరులతో తరచుగా ఇట్లనేవారు. వ్యక్తి గుణములు అతను కూర్చునే సమావేశములను పోలి వుండును. అందుకే ఎల్లప్పుడు పుణ్య సహవాసమును అవలంభించుము. *(బుఖారి, ముస్లిం)*

## ప్రజల విశ్వాసమును రక్షించు తాపత్రయం

ఏ వ్యక్తి కూడ అపార్థం చేసుకోకూడదని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తాపత్రయ పడేవారు. ఒక సారి రసూలె కరీం సల్లల్లాహు

అలైహి వసల్లం మస్జిద్‌లో వుండగా వారి భార్య హజ్రత్ సఫియ్య బిన్తె హుయ్యి (రజి) వారిని కలిసేందుకు వచ్చిరి. మాటలలో వుండగా ఆలస్యమయ్యెను. వారిని గృహము వరకు వదులుట మంచిదని వారు భావించిరి. వారిని గృహమునకు వదులుటకు పోవుచున్నప్పుడు మార్గ మధ్యలో ఇద్దరు వ్యక్తులు తారసపడిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇంత రాత్రి ఏ మహిళతో పోవుచున్నారనే అనుమానము వారి హృదయములో కలుగునని వారు (స) సందేహ పడిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వారిద్దరిని ఆపి ఇట్లనిరి. చూడుము! ఈమె నా భార్య సఫియ్య (రజి). వారిట్లనిరి. ఓ రసూలుల్లాహ్! మీ గురించి మేమెట్లు చెడుగా భావించగలము. వారిట్లనిరి. షైతాన్ మానవ రక్తములో ప్రవహించును. మీ విశ్వాసము బలహీనపడునని నేను భయపడితిని. *(బుఖారి అబ్వాబుల్ ఈతికాఫ్)*

## ఇతరుల లోపాలను కప్పిపుచ్చుట

ఎవరి లోపమైన వారి (స) కంట పడినచో దానిని కప్పిపుచ్చేవారు. ఎవడేని తన లోపమును బహిర్గతమొనర్చినచో అలా చేయకూడదని వారించేవారు. ఎవరైతే ఇతరుల తప్పిదములను ఈ ప్రపంచములో కప్పిపుచ్చునో అల్లాహ్ వారి లోపములను అంతిమ దినమున కప్పిపుచ్చునని వారు తెలిపేవారు. *(ముస్లిం)*

వారిట్లు ఉపదేశించేవారు. నా సమాజములోని ప్రతి వ్యక్తి పాపము (పశ్చత్తాపముతో) అంతము కాగలదు. కాని తమ పాపములను తామే బహిర్గతమొనర్చు వారికి ఎలాంటి చికిత్స లేదు. మరల వారిట్లు తెలిపేవారు. తాను బహిర్గతము చేయడమనగా ఒక వ్యక్తి రాత్రి తప్పు చేయును. అల్లాహ్ దానిని కప్పిపుచ్చును. కాని అతడు ఉదయం తన మిత్రులతో కలిసి ఇట్లనును. ఓ మిత్రుడా! నేను రాత్రి ఈ పని చేసితిని,



ఓ మిత్రుడా! నేను రాత్రి ఆ పని చేసితిని. అల్లాహ్ అతని రాత్రి తప్పును కప్పిపుచ్చుచుండెను. అతడు స్వయానా తన తప్పును ఉదయం బహిర్గత మొనర్చును. *(బుఖారి, ముస్లిం)*

తప్పును బహిర్గత పరచుటతో పశ్చత్తాపము పుట్టునని కొందరు అమాయకముగా భావింతురు. వాస్తవముగా తప్పును బహిర్గత పర్చడం వలన పశ్చత్తాపము పుట్టదు. తప్పును బహిర్గత పర్చడం వలన నిర్లజ్జత పెరుగును. పాపము పాపమే కాని పాపము చేసిన వారి హృదయములో లజ్జ, పశ్చత్తాపము కలుగును. అటువంటి వారికి క్షమాభిక్ష లభించే అవకాశముండును. దైవ భీతి వారికి తోడుండును. ఏదో ఒక పుణ్య ఘడియలో దైవ భీతి విజయము సాధించి పాపము పలాయనమగును. కాని తమ పాపములను భహిర్గత పరచి అహంభావం ప్రదర్శించు వారి మనసులో పాపపు భావన అంతమగును. పాపపు భావన అంతమైనప్పుడు క్షమాభిక్షకు అవకాశమే లేదు.

ఒక సారి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు ఒక వ్యక్తి వచ్చి ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! నేను వ్యభిచారము చేసితిని. వ్యభిచారము ఇస్లాంలో శిక్షార్హమైన నేరము. ముస్లిం ధర్మ శాసనం ఏర్పడిన చోట ఒక వ్యక్తి వ్యభిచారము చేసినట్లు ఇస్లాం నిబంధనల మేరకు రుజువైనచో అతనికి శారీరక శిక్ష విధించబడును. అతడు నేను వ్యభిచారము చేసితినని అన్నప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని వైపు నుండి తన ముఖము మరో ప్రక్క తిప్పుకొని మాటలలో నిమగ్నమైరి. ఏ పాపమునైతే అల్లాహ్ కప్పిపుచ్చెనో దానికి చికిత్స ప్రకటన కాదు పశ్చత్తాపమని అతనికి పరోక్షంగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తెలుపుచుండిరి. కాని ఈ విషయమును అర్థం చేసుకోక నా మాట రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వినలేదని

భావించి వారి ముందుకొచ్చి నిలబడి మరల అతడు ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! నేను వ్యభిచారము చేసితిని. మరల వారు వేరే వైపు ముఖము తిప్పుకొనిరి. అయినను అతడు అర్థం చేసుకోక మరల ఆ వైపు వచ్చి అదే విషయమును చెప్పెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని వైపు దృష్టి సారించక వేరే వైపు ముఖము తిప్పుకొనిరి. ఆ వ్యక్తి మరల వారి ముందుకొచ్చి నిలబడెను. మరల అతడు నాలుగవ సారి అదే విషయమును చెప్పినప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ నిర్ణయించనంత వరకు ఇతడు తన తప్పును ప్రకటించ కూడదని నేను కోరుకొంటిని. కాని ఇతడు నాలుగు పర్యాయములు తన గురించి తానే సాక్ష్యమిచ్చుకొనెను. కావున ఇప్పుడిది నా పరిధి దాటి పోయెను. *(తిర్మిజి అబ్వాబుల్ హుదూద్)* ఆ తర్వాత ఇట్లు తెలిపిరి. ఇతడు తనకు తానే ఆరోపించుకొనెను. ఆ మహిళ ఆరోపించలేదు. ఇతడు వ్యభిచార ప్రకటన చేసిన మహిళను విచారించుము. ఆమె నిరాకరించినచో ఆమెను వదిలి పెట్టుము. ఇతన్ని మాత్రమే ఇతని నేరాంగీకారం మేరకు శిక్షించుము. కాని ఆ మహిళ కూడ ఒప్పుకొన్నచో ఆమెను కూడ శిక్షించుము. పవిత్ర ఖురాన్ బోధనలు అవతరించని విషయాలలో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం పాత నిబంధనను అనుసరించేవారు. పాత నిబంధనలో వ్యభిచారకున్ని రాళ్ళతో కొట్టు ఆదేశము గలదు. కనుక ఆ వ్యక్తిని రాళ్ళతో కొట్టవలెనని ఆదేశించిరి. ప్రజలు అతనిపై రాళ్ళు విసరడం మొదలు పెట్టినప్పుడు అతడు పారిపోదలచెను. కాని ప్రజలు పరుగెత్తి అతన్ని వెంటాడి పాత నిబంధన బోధనానుసారము హతమార్చిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలియగా దానిని అయిష్టపడి ఇట్లనిరి. అతని నేరాంగీకారం మేరకు అతను శిక్షించబడెను. అతడు పారిపోయినప్పుడు



తన అంగీకారమును నిరాకరించెను. కనుక తర్వాత అతన్ని రాళ్ళతో కొట్టు హక్కు మీకు లేకుండెను. అతన్ని విడిచి పెట్టవలసి యుండెను.

శాసనము బహిర్గత విషయాలపై అమలు చేయబడవలెనని వారు తరచుగా ఆదేశించేవారు. ఒక సారి అనుచరులు (రజి) ఒక యుద్ధములో వెళ్లియుండిరి. మార్గ మధ్యలో ఒక అన్యారాధకుడు అరణ్యములో గుప్తముగా తిరుగుచు వారి కంట పడెను. ఒంటరిగా ఒక ముస్లిం అతనికి కనిపించినప్పుడు అతని పై దాడి చేసి అతడు హతమార్చుచుండెను. ఉసామా బిన్ జైద్ (రజి) అతన్ని వెంటాడి ఒక చోట పట్టుకొనిరి. అతన్ని హతమార్చుటకు ఖడ్గము పైకి లేపగా నేను పట్టుబడ్డానని భావించి అతడు لَا اِلٰهَ اِلَّا اللّٰهُ అని చదివెను. అనగా తాను ఇస్లాం స్వీకరించుచున్నానని అర్థము. అయినను ఉసామా (రజి) అతని ఈ వాఖ్యమును లెక్కచేయక అతన్ని హతమార్చిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ యుద్ధము గురించి సమాచారము అందించుటకు ఒక వ్యక్తి మదీనా వచ్చినప్పుడు ఈ యుద్ధము విషయములతో పాటు ఈ సంఘటన కూడ ప్రస్తావించెను. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉసామా (రజి) ను పిలిపించి నీవు అతన్ని హతమార్చితివా? అని ప్రశ్నించిరి. వారు అవుననిరి. వారిట్లనిరి. ప్రళయ దినమున నీకు వ్యతిరేకముగా لَا اِلٰهَ اِلَّا اللّٰهُ సాక్ష్యమిచ్చినప్పుడు నీవేమి చేయుదువు? అనగా అతడు لَا اِلٰهَ اِلَّا اللّٰهُ చదివినను నీవెందుకు హతమార్చితివని అల్లాహ్ ద్వారా నిన్ను ప్రశ్నించబడును. అతడు హంతకుడైనను పశ్చత్తాపము ప్రకటించి యుండెను. ఓ రసూలుల్లాహ్! అతడు ప్రాణ భయముతో విశ్వాసము ప్రకటించెనని హజ్రత్ ఉసామా (రజి) సమాధానముగా చాలా సార్లు చెప్పిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అతడు అబద్ధమాడినట్లు నీవు అతని హృదయమును

చీల్చి చూచితివా? ప్రళయ దినమున నీకు వ్యతిరేకముగా لَا اِلٰهَ اِلَّا اللّٰهُ నీ ముందు ప్రవేశపెట్టబడి నప్పుడు నీవేమి సమాధానమిత్తువు? అని పదే పదే అనిరి. అందుకు నేను నేడే ఇస్లాం స్వీకరించి వుండి ఈ చర్య నాతో సంభవించకుంటే ఎంత బాగుండునని ఉసామా (రజి) తెలిపిరి. *(ముస్లిం)*

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పాపములను క్షమించుటలో ఎంతో శ్రద్ధ కలిగివుండిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం భార్య హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) పై కొందరు నిందారోపణ చేసిరి. వారిలో హజ్రత్ అబూబకర్ (రజి) సంరక్షణలో వున్న వ్యక్తి కూడ యుండెను. ఈ నిందారోపణ అసత్యమని తేలిన తర్వాత హజ్రత్ అబూబకర్ (రజి) తన కూతురుపై నింద మోపిన వ్యక్తి సంరక్షణ బాధ్యత నుండి తప్పుకొనిరి. ఇంత కంటే వేరే నిర్ణయం ప్రపంచములో ఎవరు తీసుకోగలరు ? ఇతరులైనచో ఇటువంటి వ్యక్తిని హత్య చేసేవారు. కాని హజ్రత్ అబూబకర్ (రజి) కేవలం అతని సంరక్షణ బాధ్యత నుండి వైదొలిగిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలిసినప్పుడు వారు హజ్రత్ అబూబకర్ (రజి) ను సముదాయించి ఇట్లనిరి. ఆ వ్యక్తితో తప్పు జరిగెను, అతడు పాపమునకు పాల్పడెను. కాని ఒక మానవుని పాపము వలన అతని ఆహారము నిలిపివేయుట నీ స్థాయికి తగదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశానుసారము హజ్రత్ అబూబకర్ (రజి) అతని సంరక్షణ బాధ్యతను మరల స్వీకరించిరి. *(బుఖారి కితాబుత్తఫ్సీర్)*

## ఓపిక

వారిట్లు ఉపదేశించేవారు. ఒక విశ్వాసికి ప్రపంచములో మంచియే జరుగును. విశ్వాసి తప్ప మరొకనికి ఈ స్థానము దక్కదు. అతనికి



విజయము లభించినచో అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపి అల్లాహ్ అనుగ్రహమునకు అర్హుడగును. అతనికి బాధ కలిగినచో సహనం వహించి అల్లాహ్ అనుగ్రహమునకు అర్హుడగును. *(ముస్లిం)* వారి మరణ సమయము ఆసన్నమై, వ్యాధి తీవ్రత వలన బాధపడుచున్నప్పుడు వారి కూతురు హజ్రత్ ఫాతిమా (రజి) భరించలేక ఇట్లనిరి. ఓహ్! నేను నా తండ్రి బాధను చూడలేక పోతున్నాను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వినినప్పుడు ఇట్లనిరి. సహనం పాటించుము. నేటి తర్వాత నీ తండ్రికి ఏ బాధ కలుగదు. *(బుఖారి)* అనగా నా బాధలు ఈ ప్రపంచపు జీవితము వరకే పరిమితము. నేడు నేను నా ప్రభువు వద్దకు వెళ్లిపోయెదను. తర్వాత నాకెలాంటి బాధ కలుగదు.

ఇదే క్రమంలో ఈ సంఘటన కూడ ప్రస్తావించవచ్చును. అంటు వాధ్యుల సందర్భమున ఒక నగరము నుండి మరో నగరమునకు పారిపోవుటను వారు ఇష్టపడేవారు కాదు. ఎందుకనగా ఈ విధముగా ఒక ప్రాంత వ్యాధి ఇతర ప్రాంతములో వ్యాపించును. వారిట్లు తెలిపేవారు. ఇటువంటి వ్యాధిగల ప్రాంతములో ఒక వ్యక్తి సహనముతో వుండి ఇతర ప్రాంతములో అంటు వ్యాధి వ్యాపించకుండా చేసినందుకు అతడు మృతి చెందినచో అమరుడగును. *(బుఖారి కితాబుత్తిబ్)*

## పరస్పర సహకారం

వారు ఎల్లప్పుడు తన సహచరులను పరస్పర సహకారముతో పనులు చేసుకోవలెనని ఆదేశించేవారు. వారు తమ సంఘ ప్రజల కొరకు ఈ నియమమును విధించియుండిరి. పరిహారము చెల్లించవలసిన నేరము ఎవరితోనైనా జరిగినప్పుడు పరిహారము చెల్లించలేని స్థితిలో అతడున్నచో అతని వీధి, నగరము, జాతి ప్రజలు కలిసి ఆ పరిహారమును చెల్లించవలెను.

పలువురు ధర్మ సేవ నిమిత్తం వారి వద్దకు వచ్చేవారు. అటువంటి వారి భారమును మోయుమని, అవసరాలను తీర్చవలెనని వారి బంధువులను ఉపదేశించేవారు. హ్రజత్ అనస్ (రజి) ఇట్లు తెలిపిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కాలములో ఇద్దరు సోదరులు ఇస్లాం స్వీకరించిరి. ఒక సోదరుడు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద వుండసాగెను. రెండవ సోదరుడు తన కార్యములలో నిమగ్నమయ్యెను. పని చేయు సోదరుడు తన సోదరుని గురించి ఈ పనికి మాలినవాడు కూర్చొని వుంటాడు, ఏ పని చేయడని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఫిర్యాదు చేసెను. వారిట్లనిరి. ఇటుల అనకుము. అల్లాహ్ ఇతని ద్వారనే నీకు ఆహారమందించును. కనుక ఇతని సేవ చేయుము. ధర్మ సేవకై ఇతనికి స్వేచ్ఛ కల్పించుము. *(తిర్మిజి)*

ఒక సారి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రయాణించుచుండిరి. కొంత దూరం ప్రయాణించిన తర్వాత ఒక చోట గుడారములు వేయబడెను. గుడారములు వేయుటకు, శిబిరమునకు అవసరమున్న ఇతర అనివార్య పనులకై అనుచరులు మైదానములో వ్యాపించిరి. పనులన్ని వారు పరస్పరము విభజించుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఏ పని అప్పగించలేదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీరు నా వంతుకు ఏ పని వదిలిపెట్టలేదు. నేను వంట చేయుటకు కట్టెలను సమకూర్చెదను. అనుచరులు ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్ ! పనులు చేయుటకు మేమున్నాము కదా. మీరెందుకు కష్టపడెదరు. పనులలో భాగము పంచుకొనుట నా బాధ్యత అని వారనిరి. కనుక అనుచరులు వంట చేయుటకు అరణ్యము నుండి వారు కట్టెలు సమకూర్చిరి.

*(జర్ఖానీ సంపుటి 4 పుట 306)*



**క్షమాగుణము**

వారు సదా ఇట్లు ఉపదేశించేవారు. అనవసరముగా ఇతరుల కార్యముల గూర్చి విమర్శలు చేయకుము, మీతో సంబంధము లేని సమస్యలలో జోక్యము కల్పించుకోకుము. ఎందుకనగా ఇటుల ఉపద్రవ మేర్పడును. వారిట్లు ప్రవచించేవారు. ప్రత్యక్షముగా తనకు సంబంధము లేని విషయాలలో అనవసరముగా జోక్యము చేయకపోవడం, ఒక వ్యక్తి ఇస్లాంనకు గొప్ప ఉదాహరణ. వారి ఈ ప్రవర్తనను పర్యవేక్షించినచో ప్రపంచములో శాంతి స్థాపించబడును. వేలాది పీడనములు తలెత్తుటకు కారణమేమనగా ఆపదలో వున్న వారికి సహాయము చేయుటకు సిద్ధపడని వారు ఇతరుల సమస్యలలో అకారణముగా విమర్శలు చేయుటకు సిద్ధమగుదురు.

**సత్యము**

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వ్యక్తిగతంగా సత్యము పలుకుటలో ఉన్నత శిఖరానికి చేరుకొని వుండిరి. అందుకే వారి జాతి ప్రజలు వారిని సత్యవంతుడని నామకరణం చేసిరి. వారి సంఘమును కూడ సదా సత్యముపై స్థిరంగా వుండుటకు వారు ఉపదేశించేవారు. అబద్ధపు సందేహము కూడ వుండని సత్యపు ఉన్నత స్థానముపై అనుచరులను నిలుపవలెనని వారు ప్రయత్నించేవారు. వారిట్లు ప్రవచించేవారు. సత్యమే సత్కార్యమునకు కారణమగును. సత్కార్యమే మానవునికి స్వర్గమందించును. సత్యము అసలు స్థానమేమనగా అల్లాహ్ దృష్టిలో సత్యవంతుడనే బిరుదు పొందే వరకు మానవుడు సదా సత్యమే పలుకవలెను. *(బుఖారి, ముస్లిం)*

ఒక సారి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు అనేక ముస్లిముల హత్యకు కారకుడైన ఒక వ్యక్తి ఖైదీగా వచ్చెను. ఇతను హత్యకు

అర్హుడిగా వుండెనని హజ్రత్ ఉమర్ (రజి) భావించి అదే పనిగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వైపు చూచుచు వారు సంజ్ఞ చేసినచో అతన్ని హతమార్చవలెనని భావించి యుండిరి. అతడు లేచి పోయినప్పుడు ఓ రసూలుల్లాహ్! ఇతను హత్యకు అర్హుడిగా వుండెనని హజ్రత్ ఉమర్ (రజి) మనవి చేసిరి. హత్యకు అర్హుడైనచో నీవు అతన్ని ఎందుకు హత్య చేయలేదని వారు ఎదురు ప్రశ్న వేసిరి. వారిట్లనిరి. ఓ రసూలుల్లాహ్! మీరు కనుసైగలతో సూచించినచో నేను అతన్ని హత్య చేసేవాడిని. అప్పుడు వారిట్లు నుడివిరి. దైవ సందేశహరుడు మోసమునకు పాల్పడడు. నేను అతనితో ఆప్యాయముగా మాట్లాడుచుండగా మోసమునకు పాల్పడుచూ కనుసైగతో హతమార్చమని ఎలా ఆదేశించగలను. *(సీరత్ ఇబ్నె హష్షామ్ సంపుటి 2 పుట 217)*

మరొక సారి ఒక వ్యక్తి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, ఇట్లనెను. ఓ రసూలుల్లాహ్! నాలో మూడు లోపములు గలవు. ఒకటి అబద్ధము, రెండవది మద్యపానము, మూడవది వ్యభిచారము. ఈ లోపములను వదులుటకు నేను చాలా ప్రయత్నించితిని. కాని నేను నా ప్రయత్నంలో సఫలం కాలేకపోయితిని. నాకు తగిన మార్గము చూపగలరు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు నుడివిరి. నీవు నాతో ఒక పాపమును వదులుటకు వాగ్దానము చేయుము. ఇతర రెండింటిని నేను విడిపించెదను. నేను వాగ్దానము చేయుచున్నాను. ఏ పాపమును నేను వదులవలెనో చెప్పగలరని అతను మనవి చేసెను. నీవు అబద్ధము వదిలిపెట్టమని వారు అతన్ని ఆదేశించిరి. కొన్ని రోజుల తర్వాత అతడు తిరిగి వచ్చి ఇట్లనెను. మీ ఆదేశమును నేను పాటించితిని. నాలో వున్న పాపములన్నియు దూరమైనవి. అదెలా జరిగినదో? వివరించమని వారు ఆదేశించిరి. అతడిట్లు వివరించెను. ఒక రోజు నా మనసులో



మద్యపానము గురించి ఆలోచన వచ్చెను. నేను మద్యము సేవించుటకు సిద్ధమైతిని. నా మిత్రులు నీవు మద్యం సేవించితివా అని ప్రశ్నించితే ఇంతకు ముందు నేను సేవించలేదని అబద్ధము చెప్పేవాడిని. కాని ఇప్పుడు నేను సత్యమే పలుకుతానని వాగ్దానము చేసితిని. నేను మద్యం సేవించానని చెప్పినచో నా మిత్రులు నా నుండి దూరమగుదురు. త్రాగలేదని చెప్పినచో అబద్ధమగును. కాని అబద్ధము చెప్పనని ప్రతిజ్ఞ చేసితిని. అందుకే నేను మద్యం సేవించే నిర్ణయమును వాయిదా వేసుకొంటిని. అలాగే నేను వ్యభిచారము గురించి మనసులో ఆలోచించితిని. దాని గురించి కూడ నా హృదయంలో ఇదే సంవాదన జరిగినది. నా మిత్రులు నన్ను ప్రశ్నించితే నేను ఏమందును. నేను వ్యభిచారము చేసినానని చెప్పినచో నా మిత్రులు నా నుండి దూరమగుదురు. చేయలేదని చెప్పినచో అబద్ధమగును. కాని అబద్ధము చెప్పనని నేను ప్రతిజ్ఞ చేసితిని. ఈ విధంగా నాకు నా హృదయమునకు మధ్య చాలా రోజుల వరకు సంఘర్షణ జరిగెను. కొంత కాలము వరకు ఈ రెండు చెడు వ్యసనాల నుండి దూరముండటం వలన వాటి పట్ల ఆసక్తి తగ్గెను. సత్యమును అలవర్చుకున్నందుకు ఇతర లోపాల నుండి కూడ నేను విముక్తి పొందితిని.

**శోధించుటకు నివారణ, సదాభిప్రాయ ఆదేశము**

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం శోధించుటను నివారించే వారు. ఒకరిపై మరొకరు సదాభిప్రాయము కలిగి వుండవలెనని ఆదేశించేవారు. హజ్రత్ అబూహురైరహ్ (రజి) వ్యాఖ్యానము ప్రకారము వారిట్లు ఆదేశించేవారు. దురాలోచన దరి చేరకుము. ఎందుకనగా దురభిప్రాయము అతి పెద్ద అసత్యము. శోధించకుము. అవమానకరముగా ఇతరులను నామకరణం చేయకుము. ఈర్ష్య పడకుము. పరస్పరం వైరము పెంచుకోకుము. అందరు అల్లాహ్ దాసులమనే గుర్తుంచుకొనుము.

దైవాదేశానుసారము పరస్పరం సోదరాభిమానం పెంచుకొనుము. మరల ఇట్లు ఆదేశించేవారు. ప్రతి ముస్లిం ఇతర ముస్లింనకు సోదరుడే. అతనిని హింసించడు. ఆపదలో వుండగా నిర్లక్ష్యం వహించడు. ధనము, విద్య మరో ఇతర వస్తువు అల్పముగా నున్నందున అతన్ని నీచునిగా భావించడని గుర్తుంచుకొనుము. దైవభీతి మానవుని హృదయములో జన్మించును. తన సోదరున్ని అల్పునిగా భావించుటయే మానవున్ని మలినము చేయుటకు చాలు. ఒక ముస్లిం ప్రాణము, గౌరవము, ధనముపై మరో ముస్లిం దాడి చేయుట అధర్మము. అల్లాహ్ శరీరము, ముఖమును చూడడు. మీ కర్మల బాహ్య స్థితిని కూడ చూడడు. అతడు మీ హృదయముల ఉద్దేశములను గమనించును. *(ముస్లిం కితాబుల్ బిర్ర్ వస్సిలహ్)*

## వ్యాపారములో మోసము తగదు

ముస్లిములు మోసమునకు పాల్పడకూడదని వారు (స) ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. ఒక సారి వారు బజారులో వెళ్లుచుండగా ఒక ధాన్యపు రాశిపై విక్రయ వేలం పాట జరుగుచున్నది వారు చూచిరి. వారు తమ చేతిని ఆ ధాన్యము లోపల పెట్టగా ధాన్యము లోన తడిగా, పైన ఎండినట్లుగా వుండెను. వారు తమ చేతిని బయటికి తీసి ఇదేమిటని విక్రేతను ప్రశ్నించిరి. ఓ రసూలుల్లాహ్! వర్షము వలన ధాన్యము తడిసినదని అతడు చెప్పెను. సరే, కాని ప్రజలు తెలుసుకునే విధముగా నీవు తడిసిన భాగమును పైన ఎందుకుంచలేదని ప్రశ్నించిరి. ఆ తర్వాత మోసమునకు పాల్పడే వ్యక్తి సమాజమునకు ఉపయోగ పడలేడని వారు హితవు పలికిరి. *(ముస్లిం)* వారిట్లు గట్టిగా నొక్కి చెప్పేవారు. వ్యాపారములో ఎన్నటికి మోసము వుండరాదు. చూడనిదే ఏ వస్తువు కొనుగోలు చేయకుము. ఒకరు బేరమాడుచుండగా మరొకరు బేరమాడకూడదు. ధర పెరిగిన తర్వాత విక్రయించి లబ్ధి పొందే ఉద్దేశముతో వస్తువులను



నిలువ చేయకూడదు. అవసరము గల వారికి వెంట వెంటనే వస్తువులు సరఫరా చేయవలెను.

## నిరాశ

నిరాశ దృక్పథమును వారు (స) తీవ్రంగా వ్యతిరేకించేవారు. సమాజములో నిరాశ కల్పించే మాటలు మాట్లాడు వ్యక్తి ఆ జాతి వినాశమునకు బాధ్యుడగునని వారు ఉపదేశించేవారు. ఎందుకనగా ఇటువంటి విషయములు వ్యాపించినచో జాతి ధైర్యము కోల్పోయి, బలహీనపడును. అహం, గర్వము కూడ సమాజమును క్షీణత వైపునకు తీసుకెళ్లును. అందుకే వాటిని ప్రదర్శించకూడదని హితవు పలికే వారు. ఈ రెండింటిలో మధ్యేమార్గమును అవలంభించుచు అటు అహం, గర్వము ప్రదర్శించకుండా ఇటు నిరాశ, నిరుత్సాహమునకు లోను కాకూడదని హితబోధ చేసేవారు. కష్టపడే తత్వమును పెంచుకొని ఫలితమును అల్లాహ్ నుండే ఆశించవలెను. తన సమాజము ప్రగతి సాధించాలనే కోరిక అతనిలో వుండవలెను కాని మనసులో అహం, గర్వము ఉండకూడదు.

## జంతువులతో సత్ప్రవర్తన

జంతువులను హింసించుటను వారు కఠినముగా ఖండించేవారు. ఇస్రాయీల్ సంతతిలో ఒక మహిళ తన పిల్లిని ఆకలితో చంపినందుకు శిక్షకు గురైనదని ప్రవచించేవారు. గడిచిన పక్షములలో ఒక వ్యక్తి ఒక నీరుగల లోతైన కుంట తీరమున నీరు త్రాగలేక దాహముతో నిలబడిన ఒక శునకమును చూచెను. అతడు తన పాదరక్షలను విప్పి నీటి కుంటలో వేసి ఆ పాదరక్షలో వచ్చిన నీటితో ఆ శునకపు దాహార్తి తీర్చెను. అతని ఈ పుణ్య కార్యము వలన ఆ వ్యక్తి గత పాపములన్నియు అల్లాహ్ క్షమించెనని వారు తెలిపిరి.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజి) ఇట్లు తెలిపిరి. ఒక సారి

మేము వారితో ప్రయాణములో వుండగా ఒక గువ్వ పిట్ట రెండు చిన్న పిల్లలను మేము పట్టుకొంటిమి. తర్వాత వాటి తల్లివచ్చి ఆందోళన చెందుచు అటు ఇటు పరుగెత్తుచుండెను. ఇంతలోనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ సమావేశమునకు చేరుకొని ఇట్లు ఆదేశించిరి. ఈ పక్షిని దాని పిల్లల వలన కష్టపెట్టినదెవరు ? అది సంతోషపడుటకు వెంటనే దాని పిల్లలను వదిలి పెట్టుము. *(అబూదావూద్)* హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజి) మరల ఇట్లు తెలిపిరి. ఒక సారి మేము చీమల పుట్టను చూచితిమి. అందులో గడ్డి పోసి దానిని కాల్చి వేసితిమి. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మీరలా ఎందుకు చేశారు ? అలా చేయుట సమంజసము కాదని హెచ్చరించిరి.

ఒక గాడిద ముఖముపై గుర్తులు పెడుతున్నది ఒక సారి వారు చూచి ఈ గుర్తులు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించిరి. రోమన్ ప్రజలు గొప్ప సంతతి గాడిదలను గుర్తించుటకు గుర్తులు పెడతారని వారు సమాధానమిచ్చిరి. మీరు ఇలా చేయకూడదు. ముఖము శరీరములోని సున్నితమైన అవయవము. వాతలు పెట్టడం అనివార్యమైనచో పశువు వీపు పై గుర్తులు పెట్టవలెనని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. *(అబూదావూద్, తిర్మిజి)*

అప్పటి నుండి ముస్లిములు పశువు వీపుపై గుర్తులు పెట్టుచున్నారు. ఇప్పుడు వారిని అనుసరించుచు ఐరోపా వారు కూడ వీపుపైనే గుర్తులు పెట్టుచున్నారు.

## మతసామరస్యము

వారు మత సామరస్యమును చాలా దృఢంగా ప్రోత్సహించేవారు. తాను స్వయముగా ఇందుకు గొప్ప ఆదర్శవంతులుగా నిలిచేవారు. యమన్ కు చెందిన ఒక క్రైస్తవ వర్గము ధార్మిక విషయముల గూర్చి



వారితో చర్చించుటకు వచ్చెను. అందులో వారి పెద్ద పెద్ద మత గురువులు కూడ వుండిరి. మస్జిద్‌లో ఉపస్థితులై సంభాషణ ప్రారంభించిరి. చర్చ సుదీర్ఘమైనప్పుడు ఆ బృంద మత గురువు మా ప్రార్థన సమయమైనది. కావున మేము బయటికి వెళ్లి ప్రార్థన చేసుకొని వచ్చెదమని అనెను. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బయటికి వెళ్ల వలసిన అవసరము లేదు. మా మస్జిద్ కూడ దైవ స్మరణ కొరకే నిర్మించబడినది. కావున మీరు మా మస్జిద్‌లోనే మీ ప్రార్థన చేసుకోగలరని అనిరి. *(జర్ఖానీ)*

## సాహసము

వారి (స) సాహసమును తెలుపు అనేక సంఘటనలు వారి జీవిత చరిత్రలో ప్రస్తావించబడినవి. ఒక సంఘటన ఇక్కడ కూడ నేను వ్రాయుచున్నాను. రోమన్ ప్రభుత్వము మదీనాపై దాడి చేయుటకు ఒక పెద్ద సైన్యమును పంపుచున్నదను వార్తలు మదీనాలో వ్యాపించినప్పుడు ముస్లిములు ప్రత్యేక జాగ్రత్త పాటించుచూ రాత్రి జాగారణ చేయువారు. ఒక రాత్రి అరణ్యము వైపు నుండి కలకలము ఏర్పడిన శబ్దము వచ్చెను. అనుచరులు తొందర తొందరగా తమ గృహముల నుండి బయటకు వచ్చి నలు వైపుల పరుగెత్తు చుండిరి. కొందరు మస్జిద్ ఆవరణలో ప్రోగైరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బయటికి వచ్చినచో వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని నిరీక్షించసాగిరి. ఏదైనా ప్రమాదము ముంచుకొచ్చినచో ఎదుర్కొనుటకు సిద్ధమైరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బయటికి వచ్చుదురని వారు నిరీక్షించుచుండగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒంటరిగా అశ్వముపై స్వారీ చేయుచు బయటి నుండి వచ్చుచున్నట్లు వారు చూచిరి. కలకలము ఏర్పడిన మొదటి శబ్దములోనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రమాదాన్ని పసిగట్టుటకు ఒంటరిగా అశ్వముపై అడవిలోకి వెళ్లిరని

తెలిసినది. అనగా అనుచరులు గుమికూడిన తర్వాత వారితో కలిసి వెళ్లుటకు వారు నిరీక్షించలేదు. ఒక్కరే అరణ్యములోకి వెళ్లి వాస్తవ పరిస్థితిని తెలుసుకొని తిరిగి వచ్చిరి. ప్రమాదమేమి లేదు. మీరందరు తమ తమ గృహములకు వెళ్లి, నిద్రించవచ్చునని వారనిరి. *(బుఖారి బాబుష్షుజాఅత్ ఫిల్ హర్బ్)*

### బుద్ధిహీనుల పట్ల ప్రేమానురాగం

బుద్ధిహీనులతో వారు (స) విశేష ప్రేమానురాగంతో వ్యవహరించే వారు. ఒక సారి కొత్తగా ఇస్లాంలో చేరిన ఒక గ్రామీణ వ్యక్తి వచ్చెను. వారి (స) మస్జిద్‌లో వారు కూర్చొని వుండగా అతనికి మూత్రము వచ్చెను. అతను మస్జిద్‌లోనే ఒక మూలకు వెళ్లి మూత్రము విసర్జించెను. అనుచరులు అతన్ని అడ్డుకొనుటకు ప్రయత్నించగా అతన్ని అడ్డుకొనినచో అతను బాధపడునని వారు అనుచరులను వారించి, అతను మూత్రము చేసిన తర్వాత ఆ ప్రదేశమును నీటితో శుభ్రపరచమని వారు ఆదేశించిరి. *(బుఖారి)*

### ప్రతిజ్ఞలను పాటించుట

ప్రతిజ్ఞలను వారు (స) ప్రత్యేకముగా పాటించేవారు. ఒక సారి ఒక ప్రభుత్వ ప్రతినిధి ఒక సందేశముతో వారి వద్దకు వచ్చెను. కొన్ని రోజులు వారి సహవాసములో గడిపి, ఇస్లాం సత్యమును తెలుసుకొనెను. ఓ రసూలుల్లాహ్! నేను మనస్ఫూర్తిగా ఇస్లాం స్వీకరించితిని. కావున నేను నా ఇస్లాంను ప్రకటించాలని కోరుకుంటున్నానని అతడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో మనవి చేసెను. ఇది సమంజసము కాదు. ఎందుకనగా నీవు మీ ప్రభుత్వము తరపున ఒక ప్రత్యేక పదవిలో నియమితుడవై వచ్చితివి. ఇదే స్థితిలో తిరిగి వెళ్లిపొమ్ము. అక్కడికి చేరిన తర్వాత కూడ నీ హృదయములో ఇస్లాం పట్ల ఆదరణ స్థిరంగా వున్నచో



మరల వచ్చి ఇస్లాం స్వీకరించుమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. *(అబూదావూద్ బాబుల్ వఫా బిల్‌అహ్‌ద్)*

రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర కొన్ని పుటలలో ముగించగల వ్యాసము కాదు. లేదా పలు అంశములను మాత్రమే అంచనా వేయలేము. కాని ఇది జీవిత చరిత్ర రచించుటకు ఉద్దేశించిన ప్రత్యేక పుస్తకము కానందున ఈ పరిచయములో ఇంత కంటే అధిక విస్తారముగా ప్రస్తావించుట సాధ్యము కాదు. అందుకే ఇంతటితో ముగించుచున్నాను.